# రియల్‌స్టోరీస్

స్ఫూర్తినిచ్చే వాస్తవ విజయగాథలు

కస్తూరి మురళీకృష్ణ



ఎమెస్కో

# రియల్ స్టోరీస్

స్ఫూర్తినిచ్చే వాస్తవ విజయగాథలు

కస్తూరి మురళీకృష్ణ

ఎమెస్కో

© EMESCO BOOKS

**రియల్ స్టోరీస్** (స్ఫూర్తినిచ్చే వాస్తవ విజయగాథలు)
**కస్తూరి మురళీకృష్ణ**


ముద్రణ
**డిశంబర్ : 2008**

మూల్యం : **125/-**

కవర్ డిజైన్
**జి.పి.కుమార్**

అక్షరాలంకరణ

ప్రింటర్స్

ప్రచురణ
**ఎమెస్కో బుక్స్**
సూర్యారావు పేట, విజయవాడ-520 002
ఫోన్స్ : 0866-2436643, 98499 92890

దోమలగూడ, హైదరాబాద్ - 500 029
ఫోన్ : 040-23264092, ఫ్యాక్స్: 040-23264028
e-mail : emescobooks@yahoo.com, www.emescobooks.com


© EMESCO BOOKS

# ముందుమాట

దిన పత్రికల ఆదివారం అనుబంధాలలో ఒక 'క్రైమ్‌స్టోరీ' తప్పనిసరిగా ఉంటుంది. అందుకే, వార్త ఆదివారం అనుబంధంలో వారం విడిచి వారం ఓ రియల్‌స్టోరీ రాసే అవకాశం వచ్చినప్పుడు సందేహించాను. నా సందేహాన్ని అర్థం చేసుకున్న మిత్రుడు గుడిపాటి ఓ మాట అన్నాడు. 'అందరు రాస్తున్నట్టు నువ్వు రాయాల్సిన అవసరం లేదు. క్రైమ్‌ను కూడా పదిమందికీ ఉపయోగపడేట్టు, భిన్నంగా రాసి చూపించు' అన్న గుడిపాటి సలహా నాకు ఆలోచనిచ్చింది. ఫలితంగా 'రియల్‌స్టోరీ' రచన ఆరంభించాను. ఇతర కథలకు భిన్నంగా, నా కథలలో నేరాన్ని వర్ణించకుండా, 'నేరపరిశోధనకు' ప్రాధాన్యం ఇచ్చాను. నేరానికి గురయిన వారి మానసిక వేదనను ప్రతిబింబించాలని ప్రయత్నించాను. ఒక వ్యక్తి అనాలోచిత 'క్రౌర్యం' ఇతరుల జీవితాలను ఛిన్నా భిన్నం చేయటాన్ని నా కథలలో చూపటం ఆరంభించాను. నేరాన్ని వర్ణించే కథలతో పాటుగా, ఇటువంటి కథలు కూడా పాఠకుల ఆదరణ పొందు తూండటంతో విశ్వాసం పెరిగింది.

ఫలితంగా గుడిపాటితో చర్చించి 'రియల్‌స్టోరీ'ల దిశను మార్చే ప్రయత్నం చేశాను. 'రియల్‌స్టోరీ' అంటే నిజంగా జరిగిన కథ. అది నేరానికి సంబంధించిందే కానక్కర్లేదు. మానవజీవితంలో అనేక సందర్భాలలో, అనేక అడ్డంకులను దాటుకుని వ్యక్తులు విజయం సాధిస్తారు. ప్రతికూల పరిస్థితులను సమర్థవంతంగా ఎదర్కొని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతారు. నిరాశామయ అంధకారంలో ఆశాజ్యోతిని వెలిగించి పదిమందికి మార్గదర్శనం చేస్తారు. అటువంటి కథలు ఇతరులకు స్ఫూర్తినిస్తాయి. ఆత్మవిశ్వాసాన్నిస్తాయి. మానవుడి 'స్పిరిట్' పట్ల నమ్మకం కలిగిస్తాయి. అందుకే 'రియల్‌స్టోరీ'లు నెమ్మదిగా క్రైమ్ నుంచి స్ఫూర్తివంతమైన కథలవైపు మళ్లాయి. అలాంటి 50 కథల సంకలనం ఇది.

© EMESCO BOOKS

ఈ కథలన్నీ నిజంగా జరిగినవే. వివిధ పత్రికలలో వచ్చిన ఈ నిజాలను, కథారూపంలో, కాస్త ఉన్నత ఆలోచనలను, కాస్త డ్రామాను కల్పించి జోడించి ఆసక్తికరంగా అందించాలని ప్రయత్నించాను. ఈ కథలు ఏ ఒక్కరికి స్ఫూర్తినిచ్చి కన్నీరును, పట్టుదలగా, నిరాశను విశ్వాసంగా మార్చినా నాప్రయత్నం సఫలమైనట్టే భావిస్తాను.

ఈ కథల రచనలో నాకు స్వేచ్ఛనిస్తున్న వార్త పత్రిక సంపాదకులు శ్రీ టంకశాల అశోక్‌గారికి కృతజ్ఞతలు. ఈ కథల సూత్రధారి గుడిపాటికి వందనాలు. వార్తలో కథలు ప్రచురించి ప్రోత్సహించిన సిఎండి శ్రీ గిరీష్ సంఘీగారికి ప్రత్యేక కృతజ్ఞతలు. నా ప్రతి రచనలలాగే, ఉన్నట్టే ఈ రచనలోనూ నాకు అండదండగా నిలిచింది నా శ్రీమతి పద్మ. నా ఇతర రచనలలాగే ఈ రచనకూ ప్రథమ పాఠకురాలు, విమర్శకురాలు అమ్మ.

ఈ కథలను పుస్తకరూపంలో ప్రచురిస్తున్న ఎమెస్కో విజయకుమార్ గారికి బహు కృతజ్ఞతలు. రచయితగా నాకు అత్యంత ప్రోత్సాహం ఇస్తున్న శ్రీ విజయకుమార్ గారితో నా అనుబంధం ఇలాగే కలకాలం కొనసాగాలని ఆశిస్తున్నాను.

ఈ పుస్తకంపై మీ అభిప్రాయం నిర్మొహమాటంగా తెలపాలని కోరుతున్నాను.

**కస్తూరి మురళీకృష్ణ**

© EMESCO BOOKS

# విషయక్రమం...


| | | |
|---|---|---|
| 1. | న్యాయం గెలిచింది | 7 |
| 2. | తడి ఇసుకలో పూచిన పువ్వు! | 13 |
| 3. | విరబూసిన స్నేహం! | 19 |
| 4. | అంతు దొరికిన వింత కథ! | 25 |
| 5. | ఎగిరి వచ్చిన పావురం | 32 |
| 6. | కథ కార్చిన కన్నీరు | 39 |
| 7. | ఛాయా చిత్రాలు చెప్పే కథ | 44 |
| 8. | నిప్పులా తాకిన నిజం | 50 |
| 9. | మరణం నుంచి జీవితం | 56 |
| 10. | మరణమా! నువ్వెక్కడ? | 62 |
| 11. | ఉదయించిన హృదయం | 67 |
| 12. | మృత్యువుతో ముఖాముఖి! | 73 |
| 13. | ప్రేమే గెలిచింది! | 78 |
| 14. | మనసా... నన్ను చంపకే! | 84 |
| 15. | ఎవరు దేశద్రోహి? | 90 |
| 16. | పడగ విప్పిన తుపాకీ | 96 |
| 17. | ప్రమాదం అంచులో... | 102 |
| 18. | మానవ మృగాల మధ్య...! | 108 |
| 19. | ప్రాణభిక్ష! | 115 |
| 20. | మరో సత్యాగ్రహం! | 121 |
| 21. | నిజానికి, నిప్పుకు మధ్య ...! | 127 |
| 22. | మారణకాండకు మరోవైపు! | 133 |
| 23. | ప్రేమించే హృదయం! | 139 |


© EMESCO BOOKS

| | | |
|---|---|---|
| 24. | ఇది అన్యాయం | 145 |
| 25. | విరబూసిన ప్రేమ అరవిందం! | 150 |
| 26. | కన్నీళ్లతో వెలిగిన జ్యోతి! | 156 |
| 27. | చిన్నారుల బతుకు పోరాటం! | 162 |
| 28. | వైద్యో నారాయణో 'సెమ్' | 169 |
| 29. | ఆత్మవిశ్వాసమే ఆలంబనగా! | 174 |
| 30. | ఎగిరిన పావురం! | 180 |
| 31. | అమృతప్రేమకు చిరునామా | 185 |
| 32. | కనిపించని కన్నీళ్లు చెప్పే కథ | 190 |
| 33. | వెలిగిన 'జీవనజ్యోతి' | 197 |
| 34. | అనుభవం నేర్పిన పాఠం | 203 |
| 35. | పాటకు మళ్లీ ప్రాణం | 210 |
| 36. | ఆశా దీపం వెలిగింది | 216 |
| 37. | ఆఫ్రికా ఏనుగు - ఆమె | 221 |
| 38. | ఓడి గెలిచిన యోధుడు | 227 |
| 39. | ఒక అర్ధరాత్రి కథ | 233 |
| 40. | 'ఎవరికీ తలవంచని' విజేత | 238 |
| 41. | మత్తు నుండి మానవత్వం వైపు | 242 |
| 42. | మానవతకు మరో రూపం | 248 |
| 43. | అరుదైన ఒక అద్భుతం | 253 |
| 44. | పాములా చుట్టుకున్న పాపం | 258 |
| 45. | అమ్మప్రాణం సాక్షిగా | 264 |
| 46. | చిన్నపాము - పెద్ద కర్ర | 270 |
| 47. | అమ్మ-నాన్న-ఒక పసిపాప | 276 |
| 48. | తడి మనసు వెనుక | 282 |
| 49. | మృత్యువుతో మౌన పోరాటం | 287 |
| 50. | 'వెన్నెల పాప' వెలుగు కథ | 292 |

© EMESCO BOOKS

# న్యాయం గెలిచింది

**పేదల హక్కులకోసం న్యాయబద్ధమైన పోరాటం చేసి,**
**మల్టినేషనల్ కంపెనీనే తలవంచేలా చేసిన మహిళకథ.**

మార్చి, 2005.

"మనం నాగరీకులం. అనాగరికులు సమస్యలను హింస ద్వారా పరిష్కరించుకుంటారు. నాగరీకులకు నియమాలున్నాయి. న్యాయ స్థానాలున్నాయి. చట్టాలున్నాయి. సభలున్నాయి. ఎప్పుడైతే తన న్యాయమైన కోర్కెలు తీరటం కోసం వ్యక్తి ఆయుధాలు ధరించి హింసకు దిగాల్సిన పరిస్థితి వస్తుందో అప్పుడు మన చట్టాల అమలులో లోపం ఉన్నట్టు. మన న్యాయస్థానాల పనితీరులో ఏదో పొరపాటు ఉన్నట్టు. లోపం వాటిని అమలు పరచే మనుషుల్లో ఉంటుంది. తమ హక్కులను సరిగ్గా వినియోగించుకోకుండా, అజ్ఞానంతో ఆవేశానికి దిగే సామాన్య ప్రజల్లో ఉంటుంది. ఈ నిజాన్ని మా విజయం నిరూపిస్తుంది." అని సంతోషంగా ప్రకటించింది కేటీ.

కేటీ మాటలు నిజమేనన్నట్టు మనస్ఫూర్తిగా తలాడించాడు కాహా వా (Ka Hsaw Wa). అక్కడ సంతోషంతో సంబరాలకోసం గుమిగూడిన ప్రజలు హర్షధ్వానాలు చేశారు. వారందరికీ కేటీ మాటలలోని సత్యం అనుభవ పూర్వకంగా గ్రహింపుకు వచ్చింది.

* * *

1993.

తాను 'సభ్య ప్రపంచంలోనే ఉన్నానా?' అన్న అనుమానం వచ్చింది కేటీ రెడ్ ఫోర్ట్‌కు.

మనిషి పశువుకన్నా హీనంగా ప్రవర్తిస్తూ, సాటిమనిషిని ఓ జీవంలేని వస్తువులా, పనికిరాని చెత్తలా చూడటం ఆమెకు ఆశ్చర్యం కలిగిస్తోంది. అసహ్యం వేస్తోంది.

తాను ఎరిగిన ప్రపంచానికీ, ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తున్న ప్రపంచానికీ నడుమ విజ్ఞానానికి, అజ్ఞానానికి మధ్య ఉన్నంత తేడా ఉందనిపిస్తోంది ఆమెకు. అసలు తాను ఇదంతా

© EMESCO BOOKS

నిజంగా చూస్తోందా? లేక ఏదైనా భయంకరమైన కల కంటోందా? అన్న అనుమానం వస్తోంది ఆమెకు.

'ఇదంతా నిజమే' ముక్తసరిగా అన్నాడు కాహావా.

'ప్రతి ఒక్క వ్యక్తీ తనదంటూ ఓ ప్రత్యేకమైన పటిష్ఠమైన భవనంలో ఉంటూ ప్రపంచాన్ని చూస్తాడు. కానీ ఆ భవంతి దిగి బయటకు వస్తే, తనకు అస్సలు పరిచయం లేని ప్రపంచాలు బోలెడు తన కళ్ల ఎదురుగానే ఉన్నాయని అర్థమౌతుంది. నీ పరిస్థితి ఇప్పుడు అలాగే ఉంది' మృదువుగా అన్నాడు మళ్లీ కేటీని ఓదారుస్తున్నట్టు.

"కానీ... ఆ ముసలామెని చూశాను. ఆమె కళ్ల ఎదురుగా ఒక కూతురిని అమెరికా సైనికులు మానభంగం చేశారు. ఇప్పుడు మరో కూతురిని స్వచ్ఛందంగా ప్రాణభయంవల్ల తానే సమర్పించి వచ్చింది. ఫలితంగా తానూ మానభంగానికి గురయింది. ఆమె శరీరం మీద గాయాలు చూశావా?" ఆవేదనతో కేటీ కళ్లల్లో నీళ్లు నిండాయి.

"నువ్వేం చూశావు?" అని తన చొక్కా విప్పి చూపించాడు కాహావా.

అతని వీపునిండా భయంకరమైన గాయాల తాలూకు మచ్చలున్నాయి. "ఇవి పదిహేడేళ్ల వయసులో మీ అమెరికన్ సైనికులు నాకందించిన స్థిరాస్తి తాలూకు ఆనవాళ్లు. గ్యాస్ పైప్‌లైన్‌ను కాపాడేందుకు మా దేశం వచ్చిన మీ సైనికులు మా జీవితాలతో ఆడుతున్న చెలగాటానికి ప్రతిరూపాలు ఈ గుర్తులు' అతని కళ్లు విస్ఫులింగాలు వెదజల్లుతున్నాయి.

అమెరికా లా కాలేజీలో న్యాయశాస్త్రం చదువుతున్న కేటీ, ప్రొఫెసర్ సలహాను అనుసరించి, సెలవుల్లో మానవ హక్కుల పరిరక్షణ సమితి బృందం వెంట వచ్చింది.

'అక్కడ అసలు మనుషులే కనబడనప్పుడు మానవహక్కుల ప్రసక్తి ఏముంటుంది?'– ఈ నిజం జీర్ణించుకోలేకపోతోంది కేటీ. పైగా ఈ ఘోరానికి పాల్పడుతున్నది అమెరికా సైనికులవటం, ఈ ప్రభుత్వాన్ని పరోక్షంగా నిలుపుతున్నది, ప్రపంచానికి ప్రజాస్వామ్యం నేర్పించాలనుకునే తన దేశం, అమెరికానే అవటం ఆమె భరించలేకపోతున్నది.

"నిజం ఎప్పుడూ చేదుగానే ఉంటుంది. కానీ కాలిఫోర్నియా కేంద్రంగా కల అమెరికా ఎనర్జీ కంపెనీ "యునోకల్" (Unocal), బర్మా నుంచి థాయ్‌లాండ్ వరకూ నిర్మించే 1.2 బిలియన్ డాలర్ల గ్యాస్ పైప్‌లైన్‌ను రక్షించేందుకు అమెరికా సైనికులను మా దేశంలోకి రప్పించినప్పటి నుంచీ మా పరిస్థితి మరింత దుర్భరమయింది. వాళ్లు మనుషులు కారు. రాక్షసులు. వాళ్ళకు మానవత్వం లేదు."

'కాహావా' తన దేశ సైనికుల గురించే మాట్లాడుతున్నాడన్న నిజం భరించ లేకపోతోంది కేటీ. ఆమె చెవులు మూసుకుంది.

© EMESCO BOOKS

నవ్వాడు కాహోవా.

"చెవులు మూసుకున్నంత మాత్రాన నిజం నిశ్శబ్దమైపోదు. కళ్లు మూసుకుంటే సత్యం అదృశ్యమైపోదు. నీకు తెలుసా, అమెరికా సైనికులు వెట్టిచాకిరీ చేయించుకుంటూ పెట్టే బాధలు భరించలేక మా తండ్రి ఓ రోజు ఎవరికీ చెప్పకుండా ఊరొదిలి పారిపోయాడు. అతడిని వెతుకుతూ వచ్చిన సైనికులు మా అమ్మను చితకబాదారు, తన్నారు. ఆ తన్నులకి అమ్మ ఒళ్లోఉన్న రెండునెలల నా చెల్లెలు పొయ్యిలో పడింది. అమ్మ మెదడు చిట్లి మతిస్థిమితం కోల్పోయి మరణించింది. ఎదురు తిరిగిన నాకు పట్టిన గతి ఇది. నాతో వెట్టి చాకిరీ చేయించుకోవాలని చూశారు. తప్పించుకున్నాను. అప్పటినుంచీ పోరాటం జరుపుతున్నాను. అవకాశం దొరికినప్పుడల్లా అమెరికా సైనికులను హతమారుస్తున్నాను. పైపులైనుపై దాడిచేసి చికాకు పరుస్తున్నాను. అమెరికన్లను మనుషుల ప్రాణాలు పోవటంకన్నా డబ్బు నష్టం ఎక్కువ బాధిస్తుంది" వ్యంగ్యంగా నవ్వాడు కాహోవా.

"కానీ ఇలా హింసకు దిగటం వల్ల నువ్వు వాళ్లకు దొరికితే నిన్ను చంపేస్తారు".

"వెట్టిచాకిరీ చేస్తూ బతికేకన్నా చస్తే మేలు కదా! కనీసం పదిమందిని చంపి చచ్చిన తృప్తి అయినా మిగులుతుంది."

"కానీ చట్టాలు... న్యాయస్థానాలు...."

కేటీ మాటలకు మధ్యలోనే అడ్డొస్తూ...

"అవన్నీ డబ్బున్న వాళ్లు నేరాలు చేసి తప్పించుకుని అమాయకుల్లా ఫోజులు పెట్టేందుకోసం ఏర్పరచుకున్నవి. నాలాంటి పేదవాడు న్యాయస్థానం దరిదాపులకు కూడా పోలేడు. వెళ్లినా న్యాయం పొందలేడు" అన్నాడు కాహోవా. కేటీ మాట్లాడలేదు.

మానవహక్కుల గురించి తాను పరిశోధన ప్రారంభించినప్పటి నుంచీ తమ దయనీయ గాథలు వినిపిస్తూ, ప్రతివారూ చివర్లో 'కాహోవా'ను కలవమని సలహా ఇస్తూ వచ్చారు. ఎందుకో ఇప్పుడు అర్థమయింది ఆమెకు. కాహోవా మాటలు వింటూంటే ఆమెకూ కసి కలుగుతోంది. అమెరికన్లను ఊచకోత కోయాలన్నంత ఆవేశం కలుగుతోంది. తాను చదువుతున్న చట్టాలు ఎందుకూ పనికిరావన్న ఆలోచన బలపడుతోంది.

* * *

అమెరికా తిరిగివచ్చిన కేటీ స్థిమితంగా ఉండలేకపోతోంది. ఆమె మదిలో తాను చూసిన భయంకరమైన నిజాలే మెదలుతున్నాయి. చదువుపై దృష్టి కేంద్రీకరించలేకపోయింది. తనలో రగులుతున్న వేదనను ప్రొఫెసర్ ముందు వెళ్లగక్కింది. ఆయన విని నవ్వాడు.



© EMESCO BOOKS

"ప్రపంచం రీతి అది. బలవంతుడు బలహీనుడిని దోచుకుంటాడు. బలహీనుడు తాను బలవంతుడైనప్పుడు తనకంటే బలహీనుడిని దోచుకుంటాడు. పెద్ద చేప చిన్న చేపలాంటిదీ ప్రపంచం" అన్నాడు.

ఆయన మాటలు కేటీకి సాంత్వన నివ్వలేదు. ఇంత పెద్ద ప్రజాస్వామ్యంలో, అమెరికా కంపెనీలు ఇతరదేశాల్లో చేసే అన్యాయాలను ఎదుర్కొనే నియమం లేకపోవటం ఎంత అన్యాయం!

రాత్రింబవళ్లు ఆమె 'లా' పుస్తకాలు తిరగేసింది. చివరికి 1789లో అమెరికా కాంగ్రెస్ ఆమోదించిన 'ఎలియన్ టార్ట్ క్లెయిమ్స్ ఆక్ట్' ఆమె దృష్టిలో పడింది (Alien Tort Claims Act).

వేరే దేశాలలో అమెరికన్లు జరిపే నేరాలను అమెరికా కోర్టులలో విచారించి శిక్షించవచ్చు ఈ చట్టం వల్ల. ఆమె ఎగిరి గంతేసింది.

"కష్టం. గత రెండు వందల ఏళ్లుగా ఈ చట్టాన్ని ఉపయోగించిన వారు లేరు. పైగా ఋజువులు కావాలి" అన్నాడు ప్రొఫెసర్.

కేటీ వెంటనే బర్మా ప్రయాణమైంది.

* * *

ఆమె మాటలు విని పెద్దగా నవ్వాడు కాహేవా.

"లాభంలేదు. ఆ కంపెనీకి డబ్బుంది. మన దగ్గర దారిద్ర్యముంది. వాళ్లతో కోర్టుల్లో మనం తలపడగలమా?" అడిగాడు.

"గలం. నేను మీ తరపున కోర్టులో కేసు వేస్తాను. నువ్వు నాకు ఋజువులు సంపాదించాలి" పట్టుదలగా అంది కేటీ.

"మాకు నువ్వు సహాయం చేస్తానంటే కాదనను...కానీ..."

"చూడు కాహేవా. నువ్వు సాయుధపోరాటం జరుపుతున్నావు. ఏం సాధిస్తున్నావు? వాళ్ల దగ్గర అత్యంత ఆధునిక మారణాయుధాలున్నాయి. నీ దగ్గర ఏమీలేవు. అయినా పోరాడుతున్నావు. గెలవలేనని తెలిసీ పోరాడుతున్నావు. కానీ ఈ చట్టం సహాయంతో మనం గెలవచ్చు. వాళ్లదగ్గర డబ్బుంది. మనవైపు న్యాయం ఉంది. న్యాయాన్నిచ్చే చట్టం ఉంది. నీ సాయుధ పోరాటంలో గెలుస్తామన్న ఆశలేదు. నా శాంతియుత న్యాయపోరాటంలో గెలుస్తామన్న ఆశ ఉంది" నమ్మకంగా అంది కేటీ.

మెరుస్తున్న ఆమె కళ్లల్లోకి చూస్తూ ఉండిపోయాడు కాహేవా.

* * *

© EMESCO BOOKS

'ఏలియన్ టార్ట్ క్లెయిమ్స్' మీద కేటీ రాసిన రీసెర్చి పేపరు చూసి ప్రొఫెసర్ నవ్వాడు.

"నీకు ఏ గ్రేడ్ ఇస్తున్నాను. కానీ ఈ సూత్రంపై కోర్టులో ఎవరూ కేసు వేయరు" అన్నాడు.

"నేను వేస్తున్నాను, ఈ రోజే" దృఢంగా చెప్పింది కేటీ.

* * *

అమెరికాలో సంచలనం సృష్టించింది కేటీ కేసు. ఆరంభంలో కేటీ అనవసరంగా పబ్లిసిటీకోసం కేసు వేసిందని యునోకల్ సంస్థ వాదించింది. తనకున్న శక్తితో ప్రసార మాధ్యమాలలో కేటీని విలన్‌గా చిత్రించింది. తాము బర్మా ప్రజలను ఎంతగా అభివృద్ధి చేస్తున్నామో వీడియోలు తీసి చూపింది. ప్రజల ఇంటర్వ్యూలు ప్రసారం చేసింది.

వారి ప్రచార తుఫానుకు కేటీ చెదరలేదు.

'కాహోవా' సహాయంతో ఒకటొకటిగా ఋజువులను బహిర్గతం చేయసాగింది. లాభాల ఆశలో మానవ ప్రాణాలను చిల్లర పెంకుల్లా పారవేస్తున్న వైనాల్ని నిక్కచ్చిగా ప్రదర్శించింది.

అమెరికా బహుళజాతి చమురు సంస్థతో తలపడిన మహిళగా కేటీని పత్రికలు అభివర్ణించసాగాయి.

* * *

నవంబర్, 1996.

కేటీ, కాహోవాలు వివాహం చేసుకున్నారు. కోర్టులో కేసు నడుస్తూనే ఉంది.

* * *

మార్చి 2005.

మోగగానే ఫోనెత్తింది కేటీ.

ఆ వైపునుంచి యునోకల్ లాయర్ స్వరం వినిపించింది.

"కేటీ ఈ కేసు వదిలేద్దాం. మేం ఔటాఫ్ కోర్టు సెటిల్‌మెంట్‌కు సిద్ధం."

"హుర్రే" అరిచింది కేటీ కాహోవాను కౌగిలించుకుంటూ.

"మనం గెలిచాం. మనకు న్యాయం జరిగింది" నృత్యం చేయసాగింది కేటీ.

* * *

తమ సైనికుల వల్ల నష్టం జరిగిన కుటుంబాలకు నష్ట పరిహారం చెల్లించి, గ్రామాల్లో పునరావాసం కల్పించేందుకు కంపెనీ ఒప్పుకుంది. తమ కంపెనీలో పనిచేసే పనివారికి విద్య, ఆరోగ్య వసతులను కల్పించేందుకు అంగీకరించింది.



© EMESCO BOOKS

ప్రస్తుతం – కేటీ, కాహావాలు మేరీల్యాండ్‌లో ఉంటున్నారు.

ప్రపంచ వ్యాప్తంగా వెనుకబడిన దేశాలలో అగ్రరాజ్యాలు ఉల్లంఘిస్తున్న మానవహక్కుల వైఖరులకు వ్యతిరేకంగా వారు టైలర్‌వంటి వారితో కలిసి పోరాటం సాగిస్తున్నారు. అది చట్టబద్ధమైన పోరాటం.

“ఎవరైనా మనపై స్వారీ చేస్తున్నారంటే తప్పువాడిది కాదు. వొంగి వాడిని స్వారీ చేయనిస్తున్న మనది ఆ తప్పు. అందుకే ప్రతివారూ విద్యావంతులు కావాలి. తమ హక్కులకోసం న్యాయబద్ధమైన పోరాటం సాగించాలి. న్యాయం ఎప్పుడూ అలాంటి వారి పక్షానే నిలుస్తుంది” అంటుంది కేటీ విశ్వాసంగా.

© EMESCO BOOKS

# తడి ఇసుకలో పూచిన పువ్వు!

**తన రచన ద్వారా సంతానాన్ని కోల్పోయిన తల్లిదండ్రుల కన్నీరు తుడిచిన రచయిత కథ.**

డిసెంబర్ 6, 1994

ఆకాశం నుంచి మెత్తటి మల్లె రేకులు మృదువుగా కురుస్తున్నట్టు మంచు కురుస్తోంది. ఆ మంచును ఆప్యాయంగా ఆహ్వానిస్తున్నట్టు చల్లటిగాలి వీస్తోంది.

చల్లదనానికి శిల అయిపోయినట్టు ప్రకృతి సర్వం కదలలేనట్టు నిస్తబ్దంగా ఉంది. చెట్లన్నీ మల్లెల ముసుగులు వేసుకున్నాయి. దారంతా తెల్లటి మెత్తటి మంచుమల్లె తివాచీలా పరచుకుని ఉంది. అంత చలిలో కూడా ఒకరొకరుగా వస్తున్న ప్రజలను చూస్తున్న రిచర్డ్ పాల్ ఇవాన్స్ మనస్సు ఉప్పొంగింది.

ఏ రచయితకూ లభించని పురస్కారం ఇది!

రచన ద్వారా సమాజాన్ని మార్చేయటం రచయిత పని కాదు. సమాజంలో మార్పు బీజాలను నాటి ఆలోచనలకొక దిశనివ్వటం రచయిత బాధ్యత అంటారు. తన బాధ్యత తాను సక్రమంగా నిర్వహించానన్న భావన ఇవాన్‌కు కలుగుతోంది.

రచయిత తన రచనలలో సమాజాన్ని ప్రతిబింబిస్తాడు. సమాజంలోని ఆవేశాలను, ఆనందాలను, ఆశ, నిరాశలను తనలో దర్శించి, తన రచనలో అర్థం చేసుకుంటాడు. అతని రచనలు పాఠకుల అంతరంగాలను స్పృశించి, మానవ జీవితంలోని మార్మికతను వారి గ్రహింపుకు తెస్తాయి. వారి పెదవులపై చిరునవ్వు నిలుపుతాయి. వారి కంట కారే నీటిని తుడుస్తాయి.

ఇవాన్స్ మదిలో రకరకాల ఆలోచనలు చెలరేగుతున్నాయి. నిజం, తన రచన తనను తాను అర్థంచేసుకొనే ప్రయత్న ఫలితం. కానీ అది ఇంత మందికి సాంత్వన కలిగిస్తోందంటే అంతకన్నా ఏం కావాలి?

© EMESCO BOOKS

నిజానికి తాను రచించేటప్పుడు ఇటువంటి స్పందన లభిస్తుందని ఊహించలేదు. ఇవాన్స్‌కు గతం గుర్తుకువచ్చింది.

* * *

'నాన్నకి మన మీద ప్రేమలేదు. ఎప్పుడూ బయటే తిరుగుతుంటాడు' నాలుగేళ్ల ఆలీసన్ అక్క జెన్నాతో అంది.

ఉలిక్కిపడ్డాడు ఇవాన్స్. దుప్పటి కొద్దిగా తొలగించి దొంగతనంగా చూశాడు.

పిల్లలిద్దరూ ఏదో ఆడుకుంటూ మాట్లాడుకుంటున్నారు.

'ఏమోనే. నాక్కూడా అలాగే అనిపిస్తుంది. కానీ బయట తిరిగితేనే డబ్బులొస్తాయట. అందుకని బయట తిరుగుతాడట' ఆరేళ్ల జెన్నా ఆరిందాలా చెల్లెలికి సమాధానం ఇచ్చింది.

'మరి అందరి నాన్నలూ బయట తిరుగుతారా? డేవిడ్ వాళ్ల నాన్న సాయంత్రం కాగానే ఇంటికి వచ్చేస్తారు కదా?' సందేహాన్ని వెలిబుచ్చింది అలీసన్.

'అవును. డేవిడ్, వాళ్ల నాన్న ఇద్దరూ కలసి ట్రెక్కింగ్ కెళ్తారు. పిక్నిక్‌లకు వెళ్తారు. ఆడుకుంటారు. నాక్కూడా నాన్నతో బోలెడన్ని కబుర్లు చెప్పాలని ఉంటుంది. బోలెడన్ని ఆటలు ఆడాలని ఉంటుంది. ఇదిగో అప్పుడు ఈ డాడీతో ఆడతా, మాట్లాడతా' తన బొమ్మను చూపించింది జెన్నీ.

'నాకివ్వవే. నేనూ డాడీతో ఆడతా' అంటూ ఆ బొమ్మను ఆప్యాయంగా అందుకుంది ఆలీసన్.

ఇదంతా కుతూహలంగా చూస్తున్న ఇవాన్స్ హృదయం ద్రవించింది. బిగ్గరగా ఏడవాలనిపించింది. వారిద్దరినీ హృదయానికి హత్తుకుని, మీరు 'నా హృదయపు తునకలు. నా జీవితంలో నాకు లభించిన అత్యద్భుతమైన వరాలు. భగవంతుడు నాపై కురిపించిన కరుణరస ప్రవాహాలు' అని వారికి వివరించాలనిపించింది.

'సాల్ట్‌లేక్ సిటీ'లో ఓ ప్రచార సంస్థలో ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న ఇవాన్స్ రోజుకు 18 గంటలు పని చేస్తాడు. ఆఫీసుకు వెళ్ళిన తరువాత ఎంతగా పనిలో మునిగిపోతాడంటే, ఇంటికి తిరిగి వచ్చే వరకూ తాను మనిషిని అని గుర్తుకురాదు. ఒకోసారి భార్య పిల్లల మొహాలు నెలలపాటు చూసే అవకాశం లభించదు.

'ఇటువంటి జీవితం కాదు నేను కోరుకున్నది' అని ఎన్నోమార్లు అనుకుంటూ ఉంటాడు. కానీ అంతలోనే పని ఒత్తిడి అన్ని ఆలోచనలనూ తరిమివేస్తుంది.

కానీ ఇప్పుడు పిల్లల మాటలు విన్న తరువాత తానీ ఉద్యోగంలో పడి తనకు తాను దూరమవటమే కాదు తన వారికీ దూరమవుతున్నాడనీ అర్థమవుతోంది. ముఖ్యంగా తాను ప్రాణప్రదంగా ప్రేమించే తన సంతానానికి...



© EMESCO BOOKS

అతని ఆలోచన అక్కడే ఆగిపోయింది.

పైకి చూపనిదే పెద్దవారికి సైతం అర్థంకాని 'ప్రేమ' పసిపిల్లలు ఎలా అర్థం చేసుకుంటారు? తాను వారిని తన ప్రాణాలకన్నా మిన్నగా ప్రేమిస్తున్నట్టు ఎలా తెలియచెప్పాలి?

'బాబూ...ఆఫీసుకి టైమైంది. ఇప్పటికే మీ బాసు రెండుసార్లు ఫోనుచేశాడు' ముందు గదిలోంచి అరిచింది అతని భార్య.

ఇవాన్ నిశ్శబ్దంగా మంచం దిగాడు.

పిల్లలిద్దరూ ఆడుతున్న ఆట ఆపి బెదురుతున్న కళ్లతో అతనివైపు చూశారు.

ఇవాన్స్ వాళ్ళ వైపు అడుగులు వేశాడు.

వాళ్లు వెనక్కు తగ్గారు.

అతని గుండె కరిగిపోయింది. గబగబా బయటకు నడిచాడు.

* * *

ఆఫీసులో స్థిమితంగా కూర్చోలేకపోయాడు. పనిపై దృష్టి నిలపలేకపోయాడు.

అతడి చెవుల్లో పిల్లల మాటలే ప్రతిధ్వనిస్తున్నాయి. అతడి కళ్ల ముందు తనని చూసి బెదిరిన పసి వదనాలే నిలుస్తున్నాయి.

అతడికి తన బాల్యం గుర్తుకు వచ్చింది.

ఇవాన్స్ నాలుగేళ్ల వయసులో ఓసారి తన తల్లి ఏడవటం చూశాడు. ఎందుకంటే రెండేళ్ల క్రితం పుట్టగానే చనిపోయిన 'నీ చెల్లెలు గుర్తుకు వచ్చింది' అంది అమ్మ.

కానీ 'నాన్న ఏడవటం ఎప్పుడూ చూడలేదు' అన్నాడు ఇవాన్స్.

'నాన్నకి వేరే పనులు బోలెడున్నాయి' అంది అమ్మ ముక్తసరిగా.

ఎందుకో హఠాత్తుగా బాల్యంలోని ఆ సంఘటన ఇవాన్స్‌కి గుర్తుకు వచ్చింది.

పోయిన పాపను తలచుకుని ఈనాటికీ అమ్మ కుములుతోంది. కానీ నాన్న తన బాధని పనిలో దాచేశారు. అలాగని నాన్నకు బాధలేదనికాదు. కానీ తమ వేదనను వ్యక్తులు ప్రదర్శించే విధానమే వేరుగా ఉంటుంది. ఈ విధానాలే అపోహలు కలిగిస్తాయి.

ఆలోచించసాగాడు ఇవాన్స్. ఇంతలో అతని దృష్టి ఆ దృశ్యంపై పడింది.

కిటికీ ఎదురుగా స్మశానం ఉంది. అందుకే ఆ వైపు చూడడు ఇవాన్స్. కానీ ఎప్పుడు ఆ వైపు చూసినా ఆమె కనిపిస్తుంది.

రోజూ ఇదే సమయానికి వస్తుంది. ఓ సమాధి దగ్గర పుష్పగుచ్ఛం ఉంచి వెళ్తుంది.

అది చూస్తున్న ఇవాన్స్‌లో ఇన్నాళ్లూ కలగని కుతూహలం కలిగింది. గబగబా ఆఫీసు వదలి ఆ వైపు పరుగెత్తాడు.



© EMESCO BOOKS

ఆమె పుష్పగుచ్ఛం ఉంచేది సమాధి దగ్గరకాదు. ఓ పూలచెట్టు దగ్గర.

'ఇదేమిటి?' అడిగాడు ఆమెని.

వృద్ధాప్యంతో ముఖం ముడతలు పడివుంది. నడుం వంగిపోయింది. కానీ ఆమె కళ్ళల్లో వేదన స్పష్టంగా కనిపిస్తోంది.

'పుట్టిన పది రోజులకే అబ్బాయి చనిపోయాడు. ఆ వయసులోవారికి సమాధులు కట్టం. వారిని గుర్తుంచుకునేందుకు జ్ఞాపకాలు తప్ప మరే చిహ్నాలుండవు. అందుకే ఈ చెట్టులో అబ్బాయిని చూసుకుంటున్నాను. బతికి ఉంటే ఇప్పటికి 38 ఏళ్ల వాడయ్యేవాడు. ఈ చెట్టులాగే పూలు, పళ్లతో ఆలరారేవాడు' అంది.

ఆమె మాటలు విన్న ఇవాన్స్ మదిలో ఒక వేదనా వీచిక ఉవ్వెత్తున ఎగసింది. ఒక ఆలోచన విద్యుద్ఘాతంలా తాకింది.

మనుషుల మనస్సులలో ఎన్ని వేదనలో! మానవ ప్రేమ ఎన్ని విభిన్న రూపాలలో వ్యక్తమవుతోంది!

ఇల్లు చేరిన ఇవాన్స్ రాత్రంతా నిద్రపోలేదు. అతని మనస్సులో ఏదో సంఘర్షణ జరుగుతోంది. హృదయ లోతుల్లో మథనం చెలరేగుతోంది. ఆవేదన అర్ణవమై ఎగసెగసిపడుతోంది.

* * *

తన మనస్సులోని వేదనకు అక్షరరూపం ఇవ్వాలని ఇవాన్స్ నిర్ణయించుకున్నాడు. మాటలలో చెప్పలేనిది రచనలో ప్రతిబింబించి తన పిల్లలకు అందించాలని నిర్ణయించాడు.

ఫలితంగా 'ది క్రిస్టమస్ బాక్స్' అనే నవల రాశాడు. నిజానికి అది నవల అనేకన్నా తానెరిగిన జీవిత అనుభవాల సారాన్ని విశ్లేషించి ప్రదర్శించిన రచన అనవచ్చు.

అందులో ఓ తండ్రి ఉంటాడు. ఉద్యోగంలో పడి భార్య పిల్లలను విస్మరిస్తాడు. అతని దృష్టి ఎంతసేపూ డబ్బుపైనే ఉంటుంది. ఇంతలో ఒకరోజు ముప్పై ఏళ్ల క్రితం చనిపోయిన అబ్బాయి కోసం ఈనాటికీ దుఃఖిస్తున్న వృద్ధ మహిళను కలుస్తాడు. దాంతో అతనికి మానవ సంబంధాల ప్రాముఖ్యం అర్థమవుతుంది. ప్రపంచంలో ఏ డబ్బూ మనుషుల మధ్య నెలకొన్న అనురాగానికి సరితూగదని అర్థం చేసుకుంటాడు.

తను ఉన్నా అనాథలా భావించుకుంటున్న పిల్లలపై అనురాగం కురిపిస్తాడు. మంచి భర్తగా, తండ్రిలా నిలుస్తాడు.

ఇదీ ఆ నవల కథ.

నవల చివర్లో ఆ వృద్ధ మహిళ పుష్పగుచ్ఛాన్ని చెట్టుదగ్గర ఉంచినట్టు కాక బాలదేవదూత విగ్రహం వద్ద ఉంచినట్టు మార్చాడు.

© EMESCO BOOKS

నవల పూర్తయిన తరువాత మళ్లీ చదువుకుంటూంటే అనేక సందర్భాలలో ఇవాన్స్ కళ్లల్లో నీళ్లు కదిలాయి.

ఒకోసారి 'ఇది రాసింది నేనేనా?' అని ఆశ్చర్యపోయేవాడు. అంతేకాదు. ఎలాగయితే సాలెపురుగు తనలోంచి అనంతమైన దారాలు సృష్టిస్తూ గూడు అల్లుతుందో. అలాగే అంతర్ముఖుడయిన వ్యక్తికి తనలో దాగున్నాయని తనకే తెలియని మహాద్భుత ప్రపంచాలు కనిపిస్తాయని అర్థం చేసుకున్నాడు.

* * *

క్రిస్టమస్‌రోజు తను రాసిన నవలను కుటుంబ సభ్యులందరికీ చదివి వినిపించాడు ఇవాన్స్. ఆ నవలను శిశువుగానే మరణించిన సోదరికి అంకితమిచ్చాడు.

నవల పూర్తయ్యేసరికి అతని తల్లి కళ్లల్లో నీళ్లు నిలిచాయి. కూతుళ్లిద్దరూ ఇవాన్స్‌ని పట్టుకుని భోరుమన్నారు. ఇవాన్స్ తండ్రి నిశ్శబ్దంగా గది వదలి వెళ్లిపోయాడు.

వాళ్ల స్పందన చూసిన ఇవాన్స్‌కు నోట మాట రాలేదు.

నవల విన్న ఇవాన్ మిత్రులు ఆ నవలను జిరాక్స్ తీయించుకున్నారు. వాళ్లు వాళ్ల మిత్రులకీ నవల గురించి చెప్పారు.

ఇలా ఒకరిద్వారా మరొకరికి నవల గురించి తెలియసాగింది. వారందరి ఉత్సాహం చూసిన ఇవాన్స్ నవలను ప్రచురణకర్తలకు పంపాడు. వారంతా తిరస్కరించారు. చివరికి ఆ కాలనీలోని ప్రజలంతా చందాలు వేసుకుని నవలను ప్రచురించారు. ఆగస్టు 1993న 8000 కాపీలు ముద్రించారు. ఆ తరువాత జరిగింది ఊహకందనిది.

నవంబర్ కల్లా మళ్లీ నవల ముద్రించాల్సి వచ్చింది. నవల అమ్మకాలు చూసిన పెద్ద పెద్ద పబ్లిషర్లు ఇవాన్స్ వెంట పడసాగారు.

అంతేకాదు, వీటన్నిటినీ మించి దేశం నలుమూలల నుంచీ ఇవాన్స్‌కు ఉత్తరాలు రాసాగాయి.

ఆ నవల చదివిన తరువాత తమకు తమ మరణించిన సంతానం జ్ఞప్తికి వచ్చిందని ఎంతో మంది బాధతో రాయసాగారు.

ఇంతలో మరో విచిత్రం జరిగింది.

నవల చదివిన పాఠకులు అనేకులు ఇవాన్స్ ఉంటున్న ఊరు వచ్చి స్మశానంలో బాల దేవదూత విగ్రహం కోసం వెతకటం ఆరంభించారు. నవలలో అది కల్పితమని ఒప్పుకునేందుకు వారు నిరాకరించారు.

ఇది చూసిన ఇవాన్స్ మనసులో ఒక ఆలోచన రూపు దిద్దుకుంది. తనే ఒక బాల దేవదూత విగ్రహాన్ని నిర్మించి ప్రతిష్ఠించాలనుకున్నాడు.



© EMESCO BOOKS

ఈ ఆలోచన తెలిసిన వెంటనే విరాళాలు కుప్పలు తెప్పలుగా వచ్చి పడసాగాయి. అనుకున్న సమయానికి విగ్రహం పూర్తయింది. ఆ రోజు విగ్రహ ప్రతిష్ఠ!

* * *

పెద్ద ఎత్తున అక్కడ చేరిన జనం నిశ్శబ్దంగా ఉన్నారు. విగ్రహం పైనున్న ముసుగు తొలగింది. ఆకాశం వైపు చేతులు సాచినట్టున్న బాలదూత విగ్రహం కోరాడు ఇవాన్స్.

కానీ శిల్పి చేతులు సాచి అందరి దుఃఖాన్ని తనే స్వీకరిస్తున్నట్టున్న బాలదూత విగ్రహం చెక్కాడు.

ఆ విగ్రహం చూసిన ప్రతివారి కంట అశ్రువులు నిలిచాయి. నిజంగా దేవదూత తమ దుఃఖాన్ని తొలగించేందుకే అక్కడకు వచ్చాడన్న భావన వారికి కలిగింది.

ఒకరొకరుగా నిశ్శబ్దంగా విగ్రహం దగ్గరకు వచ్చి తాము తెచ్చిన పుష్పగుచ్ఛాలు ఆ విగ్రహంపై ఉంచసాగారు.

కాస్సేపటికి ఆ విగ్రహం మొత్తం ప్రపంచ మానవాళి దుఃఖాశ్రువులు ఘనీభవించి ఏర్పడిన పుష్పగుచ్ఛాలతో నిండిపోయింది.

దుఃఖాన్ని స్వీకరించి సాంత్వననిచ్చే ప్రశాంత భావనకు ప్రతీకగా ఆ విగ్రహం నిలిచింది.

తాను సృజించిన ఊహ సత్యమై ఇంతమందికి శాంతి నివ్వటం కన్నా ఒక రచయిత కోరేదేముంది!

ఇవాన్స్ కళ్ల నుండి ఆనందాశ్రువులు రాలసాగాయి.

17 భాషల్లోకి తర్జుమా అయిన 'ది క్రిస్టమస్ బాక్స్' ఎనిమిది మిలియన్ కాపీలుపైగా అమ్ముడుపోయింది. సంతానాన్ని కోల్పోయిన తల్లిదండ్రులకు సాంత్వన నిచ్చేందుకు ఇవాన్స్ ఒక సంస్థను ఏర్పాటు చేశాడు. తన రచనల ద్వారా సంపాదించే డబ్బుతో ఆ సంస్థను నడుపుతున్నాడు. దాదాపుగా సంవత్సరానికి 1200 మంది ఆ విగ్రహాన్ని దర్శించి సాంత్వన పొందుతున్నారు.

'రచయిత హృదయ లోతుల స్పందన అక్షరరూపం ధరించినప్పుడు ఆ అక్షరాలకొక శక్తి వస్తుంది. అది పాఠకుల హృదయాలను స్పందింపచేస్తుంది. అటువంటి రచన చిరంజీవిగా నిలుస్తుంది. సమాజానికి మేలు చేస్తుంది' అంటాడు ఇవాన్స్.

© EMESCO BOOKS

# విరబూసిన స్నేహం!

**స్వచ్ఛమైన స్నేహంలో కలవటం తప్ప విడిపోవటం అంటూ ఉండదని నిరూపించిన ఇద్దరు నిజమైన స్నేహితురాళ్ల కథ.**

**1925.**

జగతి, కప్పుకున్న నల్లటి దుప్పటిని వేకువ రేకులవంటి వేళ్లతో కొద్ది కొద్దిగా తొలగించి తొంగి చూస్తోంది.

ఎర్రబడ్డ ఆకాశంతో పోటీ పడుతున్నట్టున్నాయి, రాత్రంత నిద్రలేక ఏడుస్తూ, ఒకరి చేయి ఒకరు పట్టుకుని నుంచున్న స్నేహితురాళ్లు – ఓమా, ఆనాల కళ్లు.

'నువ్వు వెళ్లక తప్పదా?' రాత్రి నుంచీ అదే ప్రశ్న అడుగుతోంది ఓమా.

'వెళ్లక తప్పదు. డచ్ ఈస్ట్ ఇండీస్ నుండి నాకు ఆయన ఉత్తరం రాశాడు. ఆయన నాకు నచ్చితే పెళ్లి చేసుకుంటాను. లేకపోతే తిరిగి వచ్చేస్తాను' మరోసారి చెప్పింది ఆనా.

'నా ఫ్రెండ్ విదేశంలో స్థిర పడుతుందని సంబరపడనా? నాకు శాశ్వతంగా దూరమవుతోందని విచారించనా?' ఏడుస్తూనే అంది ఓమా.

'ఒకరినుంచి ఒకరు ఏదో ఆశించి చేసే స్నేహంలో కలవటాలు, విడిపోవటాలు ఉంటాయి. కానీ స్వచ్ఛమైన స్నేహంలో కలవటం తప్ప విడిపోవటం అన్నది ఎన్నడూ ఉండదు. మన స్నేహంలోని స్వచ్ఛత మనల్ని మళ్లీ ఎక్కడో, ఏదో రూపంలో కలిపి తీరుతుంది' నిశ్చయంగా అంది ఆనా.

ఓమా నవ్వింది.

'ఆ రోజు కోసం నేను ఎదురుచూస్తూ ఉంటాను' అంది విశ్వాసంగా.

లేచి వెళ్లేందుకు సిద్ధమయింది ఆనా.

వెళుతూ చిన్న ఫొటోను ఓమా చేతిలో ఉంచుతూ–

© EMESCO BOOKS

'ఇది నా ఫోటో నా జ్ఞాపకంగా నీ వద్ద ఉంచు' మృదువుగా చెప్పింది.

ఫోటో వెనుక –

'ఆనా, 1925' అని రాసింది ఆనా.

ఓమా కళ్లల్లోకి నీళ్లు వచ్చాయి.

'నేను ఉత్తరం రాస్తాను. మళ్లీ తప్పకుండా కలుద్దాం' చేయి ఊపుతూ వెళ్లిపోయింది ఆనా.

వారిద్దరి జీవితంతో విధి అద్భుతమైన ఆట ఆడబోతోందని ఓమా జాంజేకు గానీ, ఆనా డ్రెక్స్‌హేజ్‌కి గానీ ఆ సమయంలో తెలియదు.

* * *

ఆనా వెళ్లిపోయిన తరువాత అనేక రోజులు ఆనాని గుర్తు తెచ్చుకుని కుళ్లికుళ్లి ఏడ్చేది ఓమా. ఆ సమయంలో ఆమెకు ఆనా ఇచ్చిన ఫోటో ఎంతో సాంత్వన నిచ్చేది.

ఆ ఫోటో చూస్తుంటే ఆనాను చూసినట్టే అనిపించేది ఆమెకు.

1952లో ఆమె కుటుంబం కెనడా ప్రయాణమయింది. అప్పటికి ఆనా మళ్లీ తనను కలుస్తుందన్న ఆలోచన ఆమెలో అడుగంటింది. ఆనా నుంచి ఎటువంటి ఉత్తరం రాలేదు.

ఆమె గురించి ఎటువంటి సమాచారం తెలియటం లేదు.

దాంతో ప్రయాణం ఆరంభించే ముందు ఆ ఫొటోను ఆల్బంలో అతికించింది ఓమా. అలాగయితే అటూ ఇటూ పడిపోకుండా ఫోటో భద్రంగా ఉంటుందని ఆమె ఆలోచన.

* * *

మొదటి చూపులోనే ఆనాకు జోహాన్నెస్ నచ్చాడు.

జోహాన్నెస్ అందగాడే కాదు ధనవంతుడు కూడా. డచ్ ఈస్ట్ ఇండీస్‌ను పాలించే ధనికులలో అతడు ఒకడు. జావా ద్వీపంలోని 'మలాంగ్' ప్రాంతంలో బోలెడన్ని వ్యాపారాలున్నాయి అతడికి, అనేక నౌకర్లతో, ఓ పెద్ద ఎస్టేట్ ఉంది అతనికి.

అతడిని తిరస్కరించేందుకు ఆనాకు ఎటువంటి కారణం కనబడలేదు.

'నేను అనాథను. నాకు ప్రేమ అంటే ఏమిటో తెలియదు' తన గురించి తాను పరిచయం చేసుకుంటూ చెప్పాడు జోహాన్నెస్.

'మీరు అనాథ ఎలా అవుతారు? మీకు నేనున్నాను. మన కుటుంబం ఏర్పడుతుంది. మీకు ప్రేమ లోటు తెలియకుండా ఉంచే బాధ్యత నాది' అతడి చేయి తన చేతిలోకి తీసుకుంటూ చెప్పింది ఆనా.

© EMESCO BOOKS

ఆనా, జోహాన్నెస్‌ల వివాహం డచ్ ఈస్టిండీస్‌లో వైభవంగా జరిగింది. వారికి ఒక ఆడపిల్ల, అయిదుగురు మగపిల్లలు కలిగారు.

ప్రేమ తెలియని జోహాన్నెస్ ప్రపంచం ప్రేమమయం అయింది. అనాథ అయిన జోహాన్నెస్‌కు కుటుంబం లభించింది.

ఇంతలో రెండవ ప్రపంచ యుద్ధం ఆరంభమయింది. డచ్ ఈస్టిండీస్‌ను జపానీయులు ఆక్రమించారు.

'డచ్ వారంతా ద్రోహులు. వారిని చంపండి' అని స్థానికులను ప్రేరేపించారు జపానీయులు.

స్థానికుల చేతిలో మరణించని వారిని జపానీయులు నిర్బంధించారు. కుటుంబాలను విడదీసి ఆడవాళ్లను, మగవాళ్లను వేర్వేరు జైళ్లలో ఉంచారు.

* * *

జరుగుతున్నది ఏమిటో ఆరెన్‌కు అస్సలు అర్థం కావటంలేదు. అతడి పసి మనసుకు మానవ దౌష్ట్యం అర్థం చేసుకునే శక్తిలేదు.

విధి ఆడే క్రూరమైన ఆటలను గ్రహించే పరిణతి లేదు.

'తమ భవంతి ఏమయింది? నౌకర్లు ఏమయ్యారు? తన ఆట వస్తువులు ఏమయ్యాయి?'– ఆరెన్‌కు ఏమీ అర్థం కావటంలేదు.

'అమ్మా!... నాన్నని వాళ్లెందుకు తీసుకుకెళ్లారు? అన్నలతో ఎందుకు లేబర్ పని చేయిస్తున్నారు?' –

ఇలాంటి సమాధానం రాని ప్రశ్నలను అమ్మని అడుగుతూండే వాడు ఆరెన్.

అతని ప్రశ్నలకు సమాధానంగా తల్లి ఆనా మూగగా ఏడ్చేది.

ఆరెన్‌కు ఏమీ అర్థం అయ్యేది కాదు.

జైలులో తిండి అరెన్‌కు పడలేదు. ఎప్పుడూ అనారోగ్యంతో బాధపడేవాడు. కానీ జపానీయులు అతడిని వదలలేదు.

'ఓపిక ఉన్నంత సేపూ పని చెయ్యి' అని నిర్బంధించేవారు.

కఠినమైన పని చెప్పేవారు.

కొరడాలతో కొట్టేవారు.

తిండి పెట్టేవారు కారు.

'నీలాంటి రోగి బతకటం కన్నా ఛస్తే మంచిది' అంటూ తిట్టేవారు.

ఇదంతా చూస్తూ ఆనా కన్నీళ్లు కార్చేది.

తన మిగతా సంతానం ఎలాగో అలాగ నెట్టుకొస్తున్నారు. కానీ ఆరెన్ ఈ యుద్ధం అయ్యేంత వరకూ బతుకుతాడన్న నమ్మకం ఆమెకి లేదు.

ఆమె తన వంతు తిండి కూడా ఆరెన్‌కి పెట్టేది.

అమ్మ తను తినకుండా ఆమె వంతు తిండి తనకి పెడుతోందని ఆరెన్ గ్రహించాడు.

'నువ్వు బతకాలి. నీకు భవిష్యత్తు ఉంది. నేను మరణించినా నష్టంలేదు' అనేది ఆనా రహస్యంగా ఎవరూ చూడకుండా ఆరెన్‌కి తినిపిస్తూ.

1945లో–

అమెరికా సేనలు ఇండోనేషియాను గెలుచుకునేందుకు కొద్ది రోజుల ముందే ఆనా మరణించింది.

'నేను మరణిస్తే నీకు తిండి ఎలా దక్కుతుంది?' అని ఆరెన్‌ని పట్టుకుని ఏడుస్తూ ప్రాణలు విడిచింది ఆనా.

ఆమె కళ్లల్లో కనిపించిన దైన్యం, ఆకలి, ప్రేమలు ఆరెన్ ఎన్నటికీ మరచిపోలేకపోయాడు. అమెరికా సేనలు జపానీయుల నుండి వీరికి విముక్తినిచ్చింది కూడా ఆరెన్‌కు తెలియదు. తన అన్నలు తనని కలిసింది కూడా ఆరెన్‌కు తెలియదు. ఆరెన్ కళ్ల నిండా తన ఆకలిని అణచుకుంటూ అన్నం పెడుతున్న ఆనానే మెదలుతోంది.

దాదాపుగా శవాకారంలో ఉన్న ఆరెన్‌ను తీసుకుని అతని అన్నలు శ్రీలంక చేరుకున్నారు. శ్రీలంకలోని రెఫ్యూజీ క్యాంపుల నుండి వీరిని హాలండ్‌కు తరలించారు.

* * *

'ఎవరికోసం ఎవరు ఏడుస్తారు? ఎవరి ఏడుపు వారిది' అని హాలండ్ చేరిన ఆరెన్ త్వరలోనే గ్రహించాడు.

అతని అన్నలు ఎవరి తోవలు వారు వెతుక్కోసాగారు. హాలండ్ ప్రజలకు ఈ రెండవ ప్రపంచ యుద్ధ రెఫ్యూజీలను పట్టించుకునే తీరిక లేదు.

హాలండ్‌లో–

ఆరెన్ ఆరోగ్యం కుదుటపడింది. అతడు ఓ ఫొటో స్టూడియోలో పనికి కుదిరాడు.

కానీ రెండవ ప్రపంచ యుద్ధ సమయం తాలూకు అనుభవాలు అతడిని ప్రశాంతంగా ఉండనివ్వలేదు.

అర్ధరాత్రిళ్లు భయంకరమైన కలలతో మెలకువ వచ్చేసేది. తన తల్లి వంతు అన్నం తిని తాను బతికాడు. తనకోసం అన్నం త్యాగం చేసి ఆకలితో అమ్మ మరణించింది.

తాను బతికి ఏం సాధిస్తున్నాడు? మరణించిన అమ్మ ఏం సాధించింది?

© EMESCO BOOKS

ఇటువంటి ఆలోచనలతో ఉక్కిరిబిక్కిరి అయ్యేవాడు. ఎవరితో కలవలేకపోయేవాడు.

ఓ రోజు–

అనుకోకుండా, కెమెరా 'వ్యూ ఫైండర్' లోంచి చూశాడు. ఫోటో తీశాడు.

ఒక్కసారిగా ఆరెన్ ప్రపంచం మారిపోయింది.

అతని బాధలన్నిటికీ పరిష్కారం దొరికింది.

కెమెరా కన్ను ద్వారా తన మనసులోని బాధలను, భావాలను వ్యక్తపరచటం ఆరెన్‌కు స్వతహాగా అలవాటయింది.

అతడు తీసే ఫొటోగ్రాపులు అందరినీ ఆశ్చర్యపరచసాగాయి.

'నీకు హాలండ్‌లో భవిష్యతులేదు. కెనడా వెళ్లు' సలహా ఇచ్చాడో మిత్రుడు.

దాంతో 1952లో కెనడా ప్రయాణమయ్యాడు ఆరెన్.

కెనడాలో డబ్బు సంపాదించి, మళ్లీ ఒకప్పటి డచ్ ఈస్ట్ ఇండీస్, ఇప్పటి ఇండోనేషియాకు వెళ్లి తమ ఆస్తులన్నీ కొనాలని కలలకు కనేవాడు.

అంతలో–

అతడి భయంకరమైన అనుభవాలు గుర్తుకు వచ్చేవి. తల్లి మరణిస్తూ తనవైపు చూసిన చూపు గుర్తుకు వచ్చేది.

దాంతో ఆ ఆలోచనను అణచి వేసేవాడు.

కెనడా చేరిన ఆరెన్, డచ్చి చర్చికి తప్పనిసరిగా వెళ్లేవాడు. అందమైన దృశ్యాలను ఫోటోలు తీసేవాడు. నెమ్మదిగా అతడి జీవితం రొటీన్‌లో పడసాగింది.

అక్కడే అతనికి అమేలియా పరిచయమయింది.

* * *

ఆరెన్, ఆమేలియాలు పెళ్లికి ఎటువంటి ప్రతిఘటనలు ఎదుర్కోలేదు. ఎందుకంటే, అమేలియాకు ఆరుగురు అక్క చెల్లెళ్లు కావటంతో, ఆమెను పెళ్లి చేసుకుంటానని ఆరెన్ అనగానే ఆమె తల్లిదండ్రులు ఒప్పుకున్నారు.

ఆరెన్, ఆమేలియాలకు ఎనిమిది మంది పిల్లలు పుట్టారు. ఇంతలో ఆ అద్భుతం జరిగింది!

* * *

1983.

'పిల్లలు ఇల్లు పీకి పందిరేస్తున్నారు. కాస్త వాళ్లని పట్టుకోండి' అరిచింది అమేలియా.

'పిల్లలు అల్లరి చేస్తారు. అదే అల్లరి నువ్వు, నేను చేస్తే పిచ్చి అంటారు' అంటూ పిల్లలతో కలసి తానూ గోల చేయసాగాడు ఆరెన్.



© EMESCO BOOKS

ఇంతలో వాళ్ల చిన్న అబ్బాయి స్టూలు ఎక్కి, బుక్ షెల్ఫ్ పైనున్న పుస్తకాలను కిందకు విసిరి కొట్టసాగాడు.

వాటిని ఒడుపుగా ఆరెన్ క్యాచ్ పడుతూండటంతో, కిలకిల నవ్వుతూ రెట్టించిన ఉత్సాహంతో వాడు పుస్తకాలను విసరసాగాడు.

ఓ ఎర్రటి పుస్తకాన్ని విసిరాడు పిల్లవాడు.

ఆరెన్ దాన్ని అందుకునేందుకు దూకాడు. కానీ ఇంకో పిల్లవాడు కాలికి అడ్డుపడటంతో ఆ పుస్తకం అతడికి అందలేదు.

అది కిందపడింది. 'అరే ఇది పాత ఆల్బంలా ఉంది' అంటూ దాన్ని తెరచి చూడసాగాడు ఆరెన్.

ఆల్బం పేజీలు తిప్పుతున్న ఆరెన్ దృష్టి ఒక ఫొటోపై స్థిరపడింది.

'అరే...! ఇది మా అమ్మఫోటో' అరిచాడు.

'కాదు...అది నా ఫ్రెండు ఫోటో' ఆల్బం లాక్కుంటూ చెప్పింది ఆమేలియా తల్లి.

'కాదు... ఆమె మా అమ్మే'

కళ్లల్లో నీళ్లు చిప్పిలుతుండగా అరిచాడు ఆరెన్.

'కాదు. ఇది నా ఫ్రెండ్ ఆనా ఫొటో. 1925లో ఇండోనేషియావెళ్ళి స్థిరపడింది' అంది అతడి అత్తగారు.

'కాదు. ఇది మా అమ్మ' ఆనాడ్రెక్స్ హేజ్ 'ఫొటో' ఆల్బం లాక్కుంటూ పిచ్చివాడిలా అరిచాడు ఆరెన్.

ఆశ్చర్యంతో అతడివైపే చూస్తూ నిలబడిపోయింది అమేలియా తల్లి, ఆరెన్ అత్తగారు ఓమా జాంజె.

'ఇది నిజమా!' ఆశ్చర్యంగా అంది.

అప్పుడు గమనించింది ఓమా, ఆరెన్ నీలికళ్లలోంచి ఆనా తొంగి చూడటం!

ఆమె కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

ఆమె ఆరెన్‌ను కౌగలించుకుంది.

'మా స్నేహం స్వచ్ఛమైనదైతే ఎప్పుడో ఒకప్పుడు, ఏదో ఒక రకంగా కలుస్తామని అనుకున్నాం. కానీ ఇలా కలుస్తామని అనుకోలేదు' అనుకుంది, తన ఎనిమిది మంది మనమలను చూస్తూ!

వారందరిలో ఆనా, ఓమాల ప్రతిబింబాలు, వారి మైత్రీ చిహ్నాలుగా ప్రతి ఫలించసాగాయి.

# అంతు దొరికిన వింత కథ!

**సత్యంతో ద్వేషాన్ని జయించి, ఆత్మన్యూనతాభావాన్ని ఆత్మశక్తిగా మలచుకున్న వ్యక్తి కథ.**

ఒకోసారి చిన్న చిన్న మాటలు జీవిత పథాన్ని నిర్దేశిస్తాయి. సామాన్యంగా తోచే మామూలు సంఘటనలు జీవన గమనాన్ని మార్చేస్తాయి. 'నీల్‌హెన్రీ' జీవితంలో ఇదే జరిగింది. వాళ్ళ అమ్మ తేలికగా కోరిన కోరిక, మామూలుగా చెప్పిన కథ అతడి జీవితాన్ని మార్చటమే కాదు, అమెరికాలో నల్లవారి అత్మగౌరవ నిదర్శనాన్ని ప్రపంచానికి అందించింది.

అది 1981, 'నువ్వు చెప్పేవన్నీ కథలు. అవన్నీ నిజమేనని ఎలా నమ్మేది?' అమ్మని ఆట పట్టిస్తూ అడిగాడు 'నీల్‌హెన్రీ'.

అవకాశం దొరికినప్పుడల్లా తమ పూర్వీకుల కథలు చెప్తూండటం నీల్‌హెన్రీ తల్లి మేరికి అలవాటు. అతడికి వాటిని వినటం అలవాటైంది.

నీల్‌హెన్రీ కుటుంబం నల్లజాతికి చెందింది. వాళ్ల అమ్మమ్మ లారా ఒకప్పుడు బానిస. అమెరికా అంతర్యుద్ధం తరువాత నల్లవారికి స్వేచ్ఛ లభించింది. ఆ సమయంలో లారా 'ఎ.జె.బ్యూమోంట్' అనే తెల్ల జమీందారుతో ప్రేమలో పడింది. అతని వల్ల 1877లో ఆమెకు 'పెర్ల్' అనే కూతురు కలిగింది. అయితే ఆ కాలంలో ఇంకా నల్లవారు, తెల్లవారి నడుమ ఉద్విగ్నతలు తగ్గలేదు. దాంతో పెర్ల్‌తో లారా 1890లో సెయింట్ జోసెఫ్ వదిలి 'సెయింట్ లూయిస్' ప్రాంతానికి చేరింది.

అక్కడ దుర్భర దారిద్ర్యంలో పెరిగింది. 'పెర్ల్'. ఆమె నీగ్రోని వివాహమాడింది. 1896లో 'నీల్‌హెన్రీ' అమ్మమ్మ 'పెడ్డా' జన్మించింది. భర్త మరణించటంతో దిక్కు తోచని పెర్ల్, తన తండ్రి బ్యూమోంట్‌ని సహాయం అర్థిస్తూ ఓ ఉత్తరం రాసింది. ఆ ఉత్తరానికి సమాధానం వచ్చింది. బ్యూమోంట్ తన ఫొటో పంపుతూ 'పెర్ల్'ని తన కూతురిగా అంగీకరించాడు. అంతే కాదు తన వల్ల పెర్ల్‌కూ, ఆమె తల్లికీ అన్యాయం జరిగిందని ఒప్పుకున్నాడు. వీలైనంత సహాయం

చేస్తానని వాగ్దానం చేశాడు. ఆ తరువాత ఎంతకీ అతడినుంచి సహాయం అందలేదు. అతడు 1901లో మరణించాడన్న వార్త పెర్ల్‌ను చేరింది. పెర్ల్ మనుమరాలు నీల్‌హెన్రీ తల్లి మేరీ. మేరీ తెల్లగా ఉండేది. ఆ కాలంలో నల్లవారికీ, తెల్లవారికీ వేర్వేరు కంపార్ట్‌మెంట్లుండేవి రైళ్లలో.

1945లో ఓసారి మేరీ తెల్లవారి కంపార్ట్‌మెంట్‌లో ప్రయాణించాలని ప్రయత్నించి పట్టుబడింది. తర్వాత మళ్లీ ఆమె తెల్లవారి కంపార్ట్‌మెంట్‌లో అడుగుపెట్టలేదు. ఎన్నో కష్టాలకోర్చి ఆమె చదువుకుంది. ఓ డాక్టర్‌ను పెళ్లాడింది. కానీ దక్షిణ అమెరికా రాష్ట్రాలలో నల్లవారు పైకి వచ్చే అవకాశాలు ఉండకపోవటంతో వాళ్లు 1956లో 'సీటల్' వచ్చారు. ఇదంతా వింటూంటే నీల్‌హెన్రీకి ఉత్సాహంగా ఉండేది. కానీ నమ్మబుద్ధి అయ్యేది కాదు.

ఓరోజు వాళ్ళమ్మ ఆ కథ మరోసారి చెప్పి 'నువ్వు పెద్ద జర్నలిస్టువి కదా, నీ పూర్వీకుల కథని ఎందుకు రాయకూడదు! మన పూర్వీకులు మన వర్తమానం, మన భవిష్యత్తుపై ప్రభావం చూపిస్తారు. గతంలేని వాడికి గతిలేదంటారు. మన కథ ఎందుకు రాయకూడద'ని అడిగింది.

దానికి నీల్‌హెన్రీ నవ్వి–'నేను జర్నలిస్టుని. ఋజువులున్న నిజాలను ప్రజలకు అందిస్తాను. కానీ, కాల్పనిక రచయితనుకాదు ఇష్టమొచ్చినట్లు చేయటానికి. నువ్వు చెప్పినదంతా నిజమేనని ఋజువు చెయ్యి దాన్ని నేను రాస్తాను' అన్నాడు. దానికి మేరీ చాలాసేపు మౌనంగా ఉంది.

'నీకు ఋజువులు కావాలా?' అని అడిగి నెమ్మదిగా లేచింది.

మంచం కింది పాతపెట్టెను ఆయాసపడుతూ బయటకు లాగింది. దాంట్లో అడుగున దాదాపుగా శిథిలావస్థలో ఉన్న ఓ ఫోటోను, ఒక ఉత్తరాన్ని, ఒక వార్తాపత్రిక కటింగ్‌ను తీసి హెన్రీ చేతిలో పెట్టింది. అవి అందుకుంటూంటే హెన్రీ కళ్లల్లో నీళ్లు కదిలాయి. ఇన్నాళ్లుగా అమ్మ చెబుతున్న కథలు నిజమే. అతనిలో ఒక ఆవేశ జ్వాల ప్రజ్వరిల్లింది.

తన అమ్మమ్మ, అమ్మలను తెల్లవారు మోసం చేయటం నిజమే. తర తరాల తమ బానిసత్వం, అణచివేతలు అన్నీ నిజమేనన్నమాట.

ఒక్కసారిగా అతడి శరీరం క్రోధంతో వణికింది. తెలుపురంగును 'మంచి' అంటారు. నలుపు రంగును 'చెడు' అంటారు. కానీ సాటి మనిషిని రంగు బేధం వల్ల బానిసలా తరతరాలుగా పశువుల్లా అణచివేసిన తెలుపు మంచి ఎలా అవుతుంది?

ఆ ఫోటో బ్యూమోంట్‌ది. ఉత్తరం బ్యూమోంట్ ఏప్రిల్ 25, 1901న పెర్ల్‌కు రాసింది. వార్తపత్రిక కటింగ్‌లో బ్యూమోంట్ మరణవార్త ఉంది. తరతరాలుగా తమ నల్లజాతిని తెల్లవారు అణచివేయడానికి అవి ఋజువుల్లా అనిపించాయి.

అతడి రక్తం మరిగింది. తెల్లవారంటే ద్వేషం వెల్లువలా మనస్సును ముంచెత్తింది. 'ఇది చాలా కథ రాసేందుకు....' ఆశగా అడిగింది. పరిశోధించాలి. అసలీ బ్యూమోంట్ ఎవరు,

© EMESCO BOOKS

అతడి తెల్ల సంతతి ఇప్పుడు ఎక్కడ, ఎలా ఉంది? కనుక్కోవాలి. అప్పుడు కానీ కథ పూర్తి కాదు'.

* * *

అలా ఆరంభమైంది 'నీల్ హెన్రీ' అన్వేషణ. స్వతహాగా జర్నలిస్టు కావటంతో పరిశోధన ఆరంభించటం పెద్ద కష్టం కాలేదు. తాను పని చేస్తున్న వార్తాపత్రిక తరఫున వీలయినప్పుడల్లా దక్షిణ అమెరికా ప్రాంతాలకు వెళ్లి అక్కడి వార్తా పత్రికలు పరిశీలించటం ఆరంభించాడు.

పత్రిక అనుమతితో దక్షిణాదిన ప్రచురితమైన పాత పత్రికలు తెప్పించాడు. సెన్సస్ రికార్డులు, కోర్టుఫైళ్లు వెతికాడు. పాత పత్రికల మైక్రోఫిల్మ్‌లను చదివాడు. ఇలా సేకరించిన సమాచారం ప్రకారం ఎ.జె.బ్యూమోంట్ అనే ఆంగ్లేయుడు మిసిసిపి నది ఒడ్డున గల సెయింట్ జోసెఫ్ అనే ప్రాంతంలో స్థిరపడ్డాడు.

ఓ పత్తి రైతు వద్ద సహాయకుడిగా చేరాడు. అమెరికా అంతర్యుద్ధం తరువాత తనే స్వయంగా భూస్వామి అయ్యాడు. ఆ తరువాత 'సెయింట్ జోసెఫ్' పట్టణానికి పెద్ద అయ్యాడు. టౌన్ కౌన్సిల్ సభ్యుడయ్యాడు. ఓ క్లబ్ యజమాని అయ్యాడు. పంటలు పండించటం, అమ్మటంవంటి వ్యాపారం చేశాడు.

ఇదంతా చదువుతూంటే నీల్‌హెన్రీ ఆవేశం మరింతసాగింది.

ఇక్కడ బ్యూమోంట్ అంచెలంచెలుగా ధనవంతుడవుతూ పోతున్నాడు. జీవితంలో సౌఖ్యాలు అనుభవిస్తూ పోతున్నాడు. ఇదే సమయానికి తన అమ్మమ్మ 'పెర్ల్' తిండికి లేక అష్టకష్టాలు పడుతుండేది. దుర్భర దారిద్ర్యం అనుభవించింది. ఈ సమయంలో సహాయాన్ని అభ్యర్థిస్తూ తండ్రికి ఉత్తరం రాసింది. ప్రపంచంలో న్యాయం అన్నది లేదనిపించింది హెన్రీకి. కేవలం శరీరం రంగు నలుపు అయినంత మాత్రాన మనిషి మనిషి కాకుండా పోతాడా? అతడి భావాలు, వేదనలు పనికి రానివవుతాయా? తెల్లరంగు వారికి సౌఖ్యాలు, నల్లరంగు వారికి బాధలూ, వేదనలూనా? – అలా వివరాలు సేకరిస్తున్న హెన్రీ పరిశోధన బ్యూమెంట్ మరణంతో ఆగిపోయింది.

బ్యూమోంట్ మరణవార్త వల్ల అతడు పెళ్లి చేసుకున్నాడనీ, అతడికి ముగ్గురు తెల్ల పిల్లలున్నారని తెలిసింది. ఎందుకో ఆ వార్త హెన్రీలో విచిత్రమైన స్పందన కలిగించింది. పెదవులపై చిరునవ్వు నిలిచింది.

తెల్లవారికి నల్ల బంధువులు! తన తెల్ల బంధువులను కలిసితీరాలని నిశ్చయించుకున్నాడు హెన్రీ. ఆ తర్వాత ఎంత వెతికినా బ్యూమోంట్ సంతానం గురించి వివరాలు తెలియలేదు. ప్రతి వార్తా పత్రికను క్షుణ్ణంగా పరిశీలించాడు. టౌన్ రికార్డులను వెతికాడు. ఫలితం కనిపించలేదు.



© EMESCO BOOKS

హెన్రీ పరిశోధన ప్రారంభించి అయిదేళ్లు కావస్తోంది.

బ్యూమోంట్ సంతానం గురించిన వివరాలు తెలియటంలేదు. ఎక్కడ ఏ పనిచేస్తున్నా హెన్రీ మనసులో ఇదే మెదలుతుండేది.

1986లో వాషింగ్టన్‌లోని 'నేషనల్ ఆర్చీవ్స్'లో వెతకటం ఆరంభించాడు హెన్రీ. రోజూ కొన్ని గంటలపాటు లైబ్రరీలో కూచుని 1880–1900 నడుమ సెన్సస్ రికార్డులను మైక్రోఫిల్మ్‌లు పరిశీలిస్తూ గడిపేవాడు. అలా పరిశీలిస్తుంటే మరో సత్యం తెలిసింది హెన్రీకి.

1880 సెన్సస్ రికార్డుల ప్రకారం 1878లో బ్యూమోంట్ 'మేరీ ఆన్' అనే అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. వారి ముగ్గురు పిల్లలే ఫ్లోరిన్స్. వాల్టర్, ఆర్థర్. అది చూస్తూంటే కూడా హెన్రీకి ఆవేశం కలిగింది. పెర్ల్ పుట్టిన సంవత్సరం తరువాత బ్యూమోంట్ పెళ్లి చేసుకున్నాడు. అక్కడ బ్యూమోంట్ తెల్లపిల్లలు సర్వసౌఖ్యాలు అనుభవిస్తూంటే, ఇక్కడ 'పెర్ల్' దుర్భర దారిద్ర్యంలో పెరిగింది. దీని కంతటికీ కారణం, పెర్ల్ తల్లి శరీర రంగు నలుపు కావటమే!

ఆ రోజు నుంచీ తెల్లవాడు కనిపిస్తే చాలు హెన్రీ అణువణువునా ద్వేషం జ్వాలలా ఎగిసేది. ప్రతి తెల్లవాడూ ఒకప్పుడు నల్లవారిని బానిసల్లా, పశువులకన్నా హీనంగా చూసినవాడే. వీరి అహంకారం, వర్ణ విచక్షణ సంకుచితత్వం వల్ల కొన్ని తరాల నల్లవారు అణచివేతకు గురయ్యారు. దుర్భరమైన వేదనలు అనుభవించారు.

ఈ భావనలు కలిగినప్పుడల్లా హెన్రీ రగిలిపోయేవాడు. తన సహోద్యోగులతో సైతం సరిగ్గా వ్యవహరించలేకపోయేవాడు. బ్యూమోంట్ సంతానానికి ఏమైందో తెలుసుకుంటే కానీ తనలో ఈ అగ్ని తగ్గదని హెన్రీకి అర్థమైంది. అందుకే తన అన్వేషణని మరింత తీవ్రం చేశాడు.

అయితే ఎంత వెతికినా బ్యూమోంట్ మరణం తరువాత అతని సంతానం ఏమయిందో తెలియటంలేదు. వాళ్లీ భూప్రపంచం నుంచే అదృశ్యమైనట్టున్నారని అనిపించింది.

1990లో 'డేవిస్' ప్రాంతంలో ఓ ప్రాంతీయ పత్రిక ప్రతి పేజీ పరిశీలిస్తూంటే, జూన్ 26, 1914 నాటి పత్రికలో బ్యూమోంట్ భార్య, మేరీ ఆన్ మరణవార్త కనిపించింది.

ఒక్కక్షణంపాటు హెన్రీ ఊపిరి స్తంభించింది. గుండె దడదడలాడుతూంటే, ఆ వార్తను గబగబా చదివాడు హెన్రీ. మరణ సమయానికి మేరీ ఆన్, 'విక్స్‌బర్గ్' అనే ప్రాంతంలో తన కొడుకు ఆర్థర్ వద్ద ఉండేదని, ఆమె సమాధి 'నాట్‌చెజ్' వద్ద ఉందనీ ఆ వార్తలో పేర్కొన్నారు.

అనేక మార్లు ఆ వార్తను చదివాడు హెన్రీ. ఎందుకో ఆ వార్త చదువుతూంటే అతడిలో అతడికే అర్థం కాని స్పందనలు కలగసాగాయి.

అంటే బ్యూమోంట్ మరణం తరువాత అతని సంతానం 'విక్స్‌బర్గ్'కు తరలి వెళ్లారన్నమాట. ఆ పత్రికలను ఇంకా పరిశీలిస్తే మరో చిన్నవార్త కనిపించింది. అదే సంవత్సరం చివర్లో 'అర్థర్' తన కూతురితో 'సెయింట్ జోసెఫ్'కు వెళ్లాడు!

అంటే బ్యూమోంట్ కొడుక్కు కూతురు పుట్టిందన్నమాట.

ఆమె బతికి ఉండవచ్చు! హెన్రీలో ఉత్సాహం పరవళ్లు తొక్కసాగింది. రెండు నెలల్లో హెన్రీ 'విక్స్‌బర్గ్' ప్రయాణమయ్యాడు.

'విక్స్‌బర్గ్' టౌన్ ఆర్చీవ్స్ అధికారిని కలసి తన పరిశోధన సంగతి వివరించాడు. 1914 విక్స్‌బర్గ్ సిటీ డైరక్టరీలో ఇద్దరూ కలసి వెతికారు.

1918 డైరెక్టరీలో ఆర్థర్ వివరం లభించింది. ఆర్థర్, అన్నా అనే అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. ఓ బొగ్గు గనిలో ఆర్థర్ ఫోర్ మాన్‌గా పని చేస్తున్నాడు!

హెన్రీకి అర్థంకాలేదు.

'బ్యూమోంట్ ధనవంతుడు, భూస్వామి. అతడి కొడుకు ఫోర్‌మాన్‌గా పని చేయటం ఏమిటి? పైగా సెయింట్ జోసెఫ్‌లో ఆస్తులు వదులుకుని వేరే ప్రాంతానికి రావాల్సిన అవసరం ఏముంది?' ఇంకా డైరెక్టరీలు ఎంత వెతికినా వివరాలేమీ దొరకలేదు.

మళ్లీ అన్వేషణ అర్థాంతరంగా ఆగిపోయింది. 1918 వరకూ బ్యూమోంట్ కుటుంబ వివరాలు తెలిసాయి. ఆ తర్వాత ఏమీ తెలియటం లేదు. దాంతో తన పరిశోధన దిశ మార్చాడు హెన్రీ. ఆర్థర్ భార్య 'ఆనా' సోషల్ సెక్యూరిటీ ఇండెక్స్ కోసం వెతకటం ఆరంభించాడు. కొన్ని నెలలు వెతకగా 1976లో 'లూయీ సియానా' అనే ప్రాంతంలో 'ఆన్' మరణించిందని తెలిసింది.

వెంటనే లూయీసియానా పాత పత్రికల మైక్రో ఫిల్మ్ కోసం పత్రిక ద్వారా కబురు పంపాడు. ఆ మైక్రోఫిల్ములు వచ్చేసరికి రెండు నెలలు పట్టింది. ఆత్రంగా వాటిని పరిశీలించాడు.

'81 ఏళ్ల వయస్సులో మెరీ ఆన్ మరణించింది. ఆమెకు నలుగురు ఆడపిల్లలు. వారంతా లూయీసియానాలోనే నివసిస్తున్నారు' ఆన్ మరణవార్త ద్వారా ఈ వివరాలు తెలిసాయి. అంటే... తన వయసు వారే... బ్యూమోంట్ తెల్ల సంతతి ఇంకా బతికివుంది. వెంటనే వారి వివరాలు 'ఇంటర్నెట్'లో వెతకటం ఆరంభించాడు హెన్రీ.

నలుగురిలో ముగ్గురి పేర్లు, అడ్రసులు, ఫోన్ నెంబర్లు 'నెట్'లో దొరికాయి. తన వివరాలు తెలుపుతూ ముగ్గురికీ ఉత్తరాలు రాసాడు. ఎంతకీ సమాధానం రాకపోవటంతో ఫోన్లు చేయటం ఆరంభించాడు.

మొదట మిసెస్ హిమ్మెల్‌కు ఫోను చేశాడు. ఆమె మరణించిందని తెలిసింది. మిగతా ఇద్దరిలో ఒకరు అల్జెమియర్ వ్యాధితో బాధపడుతున్నారని తెలిసింది. ఆమెకు ఏమీ జ్ఞాపకం ఉండదు. మరో కూతురు మతిభ్రమించిందని తెలిసింది. హెన్రీకి నిరాశగా అనిపించింది.

నిరాశతో ఫోను పెట్టేస్తూంటే ఆ వైపు నుంచి వినిపించిన మాటలు అతడిలో ఆశను రగలించాయి.



© EMESCO BOOKS

'ఆన్ చివరి కూతురు రీటాఫారిస్ 'పిన్నెవిల్లె' వద్ద ఉంటుంది. ఆమె ఫోన్ నెంబర్ కావాలా?'

'కావాలి' గట్టిగా అరిచాడు హెన్రీ.

* * *

ఫోన్ నెంబర్‌ను చూస్తూ కూచున్నాడు. హెన్రీ. ఫోన్ చేయాలని ఉంది. కానీ భయంగా ఉంది. ఎందుకో తనకే అర్థంకాని విచిత్ర భావ సంచలనంతో సతమతమవుతున్నాడు. చివరికి గుండె చిక్క బట్టుకుని ఫోన్ కలిపాడు. అవతలినుంచి మృదువైన స్వరం– 'హలో' అంది.

గొంతెండి పోతూండగా, 'నా పేరు నీల్‌హెన్రీ...' అన్నాడు. 'మీ ఉత్తరం చదివాను. లూయిసియానా. ఎప్పుడొస్తున్నారు?' అడిగింది రీటా. హెన్రీ కళ్లల్లోంచి నీళ్లు ధారలా కారసాగాయి.

* * *

మార్చి 21, 1998. గుండెలు అదురుతుంటే కాలింగ్‌బెల్ నొక్కాడు హెన్రీ. తలుపు తెరుచుకుంది. ఎదురుగా నవ్వుతూ రీటా నుంచుంది. గదిలో నిండుగా ఆమె బంధువులు కాదు, కాదు తమ బంధువులున్నారు! నల్ల చేతులు, తెల్ల చేతులను కలిశాయి.

ఒకరినొకరు పరిచయం చేసుకున్నారు. పలకరించుకున్నారు. తన కుటుంబకథను వారికి చెప్పాడు హెన్రీ. తమ కథను హెన్రీకి చెప్పింది రీటా. బ్యూమోంట్ మరణం తర్వాత కుటుంబం ఆర్థికంగా దిగజారి పోయింది. ప్లేగువల్ల పంట నష్టమైంది. ఇళ్లు, తోటలు, పొలాలు అమ్మేయాల్సి వచ్చింది. బ్యూమోంట్ సంతానం పొట్టచేత పట్టుకుని జీవన భృతి వెతుక్కుంటూ వెళ్లాల్సివచ్చింది. అయితే పుట్టినప్పటి నుంచి ఐశ్వర్యాన్ని అనుభవించటం అలవాటైన బ్యూమోంట్ సంతానం ఎందుకూ పనికిరాకుండా అయింది. తాగుడు తప్ప వేరే పనేదీ చేయలేకపోయారు. దాంతో చితికిపోయారు. ఆర్థర్‌కు విడాకులిచ్చి తర్వాత ఆనా కష్టపడి పనిచేసి సంసారాన్ని నెట్టుకొచ్చింది.

అది వింటూంటే తన ఆవేశం, ఆందోళనలు, ఉద్విగ్నతలు కరిగిపోతున్న భావన కలిగింది హెన్రీకి. ఒకప్పుడు తాము బానిసలు, దుర్భర దారిద్ర్యం అనుభవించారు. కానీ కష్టపడి ఒక్కో మెట్టూ ఎక్కుతూ పైకి వచ్చారు. డాక్టర్లయ్యారు. లాయర్లయ్యారు. తమ కలలను సాకారం చేసుకున్నారు.

ఒకప్పుడు బ్యూమోంట్లు ధనవంతులు. తెల్లవారిమన్న జాత్యహంకారంతో నల్లవారిని అణగదొక్కారు, ద్వేషించారు, చులకనగా చూశారు. కానీ ఆ అహంకారం, ఆ ద్వేషం వారిని దెబ్బతీసింది. బ్యూమోంట్ సంతానం దారిద్ర్యం అనుభవించింది. ఇప్పుడు తమకూ, వారికీ తేడా లేదు. తామెలా సమాజంలో గౌరవంగా బతుకుతున్నారో, వారూ అలాగే బతుకుతున్నారు. రంగు తేడా ఏమీలేదు. తెల్లదనంలో గొప్ప. నలుపులో నీచం లేదు. భగవంతుడి సృష్టిలో అంతా సమానమే.



© EMESCO BOOKS

ఇవాళ అహంకరించిన వాడు రేపు మట్టి కరుస్తాడు. మేడ పోయి గుడిసె మిగులుతుంది.

అందుకే మనిషి ఒకరిని ద్వేషించకూడదు. ఒకరిని చులకన చేయకూడదు. అహంకారం చూపకూడదు.

ఇవాళ తాను చేసే ప్రతి పని తన తరువాత తరాలపై ప్రభావం చూపిస్తుందని అర్థం చేసుకోవాలి. తన తప్పులకు శిక్ష తన తర్వాతి వారు అనుభవిస్తారని గ్రహించాలి.

తన తెల్ల బంధువులను వదలి వస్తుంటే హెన్రీ మనసులో అనేక భావనలు సుళ్లు తిరుగుతున్నాయి. కానీ మనసు ప్రశాంతంగా ఉంది. ఏదో అద్భుతమైన సత్యం గ్రహింపునకు వచ్చిన శాంతి అది.

తన అనుభవాలను హెన్రీ 'పెర్ల్ సీక్రెట్-ఎ బ్లాక్ మాన్స్ సెర్చ్ ఫర్ హిజ్ వైట్ ఫామిలీ' అనే పుస్తక రూపంలో వెలువరించాడు. 'రూట్స్' తర్వాత అమెరికా సమాజాన్ని అంతగా కదిలించిన పుస్తకం అది.

© EMESCO BOOKS

# ఎగిరి వచ్చిన పావురం

**పట్టుదలతో పంజరాన్ని ఛేదించుకుని**
**స్వేచ్ఛను సాధించిన బాలుడికథ.**

అక్టోబర్ 2000, ఉదయం 9 గంటలు.

ఊపిరి బిగబట్టి స్కూల్ బస్‌కోసం ఎదురుచూస్తున్నారు ఐలీన్, మార్గరెట్‌లు.

మార్గరెట్ కారులోనే ఉంది. పిల్లలు వచ్చి కారులో కూచోగానే కారు స్టార్టు చేసేందుకు సిద్ధంగా ఉంది.

ఐలీన్ కారు చాటున నిలబడి అసహనంగా ఎదురుచూస్తోంది. ఇద్దరికీ ఉద్విగ్నంగా ఉంది.

తాము చేసేది తమ దృష్టిలో తప్పుకాదని వారిద్దరికీ తెలుసు. కానీ ఇతరుల దృష్టిలో నేరం అనీ, పట్టుబడితే శిక్ష తప్పదనీ వారికి తెలుసు.

కానీ పిల్లల్ని కిడ్నాప్ చేయటం తప్పవారికి వేరే మార్గం తోచటం లేదు.

స్కూల్ బస్ వచ్చి ఆగింది.

బిలబిలా పిల్లలు బస్సులోంచి దిగుతున్నారు. వెంటనే స్కూల్లోకి పరుగిడుతున్నారు.

ఐలీన్‌లో కంగారు పెరిగింది. స్కూల్ యూనిఫారంలో పిల్లలంతా ఒకే రకంగా కనిపిస్తున్నారు. వారిని గుర్తుపట్టి త్వరగా పిలవాలి. వాళ్లు వచ్చి కారులో కూచోగానే కారును పరుగెత్తించాలి. కానీ ఎవరికీ అనుమానం రాకుండా ఇదంతా చేయటం సాధ్యమా?

'ఫాతిమా' కూతురిని గుర్తించి గట్టిగా పిలిచింది ఐలీన్.

ఫాతిమా ఒక్క సెకను సేపు అర్థం కానట్టు తల్లివైపు 'చూసింది. వెంటనే 'అమ్మా' అంటూ తల్లివైపు సుడిగాలిలా దూసుకువచ్చి చుట్టేసి ఏడవసాగింది.

ఫాతిమా వెనకే అహ్మద్, అమ్జాద్, మర్యమ్‌లు పరుగెత్తుకు వచ్చారు.

© EMESCO BOOKS

ఇంకా వారందరినీ ఐలీన్ పలకరించటం పూర్తి కానేలేదు. 'కారులోకి రండి' కంగారుగా పిలవసాగింది మార్గరెట్.

ఒకరినొకరు వారు సరిగ్గా చూసుకోనేలేదు–

'ఎవరు మీరు?' అంటూ ఓ టీచర్ వాళ్ల మధ్యన నిలబడింది.

ఐలీన్ నోరు విప్పేలోగా ఒకరొకరుగా ఆ స్కూల్ స్టాఫ్ వారిని చుట్టూ ముట్టారు.

'స్కూల్లోకి రండి' ఆజ్ఞాపించింది టీచర్.

'వాళ్లని నాతో రానీండి' నా ముద్దు బిడ్డలు, నా సంతానం. మోసంగా వాళ్లని వేరు చేశాడు వాళ్ల నాన్న. నాతో వాళ్లని ఇంగ్లండ్ తీసుకువెళ్తాను. వాళ్లిక్కడ ఉండలేరు. ఎప్పుడు ఇజ్రాయెలీ ట్యాంకులు ఏవైపు నుంచి దాడి చేసి చంపుతాయో తెలియదు. నా పిల్లల్ని నాతో రానివ్వండి' ఏడుస్తూ ప్రాధేయపడసాగింది ఐలీన్.

కానీ వాళ్లు ఐలీన్ మాటలు వినలేదు. బలవంతంగా వాళ్లని స్కూల్లోకి లాక్కుపోసాగారు.

'మా అమ్మతో పోనీయండి' వాళ్లతో యుద్ధానికి దిగాడు అహ్మద్.

'మీకేం భయంలేదు. వీళ్ల నాన్నకి కబురుపెట్టాం. కాస్సేపటికి ఆయన వస్తాడు. అప్పుడు మీరిద్దరూ మాట్లాడుకోండి. ఆయన ఒప్పుకుంటే పిల్లల్ని తీసుకెళ్లండి' చెప్పింది స్కూల్ ప్రిన్సిపాల్.

* * *

రెండుగంటల తరువాత వచ్చాడు కమాల్. బేకరీలో పని సగంలో వదలి వచ్చినట్టున్నాడు ఒళ్లంతా పిండి చుట్టుకోగా, జుట్టు రేగి ఉంది.

అతడిని చూస్తూనే ఐలీన్ మదిలో అసహ్యభావన ఉవ్వెత్తున ఎగిసింది.

'ఇతడినా తాను ప్రేమించి పెళ్లి చేసుకుంది?' అనుకుంది. 'ప్రేమ గుడ్డిది అంటారు. గుడ్డిదే కాదు మూర్ఖమైంది కూడా' అనుకుంది.

కమాల్ పాలస్తీనాకు చెందిన వాడు. 19 ఏళ్ల వయసులో చదువుకోసం ఇంగ్లండ్ వచ్చాడు. అదే వయస్సున్న ఐలీన్ గాఢంగా అతడి ప్రేమలో పడింది. పరిచయమైన ఆరు నెలల్లో పెళ్లి చేసుకున్నారు. వెంటవెంటనే నలుగురు పిల్లలు కలిగారు.

కొన్నాళ్లు సంతోషంగా గడిపిన తరువాత కమాల్ ఇంగ్లండ్‌లో ఉండలేక పోయాడు.

'నేను పాలస్తీనా వెళ్తాను. అక్కడ ఇల్లు చూసి నిన్ను, పిల్లల్ని పిలిపించు కుంటాను' అని వాగ్దానం చేసి పాలస్తీనా వెళ్లిపోయాడు.

ఎంతకీ అతడి దగ్గరనుంచి పిలుపురాక పోవటంతో, కమాల్ గురించి తెలుసుకోమని ఐలీన్ డిటెక్టివ్‌లను నియమించింది. కమాల్ మళ్లీ పెళ్లి చేసుకున్నాడని, పిల్లలు కూడా ఉన్నారని తెలుసుకుంది. ఐలీన్ అధైర్యపడలేదు.



© EMESCO BOOKS

డైవోర్స్‌కు అప్లైచేసింది. పిల్లలు తన దగ్గరే ఉన్నారని సంతోషించింది. కొన్నాళ్లకు కమాల్ ఒక్కసారి పిల్లల్ని తీసుకుని పాలస్తీనాకు రమ్మని వేధించటం ఆరంభించాడు. పిల్లల్ని చూడాలని ఉందని ప్రాధేయపడ్డాడు. ఐలీన్ కరిగిపోయింది. పిల్లల్ని తీసుకుని పాలస్తీనా వచ్చింది.

ముందు బాగానే ఉన్నాడు కమాల్. ఐలీన్ ఇంగ్లండ్ తిరిగి వెళ్లాల్సిన రోజు పిల్లల్ని తీసుకుని ఎటో వెళ్లిపోయాడు. పోలీసులు వచ్చి ఐలీన్‌ను బలవంతంగా తిరుగు విమానం ఎక్కించారు. జరుగుతున్నదేమిటో అర్థమయ్యేలోగా ఐలీన్ ఇంగ్లండ్ చేరింది. ఇంగ్లండ్ చేరినప్పటి నుంచీ తన పిల్లల్ని పాలస్తీనానుండి రప్పించాలని ప్రయత్నాలు ఆరంభించింది.

"కమాల్ 'నాబ్లస్' ప్రాంతంలో ఉన్నాడు. అది పాలస్తీనా అథారిటీ. వాళ్ల పరిధిలోకి రాదు. మనకు ఆ ప్రాంతం వారితో ఎటువంటి ఒప్పందాలు లేవు" చెప్పాడు లాయరు.

'నాబ్లాస్ అధికారులు హేగ్ కన్వెన్షన్‌పై సంతకాలు చేయలేదు. కాబట్టి మన పిల్లల్ని వాళ్లు ఎత్తుకుపోతే యుద్ధం చేస్తే తప్ప తిరిగి తెచ్చుకోలేం' దౌత్యాధికారులు చెప్పారు.

ఐలీన్‌కు కోపం పెరిగిపోతోంది.

'వీళ్లెవరు? వీళ్ల ఒప్పందాలేమిటి? తన పిల్లల్ని అన్యాయంగా తనకు కాకుండా చేస్తే, వాళ్లెందుకు అడ్డు రావడం?' – అందుకే సోదరి మార్గరెట్‌తో కలసి కిడ్నాప్ పథకం వేసింది.

అంతా విన్న ప్రిన్సిపాల్ సానుభూతి చూపించింది. 'కానీ ఇది మీ ఇద్దరి వ్యవహారం మీరే తేల్చుకోండి' అంది.

పిల్లలు 'మేం అమ్మతో వెళ్తాం' అన్నారు ముక్త కంఠంతో. ఐలీన్ ప్రాధేయపడింది.

'కమాల్, పిల్లల్ని నాతో పంపు. వాళ్లకి ఇక్కడ భవిష్యత్తు లేదు. ఇజ్రాయెల్ సైనికుల తుపాకుల బారిన పడకపోతే, తీవ్రవాదుల బాంబుల బారిన పడతారు. ఇక్కడ మరణం తప్పించి వారికి వేరే భవిష్యత్తు లేదు. నాతో పంపించు' అంటూ ఏడ్చింది.

'సరే. రేపు వచ్చి తీసుకువెళ్లు. బట్టలిచ్చి పంపుతాను. ఇలా దొంగతనంగా తీసుకువెళ్లే కన్నా ధైర్యంగా బహిరంగంగా తీసుకువెళ్లు' అన్నాడు కమాల్. సంతోషించింది.

రేపటి గురించి కలలు కంటూ బ్రిటీష్ కన్సులేట్‌కు వెళ్లింది ఐలీన్.

తెల్లారి నాబ్లస్‌కు ప్రయాణమౌతుంటే, కన్సులేట్ అధికారి ఆమెని ఆపాడు.

'నువ్వు ఇజ్రాయెల్ హద్దు దాటి వెళ్లకు. నాబ్లస్‌లో నీపై అరెస్టు వారంటు ఉంది. ఒక్కసారి పాలస్తీనా జైల్లో పడ్డావా, దానికన్నా నరకయాతనలు సుఖంగా అనిపిస్తాయి' అన్నాడు.

కమాల్ చేసిన మోసం ఆమెకు అర్థమైంది.

స్వంత తల్లిపైనే కిడ్నాప్ కేసు పెట్టాడు.

* * *

© EMESCO BOOKS

తల్లి మాటలు అహ్మద్ చెవుల్లో మారుమోగుతున్నాయి.

'మీరు బ్రిటీష్ పౌరులు. ఇజ్రాయెల్‌లో బ్రిటీష్ దౌత్య కార్యాలయం చేరితే చాలు. అక్కడి అధికారులు మిమ్మల్ని ఇంగ్లండ్ చేరుస్తారు' తల్లికి రహస్యంగా అహ్మద్ ఫోన్ చేసినప్పుడు అతడికి ఈ మాటలు చెప్పింది.

'ఎలాగైనా బ్రిటీష్ దౌత్యకార్యాలయం చేరాలి' ఇదీ అహ్మద్ ఆలోచన. 'కానీ ఎలా?'

అహ్మద్‌కు పాలస్తీనాలో జీవితం నచ్చటం లేదు. ఉదయం లేచినప్పటి నుంచీ బేకరీలో పనిచేయాలి. బరువైన వేడి వేడి వస్తువులను మోయాలి. ఆపై స్కూలుకి వెళ్లాలి. తిరిగి వస్తూనే తిన్నగా బేకరీ చేరాలి. అర్ధరాత్రి వరకూ పనిచేయాలి. వీటికితోడు, ఏ క్షణంలో ఏమౌతుందో తెలియదు. ఏ మూల నుంచి తీవ్రవాదులు ఎవరిమీద దాడి చేస్తారో తెలియదు. ఏ క్షణాన బాంబులు పేలి శరీరాన్ని ముక్కలు చేస్తాయో తెలియదు. ఆపై ఇజ్రాయెల్ విమానాలు, ట్యాంకులు ఉండనే ఉన్నాయి.

తన తోటి వయసువారు, తన పక్కనే నుంచుని అంతవరకూ నవ్వుతూ మాట్లాడుతున్న వారు, క్షణంలో మాంసం ముక్కలై గాలిలో ఎగిరిపోవటం చూసిన అహ్మద్‌కు తాను మనిషిలా బతకాలంటే పాలస్తీనా నుండి పారిపోవటం తప్ప వేరే మార్గం లేదని అర్థమయింది.

కానీ తన సోదర, సోదరిలను వదిలివెళ్లటమా? నలుగురు తప్పించుకునేకన్నా ఒక్కడే తప్పించుకోవటం సులభం. దాంతో, ముందు తాను తప్పించుకుంటే, తరువాత తన వారిని తప్పించవచ్చన్న నిర్ణయానికి వచ్చాడు అహ్మద్.

అయితే, తన బ్రిటీష్ పాస్‌పోర్ట్ తండ్రి దగ్గరే ఉంది. అది సంపాదిస్తే కాని ఇజ్రాయెల్‌లో బ్రిటీష్ దౌత్య కార్యాలయం వారు తనకి సహాయం చేయరు. 'తండ్రి నుంచి పాస్‌పోర్ట్ సంపాదించాలంటే అతనికి తనపై నమ్మకం కలగాలి. తాను పారిపోడన్న విశ్వాసం కలిగించాలి. దాంతో ఆ రోజునుంచీ తండ్రి చెప్పినట్టు వినటం ఆరంభించాడు అహ్మద్. అవకాశం చిక్కినప్పుడల్లా తల్లిని విమర్శించి, తండ్రిని పొగిడేవాడు.' ఇంతలో–

ఇజ్రాయెల్‌పై సూసైడ్ బాంబుదాడులు జరిగాయి. ఏప్రిల్ 2002లో ఇజ్రాయెలీ సేనలు నాబ్లస్‌లో ప్రవేశించాయి. 24 గంటలు కర్ఫ్యూ ఉన్నా బేకరీకి వెళ్లాల్సి వచ్చేది. ఇజ్రాయెలీ సేనల తుపాకీ గుళ్లతో దాగుడు మూతలు ఆడుతూ రోడ్లపై తిరగటం అలవాటు చేసుకున్నాడు అహ్మద్. పాలస్తీనాలో పిల్లలు బాంబులతో బంతులాటలు ఆడతారు. తుపాకీ గుళ్లతో దాగుడుమూతలు ఆడతారు. మృత్యువుతో యుగళగీతాలు పాడతారు. అనుక్షణం జీవితంతో చెడుగుడు లాడతారు.

* * *

తల్లితో ఈ మెయిల్ ద్వారా సంప్రదించిన రోజు అహ్మద్ ఒంటరిగా ఆనందించాడు.

'ఇజ్రాయెల్‌లోని బ్రిటీష్ దౌత్య కార్యాలయంలో అందరికీ నీ గురించి తెలుసు. నువ్వు అక్కడివరకూ క్షేమంగా చేరుకుంటే చాలు' తల్లి నుంచి సమాధానం వచ్చింది.

అనుక్షణం పాలస్తీనాలో ఛస్తూ బతికేకన్నా, స్వేచ్ఛకోసం ప్రయత్నిస్తూ ప్రాణాలు కోల్పోవటమే మేలన్న నిర్ణయానికి వచ్చాడు 15 ఏళ్ల అహ్మద్. బేకరీలో పనిచేస్తున్నా తండ్రి డబ్బు లివ్వడు. నాబ్లాస్ నుంచి జెరుసలేమ్ బస్సులో చేరాలంటే '100 షెకల్స్' (రూపాయలు) కావాలి. దాంతో కస్టమర్లు ఇచ్చే టిప్పులను రహస్యంగా దాచుకోవటం ఆరంభించాడు అహ్మద్.

తగినంత డబ్బు సమకూరింది. ఓ మిత్రుడి ద్వారా రోజూ ఉదయం ఏడు గంటలకు జెరుసలేమ్ బయలుదేరే బస్సు డ్రైవర్‌ని కలిసాడు. ఇజ్రాయెల్‌లో కూలీపని చేసే పాలస్తీనా వారిని ఆ బస్సు ఇజ్రాయెల్ చేరుస్తుంది. అహ్మద్‌ను తీసుకువెళ్లేందుకు బస్సు డ్రైవర్ ఒప్పుకున్నాడు.

అహ్మద్‌లో ఉత్సాహం. ఉద్విగ్నతలు వెల్లివిరిసాయి. 'తన పథకం తన తండ్రికి తెలిస్తే తప్ప తనకు ప్రమాదం లేదు' అనుకున్నాడు అహ్మద్.

* * *

జనవరి 1, 2003. ఉదయం 4 గంటలు.

నిశ్శబ్దంగా తయారయ్యాడు అహ్మద్. రోజూ ఇజ్రాయెల్ సైనికుల తుపాకుల నుంచి తప్పించుకోవాలంటే బ్రిటీష్ పాస్‌పోర్ట్ ఉంటే మంచిదని తండ్రిని ఒప్పించి, పాస్‌పోర్ట్ సంపాదించాడు అహ్మద్. దాన్ని మరోసారి చూసుకున్నాడు. చప్పుడు చేయకుండా ఇల్లు దాటాడు.

వీథిలో ఇజ్రాయెల్ గస్తీదళాలు లేరని నిర్ధారించుకున్న తరువాత ఒక్కసారిగా బయటకు దూకి పరుగు ఆరంభించాడు. వీథి దీపాలు లేవు. కానీ మెయిన్ రోడ్డులో అడుగు పెట్టేందుకు లేదు. ఇజ్రాయెలీ సైనికులుంటారు. ముందు కాల్చి తరువాత పేరడుగుతారు. అందుకే గల్లీల్లో పరుగెత్తటం ఆరంభించాడు అహ్మద్. ఇంతలో హఠాత్తుగా ఇజ్రాయెలీ ట్యాంకు శబ్దం వినిపించింది. గోడకు బల్లిలా అతుక్కుపోయాడు. నీడల్లో నల్లిలా నక్కాడు.

అలా రెండు గంటలు కదలకుండా ఉండాల్సి వచ్చింది. ట్యాంకు వెళ్లిపోగానే మళ్లీ పరుగు ఆరంభించాడు. అప్పటికే ఒకే స్థలంలో, ఒకే రకంగా నుంచోవటం వల్ల కాళ్లు మొద్దుబారిపోయాయి. అయినా స్వేచ్ఛ కావాలంటే పరుగెత్తక తప్పదు.

* * *

సరిగ్గా రెండు గంటలకు బస్సు బయలుదేరింది. ప్రాణాలు అరచేత పట్టుకుని దైవాన్ని ప్రార్థిస్తూ బస్సులో కూచున్నాడు అహ్మద్. ఎందుకంటే, ఏ సమయంలోనైనా తండ్రి తనను పట్టుకునేందుకు పరుగెత్తుకుంటూ రావచ్చు.

బస్సు మొదటి చెక్‌పోస్ట్ చేరింది.



© EMESCO BOOKS

తడబడుతున్న గుండెలతో 'క్యూ'లో నుంచున్నాడు అహ్మద్.

అతడి పాస్‌పోర్టు చూసి.

'ఎటు వెళ్తున్నావు' అడిగాడు ఇజ్రాయెలీ గార్డు.

అతడి మాటలో ఇంగ్లీషు యాస గమనించాడు అహ్మద్. కావాలని ఇంగ్లీషులో సమాధానం ఇచ్చాడు.

'జెరుసలేంలోని బ్రిటీష్ కార్యాలయానికి వెళ్తున్నాను. ఇక్కడినుంచి పారి పోతున్నాను.'

ఇంగ్లీషు విని కళ్లెగరేశాడు గార్డు. మరేమీ అడక్కుండా ముందుకు పొమ్మనాడు.

రెండో చెక్‌పోస్ట్‌లో ఆలస్యం జరిగింది.

అహ్మద్‌లో కంగారు పెరిగిపోతోంది. ఎందుకంటే, ఇక్కడికీ తండ్రి రావచ్చు. ఆయన వస్తే ఇంత ప్రయత్నమూ బూడిదలో పోసిన పన్నీరవుతుంది. ఇంకో రెండు చెక్‌పోస్టులు దాటిన తరువాత బస్సు వేగం అందుకుంది. 'రామల్లా' చేరగానే బస్సు ఆగిపోయింది.

'ఇక ముందుకు వెళ్లదు' చెప్పాడు డ్రైవర్.

అహ్మద్ ఆగలేకపోయాడు. టాక్సీని మాట్లాడాడు. తన దగ్గరున్న డబ్బులు టాక్సీకి సరిగ్గా సరిపోతాయి. ఆ తరువాత?

దైవంపై భారం వేసి బ్రిటీష్ కార్యాలయం అడ్రసు చెప్పాడు. చివరి చెక్ పాయింట్ ముందు టాక్సీ ఆగింది. పాస్‌పోర్ట్ చూపించాడు అహ్మద్. ఇజ్రాయెల్ సైనికులు తమలో తాము చాలాసేపు వాదించుకున్నారు.

అహ్మద్‌ను క్షుణ్ణంగా వెతికారు. చివరకు వేలిగోళ్లను కూడా వదల్లేదు.

'నేను సూసైడ్ బాంబర్‌ను కాదు' అన్నాడు అహ్మద్. 'బాంబు పేల్చేవరకూ ఎవరూ బాంబర్లు కారు' అంటూ మళ్లీ మళ్లీ వెతికారు.

చివరికి పొమ్మన్నారు.

అప్పటికి సాయంత్రం అయింది. ఈ పాటికి తండ్రికి నిజం తెలిసిపోయి ఉంటుంది. తనకన్నా వేగంగా రాగలడు.

'ఆయనకు దొరికిపోతే?' ఒళ్లు చెమటతో తడిసి ముద్దవుతోంది.

చివరికి బ్రిటీష్ కార్యాలయం ఉన్న వీధిలో టాక్సీ ఆగింది.

'ఇక్కడి నుంచి నడచుకుంటూ వెళ్లాలి. ఈ వీధిలోకి టాక్సీలు వెళ్లవు' చెప్పాడు టాక్సీ డ్రైవర్.

అప్పటికి చీకటి పడుతోంది. ఎంత వెతికినా అహ్మద్‌కు బ్రిటీష్ కార్యాలయం కనబడటం లేదు. కనీసం బ్రిటీష్ జెండా కూడా కనబడటంలేదు. ఆ వీధిలో పదిసార్లు తిరిగాడు.

© EMESCO BOOKS

అహ్మద్‌లో కంగారు పెరిగిపోతోంది. తండ్రి వచ్చేస్తే? అనుమానాస్పదంగా అటూ ఇటూ తిరుగుతున్న అహ్మద్‌ను ఇజ్రాయెలీ పోలీసులు పట్టుకున్నారు. అతడి కంగారు వారిలో అనుమానం పెంచింది.

ఏడుస్తూ తన కథ చెప్పాడు అహ్మద్. బ్రిటీష్ కార్యాలయానికి వెళ్లాలన్నాడు.

'ఇవాళ్ల కొత్త సంవత్సరం మొదటిరోజు. అన్ని కార్యాలయాలకు సెలవు' చెప్పారు వాళ్లు.

భోరుమన్నాడు అహ్మద్. తన తండ్రి వస్తే తనని పాలస్తీనాకు లాక్కుపోతాడని, ఆ నరకానికి పోవాలని లేదని, తనని కాల్చి చంపేయమని ఇజ్రాయెలీ సైనికులను ఏడుస్తూ ప్రాధేయపడ్డాడు.

ఒక సైనికుడి గుండె కరిగింది. బ్రిటీష్ దౌత్యాధికారికి ఫోన్ చేశాడు.

సంబరాలలో ఉన్న దౌత్యాధికారి 'అహ్మద్' పేరు వింటూనే ఉలిక్కిపడ్డాడు.

'అతడిని నా దగ్గరకు తీసుకురండి' అన్నాడు.

వెంటనే ఐలీన్‌కు ఫోను చేశాడు.

* * *

'అహ్మద్ వచ్చేస్తున్నాడు'–

సంతోషంతో నృత్యం చేసింది ఐలీన్.

హీత్రో విమానాశ్రయంలో విమానం దిగుతున్న అహ్మద్‌ను చూస్తూనే సంతోషంతో భోరుమంది ఆ కన్నతల్లి.

'నరకాన్ని దాటుకుని వచ్చానమ్మా' అన్నాడు అహ్మద్ ఆమెని కౌగిలించుకుని కన్నీళ్ల మధ్య.

* * *

ఇప్పుడు అహ్మద్ తన పేరును 'జాన్ సుట్టన్'గా మార్చుకున్నాడు. ఇంజనీరు అవ్వాలన్నది అతడి ఆశయం.

'ఏదో ఒకరోజు నాబ్లస్ వెళ్లి నా సోదరులను కూడా నరకం నుంచి తప్పిస్తాను' అంటాడు అహ్మద్.

* * *

ఇజ్రాయెల్ నుంచి బ్రిటన్‌వెళ్లే విమానం అహ్మద్ ఎక్కిన గంట తరువాత కమాల్ బ్రిటీష్ దౌత్య కార్యాలయం చేరాడు.

తన కొడుకుని అప్పగించమని గోల చేశాడు.

అహ్మద్ విడిచేసిన దుస్తులను అతడికి అప్పగించి చేతులు దులుపుకున్నారు బ్రిటీష్ అధికారులు.



© EMESCO BOOKS

# కథ కార్చిన కన్నీరు

---

**మనిషిలోని రాక్షసత్వ స్వరూపాన్ని వివరిస్తూ**
**ప్రపంచానికి మానవత్వం నేర్పుతున్న యువతి కథ.**

---

ప్రజలు కకావికలై పరుగెత్తుతున్నారు. పరుగెత్త లేనివారు వాళ్ల కాళ్లమీద పడి బతిమిలాడుతున్నారు. తట్టుకోలేక ఏడుస్తున్నారు. ప్రాణాలు కోల్పోయే వారు హృదయ విదారకంగా కేకలు పెడుతున్నారు. తుపాకుల ధనధనలు బాధితుల రోదనలు ధ్వనులకు తాళం వేస్తున్నట్లున్నాయి. ఇంతలో... నిస్సహాయంగా రోదిస్తున్న ప్రజల గుంపులోకి ఓ వ్యక్తి కత్తి పట్టుకుని దూకాడు. విచిత్ర విన్యాసంతో చేతిలోని కత్తి తిప్పుతూ మనుషులను కూరగాయలు తరిగినట్టు తరిగి వేయసాగాడు. చివరికి పసి పిల్లలను, వృద్ధులను కూడా వదలడం లేదతను. మనుషులను కోసేయడంలో ఏదో పైశాచిక ఆనందం అనుభవిస్తున్నాడతను.

అతడి కత్తి మనుషుల శరీరాలను ముక్కలు చేస్తుంటే వికటంగా నవ్వుతున్నాడు. అతడి కళ్లు వింత ఆనందంతో మెరుస్తున్నాయి.

ఇంతలో అతడి చూపులు హఠాత్తుగా 'చాంగ్'పై పడ్డాయి. అంతే!

వికటంగా నవ్వుతూ కత్తి ఎత్తాడు.

కెవ్వున కేక పెట్టింది–

మరు క్షణమే కళ్లు తెరిచింది. అది కలకాదు. 'నిజ'మని నిరూపిస్తూ ఎదురుగా కత్తి పట్టుకుని నిలబడి ఉన్నాడతడు. కానీ అతడు కత్తి అలా ఎత్తి పట్టుకుని, క్రూరంగా మెరుస్తున్న కళ్లతో నుంచునే ఉంటాడు. కదల లేడు.

కత్తి దింపనూ లేడు.

* * *

చైనా చరిత్రలో ఒక అతిభయంకరమైన చారిత్రక సత్యానికి సాక్ష్యం అది. తన ముందు మోకాళ్లమీద కూచుని రోదిస్తున్న సైనికులను కత్తితో నరుకుతున్న జపానీ సమురాయ్

© EMESCO BOOKS

ఛాయాచిత్రం అది. అంతకాలం తనను కలల్లోనే భయపెడుతున్న ఆ కత్తిపట్టుకున్న సమురాయ్ నిజానికి కల కాదు. నిజం!

'నాన్‌కింగ్' ప్రాంతంలో చైనీయులపై జపాన్ సైనికులు జరిపిన ఆకృత్యాలు అవి! ప్రపంచానికి సరిగ్గా తెలియని అత్యంత ఘోరమైన సన్నివేశం అది. ఎవరూ పైకి చెప్పటానికి ఇష్టపడని ఆ అమానవీయ దృశ్యాన్ని ప్రపంచానికి తెలిపితే కానీ తనను పీడిస్తున్న సమురాయ్ పీడకల వదలదని చాంగ్‌కు అర్థమైంది.

* * *

ఇయాన్ చాంగ్‌కు చిన్నపుడు తల్లిదండ్రులు ఆవేశంగా నాన్‌కింగ్ ఆకృత్యాల గురించి చెప్తుండేవారు. అప్పుడు ఆమెలో ఓ విధమైన ఆవేశం కలిగేది. వెంటనే లైబ్రరీకి వెళ్లి 'నాన్‌కింగ్' సమాచారం వెతికేది. అది దొరకక పోవటంతో ఉత్సాహం చల్లారి పోయేది. ఇల్లినాయిస్ యూనివర్సిటీ నుండి మాస్టర్ డిగ్రీ సంపాదించింది చాంగ్. ఆమె ఏం చేస్తున్నా మనసులో ఏదో మూల నాన్‌కింగ్‌లో జరిగిన ఆకృత్యాలు, ఆనాటి కథలే మెదలుతుండేవి.

రెండవ ప్రపంచయుద్ధంలో ప్రపంచవ్యాప్తంగా జరిగిన అమానుష కృత్యాలు ఒకటొకటిగా బహిరంగమవుతూ, ప్రజల జ్ఞాపకాల్లో స్థిరనివాసం ఏర్పరచుకుంటున్న తరుణం అది. కానీ 'నాన్‌కింగ్' గురించి అంత ఎక్కువగా ఎవరికీ తెలియదు. అక్కడి ఆకృత్యాలను పరిశోధించే ఓ కమిటీ ఏర్పడింది. కానీ, కొరియాతో యుద్ధం ఆరంభమవటంతో అందరి దృష్టి ఆ వైపుకు మళ్లింది. 1994 కల్లా ఇయాన్ చాంగ్ వివాహమైంది. రచయిత్రిగా ఇయాన్‌చాంగ్ మంచిపేరు సంపాదించింది. ఆమెకు అవార్డులు వచ్చాయి. పరిశోధనకు గ్రాంట్లు లభించాయి. ఈ హడావిడిలో నెమ్మదిగా నాన్‌కింగ్ ఆమె స్మృతి పథంలోంచి తొలగిపోయింది. కానీ, అప్పుడప్పుడు కత్తి పట్టుకున్న సుమురాయ్ కలలోకి వచ్చేవాడు. చెమటలతో ఉలిక్కిపడి లేచేది.

రెండవ ప్రపంచ యుద్ధంపై సమావేశానికి ఆహ్వానం రావటంతో వెళ్లింది చాంగ్. అక్కడ 'నాన్‌కింగ్'కు సంబంధించిన కొన్ని ఛాయాచిత్రాలు ఉన్నాయి. అవి చూస్తుంటే ఆమె కడుపులో తిప్పసాగింది. ప్రజల ముఖాల్లో ఉట్టిపడుతున్న దైన్యం, నిస్సహాయతలు ఆమెను కదిలించాయి. మరోవైపు కలల్లోకి వచ్చి బెదిరిస్తున్న సమురాయ్ ఫొటో.

నాన్‌కింగ్ ఆకృత్యాలను ప్రపంచానికి తెలియజెప్పటం రచయిత్రిగా తన బాధ్యత అని చాంగ్ గుర్తించింది. ఆ కథను ప్రపంచానికి చెప్పడం ద్వారా తన మనసులోని బాధ ప్రక్షాళణ అవుతుందని ఆమెకు తెలుసు.

రెండవ ప్రపంచ యుద్ధం సమయంలో చైనా జపాన్‌ల మధ్య ఎనిమిదేళ్ల పాటు ఘోరమైన పోరాటమే జరిగింది. ఈ ఎనిమిదేళ్ల యుద్ధంలో నవంబర్ 1937న జపాన్ సైన్యం 'షంఘాయ్'పై విజయం సాధించింది. డిసెంబర్ రెండో వారానికల్లా నాన్‌కింగ్‌ను చుట్టు ముట్టింది. ఆ తర్వాత మూడు నెలలపాటు జపాన్ సైనికులు నాన్‌కింగ్‌లో కరాళనృత్యం చేశారు. మృగాలు సైతం సిగ్గు పడేంత క్రూరంగా, నీచంగా మనిషి ప్రవర్తించిన సంఘటనల్లోకెల్లా అతి దారుణమైనవిగా అవి చరిత్రలో నిలిచిపోయాయి.



© EMESCO BOOKS

ఆ మూడు నెలలపాటు జరిగిన ఆకృత్యాలను సేకరించి, ప్రపంచానికి అందించాలన్న తన ప్రయత్నం అంత సులభం కాదని చాంగ్‌కు తెలుసు. రెండవ ప్రపంచ యుద్ధంలో చైనానుండి అమెరికా వచ్చి స్థిరపడిన చైనీయులందరూ తనకు 'నాన్‌కింగ్' గురించి సమాచారం అందించాలని పత్రికా ప్రకటనలు ఇచ్చింది. ఒకరిద్వారా మరొకరి అడ్రసు తెలుసుకుంటూ వీలైనంత మందిని వ్యక్తిగతంగా కలుసుకుని విషయాలు సేకరించింది. యేల్ డివినిటీ స్కూల్ లైబ్రరీ, వాషింగ్టన్‌లోని అమెరికా నేషనల్ ఆర్కైవ్స్‌ల నుంచి సమాచారం గ్రహించింది. చైనా, తైవాన్‌ల నేషనల్ ఆర్కైవ్స్‌ను సందర్శించింది. ఆ సమయంలో చైనాలోని మిషనరీలను ఇంటర్వ్యూ చేసింది. వారి నడుమ నడిచిన ఉత్తర ప్రత్యుత్తరాలను పరిశీలించింది. యుద్ధనేరాల విచారణ కమిటీల కాగితాలను క్షుణ్ణంగా పరిశీలించింది. జపానీ సైనికులు, వారి అత్యాచారాలకు గురైన చైనా ప్రజల అవమానాలను తెలుసుకుంది. ఆ సమయంలోని వార్తా పత్రికలను పరిశీలించింది. ప్రపంచంలోని పలువార్తా కథనాలను సేకరించింది.

ఆరంభంలో అప్పుడప్పుడు పడే చిన్న నీటి చుక్కలా అందుతున్న సమాచారం, రాను రాను వర్షమై, జలపాత ధారలా అయి, పెనుతుఫానుగా, వరదలా మహా సముద్రమై ముంచెత్త సాగింది. 'ప్రపంచంలో ఏ విషయమైనా ఆరంభించనంత వరకే అతి కష్టంగా, అసాధ్యంలా అనిపిస్తుంది. కానీ దృఢ నిశ్చయంతో పట్టుదలగా అడుగు ముందుకేస్తే అలాంటివి సుసాధ్యమవుతాయి'– అని చాంగ్ విషయంలో నిరూపితమైంది.

ఆ సంఘటనలను తలచుకుంటూ, కళ్ల ముందు ఊహించుకుంటూ, ఆకృత్యాలకు గురైన వారి స్థానంలో తనను ఊహిస్తూ, వారి అనుభవాలను అనుభవిస్తూ కలం కదపసాగింది చాంగ్.

* * *

జపానీయులు 'నాన్‌కింగ్' చేరుకున్నారు. వేల సంఖ్యలో చైనా సైనికులు జపానీయులకు లొంగిపోయారు. జపానీయులు నాన్‌కింగ్‌ను ఆక్రమించుకున్నారు.

"లొంగిపోయిన ఒక్క సైనికుడినీ ప్రాణాలతో వదలకూడదు" అని 66వ బెటాలియన్‌కు అధికారుల నుంచి ఆదేశాలు అందాయి.

అత్యంత దారుణమైన మానవ ఊచకోత ఆరంభమైంది. పదివేలకు పైగా చైనా సైనికులను దారుణంగా కాల్చి చంపారు జపాన్ సైనికులు. ఒక రోజంతా 14,777 మంది చైనా సైనికుల చేతులను వెనక్కు కట్టేయటంతోటే సరిపోయింది జపానీ జవాన్లకు. మర్నాడు వారిని ఊరి చివరి నది ఒడ్డుదాకా నడిపించుకుని వెళ్లారు. ఓ గంటపాటు తుపాకుల మోతతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. ఆ పై రాత్రంతా సైనికుల శవాలను బాయొనెట్లతో పొడుస్తూ గడిపారు జపాన్ సైనికులు.

© EMESCO BOOKS

ఈ సంఘటనను ఓ ఆట గురించిన వార్త లా వర్ణించింది జపాన్ మీడియా. సైనికులను చంపిన తర్వాత అమాయక ప్రజలపై పడ్డారు జపాన్ సైనికులు. మనుషుల శవాలతో ఆ ప్రాంతం నిండిపోయింది. నదులు శవాలతో నిండిపోయాయి. 'యాంగ్జె' నది రక్తంతో ఎర్రనది అయి పారింది. జపానీ సైనికులు నాన్‌కింగ్ ప్రజలపై జరిపిన అత్యాచారాలు అత్యంత హేయమైనవి. ప్రజలను ఇళ్లపైకి ఎక్కించి, ఇళ్లు తగల పెట్టేవారు. ఇళ్లు కూలి ప్రజలు నిప్పులో పడేవారు. నిప్పు ఆరిన తరువాత బతికి ఉన్నవారిని వెతికి మరీ చంపేవారు.

గాయపడిన ప్రజలను చీల్చేందుకు కుక్కలను ఉసిగొలిపారు. వృద్ధులను, పిల్లలను కాళ్లతో తొక్కి చంపేసేవారు. సైనికుల చేతిలో అత్యంత దారుణంగా హింసకు గురైంది స్త్రీలు. వయసుతో సంబంధం లేకుండా స్త్రీ అన్న ప్రతివారూ మానభంగానికి గురయ్యారు. చెత్త మోసే లారీల నిండా మహిళలను నింపుకుని జపానీ సైనిక శిబిరాలకు తీసుకువెళ్లేవారు. అక్కడ అందిన వారిని అందినట్టే జపానీ సైనికులు అనుభవించే వారు. ఆపై వారు పరుగెత్తుతుంటే కాల్చి చంపేవారు. కదలలేని వారిని క్రూరంగా హింసించి చంపేవారు. జపానీయుల చేతిలో 300,000 పైగా చైనీయులు ప్రాణాలు కోల్పోయారు. అప్పుడు కొందరు అమెరికా, యూరప్ దేశాలకు చెందిన వారు రెడ్‌క్రాస్ జెండాలు పాతి, ఆ నగరంలో కొన్ని ప్రాంతాలను 'ఇంటర్నేషనల్ సేఫ్టీజోన్'గా ప్రకటించారు. వారి నాయకుడు జర్మనీ వ్యాపారి, నాన్‌కింగ్ నాజీ పార్టీకి చెందిన జాన్ రాబె.

* * *

జాన్ రాబె గురించి తెలుసుకుంటుంటే 'చాంగ్' హృదయం ఉప్పొంగింది మొత్తం. ప్రజలు మూర్ఖులై, శివమెత్తినట్టు, పశువుల్లా ప్రవర్తిస్తుంటే ఆ పాశవిక తుపాను నడుమ మానవత్వం ఇంకా మరణించలేదని చిరుదివ్వెను వెలిగించిన వ్యక్తి జాన్ రాబె.

రెండవ ప్రపంచయుద్ధంలో జపాన్, జర్మనీలు మిత్రదేశాలు. అందువల్ల జపానీయులు తన మాటను గౌరవిస్తారని జాన్ భావించాడు. కానీ అతని మాటను ఎవరూ ఖాతరు చేయలేదు. జపాన్ ప్రభుత్వానికి అనేక ఉత్తరాలు రాశాడు జాన్. సైనికుల ఆకృత్యాలను వివరిస్తూ, విమర్శిస్తూ రాశాడు. కానీ సమాధానం రాలేదు. దాంతో తన నాజీ సభ్యత్వ కార్డును ఉపయోగించడం మొదలుపెట్టాడు. ఎందుకంటే, ఆ కార్డు చూడగానే జపానీ సైనికులు తలవంచి వెళ్లిపోయేవారు.

నగరం నలుమూలలా తిరుగుతూ జపానీ సైనికుల అత్యాచారాల నుంచి వీలైనంత ఎక్కువమందిని కాపాడేడు జాన్. అలా కాపాడిన వారిని సేఫ్టీ జోన్‌కి చేర్చేవారు. ఆ విధంగా అనేకులను కాపాడాడు జాన్. కానీ అతని చర్యల గురించి జర్మనీ ప్రభుత్వానికి తెలిసింది. 1938లో జాన్ జర్మనీ చేరాడు. చైనా ప్రజలపై జపాన్ సైనికుల అత్యాచారాలను అరికట్టమని విజ్ఞప్తి చేశాడు. కానీ నాజీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాడన్న నేరం మోపి ఆయనను బంధించారు.

* * *

1938 డిసెంబర్ కల్లా 'నాన్‌కింగ్'లో జపానీ అత్యాచారాలు ఆగిపోయాయి. చైనా వారి అహంకారాన్ని అణచి తగిన గుణపాఠం వారికి నేర్పామని జపాన్ సైనికులు సంతోషించారు. ఒక్క నాన్‌కింగ్‌లోనే 300,000 మంది చైనీయులు మరణించారు. పోలిస్తే, రెండవ ప్రపంచయుద్ధంలో అమెరికా సైనికులు 291,000 మంది ప్రాణాలు కోల్పోయారు.

రచన పూర్తయింది. కానీ ఇయాన్ చాంగ్‌కు సంతృప్తి కలగలేదు. జాన్ రాబ్ గురించి పూర్తిగా తెలుసుకుంటే కానీ తన రచన పూర్తి కాదని ఆమెకు తెలుసు. అందుకే జర్మనీ ప్రయాణమైంది. రెండవ ప్రపంచ యుద్ధానికి సంబంధించిన రికార్డులు వెతికింది.

జాన్ రాబ్ రెండవ ప్రపంచయుద్ధం తర్వాత బతికాడు. కానీ ఆనాటి బాంబుదాడుల వల్ల అతని ఇల్లు బూడిదైంది. దుర్భరమైన దారిద్ర్యంలో బతికాడు. 1948లో ఈ సంగతి నాన్‌కింగ్‌లోని ప్రజలకు తెలిసింది. జపాన్ సైనికుల బారి నుంచి తమని కాపాడిన 'జాన్‌రాబ్'ను వారు మరిచిపోలేదు. తమకే తినటానికి తిండిలేని పరిస్థితిలో కూడా వారంతా స్వచ్ఛందంగా డబ్బు జమచేసి 2000 డాలర్లు జర్మనీ పంపారు. అయితే 1950లో జాన్ రాబ్ గుండెనొప్పితో మరణించాడు. కానీ తాను రక్షించిన వారందరి వివరాల జాబితాను, ఫొటోగ్రాఫులను, వార్తాపత్రికలు ప్రకటించిన వార్తలను భద్రపరిచాడు. దాదాపుగా 200 పేజీల ఆ అంశాలను 1996లో చాంగ్ బహిరంగ పరచింది.

"ప్రపంచం దొంగల గురించి తెలుసుకుంటుంది. నియంతల గురించి చదువుతుంది. మానవుడు పశువులా ప్రవర్తించటం చూసి నిరాశకు గురవుతుంది. మనిషి మనిషిని పశువుకన్నా హీనంగా హింసించడం చూసి బాధపడుతుంది. కానీ మనిషిలో మానవత్వం ఎన్నటికీ మరణించదని నిరూపించే 'జాన్‌రాబ్' వంటివారి గురించి తెలుసుకున్నప్పుడు మనిషి భవిష్యత్తుపై ఆశాభావం కలుగుతుంది. ఇటువంటి వారిని మనం మరచిపోవద్దు" అంటుంది చాంగ్.

ఆమె రచించిన 'ది రేప్ ఆఫ్ నాన్‌కింగ్' పుస్తకం 1997లో విడుదలవుతూనే సంచలనం సృష్టించింది. అమెరికా, జపాన్, చైనా ప్రజలేకాదు, ప్రపంచ ప్రజలంతా ఆ పుస్తకం చదివి చలించిపోయారు.

జపాన్, చైనాల నడుమ రాజకీయ దుమారం రేగింది. రెండు దేశాల మధ్య ఉద్విగ్నతలు నెలకొన్నాయి.

చాంగ్ మాత్రం ఇదేం పట్టించుకోకుండా దేశాలు పర్యటిస్తూ ప్రజలలో 'నాన్‌కింగ్' గురించిన అవగాహన కలిగిస్తోంది.

"మనం నాన్‌కింగ్‌ను ఎప్పటికీ మరిచిపోవద్దు. ఎందుకంటే, మనిషి ఎంత నాగరీకుడైనా అతనిలో ఉన్న ఏదో ఒక బలహీనత అతడిని మానవత్వం మరచిపోయి రాక్షసుడిలా ప్రవర్తించేటట్టు చేస్తుంది. ఆ రాక్షసత్వ స్వరూపం మనం మరచిపోకూడదు. కాబట్టి నాన్‌కింగ్ సంఘటన చైనా, జపాన్‌లకు మాత్రమే పరిమితమైంది కాదు. ఇలాంటివి ప్రపంచంలో ఏ క్షణంలోనైనా, ఏ ప్రాంతంలోనైనా, ఏ దేశంలోనైనా సంభవించవచ్చు. అలా జరక్కుండా చూసుకునే బాధ్యత మనందరిదీ. అందుకే 'నాన్‌కింగ్'ను, జాన్ రాబ్‌ను మరవవద్దు" అంటుంది చాంగ్.



© EMESCO BOOKS

# ఛాయా చిత్రాలు చెప్పే కథ

---

**చైనా ప్రజలపై జరిగిన అమానుష అత్యాచారాల నిశ్చల సాక్షులను ప్రపంచానికి చూపిన వ్యక్తికథ**

---

అది 1966 సంవత్సరం.

మావో జెడాంగ్ ఆరంభించిన సాంస్కృతిక విప్లవం ఒక ఉత్తుంగ తరంగంలా చైనాను ముంచెత్తుతున్న రోజులవి. చైనా ప్రజలలో స్వర్గాన్ని భువికి దింపుతున్నామన్న ఉత్సాహం వెల్లి విరుస్తున్న క్షణాలు అవి.

మావో మార్గదర్శకత్వంలో ప్రజలు పాత సంకెళ్లు తెంచుకుని మరో ప్రపంచం వైపు ఉరకలిడుతున్నారు. చైనా మొత్తం ఒక రకమైన సాంఘిక, మానసిక, సాంస్కృతిక మథనానికి గురవుతోంది.

అయితే ఆ మథనం నుంచి కొంత హాలాహలమూ ఉద్భవించింది. దానిని ప్రపంచానికి ప్రదర్శించిన ప్రత్యక్ష సాక్షి లై జెన్‌షెంగ్.

* * *

విప్లవం ఆరంభమైన దినాలలో లై సినిమాటోగ్రఫీ చదువుతున్నాడు. ప్రపంచ ప్రఖ్యాత చలన చిత్ర కెమెరా దర్శకుడిగా పేరు పొందాలన్నది లై లక్ష్యం. ఒకరోజు లైకు పై అధికారుల నుంచి పిలుపు వచ్చింది.

"నువ్వు కమ్యూనిస్టు పార్టీ సభ్యుడివా?" అడిగాడు అక్కడి అధికారి.

తల ఊపాడు లై. తన గుర్తింపు పత్రం, పార్టీ సభ్యత్వ పత్రాలను అధికారికి అందించాడు.

"నువ్వు ఎంతమంది విప్లవ వ్యతిరేకులను పట్టించావు?" సూటిగా అడిగాడు ఆ అధికారి.

© EMESCO BOOKS

సాధారణంగా ఏ తత్వవేత్త అయినా ప్రజల అభ్యున్నతి, సమాజ క్షేమం కోరి సిద్ధాంతాన్ని ఏర్పాటు చేస్తాడు. కానీ అది ప్రజాదరణ పొంది పదికాలాలు మన గలగటం దానిని అమలు పరచే వారిపైన ఆధారపడి ఉంటుంది. ఆ సిద్ధాంతం అనుయాయుల వ్యక్తిత్వంపైన దాని ప్రాచుర్యం ఆధారపడుతుంది.

కాలేజీ విద్యార్థులు, స్కూలు విద్యార్థులతో మావో 'రెడ్‌గార్డ్స్'ను ఏర్పాటు చేశాడు. ప్రభుత్వం ప్రకటించే నిర్ణయాలను వ్యతిరేకించిన వారిని ప్రభుత్వ నియమాలకు తలవంచి పాటించని వారిని, స్వతంత్రంగా వ్యవహరించే వారిని వెతికి పట్టి ఏరివేయడం 'రెడ్‌గార్డ్స్' పని. 'కొత్త మతం పుచ్చుకుంటే గుర్తులెక్కువ' అన్నట్టు వీరు అవసరమైన దానికన్నా ఎక్కువ ఉత్సాహం ప్రదర్శించటం ఆరంభించారు. పెద్దలను, టీచర్లను, మేధావులను చూడకుండా గవర్నరు నుండి చప్రాసీ వరకు ప్రతి ఒక్కరినీ అవమానించి, హింసించి, శిక్ష శిబిరాలలోకి పంపి ప్రపంచాన్ని మార్చేస్తున్నామని గర్వించేవారు. కానీ తాము ఏ సిద్ధాంతాన్ని అనుసరిస్తున్నారో, ఆ సిద్ధాంతాన్ని విమర్శించి దుర్వ్యాఖ్యానాలు చేసే అవకాశం ఎదుటివారికి ఇస్తున్నామని వారు గ్రహించలేకపోయారు. ఆ ఉత్సాహం అటువంటిది. ఆ రోజులు అంత ప్రబలమైనవి.

లైకు తన చుట్టూ జరుగుతున్నవి తెలుసు. కానీ మనస్ఫూర్తిగా వాటిలో పాల్గొనలేకపోతున్నాడు. మనుషుల నడుమ తేడాలు లేక అందరూ సమానంగా మనగలగడం వాంఛనీయమే అయినా ఇలా వ్యతిరేకించిన వారిని మట్టుపెట్టడం అమానుషం అని లై నమ్మకం.

అందుకే తల అడ్డంగా ఊపాడు.

"నాకెవరూ సిద్ధాంత వ్యతిరేకులు కనబడటం లేదు" అన్నాడు నెమ్మదిగా లై.

అధికారి తల పంకించాడు.

"నువ్వు సినిమాటోగ్రఫీ నేర్చుకుంటున్నావు కదూ?"

'అవునన్నట్టుగా' తల ఊపాడు లై.

"ఇవాళ్టి నుంచీ నువ్వు ఫొటో జర్నలిజం నేర్చుకో. నువ్వు ఫొటో జర్నలిస్టుగా సమాజానికి ఇంకా మంచి సేవలు అందించగలుగుతావని పార్టీ నమ్మకం" లై ముఖ కవళికలను జాగ్రత్తగా గమనిస్తూనే అన్నాడు అధికారి.

తన మనసులో భావాలు ముఖంలో బయట పడకుండా జాగ్రత్తపడ్డాడు లై. అతని కలల ప్రపంచం మొత్తం ఒక అధికారి నిర్ణయంతో కుప్పకూలి పోయింది. సినీ కెమెరామేన్ అవుదామనుకున్న లై తను ఫొటో జర్నలిస్టు అవటం తనకే నచ్చలేదు.

"పార్టీ నా గురించి నిర్ణయం తీసుకునే ముందు నన్ను సంప్రదిస్తే బాగుండేది. నా ఇష్టాయిష్టాలు ఒకసారి పరిగణనలోకి తీసుకోవాల్సింది" అని వీలైనంత సౌమ్యంగా, మృదువుగా అన్నాడు లై.

అధికారి కనుబొమలు ఎగరేశాడు.

"నువ్వు పార్టీ ఆదేశాలను ధిక్కరిస్తున్నావా? నువ్వు ఫొటో జర్నలిజమే చేయాలి. నిన్ను 'హార్బిన్'కు పోస్ట్ చేస్తున్నాను" తన నిర్ణయానికి ఎదురులేదన్నట్టుగా లేచాడు అధికారి.

'హార్బిన్' పేరు వినగానే లై ఒళ్లు చల్లబడింది. చైనా ఉత్తరాన ఉన్న రాష్ట్రానికి రాజధాని హార్బిన్. చైనాలోకెల్లా అతి శీతలమైన ప్రదేశం అది. మరోమాట మాట్లాడకుండా తల వంచుకుని బయటకు నడిచాడు లై. అతని మనసులో లావాలా ద్వేషం పెల్లుబుకుతోంది.

కొందరు వ్యక్తుల 'అతి' వల్ల అనేకమంది అమాయకులు సిద్ధాంతంపై ద్వేషం పెంచుకుంటారు. వీరి ద్వేషం వల్ల ఒక ఉత్తమ సిద్ధాంతం వికృత రూపంలో ప్రపంచానికి పరిచయమవుతుంది. లై వల్ల అదే జరిగింది.

* * *

"నువ్వు విప్లవం వల్ల మనం సాధించిన గొప్ప ఫలితాలను నీ ఫొటోల ద్వారా ప్రదర్శించాలి."

హార్బిన్‌లో ఓ పెద్ద దినపత్రికలో లైకు ఉద్యోగం దొరికింది. ఉద్యోగంలో చేరిన తొలిరోజే అతనికి ఎడిటర్ నుండి ఈ ఆదేశం అందింది.

లై తలూపాడు. 'ప్రతి వారికీ దీపం వెలుగులే కావాలి. దీపం నీడన చేరే పురుగులగురించి ఎవరూ ఆలోచించరు' అనుకున్నాడు లై మనసులో.

'వీరంతా 'మంచి'నే అధికారులకు ప్రదర్శిస్తున్నారు. ఆ 'మంచి'నే అధికారులు పై వారికి పంపుతారు. ఆ పైకీ అదే 'మంచి' వెళుతుంది. అత్యున్నత స్థానంలో ఉన్న వ్యక్తి కళ్లవంటి వీళ్లు, వాళ్లు చూపాలనుకున్నదే చూపుతుంటే, అత్యున్నత స్థానంలోని వ్యక్తికి నిజానిజాలు ఎలా తెలుస్తాయి?'– ఇలా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాడు లై.

"నేను తెలియజేస్తాను. సమాజాన్ని ఉత్తేజపరిచి సంఘటితం చేసి ప్రగతి దిశగా ప్రయాణించేట్టు చేస్తున్న ఛైర్మన్ కళ్లకు అసలు నిజాన్ని ప్రదర్శిస్తాను" అనుకున్నాడు స్థిరంగా.

* * *

విప్లవం సత్ఫలితాలను, చైనాలో చిరునవ్వులు చిందిస్తున్న పేద ప్రజలను ఫొటోలు తీసి పత్రికకు ఇచ్చేవాడు లై. ఇది అతని బహిరంగ జీవితం. అతని అంతరంగ జీవితం వేరు.

'విప్లవం' పేరిట అధికారుల నైచ్యం ప్రదర్శిస్తూ బలహీనులను, అమాయక ప్రజలనూ హింసించటాన్ని రహస్యంగా తన కెమెరాలో బంధించటం ఆరంభించాడు.

© EMESCO BOOKS

అది చాలా ప్రమాదకరం అని లైకు తెలుసు. కానీ అధ్యక్షుడికి అసలు నిజం తెలియజేయడం అంత సామాన్యమైన విషయమేమీ కాదు. దారిలో అనేక మింగే పాములవంటి అధికారులను దాటి వెళ్ళగలిగితేనే అధ్యక్షుడిని చేరగలుగుతానని లైకు తెలుసు.

ఇంతలో లై మామ ఆత్మహత్య చేసుకున్నాడు.

"నాన్నని విప్లవ వ్యతిరేకునిగా భావించి అధికారులు వేధించడం ప్రారంభించారు. అది భరించలేక ఆయన ఆత్మహత్య చేసుకున్నాడు" నిజం తెలుసుకున్న లై భార్య భోరుమంది. మరుసటి రోజే లై భార్య 'యింగ్జియా'కు అధికారుల నుంచి పిలుపు వచ్చింది.

"మీ నాన్న విప్లవ వ్యతిరేకి. నువ్వుకూడా విప్లవ వ్యతిరేకివి కావని ఋజువేమిటి?" అంటూ నిలదీశారు అధికారులు.

యింగ్జియా మాట్లాడలేదు.

"నువ్వివాళ్టి నుంచి నీ ఎడిటర్ ఉద్యోగం మానేస్తున్నావు. మావో రచనలు బట్టీ పట్టి అప్పచెప్పటం నీ పని" ఆదేశించారు అధికారులు.

యింగ్జియా ఇంటికి వచ్చి లై భుజం మీద తలపెట్టి కళ్ళు మూసుకుంది. కంటి నుండి నీరు కార్చాలన్నా భయమే ఆమెకు.

* * *

నల్ల మేఘాలు ఎప్పుడూ ఒంటరిగా రావు. గుంపుగానే వస్తాయి. ఆకాశంలో దట్టంగా ఆలుముకుంటాయి. లై పనిచేస్తున్న పత్రికాఫీసులో ఓ అధికారి నెగటివ్‌ల లెక్కలు చూశాడు. లై అధికంగా నెగటివ్స్‌ను వ్యర్థం చేస్తున్నాడనిపించింది ఆయనకు. లైని పిలిపించాడు.

"నీకు ఇచ్చిన రోల్‌కు నువ్వు తీసిన ఫొటోలకు నడుమ చాలా తేడా ఉంది. అంత రీల్ ఎందుకు వ్యర్థం చేస్తున్నావు? ఇది ప్రజల డబ్బు అని తెలియదా?" నిలదీశాడు అధికారి.

లై తలవంచుకున్నాడు.

"మొన్న గవర్నర్ లైసన్వుకు రెడ్‌గార్డ్స్ బుద్ధి చెప్తూంటే ఫొటో తీశావన్నారు. నిజమేనా?" గద్దించాడు అధికారి.

గవర్నర్ లైసన్వు మావోలాంటి హెయిర్ స్టయిల్ పెంచుకున్నాడు. అది మావోకు అవమానంలా భావించిన రెడ్‌గార్డ్స్ అతడిని ఓ కుంటి కుర్చీపై నుంచోబెట్టి తలపై విప్లవటోపీ పెట్టి, ఒళ్లంతా సిరా పోసి, రాళ్లు చెప్పులూ విసుర్తూ అవమానించారు. అతడికి గుండు కొట్టారు.

ఆ దృశ్యాన్ని లై ఫొటో తీశాడు.

"నీ దగ్గర ఉన్న ఆ సంఘటన నెగటివ్‌లన్నీ రేపు ఉదయంలోగా మాకు అందించాలి. వ్యర్థమైన వాటినికూడా" ఆదేశించాడు అధికారి.

తల ఊపి ఇంటికి వచ్చేశాడు లై. అంతవరకు తాను తీసిన నిషిద్ధ ఛాయాచిత్రాలన్నిటినీ పోగు చేశాడు. తన టేబిల్ కింద ఉన్న నేలపై రాళ్లను తొలగించి రహస్య అర ఏర్పాటు చేసి ఫొటోలు, నెగటివ్స్ దాంట్లో దాచాడు. మళ్లీ పైన రాళ్లను కప్పేసి పైన బల్లను ఉంచాడు.

లై అందచేసిన నెగటివ్‌లు అధికారులకు సంతృప్తి కలిగించలేదు.

ఆ రోజు పత్రికలో ఉద్యోగులందరి ముందు లైను దూషించారు అధికారులు. అతడి పార్టీ సభ్యత్వ కార్డును తీసి చించేశారు. అతడిపై ఉమ్మేశారు. "నీ మామ సిద్ధాంత ద్రోహి. నీ భార్య సిద్ధాంత వ్యతిరేకి. నువ్వు ప్రజాధనాన్ని నాశనం చేస్తున్నావ్" అంటూ దూషించారు.

అర్ధరాత్రి అతడి ఇంటిని సోదా చేశారు. లై తన టేబిల్‌వద్ద నిలబడి వారి ప్రతి కదలికను జాగ్రత్తగా గమనించాడు. వారికేమీ దొరకలేదు.

"నువ్వు పార్టీకి విధేయుడిలా లేవన్న నేరం కింద నిన్ను సిద్ధాంతాన్ని బోధించే 'రిఫార్మ్ క్యాంపు'కు పంపుతున్నాం" అంటూ రెండు గంటల్లోగా మొత్తం కుటుంబాన్ని మూటముల్లె సర్దుకోమని ఆదేశించారు. భార్య కొడుకులతో 'రిఫార్మ్ క్యాంప్' చేరాడు లై తెల్లారేలోగా.

అక్కడ రాళ్లు కొట్టటం లై పని.

కెమెరా కన్ను నుండి ప్రపంచాన్ని చూడటం అలవాటైన లైకు రాళ్లు కొడుతూ బతకటం దుర్భరం అనిపించింది.

'తనలోని సృజనాత్మకతను తానే పోగొట్టుకుంటున్నానన్న నిరాశ కలిగేది. కానీ ఏదో ఒకనాడు తనకు స్వేచ్ఛ లభిస్తుంది. ఆరోజు నిజాలను అధ్యక్షుడికి వివరించాలి' అన్న ఆలోచనతో బతికేవాడు లై.

* * *

1971లో చైనాలో ప్రభుత్వ ధోరణి మారింది. పార్టీ పేరు కింద స్వార్థపరులు జరిపిన అత్యాచారాలు, దుష్కృత్యాలు పైస్థాయి అధికారులకు తెలిశాయి. దాంతో దేశంలో రాజకీయ సంస్కరణ పవనాలు వీచసాగాయి. అసహనం స్థానాన్ని సహనం ఆక్రమించింది. ప్రజలకు స్వేచ్ఛ లభించింది. లై, యింగ్జియాలు విడుదలయ్యారు.

1976లో ఆ ఫొటోలు పట్టుకుని మావోను కలిసేందుకు బీజింగ్ ప్రయాణమయ్యాడు లై. కానీ ఆయన బీజింగ్ చేరేసరికి మావో మరణించాడు. 1980లో బీజింగ్ యూనివర్సిటీలో ఫొటోగ్రఫీ ప్రొఫెసర్ ఉద్యోగం లభించింది లైకు. 1996లో చైనాలో విప్లవం ఆరంభమై 30



© EMESCO BOOKS

ఏళ్లయిన సందర్భంగా జరిగిన ఎగ్జిబిషన్‌లో తాను తీసిన ఆనాటి రహస్య ఫొటోలను తొలిసారిగా ప్రపంచానికి ప్రదర్శించాడు లై.

అది చూసి ప్రపంచం ఆశ్చర్యపోయింది. చైనా నిర్ఘాంతపోయింది.

విప్లవం నీడన మానవుడి నైచ్యం చేసిన కరాళ నృత్య కింకిణీ ధ్వనుల ఛాయాచిత్రాలు చూసి చైనా ప్రజలు నిర్విణ్ణులయ్యారు. ప్రభుత్వం లైకు ఉత్తమ ఛాయాచిత్రకారుడి బహుమతిని ఇచ్చింది.

'ఒక దశాబ్దం పాటు చైనా ప్రజలపై జరిగిన అమానుష అత్యాచారాలకు నిశ్శబ్ద సాక్షులు ఈ ఛాయాచిత్రాలు' అంటూ చైనా అధికారులు లై ప్రశంసా పత్రంలో పేర్కొన్నారు.

ప్రస్తుతం లై హార్వర్డ్, ప్రిన్స్టన్ యూనివర్సిటీలలో ఎడిటింగ్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాడు. చైనా యూనివర్సిటీ ఫొటోగ్రఫీ డిపార్ట్‌మెంట్ అధ్యక్షుడయ్యాడు.

"నా నిశ్చల చిత్రాలు ఒక దశాబ్ద చరిత్రను ఘనీభవింపజేసి ప్రదర్శిస్తాయి. ఆ చిత్రాల్లో కనిపించే మనుషుల మనోభావాలు తెలుసుకోవాలని నా కోరిక. అయితే నాకు కమ్యూనిస్టు సిద్ధాంతం మీద అమితమైన ప్రేమ ఉంది. దాన్ని క్రూరంగా అమలు పరచి సిద్ధాంతానికి చెడ్డ పేరు తెచ్చిన వారంటే ద్వేషం ఉంది. నా ఫొటోలు ఆ ద్వేషం వికృతరూపాన్ని ప్రదర్శిస్తాయి. కానీ ఆ సిద్ధాంతంలోని ప్రేమ భావనను ప్రదర్శించాలని నా తపన. అందుకే ఈ చిత్రాలు ఆనాటి చరిత్రకు మౌన సాక్ష్యాలు. మనిషి మనిషిపై సాగించిన ఒకనాటి అత్యాచారాలను ప్రపంచానికి ప్రదర్శిస్తూ భవిష్యత్తరాలకు చరిత్ర చేసే హెచ్చరికలను అవి గుర్తు చేస్తుంటాయి" అంటాడు లై.

లై తీసిన 300 నిశ్చల ఛాయాచిత్రాలు 'రెడ్-కలర్ న్యూస్ సోల్జర్: ఎ చైనీస్ ఫొటోగ్రాఫర్స్ ఒడిస్సీ థ్రూ ది కల్చరల్ రివల్యూషన్' అనే పుస్తకంలో పొందుపరిచారు.

© EMESCO BOOKS

# నిప్పులా తాకిన నిజం

**ఆత్మవిశ్వాసంతో 'పవర్ బలం'పై పోరాడి**
**గెలిచిన పత్రికారుడి కథ.**

'ప్రపంచంలో అన్ని మత్తు పదార్థాలకన్నా అత్యంత హానికరమైంది అధికారం ఇచ్చే మత్తు. ఇతర మత్తు పదార్థాల వల్ల వ్యక్తిగతంగా వ్యక్తి నష్టపోతాడు. కానీ అధికారం ఇచ్చే మత్తువల్ల వ్యక్తి స్వయంగా నష్టపోవటమే కాదు, సమాజం కూడా నష్టపోతుంది.'

తను రాసిన వాక్యాలను తనే చూస్తూ కూచుండిపోయాడు 'ది డెమొక్రాట్ రిపోర్టర్' పత్రిక సంపాదకుడు 'గుడ్లో'.

అలా కాగితాలవైపు చూస్తూ కూచున్న 'గుడ్లో'ను చూసి ఆశ్చర్యపోయింది అతని భార్య, ఆ పత్రిక రిపోర్టర్ 'జీన్ సట్టన్'.

నెమ్మదిగా లేచి వచ్చి గుడ్లో భుజం మీదుగా వంగి అతని టేబిల్‌పై ఉన్న కాగితాలవైపు తొంగిచూసింది. అతను రాసిన వాక్యాలు చదువుతుంటే, ఆమె కళ్లు చమర్చాయి. అతడిని దగ్గరకు తీసుకుంది.

'రాజర్ డేవిస్ గురించి రాస్తున్నావా?' అడిగింది జీన్.

సమాధానంగా తలూపాడతను.

* * *

'గుడ్లో' పత్రికాఫీసులోనే పుట్టి పెరిగాడంటారు. తండ్రి నుండి వారసత్వంగా ఆ పత్రిక 'గుడ్లో'కు అందింది. నిజం వైపు నిర్భయంగా తండ్రి నిలబడటం. అందరినీ ఎదిరించి పోరాడటం చూసిన 'గుడ్లో'కు నిజంతో రాజీపడకుండా ఉండటం చిన్నప్పటి నుంచీ అలవాటైంది. ఉన్నత విలువలను, ప్రామాణికాలను అనుసరించి పత్రికను నడుపుతానని తండ్రికి వాగ్దానం చేశాడు.

అలాగే నడుపుతూ వస్తున్నాడు.

© EMESCO BOOKS

అతడి భార్య జీన్‌కూడా పత్రికను నడపటంలో అతడికి చేదోడువాదోడుగా ఉండేది. నగరమంతా తిరిగి సమాచారం సేకరించేది. ఆ సమాచారాన్ని వార్తల రూపంలో రచించేవాడు గుడ్లో. ఇలా ఆ భార్యభర్తలిద్దరూ 'మారెంగో కంట్రీ' ప్రాంతంలో ఎంతో మంచిపేరు సంపాదించారు. ప్రజల ఆదరాభిమానాలను చూరగొన్నారు. అత్యధిక సర్క్యులేషన్ ఉన్న పత్రిక సంపాదకులుగా ఆ ప్రాంత ప్రజల అభిప్రాయాన్ని నిర్దేశించే స్థాయికి చేరుకున్నారు. అందుకే ఆ ప్రాంతానికి 'షెరీఫ్' ఎన్నికలు ప్రకటించినప్పుడు 'రోజర్ డేవిస్' ముందుగా 'గుడ్లో'ను వచ్చి కలిశాడు.

"మీరు నా అభ్యర్థిత్వాన్ని సమర్థించాలి. నేను అతిపేద కుటుంబంలో జన్మించాను. మా తల్లి తండ్రి చెత్త ఏరుకుని బతికేవారు. అటువంటి స్థితినుంచి అంచెలంచెలుగా ఎదిగాను. పోలీసు అయ్యాను. పోలీసు ఆఫీసరుగా రిటైరైనాను. నాలాంటి వారికి పేద ప్రజల స్థితిగతులతో పరిచయం ఉంటుంది. వారిపై సానుభూతి ఉంటుంది. నేను 'షెరీఫ్'నైతే, మన పట్టణాన్ని ఉత్తమంగా తీర్చిదిద్దుతాను. పోలీసుగా నా అనుభవాల్ని ఉపయోగించి పట్టణంలో నేరాలను అరికడతాను. శాంతిభద్రతలను కాపాడతాను" గంభీరంగా అన్నాడు రోజర్.

అతని మాటల విని నవ్వాడు 'గుడ్లో'.

"మీకు తెలుసు. నేను ఏ పార్టీని సమర్థించను. ఏ వ్యక్తికీ కొమ్ముకాయను. నాకు ఎవరిపైనా ప్రత్యేక శ్రద్ధ లేదు. నా దృష్టి అంతా ప్రజా సంక్షేమంపైననే. పోటీలో ఉన్న అభ్యర్థులలో నాకు అంతా కావలసిన వారే. నేను నిష్పాక్షికంగా నా అభిప్రాయాలను రాస్తాను. గుడ్‌లక్" అన్నాడు 'గుడ్లో'.

ఇక మాటలు పొడిగించాల్సిన అవసరం లేకపోయింది రోజర్‌కు.

* * *

పోటీలో ఉన్న అభ్యర్థులందరిలోకి రోజర్ డేవిస్ మంచివాడిలా, సమర్థుడిలా తోచాడు గుడ్లోకి. దాంతో రోజర్‌గురించి పూర్తి వివరాలు సేకరించాడు. 'పోలీసుగా రోజర్ డేవిస్‌కు మంచి పేరుంది. అయితే అతి పేదరికంలో పెరిగినందువల్ల అతడికి డబ్బుపై ఆశ అధికం. ఎక్కడ మళ్లీ పేదరికంలో బతకాల్సి వస్తుందోనన్న భయం అతడికి ఉంది. అవినీతికి పాల్పడినట్టు ఆరోపణలు ఉన్నా ఋజువులు లేవు. గుడ్లో తన భార్య జీన్‌తో దీర్ఘంగా చర్చించాడు.

"ఏ వ్యక్తీ సంపూర్ణుడుకాడు. ఎటువంటి లోపాలు లేనివాడు దేవుడితో సమానం. కాబట్టి, రోజర్ డేవిస్‌లోనూ లోపాలుంటాయి. అట్టడుగు నుంచి పైకి రావాలంటే ఎంత ధైర్యం, ఎంత పట్టుదల అవసరమో ఆలోచించండి. రోజర్‌లో అవన్నీ ఉన్నాయి" అంది జీన్.

దాంతో 'ది డెమొక్రాట్ రిపోర్టర్' పత్రిక బహిరంగంగా రోజర్‌ను సమర్థించకున్నా, ఉన్న అభ్యర్థులందరిలో అతడే ఉత్తముడన్న భావం వచ్చేలా వార్తలను, వ్యాసాలను ప్రచురించింది.

ఆ అభిప్రాయానికి విలువ ఇచ్చిన ప్రజలు రోజర్‌ను గెలిపించారు. గెలిచిన తరువాత రోజర్ స్వయంగా గుడ్లో దగ్గరకు వచ్చి కృతజ్ఞతలు తెలిపాడు. ఇలాగే గుడ్లో తనకు మద్ధతునిస్తూండాలని కోరాడు.

"మీరు మంచి చేస్తున్నంత కాలం మీకు నా మద్దతు ఉంటుంది. ఎప్పుడైతే మీరు దారి తప్పుతారో అప్పుడు మీకు మీ లోపాన్ని, తప్పును ఎత్తిచూపించి, రాయడానికి వెనుకాడను. నాకు నిజంపై తప్ప ఇతర ఏ అంశంపైనా, వ్యక్తిపైనా మమకారం లేదు" నిజాయితీగా అన్నాడు గుడ్లో.

"మీరు నన్ను వ్యతిరేకించే అవకాశం రాదులెండీ" అన్నాడు రోజర్ నవ్వుతూ.

కానీ, అతడి మాటలు అబద్ధం అవటానికి ఎక్కువ కాలం పట్టలేదు.

* * *

ఆరంభంలో వినిపిస్తున్న నీలివార్తలను 'గుడ్లో' పట్టించుకోలేదు. రోజర్ వ్యతిరేకులు చేస్తున్న ప్రచారం దుష్ప్రచారం అని భావించాడు.

"నిప్పు లేకుండా పొగరాదు. అయితే నిప్పు ఎంత తీవ్రమైందో మనం తెలుసుకోవాలి" అంది జీన్.

"అది తెలుసుకోవాల్సిందీ నీ బాధ్యతనే. నా మటుకు నాకు రోజర్‌ని అనుమానించేది కనబడటం లేదు. పాత వారందరినీ తొలగించి, వారి స్థానంలో తన సమర్థకులను నియమించాడు. అందరూ చేసే పని అది" అన్నాడు గుడ్లో.

ఏదైనా విషయం గురించి నిర్ణయానికి రావాల్సి వచ్చినప్పుడు వారిద్దరూ రెండు వ్యతిరేక వాదనలను సమర్థిస్తారు. ఎవరి వాదనలో బలముందో తేల్చుకున్నాక ఆ దృష్టితో ఆ అంశాన్ని విశ్లేషిస్తారు.

"అవును. అందరూ చేసేది అదే. కానీ రోజర్ కొత్తగా నియమించిన వారందరికీ నేరచరిత్ర ఉంది."

"వారంతా రోజర్ మాట జవదాటరు. అందరూ ఏదో ఓ సందర్భంలో అవినీతి ఆరోపణలను ఎదుర్కొన్నవారే"

"అంత మాత్రాన..." జీన్ ఏదో కాగితం టేబిల్‌పై పెట్టడంతో మాట సగంలో ఆపి ఆ కాగితం చదివాడు గుడ్లో.

"ఇకనుంచి షెరీఫ్ ఆఫీసులో వారెవరూ పత్రికల వాళ్లతో మాట్లాడకూడదుట. ఒక్క డేవిస్‌కే ఆ హక్కు ఉందట. స్మగ్లర్‌తో, డ్రగ్ వ్యాపారస్థులతో రోజర్ ఒప్పందాలు చేసుకుంటున్నాడని వార్తలు వస్తున్నాయి. డ్రగ్ డీలర్లను వేటాడేందుకు ఏర్పాటు చేసిన నిధులు రోజర్

© EMESCO BOOKS

వాడుకుంటున్నాడని ఆరోపణలు ఉన్నాయి" అంటూ మరో కాగితం కట్ట గుడ్లోకి ఇచ్చింది జీన్.

రోజర్ డేవిస్ బ్యాంకు స్టేట్‌మెంట్ అది. అది చూస్తూ గుడ్లో తల పంకించాడు.

* * *

'బలవంతంగా డొనేషన్లు గుంజుతున్న షెరీఫ్ డేవిస్'.

'డ్రగ్ ఫండ్స్‌ను దుర్వినియోగ పరుస్తున్నాడని డేవిస్‌ను మందలించిన ఆడిట్ ఆఫీసర్లు'

'డ్రగ్ డీలర్లతో చేతులు కలిపిన షెరీఫ్ రాజర్ డేవిస్'

వరుసగా షెరీఫ్ అవినీతులను ఒకటొకటిగా బయటపెట్టడం ఆరంభించాడు గుడ్లో.

'మారెంగో కంట్రీ' మొత్తం ఈ వార్తలతో అట్టుడికి పోయింది.

"గుడ్లో నన్ను సహాయం అడిగాడు. నేను నీతి బాహ్యంగా ప్రవర్తించనన్నాను. అందుకని కక్షకట్టి నాపై దుష్ప్రచారం చేస్తున్నాడు" అని ప్రకటించాడు రోజర్ డేవిస్.

అంతేకాదు, కనబడ్డ ప్రతివారితో గుడ్లోతో ఎటువంటి సంబంధాలు పెట్టుకోవద్దని బెదిరించడం ఆరంభించాడు. అధికారం అతని వద్ద ఉండటంతో అతనితో అవసరం ఉన్నవారంతా గుడ్లోని విమర్శించడం ఆరంభించారు. గుడ్లోను తిడుతూ, బెదిరిస్తూ పత్రికకు ఉత్తరాలు రాసాగాయి. గుడ్లో పత్రిక కొన్నవారికి షెరీఫ్ ఆఫీసుద్వారాలు మూసివేయబడతాయని రహస్యంగా ప్రతి ఒక్కరికీ వర్తమానం అందసాగింది.

దాంతో ఒకరొకరుగా గుడ్లో మిత్రులు గుడ్లోకు దూరమైపోవటం ఆరంభమైంది. పత్రిక సర్క్యులేషన్ పడిపోవడం మొదలైంది. పత్రికకు ప్రకటనలు ఇవ్వటం మానేశారు వ్యాపారులు. గుడ్లోకు ఎదురుపడిన వారు పక్కకు తప్పుకుపోతున్నారు. ప్రాణమిత్రులు చూసీ చూడనట్లు ఉంటున్నారు. ఇంకొందరు గుడ్లోని నిలదీయడం ఆరంభించారు.

"షెరీఫ్ రోజర్ డేవిస్‌పై ఎందుకు కక్షకట్టావు? అతడి జోలికి రాకు" అంటూ బెదిరించసాగారు.

గుడ్లో దేనికీ బెదరలేదు. కానీ రోజు రోజుకీ తగ్గిపోతున్న పత్రిక అమ్మకాలు అతడిని బాధపెట్టాయి.

"నాకు రోజర్‌పై ద్వేషం లేదు. నేను రాస్తున్న ప్రతివార్తకూ ఋజువులున్నాయి" అంటూ తాను సేకరించిన ఆధారాలతో సహా ప్రచురించాడు గుడ్లో. కానీ ప్రజలలో స్పందనలేదు. ఆ ఋజువులను పై అధికారులకు చూపించాడు. స్పందనలేదు. డిస్ట్రిక్ట్ అటార్నీకి ఋజువులను సమర్పించాడు గుడ్లో.

© EMESCO BOOKS

"ఎందుకయ్యా రోజర్ వెనుకబడ్డావు?" అని అడిగాడు డి.ఎ. సాక్ష్యాధారాలవైపు చూడకుండా.

గుడ్లో, జీన్‌లు వీధిలో కనిపిస్తేనే అంటరాని వారిని చూసినట్టు చూడసాగారు ప్రజలు.

"ఈ ప్రజలకోసమా మనం ఇన్ని బాధలు పడుతోంది. వీళ్లు వెర్రి గొర్రెలవంటి వారు. అధికారానికి జడుస్తారు. అవసరాలకు లొంగిపోతారు. పరిస్థితులతో రాజీ పడిపోతారు. మనకే గొడవలూ వద్దు అన్నీ వదిలేద్దాం" అంది జీన్ ఓ రోజు విసుగ్గా.

అయితే, ఆ రోజు ఎవరో ఆమె కారు అద్దాలు పగులకొట్టారు. అంతకు ముందు రాత్రి ఎవరో వాళ్లింట్లోకి రహస్యంగా ప్రవేశించి సోఫాలను కోసేశారు. ఎవరో మాటిమాటికీ ఫోన్లు చేసి బెదిరిస్తున్నారు. అందుకే జీన్ బెదిరిపోయింది. గుడ్లో మాత్రం తొణకలేదు.

"ప్రజలను వెర్రి గొర్రెలన్నావు. నువ్వు మనిషిలాగా నీ ప్రత్యేకత చూపించుకోవాలి. బెదిరింపులకు భయపడకూడదు. కష్టాలకు కుంగిపోకూడదు. ఆత్మ విశ్వాసం ఆసరాగా, ఆత్మధైర్యం దారి దివ్వెగా నమ్మిన బాటలో సాగిపోయేవాడే నిజమైన మనిషి" అంటూ ఆమెకు ధైర్యం చెప్పాడు.

ఎవరెంత బెదిరించినా గుడ్లో లొంగలేదు. షరీఫ్ దుశ్చర్యలను బయల్పరుస్తూ వచ్చాడు. పై అధికారులకు సాక్ష్యాధారాలు పంపుతూ వచ్చాడు.

* * *

'ది డెమొక్రాట్ రిపోర్టర్' వరుసగా ప్రచురిస్తున్న వార్తలు స్పెషల్ ఏజెంట్ జార్జ్ బారోస్ దృష్టిని ఆకర్షించాయి. అతను డిటెక్టివ్‌లను పిలిచాడు.

"షెరీఫ్ రోజర్ డేవిస్ చర్యలను గమనించండి" ఆదేశించాడు.

డిటెక్టివ్‌లు సేకరిస్తున్న సమాచారం చూస్తుంటే జార్జి తల తిరిగిపోసాగింది.

గుడ్లో పత్రికలో రాస్తున్నది సముద్రంలో నీటి చుక్కలాంటిది. రోజర్ డ్రగ్ డీలర్‌తోనే కాదు, ప్రతి అక్రమ వ్యాపారితోనూ సంబంధాలు పెట్టుకున్నాడు. ఏ వ్యాపారి తనకు డబ్బులిస్తాడో అతడి ప్రత్యర్థిని ఏదో ఒక కేసులో ఇరికిస్తాడు. ఆపై ఆ వ్యాపారికి వచ్చే లాభంలో వాటా తీసుకుంటాడు. రోజర్ డేవిస్ రహస్య ఫైళ్లను పరిశీలించాడు జార్జ్. బ్యాంకు అకౌంట్లను చూశాడు.

రోజర్ డేవిస్ అవినీతి పరుడని సందేహం లేదు.

ఓ రోజు హఠాత్తుగా రోజర్ డేవిస్ ఇంటిని సోదా చేశారు. ఇంట్లో అడుగడుగునా రహస్య అరల నిండా డబ్బే. ఇంటి బయట గార్డెన్‌లో తవ్విన చోటల్లా డబ్బు మూటలు బయటపడ్డాయి.



© EMESCO BOOKS

“నేను అవినీతి పరుడిని కాను. నాకు పేదరికం అంటే భయం” అంటూ భోరుమన్నాడు రోజర్ డేవిస్.

* * *

రోజర్ డేవిస్ అరెస్టుతో మళ్లీ ప్రజలు గుడ్లోతో మైత్రి నెరపసాగారు. పత్రిక అమ్మకాలు పెరిగాయి. రోజర్‌కు 27 నెలల జైలు శిక్ష పడింది.

“నేనేమీ తప్పు చేయకున్నా మారెన్గో కంట్రీ కోసం నేరం ఒప్పుకున్నాను” అంటూ ప్రకటించాడు రోజర్ డేవిస్ జైలుకి వెళుతూ.

“అధికారం మత్తు మందయితే, ఆత్మవంచన భయంకరమైన విషం. మత్తుమందుతో పాటు విషం సేవించిన వ్యక్తి ఎలా దిగజారతాడో, రోజర్ డేవిస్‌ను చూస్తే తెలుస్తుంది” అంటాడు గుడ్లో.

ఈనాటికి గుడ్లో, జీన్‌ల పత్రిక ‘ది డెమొక్రాట్ రిపోర్టర్’ నిజాలను నిర్భయంగా, నిష్పాక్షికంగా ప్రచురిస్తూనే ఉంది. ప్రజా సంక్షేమమే పరమావధిగా గుడ్లో వార్తలు, వ్యాసాలు ప్రచురిస్తూనే ఉన్నాడు.

© EMESCO BOOKS

# మరణం నుంచి జీవితం

---

**మానవుడి పట్టుదల మరణం నుంచి జీవితాన్ని**
**కాపాడుతుందన్న సత్యాన్ని చూపేకథ.**

---

**అది** చూస్తుంటే 'మారన్ సోటో'లో తనకే అర్థంకాని సంచలనం కలుగుతోంది. ఒక వంక పరమాద్భుతం అనిపిస్తోంది. మరోవంక భరించలేని వేదన తుపానులా చెలరేగుతోంది.

'రామన్ సోటో' కూతురు 'డారియెలిస్ మైలాగ్రో' చిరునవ్వు అతడిలో విచిత్రమైన స్పందనలు కలిగిస్తోంది. నిండా ఆరునెలలు లేవు, అప్పుడే తన నవ్వుతో అందరినీ మైమరపింపచేస్తోంది మైలాగ్రో.

మనిషి, జీవితంలో అనేక కలలు కంటాడు. దాన్లో కొన్ని నెరవేరతాయి. కొన్ని నెరవేరవు. నెరవేరిన కలలతోపాటూ నెరవేరని కలలు గుర్తుకువస్తాయి. తీరిన కోరికలు ఆనందం కలిగిస్తే, తీరినట్టే తీరి చేజారిపోయిన కలలు విషాదం నిలుపుతాయి.

అందుకే 'డారియస్ మైలాగ్రో'ను చూస్తుంటే ఓ వంక మైలాగ్రోతోపాటు భూమిపైకి వచ్చి, జన్మించిన వెంటనే ఊపిరి పీల్చటం ఆపిన మరో 'అద్భుతం' గుర్తుకువస్తోంది. డారియస్ ఆ అమ్మాయి కవలలు. కలిసి పుట్టటమేకాదు, ఇద్దరూ ఒకే గుండెను పంచుకున్నారు.

* * *

డాక్టర్ ఆ మాట అంటుంటే నమ్మలేకపోయారు రామన్ సోటా, సాండ్రా పెరెజ్‌లు. వారిద్దరూ 1997లో క్రిస్టమస్ రోజున పెళ్లి చేసుకున్నారు. వాళ్లిద్దరికీ పెద్ద కుటుంబం ఉండాలని కోరిక. కనీసం అయిదారుగురు పిల్లల్ని కనాలని ఒప్పందాలు చేసుకున్నారు. ఇంకో ఇద్దరిని దత్తత తీసుకోవాలని సాండ్రా కోరిక. ఇలా వాళ్లు కలలకంటూ, ముచ్చట్లాడుతుండగా సాండ్రా గర్భవతి అయింది. కానీ వెంటనే గర్భస్రావం అయింది.

© EMESCO BOOKS

సాంద్రా కుంగిపోయింది. బాధపడినా రామన్, ఆమెకు ధైర్యం చెప్పాడు. మళ్లీ రెండేళ్లకు సాంద్రా గర్భవతి అయింది. ఇద్దరి ఆనందానికి అంతులేదు. రకరకాల ఆలోచనలు చేశారు. పేర్ల గురించి ఆలోచించారు. తమ సంతానం భవిష్యత్తు గురించి కలలు కన్నారు. ఇంతలో సాంద్రా గర్భంలో కవలలు పెరుగుతున్నారని తెలిసింది. ఈ వార్తతో వారి ఆనందం ద్విగుణీకృతమైంది.

ఓ రోజు రొటీన్ చెకప్ కోసం వెళ్లినప్పుడు పిడుగులాంటి వార్త తెలిసింది.

"గర్భంలో కవల లిద్దరూ కలిసి వున్నారు. వారు వేర్వేరుగా లేరు" చెప్పాడు డాక్టర్.

ఒక్కసారిగా వారికలల భవంతి కుప్పకూలిపోయింది.

"అందువల్ల శిశువుకు ప్రాణనష్టం ఉంటుందా?" కన్నీళ్ల పర్యంతమైపోతూ అడిగింది సాంద్రా.

"పిల్లలకోసం ఎంతో తపిస్తున్న తనకే ఇటువంటి సమస్య ఎదురవ్వాలా?' అన్నది ఆమె ఆవేదన.

డాక్టర్ విషాదంగా తలూపాడు. అతడికి రామన్, సాంద్రాలు పరిచయం. వారిద్దరికీ పిల్లలంటే ఉన్న ఇష్టం అతడికి తెలుసు.

'మీరు డాక్టరు స్టీవెన్ షిఫ్‌మాన్‌ను కలవండి ఆయన మీకు పూర్తిగా వివరిస్తాడు. కలసిన కవలల విషయంలో ఆయన ఎక్స్‌పర్ట్' చెప్పాడు డాక్టర్.

* * *

"సాధారణంగా కలసివున్న కవలలు ఇద్దరూ బతికి బట్ట కట్టటం చాలా కష్టం" సూటిగా చెప్పాడు డాక్ట స్టీవెన్ షిఫ్‌మాన్.

"ఇద్దరిలో ఒక్కరుకూడా బతకరా?" బేలగా అడిగింది సాంద్రా.

"మీ పిల్లలు కలసి ఉండటమే కాదు. ఇద్దరికీ ఒకే గుండె ఉంది" నెమ్మదిగా చెప్పాడు డాక్టర్.

భార్యా భర్తలిద్దరూ అయోమయంగా ఒకరివైపొకరు చూసుకున్నారు.

"మీ గర్భంలోని కవలల ఛాతీ భాగం, కడుపు దగ్గర అతుక్కుని ఉన్నారు. అయితే ఇద్దరికీ వేర్వేరుగా చెరో గుండెలేదు. ఒక శిశువుకు గుండె ఉంది. ఈ గుండె నుంచే రెండో శిశువుకు రక్తం అందుతోంది. అంటే, ఒక శిశువుకు గుండెనే లేదన్నమాట. అలాగని ఇద్దరినీ కలిపి ఉంచలేం. ఎందుకంటే ఒక మనిషికి సరిపడా రక్తం సరఫరా చేయాల్సిన గుండె, ఎల్లప్పటికీ ఇద్దరికీ సరిపడ రక్తం సరఫరా చేస్తూండలేదు.".

"ఇద్దరినీ పుట్టగానే వేరే చేస్తే?" ఆశగా అడిగింది సాండ్రా.

"పుట్టగానే వేరు చేయాలి. దాంతో గుండె లేని శిశువు తప్పనిసరిగా మరణిస్తుంది. సాధారణంగా ఇటువంటి కేసుల్లో గుండె సరిగ్గా అభివృద్ధి చెందదు. దాంతో రెండో శిశువు కూడా ఎక్కువకాలం బతికే అవకాశం లేదు. ఒకవేళ బతికినా ఏదో ఒక అవలక్షణం ఉంటుంది. కాబట్టి మీరు అబార్షన్ చేయించుకోవటమే మంచిది" చాలా మృదువుగా చెప్పాడు డాక్టర్.

సాండ్రా, రామన్‌లిద్దరూ ఒకరి చేయినొకరు గట్టిగా పట్టుకున్నారు.

"శిశుహత్యకు నేను ఒప్పుకోను. ఒకవేళ మామూలుగా జన్మించిన తరువాత మరణిస్తే దానికి మనమేం చేయలేం కానీ ఇలా కృత్రిమ గర్భవిచ్ఛిత్తి నాకిష్టంలేదు." దృఢంగా చెప్పింది సాండ్రా. డాక్టర్ రామన్‌వైపు చూశాడు.

రామన్, సాండ్రా కళ్లల్లోకి చూస్తున్నాడు. ఇరువురి కళ్లల్లో ఒకే రకమైన భావన.

"డాక్టర్! మా దృష్టిలో శిశు జననం అన్నది భగవంతుడి అద్భుతమైన సృజనాత్మక కళాకౌశల ప్రదర్శనకు నిదర్శనం వంటిది. ఏమో, భగవంతుడి ఇచ్ఛ ఎలా ఉందో అలాగే జరుగుతుంది. మేం భ్రూణ హత్యకు వ్యతిరేకులం" అన్నాడు రామన్ నిశ్చయంగా.

వారిద్దరినీ చూస్తూంటే డాక్టర్‌కు ముచ్చటగా అనిపించింది.

"మీ పట్టుదల, ధైర్యం చూస్తుంటే నాకూ పట్టుదలగా అనిపిస్తోంది. మనం భగవంతుడి పని సాధకులం. మనద్వారా ఏ అద్భుతం సాధించేందుకో మనకీ పరీక్ష పెడుతున్నాడనిపిస్తోంది. ఈ సవాల్‌ను నేనూ స్వీకరిస్తాను. కనీసం ఒక్క శిశువునైనా బతికించేందుకు నా శాయశక్తులా కృషి చేస్తాను" చెప్పారాయన.

తన వంతు ప్రయత్నం సంపూర్ణంగా చేసే వాడికి భగవంతుడు కూడా తప్పక సాయం చేస్తాడంటారు. "మన ప్రయత్నం మనం చేద్దాం" అన్నాడు డాక్టర్ విశ్వాసంగా.

* * *

సాండ్రా గర్భాన్ని అల్ట్రాసౌండ్‌తో పరీక్షించాడు డాక్టర్. వివరాలు చూస్తూంటే డాక్టర్ భృకుటి ముడిపడింది. ఆత్రంగా డాక్టర్‌వైపే చూడసాగారు సాండ్రా, రామన్‌లు.

"ఒక శుభవార్త ఏమిటంటే ఉన్న ఒక్క గుండె సక్రమంగా ఉంది. దుర్వార్త ఏమిటంటే..." ఆగాడు డాక్టర్.

"ఏమిటి డాక్టర్?" అడిగారు ఇద్దరూ.

వారి కళ్లల్లో నీటిపొర.

"గుండెలేని శిశువుకు రక్తం తిన్నగా గుండె నుండి అందటం లేదు" చెప్పాడు డాక్టర్.



© EMESCO BOOKS

"అంటే?" ఆత్రంగా అడిగారిద్దరూ.

"ఇద్దరికీ ఒకే గుండెనుంచి రక్తం అందాలి. గుండెలేని శిశువుకు రక్తం, తిన్నగా గుండె ఉన్న శిశువు నుండి అందటం లేదు. అది బొడ్డు దగ్గర ఉండే నాళాల ద్వారా రెండో శిశువుకు అందుతోంది. శిశు జననం కాగానే మనం బొడ్డుకోసి వేరు చేయాల్సి ఉంటుంది. అంటే..."

వినడంతోనే భోరుమంది సాండ్రా.

"మనం కృత్రిమంగా గుండెని ఏర్పాటు చేయలేమా డాక్టర్?" అడిగాడు రామన్.

తల అడ్డంగా ఊపాడు డాక్టర్.

"బొడ్డు నుంచి రక్తం అందుతోంది. కానీ గుండెను చేరాల్సిన చెడురక్తం ఇద్దరూ పంచుకున్న కాలేయం ద్వారా చేరుతోంది" చెప్పాడు డాక్టర్.

బిత్తరపోయాడు రామన్.

'నేను ఇటువంటిదెక్కడా వినలేదు' అన్నాడు అయోమయంగా.

"నేనూ నా జీవితంలో ఇటువంటి కేసు చూడలేదు. ఇతర దేశాల డాక్టర్లను సంప్రదించాను. వారి అనుభవంలోనూ ఇటువంటి కేసులేదు. ఈ కొత్త సమాచారం వల్ల పరిస్థితి మరింత జటిలమవుతోంది. జననం కాగానే శిశువులను త్వరగా వేరుచేయాలి. లేకపోతే మరణించే శిశువు శరీరం ఉత్పత్తి చేసే లాక్టిక్ ఆసిడ్, ఇతర విషపదార్థాలు మామూలుగా ఉన్న శరీరంలో ప్రవేశించి, ఈ శిశువును కూడా మరణానికి చేరువ చేస్తాయి."

సాండ్రా వేదనగా రామన్ భుజంపై తలవాల్చింది. ఆమెని పొదివి పట్టుకున్నాడు.

"మానవ సంబంధాలను నిర్దేశించే డబ్బు ఇప్పుడే రంగప్రవేశం చేసేది" మృదువుగా అన్నాడు డాక్టర్. అతడికి తెలుసు. ఈ దంపతులు ధనవంతులు కారని. వారికి శిశువులను రక్షించుకోవాలన్న పట్టుదల ఉంది. కానీ, అందుకు సరిపడా నిధులు సమకూర్చుకునే శక్తి వారికి లేదని తెలుసు.

అందుకే డాక్టర్ మాటలకు రామన్, భార్యను మరింత దగ్గరకు లాక్కున్నాడు మౌనంగా.

"ఆపరేషన్ చేయటమే కాదు, జన్మించిన తర్వాత శిశువును రక్షించేందుకు చాలా ధనం అవసరం. అందుకే నేను మీ దగ్గర సర్జికల్ ఫీజు తీసుకోను. అంతేకాదు హాస్పిటల్‌కూడా మీవద్ద ఒక్క పైసా పుచ్చుకోదు. మానవుడు సాధిస్తున్న వైజ్ఞానిక ప్రగతికి ఈ కేసును ఛాలెంజ్‌గా భావిస్తున్నాం. శిశువుకు జన్మనిచ్చి రక్షించాలన్న మీ ఇద్దరి పట్టుదలకు నీరాజనలర్పిస్తున్నాం. శిశువు బతికితే, కనీసం అయిదు సంవత్సరాలపాటు ఎప్పుడు ఏ అవసరమైనా, ఉచితవైద్య సదుపాయం ఈ హాస్పిటల్ మీకు కల్పిస్తుంది" మృదువుగా చెప్పాడు డాక్టర్.

© EMESCO BOOKS

డాక్టర్ మాటలు వింటూనే సాండ్రా భోరుమంది. రామన్ కళ్లల్లోంచి నీరు ధారాపాతంగా కారసాగింది.

"మనుషుల్లో భగవంతుడు ఉంటాడంటారు. ఈ అద్భుతం చూసే భాగ్యం కలిగేందుకే మాకీ అనుభవం ఇచ్చాడేమో దేవుడు" అన్నాడు రామన్ కన్నీళ్ల మధ్య.

"కాదు... భావితరాన్ని రక్షించాలన్న మానవుడి పట్టుదలను ప్రదర్శించేందుకే ఈ అనుభవం" అన్నాడు డాక్టర్.

* * *

మే 30, 1999. రోజూలాగే, ఉదయం నిద్రలేవగానే సాండ్రా గర్భంలోని శిశువులకు ధైర్యం చెప్పటం ఆరంభించాడు రామన్.

"జీవితం కోసం పోరాడాలి మీరిద్దరూ. బతికే హక్కుకోసం మీరు పోరాడండి. మీరు బతకటానికి నా వంతు పోరాటం నేను చేస్తాను" గుసగుసగా సాండ్రా గర్భంలోని శిశువులకు ధైర్యం నూరిపోయసాగాడు రామన్.

"రామన్...కడుపులో నొప్పిగా ఉంది" పళ్లబిగువున అంది సాండ్రా.

రామన్ ఆలస్యం చేయలేదు. హాస్పిటల్‌కు ఫోన్ చేసాడు. డాక్టర్‌తో మాట్లాడాడు. వెంటనే అంబులెన్స్‌లో ఆమెను ఆస్పత్రికి చేర్చారు.

* * *

"సాండ్రా రక్తపోటు అధికంగా ఉంది. మూత్రంలో ప్రొటీన్లున్నాయి. అంటే ఆమెకు ఫిట్స్ వచ్చే అవకాశం ఉందన్నమాట" పరీక్షలు చేసిన లాబ్ టెక్నీషియన్ చెప్పాడు.

"ఇక ఆలస్యం చేసి లాభం లేదు. వెంటనే డెలివరీ చేయాలి" తన సహచరులకు ఫోన్లు చేయటం ఆరంభించాడు డాక్టర్ షిఫ్‌మాన్.

"కానీ శిశువులను వేరు చేయకుండా డెలివరీ చేస్తే ఇద్దరు శిశువులు మరణిస్తారు' అన్నాడు షిఫ్‌మాన్ సహ డాక్టర్.

"డెలివరీ చేయకపోతే తల్లి మరణిస్తుంది" క్లుప్తంగా చెప్పాడు డాక్టర్ షిఫ్‌మాన్.

* * *

శిశువులను గర్భంలోంచి బయటకు తీయగానే ఇద్దరి రంగు మారిపోసాగింది. ఇద్దరూ కాళ్లూ, చేతులు కదలిస్తూ కొట్టుకోసాగారు బతకటం కోసం.

ఆ దృశ్యం రామన్ మనసులో నిలిచిపోయింది. అందులో ఒకరినొకరు గట్టిగా పట్టుకుని, జీవితం కోసం పోరాడుతున్న ఆ ఇద్దరు శిశువులను మించిన గొప్ప అద్భుతం మరొకటి లేదనిపించింది అతనికి.



© EMESCO BOOKS

అతడి కళ్లముందే ఇద్దరు శిశువులను ఇన్క్యుబేటర్‌లో ఉంచారు. అంతలోనే ఒక శిశువు శరీరం చల్లబడి, నల్లబడసాగింది.

"డాక్టర్! ఈ శిశువులో రక్తపోటు లేదు. నాడి అందటం లేదు" అరిచింది నర్సు.

జన్మించిన క్షణంలోనే మరణించిందా శిశువు. తన బోసినవ్వుల ప్రపంచం బోసిపోయినట్టుంది రామన్‌కు.

ఇంతలో డాక్టర్లు వేగంగా శిశువులను ఆపరేషన్ గదిలోకి తీసుకెళ్లారు.

రామన్ కళ్లముందు సజీవంగా ఉన్న శిశువు ఛాతీకి, పొట్టకు అతుక్కొని నిర్జీవంగా ఉన్న శిశువు కదలాడుతోంది.

"భగవంతుడా! నా శిశువును బతికించు" మౌనంగా ప్రార్థించసాగాడు రామన్.

* * *

డాక్టర్ షిఫ్‌మాన్ అతని వైద్యుల బృందం జాగ్రత్తగా ఛాతీదగ్గర శిశువులను వేరుచేశారు. అదే సమయానికి ఇంకో డాక్టర్ల బృందం పొట్టనుంచి శిశువులను వేరు చేశారు.

దాంతో మరణం నుంచి జీవితం వేరుపడింది. మరణించిన శిశువును బయటకు తీసుకెళ్లారు. బతికివున్న శిశువుకు చికిత్స ఆరంభించారు డాక్టర్లు.

* * *

బతికివున్న శిశువును చూసినప్పుడల్లా సాండ్రా, రామన్‌లకు మరణించిన శిశువు గుర్తుకు వస్తుంది. దాంతో వారికి జీవితం ఎంత సున్నితమైందో అర్థమవసాగింది. వారి శిశువు విలువ గ్రహింపుకు వచ్చింది.

వారు శిశువుకు 'డారియెలిస్ మైలాగ్రో' అని పేరు పెట్టుకున్నారు. కవలలు అని తెలియగానే ఒక శిశువుకు 'డారియెలిస్' అని మరో శిశువుకు 'మైలాగ్రో' అని పేరు పెట్టాలనుకున్నారు.

అందుకే ఆ ఒక్క శిశువుకే రెండు పేర్లు కలిపి పేరు పెట్టారు.

"మైలాగ్రేకు ఊహ రాగానే పుడుతూనే మరణించిన సోదరి గురించి చెప్తాం. జీవితం ఎంత అపురూపమైందో, దాన్ని ఎంత విలువైందిగా భావించాలో నేర్పుతాం. మైలాగ్రో మా జీవితాన్ని అద్భుతమయం చేసిన విధానం తెలుపుతాం" అంటారు రామన్ దంపతులు.

పాప ప్రతిచర్య వారికి పరమాద్భుతంగా, అతి విలువైందిగా అనిపిస్తోంది. 'మైలాగ్రో' అంటే 'అద్భుతం' అని అర్థం.

© EMESCO BOOKS

# మరణమా! నువ్వెక్కడ?

**మరణం పొంచి ఉన్నా జీవితాన్ని ప్రతిక్షణం ఆనందంగా గడుపుతున్న సాహసవంతుడి కథ.**

**జూలై** 1993. 'న్యూయార్క్ స్టేట్ యూనివర్సిటీ హెల్త్ సైన్స్ సెంటర్ మెడికల్ స్కూల్'లో పట్టభద్రులైన విద్యార్థులకు డాక్టర్ సర్టిఫికెట్ల ప్రధానోత్సవం జరుగుతోంది.

ఒకరొకరుగా విద్యార్థుల పేర్లు పిలవగానే కరతాళ ధ్వనుల నడుమ వారు స్టేజి ఎక్కి తమ సర్టిఫికెట్ తీసుకుంటున్నారు.

ఇంతలో... అందరూ ఎదురు చూస్తున్న పేరు వినిపించింది.

'డాక్టర్ బ్రియాన్ కేత్ విన్‌స్టెయిన్'.

హాలు చప్పట్లతో మార్మోగటమే కాదు. అందరూ లేచి నిలబడ్డారు. హాల్లో ఉన్న ప్రతివారి కళ్లల్లో నీళ్ళు కదలాడుతున్నాయి.

'సమస్యలు ప్రతివారికీ ఉంటాయి. తన సమస్యను పరిష్కరించుకుని కష్టాన్ని అధిగమించిన వాడు మనిషి. కానీ తన కష్టాన్ని అధిగమించటమే కాక... ఇతరులు కష్టాలను అధిగమించేట్టు చేయాలన్న తపనతో అడుగు ముందుకు వేసేవాడు అసలైన మనిషి'.

బ్రియాన్‌కు సర్టిఫికెట్ ఇస్తూ సజల నయనాలతో చెప్పాడు వైస్‌ఛాన్సలర్.

ముందు వరుసలో కూచున్న మైకెల్, షెరిల్ విన్ స్టయిన్‌ల కళ్లు డాక్టర్ గర్వోయ్ కళ్లతో కలిశాయి.

ఆ ఆరు కళ్లల్లో ఒకే జ్ఞాపకం కదలాడుతోంది.

* * *

1967.

'మీ అబ్బాయికి 'సిస్టిక్ ఫైబ్రోసిస్' అనే వ్యాధి ఉంది' కర్ణకఠోరంగా ధ్వనించింది. డాక్టర్ స్వరం.

© EMESCO BOOKS

మైకెల్, షెరిల్‌లకు డాక్టర్ మాటలు అర్థం కాలేదు. లేకలేక వాళ్లకి ఆరు నెలల క్రితం బ్రియస్ పుట్టాడు. పుట్టినప్పటి నుంచీ ఏదో ఒక వ్యాధితో బాధపడుతూనే ఉన్నాడు బ్రియాన్, ముఖ్యంగా శ్వాసకోశ సమస్యలు మాటిమాటికీ ఉత్పన్నమవుతున్నాయి.

ఆరు నెలల పిల్లవాడైనా బరువు పెరగటం లేదు. కాళ్లు, చేతులు పుల్లల్లా ఉన్నాయి. అందుకే డాక్టర్ దగ్గరకు వస్తే, డాక్టర్ ఏదో అర్థం కాని వ్యాధిపేరు చెప్తున్నాడు.

'అంత చిన్న పిల్లవాడికి ఇంత అర్థం కాని వ్యాధి ఎలా వస్తుంది?'

ఇదే వాళ్లిద్దరి ఆలోచన. అదే మాట డాక్టర్‌తో అన్నారు.

'అంటే?' అడిగాడు మైకెల్.

'మీ అబ్బాయి చెమటను పరీక్షిస్తే మామూలు కన్నా అధిక పాళ్లలో సోడియమ్ క్లోరైడ్ ఉన్నట్టు తేలింది. సిస్టిక్ ఫైబ్రోసిస్ లక్షణం ఇది.'

'ఇదెందుకు వస్తుంది?' కన్నీళ్లు తుడుచుకుంటూ అడిగింది షెరిల్.

'ఇది జన్య సంబంధిత వ్యాధి. దీనిగురించి ఇంకా సరిగ్గా తెలియదు. పరిశోధనలు జరుగుతున్నాయి. కణాలు సరిగా పనిచేయకపోవటం వల్ల వస్తుందీ వ్యాధి. ఆహారాన్ని సరిగ్గా జీర్ణం చేయటంలో కణాలు విఫలమవుతాయి. దాంతో వ్యక్తి బలహీనమవుతాడు. రకరకాల వ్యాధులు వస్తాయి. అంతే అయితే ఫరవాలేదు. కానీ ఈ కణాలు ఒక రకమైన 'మ్యూకస్'ను ఉత్పత్తి చేస్తాయి. అది శరీరంలో వాయుప్రసరణను అడ్డుకుంటుంది. దాంతో ఊపిరితిత్తుల సమస్యలు, బ్రాంకియల్ వ్యాధులు వస్తాయి.'

'దీనికి మందు...?' బలవంతాన గొంతు పెగల్చుకున్నారిద్దరూ.

విషాదంగా నవ్వాడు డాక్టర్.

'ఇంకా వ్యాధి స్వరూపమే సంపూర్ణంగా అర్థం కాలేదు. కానీ ఒక రకంగా చూస్తే మీరు అదృష్టవంతులు. వ్యాధి ఉన్నట్టు త్వరగా తెలిసింది. అనేక సందర్భాలలో వ్యాధి ఉన్నట్టే తెలియదు. హఠాత్తుగా ఒకోరోజు పిల్లవాడు రక్తం కక్కుకుంటాడు. అంటే అర్థం ఊపిరితిత్తులు చేతులెత్తేశాయని. గుండె ఆగిపోతుంది. ప్రస్తుతం ఈ వ్యాధితో బాధ పడుతున్నవారిలో 50శాతం మంది 15 ఏళ్లలోపుగా మరణిస్తున్నారు. కాబట్టి మీరు మనసును గట్టి చేసుకోండి' జాలిగా చెప్పాడు డాక్టర్?

'ఎవరైనా స్పెషలిస్టుకు చూపిస్తే... ఖర్చు ఎంతయినా ఫరవాలేదు' ఆత్రంగా అన్నాడు మైకెల్.

'లాభం లేదు. కానీ మీ సంతృప్తి కోసం నేను డాక్టర్ అడ్రసు ఇస్తాను. అతనుకూడా అద్భుతాలేమీ చేయలేడు. కానీ ఇంకాస్త ఎక్కువ కాలం మీ అబ్బాయి బతికేట్టు చేయగలిగేది అతనొక్కడే' అంటూ డాక్టర్ జాన్ గర్వోయ్ అడ్రసు ఇచ్చాడు డాక్టరు.

* * *

© EMESCO BOOKS

'మీ అబ్బాయి ఎన్నేళ్లు బతుకుతాడో ఎవరు చెప్పగలరు? మీరెన్నేళ్లు బతుకుతారో మీరు చెప్పగలరా? నేనెన్నేళ్లు బతుకుతానో నాకు తెలుస్తుందా?' సూటిగా అడిగాడు డాక్టర్ గర్బోయ్.

మైకెల్, షెరిల్‌లు తలలు వంచుకున్నారు.

'మరణం అనేది అనివార్యం. ఎప్పుడో వచ్చే మరణం గురించి ఆలోచిస్తూ ఇవాళ్ల బతకటం మానేస్తామా? మీ అబ్బాయికి సమస్య ఉంది. దానికి పరిష్కారం లేదు. అంత మాత్రాన అన్నీ వదిలేసి ఏడుస్తూ కూచుంటామా? విజ్ఞానశాస్త్రం అభివృద్ధి చెందుతోంది. ఏమో త్వరలోనే ఈ వ్యాధికి మందు కనుక్కోవచ్చు. ఆశ మనిషికి ప్రాణవాయువులాంటిది. అది లేకపోతే మనిషికి జీవితం లేదు. వరదలో కొట్టుకుపోతున్నా, గడ్డిపోచ దొరుకుతుందన్న ఆశతో ఉండాలి'.

మైకెల్, షెరిల్‌లు తలలూపారు.

వారికి ధైర్యంగా ఉంది డాక్టర్ మాటల వింటూంటే.

'మీ అబ్బాయిని జాగ్రత్తగా చూసుకోవాలి. అలాగని తనలో ఏదో లోపం ఉందన్న భావన అతనికి రానివ్వద్దు. అతడు చేస్తానన్న పనులన్నిటినీ చేయనివ్వండి. అలా తాను చేయగలవేమిటో, చేయలేనివేమిటో స్వయంగా తెలుసుకుంటాడు...'

తలూపారు ఇద్దరూ. మళ్లీ డాక్టరే అన్నాడు.

'తన శక్తిని, తన పరిమితులను, బలహీనతలను తెలుసుకున్న వ్యక్తికి తిరుగులేదు. అర్థమైందా? బతికినన్నాళ్లు మీ అబ్బాయిని మనిషిలా బతకనివ్వండి. ఓ రోగిలా చావుకోసం ఎదురుచూస్తున్న వాడిలా కాదు' అంటూ తీసుకోవలసిన జాగ్రత్తలు చెప్పాడు.

అత్యవసర పరిస్థితి వస్తే, ఊపిరి అందకపోతే ఏం చేయాలో వివరించాడు.

'మీ అబ్బాయి శరీరం ఆహారాన్ని జీర్ణం చేసే ఎంజైమ్‌లను ఉత్పత్తి చేయటం లేదు. ఆ ఎంజైమ్‌లను కృత్రిమంగా అందించి చూస్తాను. ఫలితం ఎలా ఉంటుందో చూద్దాం' అన్నాడు డాక్టర్. అలా ప్రారంభమైంది డాక్టర్ గర్వోయ్, బ్రియాన్‌ల మైత్రి.

* * *

డాక్టర్ ఇచ్చిన ఎంజైమ్‌ల వల్ల బ్రియాన్ శరీరం ఆహారాన్ని గ్రహించటం ఆరంభమైంది. బ్రియాన్ శరీరం శక్తిని పుంజుకోసాగింది. బ్రియాన్ తన చేతుల మీద శరీరం బరువునుంచి పాకటం ఆరంభించాడు. లేచినుంచో గలుగుతున్నాడు.

మైకెల్, షెరిల్‌ల ఆనందానికి అంతులేదు. అయితే క్రమం తప్పకుండా ప్రతివారం డాక్టర్ దగ్గరకు చెకప్‌ల కోసం తీసుకెళ్తున్నారు. బ్రియాన్ కూడా నెమ్మదిగా ఇతర పిల్లల్లా ఆటలాడటం ఆరంభించాడు. అంతేకాదు ఇంట్లో పనిచేయటం నేర్చుకున్నాడు. వంట నేర్చుకున్నాడు. ఫుట్‌బాల్ ఆడేవాడు. అప్పుడప్పుడు ఊపిరి అందటం కష్టమయ్యేది. అప్పుడు

విశ్రాంతి తీసుకునేవాడు. మళ్లీ ఆటలోకి దూకేవాడు. బ్రియాన్‌కు ఊహ తెలిసిన తరువాత తల్లిదండ్రుల సమక్షంలో డా॥ గర్వోయ్ అతడికి స్థితిని వివరించాడు.

బ్రియాన్ కుంగిపోలేదు.

'నాకు ఇప్పుడు అర్థమైంది. నాకు అప్పుడప్పుడు ఊపిరి ఎందుకు అందటం కష్టమవుతుందో' అన్నాడు.

'ఎంతో మందికి తమ లోపల ఏ లోపాలున్నాయో తెలియదు. కానీ నాకు తెలుసు. అంతే తేడా' అంటూ మళ్లీ తన మామూలు జీవితంలో పడ్డాడు బ్రియాన్.

* * *

'నేను పరుగుపందెంలో పాల్గొంటానంటే, అమ్మా-నాన్నా వద్దంటున్నారు' డాక్టర్ గర్వోయ్‌కి ఫిర్యాదు చేశాడు బ్రియాన్.

'పాల్గొన నివ్వండి. ప్రతి వ్యక్తికీ తను చేయగల పని, చేయలేని పని తెలుసుకునే హక్కు ఉంది. పని చేయాలని ప్రయత్నించి కుదరక పోతేనే కదా తనకా పని చేతకాదని తెలిసేది' అన్నాడు గర్వోయ్, బ్రియాన్‌ను సమర్థిస్తూ, అయితే, ఎక్కువకాలం పరుగు ప్రాక్టీసు చేయలేకపోయాడు బ్రియాన్. తరువాత మురళి వాయించాలని కుతూహల పడ్డాడు. కానీ అంతకాలం ఊపిరి బిగబట్టలేకపోవటం గ్రహించి దాన్ని వదిలేశాడు. అతడి నిరాశను చూసి తల్లిదండ్రులు బాధపడుతూంటే, వాళ్లని బ్రియాన్ ఓదార్చాడు.

'అందరికీ అన్ని లభించవు. కలలు కంటాం, అవి నిజం కాకపోతే, పాత కలలని వదలి కొత్త కలలను కని వాటిని సాకారం చేసుకునేందుకు ప్రయత్నించాలి. అంతేకాని ఒక కల చెదిరిందని ఏడుస్తూ కూచుంటే జీవితం చేజారిపోతుంది. నాకంత సమయం లేదు' అంటూ కొత్త పథకాలు వేసేవాడు బ్రియాన్.

బ్రియాన్ ధైర్యం అతడి తల్లిదండ్రులకు ఊరటనిచ్చేది.

* * *

1985లో బ్రియాన్ హైస్కూలు చదువు పూర్తి చేసుకున్నాడు. కాలేజీలో చేరాడు. డాక్టర్ గర్వోయ్‌తో ఫోన్లో మాట్లాడుతూ, సలహాలు తీసుకుంటూ సందేహాలు తీర్చుకుంటూ కాలేజీ చదువు పూర్తిచేశాడు బ్రియాన్. కాలేజీ పూర్తవగానే 'నేను డాక్టర్‌ని అవుతాను' అని ప్రకటించాడు బ్రియాన్.

'డాక్టర్ చదువు పూర్తయేంత కాలం బతుకుతావో లేదో తెలియదు' నోరు జారాడు మైకెల్.

నవ్వాడు బ్రియాన్.



© EMESCO BOOKS

'బతికినంత కాలం చదువుతూ ఉంటా. ప్రమాదం గురించి ఆలోచిస్తూంటే అడుగు ముందుకు వేయలేం నాన్నా' అన్నాడు.

* * *

అప్పుడప్పుడూ వచ్చే అనారోగ్యం, అలసట తప్ప బ్రియాన్ కాలేజీలో పెద్దగా బాధపడలేదు. కాలేజీలో మొదటి పదిమంది విద్యార్థులలో అతడి పేరు ఉండేది. డాక్టరు కోర్సు చివరి సంవత్సరం పరీక్షలు దగ్గర పడుతున్నాయి. అందరు విద్యార్థులలాగే రాత్రింబవళ్లు చదువుతున్నాడు బ్రియాన్. ఇంకో పదిరోజుల్లో పరీక్షలు ఉన్నాయనగా, ఓ అర్ధరాత్రి హఠాత్తుగా మెలకువ వచ్చింది బ్రియాన్‌కు. గుండెలో నొప్పి! ఊపిరి అందటం కష్టంగా ఉంది.

తాను 'న్యూమోథోరాక్స్' (Pneumothorax) తో బాధపడుతున్నానని బ్రియాన్‌కు అర్థమైంది. 'సిస్టిక్ ఫైబ్రోసిస్' వల్ల ఊపిరితిత్తులు బలహీనమవుతాయి. బలహీనమైన ఊపిరితిత్తులపైన బొబ్బలెక్కుతాయి. వాటి నుంచి గాలి వెలువడుతుంది. దాంతో ఊపిరితిత్తులకు గాలిచేరదు. అప్పుడు గాలి శరీరంలో నిండిగుండెను పక్కకు తోసేస్తుంది. త్వరగా వైద్య సహాయం అందకపోతే మరణం తప్పదు.

అందుకే అంత బాధలోనూ, శరీరం సహకరించకపోతున్నా, పక్కగది తలుపుతాట్టాడు బ్రియాన్. ఆ గదిలోని విద్యార్థి నిద్రమత్తునుండి మేల్కొని తలుపు తీసేలోగా అక్కడే పడిపోయాడు బ్రియాన్.

* * *

బ్రియాన్ మామూలు మనిషి అయ్యేందుకు పది రోజులు పట్టింది. సరిగ్గా ఆ రోజునుంచే పరీక్షలు ప్రారంభం. బ్రియాన్ కోసమని ప్రత్యేకంగా ఆస్పత్రి గదిని పరీక్ష హాలుగా మార్చారు యూనివర్సిటీ అధికారులు. ఆస్పత్రిలోనే పరీక్ష రాశాడు బ్రియాన్. పరీక్షలో అందరికన్నా ఎక్కువ మార్కులతో ఉత్తీర్ణుడై డాక్టర్ అయ్యాడు బ్రియాన్!

* * *

'నేను ఎన్ని రోజులు బతుకుతానో నాకే తెలియదు. కానీ బతికినన్ని రోజులు నాలాంటి వాళ్లకు సేవ చేయాలని నా ఆకాంక్ష. నిరాశామయ జీవితాలలో ఆశా వెలుగులు నింపాలన్నది నా లక్ష్యం. అందరం ఏదో ఒకరోజు మరణించాల్సిన వారమే. అలాగని జీవితాన్ని చేజార్చుకోవటం మూర్ఖత్వం. ఏ పనినయినా ప్రయత్నించిన తరువాత సాధ్యమో, అసాధ్యమో తెలుస్తుంది. ప్రయత్నించకపోవటం చేతకానితనం. ఇతరులకు తమలోని వ్యాధులు తెలియవు. నాకు తెలుసు. కాబట్టి జీవితం ఎంత విలువైందో అందరికన్నా నాకు ఎక్కువ తెలుసు. ఈ అమూల్యమైన జీవితాన్ని ప్రతిక్షణం ఆనందంగా, అర్థవంతంగా జీవించటమే నా లక్ష్యం' అన్నాడు బ్రియాన్ డాక్టర్ సర్టిఫికెట్ అందుకుంటూ.

© EMESCO BOOKS

# ఉదయించిన హృదయం

**మెదడెదగని మనిషిగా భావించే మనిషిలో**
**ఎదిగిన నిజమైన మనిషిని చూపేకథ.**

**ఆమె** అసహనంగా చుట్టూ చూసింది. ఆమె ఎదురుగా రంగు రంగుల దారాలు గుట్టలు గుట్టలుగా పడి ఉన్నాయి. అటూ ఇటూ వెతుకుతున్న ఆమె కళ్లు వెలిగాయి. విరిగిపోగా పారేసిన పైపుపై ఆమె కళ్లు పడ్డాయి. ఆమె కళ్లు వెలిగిపోయాయి. ముఖం నవ్వుతో వెలిగింది. ఆమె లేచి ఊగుతూ, తడబడుతూ ఆవైపు వెళ్లింది. ఆ పైపును ఆప్యాయంగా తీసుకుంది.

తడబడుతున్న అడుగులతో తాను కూర్చున్న స్థలానికి చేరుకుంది. అంతే... క్షణంలో ఆమె మారిపోయింది. అంతవరకూ ఆమె కదలికలో, ప్రవర్తనలో ఉన్న అయోమయం, సంశయాలు అదృశ్యమైపోయాయి. ఆమె రూపాంతరం చెందినట్టు కనిపిస్తోంది. ఆమె వేళ్లు చకచకా కదులుతున్నాయి. రంగురంగుల దారాలు, పనికిరాని ఆపైపుచుట్టూ చుడుతోంది. క్షణక్షణానికీ పైపు తన అస్తిత్వం కోల్పోతోంది. సరికొత్త స్వరూపాన్ని సంతరించుకుంటోంది.

కాస్సేపయ్యేసరికి ఆమె తయారుచేసిన సుందరమైన వస్తువు చూస్తూంటే, ఆ వస్తువు కేంద్రంలో పనికిరాని పైపు ఉందంటే నమ్మబుద్ధికాదు.

'మనిషి కూడా ఇంతేనేమో' అనుకుంది ఏకాగ్రతగా పని చేస్తున్న జూడిత్‌ను, నీళ్లు నిండిన కళ్లతో చూస్తున్న జాయ్స్.

'నిజమే మనిషి బాహ్య స్వరూపం చూస్తూ, అంతరంగంలోని అసలు వ్యక్తిని గుర్తించటం సాధ్యమా? డౌన్ సిండ్రోమ్‌తో బాధపడుతూ, ఎదిగీ ఎదగని మెదడుతో ఎందుకూ పనికిరాదనుకున్న జూడిత్‌లో ఇంత కళానైపుణ్యం దాగుందని, ప్రపంచవ్యాప్తంగా అనేక కళాకారులను ఆమె ప్రభావితం చేయగలుగుతుందని ఎవరైనా ఊహించగలిగారా?'– జూడిత్‌ను చూస్తున్న జాయ్స్ మనసు గర్వంతో ఉప్పొంగింది. గతం ఆమె కళ్లముందు కదలాడసాగింది.

* * *

© EMESCO BOOKS

1943లో లిచియాన్ స్కాట్‌కు కవలలు పుట్టారు. జూడిత్, జాయ్స్ వారిపేర్లు. జూడిత్ కన్నా కొన్ని నిమిషాల ముందు పుట్టింది జాయ్స్.

ఇతరుల్లాగే తామిద్దరూ కలసి ఆడుకోవటం జాయ్స్‌కు గుర్తుంది. అయితే సమవయస్కురాలైన సోదరి జూడిత్ అన్నిటిలో వెనుకబడేది. పదాలు పలకలేకపోవటం, సరిగ్గా కదలలేక పోవటం వింతగా ఉండి జాయ్స్‌కు నవ్వు పుట్టించేది. కానీ వారిమధ్య ఎంతో ప్రేమ ఉండేది. కవలలు కావటంతో వారికి తెలియకుండా, వారికి అర్థం కాకుండానే ఒకరంటే ఒకరికి విడదీయరాని అనుబంధం ఏర్పడింది. ఇద్దరూ కలసి తోటలో అడుకునే వారు. జూడిత్ మాట్లాడగలిగేది కాదు. జూడిత్ మాట్లాడుతున్నట్టు ఊహించుకుని, ఆమె వంతు కూడా జాయ్స్ మాట్లాడేది.

వాళ్ల వయసు పెరుగుతున్నకొద్దీ వాళ్లలో తేడా స్పష్టంగా కనబడసాగింది. జాయ్స్ అన్ని పనులు చకచకా చేయగలిగేది. జాయ్స్‌కు చదువు త్వరగా వచ్చేసింది. ఈ సమయంలో ఒకటొకటిగా జూడిత్‌లో లోపాలు బయటపడసాగాయి. ఆమె చెవులు వినబడవని తెలిసింది. మెదడులో లోపం ఉందని తేలింది. దాంతో, జూడిత్‌ను మానసిక ఎదుగుదల లేని పిల్లల కోసం ప్రత్యేకంగా ఉండే 'హోమ్'లో చేర్పించారు. ఆ కాలంలో ఇలా మెదడు ఎదగని పిల్లలను ఇళ్లల్లో ఉంచుకునే వారు కాదు.

జాయ్స్‌కు ఆ రోజు బాగాగుర్తు. అప్పుడామెకు ఏడున్నరేళ్లు. రాత్రంతా జూడిత్‌తో ఆడుకుని నిద్రపోయింది జాయ్స్. తెల్లారి లేచేసరికి పక్కన జూడిత్ లేదు. 'జూడిత్ అందరిలాంటిది కాదు. జూడిత్‌ను సరిగ్గా పెంచటం, చదివించటం మనకు చేతకాదు. మనకన్నా బాగా చూసుకునే వాళ్ల దగ్గరకు వెళ్లింది. మనం అప్పుడప్పుడు వెళ్లి జూడిత్‌ను చూసి వస్తూండ వచ్చు' జూడిత్‌కోసం ఏడుస్తున్న జాయ్స్‌ను ఓదార్చింది తల్లి.

కానీ అప్పట్నించీ జాయ్స్‌లో నిద్రపోవాలంటే ఒక రకమైన చెప్పలేని భయం కలగసాగింది. తాను పడుకుని లేచేసరికి ఆప్తులు దూరమైపోతారని, ప్రపంచం మారిపోతుందన్న అకారణ భయం ఆమెలో జనించింది.

చాలా కాలం ఆమె జూడిత్‌ని కలవాలని ఏడ్చింది. రాత్రుల్లు మేల్కొని కూర్చునేది. జాయ్స్ ఏడుపు చూడలేక తల్లిదండ్రులు ఆమెను జూడిత్‌ను చూడటానికి తీసుకువెళ్లారు. అక్కడ ఎంతోమంది మెదడు ఎదగని వారి నడుమ జూడిత్ తలదించుకుని, జీవచ్ఛవాలమధ్య ఓ జీవచ్ఛవంలా కూచుని కనిపించింది. అది చూసి జాయ్స్ పసి మనసులో అర్థంకాని సంచలనం కలిగింది. ఆ తర్వాత ఎప్పుడు జూడిత్‌ను చూడటానికి వెళ్లినా తెలియని బాధతో జాయ్స్ మనసు విలవిలలాడేది.

ఎటువంటి గాయాలనైనా మాన్పగల శక్తి కలది కాలం. మనిషి చేయాల్సిందల్లా తీవ్రమైన వేదనను అనుభవిస్తూ కూడా ఓపిక పట్టాలి. ఒక తుఫాను అల వేగంగా తాకి ఉక్కిరిబిక్కిరి



© EMESCO BOOKS

చేస్తున్నప్పుడు ధైర్యం కోల్పోకూడదు. అది ఎల్లకాలం అదే వేగంతో ఉండదు. కాస్సేపటికి ఆ వేగం తగ్గుతుంది. శక్తి తగ్గిపోతుంది. అందుకే 'రాత్రిని చూసి భయపడకు. రాత్రి ఓపిక పడితే తెల్లవారి వెలుతురు వస్తుంది' అంటారు. ఎదిగిన తరువాత చదువు, కెరీర్ వంటి విషయాల్లో పడటంతో జూడిత్ బాధ జాయ్స్‌లో మరుగున పడింది. ఆరంభంలో జూడిత్‌ను చూసేందుకు వారానికి ఒకసారి వెళ్లేవారు. ఆపై నెలకొకసారి వెళ్లేవారు. కొన్నాళ్లకు, మూడు నెలలకోసారి, ఆరు నెలలకోసారి, చివరికి సంవత్సరానికి ఓసారిగా మారింది. అయితే ఎన్నాళ్లకు వెళ్లినా జాయ్స్‌ను చూడగానే జూడిత్ ముఖం వెలిగిపోయేది.

కళ్లల్లోకి కాంతి వచ్చేది. ఆమె ముఖం చిరునవ్వుతో నిండిపోయేది. జూడిత్‌ను కలసిన తరువాత జాయ్స్ మనసు ఎలాగో అయిపోయేది. కానీ రొటీన్ జీవితంలో ఆ బాధ అడుగున పడిపోయేది. జాయ్స్ చదువు పూర్తయిన తరువాత ఆమె నర్సుగా కెరీర్‌ను ఆరంభించింది. ప్రేమించి పెళ్లి చేసుకుంది. ఆమెకంటూ ఓ సంసారం ఏర్పడింది. ఒకవైపు ఉద్యోగం, మరోవైపు పిల్లల్ని చూసుకోవటంతోనే సరిపోయేది.

* * *

అది 1985. అన్నీ ఉన్నా తనకు ఎందుకు శాంతిగా లేదో జాయ్స్‌కు అర్థం కావటంలేదు. పిల్లలు బుద్ధిగా చదువుకుంటున్నారు. భర్త ప్రేమగా చూసుకుంటున్నాడు. నర్సుగా మంచిపేరుంది. సమాజంలో భద్రత, గౌరవాలున్నాయి. అయినా ఎందుకో అర్ధరాత్రి హఠాత్తుగా మెలకువ వచ్చేది జాయ్స్‌కు. ఇక నిద్రపట్టేది కాదు. అకారణంగా తనలో ఎందుకీ అశాంతి కలుగుతోందో జాయ్స్‌కి అర్థం కాలేదు. భర్తతో చర్చించింది. మానసిక వైద్యులను కలసింది.

'మీరు మరీ శ్రమ ఎక్కువగా పడుతున్నారు. కొన్నాళ్లు విహారయాత్రకు వెళ్లండి' సలహా ఇచ్చారు డాక్టర్లు.

దాంతో సాన్‌ఫ్రాన్సిస్కో దగ్గరి ఒక కొండ ప్రాంతంలోని 'రిసార్టు'లో విశ్రాంతికని వెళ్లింది జాయ్స్. భర్తను, పిల్లలను వదలి ఒంటరిగా, తనలో తాను ఆలోచించుకుంటూ, ఎటువంటి పని తొందర లేకుండా ప్రశాంతంగా ఉండేందుకు వెళ్లింది. కానీ అక్కడా ఆమెకు శాంతి లభించలేదు.

ఒంటరిగా, ఆకాశాన్ని తాకేట్టు మౌనంగా నిలబడిన కొండలను చూస్తూంటే ఆమె మదిలో విచిత్రమైన సంచలనం కలుగుతోంది. బాధ ఉబికి ఉబికి వస్తోంది. ఆ కొండలు తనకేదో చెప్పాలని ప్రయత్నిస్తున్నట్టు, వాటి భాష తనకు అర్థం కాకపోవటంతో మౌనంగా ఉండిపోతున్నట్టు అనిపించింది జాయ్స్‌కు. ఎంత ప్రయత్నించినా ఆమె మదిలో మెదలుతున్న అస్పష్టమైన వేదన స్వరూపం ఆమెకు అర్థం కావటం లేదు.

ఒకరోజు అర్ధరాత్రి మెలకువ వచ్చింది జాయ్స్‌కు. కిటికీ తెరలు పక్కకు జరిపి బయటకు చూసింది.

© EMESCO BOOKS

చీకట్లో దూరంగా నల్లటి ముద్దల్లా కనిపిస్తున్నాయి పర్వతాలు. అవి ఎక్కడ అంతమవుతున్నాయో, ఆకాశం ఎక్కడ ఆరంభమవుతోందో తెలియటం లేదు. అసలు భూమి, ఆకాశం నల్లటి దుప్పటి కప్పుకుని కలసి పోయాయనిపిస్తోంది. ఇంతలో హఠాత్తుగా ఆమె మదిలో మెరుపులా ఓ ఆలోచన మెరిసింది. వెంటనే ఆమె స్థాణువులా కూర్చుండిపోయింది. ఇంతకాలం తనలో అశాంతికి కారణం అప్పుడు అర్థమయింది ఆమెకు.

తన అశాంతికి కారణం జూడిత్!

* * *

'జూడిత్ నేను కవలలం. సాధారణంగా అండంతో కలిసేందుకు మిలియన్లకొద్దీ స్పెర్మ్‌లు పోటీ పడతాయి. వాటిల్లో అన్ని అడ్డంకులను అధిగమించి, అతి వేగంగా వెళ్ళి, అన్నిటికన్నా ముందు అండంతో కలిసిన స్పెర్మ్ కణం పిండంగా ఎదిగి, మనిషిగా మారుతుంది. కొన్ని సందర్భాలలో రెండు కణాలు ఒకేసారి అండంతో కలుస్తాయి. అటువంటప్పుడు కవలలు జన్మిస్తారు' ఆమె చెప్తుంటే, తన భర్త, పిల్లలు వింటున్నారు ఆసక్తిగా.

'అంటే అన్ని రకాలుగా సమానమైన రెండు కణాలు ఇద్దరు మనుషులుగా ఎదుగుతాయన్నమాట. నేను, జూడిత్ ఇద్దరం అన్ని రకాలుగా సమానమైన వాళ్లం. కానీ నేను ఇలా జీవితం హాయిగా గడుపుతున్నాను. జూడిత్ అలా మానసికంగా ఎదగని మనుషుల నడుమ వ్యర్థంగా గడుపుతోంది. కేవలం ఒక సెకను ముందు పుట్టిన నాకూ, ఒక సెకను ఆలస్యంగా పుట్టిన జూడిత్‌కు ఇంత తేడా ఎలా వచ్చింది? ఒకవేళ పరుగు పందెంలో జూడిత్ నాకన్నా ఒక సెకను ముందువచ్చి, తర్వాత నేను వచ్చి ఉంటే?' ఒళ్లు జలదరించింది వింటున్న వారికి. జాయ్స్ కళ్లల్లో నీళ్లు నిలిచాయి.

'నేను, జూడిత్ అవిభాజ్యమైన అంగాలం. తొమ్మిది నెలలు కలసి మాతృగర్భంలో గడిపిన అద్భుతమైన బంధం మాది. ఒక అనిర్వచనీయమైన అనుబంధం మా నడుమ జననానికి పూర్వమే ఏర్పడింది. ఆ అనుబంధాన్ని విస్మరించాను. ఇదీ నా అశాంతికి కారణం. నేను సంతోషంగా ఉండాలంటే జూడిత్ కూడా సంతోషంగా ఉండాలి. నేను సుఖంగా ఉండాలంటే జూడిత్‌కూడా సుఖంగా ఉండాలి. నా ఆనందం జూడిత్ ఆనందంతో ముడిపడి ఉంది' ఆవేశంగా చెప్తూన్న ఆమెను ఆశ్చర్యంగా చూడసాగారంతా.

'నేను జూడిత్‌ను తీసుకువస్తాను. నాతోపాటు ఉంటుంది. ఇన్నాళ్లు ఆమెను విస్మరించి అశాంతి పాలయ్యాను. ఇప్పుడు తనను ఆదరించి మనిషినవుతాను' చెప్పింది జాయ్స్.

'ఈ నిజం గ్రహించేందుకు నాకు నలభై అయిదేళ్లు పట్టింది' అని ముఖం చేతుల్లో దాచుకుని భోరుమంది జాయ్స్.

* * *



© EMESCO BOOKS

జూడిత్‌కు గార్డియన్‌గా చట్టం అనుమతి తీసుకుంది జాయ్స్. ఆపై ఆమెను కాలిఫోర్నియా తెచ్చింది. ఆమెని మానసిక వైద్యుడికి చూపించింది.

'ఈమెకు ఆరంభంనుంచీ ఏమీ నేర్పించే ప్రయత్నం చేయలేదు. మూగవారికి, చెవిటివారికి వేళ్లతో మాట్లాడటం నేర్పుతారు. అదీ నేర్పలేదు. అయినా ఫరవాలేదు. ఇప్పుడైనా మనం ఆరంభించవచ్చు. కాస్త కష్టమైనా జూడిత్‌కు వేళ్లభాష నేర్పవచ్చు' అన్నాడు డాక్టర్.

మానసిక వికలాంగుల కోసం ప్రత్యేకంగా ఏర్పడ్డ 'క్రియేటివ్ ఆర్ట్ గ్రోత్ సెంటర్'లో జూడిత్‌ను చేర్పించింది జాయ్స్.

* * *

'జూడిత్ చాలా మొండిది. ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా ఒక్కపనీ చేయించలేం' జాయ్స్‌తో చెప్పింది ఆ సెంటర్‌లోని టీచర్.

జాయ్స్ తొంగిచూసింది. గదిలో ఓ మూల మౌనంగా కూచుంది జూడిత్. ఆమె టేబిల్‌మీద పెయింట్లున్నాయి. బంకమన్ను ఉంది. రంగుల పెన్సిళ్లున్నాయి. ఆమె వేటినీ ముట్టటం లేదు. ఎవరైనా ఆమెతో ఏమైనా చేయించాలని ప్రయత్నిస్తే వారిమీదకు వస్తువులు విసిరేస్తోంది.

'ఆమెకు ప్రేమ అలవాటు లేదు. తననీ ఓ మనిషిగా చూడటం అలవాటయ్యేసరికి కాస్త సమయం పడుతుంది' చెప్పింది టీచర్.

ఆ రాత్రి ఇంటికి వచ్చి కన్నీరు మున్నీరుగా ఏడ్చింది జాయ్స్. ఎలా మరచిపోయింది తన సోదరిని తాను? సాధారణంగా ఏ వ్యక్తికైనా తల్లితోనే సంబంధం ఎక్కువంటారు. ఇతరులందరితో జన్మించిన తరువాత సంబంధం ఏర్పడుతుంది. తల్లితో గర్భం నుండే అనుబంధం ఏర్పడుతుంది. కానీ తమది అంతకన్నా ముందు నుంచీ ఉన్న అనుబంధం. అండాన్ని చేరేందుకు కణాల రూపంలో పరుగెత్తుతున్నప్పటి నుంచీ ఉన్న సంబంధం తమది. దాన్ని ఎలా మరచిపోయింది తాను?

* * *

అన్నిటివైపు అనాసక్తితో చూస్తున్న జూడిత్ కళ్లు ఆ రంగు రంగుల దారాలను చూడగానే వెలిగాయి. అది గమనించిన టీచర్ ఆమె ముందు రంగుల దారాలుంచింది. జూడిత్ కాసేపు వాటిని అటూ ఇటూ కదిపి చూసి పక్కన పడేసింది. ఆమెని ఇంటికి తీసుకెళ్లేందుకు జాయ్స్ వచ్చే వరకూ మళ్లీ కదలలేదు. జాయ్స్‌తో తడబడుతూ అడుగులు వేస్తున్న జూడిత్ ఆగిపోయింది. నేలమీద పడున్న చిన్న కర్రముక్కను తీసుకుంది.

జాయ్స్ చేయి విదిలించుకుని వెనక్కు నడిచింది. ఆశ్చర్యంతో జాయ్స్ ఏదో అనబోయింది. టీచర్ ఆమెను వారించి, నిశ్శబ్దంగా ఉండమంది.



© EMESCO BOOKS

తన సీటు దగ్గరకు వెళ్లింది జూడిత్. రంగుల దారాలను తీసుకుంది. ఆ కర్రముక్క చుట్టూ బిగించింది. ఆమె ఏకాగ్రత చూసిన జాయ్స్‌కి సంతోషం అనిపించింది. చూస్తూ చూస్తూ కర్రముక్క స్థానంలో ఒక విచిత్రమైన ఆకారం తయారయింది. సంతోషంగా దాన్ని ఎత్తి జాయ్స్‌కు చూపించింది జూడిత్. తర్వాత గబగబా ఊగుతూ వచ్చి దాన్ని జాయ్స్ చేతిలో పెట్టి నవ్వింది. ఆనందంతో జాయ్స్ గుండె బద్దలయింది. జూడిత్‌ను కౌగలించుకుని ముద్దుపెట్టుకుంది.

* * *

'ఇన్నాళ్లూ తన భావాలను వ్యక్తపరచే మాధ్యమం జూడిత్‌కు లభించలేదు. వస్తువుల చుట్టూ రంగుల దారాలు చుట్టటం ద్వారా ఆమె తనలో దాగి ఉన్న సృజనాత్మకతను వ్యక్తపరుస్తోంది. వస్తువుల చుట్టూ దారాలు అల్లి వింత ఆకారాలు తయారుచేయటం ఆమె భావ ప్రకటనకు ప్రతీక'. ఏకాగ్రతగా దారాలు చుడుతున్న జూడిత్‌ను చూస్తూ చెప్పింది టీచర్. పనికిరాని వస్తువులు, విరిగాయని పారేసిన వస్తువులన్నీ జూడిత్ ఏరుకుని చుట్టూ దారాలు అల్లి వింత ఆకారాలు తయారుచేయటం ఆరంభించింది. ఆమె అలా తయారుచేసిన వస్తువులు అందరినీ ఆకర్షించటం ఆరంభమైంది. 1989లో న్యూయార్క్ ఆర్ట్ గేలరీ అధికారి సౌరిక్ మారెస్సా ఈ సెంటర్‌కు వచ్చినప్పుడు జూడిత్ సృష్టి చూసి ఆశ్చర్యపోయాడు.

'ఈ బొమ్మలలో కనబడేది ఆకర్షిస్తే, కనబడనిది ఆశ్చర్యపరుస్తుంది' అని వ్యాఖ్యానించాడు. తన గేలరీలో జూడిత్ బొమ్మలను ప్రదర్శిస్తే 15000 డాలర్లకు అమ్ముడుపోయాయి. అలా వచ్చిన డబ్బును జూడిత్ పేరుమీద ఓ ట్రస్టుస్థాపించి దాన్లో ఉంచింది జాయ్స్.

నెమ్మదిగా జూడిత్ ప్రతిభ గురించి దేశమంతా పాకింది. చికాగో, సాన్ ఫ్రాన్సిస్కోలోనేకాదు పారిస్, టోక్యోవంటి నగరాల ఆర్ట్ గేలరీలలో జూడిత్ బొమ్మలు ప్రదర్శితమయ్యాయి. 1999లో జాన్‌ఎం మాక్ గ్రెగర్ అనే రచయిత జూడిత్‌పై 'మెటామార్ఫసిస్: ది ఫైబర్ ఆర్ట్ ఆఫ్ జూడిత్ స్కాట్' అనే పుస్తకం రాశాడు. దేశ విదేశాల్లో పాకుతున్న తన ఖ్యాతిగురించి జూడిత్‌కు తెలియదు. ఆమె మౌనంగా, ఆనందంగా బొమ్మలు తయారుచేస్తూనే ఉంది. ఓరోజు జూడిత్ రెండు బొమ్మలు తయారుచేసింది. అవి ఒకదానితో ఒకటి కలిసిఉన్నాయి. జాయ్స్‌కు దాన్ని బహుమతిగా ఇచ్చింది జూడిత్.

ఆ బొమ్మను అందరికీ చూపిస్తూ గర్వంగా ఇది 'మేము' అంటుంది జాయ్స్. 'ప్రతి వ్యక్తిలో సృజనాత్మకత ఉంటుంది. మనం రొటీన్ జీవితంలో పడి దాన్ని గుర్తించం. దాంతో అది మరుగున పడిపోతుంది. కానీ జూడిత్ విషయం అలా కాలేదు. ఆమెలో నిద్రాణమై ఉన్న సృజనాత్మకత అవకాశం లభించగానే వ్యక్తమయింది. అందుకే ఎదిగీ ఎదగని మనిషి జూడిత్‌కాదు. జూడిత్ సంపూర్ణమైన సృజనాత్మక శక్తి. ఎదిగీ ఎదగనిది యాంత్రిక జీవన వాహినిలో పడి కొట్టుకుపోతూ భగవదత్తమైన సృజనాత్మక ప్రతిభను వ్యర్థం చేసుకునే మనమే' అంటుంది జాయ్స్ ఒకింత గర్వంగా.

# మృత్యువుతో ముఖాముఖి!

**ఆత్మబలంతో మాఫియా ముఠాల
ఆటకట్టించిన మహిళకథ.**

ఫిబ్రవరి 1993. కోర్టు హాలు నిశ్శబ్దంగా ఉంది. అందరూ ఊపిరి బిగబట్టి తీర్పుకోసం ఎదురుచూస్తున్నారు. అందరి దృష్టి ముందు వరుసలో కూర్చున్న 'టెరెస్సా కర్దోపత్రి' పైనే ఉంది. అరవై ఒక్క ఏళ్ల టెరెస్సా దాదాపుగా తన జీవితం మొత్తం ఎవరితో పోరాడుతూ గడిపిందో, ఎవరి బారినుంచి తన ఆస్తిని కాపాడుకోవాలని ప్రయత్నించిందో, ఎవరి తుపాకీ గుళ్లకు ఆమె కళ్లముందే ఆమె సోదరుడు ఆన్టోనియో కర్దోపత్రి బలయ్యాడో, వారు దోషులా, నిర్దోషులా నిర్ణయించి, శిక్ష విధించే జడ్జి నిర్ణయం కోసం ఆమె నిర్భావంగా ఎదురుచూస్తోంది...

ఆమె ఉద్విగ్నత ఆమె వదనంలో ప్రతిఫలించకపోయినా, బిగించిన ఆమె పిడికిళ్లు ఆమె మనోస్థితిని తెలపకనే తెలుపుతున్నాయి.

జడ్జి కోర్టులోకి అడుగుపెట్టగానే అందరూ లేచి నించున్నారు. కుర్చీలో కూర్చుంటూ జడ్జి టెరెస్సా వైపు చూశాడు. ఆమె దృష్టి జడ్జిపై కేంద్రీకృతమై ఉంది. కానీ ఆమె మనసు గతంలోకి పరుగులు తీస్తోంది.

* * *

'ఈ స్థలం మనది. దీన్ని మననుంచి ఎవ్వరూ దోచుకోలేరు. ప్రాణాలయినా అర్పిస్తాను కానీ నా స్థలాన్ని మాఫియా హస్తగతం కానీయను' మరణించే ముందు, కలవరిస్తూ, మరణించాడు బారన్ డొమినెసి కర్దోపత్రి.

ఇటలీలోని 'రెగ్గియోడి కాలాబ్రా' వద్ద ఉన్న పెద్ద ఎస్టేట్ కర్దోపత్రి కుటుంబానికి చెందింది. తరతరాలుగా ఆ భూమికోసం కర్దోపత్రి వంశస్థులు ఎన్నో యుద్ధాలు చేశారు. ఆ స్థలంలో పెద్ద తోట వేసుకుని, అంతకన్నా పెద్ద బంగళా కట్టుకున్నారు.

ఇక ఆ స్థలం కోసం ఇటువంటి యుద్ధాలు చేయాల్సిన అవసరం లేదనుకున్నారు. ఎందుకంటే ఇప్పుడు సామాజిక వ్యవస్థ మారింది. రాజకీయ వ్యవస్థ మారింది. ఆ కాలం

© EMESCO BOOKS

నాటి యుద్ధాలు, హింసల అవసరం పోయింది. పోలీసులు వచ్చారు. ఆ సమయంలో, 'రెగ్గియోడి కాలాబ్రా' ప్రాంతంలో మాఫియా ముఠాలు సమాంతర ప్రభుత్వాన్ని నడిపేవి. పోలీసులతో సహా పాలన యంత్రాంగమంతా మాఫియా ముఠాలచేతుల్లో ఉండేది. మాఫియా ముఠాలు అడిగింది కాదన్న వారు ప్రాణాలు కోల్పోయే వారు. 'ఇదేమిటని' అడిగేవారు లేరు.

వాళ్లకు నచ్చిన స్థలాలను తక్కువ ధరకు అమ్మాల్సిందే. అందుకు ఒప్పుకోకపోతే ప్రాణాలతో మూల్యం చెల్లించాల్సి వచ్చేది. దాంతో ప్రాణాలు అరచేత పెట్టుకుని, మాఫియా వాళ్లు చెల్లించిన డబ్బు తీసుకుని వెళ్లిపోయేవారు.

అంతటి కఠినాత్ములైన మాఫియా వారి దృష్టి 'కర్దోపత్రి' ఆస్తిపై పడింది.

* * *

'ఎట్టి పరిస్థితులలో నేనీ భూమిని అమ్మను. ఇది నా పూర్వీకులు నా కోసం తరతరాలుగా కాపాడుతూ వస్తున్న ఆస్తి. నేను, నా తరువాత తరానికి అందిస్తాను. అంతే'! మాఫియా ముఠాల దూతకు నిర్మొహమాటంగా సమాధానం ఇచ్చాడు డొమెనెసి.

ఆ రోజు నుంచీ వారి బతుకు దుర్భరమైపోయింది. ఎవరో చెట్లను కొట్టేసేవారు. తోటను ధ్వంసం చేసేవారు. ఇంట్లో దొంగతనాలు జరిగేవి. విలువైన వస్తువులు మాయమయ్యేవి.

ఊళ్లో వాళ్లెవరూ సహాయానికి రాలేదు. సానుభూతి చూపలేదు.

'ఇది మనం ఒంటరిగా సాగించవలసిన పోరాటం. నాతో మీరూ ఈ గొడవల్లోకి దిగటం నాకు ఇష్టం లేదు. మీరు అమెరికా వెళ్లి చదువుకోండి'.

తన కూతురు టెరెస్సాను, కొడుకు ఆన్టోనియోను పిలిచి చెప్పాడు డొమినెసి.

వాళ్లద్దరూ ముక్త కంఠంతో ఒకేమాట అన్నారు. 'మేం నిన్ను వదలివెళ్లం. గెలుపో, ఓటమో అందరం కలిసి అనుభవిద్దాం.'

* * *

నానాటికీ మాఫియా వాళ్ల ఆగడాలు మించిపోసాగాయి.

రోజూ ఫోన్లలో బెదిరింపులు వస్తున్నాయి.

ఇంటి బయట అపరిచిత వ్యక్తులు తచ్చాడుతూ కనిపించేవారు.

'ఎవరు?' అని అడిగేలోపల కత్తులు విసిరేవారు. ఆసిడ్లు విసరేవారు. దాంతో ఇల్లు దాటి బయటకు రావాలంటే ఎన్నో జాగ్రత్తలు పడాల్సి వచ్చేది. బయటకు వస్తే ఏ చెట్టు చాటు నుంచి ఏ ప్రమాదం ముంచుకు వస్తుందోనని భయపడుతుండాల్సి వచ్చేది.

దాంతో ఇంటి  బాధ్యత అంతా టెరెస్సా మీద పడింది.

పని మనుషులు ఆ ఇంట్లో పని చేసేందుకు ఇష్టపడక పోవటంతో ఇంటి పని అంతా ఆమెనే చేసేది.



© EMESCO BOOKS

తోటపని చేసేందుకూ పనివారెవరూ రాకపోవటంతో, అది కూడా ఆమెనే చేసేది. తండ్రి అవసరాలూ ఆమే చూడాల్సి వచ్చేది.

పక్షవాతంతో కాళ్లు, చేతులు చచ్చుబడటంతో, నిత్యం ఆయన వెంట ఒకరు తప్పనిసరిగా ఉండాలి. కానీ నర్సులెవరూ ఆ ఇంటికి రావటానికి ఇష్టపడలేదు. దాంతో ఆ పనీ టెరెస్సానే చేసేది. పెళ్లి చేసుకునేందుకు కూడా టెరెస్సా నిరాకరించింది.

'మమ్మల్ని పెంచి పెద్ద చేసి విద్యాబుద్ధులివ్వటం కోసం మా నాన్నగారు తన జీవితాన్ని వెచ్చించారు. ఇప్పుడు ఆయనకు మనిషి అవసరం అయినప్పుడు నేను – నా పెళ్లి, నా జీవితం అంటూ ఆలోచించటం సమర్థనీయమా?' అంటూ ఆమె అవివాహితగా ఉండేందుకూ సిద్ధపడింది.

'పెళ్లి జీవితంలో ఒక అనుభవం మాత్రమే. అదే జీవితం కాదు'–

అంటూ తనని నచ్చ చెప్పాలని ప్రయత్నించే వారిని సున్నితంగా తిరస్కరించేది.

నెమ్మదిగా...

'కర్డోపత్రి'ల ఆస్తి కరిగి పోసాగింది.

మరోవైపు మాఫియాల ఒత్తిడి తగ్గకపోగా, పెరగసాగింది.

ఇంతలో డొమినెసి మరణించాడు.

ఆయన అంత్యక్రియలు పూర్తయిన మరుసటి రోజే, ఆన్టోనియాకు మాఫియా నుంచి పిలుపు వచ్చింది.

* * *

'నువ్వు వాళ్లు పిలవగానే చర్చలకు వెళ్లాల్సిన అవసరం లేదు.' చర్చలకు సిద్ధమౌతున్న సోదరుడిని వారించింది టెరెస్సా.

'నేను వెళ్లకపోతే దాన్ని వాళ్లు మన పిరికితనంగా భావిస్తారు' అంటూ మాఫియా ముఠాలతో సమావేశానికి వెళ్లాడు ఆన్టోనియో.

* * *

'ఏమైంది?' ఆన్టోనియో తిరిగిరాగానే అడిగింది టెరెస్సా, ఆత్రంగా.

'ఏమవుతుంది...? ఇన్నాళ్లు నాన్నగారి మీద గౌరవంతో కేవలం బెదిరింపులకే పరిమితమయ్యారట! ఇప్పుడు వాళ్లమాట వినకపోతే చంపుతారట' చెప్పాడు ఆన్టోనియో.

'మనకెందుకీ గొడవలు. పోనీ వాళ్లకి భూమి ఇచ్చి వెళ్లిపోదాం' అంది టెరెస్సా. ఎక్కడో ఓ చోట ప్రశాంతంగా బతికేస్తే చాలన్నట్టుంది ఆమెకు.

నవ్వాడు ఆన్టోనియో.

'నాన్నగారే మన్నారు, ఎట్టి పరిస్థితులలో ఈ భూములని అమ్మవద్దన్నారు. నేను అమ్మను. వాళ్లు నన్ను చంపుతారు? చంపనీ?!'

* * *



© EMESCO BOOKS

ఆన్టోనియో, మాఫియా వారిని కలసి వచ్చిన తరువాత నుంచీ బెదిరింపులు ఎక్కువయ్యాయి.

రాత్రంతా బెదిరింపు ఫోన్ కాల్స్ వస్తూనే ఉన్నాయి. ఫోను పక్కన పెడితే, ఇంటిపైకి రాళ్లు విసురుతున్నారు.

'రేపు నీ చివరిరోజు. నిన్ను రేపు చంపుతున్నాం' రోజూ ఇటువంటి బెదిరింపులు అందుతూనే ఉన్నాయి.

* * *

ఎప్పటిలాగా ఆ ఆదివారం కూడా ఆన్టోనియో, టెరెస్సాలు చర్చికి బయలుదేరారు. మామూలుగా గేటు తెరిచేముందు బయటంతా బైనాక్యులర్స్‌తో క్షుణ్ణంగా పరిశీలించింది టెరెస్సా.

ఎటువంటి ప్రమాదమూ పొంచిలేదని నిశ్చయించుకున్న తరువాత గేటు తీసింది టెరెస్సా. ఆన్టోనియో కారు స్టార్టు చేశాడు. తానూ కారెక్కి తలుపువేసింది.

కారు సందు మలుపు తిరగగానే ఓ వ్యక్తి హఠాత్తుగా కారుమీదకు దూకాడు. ఆన్టోనియో సడన్‌బ్రేక్ వేశాడు.

ఆ వ్యక్తి ఆన్టోనియోను తుపాకీతో కాల్చివేశాడు. ఆపై నవ్వుతూ టెరిస్సావైపు తుపాకీ గురిపెట్టాడు.

జరుగుతున్నది అర్థమయ్యేసరికి టెరెస్సాకు వెర్రి ఆవేశం వచ్చింది.

కారులోంచి బయటకు దూకి ఆ వ్యక్తి పైకి లంఘించింది.

ఆ వ్యక్తి బిత్తరపోయాడు. తుపాకీ పడేసి పరుగెత్తటం ఆరంభించాడు.

టెరెస్సా అరుస్తూ అతడి వెంటపడింది.

మాఫియా వాళ్లని అనుమానిస్తే సాధారణంగా దారినపోయేవారు చూసీ చూడనట్టు వదిలేసేవారు. కానీ ఎవరో సాధారణమైన దొంగ, టెరెస్సా హ్యాండ్‌బ్యాగ్ దొంగిలించాడని అనుకున్నారు ప్రజలు.

దాంతో వారూ వెంబడించి అతడిని పట్టుకున్నారు. ఈ గోల చూసి పోలీసులు పరుగెత్తుకు వచ్చారు. హంతకుడిని తుపాకీని పోలీసులకు అప్పచెప్పింది టెరెస్సా.

అప్పుడు గుర్తుకు వచ్చిందామెకు ఆన్టోనియో విషయం.

ఆమె భోరుమంటూ నేలవాలిపోయింది.

* * *

'అతడే హంతకుడు'.

పది మంది నడుమ అతడిని గుర్తుపట్టి, పోలీసులకు చూపింది టెరెస్సా.



© EMESCO BOOKS

ఆ రోజు హంతకుడు ఆయుధంతో దొరికిన సంఘటనను వార్తాపత్రికలు ప్రముఖంగా ప్రకటించటంతో పోలీసులకు కేసును బుక్ చేయక తప్పలేదు.

తీగలాగితే డొంకంతా కదిలింది.

హంతకుడిని 'లారోసా'గా గుర్తించారు. అతడు మాఫియా ముఠాకు చెందిన వాడు.

కోర్టులో టెరెస్సా మాఫియా బెదిరింపుల గురించి విపులంగా వివరించింది.

ఆమె వాఙ్మూలాన్ని అనుసరించి ఆగస్టు 31, 1992న మాఫియా నాయకుడు 'సావెరియో మమ్మోలిటి, అతని 28 మంది అనుచరులు అరెస్టయ్యారు.

ఈ సంఘటనలకు మీడియాలో విపరీతమైన ప్రచారం దొరకటంతో, మాఫియా ముఠాలకు అండగా ఉండే పోలీసులు, రాజకీయ నాయకులు ఏమీ అనలేకపోయారు.

కానీ టెరెస్సాకు బెదిరింపులు అందసాగాయి.

ఆమెపై హత్యా ప్రయత్నం విఫలమైంది. దాంతో ఆమెకు పోలీసులు రక్షణ కల్పించారు.

ఎవరెంత బెదిరించినా వినకుండా టెరెస్సా కోర్టులో సాక్ష్యం చెప్పింది.

వాదనలు పూర్తయ్యాయి. కేసు తీర్పుకు సిద్ధంగా ఉంది.

* * *

'లభించిన సాక్ష్యాధారాలు, జరిగిన వాదనలను బట్టి 'లారోసా'కు యావజ్జీవ కారాగారశిక్ష విధిస్తున్నాను'.

కోర్టులో ప్రజలు నిట్టూర్చారు.

'డాన్ సారోకు 13 ఏళ్లు, విన్సెన్జోకు 11 ఏళ్లు, అతని అనుచరులకు ఏడేళ్లు కఠిన కారాగార శిక్ష విధిస్తున్నాం'.

హాలు చప్పట్లతో మార్మోగింది.

అనూహ్యమైంది సాధ్యమయింది.

ఒక మహిళ మొత్తం మాఫియా ముఠాను అంతం చేసింది.

'ఈ విషయంలో టెరెస్సా ప్రదర్శించిన అసాధారణ సాహసాన్ని కోర్టు ప్రశంసిస్తోంది. ఒక్క మహిళ తలచుకుంటే ఆత్మశక్తితో మాఫియాను న్యాయం, చట్టాలద్వారా మట్టి కరిపించగలదని నిరూపించింది' అన్నాడు జడ్జి.

కోర్టు కరతాళ ధ్వనులతో మారు మోగిపోయింది.

అందరి అభినందనలనూ అందుకుంటూ టెరెస్సా ఒకే మాట అంది.

'నాకు ప్రతీకారం వద్దు. న్యాయం కావాలి తరతరాలుగా నాకు వస్తూన్న నా ఆస్తిని నేను నా తరువాత తరాల వారికి అందించాలి. నాకు కావాల్సింది అంతే!'

ఆమె గుండె నిబ్బరమే ఆయుధమైంది!



© EMESCO BOOKS

# ప్రేమే గెలిచింది!

## ప్రేమతో మృత్యువుతో పోరాడి గెలిచిన
## మరోసావిత్రి కథ.

అక్టోబర్ 1997. బెరుకుగా డాక్టర్ గదిలోకి అడుగుపెట్టింది జీన్ ఫ్లాయిడ్. డాక్టర్ ముఖం చూడగానే ఆమె మనసు కీడును శంకించింది.

'జీన్...నీ భర్త ఫ్లాయిడ్‌కు గుండె సమస్య ఉంది. అతడి గుండెకు రక్తాన్ని అందించే బైపాస్‌లు రెండు పూర్తిగా మూసుకుపోయాయి. మూడవది కూడా దాదాపుగా మూసుకుపోయింది. ఆ మూడవ బైపాస్ ద్వారా కొద్ది కొద్దిగా అందుతున్న రక్తం వల్ల అతడింకా బతికి వున్నాడు. రక్తం సరిగ్గా అందకపోవటం వల్లనే అతడికి ఊపిరి అందటం లేదు. త్వరగా అలసిపోతున్నాడు గుండెలో నొప్పి వస్తోంది.'

'డాక్టర్...ఆపరేషన్ వల్ల...'

'ప్రయోజనం ఏమీలేదు. ఇంకో విషయం... అతని రక్తనాళాలు మామూలు కన్నా కురచగా ఉన్నాయి. వాటికీ వ్యాధి సోకింది. మనం చేసేదేమీ లేదు. దైవాన్ని ప్రార్థించండి. ధైర్యంగా ఉండండి. అతడి మిగిలిన జీవితాన్ని సుఖమయం, ఆనందమయం చేయండి'.

ఇక చెప్పేదేమీ లేదన్నట్టు లేచాడు డాక్టర్.

జీన్ కదలలేకపోయింది. ఆమె ఊహించిన పరిణామమే ఇది. కానీ ఊహ ఎప్పుడూ నిజంలా ఉండదు. నిజం, ఊహకన్నా భిన్నంగా, భయంకరంగా ఉంటుంది.

ఫ్లాయిడ్ స్టోర్స్‌ను కాలేజీలోనే ప్రేమించింది జీన్. రెండేళ్ల పరిచయం తరువాత 1959లో పెళ్లి చేసుకున్నారు. అప్పుడు జీన్‌కు 17 ఏళ్లు. అప్పటి నుంచి గత 38 ఏళ్లుగా వారు ఒకరిని విడిచి ఒకరు ఉండలేదు. జీవితంలో కష్టసుఖాలు కలసి అనుభవించారు. ఆనంద విషాదాలు

© EMESCO BOOKS

కలసి పంచుకున్నారు. ఇద్దరు పిల్లలను పెద్ద చేశారు. ఇప్పుడు...ఇన్నాళ్లకి...ఎటువంటి ఉద్విగ్నతలు, ఆరాటాలు, ఆందోళనలు లేకుండా ఒకరి సమక్షంలో మరొకరు ప్రశాంతంగా శేషజీవితం గడిపేందుకు సిద్ధమౌతూంటే... ఫ్లాయ్డ్ తనను ఒంటరివాడిని చేసి వెళ్లిపోతాడంటున్నాడు డాక్టర్.

చేతుల్లో ముఖం దాచుకుని కుర్చీలో కూచుని కన్నీళ్లు కార్చసాగింది జీన్.

మనసులోతుల్లోంచి ఉబికి వస్తున్న ఆవేదనా అశ్రువులను చూస్తూంటే డాక్టర్ గుండె కరిగిపోయింది. ఆమెనలా చూడలేక బయటకు నడిచాడు.

* * *

పక్కనే ఫ్లాయ్డ్ ఉచ్ఛ్వాస నిశ్వాసలు భారంగా, పెద్దగా వినిపిస్తున్నాయి. అస్థిమితంగా అటూ ఇటూ నిద్రలోనే పొర్లుతున్నాడు ఫ్లాయ్డ్. ఉండుండి ఏదో చెప్పాలనుకుంటున్నట్టు కదులుతున్నాయి అతడి పెదవులు.

అది చూస్తూంటే జీన్‌కు దుఃఖం ఆగటం లేదు.

ఆమెకేమీ అర్థం కావటం లేదు. 'ఏమిటీ జీవితం?' అనుకుంది.

ఒక్క నిమిషం ఇంట్లో ఉండేవాడు కాదు ఫ్లాయ్డ్. 'మనిషి పుట్టింది నాలుగు గోడల మధ్య మగ్గటానికి కాదోయ్. పక్షిలా ఎగరాలి. చేపలా ఈదాలి. లేడిలా అడవుల్లో పరుగిడాలి. ఓ మూల కూచోవటమంటే మనిషి జీవచ్ఛవం అవటమే' అనే వాడు.

డబ్బు రాగానే పెద్ద స్థలం కొన్నాడు. రోజూ చెట్లు నాటుతూ, పూలను చూస్తూ ఆ తోటలో విహరించేవాడు. చీకటి పడ్డ తరువాత ఇంట్లోకి వచ్చేవాడు. సూర్యోదయానికి ముందు వెళ్లేవాడు. జీన్‌ని తనతో లాక్కెళ్లేవాడు.

'ఈ చెట్లను చూస్తూ వీటి నడుమ చచ్చిపోవాలి. నేను చెట్టునైపోతా' అనేవాడు.

అటువంటి ఫ్లాయ్డ్ ఇప్పుడు మంచం దిగలేకపోతున్నాడు. కదిలితే ఆయాసంతో అల్లల్లాడుతున్నాడు. తన ప్రియ స్నేహితుడు, ప్రాణసఖుడు, తన ప్రాణంలో ప్రాణం, రక్తంలో రక్తం, భావంలో భావం అయినటువంటి తనలోని సగం ఇలా క్షణక్షణం మృత్యువుకు చేరువవుతూంటే చూస్తూ దుఃఖించటం తప్ప తాను ఏమీ చేయలేదా?

మనిషి ఆవేదనలు, ప్రేమలు, అనుబంధాలు అన్నీ విధిముందు తలవంచ వలసిందేనా? మనిషి ఇచ్ఛా శక్తికి అర్థం లేదా? విధి చేతిలో కీలుబొమ్మలా ఆడించినట్టు ఆడేట్టయితే మనిషి గొప్ప ఏముంది?

© EMESCO BOOKS

నిద్ర పట్టటం లేదు. శాంతి లభించటంలేదు. చిరాగ్గా లేచింది జీన్. ఏదైనా పుస్తకం చదవాలని వెతుకుతూంటే ఆమె దృష్టి, తన భారతీయ స్నేహితురాలు ఇచ్చిన ఆ పుస్తకంపై పడింది. ఆ పుస్తకాన్ని అప్పుడు పక్కన పడేసింది. ఇప్పుడు పుస్తకం పేరు ఆమెను ఆకర్షించింది.

ఆ పుస్తకం పేరు 'ది వుమెన్ హూ ఛాలెంజ్డ్ డెత్'. అది భారతీయ పురాణాల్లోని 'సావిత్రి' కథ! ఆమె చదవటం ఆరంభించింది.

* * *

'దుఃఖం మానవ సహజం. కానీ కళ్లల్లోంచి కన్నీరు కారుతున్నా, పెదవులపై చిరునవ్వు నిలిపేందుకు ఏం చేయాలో అన్నది ఆలోచిస్తూనే ఉండాలి. ఏడుస్తూ కూచుంటే కన్నీళ్లు కారతాయి తప్ప సాధించేది ఏమీ లేదు. తల ఎత్తి నిలచిపోరాడు. విజయం నీదవుతుంది' తాను చదివిన పుస్తకంలోని వాక్యాలు జీన్‌ను వీడటంలేదు. ముఖ్యంగా, యముడితో పోరాడి భర్త ప్రాణాన్ని నిలుపుకున్న సావిత్రి కథ ఆమెకు నూతనోత్తేజాన్ని ఇస్తోంది.

కానీ సావిత్రి యముడితో మాట్లాడటం కథ. తాను తన భర్తని ఎలా రక్షించుకోవాలి? అంతలో –

ఆమెకో ఆలోచన వచ్చింది. ఆ కాలం కాబట్టి యముడు సావిత్రికి కనిపించాడు. ఈ కాలంలో తాను కనబడని శత్రువులతో పోరాడి గెలవాలి. వెంటనే తన ఆలోచనకు కార్యరూపాన్నిచ్చింది జీన్.

ఆమె గుండెజబ్బులకు సంబంధించిన పుస్తకాలు చదవటం ఆరంభించింది. మెడికల్ జర్నల్స్ కొని చదవటం మొదలుపెట్టింది. గుండె జబ్బులకు సంబంధించిన వెబ్‌సైట్ల వేట మొదలుపెట్టింది.

ఇందువల్ల తానేమైనా సాధించగలదా? అంతలోనే ఆ అనుమానాన్ని అణచివేసింది. ఫలితం గురించి ఆలోచిస్తే ప్రయత్నం దెబ్బతింటుంది. కాబట్టి తన దృష్టి మరల్చకూడదు. ఫలితం లేకున్నా ఉట్టిగా ఏడుస్తూ కూచునే కన్నా ఏదో ప్రయత్నం చేశానన్న సంతృప్తి ఉంటుంది.

* * *

నవంబర్ 98. తాను గుండె జబ్బులకు సంబంధించిన సమాచారాన్ని సేకరించటం మొదలుపెట్టినప్పటి నుంచీ ఓ కొత్త ప్రపంచానికి ద్వారాలు తెరచినట్టు అనిపిస్తోంది జీన్‌కు. గుండెకు సంబంధించి ఎన్ని జబ్బులున్నాయో, ఎన్ని పరిశోధనలున్నాయో చూస్తూంటే ఆమెకు ఆశ్చర్యమేసింది.

ఇంత సమాచార విస్ఫోటన యుగంలోకూడా తాము ఎంత అంధకారంలో ఉన్నామో అర్థమౌతుంది జీన్‌కు. కొన్ని చిన్న జాగ్రత్తలద్వారా ఎంతెంత పెద్ద రోగాలను దూరం ఉంచవచ్చో



© EMESCO BOOKS

అర్థమైన తర్వాత మరింత బాధ కలుగుతోంది. ఇంతలో ఆమెదృష్టి డాక్టర్ జెసరీ ఇస్నెర్ రాసిన ఓ వ్యాసంపై పడింది. ఆమె కళ్లు మెరిశాయి. సరిగ్గా ఫ్లాయ్డ్‌లాంటి జబ్బుల గురించి ఆయన పరిశోధిస్తున్నాడు.

ఆసక్తిగా చదవటం ఆరంభించింది.

* * *

రక్తనాళాలకు సంబంధించిన వ్యాధులకు మందులు కనుక్కోవటం డాక్టర్ జెఫ్రీ ఇస్నెర్ కల. దానిని సాకారం చేసుకొనేందుకు ఆయన పరిశోధనలు ప్రారంభించాడు. 1980 ప్రాంతంలో పరిశోధకులు కనుగొన్న ఓ కొత్తసత్యం 'ఇస్నెర్' దృష్టిని ఆకర్షించింది. శరీరంలో ఏర్పడే కణతులు (ట్యూమర్లు) ఓ రకమైన ప్రోటీన్లను తయారుచేస్తాయి. ఈ ప్రోటీన్లు ట్యూమర్లకు అవసరమైన రక్త సరఫరాకోసం ప్రత్యేకమైన వ్యవస్థను ఏర్పరుస్తాయి. ఒకవేళ ప్రోటీన్లను నాశనం చేసి, అవి సృష్టించిన రక్తనాళాలను ధ్వంసం చేస్తే, ట్యూమర్లను కరిగించి వేయవచ్చని శాస్త్రవేత్తలు ప్రతిపాదించారు.

ఈ సిద్ధాంతం ఇస్నర్ పరిశోధనలకు ఒక దిశను ఇచ్చింది. ట్యూమర్లకు ప్రత్యేక రక్త సరఫరాను ఏర్పాటుచేసే ఈ ప్రోటీన్లను ఉపయోగించి, రక్తం సరఫరా సరిగ్గా లేని రక్తనాళాల స్థానే, సరిగ్గా రక్తం సరఫరా చేసే వ్యవస్థను ఏర్పాటు చేయవచ్చన్న ఆలోచన వచ్చిందతనికి. అంటే పాడైపోయిన రక్తనాళాల స్థానే కొత్త రకం సరఫరా వ్యవస్థను సృష్టించటం అన్నమాట. అయితే ఈ వ్యవస్థ ట్యూమర్‌కు రక్తాన్ని అందించే బదులు, శరీరంలోని భాగాలకు రక్తాన్ని అందిస్తుంది. తన దృష్టిని విఇజిఎఫ్ (వాస్కులర్ ఎండోథీలియల్ గ్రోత్‌ఫాక్టర్) అనే జీన్‌పై కేంద్రీకరించాడు ఇస్నర్. రక్త నాళాల అంచులను తయారుచేస్తుందీ జీన్. ఇందువల్ల రక్తనాళాలు ఎదుగుతాయి.

1990 కల్లా ఇస్నర్ పరిశోధనలు ఫలితాలివ్వసాగాయి. కుందేలు కాలిలో ఓ భాగానికి రక్త అందకుండా గట్టిగా కట్టేశాడు. రక్తం అందని భాగంలో ఈ జీన్‌ను ప్రవేశపెట్టాడు. కొన్నాళ్లకి ఆ భాగానికి రక్తం అందించే వ్యవస్థ ఏర్పడింది. దాంతో ఇస్నర్‌కు తన పరిశోధనలు ఫలితాన్నిస్తాయని విశ్వాసం పెరిగింది. తను కనుగొన్న కొత్త 'జీన్‌థెరఫీ' ని మనుషుల పై ప్రయోగించేందుకు 1996లో ఆయనకు అనుమతి లభించింది. అదీ కేవలం 20 మంది రోగులకే జీన్ థెరపీ ఇవ్వాలి. ఆ చికిత్స కూడా ఇక దాదాపుగా ఆశను వదులుకున్న కేసుల్లోనే ఇవ్వాలి.

ఫలితాలు అందరినీ సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తాయి. కాళ్లు చేతులు తీసివేయక తప్పదనుకున్న 20 మందికీ కొన్నాళ్లకు ఆ అంగాలు మామూలుగా పనిచేయటం ఆరంభించాయి.

© EMESCO BOOKS

దాంతో మానవుని గుండె రక్త సరఫరా ఆటంకాన్ని తొలగించేందుకు జీన్ థెరఫీని ప్రయోగించేందుకు అనుమతి అడిగాడు ఇస్నర్. తన పద్ధతికి 'బయోలాజికల్ బైపాస్' అని పేరు పెట్టాడు. అనుమతి రావటం కోసం ఎదురుచూస్తున్నాడు. ఇదీ ఆ వ్యాసం సారాంశం.

* * *

వ్యాసం చదివిన జీన్ హృదయం ఆనందంతో ఉప్పొంగింది.

యముడితో పోరాటంలో గడ్డిపోచ ఆధారం లభించింది. ఆమె వెంటనే తన భర్త కేసు వివరిస్తూ ఇస్నర్‌కు ఉత్తరం రాసింది.

జవాబు కోసం ఎదురుచూడసాగింది. రోజు రోజుకూ ఉద్విగ్నత అధికమౌతోంది తప్ప జవాబు రావటం లేదు.

ఇంతలో డాక్టర్‌కు జీన్ థెరపీ మనుషులపై ప్రయోగించే అనుమతి అభించిందన్న వార్త వచ్చింది. కేవలం 20 మంది రోగులపైనే ఆయన ప్రయోగం చేయాలి. జీన్‌కు ఎంతో నిరాశగా అనిపించింది.

అంతలో ఆ 20 మందిలో తన భర్త ఉండి తీరాలన్న పట్టుదల కలిగింది. ఎందుకంటే రాను రాను ఫ్లాయ్డ్ పరిస్థితి దిగజారుతోంది.

దాంతో ఆమె ఇస్నర్‌కు పెద్ద ఉత్తరమే రాసింది. తనకూ, ఫ్లాయ్డ్‌కూ నడుమ ఉన్న అనుబంధాన్ని వివరిస్తూ రాసింది. ఫ్లాయ్డ్ లేకపోతే తానెలా బతుకుతోందో ఊహిస్తూ రాసింది. తన ఫొటో, ఫ్లాయ్డ్ ఫొటోలను జతపరచి పంపింది. వివాహమైనప్పట్నించి ఆనాటివరకూ వారి మధుర స్మృతులను ప్రతిబింబించే ఫొటోలవి. సమాధానం కోసం దైవాన్ని ప్రార్థిస్తూ ఆమె ఎదురు చూడసాగింది.

* * *

ఉత్తరం చూడగానే జీన్ గుండె ఆనందంతో ఎగిసిపడింది. సంతోషంతో నృత్యమాడింది. 'ఫ్లాయ్డ్ మనం బోస్టన్ వెళ్తున్నాం' అరిచింది.

'ఎందుకు?' అయాసంగా అడిగాడు.

జీన్ చెప్పటం ఆరంభించింది. అంతవరకూ తన చికిత్సకోసం జీన్ అంత శ్రమ పడుతోందని ఫ్లాయ్డ్‌కు తెలియదు.

మే 24, 1998.

ఆపరేషన్ గదిలోకి వెళ్తున్న ఫ్లాయ్డ్, జీన్ చేయి పట్టుకుని వదిలాడు. ఆ స్పర్శచాలు.. కొన్ని వేల సంభాషణల సమానం అది.



© EMESCO BOOKS

వ్యక్తుల నడుమ బాంధవ్యం ఒక స్థాయికి చేరిన తరువాత వారి నడుమ సంభాషణలు అవసరం లేదు. ఒక చూపు కొన్ని వేల భావాలు వ్యక్తపరుస్తుంది. ఒక స్పర్శ కొన్ని లక్షల గ్రంథాలు నింపుతుంది.

* * *

ఆపరేషన్ ఆరంభమైంది.

ఫ్లాయ్డ్ ఛాతి ఎడమ భాగంలో 10 సెంటీమీటర్ల రంధ్రం చేశారు. ఫ్లాయ్డ్ గుండె రక్తనాళాల ఎక్స్-రే చూస్తూ, ఒక రక్తనాళంలోకి 'విఇజిఎఫ్' జీన్‌ను ఇంజెక్ట్ చేశాడు ఇస్నర్. అలాగే మిగిలిన రక్త నాళాలలోకి జీన్‌ను పంపాడు ఇస్నర్.

రెండుగంటలు ఆపరేషన్ చేసి బయటకు వస్తున్న ఇస్నర్‌కు ఆత్రంగా ఎదురువచ్చి జీన్.

ఆమెను చూసి సంతోషంగా నవ్వాడు ఇస్నర్.

'ఇంతవరకూ ఎటువంటి రియాక్షన్ లేదు. ఫలితం త్వరలో తెలుస్తుంది. మన పని మనం చేశాం. ఫలితం ఇవ్వాల్సింది భగవంతుడే' అన్నాడు ఇస్నర్.

'సత్ఫలితమే ఉంటుంది. దేవుడి ప్రపంచంలో అన్యాయం లేదు' అంది జీన్ విశ్వాసంతో.

* * *

రెండు వారాలలోగా ఫ్లాయ్డ్ కోలుకున్నాడు. ఇప్పుడతని గుండెకు ప్రాకృతికంగా ఏర్పడిన నూతన వ్యవస్థ నుండి రక్తం అందుతోంది.

గతంలోకన్నా రెట్టించిన ఉత్సాహంతో తోటపనులు చేస్తున్నాడు ఫ్లాయ్డ్ ఇప్పుడు. రాత్రిళ్లు కూడా ఆరు బయట చెట్లకిందనే పడుకొంటున్నాడు.

'ఈ విశాల ఆకాశంలో నక్షత్రాల పరదాను, ఆకుల సందులలోంచి చూస్తూ, చంద్రుడితో దోబూచులాడేందుకే నాకు మరో జీవితం లభించింది' అంటూ జీన్‌ను కూడా ఇంట్లోకి పోనిచ్చేవాడు కాదు.

'జీన్ నాకు నూతన జీవితం ప్రసాదించింది.' అంటాడు ఆనందంగా.

'మనిషికి పట్టుదల, ఆత్మవిశ్వాసం ఉంటే యముడితో ఏంటి సృష్టికర్తతోనే పోరాడి సృష్టికి ప్రతిసృష్టి చేయగలడు మనిషి' అంటుంది జీన్ భగవంతుడికి నమస్కరిస్తూ.

* * *

ఫ్లాయ్డ్ తరువాత దాదాపుగా 200 హృద్రోగులపై 'బయోలాజికల్ బైపాస్' ఆపరేషన్ జరిగింది. అందరు ఆరోగ్యంగా ఉన్నారు.

ప్రస్తుతం ఈ అంశంపై మరింత విస్తృతంగా పరిశోధనలు చేస్తున్నాడు డాక్టర్ ఇస్నర్.

© EMESCO BOOKS

# మనసా... నన్ను చంపకే!

**ప్రపంచానికి అందాన్ని చూడగలిగే**
**దృష్టి నిల్పాలనున్న వ్యక్తికథ.**

**జ**నవరి 22, 1976. ఉద్విగ్నతతో, కంగారుగా పచార్లు చేస్తున్నాడు రిక్ మెకాల్. అతని మొదటి భార్య జూడీ ప్రసవానికి సిద్ధంగా ఉంది. లోపలి గదిలోంచి ఆమె మూల్గులు వినిపిస్తున్నాయి. ఇంతవరకూ అయిదారుమార్లు జూడీ గర్భం ధరించింది. కానీ ప్రతిసారీ గర్భం మధ్యలో విచ్చిన్నమవటమో, శిశువు మృత శిశువుగా జన్మించటమో జరుగుతూ వస్తోంది.

అందుకే డాక్టర్లు ఏ ప్రమాదం లేదని చెప్తూన్నప్పటికీ ప్రశాంతంగా ఉండలేకపోతున్నాడు.

సంతానం కలగకపోవటంతో వారిద్దరు పిల్లలను దత్తత తీసుకున్నారు. ఇంతలో జూడీ మళ్లీ గర్భవతైంది. డాక్టర్ గదిలోంచి బయటకు వచ్చాడు.

"కంగ్రాట్స్! పాప పుట్టింది" చేయి సాచాడు.

డాక్టర్ చేయి అందుకుంటున్న రిక్ హృదయంలో ఆనంద తరంగం ఎగసిపడింది. తనకు అమ్మాయి పుట్టింది. పాపని తాను ఎంతో అపురూపంగా పెంచుకుంటాడు. ప్రపంచంలో అత్యంత విలువైన వ్యక్తిగా తీర్చిదిద్దుతాడు. పెద్ద పెద్ద కళ్లతో. నున్నని బుగ్గలతో, మృదువైన శరీరంతో, అమాయకమైన నవ్వుతో తనని చూడగానే మీదకు దూకి హత్తుకునే ఎలీసా రూత్ మెకాల్, రిక్ జీవితానికి కేంద్ర బిందువైంది. పాపని వదలి బయటకు వెళ్లాలనిపించేది కాదు. అనుక్షణం పాపతో ఆడుకుంటూ, ఆమెని చూస్తూ గడపాలని ఉండేది. ఆఫీసులో కూర్చున్న సమయం వృథాగా, వ్యర్థంగా గడుపుతున్నట్లు తోచేది. ఎప్పుడూ పాపని వదలకుండా తిరుగుతూ, ఆమె అడుగులకు మడుగులొత్తుతున్నట్టు కనిపించే రిక్‌ని చూస్తే జూడీకి చికాకు వచ్చేది.

"మరీ అంత ముద్దు చేస్తే పాప చెడిపోతుంది" హెచ్చరించింది. జూడీ.

© EMESCO BOOKS

"ప్రపంచంలోకెల్లా పరమాద్భుతమైంది నా కూతురు. ఆమెని ఎంత ముద్దు చేసినా తనివి తీరదు. చూడు.... ఇంకా ముద్దు చేయమని ఎలా అడుగుతోందో..." అంటూ పాపని గిరగిర తిప్పాడు రిక్.

ఎదుగుతున్న ఎలీసాకు తండ్రి దృష్టిలో తాను అపురూపం అని అర్థమైంది. అంతేకాదు. తండ్రి జీవితానికి తాను కేంద్రబిందువు అన్న విశ్వాసం కలిగింది. ఎందుకంటే, ఆమె పరుగుపందెంలో పాల్గొంటే, రిక్ తానూ పరుగుపందెంలో పాల్గొన్నంత పని చేసేవాడు. ఆమెకు దగ్గరుండి అన్ని మెళకువలు నేర్పేవాడు. ఆమె గెలిస్తే ప్రపంచాన్ని తానే గెలిచినట్టు సంబరాలు జరిపేవాడు.

కానీ తల్లికి తనంటే ఎందుకో ఇష్టం లేదనిపించింది ఎలీసాకు. తాను చేసే ప్రతి పనిలో తప్పులు పడుతుంది. విసుక్కుంటుంది. తనని తిడుతుంది. అక్కలిద్దరితో పోల్చి విమర్శిస్తుంది.

ఓ రోజు తండ్రి తెచ్చిన చాక్లెట్లను ఎలీసా గబగబా తింటూంటే, జూడీ వాటిని లాక్కుని తిట్టింది. "ఎక్కువ తింటే లావెక్కుతావు. లావెక్కిన వాళ్లు అసహ్యంగా ఉంటారు. జీవితంలో ఏమీ సాధించలేరు. సన్నగా, నాజూగ్గా ఉంటేనే అందం. అటువంటి వారే ఏదైనా సాధిస్తారు" అంది జూడీ.

"నేను సన్నగా ఉంటే నీకు ఇష్టమా?" అమాయకంగా కళ్లు పెద్దవిచేసి అడిగింది ఎలీసా.

"నేనే కాదు. అందరూ ఇష్టపడతారు" చెప్పింది జూడీ. ఆ మాటలు విని ఎదురుగా ఉన్న బ్రేక్‌ఫాస్ట్‌ను పక్కన నెట్టింది ఎలీసా.

* * *

అమ్మకు నచ్చేట్టు, అమ్మ మెచ్చేట్టు అందంగా తయారవ్వాలని ఎలీసాలో తపన మొదలయింది. ఇంతకుముందు అన్నీ ఇష్టం వచ్చేట్టు తినే ఎలీసాకు. ఇప్పుడు ఏది తిన్నా తాను లావెక్కిపోతానేమో అన్న భయం పట్టుకుంది. ఒకవేళ బలవంతంగా ఏదైనా తింటున్నా, తాను లావెక్కిపోయి, కుర్చీలో పట్టనట్టు, అందరూ తనను చూసి, నవ్వుతూ హేళన చేస్తున్నట్టా దృశ్యాలు కళ్ళముందు తిరిగేవి. దాంతో తినలేకపోయేది. ఇలా వారమంతా తినకుండా నెట్టుకొచ్చి, వారం చివర్లో పట్టలేక ఇష్టం వచ్చినట్టు తినేసేది. పరిహారంగా మళ్లీ వారమంతా తినకుండా ఉండేది. ఒక్కరోజు ఇష్టం వచ్చినట్టు తినేసేది. ఎలీసా ప్రవర్తనలో మార్పును రిక్ గమనించినా, 'అది ఎదుగుదల వల్ల వ్యక్తులో సహజంగా వచ్చే మార్పు' అనుకున్నాడు.

"చూశావా! నేను మరీ ముద్దుచేస్తున్నానని బాధ పడిపోయావు. కాస్త ఎదిగి, ఊహ వచ్చేసరికి పిల్లలకు వాళ్లదంటూ ప్రత్యేక ప్రపంచం ఏర్పడుతుంది. దాంతో వాళ్లంతట వాళ్లే నెమ్మదిగా మనకు దూరమైపోతారు. ఎప్పుడైనా బాధ కలిగినప్పుడో, సలహా అవసరమైనప్పుడో



© EMESCO BOOKS

మన దగ్గరకు వస్తారు. మన మీద, వారికీ విశ్వాసం కలిగేందుకే అప్పుడప్పుడు ముద్దు చేయటం. వారిని ముద్దు చేయగలిగిన వయసూ అదే" అన్నాడు రిక్ జూడీతో, మూతి ముప్ఫై వంకర్లు తిప్పింది జూడీ.

"మీ వల్లనే అలా తయారైంది. ఇంట్లో ఏమీ తినదు కానీ బయట కనబడ్డ ప్రతీది మెక్కేస్తుంది. అందుకే ఏమీ తినకున్నా లావెక్కుతోంది అసహ్యంగా."

"నా ఎలీసా ఎలా ఉన్నా అందంగానే ఉంటుంది..." ఇంకా ఏదో అనబోతున్న రిక్ మాటలు మధ్యలోనే ఆగిపోయాయి. గదిలోకి అడుగు పెడుతూనే పెద్దగా వాంతి చేసుకుంది ఎలీసా!

* * *

"మీ అమ్మాయి 'బులీమియా' (Bulimia) వ్యాధితో బాధపడుతోంది" అన్నాడు డాక్టర్. డాక్టర్ మాటలు అర్థమయ్యేసరికి కాస్త సమయం పట్టింది రిక్‌కు.

"ఇదొక రకమైన మానసిక వ్యాధి. ఈ వ్యాధివల్ల వ్యక్తి తానెందుకూ పనికిరాని వాడిగా భావిస్తాడు. తానందంగా, ఆకర్షణీయంగా లేనని భావిస్తాడు. అందంగా తయారయ్యేందుకు డైటింగ్ పేరిట ఆహారం తినటం మానేస్తాడు. కానీ శరీరం అందుకు ఒప్పుకోదు. దాంతో ఏదో ఓ రోజు ఇష్టం వచ్చినట్టు తినేస్తాడు. దాంతో అంతవరకూ ఆహార లేమికి అలవాటు పడ్డ శరీరం తిరగబడుతుంది. ఇలా మాటిమాటికీ జరుగుతుండడం వల్ల ఇదొక వ్యాధిలా పరిణమిస్తుంది. ఈ వ్యాధికి మందు ప్రేమ! వ్యక్తికి తనమీద తనకు విశ్వాసం కలగాలి. తన వారు తనని ప్రేమిస్తున్నారన్న భావన కలగాలి. ఆపై ఆహారం సక్రమంగా తీసుకోవాలి. డైటింగ్ అంటే శరీరాన్ని తిండి పెట్టకుండా కృశింపచేయటం కాదు, సరైన ఆహారం తీసుకుంటూ సరిపడా వ్యాయామం చేస్తుండటం అన్న గ్రహింపు కలగాలి". డాక్టర్ మాటలకు 'రిక్' తల తిరిగిపోయింది.

'ప్రపంచంలో అన్నిటి కన్నా అపురూపమైన, అందమైన తన కూతురు ప్రేమ రాహిత్య, అందవిహీన భావనలకు గురవటమా!'–

కూతురును దగ్గరకు తీసుకుని ఓదార్చాడు రిక్–

"నీ అంత అందంగా ఎవ్వరూ లేరమ్మా" మనస్ఫూర్తిగా అన్నాడు.

ఎలీసా తల్లివైపు చూసింది.

"సరిగ్గా తినటం కూడా రాదు" అన్నట్టున్నాయి ఆమె చూపులు.

* * *

© EMESCO BOOKS

"నాకు విడాకులు కావాలి". జూడీవైపు అపనమ్మకంగా చూశాడు రిక్.

"ఎలీసా మానసిక పరిస్థితి బాగాలేదు. ఇటువంటి సమయంలో విడాకులు తీసుకోవటం అంత మంచి పని కాదేమో!"

"నాకు అదంతా అనవసరం" స్థిరంగా అంది జూడీ.

రిక్. కూతురువైపు చూశాడు.

"అది నాతోనే ఉంటుంది" అంది జూడీ. రిక్ మాట్లాడలేకపోయాడు.

ఎలీసాకు దూరమవటం అంటే తన హృదయాన్ని చీల్చి దూరంగా ఉంచడమే. కానీ...!

* * *

ఫిబ్రవరి 1991. ఆ వార్త వింటూనే రిక్ శరీరం చల్లబడింది.

"ఎలీసా ఆత్మహత్య ప్రయత్నం చేసింది". తండ్రిని చూస్తూనే భోరుమంది ఎలీసా. రిక్ హృదయం ద్రవించింది.

"డాడీ! నేను అందంగా లేను. అందరూ మెచ్చేంత అందంగా ఉండాలి." ఆమెను ఎలా సముదాయించాలో రిక్‌కు అర్థం కాలేదు.

"ఎలీసాను నేను తీసుకువెళ్తాను" జూడీతో స్థిరంగా అన్నాడు రిక్.

"మీ ఇష్టం. ఇటువంటి ఆత్మవిశ్వాసం లేని వారిని నేను భరించలేను" ఖరాఖండిగా చెప్పింది జూడీ.

ఎలీసాను హాస్పిటల్‌లో చేర్పించాడు రిక్. ఆమెతోపాటు ఓ డైటీషియన్ ఉండేట్టు ఏర్పాటు చేశాడు. డైటీషియన్ పర్యవేక్షణలో ఎలీసా బరువు తగ్గింది. ఆరోగ్యంగా తయారైంది. కానీ ఎలీసాను చూస్తూంటే అతని బాధ పెరుగుతోందే తప్ప తరగటం లేదు. ఎందుకంటే. ఎంత అందంగా ఉన్నా, తాను అందంగా లేనన్న భావన ఎలీసాను వేధిస్తోంది.

"డాడీ! నా పళ్లు ఎత్తుగా ఉన్నాయి కదా" అంటూ క్లిప్పులు పెట్టుకుంది. క్లిప్పులు ఉన్నన్ని రోజులు అసహ్యంగా కనిపిస్తానని బయటకు వెళ్లేదికాదు. పది రకాలుగా తలదువ్వేది. మేకప్పు ఓ పట్టాన నచ్చేది కాదు.

"నువ్ చాలా అందంగా ఉన్నావు" అని రిక్ ఎన్నిమార్లు చెప్పినా ఆమెకు విశ్వాసం కలిగేది కాదు.

"నేను చాలా లావుగా ఉన్నాను" అనేది, అద్దంలో చూసుకుంటూ.

స్కూలు చదువు పూర్తయిన తరువాత ఎలీసా కాలేజీలో చేరింది. కానీ ఏ కాలేజీలో ఎక్కువ రోజులు ఉండేది కాదు. కాలేజీలు మారుతూండేది.



© EMESCO BOOKS

"నేను అందంగా లేను. అక్కడ చదవలేను" ఇలా ఏవోవే కారణాలు చెప్తూండేది.

బాధ కలిగినప్పుడల్లా డైటింగ్ వదిలేసి ఇష్టం వచ్చినట్టు తినేది. ఆపై బాధతో మరింత తినేది.

మళ్లీ తినటం మానేయాలని రోజులకొద్దీ ఉపవాసాలు చేసేది. మళ్లీ ఏదో ఓరోజు తిండిపై నియంత్రణ కోల్పోయేది.

* * *

ఓ రోజు కాలేజికి వెళ్లిన ఎలీసా ఇంటికి రాలేదు. కంగారుగా రిక్ పోలీసులకు ఫోన్ చేశాడు.

కొన్ని రోజుల తరువాత ఎలీసా దొరికింది. ఓ హోటల్ గదిలో నిద్రమాత్రలు అధికంగా సేవించి అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను పోలీసులు కనుగొన్నారు.

"నన్ను చూస్తే కోపంగా. అసహ్యంగా ఉందా" తన బెడ్ పక్కన కూర్చున్న తండ్రిని అడిగింది ఎలీసా.

"లేదు. కోపం ఎందుకు? నువ్వంటే నాకు అమితమైన ప్రేమ. ఎలీసా... యూ ఆర్ మై మోస్ట్ బ్యూటిఫుల్ డాటర్" అన్నాడు రిక్.

ఎలీసా నవ్వింది.

* * *

"నాకు నా వ్యాధి గురించి అర్థమైంది. రేపటి నుంచి నా పద్ధతులు మార్చుకుంటాను" ఇంటికి వచ్చిన ఎలీసా తండ్రికి వాగ్దానం చేసింది.

"కానీ నువ్వు డాక్టర్ దగ్గరకు వెళ్తూండాలి" రెట్టించాడు రిక్.

"అవసరంలేదు. నాకు నా పరిస్థితి సంపూర్ణంగా అర్థమయింది. ఇక నాగురించి నువ్వు బెంగ పడనక్కర్లేదు డాడీ" నవ్వాడు రిక్.

* * *

తెల్లారే నిద్రలేచిన రిక్. తన రెండో భార్య ఎస్లీని అడిగాడు.

"ఎలీసా ఇంకా నిద్ర లేవలేదా? వాకింగ్ వెళ్లిందా?

"ఏమో పొద్దుటినుంచీ కనబడలేదు. ఉండండి. గదిలోకి వెళ్లి చూస్తాను" అంటూ ఎలీసా గదిలోకి వెళ్లిన ఎస్లీ పెద్దగా కేక పెట్టటంతో అటువైపు పరుగెత్తాడు రిక్.



© EMESCO BOOKS

గదిలో పైకప్పు నుంచి వేలాడుతోంది ఎలీసా శవం!

"డాడీ నేను అందంగా ఉన్నానా?"

అని అడుగుతున్నట్టుంది ఆమె శవం!

* * *

"బులీమియా ఒక మానసిక వికృతి. తెలిసో తెలియకో బాల్యంలోనే ఈ వికృతికి బీజాలు పడతాయి. ఆపై సమాజంలో అందం గురించి నెలకొని ఉన్న అపోహలు ఈ వికృతిని పెంచుతాయి.

"సన్నగా నాజూకుగా ఉంటేనే అందం" అన్న ప్రచారం వ్యక్తులను మానసికంగా కుంగదీస్తుంది. అందం అన్నది మనస్సులోంచి వస్తుంది. బాహ్య స్వరూపం కేవలం పైపై ప్రదర్శనే. కానీ ఈ వ్యాధిని వ్యాధిగా గుర్తించటం కష్టం. ప్రపంచ వ్యాప్తంగా కోట్లకొలది యువతీ యువకులు ఈ వ్యాధికి గురై బాధపడుతున్నారు. డైటింగ్‌పై ఉన్న అపోహలు ఈ వ్యాధి ముదరటంలో మరింత దోహదం చేస్తున్నాయి. దీని గురించి సమాజంలో సరైన అవగాహన కల్పించటం ఎంతో అవసరం. మీ పరిస్థితి చూడండి. మీరు ప్రేమ నిచ్చారు. ఆమె అడిగినవన్నీ ఇచ్చారు. కానీ ఆమెలో ఎదుగుతూ వస్తున్న అందవిహీన భావన మానసిక వికృతిగా ఎదిగి ఆమె జీవితాన్నే కబళించి వేస్తుందని ఊహించారా? మీలాంటి వారు ఎందరో ఉన్నారు."

డాక్టర్ మాటలు రిక్ మనసులో నాటుకుపోయాయి.

ఎలీసా డైరీలు చదువుతూంటే తాను అందంగా లేనన్న భావనతో ఆమె మానసికంగా ఎంతగా బాధపడిందో ఎరిక్‌కు అర్థమైంది. 'కనీసం ఆమె బతికి ఉన్నప్పుడు ఈ డైరీలు చదివి. ఆమె మానసిక స్థితిని అర్థం చేసుకుని ఉంటే ఒక నిండు జీవితం వ్యర్థంగా బలయ్యేది కాదు...' అనుకున్నాడు రిక్.

'జరిగిందేదో జరిగింది. ఇకనుంచైనా ఎవరూ ఇటువంటి మానసిక వికృతికి లోనవకుండా చూడాల'ని నిశ్చయించుకున్నాడు. ఈ వ్యాధికి గురయిన వారికి చేయూత నివ్వాలని' సంకల్పించాడు.

ఫలితంగా 'ఎలీసా ప్రాజెక్ట్' రూపుదిద్దుకుంది. యువతీ, యువకులకు, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్. గైడెన్స్ ఇవ్వటం ఆ ప్రాజెక్ట్ లక్ష్యం.

"చూడగలిగే దృష్టి ఉంటే ప్రపంచంలో ప్రతీదీ అందమైందే. ప్రపంచానికి ఆ అందాన్ని చూడగలిగే దృష్టినివ్వటమే నా లక్ష్యం" అంటాడు రిక్, ఎలీసాను తలచుకుని కళ్లు తుడుచుకుంటూ!

© EMESCO BOOKS

# ఎవరు దేశద్రోహి?

**దేశద్రోహులను పట్టివ్వాలని ప్రయత్నించి
దేశద్రోహిగా ముద్రపొందిన వ్యక్తికథ.**

క్లీక్... క్లీక్... క్లీక్... క్లీక్

ఉలిక్కిపడి నిద్రలేచాడు షాన్ కార్పెంటర్.

అలవాటైన రీతిలో నిద్రలేవగానే అతని సర్వేంద్రియాలు చురుకుగా పని చేయటం ఆరంభించాయి. గబగబా లేచి థెర్మోస్‌లోంచి కాఫీ ఒంపుకున్నాడు. అంతవేగంగా తన ఇంట్లోనే ఉన్న కంప్యూటర్ టెర్మినల్స్‌వైపు వెళ్లాడు.

కార్పెంటర్, తన ఇంట్లోనే కంప్యూటర్ సమూహాన్ని పెట్టుకున్నాడు. ఒకేసారి పది కంప్యూటర్లలో పని చేస్తాడు. అతను ఈ పని రహస్యంగా చేస్తున్నాడు. ప్రభుత్వ ఆదేశాలమేరకు చేస్తున్నాడు అదీ దేశ రక్షణకోసం.

ఒకో కంప్యూటర్‌ను చకచకా 'ఆన్' చేస్తున్నాడు. అడగగానే తన కోడ్‌పేరు టైప్ చేస్తున్నాడు. కొన్నేళ్ల క్రితం షాన్ కార్పెంటర్ మారువేషం ధరించాల్సి వచ్చింది. కొత్త కోడ్ ఏర్పాటు చేసుకోవాల్సి వచ్చింది.

అతడి కోడ్‌పేరు 'స్పైడర్ మాన్'.

* * *

'ఎవరో మన దేశ రహస్యాలున్న కంప్యూటర్లలో అక్రమంగా ప్రవేశిస్తున్నారు. హ్యాకింగ్ ద్వారా మన రహస్యాలన్నీ కాజేస్తున్నారు. వారు ఎవరో, ఏ దేశానికి చెందినవారో తెలియటంలేదు. వారు ఏయే సమాచారాన్ని తెలుసుకుంటున్నారో కూడా స్పష్టంగా తెలియటంలేదు. దాంతో ఎవరితో మాట్లాడాలన్నా వారికి మనవెన్ని రహస్యాలు తెలుసో అన్న భయంతో ఛస్తున్నాం" అని అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ డిఫెన్స్ అధికారి చిందులు తొక్కుతున్నాడు.

'ఎఫ్‌బిఐ' అధికారి తల వంచుకున్నాడు.

© EMESCO BOOKS

'ఎఫ్‌బిఐలో సరైన కంప్యూటర్ డిటెక్టివ్‌లు లేరు. ప్రపంచవ్యాప్తంగా విభిన్నదేశాల నుంచి హ్యాకర్లు మన కంప్యూటర్లపై దాడులు చేస్తున్నారు. వారిని ఎదుర్కొనేందుకు తగిన సైనికులు మన దగ్గరలేరు.'

నవ్వాడు 'డిఒడి' అధికారి.

'ప్రపంచానికి ఇంటర్నెట్ సాంకేతిక పరిజ్ఞానం అందించి, మన గోతిని మనమే తవ్వుకున్నట్ట వుతున్నది.'

'హ్యాకర్లు రెడ్‌స్టోన్ ఆర్సెనల్ మిలటరీ బేస్ కంప్యూటర్లే కాదు, నాసా, వరల్డ్ బ్యాంక్ కంప్యూటర్లలోని రహస్యాలను కూడా తెలుసుకునే శక్తి సంపాదించారు. ఇంతవరకూ వారు సేకరించినవి మన దేశ పౌరులకు రహస్యం కాదు కానీ, ఇతర దేశాల కంప్యూటర్ వాడకందార్లకు మాత్రం నిషిద్ధం' చెప్పాడు ఎఫ్‌బిఐ అధికారి.

ముందు మామూలు సమాచారాన్ని సేకరిస్తారు. ఆ తరువాత రహస్య సమాచారం గ్రహిస్తారు. కుండకు ఒక్కసారి చిల్లుపడిందా, ఇవాళ్ల కాకపోతే రేపయినా అది పెద్దగా అవుతుంది' అన్నాడు డిఒడి అధికారి.

'కానీ ఏం చేయాలో తెలియటంలేదు. వాళ్లు మన రహస్యాలను గ్రహిస్తూంటే చూస్తూ ఉండగలమా?'

'ప్రైవేట్ హ్యాకర్ల సహాయం తీసుకోండి'.

'మన చట్టం అందుకు ఒప్పుకోదు. సైన్య రహస్యాధికారులు తమ పని సివిలియన్లతో చేయించకూడదు'.

'అవ్వపెట్టదు. అడుక్కు తిననివ్వదు అన్నట్టుంది. ప్రభుత్వానికి తెలియకుండా వీళ్లని ముగ్గులో దింపండి. నా దృష్టి 'సాండియా నేషనల్ లాబొరేటరీస్'లో పనిచేసే కార్పెంటర్ లాంటి వాళ్లమీద ఉంది' అన్నాడు డిఒడి అధికారి. తల ఊపాడు ఎఫ్‌బిఐ అధికారి.

అతడికి కార్పెంటర్ తెలుసు.

2003లో 'లాక్‌హీడ్ మార్టిన్' కంప్యూటర్లపై హ్యాకర్లు దాడిచేశారు. కొన్ని నెలల తరువాత 'సాండియా' సంస్థ కంప్యూటర్లపై కూడా హ్యాకర్లు దాడులుచేశారు. అప్పుడు 'సాండియా' తరపున వారి ఆట కట్టించింది కార్పెంటరే!

'కానీ ఇది చాలా రహస్యంగా జరగాలి. బయటకు పొక్కిందా, అంతర్జాతీయ స్థాయిలో గొడవలు అయిపోతాయి.'

'ముందు హ్యాకర్లను పట్టుకుంటే చాలు. గొడవల సంగతి తరువాత చూసుకోవచ్చు' అన్నాడు డిఒడి అధికారి.

* * *



© EMESCO BOOKS

కీ బోర్డుపై కార్పెంటర్ వేళ్లు చకచకా కదులుతున్నాయి.

స్పైడర్‌మాన్ పేరుతో కార్పెంటర్ రకరకాల సర్వర్లలోకి దూరుతున్నాడు. చాట్ గదుల్లో ప్రవేశించి మాటలు వింటున్నాడు. వాళ్ల రహస్యాలు గ్రహిస్తున్నాడు. ఇలా అనేక హ్యాకర్లగుట్లు కనుక్కున్నాడు కార్పెంటర్.

వాళ్లు ఏ కంప్యూటర్‌పై ఎలా దాడి చేయాలని పథకాలు వేయాలనుకుంటున్నారో, తెలుసుకుంటున్నాడు. వెంటనే ఓ అడ్రసుకు ఈ మెయిల్ చేస్తున్నాడు. మళ్లీ తన పని కానిస్తున్నాడు. ఇంతలో ఫోను మోగింది.

ఇంత అర్ధరాత్రి 'ఎవరా?' అనుకుంటూ ఫోను ఎత్తాడు కార్పెంటర్.

'స్పైడర్‌మాన్ రేపు ఆఫీసు అయిన తరువాత నిన్ను కలవాలి.'

కార్పెంటర్ ఒళ్లు జలదరించింది.

'అంటే మొత్తానికి ఎఫ్‌బిఐకి తనపై నమ్మకం కలిగిందన్నమాట' అనుకున్నాడు సంతోషంగా.

* * *

'టైటన్ రెయిన్ గ్రూపు పేరు విన్నావా?' ఎఫ్‌బిఐకి చెందిన వ్యక్తి అడిగాడు.

తల అడ్డంగా ఊపాడు కార్పెంటర్.

'మన రహస్యాలను ఒక పద్ధతి ప్రకారం సేకరిస్తున్న వారికి ఆ పేరు పెట్టాం. నువ్వు వారెవరో తెలుసుకోవాలి. ఇంకా మన మిలటరీ రహస్యాలను తెలుసుకోవాలని ప్రయత్నించే హ్యాకర్ల వివరాలు మాకందించాలి'.

'కానీ నా ఉద్యోగం...'

'నీ ఉద్యోగానికి ఎటువంటి ఢోకా లేదు' హామీ ఇచ్చాడు ఎఫ్‌బిఐ వ్యక్తి.

* * *

ఉదయం ఉద్యోగం చేయటం, ఇంటికి రాగానే నిద్రపోవటం, అర్ధరాత్రి మేలుకొని కంప్యూటర్ ముందు కూచుని హ్యాకర్ల వెంటబడటం తప్ప కార్పెంటర్‌కు మరో ప్రపంచం లేకుండా అయింది. తన ఇంట్లో కంప్యూటర్ల సంఖ్య పెంచాడు.

ఒక పద్ధతి ప్రకారం హ్యాకర్ల కదలికలను గమనించసాగాడు.

అలా...

తాను సేకరించిన సమాచారాన్ని విశ్లేషించేందుకు ఓ ప్రత్యేక కంప్యూటర్‌ను రూపొందించాడు. ఆ విధంగా రాత్రంతా పనిచేస్తున్న కార్పెంటర్ దృష్టిని ఓ రోజు ఒక రహస్యమిలటరీ కంప్యూటర్ 'హార్డ్‌డ్రైవ్' కదలికలు ఆకర్షించాయి.



© EMESCO BOOKS

వెంటనే తన దృష్టిని ఆ కదలికలపై కేంద్రీకరించాడు. స్పైడర్‌మాన్‌లా ఆ ఎలక్ట్రానిక్ సంకేతానికి అతుక్కుపోయి దాని వెంట ప్రయాణించాడు.

కాస్త దూరం పోయిన తరువాత ఆ ఫైళ్ళు శాఖోపశాఖలుగా చీలిపోయాయి. వెంటనే ఇతర కంప్యూటర్ల ద్వారా శాఖలుగా చీలిన సంకేతాన్ని వెంబడించాడు. ఎంతవేగంగా సంకేతాలు ప్రయాణిస్తున్నాయంటే, వాటిని వెంబడించటం ఆయనకు కష్టమైపోతోంది.

అయినా వీలయినన్ని సంకేతాలను వెంబడించాడు స్పైడర్‌మాన్.

ఒక అరగంటలో ఎక్కడి కంప్యూటర్లు అక్కడ చల్లబడిపోయాయి. హ్యాకర్ల కదలికలు ఆగిపోయాయి. కార్పెంటర్‌కు చెమటలు పట్టేశాయి.

ఎందుకంటే అరగంటలో కొన్ని వేల ఫైళ్లు అమెరికా మిలటరీ కంప్యూటర్లనుంచి వేగంగా ప్రపంచం నలుమూలలా ప్రయాణించాయి.

ప్రపంచంలో ఒక దేశంలోని కంప్యూటర్ నుంచి మరో దేశంలోని కంప్యూటర్‌కు పరావర్తనం చెంది ఇంకో చోటికి ప్రయాణిస్తున్నాయి.

పది నుంచి 30 నిమిషాలలో ఫైళ్లలోని సమాచారం అమెరికా నుంచి ప్రపంచం చుట్టి ఉత్తర కొరియా, హాంకాంగ్, తైవాన్‌లు చేరుకున్నాయి. అక్కడ ఆగిపోయాయి.

ఆశ్చర్యంతో స్తబ్దుడయిపోయాడు కార్పెంటర్.

ఇంతవేగంగా, ఇంత తక్కువ సమయంలో 'హ్యాక్' చేసేవారిని ఇంతవరకూ చూడలేదు. అంతేకాదు, ఎలాగైతే పోలీసులు వెంబడిస్తూంటే, వారిని తప్పుదారి పట్టించేందుకు దొంగలు అసలు గమ్యం వైపుకాకుండా వేర్వేరు ప్రాంతాలకు పరుగులిడి, పోలీసులు వెంబడించటం లేదని నిర్ధారించుకుని గమ్యం చేరతారో, అలా ఈ హ్యాకర్లు ప్రవర్తిస్తున్నారు.

* * *

కార్పెంటర్ చెప్పింది విని సంతోషించారు ఎఫ్‌బిఐ వారు.

'నీ సీక్రెట్ లెవెల్ పెంచుతాం. వారిని వెంబడించు. వీలయితే వారెవరో తెలుసుకో. నీకే కష్టం రాకుండా చూసే బాధ్యత మాది' హామీ ఇచ్చాడు ఎఫ్‌బిఐ అధికారి.

ఆ రోజు నుంచీ రెట్టించిన ఉత్సాహంతో హ్యాకర్లను వెండించసాగాడు కార్పెంటర్.

ఆ రాత్రి తైవాన్, హాంకాంగ్, కంప్యూటర్లలో దొంగిలించిన ఫైళ్లకోసం వెతికాడు కార్పెంటర్.

అవి లేవు. అంటే ఇది కూడా ఆ ఫైళ్ల అంతిమ గమ్యం కాదన్నమాట.

ఆ కంప్యూటర్ల కదలికలను అనుక్షణం పసికట్టే యంత్రాన్ని అమర్చాడు కార్పెంటర్. దాంతో ఆ కంప్యూటర్లను వాడినప్పుడల్లా కార్పెంటర్‌కు ఈ మెయిల్ అందుతుంది. వాటి కదలికలను పసికట్టే స్పైడర్‌మాన్ ఆక్టివేట్ అవుతాడు.

© EMESCO BOOKS

ఒక్క రోజులో కార్పెంటర్‌కు 23 వేల మెసేజీలు అందేయి!

'మొత్తం ఆరు నుంచి పది వర్క్ స్టేషన్లున్నాయి టైటన్ రెయిన్ హ్యాకర్లకు. 24 గంటలు వాటిముందు ఎవరో ఒకరు పని చేస్తూనే ఉన్నారు. మొత్తం మూడు రూట్లలో సమాచారం ప్రవహిస్తుంది. ఉత్తర కొరియా, హాంకాంగ్, తైవాన్‌లు చేరిన సమాచారం ఒక్కరోజు తర్వాత చైనాలోని 'గ్యూవాంగ్ డాంగ్' చేరుతుంది!'

కార్పెంటర్ మాటలు వింటూనే గదిలో బాంబు పడ్డట్టు ఉలిక్కి పడ్డారందరూ.

ఇంతవరకూ ఒక దేశానికి చెందిన హ్యాకర్లు ఇంత పట్టుదలగా మరో దేశం రహస్యాలను సేకరించటం జరగలేదు.

అయితే, ఈ హ్యాకర్లు స్వతంత్రంగా ప్రవర్తిస్తున్నారా? లేక, వారికి చైనా ప్రభుత్వ సహాయ సహకారాలు ఉన్నాయా?

ఏ ప్రభుత్వం మాత్రం తాను మరో దేశ రహస్యాలను సేకరిస్తున్నట్టు ఒప్పుకుంటుంది?

జాగ్రత్తగా వ్యవహరించకపోతే ఇది అంతర్జాతీయ సమస్యగా పరిణమిస్తుంది. ఆలోచించసాగాడు ఎఫ్‌బిఐ అధికారి.

తన బాధ్యత తాను నిర్వహిస్తున్నానన్న సంతృప్తితో కార్పెంటర్ సంతోషంగా ఇల్లు చేరుకున్నాడు.

* * *

'బాస్ మీటింగ్‌కు పిలుస్తున్నాడు' సెక్రటరీ చెప్పటంతో, హఠాత్తుగా ఈ మీటింగ్ ఎందుకో అర్థంకాక వెళ్లాడు కార్పెంటర్.

గదిలో ఉన్న పై అధికారులను చూడగానే ఏదో అనుమానం వచ్చింది కార్పెంటర్‌కు.

'ఉద్యోగ నియమాల ప్రకారం నువ్వు మాకు పనిచేస్తూ వేరే ఎవరికోసం పనిచేయకూడదు. నువ్వు ఎఫ్‌బిఐ కోసం పని చేస్తున్నావని తెలిసింది. నిన్ను ఉద్యోగం నుంచి తొలగిస్తున్నాం. అంతేకాదు నీకు సంస్థ ఇచ్చిన 'క్యూ' క్లియరెన్స్ కూడా రద్దు చేస్తున్నాం.'

నిర్ఘాంతపోయాడు కార్పెంటర్.

'తన క్లియరెన్స్ రద్దు చేయటం అంటే, గతంలోలా తాను స్వేచ్ఛగా ఈ హ్యాకర్ల వెంటపడలేడు.'

కార్పెంటర్ వాదనను వినేందుకు అధికారులు సిద్ధంగా లేరు.

* * *



© EMESCO BOOKS

'సారీ! నీకు మేము ఎటువంటి హామీలు ఇవ్వలేదు. నిన్ను కలసినట్టు చెప్తున్న వ్యక్తి మా ఎఫ్‌బిఐ ఉద్యోగి కాదు.'

కార్పెంటర్ నోటమాట రాలేదు.

'నేను మీకు విలువయిన సమాచారాన్ని అందించాను. ఇంకా విలువైన సమాచారాన్ని అందించగలను. మన రహస్యాలను దొంగిలిస్తున్న వాళ్లని పట్టివ్వగలను...'

'సారీ... నువ్వేమంటున్నావో మాకు అర్థం కావటం లేదు'

ఎఫ్‌బిఐ కార్యాలయం నుంచి దాదాపుగా గెంటి వేయబడ్డాడు కార్పెంటర్.

* * *

'కార్పెంటర్ దేశద్రోహానికి పాల్పడ్డాడా లేదా అన్నది పరిశోధిస్తున్నాం. అతడు హ్యాకర్. హ్యాకింగ్ అంటేనే నేరం. మాకూ ఎటువంటి హ్యాకర్లతో సంబంధంలేదు' చేతులు దులుపుకుంది ఎఫ్‌బిఐ.

'కార్పెంటర్‌ను ఉద్యోగ నియమాలు ఉల్లంఘించినందుకు తొలగించాం. అంతే ఈ విషయంలో ఇంక మాట్లాడేదేమీ లేదు' ప్రకటించింది 'సాండియా' సంస్థ.

కార్పెంటర్‌కేం చేయాలో తెలియటం లేదు.

మంచికి పోతే చెడు ఎదురవటమంటే ఇదే.

తనని హ్యాకర్ అని, దేశద్రోహి అని అన్యాయంగా అనుమానించి తన ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నారని కోర్టును ఆశ్రయించాడు కార్పెంటర్.

ప్రస్తుతం కేసు కోర్టులో ఉంది.

'వాళ్లు నన్ను వాడుకుని వదిలేయటం నాకు బాధ కలిగించటంలేదు. చైనాకు చెందిన టైటన్ రెయిన్ గ్రూపు వారు ఇంకా హ్యాకింగ్ చేస్తూనే ఉన్నారు. అమెరికా రహస్యాలు గ్రహిస్తూనే ఉన్నారు. దేశాన్ని రక్షించవలసిన వీళ్లు కనీసం వారి వివరాలు, పాస్‌వర్డ్‌లు కూడా నన్ను అడగటం లేదు. అంటే నన్ను చెడ్డవాడిగా చిత్రించటంలో దేశానికి ప్రమాదం కలిగినా ఫరవాలేదన్నమాట. టైటన్ రెయిన్ గ్రూప్ ఇంకా సమాచారం గ్రహిస్తున్నారన్న ఆలోచన నన్ను నిద్ర పోనివ్వటం లేదు' అంటాడు కార్పెంటర్ ఆవేదనగా!

ఇంతకీ ఇలా తనని ఏ ఒత్తిడి వల్ల నేరస్తుడిగా చిత్రీకరిస్తున్నారో కార్పెంటర్‌కు తెలియదు. కార్పెంటర్ ఏ నేరం చేశాడో ఎవరో చెప్పటం లేదు.

'దేశ ద్రోహులను పట్టించాలనుకోవటమే నా నేరమేమో' అంటాడు కార్పెంటర్.

© EMESCO BOOKS

# పడగ విప్పిన తుపాకీ!

## పిచ్చివాడి చేతిలో తుపాకీని ఆత్మస్థయిర్యంతో ఎదుర్కొని పసిపిల్లల ప్రాణాలు కాపాడిన ప్రిన్సిపాల్ గాథ

“ధైర్యవంతుడికీ, పిరికివాడికీ మధ్య పెద్ద తేడాలేదు. ఇద్దరూ మనసులో భయపడుతూనే ఉంటారు. కానీ పిరికివాడు తన భయాన్ని బయటకు చూపుతాడు. ధైర్యవంతుడు చూపించడు. అంతే తేడా” అన్నాడు డాన్ స్టాక్‌వెల్.

అందరూ నవ్వేశారు.

న్యూ హాంప్‌షైర్‌లో స్వాన్జే ప్రాంతంలోని ఓ పాఠశాల ప్రిన్సిపాల్ డాన్ స్టాక్‌వెల్.

స్టాక్‌వెల్ ఆ పాఠశాలకు అధికారిగా వచ్చినపుడు అక్కడి పరిస్థితి ఎంతో దయనీయంగా ఉంది. భవంతి పాతదై కూలిపోయేందుకు సిద్ధంగా ఉండేది. అధ్యాపకులు సరిగ్గా ఉండేవారు కారు. ఉన్నవారికి పాఠాలు చెప్పడంపై పెద్ద ఆసక్తి ఉండేది కాదు.

పాఠశాలలో విద్యార్థుల సంఖ్య అతి తక్కువగా ఉండేది. వారికీ చదువులపై శ్రద్ధ ఉండేదికాదు. కానీ స్టాక్‌వెల్ ఆ పాఠశాలలో అడుగుపెట్టినప్పటి నుంచీ పరిస్థితి మారింది.

అధ్యాపకులను ఉత్తేజపరిచాడు. విద్యార్థులను ఉత్సాహపరిచాడు. భవంతిని పునరుద్ధరించాడు. అనేక నూతన పథకాలను అమలుపరచి పాఠశాలను అభివృద్ధి పరిచాడు. దాంతో విద్యార్థుల సంఖ్య 1040 దాటింది. పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యే వారిసంఖ్య గణనీయంగా పెరిగింది. దూర ప్రాంతాలనుండి సైతం విద్యార్థులు ఆ పాఠశాలలో చేరేందుకు ఉత్సాహం చూపసాగారు.

ఆ రోజు స్టాక్‌వెల్‌కు సన్మానం జరపాలని అధ్యాపక బృందం, విద్యార్థులు నిశ్చయించారు. అందుకోసం వచ్చిన అతిథులతో స్టాక్‌వెల్ తన గదిలో కూర్చుని పిచ్చాపాటీ మాట్లాడుతున్నాడు. స్టాక్‌వెల్ చదువుకునే సమయంలో అత్యంత సాహసం ప్రదర్శించినందుకుగాను బహుమతిగా ‘హీరోయిజమ్ మెడల్’ను పొందాడు. అప్పుడు అక్కడ అడిగిన వారి ప్రశ్నకు సమాధానంగా స్టాక్‌వెల్ పిరికి వారికి, ధైర్యవంతుడికి తేడాను అలా వివరించాడు.

© EMESCO BOOKS

అంతలో అక్కడున్న ఓ టీచర్ అడిగాడు.

"స్టాక్‌వెల్! ఒకవేళ ఇప్పుడు ఏదైనా విపత్కర పరిస్థితి ఎదురైనా కూడా మీరు అదే సాహసం చేస్తారా?"

స్టాక్‌వెల్ నవ్వాడు.
"ఏమో చెప్పలేను" అన్నాడు.

కానీ మరి కొద్దిసేపట్లో స్టాక్‌వెల్ నిజంగానే కఠిన పరీక్షను ఎదుర్కోవాల్సి వస్తుందని, అతని ధైర్య సాహసాల నిగ్గు తేలుతుందని అక్కడున్న వారెవరూ ఊహించలేక పోయారు.

అది అక్టోబర్ 15, 1991.

* * *

హఠాత్తుగా ఓ అమ్మాయి కెవ్వున కేక పెట్టింది.
ఆ కేకతో పాఠశాల ప్రతిధ్వనించింది.

వెంటనే మరిన్ని ఆక్రందనలు వినిపించాయి. విద్యార్థులు భయంతో చెల్లాచెదురై పరుగెత్తుతున్న శబ్దాలు వినిపిస్తున్నాయి.

పళ్లరసం గ్లాసును పక్కనపెట్టి లేచాడు స్టాక్‌వెల్. అందరూ కిటికీలోంచి బయటకు చూడసాగారు.

"ఏమైంది?" అడిగాడు స్టాక్‌వెల్ బయటకు రాగానే కనిపించిన ఓ విద్యార్థిని.

"ఎవరో విచక్షణా రహితంగా తుపాకీ కాలుస్తున్నాడు. విద్యార్థులంతా పరుగెత్తుతున్నారు" చెప్పాడా అబ్బాయి.

* * *

పద్దెనిమిది సంవత్సరాల యువకుడు తుపాకీ ఊపుతూ అరుస్తున్నాడు. ఉండుండి గాల్లోకి తుపాకీ పేలుస్తున్నాడు. అతనెవరో, ఎవరికీ తెలియదు. క్యాంటీన్‌లో అందరూ ఉన్నపుడు హఠాత్తుగా లోపలకు వచ్చి విచక్షణా రహితంగా కాల్పులు సాగించాడతను.

దాంతో కకావికలై విద్యార్థులు పరుగెత్తసాగారు. ఆ యువకుడు క్యాంటీన్ వదలి తరగతి గదిలో దూరాడు. అది ఇంటర్వెల్ సమయం కావటంతో క్లాసులో విద్యార్థులు ఎక్కువగా లేరు. ఉన్నవారు ఆశ్చర్యం నుంచి తేరుకునే లోగా ఆ యువకుడు వారివైపు తుపాకీ గురిపెట్టాడు.

"కదలకండి. కదిలితే కాల్చేస్తాను".

* * *

© EMESCO BOOKS

"తుపాకీతో అతడు క్లాస్‌రూమ్‌లో దూరాడు". క్యాంటీన్ వైపు వడివడిగా వెళుతున్న స్టాక్‌వెల్‌కు సమాచారాన్నందించాడు ఓ విద్యార్థి.

"తరగతి గదిలో ఎవరైనా విద్యార్థులున్నారా?" వెంటనే అడిగాడు స్టాక్‌వెల్.

"పన్నెండు మంది ఉన్నారు"

స్టాక్‌వెల్ నడకలో వేగం తగ్గించలేదు. వెనక్కు తిరిగి పరుగులాంటి నడకతో తన గది చేరుకున్నాడు. పోలీస్ స్టేషన్‌కు ఫోను చేశాడు. ఆ పై హాస్పటల్‌కు ఫోను చేశాడు. తరువాత మానసిక శాస్త్రవేత్తలకు ఫోను చేశాడు. ఫోను పెట్టి నిట్టూర్చాడు.

"పదిహేను నిముషాల్లో పోలీసులు వస్తారు" చెప్పాడు అక్కడ ఉన్నవారికి.

కానీ స్థిమితంగా ఉండలేక పోయాడు స్టాక్‌వెల్.

"పదిహేను నిముషాలు మామూలుగా అయితే ఎక్కువ సమయమే. కానీ ఒక గదిలో తుపాకీతో బెదిరించే యువకుడితో 12 మంది బంధీలుగా ఉన్నపుడు ఆ 15 నిముషాల్లో ఏ క్షణమైనా యమగండమే"

లేచాడు స్టాక్‌వెల్.

"ఎక్కడికి?" అడిగారు గదిలో ఉన్నవారు.

"అక్కడ నా విద్యార్థులు ప్రమాదంలో ఉంటే, నేనిక్కడ పోలీసులు వచ్చేవరకు చేతులు ముడుచుకుని ఎదురుచూస్తూ కూచోలేను"

"మనమేం చేయగలం?"

"ఏమీ చేయలేకున్నా ఏదైనా చేయాలని ఆలోచించకుండా ఉండగలమా?"

స్టాక్‌వెల్ టీచర్లందరినీ సమావేశ పరిచాడు.

"మీరు అనౌన్స్‌మెంట్ ఇవ్వండి. విద్యార్థులంతా పాఠశాల వదలి బయటకు వెళ్లిపోవాలని ఆదేశించండి".

"మిగతా టీచర్లందరినీ గన్‌మెన్ ఉన్న గది నలువైపులా కాపలాగా నుంచోమని" ఆదేశించాడు.

అందరూ స్టాక్‌వెల్ ఆదేశాలను మౌనంగా ఆమోదించారు.

స్టాక్‌వెల్ లేచి నిలబడ్డాడు.

"నేను ఆ యువకుడితో మాట్లాడేందుకు గదిలోకి వెళ్తాను. ఎవరూ తొందరపడి ఎటువంటిచర్యలు తీసుకోవద్దు. గన్‌మన్ కంగారుపడ్డాడంటే విలువైన ప్రాణాలు పోతాయి"

"ఆ గదిలోకి వెళ్లటం ప్రమాదకరమేమో?"

నవ్వాడు స్టాక్‌వెల్.

© EMESCO BOOKS

"విద్యార్థుల ప్రాణాలు ప్రమాదంలో ఉన్నపుడు మన ప్రాణాలగురించి ఆలోచిస్తామా?
వడివడిగా గన్‌మన్ ఉన్నగదివైపు వెళ్లాడు స్టాక్‌వెల్.

* * *

కిటికీ సందులోంచి చూశాడు స్టాక్‌వెల్.

తుపాకీ పట్టుకున్న యువకుడు గది మధ్యలో నుంచుని ఉన్నాడు. తుపాకీని ఒకో విద్యార్థివైపు గురిపెట్టి వెర్రిగా నవ్వుతున్నాడు. విద్యార్థులు భయంతో ఏడుస్తున్నారు.

ఇంతలో హఠాత్తుగా ఆ యువకుడు ఓ విద్యార్థివైపు గురిపెట్టి తుపాకీ పేల్చాడు గుండు విద్యార్థి తలపైనుండి దూసుకుపోయింది.

కావాలని విద్యార్థిని బెదిరించేందుకే అలా కాల్చాడా యువకుడని గ్రహించాడు స్టాక్‌వెల్.

"అంటే, ఆ యువకుడు ఏదో ఆవేశంలో బలహీన క్షణంలో ఇలా ప్రవర్తిస్తున్నాడు తప్ప నిజంగా హాని కలిగించే ఉద్దేశ్యం లేదన్న మాట. అందువల్ల అతడిని మాటలలో పెట్టి బందీలైన విద్యార్థులను విడిపించవచ్చు అనుకున్నాడు స్టాక్‌వెల్.

నెమ్మదిగా తలుపు దగ్గరకు వెళ్లాడు. తలుపు తట్టాడు.

"నేను ఈ పాఠశాల ప్రిన్సిపాల్‌ను. నా పేరు స్టాక్‌వెల్. నేను లోపలకు వస్తున్నాను" అన్నాడు.

వెంటనే సమాధానం కోసం చూడకుండా నెమ్మదిగా తలుపు తోసుకుని లోపలకు అడుగుపెట్టాడు స్టాక్‌వెల్.

ఆ యువకుడు తుపాకీని స్టాక్‌వెల్‌వైపు గురిపెట్టాడు.
మృదువుగా నవ్వాడు స్టాక్‌వెల్.
ఓ కుర్చీని లాక్కుని కూర్చున్నాడు.

"నేను పాఠశాల ప్రిన్సిపాల్‌ని. నీకేదైనా సమస్య ఉంటే నాతో చెప్పు. పిల్లలను తుపాకీ చూపి బెదిరించి లాభంలేదు"

పైకి ధైర్యంగా మాట్లాడుతున్నా స్టాక్‌వెల్ గుండెలు దడదడలాడుతూనే ఉన్నాయి. ఎందుకంటే ఈ మొదటి క్షణాల్లో కనుక తాను ఆ యువకుడి విశ్వాసం సంపాదించ లేకపోతే తన ప్రాణాలేకాదు, విద్యార్థుల ప్రాణాలు సైతం ప్రమాదంలో పడతాయి.

ఆ యువకుడు మాట్లాడలేదు. తుపాకీని స్టాక్‌వెల్ వైపు గురిపెట్టి అలాగే తీక్షణంగా చూస్తూ నిలబడ్డాడు.

స్టాక్‌వెల్ స్నేహ పూర్వకంగా నవ్వాడు.

© EMESCO BOOKS

"నువ్వు చేస్తున్న పని ప్రభావం కాని, ఫలితం కానీ నీకు తెలియదు. వీళ్లంతా చిన్న పిల్లలు. నువ్విప్పుడు తుపాకీతో వీళ్లని బెదిరిస్తున్నావు. ఏదో సాధించాలని, ఎవరిమీదో కసి తీర్చుకోవాలని అనుకుంటున్నావు. కానీ నువ్వేమీ సాధించలేవని తెలుసుకో. నీ చర్య వల్ల ఈ చిన్నారుల మనసు దెబ్బతింటోంది. జీవితాంతం ఈ భయాలు వాళ్లని వెంటాడతాయి" గంభీరంగా అన్నాడు స్టాక్‌వెల్.

అతనికి తెలుసు. ఉపన్యాసం ఇస్తున్నట్టు కనిపిస్తే, ఆ యువకుడి అహం దెబ్బతింటుందని. కాబట్టి నిజానిజాలు అతనికి ఓ మిత్రుడిలా వివరించడం తప్ప మరో మార్గం లేదని స్టాక్‌వెల్ గ్రహించాడు.

యువకుడు తుపాకీని అలాగే గురిపెట్టి ఉంచాడు.

"చూడు బాబూ... జీవితం ఎంతో విలువైంది. తాత్కాలికంగా ఆవేశాలకు లోనై దాన్ని నాశనం చేసుకోకూడదు. ఇప్పటికే నీ ఈ చర్యవల్ల నీకు తెలియకుండానే నీకెంతో అన్యాయం జరిగింది. ఈ పసివాళ్లకు అన్యాయం చెయ్యకు. వాళ్లని వెళ్లిపోనీ. నేను ఇక్కడే ఉంటాను. వాళ్లకన్నా నన్ను బంధిస్తేనే నీకు లాభం ఎక్కువ!"

ఆ యువకుడు తీక్షణంగా అలానే చూస్తూ నిలబడ్డాడు. తుపాకీని స్టాక్‌వెల్ వైపు గురిపెట్టి ఉంచాడు.

స్టాక్‌వెల్ కాస్సేపు నిశ్శబ్దంగా ఉన్నాడు. దీర్ఘంగా ఊపిరి పీల్చి పిల్లలవైపు తిరిగాడు.

"భయమేస్తోందా?" మృదువుగా అడిగాడు.

పిల్లలు ఏడుపు పెంచారు.

"మీరు వెళ్లిపొండి"

ఆ యువకుడివైపు చూడకుండా చెప్పాడు స్టాక్‌వెల్.

పిల్లలు యువకుడివైపు చూశారు.

"నేను చెప్తున్నానుగా. వెళ్లండి" ఆజ్ఞాపించాడు స్టాక్‌వెల్.

పిల్లలు ఒకరొకరే లేచి నిశ్శబ్దంగా, గబగబా గది వదలి వెళ్లసాగారు. ఓరకంట ఆ యువకుడివైపు చూశాడు స్టాక్‌వెల్.

అతడు నిర్భావంగా చూస్తున్నాడు పిల్లలవైపు!

పిల్లలు గదివదిలి వెళ్లగానే స్టాక్‌వెల్ లేచి తలుపు దగ్గర వేశాడు. తలుపు వేస్తున్నపుడు గమనించాడు, పిల్లలను టీచర్లు గబగబా మానసిక శాస్త్రవేత్తలున్న గదిలోకి తీసుకువెళ్తున్నారు. అప్పుడే పోలీసులు రావటం చూశాడు స్టాక్‌వెల్. తలుపువేసి ఆ యువకుడి వైపు తిరిగాడు.



© EMESCO BOOKS

"పోలీసులు వచ్చేశారు. నువ్వు మంచిగా ప్రవర్తించావని నేను వారికి చెప్తాను. నీకు పెద్దగా శిక్ష పడకుండా చేస్తాను" అన్నాడు.

* * *

పోలీసాఫీసర్ ఓగ్రెన్ ఆ గది తలుపు బయట పొంచి ఉన్నాడు.

మరో పోలీసాఫీసర్ ఆ గది కిటికీవద్ద నిలబడ్డాడు సిద్ధంగా.

పరిస్థితి ఉత్కంఠగా ఉంది.

* * *

"నాకు స్టీరియో రికార్డర్, రాక్ ఎండ్ రోల్ టేపులు కావాలి"

తుపాకీని స్టాక్‌వెల్‌కు గురిపెట్టి అడిగాడు ఆ యువకుడు.

అది ఆజ్ఞాపనలా లేదు.

అభ్యర్థనలా ఉంది. స్టాక్‌వెల్‌లేచి కిటికీవద్దకు వెళ్లాడు. అతడి డిమాండ్లను చెప్పసాగాడు.

* * *

"ఇదే సమయం" అనుకున్నాడు ఓగ్రెన్.

వెంటనే తలుపు తోసుకుని లోపలకు పరుగెత్తుకు వచ్చాడు ఓగ్రెన్.

ఆ శబ్దానికి యువకుడు గిరుక్కున వెనక్కు తిరిగాడు. తుపాకీ పట్టుకుని సిద్ధంగా ఉన్న పోలీసును చూస్తూనే తుపాకీని తన కణతల వద్ద పెట్టుకున్నాడు.

"స్టాపిట్! నన్ను నేను కాల్చుకుంటా" బిగ్గరగా అరిచాడు ఆ యువకుడు.

ఇంతలో కిటికీవద్ద పొంచి ఉన్న పోలీసాఫీసర్ గ్రాస్ నిశ్శబ్దంగా పిల్లిలా గదిలోకి ప్రవేశించాడు. అలాగే మెల్లిగా నడుస్తూ ఆ యువకుడిని చేరాడు.

జరుగుతున్న దేమిటో గ్రహించేలోగా ఆ యువకుడిపై దూకాడు. తుపాకీని లాక్కున్నాడు. స్టాక్‌వెల్ మౌనంగా గది వదలి వెళ్లిపోయాడు.

* * *

నలభై అయిదు నిముషాలపాటు తుపాకీ పట్టుకున్న యువకుడితో ధైర్యంగా మానసిక యుద్ధం చేసి గెలిచిన స్టాక్‌వెల్‌కు ప్రభుత్వం అసాధారణ సాహసాన్ని ప్రదర్శించినందుకు బహుమతినిచ్చింది. అయితే పైకి గంభీరంగా ఉన్నా తానెంత భయపడింది ఒక్క స్టాక్‌వెల్‌కే తెలుసు. ఆ యువకుడిని కోర్టు ధృవీకృత పాఠశాలకు పంపింది.

అయినా కొన్నాళ్లకు ఆ యువకుడు మరో స్కూల్లో ఇలాగే తుపాకీ పట్టుకుని దూరాడు. అయితే అప్పటికే అతడికి 18 ఏళ్లు దాటడంతో కోర్టు అతడికి జైలుశిక్ష విధించింది.



© EMESCO BOOKS

# ప్రమాదం అంచులో...

**సముద్రగర్భంలో తండ్రికొడుకుల సాహసం.**
**ప్రాణాలుపణంగా పెట్టి కొడుకును కాపాడిన తండ్రికథ.**

**“డాడీ ఇంకొక్కసారి ప్లీజ్!”**

బతిమి లాడుతున్న డేవిడ్‌వైపు చూశాడు జో మైస్ట్రెల్. జాలిగా ముఖం పెట్టాడు డేవిడ్.

డేవిడ్‌నుంచి దృష్టిని మరల్చి చిక్కగా నల్లగా ఉన్న నీటికేసి చూశాడు జో. నెమ్మదిగా వీస్తున్న గాలికి మృదువుగా అలలు లేస్తున్నాయి. అలలు తమ బోటుకి తగిలి భంగమయినప్పుడు వినిపిస్తున్న ‘ఛళ్లు ఛళ్లు’ మన్న శబ్దం తప్ప మరో అలికిడే లేదు.

ఆకాశంలో తారలు తళ తళా మెరుస్తున్నాయి.

“ఇప్పటికే మనం 33 నిముషాలు నీటిలో గడిపాం. ఈసారికి ఇంక చాలు” నచ్చచెప్పాడు జో.

“ప్లీజ్ డాడీ. ఇంకాస్సేపే. బోలెడన్ని పీతలున్నాయి. మునిగిన పడవలో నివాసం ఉంటున్న వాటిని పట్టుకోవటం చాలా సులభం డాడీ”.

49 ఏళ్ల జో మెరైన్ బయాలజిస్టు.

నీటిలోని జీవాలను పరిశోధించటం అతని పని. అందుకే నీటిలోకి దూకటం, ఎక్కువ కాలం నీటిలో ఉండటం అతనికి అలవాటే. అతడి కొడుకు, 17 ఏళ్ల డేవిడ్ కూడా చిన్నప్పటి నుంచీ నీటిలోకి తండ్రితోపాటు దూకేవాడు.

డేవిడ్‌కు 14 ఏళ్ల వయసు వచ్చేసరికి ‘డైవర్’గా సర్టిఫికెట్ కూడా వచ్చింది. పీతలను పట్టటం డేవిడ్‌కు కూడా సరదానే.

© EMESCO BOOKS

కొద్దికాలం క్రితమే నీటిలో 'అవాలాన్' అనే పడవ కనిపించింది. దాదాపుగా 30 ఏళ్ల క్రితం మునిగిపోయిన పడవ అది. అప్పటినుంచీ జో, డేవిడ్‌లు సాయం వేళల్లో నీటిలో దూకి ఆ పడవ గురించిన విశేషాలను పరిశీలిస్తూ వస్తున్నారు. పడవ నీటిలో ఎంతో కాలం నుంచి ఉండటంవల్ల అది పీతల మయం అయింది.

దాంతో డేవిడ్ ఉత్సాహం పట్టలేకుండా ఉన్నాడు. జో అప్పటికే అరగంటలో బోలెడన్ని పీతలను పట్టాడు.

"డాడీ ప్లీజ్" తండ్రి నుంచి సమాధానం ఎంతకీ రాకపోవటంతో మళ్లీ బతిమిలాడటం ఆరంభించాడు డేవిడ్.

"సరే" అన్నాడు నవ్వుతూ జో.

అతనికీ మరోసారి నీటి గర్భంలోకి దూకాలని ఉంది. 'జో' తన ఆక్సిజన్ ట్యాంకుకు ఉన్న 'డైవ్ కంప్యూటర్' వైపు చూశాడు. నీళ్లలో ఎక్కువకాలం ఉండేవారి శరీరంలోకి జలంలోని నైట్రోజన్ ప్రవేశిస్తుంది. దాంతో దేహంలో నైట్రోజన్ పరిమాణం పెరుగుతుంది. ఎప్పుడయితే నైట్రోజన్ నిర్ణీత విలువను దాటుతుందో అప్పుడే కంప్యూటర్ డైవర్‌ను హెచ్చరిస్తుంది. అప్పుడు నీటిపైకి వెంటనే రాకూడదు. నెమ్మది నెమ్మదిగా ఆగుతూ పైకి రావాల్సి ఉంటుంది. అలా కాక వెంటనే పైకి వచ్చేస్తే 'బెండ్స్' అనే విపరీతమైన కీళ్ళ నొప్పులు వస్తాయి. రక్తంలో, ఇతర కణాల్లో నైట్రోజన్ బుడగలు ప్రవేశించటంతో ఈ నొప్పులు వస్తాయని వైద్యులు చెబుతారు. సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే ఈ బుడగలవల్ల ఊపిరితిత్తులు బద్దలై ప్రాణహానీ సంభవించవచ్చునని వారంటారు.

"మనం నీట్లో 18 నిముషాల కన్నా ఎక్కువ ఉండకూడదు. మన ట్యాంకుల్లో ఆక్సిజన్ ఎక్కువగా లేదు" డేవిడ్‌కు గుర్తుచేశాడు జో.

"అలాగే డాడీ. 18 నిమిషాలు చాలు" సంతోషంగా ఒప్పుకున్నాడు డేవిడ్.

తండ్రి తల ఆడించగానే నీటిలోకి ఉత్సాహంగా దూకాడు డేవిడ్.

డేవిడ్ వెనకే తానూ నీటిలో దూకాడు జో.

అయితే, వారు కలలోకూడా ఊహించని పెను ప్రమాదం కొద్దిసేపట్లో ఎదుర్కోవాల్సి వచ్చింది. అది వారికి జీవితాంతం మరచిపోలేని అనుభవాన్ని మిగిల్చింది.

* * *

తండ్రి తన వెనకే నీటిలో దూకటం గమనించాడు డేవిడ్.

'తండ్రి తోడుండగా భయం దేనికి?'– అనుకుని వేగంగా నీటి అడుగువైపు దూసుకువెళ్లాడు. సముద్రగర్భంలోని పడవను చేరుకున్నాడు. పడవచుట్టూ తిరుగుతూంటే పడవలో మనిషి

దూరేంత రంధ్రం ఒకటి కనిపించింది. రెట్టించిన ఉత్సాహంతో ఆ రంధ్రంలోంచి పడవ లోపలకు ప్రవేశించాడు డేవిడ్.

లోపల పీతల ప్రపంచం ఉన్నట్టుంది. ఆనందం పట్టలేక వాటివైపు దూకాడు డేవిడ్.

డేవిడ్ నీటిలో దూకి పడవవైపు వెళ్లటం గమనించాడు జో. ఆపై తన దృష్టిని పడవవైపు మళ్లించాడు. టార్చి లైటు వెలుతురులో పడవను పరిశీలించాడు. అయితే పక్కకు తిరిగి చూసేసరికి డేవిడ్ లేడు.

టార్చిని నలువైపులా తిప్పాడు డేవిడ్ కనబడటం లేదు.

'ఏడీ? డేవిడ్! ... ఇంతలో ఎటుమాయమై పోయాడు?' అతడిలో ఆందోళన.

* * *

అక్కడ పడవ లోపల ఒడుపుగా ఒక పీతను పట్టుకున్నాడు డేవిడ్. దాన్ని తండ్రికి అందించాలనుకున్నాడు. తాను దూరిన కన్నంలోంచి పీతను తండ్రికి అందించేందుకు చేయెత్తి పట్టుకున్నాడు డేవిడ్.

* * *

ఇటువైపు గాభరాగా డేవిడ్‌కోసం చూస్తున్న 'జో'కు పడవలోంచి బయటకు వస్తున్న పీత, దాన్ని పట్టుకున్న డేవిడ్ చెయ్యి కనిపించాయి. సంతోషంతో నిట్టూర్చాడు జో.

వెంటనే ముందుకు దూకి పీతను అందుకున్నాడు. పీతతో పాటుగా డేవిడ్ చెయ్యిని పట్టుకోవాలనుకున్నాడు. కానీ అంతలోనే డేవిడ్ చేయ్యి లోపలకు జారి మళ్లీ అదృశ్యం అయిపోయింది.

* * *

అన్ని పీతలను చూస్తున్న డేవిడ్, రెట్టించిన ఉత్సాహంతో మరిన్ని పీతలు పట్టేందుకు లోపలకు జారాడు. అయితే డేవిడ్ కదలికలకు పీతలలో సంచలనం కలిగింది. అవి మామూలుకన్నా వేగంగా పరుగెత్తసాగాయి. దాంతో ఆ ప్రాంతంలోని మట్టి లేచి నీళ్లలో కలవసాగింది. పడవలో తుప్పు పట్టిన వస్తువుల వల్ల నీళ్లు మరింత మడ్డిగా అయ్యాయి. టార్చి వేసినా మట్టినీళ్ల వల్ల ఏమీ కనబడటం లేదు.

'ఇక్కడ నుంచి వెళ్లిపోవటం క్షేమకరం' అనుకున్నాడు డేవిడ్.

తాను లోపలకు దూరిన కన్నం ఉందనుకున్న వైపుకు ఈదాడు.

తలకు బలంగా చెక్క తగిలింది.

© EMESCO BOOKS

అంటే ... 'అక్కడ రంధ్రం లేదా!' అనుకుని మరోవైపు వెళ్లాడు. కానీ అక్కడా రంధ్రం కనిపించలేదు.

అంతే!... ఉన్నఫలాన అతడికి భయం ఒళ్లంతా పాకసాకింది.

అంత చల్లటి నీళ్లలోనూ డేవిడ్ కాళ్లు చేతులు వణుకసాగాయి.

* * *

డేవిడ్ చేయి అదృశ్యమైన చోట టార్చి లైటు వేసి చూశాడు జో.

నీళ్లంతా మట్టి మట్టిగా ఉన్నాయి.

డేవిడ్ జాడలేదు. గడియారం వైపు చూశాడు జో. 'తాము నీటిలో దూకి 13 నిముషాలయింది. తమ ట్యాంకుల్లో ఆక్సిజన్ ఇంకా అయిదు నిముషాలకు సరిపడ మాత్రమే ఉంది. ఈ అయిదు నిముషాల్లో తాము నీటిపైకి ప్రయాణం ఆరంభించాల్సి ఉంటుంది... లేకపోతే...'

'కమాన్ డేవిడ్' మనస్సులో గట్టిగా అనుకున్నాడు జో.

మరో నిముషం గడిచింది. డేవిడ్ జాడలేదు. తానూ ఆ రంధ్రంలోంచి దూరాలని ఆవైపు వెళ్లాడు జో.

తల లోపలకు వెళ్లింది. ఆక్సిజన్ సిలిండర్ ఆ కన్నంలో పట్టలేదు. ఇరుక్కుపోయింది....

అక్కడ... అదే సమయంలో కంగారులో డేవిడ్ చేతిలోంచి టార్చిలైట్ కాస్త జారిపోయింది. చుట్టూ కటిక చీకటైంది. దారి తెలియటం లేదు. హఠాత్తుగా నీళ్ల ఒత్తిడి పెరిగిన భావన కలిగింది. సరిగ్గా ఊపిరి పీల్చలేక పోతున్నాడు. ఒక్కసారి తన ముఖం మీది తొడుగులు తొలగించి స్వేచ్ఛగా గాలి పీల్చాలని ఉంది. కానీ... చుట్టూ నీరు!

డేవిడ్‌కు తండ్రి మాటలు గుర్తుకు వచ్చాయి. 'తమ ట్యాంకుల్లో ఆక్సిజన్ ఎక్కువగా లేదు. తమ ఆక్సిజన్ అయిపోతోందా? అప్పుడేమవుతుంది?'–

డేవిడ్ కంట నీరు కారసాగింది. కారిన నీరు చుట్టూ ఉన్న నీటిలో కలసిపోతోంది. 'తానిక్కడ, ఈ చీకట్లో, ఈ నీటిలో చచ్చిపోతాడా?'–

అటువైపు ... 'తానీ సంకటంనుంచి బయట పడాలంటే ఆక్సిజన్ 'వాల్వ్' తెరవక తప్పదు' అనుకున్నాడు జో. 'కానీ అది తీసి, లోపలకు వెళ్లి మళ్లీ మూసేసేలోగా ఎంత ఆక్సిజన్ వ్యర్థమవుతుందో?! ముందే ఆక్సిజన్ తక్కువుంది...

కానీ ఇక్కడ ఇరుక్కుని ఏం సాధిస్తాడు?'–

నెమ్మదిగా 'వాల్వ్' విప్పి లోపలకు దూరాడు జో. టార్చి వెలుతురులో లోపలంతా మట్టి నీరు కనిపించింది.



© EMESCO BOOKS

నలుమూలలా టార్చిని కదపసాగాడు.

అతడు ఉన్న స్థలానికి గోడకు అవతలవైపు ఏదో మెరుస్తూ కనిపించింది. అదే ... డేవిడ్ వేసుకున్న 'నీటి తొడుగు!'–

జోకు సంతోషం వేసింది. డేవిడ్ దగ్గరలోనే ఉన్నాడు. కానీ జో ఆ వైపు వెళ్లలేదు. డేవిడ్ ఈ వైపుకు రాలేదు. మళ్లీ కిందకు వెళ్లి చుట్టూ తిరిగి పైకి రావాలి. 'తమకు అంత సమయం ఉందా?'...

* * *

ఆక్సిజన్ అయిపోతోంది. ఊపిరి అందటం లేదు. ఎంతో కష్టంగా ఉంది డేవిడ్‌కు. అంతలో అతని దృష్టి దూరంగా కనిపిస్తున్న కాంతిపై పడింది. 'డాడీ!' అరవబోయాడు. కానీ బయటికి రాలేదు. అతని ఇంద్రియాలు సర్వం కదులుతున్న కాంతిపైనే కేంద్రీకరించి ఉన్నాయి.

జో గుండె వేగం బాగా పెరిగింది. అది మంచిది కాదని 'జో'కు తెలుసు. గుండె ఎంత వేగంగా కొట్టుకుంటే ఆక్సిజన్ అంత త్వరగా ఖర్చయిపోతుంది. అతని దృష్టి డేవిడ్‌పైనే! డేవిడ్ ఏమో కదలటంలేదు.

'కదలకు. అక్కడే ఉండు. నేను వస్తున్నాను' సమాచారం అందించే వీలు లేదు. కానీ ఎదురుచూసే సమయం కూడా లేదు.

వెంటనే జో కిందకు ఈదాడు. మరో వైపు నుంచి బయటకు వచ్చి డేవిడ్ వైపు ఈదసాగాడు.

కాంతి అదృశ్యమవటంతో మళ్లీ డేవిడ్‌లో కంగారు కలిగింది. 'డాడీ తనను చూడలేదా? తానిక్కడ ఉంటే వేరేచోటికి వెళ్తున్నారేంటి!?'–

రంధ్రంలోంచి డేవిడ్ కనిపిస్తున్నాడు. అతని వైపుకు టార్చి తిప్పాడు జో. డేవిడ్ ఆ వైపు తిరిగాడు.

టార్చి తిప్పుతూ ఎటువైపు నుంచి బయటకు రావచ్చో చూపించాడు జో. డేవిడ్ నెమ్మదిగా ఆ వైపు పాకసాగాడు.

"త్వరగా" గొణుక్కున్నాడు జో.

ఇద్దరి ట్యాంకుల్లో ఆక్సిజన్ అడుగంటింది. ఇద్దరికీ ఊపిరి అందటంలేదు. వాళ్ల కళ్లు బైర్లు కమ్ముతున్నాయి.

జో గాలి పీల్చే ప్రయత్నం చేశాడు. అందలేదు. రబ్బరు మౌత్ పీస్‌ను గట్టిగా కొరుకుతూ గాలిని సృష్టించసాగాడు. కానీ అదీ ఎంతో సేపు ఉండదని 'జో'కు తెలుసు.



© EMESCO BOOKS

"త్వరగా రా డేవిడ్!" మనసులో ప్రార్థించాడు జో.

కానీ డేవిడ్ కదలటం లేదు.

అప్పుడు గమనించాడు జో.

డేవిడ్ సగం దూరం వచ్చి ఆగిపోయాడు. కాదు ఆగలేదు, స్పృహ తప్పి నీటిలో వేలాడుతున్నాడు. ఇంకాస్సేపటికి నీటి ప్రవాహంలో కొట్టుకుపోతాడు.

ఇక ఆలస్యం చేయలేదు జో.

తన శరీరంలో ఉన్న శక్తినంతా కూడగట్టుకుని ఊపిరి బిగబట్టి డేవిడ్ వైపు లంఘించాడు.

డేవిడ్‌ను పట్టుకుని అదే వేగంతో కింద నేలవరకూ వెళ్లాడు. నేలను గట్టిగా తన్ని పైకి ఎగిరాడు. అంతే! రయ్‌మని తేలసాగారు వారిద్దరూ.

'నెమ్మదిగా వెళ్లండి. లేకపోతే ప్రమాదం' కంప్యూటర్ హెచ్చరించ సాగింది. కానీ నెమ్మదిగా వెళ్లటం కుదరదు. అప్పటికే డేవిడ్ స్పృహకోల్పోయి నీళ్లు మింగటం ఆరంభించాడు.

ఆక్సిజన్ అయిపోయింది. ఊపిరి అందక జో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు. అందుకే ... అపరిమిత వేగంతో నీటి ఉపరితలానికి వచ్చేశారు. పైకి వస్తూనే మౌత్‌పీస్ పీకేసి ఆత్రంగా గాలి పీల్చుకున్నాడు జో.

డేవిడ్ ముఖం మీది తొడుగును పీకేసి అతని ముఖంకేసి పరీక్షగా చూశాడు. నైట్రోజన్ అధికమవటంతో రక్తనాళాలు చిట్లినట్టున్నాయి. దాని లక్షణాల కోసం వెతికాడు. అతడికి డేవిడ్ కళ్లల్లో నీళ్లు, చీకట్లో మిలమిలలాడుతూ కనిపించాయి!

* * *

ఆ రాత్రి డేవిడ్‌కు విపరీతంగా కీళ్ల నొప్పులు వచ్చాయి. వెంటనే హాస్పిటల్‌లో చేర్చాడు జో. డాక్టర్లు జో, డేవిడ్లకు ఆక్సిజన్ చికిత్స చేశారు. అయితే, డేవిడ్ నొప్పులు త్వరగానే తగ్గిపోయాయి. ఆశ్చర్యంగా జోకు ఎటువంటి నొప్పులూ లేవు.

"మేం ఆ రోజు ప్రాణాలతో బతికి బయటపడటం ఒక అద్భుతం" అని చెప్పే జో మాటల్లో సత్యం ఉంది.

"నేనీరోజు బతికి ఉండటానికి నాన్ననే కారణం. తన ప్రాణాలను పణంగా పెట్టి నా ప్రాణాలు కాపాడాడు. ఆ రోజే నేను అతి ముఖ్యమైన పాఠం నేర్చుకున్నాను. అదేమిటంటే... 'ఈ ప్రపంచంలో మనిషి ప్రాణానికి మించిన విలువైంది మరేదీ లేదు" అంటాడు డేవిడ్.

ప్రమాదం అంచుకు చేర్చిన ఆ ఘడియలు వారికొక పీడకల!

© EMESCO BOOKS

# మానవ మృగాల మధ్య...!

**తన శరీరంపై జరిగిన అత్యాచారాన్ని ఆత్మశక్తితో ఎదుర్కొని నేరస్తులను పట్టించిన యువతి అద్భుతకథ.**

అక్టోబర్ 1995...

చప్పట్లతో హాలు దద్దరిల్లుతోంది. క్షణం క్రితమే పాల్ హారిస్ ఫెలోషిప్ అవార్డు, మానవత్వానికి అందుకున్న టియాన్ ఐలెర్డ్ కూడా చప్పట్లు చరచటం ఆరంభించాడు.

నెమ్మదిగా స్టేజి ఎక్కి అత్యద్భుతమైన సాహసానికి అవార్డు నందుకుంది అలిసన్. ఆమె కళ్లలో నీళ్లు తిరగసాగాయి. ఒక ముత్యపు చుక్కలాంటి నీటిబొట్టు ఆమె అందుకున్న పతకంపై పడింది. ఆ నీటి చుక్కలో మెరుస్తూ ఆమెకు ఆ సంఘటన కనబడసాగింది.

* * *

డిసెంబర్ 18, 1994. పోర్ట్ ఎలిజబెత్, దక్షిణాఫ్రికా. సాయంత్రమంతా మిత్రులతో సముద్ర తీరంలో హాయిగా గడిపి ఇల్లు చేరిన ఎలిసన్ తనలో తాను పాడుకుంటూ కారు తలుపు తీయబోయింది.

"లోపలకు జరుగు" ఆమెను కార్లోకి తోస్తూ కర్కశంగా అన్నాడతడు.

జరుగుతున్నదేమిటో ఆమెకు అర్థమయ్యేలోగా ఆమె మెడ మీద కత్తి ఉంది. అతడు పూర్తిగా నల్ల దుస్తులు వేసుకుని ఉన్నాడు. అతడి నీలి కళ్లు క్రూరంగా ఆమెని పరిశీలిస్తున్నాయి. ఆమె కారు లోపలకు జరిగింది. అతడు స్టీరింగ్ ముందు కూచుని తలుపు వేశాడు. ఆమెవైపు చూసి నవ్వి కత్తిని మడిచి జేబులో పెట్టుకున్నాడు.

"భయపడకు! నా ఇంట్లో దొంగతనం జరిగింది. ఆ దొంగని పట్టుకుని నా వస్తువులు తెచ్చుకునేందుకు నాకీ కారు అవసరం."

© EMESCO BOOKS

తనలో చెలరేగుతున్న భయాందోళనలను అదుపులో పెట్టుకుంటూ పైకి శాంతంగా అంది –

"నేను చాలా అలసిపోయి ఉన్నాను. కారు తీసుకువెళ్లు. పని అయిపోయిన తరువాత తెచ్చి ఇచ్చెయ్యి."

అతడు మృదువుగా నవ్వాడు.

"నీ పేరేంటి?"

"సూసన్" కావాలని అబద్ధం చెప్పింది అలిసన్.

"సూసన్! నువ్వు నాకు నచ్చావు. ఒక్కడికి డ్రైవింగ్ బోరుగా ఉంటుంది. పక్కన నీలాంటి అందమైన అమ్మాయి ఉంటే ప్రయాణం ఆనందంగా సాగుతుంది" కారు వేగాన్ని పెంచుతూ అన్నాడు అతడు.

ఆమెకేం చేయాలో తోచలేదు. మౌనంగా భగవంతుణ్ణి ప్రార్థించసాగింది.

* * *

కారు ఓ నైట్‌క్లబ్ ముందు ఆగింది. ఆ ప్రాంతం చూస్తుంటేనే అలిసన్‌కు వణుకు రాసాగింది. బయట ఉన్న మనుషులకన్నా కారులో తన పక్కన ఉన్న వ్యక్తే మర్యాదగా అనిపిస్తున్నాడు.

ఇంతలో హఠాత్తుగా లావుగా, పొట్టిగా ఉన్న వ్యక్తి కారు తలుపు తీసుకుని వెనుక సీట్లోకి వచ్చాడు. అతడూ నల్లటి దుస్తులు వేసుకున్నాడు.

"నా ఫ్రెండ్" పేరు చెప్పలేదు అతడు.

"హలో" అంది అలిసన్.

అతడు కళ్లతో ఆమెని నఖశిఖ పర్యంతం స్పృశిస్తూ కూచున్నాడు తప్ప మాట్లాడలేదు. కారు మళ్లీ బయలుదేరింది. "ఎటు?" ఆందోళనని అణుచుకుంటూ అడిగింది అలిసన్.

అతడు సమాధానం ఇవ్వక నవ్వాడు.

* * *

సముద్రం ఒడ్డున ఉన్న చీకటి పొదల వద్ద కారు ఆగింది. ఆ ప్రాంతాన్ని 'నూర్డోక్' అంటారు. చీకటి పడితే మామూలు మనుషులు ఆ ప్రాంతంలో తిరగరు. అలిసన్ గుండెలు దడదడలాడసాగాయి.

'ఇప్పుడు వీళ్లేం చేస్తారు?'

© EMESCO BOOKS

అలిసన్‌కు 27 ఏళ్లు. ఆమెకు పెళ్లయింది. భర్తతో విడాకులు తీసుకుంది. సెక్స్ ఆమెకు కొత్త కాదు.

కానీ ఇలా ముక్కూ మొహం తెలీని వ్యక్తి ... కాదు వ్యక్తులు, తన ఇష్టంతో ప్రమేయం లేకుండా, జంతువుల్లా పొదలలో... ఆమె శరీరం వణకసాగింది. కానీ ఆమె తన భయాన్ని అణచుకోవాలని ప్రయత్నిస్తోంది. ఎందుకంటే ... ఇటువంటి వాళ్లు సాడిస్టులై ఉంటారు. న్యూనతా భావంతో బాధపడుతుంటారు. తాను వారిని చూసి భయపడుతున్నట్టు కనిపిస్తే వారి ఆనందం పెరుగుతుంది. తను వారిని దూరం నెట్టేస్తే వారి అహం దెబ్బతిని, మృగాలు కాస్తా రాక్షసులవుతాయి.

"కారు లైట్లు ఎలా ఆర్పాలి?" అడిగాడతడు.

అలిసన్ చూపించింది. లైట్లార్పేశాడు.

"ఇప్పుడేమిటి?" ధైర్యం చిక్కబట్టుకుని అడిగింది అలిసన్.

"ఇప్పుడు మనం సెక్స్ చేస్తాం" తాపీగా అన్నాడు అతడు.

ఆమె దృష్టి వెనుక సీటు వాడివైపు మళ్లింది.

వాడు అప్పటికే నగ్నంగా ఉన్నాడు. ఉద్రేకంతో వాడి ముఖం ఉబ్బి, రాక్షసంగా ఉంది.

ఆమెకు ఇది నిజమనిపించటం లేదు. ఇదేదో పీడకల...! కాస్సేపటికి తాను కళ్లు తెరుస్తుంది. తన బెడ్‌మీద పడుకుని ఉంటుంది. ఇది కల కాదని గుర్తుచేస్తూ అతడు దుస్తులు విప్పుతున్న శబ్దం వినిపించింది.

ఆమె కళ్లు మూసుకుంది.

"కళ్లు తెరు" కత్తిని ఆమె చుబుకం కింద పెట్టి అన్నాడతడు. ఆమె కళ్లు తెరిచింది.

"నువ్వూ బట్టలు విప్పు" ఆజ్ఞాపించాడు.

ఆమెకు ఏడుపు వస్తోంది. 'ఇది నిజం కాదు. ఇది కల'– పదే పదే మననం చేస్తోంది.

ఒకటికి పదిసార్లనుకున్నా నిజం కలకాదన్నట్టు, ఆమె అనాచ్ఛాదిత శరీరంపై వెనుకసీటు వ్యక్తి కరకు చేతులు కదలాడుతున్నాయి. ఒంటిపై తేళ్లు, జెర్రెలు పాకుతున్న భావన కలిగింది ఆమెకు.

"థీన్స్! ముందు నీ వంతు" అన్నాడు అతడు కారులోంచి దిగుతూ...

అప్పటికే వెనుక సీటు అతను ఆమెను వెనుక సీట్లోకి ఆత్రంగా లాక్కుంటున్నాడు. ప్రతిఘటించి వారి ఆనందాన్ని ద్విగుణీకృతం చేయదలచుకోలేదు ఆమె. కానీ ఆమెకు ఎంతో అవమానంగా ఉంది.

'థీన్స్' అనేవాడు ఆమె శరీరాన్ని అపవిత్రం చేస్తుంటే, మరోవ్యక్తి నవ్వుతూ చూస్తున్నాడు. 'థీన్స్'ని ప్రోత్సహిస్తున్నాడు. వాడు చూడటం మరీ అసహ్యంగా ఉంది. ఇది నిజం కాదు!



© EMESCO BOOKS

'ఇది అనుభవిస్తున్నది తానేనా?' కాదు.

ఈ అనుభవం శరీరానికి తప్ప తన మనసుకి కాదు. శరీరం నాశనం అయిపోతుంది. మనసు... మనసు భగవంతుడి ప్రతిరూపం.

ఆమె తన శరీరాన్ని వదలి మనసుపై దృష్టి కేంద్రీకరించింది.

'థీన్స్' లేచాడు.

"ఫ్రాన్స్! ఇప్పుడు నీవంతు" అన్నాడు ఆయాసంతో –

నవ్వుతూ ఫ్రాన్స్ ముందుకు వచ్చాడు.

ఆమె వాళ్లిద్దరి పేర్లు గుర్తుంచుకున్నది. వీళ్లెందుకింత పశువుల్లా ప్రవర్తిస్తున్నారో ఆమెకు అర్థంకాలేదు. సెక్స్ ఇద్దరు వ్యక్తులు ఆనందంగా ఒకరిపై మరొకరు ప్రేమను ప్రదర్శిస్తూ సౌఖ్యాన్ని అందుకునే చర్య. దాన్ని వాళ్లిలా, ఆత్రంగా పశువుల్లా, సున్నితత్వమన్నదే లేకుండా అనుభవించేయాలని ఎందుకు తపన పడుతున్నారు? ఇందువల్ల వీరికేం సంతృప్తి లభిస్తుంది? బహుశా వీరికి పసితనంలో ప్రేమ అన్నది లభించలేదేమో! అంత బాధలోనూ ఆమెకు వారిపై జాలి కలుగుతోంది.

* * *

స్పృహ వచ్చిన అలిసన్ తన శరీరం వైపు చూసుకుంది. కారు వెనుక సీట్లో నగ్నంగా పడి ఉంది ఆమె. ఆమెకు జరిగింది గుర్తుకు వచ్చింది.

ఇదంతా కల కాదు, ఘోరమైన చేదు నిజం!

ఆమెకు స్పృహ రావటం చూసి ఫ్రాన్స్ నవ్వుతూ ఆవైపు వచ్చాడు. అతడి చేతిలో కత్తి తళతళలాడుతోంది.

"మా గురించి పోలీసులతో చెప్తావా?" అడిగాడు ఫ్రాన్స్.

"చెప్పను. నాకీ అవమానం జరిగినట్టు ఎవరికీ తెలియటం నాకిష్టం లేదు" అంది అలీసన్.

"మేం నమ్మం" కరకుగా అన్నాడు థీన్స్.

భయంతో ఆమె వణకసాగింది. 'దేవుడా! ఇంకా ఎటువంటి అనుభవాలు రాశావు నాకు'– ఆమె మనసు రోదించసాగింది.

* * *

థీన్స్ అనేవాడు ఆమె గుండెలమీద కూర్చున్నాడు.

© EMESCO BOOKS

"ప్లీజ్ నన్ను చంపకు" బతిమిలాడబోయింది అలిసన్. కానీ ఆమె మాటలను సగంలో కోసేస్తూ అతడు ఆమె గొంతు నొక్కేయసాగాడు.

ఆమె కళ్లు తేల వేసింది. ఆమె స్పృహ కోల్పోయింది. ఇద్దరూ ఆమె నగ్న శరీరాన్ని పొదల్లోకి లాగారు. ఆమె శరీరాన్ని నేలపైకి విసిరేశారు.

"చచ్చిపోయిందా?" అడిగాడు ఫ్రాన్స్.

ఆ మాట వింటూనే పిచ్చెక్కిన వాడిలా కత్తితో ఆమె శరీరంపై అందినచోటల్లా పొడవసాగాడు థీన్స్. అయినా ఆమె కాళ్లు కదలుతుండటంతో విసిగి కత్తితో ఆమె గొంతు కోశాడు.

కాస్సేపటికి ఫ్రాన్స్ కూడా అతడికి తోడయ్యాడు. ఇద్దరూ ఆమె శరీరాన్ని కోసి పారేశారు. మెడనుండి కాలివరకూ చీరేశారు. ఇక విసిగి లేచారు. కారులోంచి ఆమె దుస్తులు బయటకు విసిరి వెళ్లి పోయారు.

* * *

నమ్మశక్యం కాని విషయమేమిటంటే వారి విచక్షణా రహితమైన దాడి అలిసన్ ప్రాణాలను కాపాడింది. గొంతు నొక్కటంవల్ల ఆమె 'విండ్‌పైప్ (శ్వాస నాళిక) మూసుకుపోయింది. కానీ వాళ్లు గొంతు కోయటం వల్ల ఆమె గొంతు ద్వారా గాలిని గుండెల్లోకి పీల్చగలుగుతుంది.

చిత్రంగా తన శరీరంపై వారు దాడి చేస్తున్నా అలిసన్‌కు ఏమీ అనిపించటం లేదు. పైగా ఆమె వారు తనని ఎన్నిసార్లు పొడిచారో లెక్కించింది. ఆమె పైనుండి, కింద తన శరీరంపై జరుగుతున్న అత్యాచారాన్ని గమనిస్తోంది. కాస్సేపటికి ఆమె తిరిగి తన శరీరంలో ప్రవేశించింది.

"నేనిలా ఛావను. వాళ్లని పట్టిస్తాను. ఇలా నడిరోడ్డులో దిక్కులేని చావుఛస్తే అమ్మ ఎంతగానో బాధపడుతుంది" ఆమె ఆలోచించసాగింది.

అక్కడే ఇసుకలో ఫ్రాన్స్, థీన్స్ అన్న పేర్లు రాసింది.

శక్తినంతా కూడదీసుకుని పొద బయటకు పాకసాగింది. ఆమె ఒక వైపుకు వంగగానే ప్రేవులు బయటకు వేలాడాయి. వాళ్లు విసిరేసిన గుడ్డలతో ప్రేవులను కప్పి పట్టుకుని అలాగే పాకసాగింది. అలా 65 మీటర్లు పాకింది. రోడ్డుకడ్డంగా ఎవరో పడి ఉండటం చూసి కారు ఆపాడు టియాన్ ఐలార్డ్. కారులోని ఫ్రెండ్స్‌తో కలసి నగ్నంగా, మాంసం వేలాడుతూ, రక్తపు ముద్దలా ఉన్న ఆమె దగ్గరకు వెళ్లాడు.

కొన ఊపిరితో ఉంది. ఆమె మెడలో లోతు గాయం.

"కారాక్సిడెంటా?" ఆమెని మాట్లాడించాలని అడిగాడు ఐలార్డ్.



© EMESCO BOOKS

కాదన్నట్టు వేళ్లు బలహీనంగా కదల్చింది. ఈలోగా మొబైల్ ఫోన్లలో అంబులెన్స్‌ని పిలిచారు. అంబులెన్స్ వచ్చేవరకూ ఆమె స్పృహ కోల్పోకుండా మాట్లాడిస్తూ కూచున్నాడు ఐలార్డ్. అతని మిత్రులు ఆమెవైపే చూడలేకపోయారు. అంబులెన్స్‌లో ఆమెతోపాటు ఎక్కాడు ఐలార్డ్.

* * *

ఆమెని చూస్తూనే ఆశ్చర్యపోయాడు 42 ఏళ్ల డాక్టర్ వలోదియా ఆంజెలోవ్. వెంటనే ఆపరేషన్ ఆరంభించాడు. రెండుగా కత్తిరించిన థైరాయిడ్ గ్లాండ్‌ను కలిపి కుట్టాడు. కత్తి ఇంకొన్ని మిల్లీమీటర్లు లోతు దిగితే ఆమె వెంటనే మరణించి ఉండేది. ఆమె పొట్టపై 25 కత్తి గాయాలున్నాయి.

* * *

"నామీద అత్యాచారం చేసినవాళ్లని పోలీసులకు పట్టిస్తాను" స్పృహ వచ్చిన తరువాత అలిసన్ మాట్లాడిన మొదటి మాట అది.

ఆమె ఇచ్చిన వివరాలను బట్టి పోలీసులు థీన్స్ క్రూజర్, ఫ్రాన్స్ డ్యుటాయిట్ అనే ఇద్దరిని అరెస్టు చేశారు. వారికి నేర చరిత్ర ఉంది. అలిసన్ చావలేదని తెలిసి వారు ఆశ్చర్యపోయారు.

"అంత దాడి తరువాత కూడా బతికి ఉందంటే ఆమె మనిషి కాదు" అన్నాడు క్రూజర్.

"అవును... మీరు మనుషులైతేగా? పశువులు!" అన్నాడు పోలీసాఫీసర్ పళ్లు పటపటలాడిస్తూ.

* * *

అలిసన్ బతకటమే అద్భుతం అంటే, ఆమెకైన గాయాలకు 15 రోజుల్లోగా ఆమె కోలుకోవటం మరీ వింత!

1994 డిసెంబర్ 31న ఆమె హాస్పిటల్‌ను వదలి ఇల్లు చేరింది.

జూన్ 12, 1995. కోర్టులో అలిసన్ తనపై జరిగిన అత్యాచారాన్ని వివరించింది. అక్కడున్న వారందరి దృష్టి ఆమె మెడచుట్టూ ఉన్న ఎర్రటి రిబ్బన్‌లాంటి చారికపైనే ఉంది. ఆ ఎర్రచారిక ఎన్నో భయంకరమైన నిజాలకు ప్రతీకలా అందరి మనస్సులను కలవరపెడుతోంది.

కోర్టులో థీన్స్ కూజర్, ఫ్రాన్స్ డ్యుటాయిట్ల గురించి అనేక విషయాలు వెల్లడయ్యాయి. ఇరవై ఆరేళ్ల ఫ్రాన్స్ డ్యుటాయిట్‌కు పెళ్లయింది. ఇద్దరు పిల్లలు.

© EMESCO BOOKS

కానీ ఇలా లైంగిక కోరికలు తీర్చుకోవటం అతనికి అలవాటయింది. 19 ఏళ్ల ఓ అమ్మాయిపై అత్యాచారం చేసి అరెస్టయి బెయిల్‌మీద విడుదలయ్యాడు.

అయినా 21 ఏళ్ల గర్భిణీ స్త్రీపై, థీన్స్ క్రూజర్‌తో కలసి అత్యాచారం చేశాడు. ఇద్దరూ అరెస్టయి బెయిల్‌మీద విడుదలయ్యారు.

ఆ తరువాత వాళ్లు అలిసన్‌పై దాడిచేశారు.

కోర్టులో ఎనిమిది వారాల పాటు వాదోపవాదాలు జరిగాయి.

ఇద్దరికీ యావజ్జీవ కారాగార శిక్ష విధించింది కోర్టు.

"వీళ్లు బతికి ఉన్నన్నాళ్లు జైల్లో నాలుగు గోడల మధ్య గడపాల్సిందే" అని తీర్పునిచ్చాడు జడ్జి.

అంతటితో అలిసన్ పోరాటం పూర్తి కాలేదు.

బలాత్కారం కేసుల్లో అరెస్టయినా, వెంటనే నేరస్తులకు బెయిల్ మంజూరు చేయటంవల్ల వారికీ మరిన్ని అత్యాచారాలు చేసే అవకాశం కోర్టులు కల్పిస్తున్నాయని, అందువల్ల తనలాంటి వారి జీవితాలు నరకప్రాయం అవుతున్నాయని అలిసన్ ఇప్పుడు ప్రభుత్వంపై కోర్టులో కేసువేసింది. దేశమంతా తిరుగుతూ అత్యాచారానికి గురైన వారికి ధైర్యం చెప్తూ ఉపన్యాసాలు చేస్తోంది. వారి సంరక్షణకు ఓ నిధిని ఏర్పాటు చేసింది.

* * *

కరతాళ ధ్వనులు మిన్నంటాయి.

కన్నీటి చుక్క కిందకు జారిపోయింది. ఉలిక్కిపడి తలెత్తింది అలిసన్. ఇప్పుడు ఆమె కళ్లలో నీళ్లు లేవు. ఆమె కళ్లలో జ్ఞాన జ్యోతులు వెలుగుతున్నాయి.

"నా ఈ అనుభవం నాకొక పాఠం నేర్పింది. భయాలన్నీ మన శరీరానికే. ఈ శరీరం లోపల మరో సజీవ శక్తి ఉంది. మనం పైపై శరీరాన్ని చూసి భ్రమ పడతాం. కానీ ఈ లోపలి సజీవ శక్తిని గుర్తిస్తే మనకు భయం లేదు. కోపం లేదు, ద్వేషంలేదు, నిరాశ నిస్పృహలు దరిదాపులకు రావు. అనంతమైన ప్రశాంత ఆనంద సాగరం మనలోనే ఉంది.

పొదల్లోంచి రోడ్డువైపు 65 మీటర్లు నేను పాకానంటారు. కానీ నా శరీరానికైన గాయలకు అతీతంగా పనిచేసిన ఆ శక్తి నన్ను పాకించింది. నన్ను బతికించింది. నాకు జ్ఞానాన్నిచ్చింది. నా శరీరం వేరు, ఆ శరీరంలో ఉన్న నేను వేరు – అన్న గ్రహింపునిచ్చింది. ఈ బహుమతి నా శరీరానికే, మీ ఆదరణ నా లోపలి మనిషికి అసలైన బహుమతి!" అంది అలిసన్ బహుమతి స్వీకార ఉపన్యాసం ఇస్తూ.



© EMESCO BOOKS

# ప్రాణభిక్ష!

**ఇంట్లో ప్రవేశించిన దొంగను ధైర్యంగా ఎదుర్కొని పోలీసులకు పట్టించిన పడతికథ**

**ఏదో** శబ్దం.

ఉలిక్కిపడి లేచింది మార్జోరి.

సాధారణంగానే అతి భయస్తురాలు ఆమె. చీకటంటే ఆమెకు మరీ భయం.

ఆ భయం ఆధారంగా భర్త పీటర్ మార్జోరిని వెక్కిరిస్తుంటాడు. అందుకని భయాలను అణచుకోవాలని ఆమె తీవ్రంగా ప్రయత్నిస్తోంది. కానీ వెన్నంటే నీడలా, భయం ఆమెని వదలటంలేదు.

మెలకువ వచ్చాక మార్జోరీ చుట్టూచూసింది.

నీలిరంగు వెలుతురులో బెడ్‌రూమ్ నిశ్శబ్దంగా ఉంది. పక్కన పసికందు తన అయిదు నెలల బాబు రేమండ్ ఉచ్ఛ్వాస నిశ్వాసలు వినిపిస్తున్నాయి.

మార్జోరీకి ఎయిర్ కండిషన్డ్ గదిలోని చల్లదనం పడటం లేదు. అలా అని ఒంటరిగా పడుకోవాలంటే భయం.

ఎయిర్ కండిషనర్‌ను ఆపేసేందుకు పీటర్ ఇష్టపడడంలేదు. దాంతో మార్జోరీ, రేమండ్‌ని తీసుకుని ఒంటరిగా పడుకోవాల్సి వచ్చింది. మూడేళ్ల పీటర్ ఇంటి వెనుక ప్రత్యేకంగా కట్టిన ఎయిర్ కండిషన్డ్ గదిలో పడుకున్నాడు.

మళ్లీ శబ్దం వినిపించింది.

'ఏమై ఉంటుంది?' తనున్న దగ్గరనుంచి కదలాలంటే మార్జోరీకి భయంగా ఉంది. అందుకే దుప్పటిని ముఖంమీదకు లాక్కుని, కళ్ల గట్టిగా మూసుకుని పడుకుంది.

© EMESCO BOOKS

కానీ త్వరలో మార్జోరి అసాధారణ సాహసాన్ని ప్రదర్శిస్తుందని ఆమె కాదు, మరెవరూ ఊహించలేదు.

అది మార్చి 4, 1995.

* * *

తలుపు దగ్గర నిలబడ్డాడతను. అంతా నిశ్శబ్దంగా ఉంది.

ఇంటికెదురుగా కారు ఆగి ఉంది.

ఇంటి తాళం విరగ్గొట్టేందుకు ఏమైనా దొరుకుతాయేమోనని వెతికాడు అతడు. కారు డిక్కీలో ఇనుపరాడ్ దొరికింది.

చేతిలోని రాడ్‌వైపు చూసుకున్నాడు.

తలుపు వైపు చూశాడు.

నెమ్మదిగా రాడ్‌ను గాల్లోకి ఎత్తాడు.

* * *

ఉలిక్కిపడి లేచింది మార్జోరి.

ఆమె ఒళ్లంతా చమట్లతో తడిసిపోయింది. గడియారం వైపు చూసింది.

రెండున్నర గంటలు!

'ఇంతరాత్రి సమయంలో పీటర్ నిద్రలేచి ఏం చేస్తున్నట్టు?' అనుకుంది.

ఇంతలో హాలులో లైటు వెలిగింది.

* * *

అతడు డబ్బు కోసం వెతుకుతున్నాడు. ముందుగా వంటగదిలో వెతికాడు. ఆ తరువాత స్టోర్‌రూమలో వెతికాడు. ఇపుడు హాలు చేరాడు. హాల్లోని అల్మారా అరల్లో చకచకా వెతుకుతున్నాడు.

"ఎవర్నువ్వు?"

ఏకాగ్రతతో తన పనిలో నిమగ్నమై వున్న అతడు గిరుక్కున వెను తిరిగాడు.

* * *

అతనెవరో అపరిచితుడు!

ఇంట్లో దూరాడు. బీరువాలో వెతుకుతున్నాడు. డబ్బుకోసం కావచ్చు.

చీకటంటేనే భయపడే మార్జోరీకి చిత్రంగా భయం వేయలేదు.



© EMESCO BOOKS

ఎదురుగా ఉన్నది ఒక కుర్రాడు. పదిహేడు – పద్దెనిమిదేళ్ల కన్నా ఎక్కువుండవు అతనికి. దొంగలా ఇంట్లో దూరినందుకు అతడిపై ఆమెకు కోపానికి బదులు జాలి కలుగుతోంది.

"వెంటనే ఇల్లు వదిలి వెళ్లిపో. లేకపోతే పోలీసులను పిలుస్తాను"

ఆమె పనిచేసే యూత్ సెంటర్‌లో ఆ వయసు కుర్రాళ్లు అనేకులు ఉన్నారు. కాస్త బెదిరిస్తే వారు బెదిరిపోతారు. ఈ కుర్రాడూ వారికి ఏమాత్రం వేరు కాదు అనుకుంది. కానీ అతడి స్పందన పూర్తిగా వ్యతిరేకంగా ఉంది.

ఆ హెచ్చరికకు అతడు ఏ మాత్రం భయపడక పోగా వెంటనే ఆమెవైపు దూకాడు.

ఆమె చేయి పట్టుకుని బెడ్‌రూమ్ వైపు లాగాడు. గదిలోకి చేరగానే ఆమెను మంచం పైకి తోశాడు. జరిగేది అర్థమయ్యేలోగా ఆమె మంచంపై పడి ఉంది. అతడు ఆమె మీదకు దూకేందుకు సిద్ధంగా ఉన్నాడు. ఆమె వెంటనే రెండు కాళ్లతో అతని పొట్టలో బలంగా తన్నింది. అతడు లుంగచుట్టుకుని నేలపై పడ్డాడు. ఆమె ఆలస్యం చేయకుండా మంచం మీద నుంచి దూకి కిచెన్ వైపు పరుగెత్తింది. అతడు లేచి ఆమె వెంటపడ్డాడు.

హాలు చేరి వెనకే తలుపేయాలని మార్జోరి ప్రయత్నించింది. కానీ అతడు తలుపు వేయకుండా అడ్డుపడ్డాడు. ఆమెను బెడ్‌రూమ్‌లోకి తోయాలని ప్రయత్నించసాగాడు. తలుపు తెరచుకోకుండా అడ్డుపడుతూనే అతడ్ని మాట్లాడించాలని ప్రయత్నించసాగింది మార్జోరి.

ఆవేశంలో ఉన్నవాడిని మాట్లాడించాలంటారు. అలా మాట్లాడడంద్వారా అతనిలోని ఆవేశం దారి మళ్లుతుందని ఆమె విన్నది.

"నీకు నా భర్త పీటర్ తెలుసనుకుంటాను. నువ్వుండేది ఎక్కడ? ఇటువంటి పనులు ప్రమాదకరమని నీకు తెలియదా? అనవసరంగా నేరస్తుడిగా ముద్ర వేయించుకుని జీవితం ఎందుకు పాడు చేసుకుంటావు?"

ఆమె మాట్లాడుతుంటే ఏకాగ్రతగా వింటున్న అతడు మారు మాట్లాడలేదు. అతనినుండి ఎలాంటి స్పందనాలేదు. ఎటువంటి హెచ్చరిక లేకుండా చేయిపైకి ఎత్తాడు. వెలుతురులో అతని చేతిలోని కత్తి తళతళలాడింది.

ఆమెకేం చేయాలో తెలియలేదు.

భయంతో రక్తం గడ్డకట్టుకుని పోయింది. వేగంగా తన మీదకు వస్తున్న కత్తికి అప్రయత్నంగా చేతిని అడ్డం పెట్టింది. ఆమె చేయినికోస్తూ కిందకు దిగింది కత్తి! అయినా సరే బాధను అణచుకుంటూ కత్తిని బలంగా పట్టుకుని వంచింది. ఆమె చేతిలో కత్తి విరిగింది. విరిగిన భాగం ఆమె చేతిలో గుచ్చుకుకోగా, మిగతా మొండికత్తి అతని చేతిలో మిగిలింది.



© EMESCO BOOKS

చేతిమీద నిప్పు మండిస్తున్న భావన కలిగింది ఆమెకు. ఇంతలో ఆ మొండికత్తినే ఆమె శరీరంలోకి గుచ్చాడతడు.

ఆమె స్థాణువైంది. శరీరం మొత్తం ఎవరో మంట పెట్టినట్లు భయంకరమైన బాధ.

అతడు ఆమెను దగ్గరకు లాగి, పిడికిలి బిగించి ముఖంపై బలంగా మోదాడు.

ఆమెకు కళ్లు బైర్లుకమ్మి చుక్కల్ని చూసినట్టయ్యింది.

ఉన్నఫలాన నేలపై పడిపోయింది.

'ఇంకో దెబ్బ ఇటువంటిది తగిలితే ఇక తన పని అయిపోతుంది' అనుకుందామె. గుండెలో మొండికత్తితో అతనుచేసిన గాయం నుండి రక్తం ధారాపాతంగా కారుతోంది.

అతడు కత్తిని మళ్లీ పైకెత్తాడు!

ఒంట్లోని సర్వశక్తిని కూడదీసుకుని ఆమె అతడిపైకి మెరుపులా లంఘించింది. ఊహించని ఈ ఎదురు దాడికి అతడు వెనక్కు తూలాడు. అతడి చేతిలోని కత్తి ఆమె చేతిలోకి వచ్చింది. వెంటనే బలంగా అతడిలో దింపేందుకు ఆమె కత్తిని ఎత్తింది.

కానీ ఒకే ఒక్కక్షణం తటపటాయించింది.

'అతడు కుర్రాడు. ఇటువంటి కుర్రాళ్లెందరినో తనురోజూ యూత్ సెంటర్‌లో చూస్తుంటుంది. మంచి భవిష్యత్తు వాళ్లు....

చంపడం భావ్యమా!?' – అనుకుంది.

సరిగ్గా అప్పుడే ఆమెకు పసివాడు రేమండ్ ఏడుపు గదిలోంచి వినిపించింది.

వీడు ... రేమండ్‌ని చంపితే!?

ఆమె ఆలస్యం చేయలేదు. ఆమె కత్తిని అతడి గుండెలోకి దింపేబదులు తలవెనుక, వీపులో వెంటవెంటనే పొడిచింది. 'గాయాలవుతాయి. కానీ ప్రాణానికి ప్రమాదంలేదను'కుంది. 'తాత్కాలికంగా అతడు నిర్వీర్యుడవుతాడే తప్ప శాశ్వతమైన హాని కలగదు' అనుకుంది.

కానీ ఆమె ఊహకు అతీతంగా అతడు ప్రవర్తించాడు. కత్తిగాట్లను ఓర్చుకుంటూ ఆమె కదలికను ఊహించి, మూడోసారి ఆమెచేతిని గాల్లోనే పట్టుకున్నాడు.

ఆమె చేతిని బలంగా మెలి తిప్పి కత్తిని లాక్కున్నాడు.

అప్పుడు అతడు ఆమెలా ఆలోచించలేదు. కత్తిని ఆమె కణతల్లోకి నిర్దాక్షిణ్యంగా దింపాడు. బాధతో కెవ్వున అరిచింది. ఊపిరికోసం రొప్పుతోంది.

'తనకు ప్రాణం పోవటం తథ్యమని' అర్థమైంది. ఒంట్లోని సత్తువనంతా కోల్పోతోంది. చైతన్యం శరీరాన్ని వదిలిపోతున్నట్టు ఆమె గ్రహిస్తోంది.



© EMESCO BOOKS

నేలపై కుప్పకూలిపోయింది.

"హెల్ప్ హెల్ప్...!"

గొంతు పెగలట్లేదు.

ఆమెను మళ్లీ పొడిచి ప్రాణం తీసేందుకు ఆ కుర్రాడు మరోసారి కత్తి ఎత్తాడు.

కానీ అది కిందకి దిగలేదు. కారణం ఆమె అతడిడొక్కలో తన బూటుకాలితో బలంగా తన్నింది. ప్రాణం పోయేట్టు అరిచాడు.

వెంటనే దిగ్గున లేచి కిచెన్‌లోకి పరుగెత్తాడు. అతడు మరోకత్తిని తేబోతున్నాడని ఆమెకు అర్థమైంది!

రేమండ్ ఏడుపు గదిలోంచి ఇంకా వినిపిస్తోంది. తను మరణించినా ఫరవాలేదు. కానీ పసిగుడ్డు రేమండ్‌కు ఏం కాకూడదు.

'భగవంతుడా! నాకు శక్తినివ్వు!!' అనుకుంది గట్టిగా కళ్లు మూసుకుంది.

ఆమె ప్రార్థనను దేవుడు విన్నాడో లేడో కాని రేమండ్ రూపంలో ఆమెకు ప్రాణభిక్ష లభించింది!

నెమ్మదిగా పాక్కుంటూ ఆమె రేమండ్‌ని చేరుకుంది.

కానీ దాక్కోవడానికి భద్రమైన స్థలం ఏది? రేమండ్‌ని గుండెకు బలంగా హత్తుకుని బాత్‌రూమ్‌లో దూరి తలుపేసింది. వెంటనే ఆవైపునుంచి అతడు తలుపుమీద మోదటం ఆరంభమైంది. అంటే చిటికెలో అతడి బారినుంచి తప్పించుకుందన్నమాట!

బలమంతా ఉపయోగించి తలుపుకు అడ్డంగా కూలబడింది మార్జోరి. కాస్సేపటికి బయటనుండి తలుపుపై చప్పుడు తగ్గింది. మార్జోరికి కళ్లు తిరుగుతున్నాయి.

బాత్‌రూమ్ నేల రక్తంతో ఎర్రబారింది. ఎంత సేపటికీ బయటనుండి ఎటువంటి శబ్దం వినబడకపోవటంతో మార్జోరి ధైర్యం చేసి నెమ్మదిగా తలుపుతీసి బయటికి తొంగి చూసింది.

ఎవరూ లేరు!

శక్తినంతా కూడదీసుకుని రేమండ్‌ని గట్టిగా హత్తుకుని ఒక్క పరుగున ఇంటి బయటకు వచ్చింది. వెనక ఉన్న ఎయిర్ కండిషన్డ్ గదిని చేరుకుంది.

తలుపు తట్టసాగింది. కానీ ఎ.సి. శబ్దానికి ఆమె బలహీనమైన పిలుపులు భర్తకు వినబడలేదు.

బాధనంతా పళ్లబిగువున అణచుకుంటూ భగవంతుడిని ప్రార్థించింది. శక్తిని మళ్లీ కూడ దీసుకుని ఎయిర్ కండిషనర్‌ను ఆపుచేసింది. అప్పుడు లేచాడు పీటర్.

© EMESCO BOOKS

రక్తం ముద్దలా అతడి ఒళ్లోకి జారిపోయింది. పీటర్ గుడ్లు తేలేసి వెంటనే తేరుకుని ఆమెని హాస్పటల్‌కి తరలించాడు. ఆలస్యం చేయకుండా డాక్టర్లు ఆమెని ఎమర్జెన్సీ గదిలోకి తీసుకెళ్లారు.

సరిగ్గా అప్పుడే మరోవ్యక్తి కట్లతో బయటికి వస్తున్నాడు. అతణ్ణి చూస్తూనే ఆమె –

"పీటర్... వాడే!!" అని హిస్టీరియా పేషెంట్‌లా అరిచి స్పృహ కోల్పోయింది మార్జోరి.

* * *

అసాధారణ సాహసాన్ని, తెగింపును ప్రదర్శించిన మార్జోరి మృత్యువుతో పోరాడి విజయం సాధించింది.

'ఆమె కోలుకోవడాన్ని ఓ అద్భుతంగా' అభివర్ణించాడు డాక్టర్లు. గుండెలోతు గాయమైనా, తన బిడ్డను హృదయానికి గట్టిగా హత్తుకోవటంవల్ల రక్తస్రావం ఆగి ప్రాణాపాయం తప్పిందని డాక్టర్లు అన్నారు.

ఆరోజు నవంబర్ 2, 1995.

కోర్టులో మార్జోరి సాక్ష్యం చెప్పింది.

అయితే దోపిడీ, హత్యకు ప్రయత్నించిన ఆ కుర్రాడు మైనర్ కావటంతో కోర్టు అతడికి పదకొండేళ్లు జైలు శిక్ష విధించింది.

"దీనివల్ల నాకు దైవంపై విశ్వాసం పెరిగింది. భయం బదులు నాలో ధైర్యం, తెగువ వచ్చాయి" అన్న మార్జోరిలో ఆత్మవిశ్వాసం కనిపించింది.

© EMESCO BOOKS

# మరో సత్యాగ్రహం!

**సత్యాగ్రహంతో ప్రజలను చైతన్యపరచి తీవ్రవాదుల ఆటకట్టించిన మహిళ మహత్తర గాథ.**

"**చీ**కటిని తిట్టుకుంటూ కూచుంటే చీకటిలోనే మగ్గుతావు...

చిరుదీపం వెలిగించే ప్రయత్నం చేస్తే పదిమందికి వెలుతురు పంచి నట్టవుతుంది"–

ఫాదర్ డెన్నిస్ ఫాల్ మాటలు నాన్సిగ్రేసీ చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి.

ఆమెకేం చేయాలో తోచటం లేదు.

నిస్సహాయతవల్ల కలిగిన ఆవేశం ఆమెను దహించి వేస్తోంది.

ఆమె ప్రమేయం లేకుండానే పిడికిళ్లు బిగుసుకున్నాయి. శరీరంలో ఉద్విగ్నత ప్రకంపనాలుగా మారి ఉండి ఉండి కుదిపేస్తోంది. కళ్ల నుండి నీళ్లు ధారాపాతంగా కారుతున్నాయి. గుండెలో ఆవేశం మంట మండిస్తోంది.

ఆమె కళ్లముందు బాధతో లుంగ చుట్టుకుపోతూ కేకలు పెడుతున్న పాడీ గ్రేసీ ముఖం కనిపిస్తోంది. రాక్షసుల్లా అతనిచుట్టూ తిరుగుతూ తుపాకులు ఝుళిపిస్తున్న ఐరిష్ రిపబ్లికన్ ఆర్మీ సంస్థ సభ్యులు కనిపిస్తున్నారు. పాడీ మోకాలిని తుపాకీతో కాల్చి అతడి వెన్నుపూస కింది భాగాన కాల్చేందుకు సిద్ధంగా ఉండి వికటంగా నవ్వుతున్న 'రాక్షసులు' కనిపిస్తున్నారు.

ఈ హింసకు అంతం లేదా?

'బాల్లీనో' ప్రాంతంలో ఓ ఫంక్షన్‌కు వెళ్లి తిరిగివస్తుంటే బస్సులో ఆర్మీ సభ్యులు అసభ్యంగా ప్రవరిస్తున్నారని అతడు అడ్డుపడ్డాడు. ఆ గోలలో ఆర్మీ నాయకుడు ఫెట్జ్‌సమ్మన్స్‌కు దెబ్బలు తగిలాయి. పాడీనే ఆయనను కొట్టాడని ఐఆర్ఎ వారి అభాండం.

ఐర్లండ్ రిపబ్లిక్‌లో ఐఆర్ఎ చెప్పిందే వేదం. వారు ప్రజలను భయభ్రాంతులను చేస్తూ, తమకు ఎదురు చెప్పిన వారిని హింసిస్తూ, చంపేస్తూ తీవ్ర భయోత్పాతాలను కలిగిస్తున్నారు. వారిని ప్రశ్నించే ధైర్యం ఎవరికీ లేదు.

© EMESCO BOOKS

రాజకీయ నాయకులకు కూడా ఐఆర్ఎ పేరు వింటేనే భయం. ఇటువంటి పరిస్థితుల్లో ఫిట్జ్ సిమ్మన్స్‌ను కొట్టాడన్న నేరంపై ఐఆర్ఎ సభ్యులు పాడీని జీవితాంతం జీవచ్ఛవంలా బతికేట్టు చేశారు. ఆ బాధను తను మౌనంగా భరించటం తప్ప మరేం చేయగలడు?!

నాన్సీ మనస్సులో ఆమె పాడీని తానెంతగా, అపురూపంగా పెంచిందో మెదిలింది. పాడీని తన గర్భంలోమోసి, జన్మనిచ్చి, అల్లారుముద్దుగా పెంచింది. ఎవరో అతడిని కాల్చి, ఎందుకూ పనికిరాని జీవచ్ఛవాన్ని చేశారు. దాన్ని తాను ఏడుస్తూ భరించడం ఏమిటి?

పిల్లల్ని పెంచేది ఇందుకేనా?

అసలు ఎవరికైనా ఇలా మరొకరిపై అఘాయిత్యంచేసే హక్కు ఎక్కడిది? కానీ ఐఆర్ఎ అమాయకులపై ఇటువంటి ఘోరాలు చేయడం ఐర్లండ్‌లో సర్వసాధారణం. 1973 నుండి దాదాపుగా 2000 కు పైగా కాల్చివేత సంఘటనలు జరిగాయి. తమను వ్యతిరేకించిన వారిని కొట్టడం, పోలీసులకు సమాచారం అందించారని ఆరోపించి చంపటం రోజూ జరిగే సంఘటనలే. అందరూ మౌనంగా ఈ అన్యాయాన్ని భరిస్తున్నారు. భరించలేని వారు దేశం వదలి పారిపోతున్నారు.

'ఏమిటిదంతా!?'

నాన్సీ మనసుకు ఊరట కలగడం లేదు.

తనకు అన్యాయం జరిగింది.

తాను చదువు సంధ్యలులేని మహిళ. 12 ఏళ్ల వయసులో చదువు మానేసింది. 16 ఏళ్ల వయసులో పెళ్లయింది. 17 ఏళ్లకు పిల్లవాడు పుట్టాడు. వంట చేయడం, ఇల్లు శుభ్రపరచటం, పిల్లల్ని కనటం, పెంచటం తప్ప మరేమీ తెలియదు నాన్సీకి. 1981 లో ఆమెకి చివరి పిల్లవాడు పుట్టాడు. అదే సంవత్సరం ఆమె భర్త ఆమెని వదిలి వెళ్లిపోయాడు. తర్వాత తన కొడుకు జీవితాన్ని చిన్నాభిన్నం చేశారు సాయుధులైన దుండగులు.

అలాంటి వారిపై ప్రతీకారం తీర్చుకోలేమా? ఎలా!?

ఆమె హృదయం అల్ల కల్లోలంగా ఉంది. తుపాను అలల తాకిడికి ఉక్కిరి బిక్కిరి అవుతున్న తీరంలా ఉంది.

అంతలో ఆమె దృష్టి గోడమీద వున్న ఆ వాక్యాలపై పడింది.

'నిరాయుధమైన సత్యాన్ని మించిన శక్తివంతమైన ఆయుధం మరేమీ లేదు ఈ ప్రపంచంలో' మార్టిన్ లూథర్ మాటలవి.

ఆ వాక్యం చదవగానే నాన్సీ మనసులో అలలు ఆగిపోయాయి. ఆమె ఇంద్రియాలు సర్వం ఆ వాక్యాల అర్థాన్ని విశ్లేషించసాగాయి.

© EMESCO BOOKS

'అవును, చీకట్లో చిరుదీపం వెలిగించాలి. సాయుధులను ఆయుధాలతోనే ఎదుర్కోవాల్సిన పనిలేదు. సత్యానికి ఆయుధాలు అవసరం లేదు. సత్యాన్ని మించిన శక్తిలేదు.

సత్యం భగవంతుడు!'–

నాన్సీ కళ్లు మెరిశాయి.

అప్పటికప్పుడు ఆమె ఒక స్థిరమైన నిర్ణయం తీసుకుంది.

ఆ నిర్ణయం ఐరిష్ రిపబ్లిక్‌లో ఘోర కృత్యాలకు బలయ్యే అనేకులకు వెలుగుదారి చూపే దివ్వె అయింది!

* * *

'మనమేం చేయగలం? నా కళ్లముందే నా భర్తని కొట్టి చంపారు. నేనింకా బతికే ఉన్నాను. ఇప్పటికే నా కళ్లముందు ఆ భయంకరమైన దృశ్యాలు కదలుతూనే ఉన్నాయి'

ఆమె చేతుల్లో ముఖం దాచుకుని వెక్కి వెక్కి ఏడవసాగింది.

నాన్సీ హృదయం ద్రవించింది.

అలాగే ఆ గదిలో ఉన్న ప్రతివారి హృదయంలో ఒక విషాదగాథ ఉంది. ప్రతివారి జీవితం ఐఆర్ఎ పాశవిక చర్యలకు బలైందే.

ఒకరికి కొడుకు మరణిస్తే మరొకరు తండ్రిని కోల్పోయారు. ఒకరి భర్త వికలాంగుడైతే మరొకరి అన్న హింసకు పిచ్చివాడై పోయాడు. గదినిండా అనాథలే! మనిషిలోని పశువు చర్యకు బలైన అనాథలు!

నాన్సీ కళ్లలో నీళ్లు నిండాయి.

ఎందుకీ హింస?

ఇదంతా ఐరిష్ ప్రజల అభ్యున్నతి కోసమేనా? ఇదేం అభ్యున్నతి?

అక్కడున్న వారందరిలోనూ కొత్తగా ఐఆర్ఎ బాధలకు గురయింది మిసెస్ మాలిస్ విలియమ్స్.

"పక్క ఇంట్లో కేకలు వినిపిస్తుంటే దొంగలే మోననుకుని ఆయన పోలీసులకు ఫోన్ చేశారు. కానీ వాళ్లు దొంగలు కారు. ఐఆర్ఎ మనుషులు. పక్కింటి వారిని హింసిస్తున్నారు. సమయానికి పోలీసులు రావడంతో వాళ్లలో ఒకడు పోలీసులకు దొరికిపోయాడు. దాంతో నా భర్త పోలీసులకు సమాచారం అందించేవాడని ఆయనను చంపాలని ప్రయత్నించారు. ఆయన ప్రాణాలు అరచేత పట్టుకుని దేశం వదిలి పారిపోయాడు. ఇప్పుడు నేను ఒక్కర్తినే పిల్లల్ని ఎలా పెంచాలి? కనీసం భిక్షమైనా ఎత్తుకోలేను" విలపించింది మిసెస్ విలియమ్స్.



© EMESCO BOOKS

"మగవాళ్లు ఒకళ్ల నొకళ్లు చంపుకుంటుంటే మనం విలపిస్తూ విధిని తిట్టుకుంటూ కూచుంటే లాభం లేదు"

"మరేం చేయగలం?"

అందరూ ఒక్కసారే అడిగారు.

"ఒంటరి వ్యక్తిలో లేని శక్తి సమష్టిలో ఉంది. ఐకమత్యం మన బలం కావాలి"

వాళ్లకి అర్థంకాలేదు.

"నిరాయుధమైన సత్యాన్ని మించిన శక్తివంతమైన ఆయుధం ఇంకొకటి లేదు"

నాన్సీ తన పథకాన్ని వారికి సమగ్రంగా వివరించసాగింది.

ఆరంభంలో వాళ్లు అపనమ్మకంగా చూశారు. ఆ తరువాత వాళ్ల కళ్లలో ఆశ కదిలింది. ఆపై పట్టుదల మెదిలింది.

చివరికి ఆత్మవిశ్వాసంతో కూడిన దృఢ నిశ్చయం స్థిరపడింది.

చేతులు - చేతులు కలిశాయి. ఆవేదనలు ఆలోచనలై ఉత్కృష్టమైన కార్యసాధనకు సోపానాలైనాయి.

1990 లో 49 ఏళ్ల నాన్సీ గ్రెసీ ఆధ్వర్యంలో 'ఫ్యామిలీస్ ఎగైనిస్ట్ ఇంటిమిడేషన్ అండ్ టెర్రర్ (ఎఫ్ఎఐటి) - హింసను, బెదిరింపులను వ్యతిరేకించే కుటుంబాల' సంస్థ ఏర్పడింది.

దాంతో ఐరిష్ హింసాత్మక చరిత్ర ఓ మలుపు తిరిగింది.

* * *

ఐర్లండ్‌లో ఎవరినోట విన్నా మిక్కీ విలియమ్స్ పేరు వినబడసాగింది. మిక్కీ విలియమ్స్ తిరిగి ఐర్లండ్ వచ్చే పరిస్థితులు కల్పించాలని కోరుతున్న వినతిపత్రాలు అడుగడుగునా దర్శన మివ్వసాగాయి.

టివిలో నాన్సీ ఇంటర్వ్యూలు కనబడసాగాయి. ఐఆర్ఎ అమాయక ప్రజలపై జరుపుతున్న దుష్కృత్యాలను ధైర్యంగా విమర్శించడమే కాదు, వారు మిక్కీకి విధించిన మరణశిక్షను వాపస్ తీసుకోవాలని, అతడు తిరిగి ఐర్లండ్ చేరేట్టుచేయాలని డిమాండ్ చేసింది.

ప్రాంతీయ టివి ఛానళ్ల నుండి ఆమె జాతీయ టివి నెట్‌వర్క్‌లోనూ ఇంటర్వ్యూలిచ్చే స్థాయికి ఎదిగింది. జాతీయ వార్తాపత్రికలు నాన్సీ అభిప్రాయాలను ప్రముఖంగా ప్రచురించటం ప్రారంభించాయి. ఒకసారి నాన్సీ బహిరంగంగా ఐఆర్ఎ అమానుష చర్యలను విమర్శించడంలో ఇంతకాలం ప్రజలలో అణగి ఉన్న ఆవేదనలు, ఆవేశాలు వెలికిరాసాగాయి.



© EMESCO BOOKS

ప్రతి ఒక్కడు తమ దయనీయ గాథను చెప్పేందుకు ధైర్యంగా ముందుకు రాసాగారు. తమ బాధలు, సమస్యలతో నాన్సీని వచ్చి కలిసేవారి సంఖ్య రోజురోజుకీ పెరగసాగింది. వారిలో ధైర్యంగా తమకు జరిగిన అన్యాయాన్ని వివరించే వారికి నాన్సీ టివిల్లో, వార్తా ప్రతికల్లోనూ అవకాశాలు కల్పించసాగింది. ఐఆర్ఏ దుష్కృత్యాలకు బలైన కుటుంబాల వివరాలను ఆమె అంతర్జాతీయ మానవహక్కుల సంఘాలకు అందించసాగింది. దాంతో ఇంతకాలం అణగి వున్న అనేక నిజాలు వెలికి రాసాగాయి.

ఐఆర్ఏ అసలు రూపు ఐర్లండ్ ప్రజలకే కాదు ప్రపంచానికీ తెలిసింది. రాజకీయ నాయకులు ఈ అంశాన్ని విస్మరించలేకపోయారు. ఐఆర్ఏ పై ఒత్తిడి పెరిగింది.

ఫలితంగా, మిక్కి విలియమ్స్ మళ్లీ ఐర్లండ్‌లో అడుగుపెట్ట గలిగాడు.

* * *

కొందరు మహిళలు ఐక్యత ప్రదర్శించి, నిర్భయంగా నిజాలు వెల్లడించడంవల్ల సాయుధులైన ఐఆర్ఏ దుండగులు తలవంచవలసి వచ్చింది. దీంతో 'ఫైట్' పెద్ద సంస్థగా ఎదిగింది. బెల్ఫాస్ట్ నగరంలో సంస్థ ఆఫీసు కిటకిటలాడసాగింది. ప్రతిప్రాంతంలో 10 నుండి 12 మంది 'ఫైట్' కార్యకర్తలు పనిచేస్తున్నారు. ఎవరికి అన్యాయం జరిగినా వారు ఇప్పుడు తాము ఒంటరి వాళ్లం కామన్న భావనతో ఆత్మ విశ్వాసం ప్రదర్శించసాగారు.

కానీ, నాన్సీ పనులు ఆమె కొడుకు పాడీకి నచ్చలేదు.

"ఏమీ అవకముందే నన్నిలా చేశారు. నువ్విలా వాళ్లకి వ్యతిరేకంగా ప్రవర్తిస్తుంటే..." అతని మాటలు పూర్తి కాకముందే నవ్వింది నాన్సీ.

"ఏం చేస్తారు? పాడీ, మనిషికి చావు ఒకేసారి వస్తుంది. కానీ మరణభయంతో మనిషి అనుక్షణం ఛస్తూ బతుకుతాడు. ఆ భయాన్ని జయిస్తే కానీ మనిషి జీవించటం ఆరంభంకాదు" నిశ్చయంగా చెప్పింది నాన్సీ.

తన తల్లిలో కొత్తవ్యక్తిని చూస్తుండిపోయాడు పాడీ.

'తన ఒక్కడికి అన్యాయం జరగటంవల్ల అమ్మలో ఎంతమార్పు! అందువల్ల ఎంత మందికి లాభం కలుగుతుందో' గమనించిన పాడీ మరి మాట్లాడలేదు.

* * *

మోరిస్ హీలీ కేసుతో నాన్సీ గ్రెసీ పేరు ప్రపంచమంతా మారుమోగింది. ఐఆర్ఏలో చేరి వివరాలు సేకరించి తమకు అందించమని ఐర్లండ్ పోలీసులు మారీస్ హీలీని కోరారు. హీలీ తిన్నగా ఐఆర్ఏ సభ్యుల దగ్గరకు వెళ్ళి పోలీసులు తననిలా కోరుతున్నారని చెప్పాడు.



© EMESCO BOOKS

ఐఆర్ఎ వాళ్లు అతడిని అభినందించే బదులు 'పోలీసులకు ఇంకేం సమాచారాన్నిచ్చావో చెప్పమంటూ' హింసించడం మొదలు పెట్టారు. 14 గంటలు అతడిని చావబాదిన తర్వాత తుపాకీని అతడి చెవిదగ్గర పేల్చారు. అతడి చెవులు దెబ్బతిన్నాయి. అతడిని ఐర్లండ్ వదలి వెళ్లమని ఆజ్ఞాపించారు.

కానీ, నాన్సీ అడ్డు పడింది.

ఫైట్ ద్వారా హీలీ కేసును ప్రపంచానికి తెలిపింది. ఆరంభంలో ఐఆర్ఎ తనకేమీ తెలియదని బుకాయించింది.

కానీ నాన్సీ చూపించిన సాక్ష్యాధారాల బరువుముందు ఐఆర్ఎ వారికి తలవంచక తప్పలేదు.

ఏప్రిల్ 1991 లో హీలీ ఐర్లండ్‌లో అడుగు పెట్టవచ్చని ఆమోదాన్ని తెలిపింది. దాంతో ఐర్లండ్ నలుమూలల నుంచేకాదు, జర్మనీ, ఫిన్లాండ్, ఉత్తర అమెరికాల నుండి సైతం పెద్ద ఎత్తున ప్రజలు, పాత్రికేయులు నాన్సీని కలిసేందుకు బెల్ఫాస్ట్‌కు చేరుకున్నారు.

పెద్దగా చదువు సంధ్యలులేని మామూలు గృహిణి, ఒక తీవ్రవాద సంస్థను కాళ్లదగ్గరికి తెచ్చిన అద్భుతాన్ని కళ్లారా చూసేందుకు వాళ్లంతా తహతహలాడారు!

నాన్సీ ప్రభావంవల్ల ఐఆర్ఎ హింస 'జాన్ పాట్రిక్' ప్రాంతంలో పూర్తిగా అంతరించింది. ఐఆర్ఎ హింసకు దిగేందుకు భయపడుతోంది. ఎవరినైనా హింసించినా నాన్సీ దగ్గరకు వెళ్లవద్దని బెదిరిస్తోంది.

కానీ ఆ బెదిరింపులను ప్రజలు లెక్కచేయటంలేదు. దాంతో ఐఆర్ఎ బలహీనమవసాగింది. 'మామూలు మనిషికి ఇంత శక్తి ఎక్కడినుండి వచ్చింది?' అని అందరూ సాధారణంగా ఆమెని అడుగుతుంటారు.

దానికి నాన్సీ గ్రెస్ సమాధానం ఒక్కటే.

'ఈ శక్తి నాది కాదు, భగవంతుడిది! సత్యం భగవంతుడు'–

# నిజానికి, నిప్పుకు మధ్య ...!

---

**పట్టుదలగా హంతకుడిని**
**వేటాడిపట్టుకున్న వ్యక్తి కథ**

---

బ్యాగులో బట్టలు కుక్కుకుంటున్న టర్నర్‌ను నిస్సహాయంగా చూస్తూ నిలబడింది ఇరీనా.

బట్టలను బ్యాగులోకి విసిరేయటంలోనే అణచి పెట్టుకుంటున్న అతని కోపం స్పష్టంగా తెలుస్తోంది. అతని పెదిమలు బిగబట్టి వున్నాయి. అతి కష్టంమీద దుఃఖాన్ని అణచుకుంటున్నాడని అర్థమవుతోంది.

"టర్నర్! ఈ విషయాన్ని పోలీసులకు వదిలేయవచ్చు కదా?" లాభం లేదని తెలిసినా మరోసారి బతిమిలాడింది ఇరీనా.

టర్నర్ కోపంగా తలెత్తి చూశాడు.

"పోలీసులు తమ వల్ల కాదని చేతులెత్తేశారు. మనం చేతులు ముడుచుకుని కూచుంటామనుకున్నారేమో!" అతని కళ్లల్లో నీళ్లు కదిలాయి.

"మరేం చేయగలరు? సాన్‌జోస్ వీథుల్లో తిరుగుతూ కనబడ్డ ప్రతి ఒక్కడిని 'నువ్వు హత్య చేశావా?' అంటూ అడుగుతారా! లేక 'హంతకుడెవరో ముందుకువచ్చి లొంగిపోవాలి' అని ఆజ్ఞాపిస్తారా! అంత పెద్ద బలగం ఉన్న పోలీసులే ఏం చేయలేకపోతే, మామూలు ఎలక్ట్రీషియన్ మీరేం చేయగలరు?" విసుగ్గా అంది.

టర్నర్ మూర్ఖత్వానికి కరీనాకు చిరాగ్గాను, కోపంగానూ ఉంది.

హత్యకు గురైన ఫ్రాంక్ అగిర్రె కరీనాకు తండ్రి. మిత్రుడిని కలవాలని సాన్‌జోస్‌కు వెళ్లిన ఆయన్ని ఎవరో అక్కడి చైనాటౌన్ కార్ పార్కింగ్‌లో చంపేశారని పోలీసులు ఉన్నట్టుండి సమాచారం అందించారు.

© EMESCO BOOKS

ఆ వార్త విన్న కరీనాకు దుఃఖం ఆగలేదు. టర్నర్ పట్టరాని దుఃఖాన్ని బిగబట్టుకున్నాడు. కానీ అతడిలో ఆవేశాగ్ని రగులుతోంది.

వార్త తెలిసినప్పటి నుంచి రోజూ, ఫ్రెస్నో డిపార్ట్‌మెంట్ హోమిసైడ్ యూనిట్‌కు చెందిన డిటెక్టివ్ జాన్ హర్రేరాకు ఫోన్లు చేసి 'హంతకుడు పట్టుబడ్డాడా?' అని అడుగుతూనే ఉన్నాడు.

హర్రేరా ఓపిగ్గా సమాధానం ఇస్తున్నాడు. ఓ రోజు హర్రేరా లేని సమయంలో వేరే ఎవరో ఫోనెత్తి టర్నర్‌మీద విసుక్కున్నాడు.

"మా సాన్‌జోస్‌లో ఇదొక్కటే హత్య అనుకున్నారా? రోజుకు అయిదు హత్యలు జరుగుతుంటాయి. పోలీసులకు మీ మామగారిని హత్య చేసినతణ్ని వెతకటం తప్ప మరి వేరే పనే లేదా? ఇంతపెద్ద నగరంలో గుర్తు తెలియని హంతకుడిని పట్టుకోవటం అంటే ఎడారిలో సూదిని వెతకటంలాంటిదని మీరు ఇంకెప్పుడు తెలుసుకుంటారయ్యా?! మాకు చేతనైనంత వరకు మేం చేస్తూనే ఉన్నాం. హంతకుడు దొరికితే మీకు తెలియజేస్తాం. అంతదాకా ఓపిక పట్టండి. అంతేకాని ఇలా మాటిమాటికీ ఫోన్లు చేసే విసిగించకండి." అంటూ ఫోన్ పెట్టేశాడతను.

దాంతో 'పోలీసులకు చేతకాలేదు. వాళ్లు కేసు ఫైలు మూసేస్తున్నారు. కాబట్టి నేనే వెళ్లి హంతకుడిని పట్టుకుంటాను' అని ఫ్రాంక్ టర్నర్‌వ స్వయంగా సాన్‌జోస్‌కు బయల్దేరుతున్నాడు.

ఇరీనా ఎంత వారించినా వినడం లేదు. చివరికి ఇల్లు దాటుతుండగా ఇరీనావైపు తిరిగి చెప్పాడు టర్నర్.

"ఇరీనా! నువ్వేం కంగారు పడకు. నాకేమీ కాదు. హంతకుడిని నా తృప్తి కోసమైనా పట్టుకోవాలి. హాయిగా, నవ్వుతూ, తుళ్లుతూ వున్న వ్యక్తిని వాడెలా చంపగలిగాడో నేను తెలుసుకోవాలి? ఎందుకు చంపాడు? తద్వారా అతడికి ఒరిగిందేమిటి? ఇవి నేను వాడినుండి రాబట్టాలి. ఇలా అతడు ఇంకెంత మంది అమాయకుల్ని చంపుతాడు! హంతకుడు దొరకనీ, దొరక్కపోనీ. దొరుకుతాడన్న ఆశ మాత్రం నాకుంది. కనీసం ప్రయత్నం చేశానన్న తృప్తి అన్నా నాకు మిగలనీ" అని గబగబా వెళ్లిపోయాడు.

భర్త టర్నర్ వెళ్లినవైపే తదేకంగా చూస్తూ ఉండిపోయింది ఇరీనా.

* * *

"మొత్తం అయిదుగురు పెట్రోలింగ్ ఆఫీసర్లు వారంపాటు చైనాటౌన్ అణవణువునా గాలించారు. ప్రతి ఒక్కరినీ ప్రశ్నించారు. అయినా ఫలితం అందలేదు" కేసు వివరాలను టర్నర్‌కు వివరించాడు హర్రేరా.

టర్నర్ బాధ మరింత పెరిగింది. అతని కళ్లముందు లాంగ్‌బీచ్, కాలిఫోర్నియా బస్టాండులో బస్సులోంచి చేయి ఊపుతూ 'నిన్ను రెండ్రోజుల్లో కలుస్తానని' నవ్వుతూ అంటున్న అగిర్రె ముఖమే మెదలుతోంది.

© EMESCO BOOKS

అది సెప్టెంబర్ 4, 1991 నాటి మాట.

రెండు రోజుల్లో అగ్రిరె జీవంలేని శవం అయినాడు. టర్నర్ ముఖం చేతుల్లో దాచుకున్నాడు.

* * *

58 ఏళ్ల ఫ్రాంక్ అగ్రిరె అంటే టర్నర్‌కు ఎంతో గౌరవం. అగ్రిరె హృద్రోగంతో ఆసుపత్రి పాలైనపుడు టర్నర్ దగ్గరుండి చూసుకున్నాడు. దాంతో వారి మధ్య మామ అల్లుళ్ల బంధంతోపాటు ఏదో తెలియని ప్రేమబంధం మొలకెత్తింది. అప్పుడు అగ్రిరె టర్నర్‌కు మరింత దగ్గరయ్యాడు. వియత్నాం యుద్ధంలో తన అనుభవాలు, జీవితంపై తన అభిప్రాయాలు అన్నీ టర్నర్‌తో చెప్పుకున్నాడు. మంచి స్నేహితుల్లా కలిసిపోయారు. అగ్రిరెకూడా టర్నర్‌ను అల్లుడిలా కాకుండా కొడుకులా ప్రేమించాడు. అలాంటి టర్నర్ దారుణ హత్యకు గురయ్యాడు. కళ్లముందు ఒంటరిగా కార్ పార్కింగ్‌లో నేలమీద పడి, రక్తం కారుతుండగా కొద్దికొద్దిగా ప్రాణం వదిలిపోతున్న అగ్రిరెనే టర్నర్ మనసులో మెదలుతున్నాడు. ఆ సమయంలో అతనేం ఆలోచించి వుంటాడోపాపం! అందరూ ఉండికూడా ఎవరూలేని అనాథలా రోడ్డుమీద పడి మ రణించటం ఎంత దారుణం!?

టర్నర్ పిడికిలి బిగుసుకుంది.

అగ్రిరెను హత్యచేసిన వాడిని వదల కూడదు. వాడిని ఎలాగైనా పట్టుకోవాలి. కానీ, ఎలా! ఏ ఆచూకీ తెలియని వ్యక్తిని ఎలా వెతికి పట్టుకోవడం!?

మరుసటి రోజు తెల్లవారక ముందే టర్నర్ చైనాటౌన్ చేరుకున్నాడు. అగ్రిరె శవం దొరికిన కార్‌పార్కింగ్ ప్రదేశం చూస్తుంటే అతనికి దుఃఖం ఆగలేదు. మరోవైపు ఆవేశం రెండింతలైంది. ఇక్కడే ఓ రాత్రి ఎవరో ఒంటరిగా మామయ్యని పొడిచి పడేసి, అతని జేబులోంచి డబ్బులు దొంగతనం చేశారు!

ఎవడు వాడు?

చైనా టౌన్‌లో అప్పుడప్పుడే నెమ్మదిగా జన సంచారం మొదలవుతోంది. ఓ చిన్న హోటల్‌లోకి వెళ్లి కూచున్నాడు టర్నర్. హోటల్‌లోకి వచ్చిపోయే వాళ్లను గమనిస్తున్నాడు. హోటల్‌లోని టేబిళ్లన్నీ నిండిపోయే దాకా చూశాడు.

అప్పుడు మెల్లగా లేచి ఒక టేబిల్ దగ్గరకు వెళ్లాడు. అక్కడి వాళ్లు ఏదో విషయం సీరియస్‌గా చర్చించుకుంటున్నారు.

"నా పేరు ఫ్రాంక్ టర్నర్. నేను కాలిఫోర్నియా, లాంగ్‌బీచ్‌లో ఉంటాను. ఈ ఫోటో నా మామగారు ఫ్రాంక్ అగ్రిరెది. సెప్టెంబర్ 4న ఆయన ఈ ప్రాంతంలో దారుణహత్యకు గురయ్యారు. మీకెవరికైనా ఏమైనా తెలిస్తే చెప్పండి. నేను పోలీసును కాదు. మామూలు పౌరుడిని" చెప్పాడు టర్నర్ దీనంగా.



© EMESCO BOOKS

వాళ్లు ఫోటోకన్నా టర్నర్‌నే విచిత్రంగా చూశారు. టర్నర్ మళ్లీ అడిగాడు. అప్పుడు వాళ్లు ఫోటోవైపు ఓ చూపు విసిరేసి తల అడ్డంగా తిప్పారు. టర్నర్ అలా ఒకో టేబిల్ దగ్గరకు వెళుతూ ఫోటో చూపిస్తూ 'ఎవరికైనా, ఏమైనా తెలుసేమోనని' ప్రయత్నించసాగాడు. అందరూ తమకు తెలియదన్నా నిరాశ పడకుండా ఓపిగ్గా అడుగుతున్నాడు.

అందరినీ అడిగాక హోటల్ బయటికి వచ్చి అక్కడ నాలుగు రోడ్లకూడలిలో నించుని వచ్చేపోయే వారిని ఆపి అడగసాగాడు. రోడ్డు దాటేవాళ్లు కొందరు టర్నర్‌కోసం ఆగుతున్నారు. మరికొందరు ఆగకుండా వెళ్తున్నారు. ఇంకొందరు గుంపుగా కూడుతున్నారు. 'ఎవడో పిచ్చోడై ఉంటాడు' అనుకుంటూ మరి కొందరు వెళ్లిపోతున్నారు. ఎవ్వరూ ఏ విషయమూ చెప్పలేదు.

రాత్రయ్యేసరికి బాగా అలసిపోయాడు. తన హోటల్ గదికి చేరుకున్నాడు. ఫోన్లో ఇరీనా స్వరంలో ఆందోళన వినిపించింది.

"తిరిగి వచ్చేయండి. అనవసరంగా ఎందుకు శ్రమపడుతున్నారు? పైగా ఒకవేళ హంతకుడే ఆ ఫోటో చూస్తే మిమ్మల్ని ఏమైనా చేయవచ్చు. ప్లీజ్ టర్నర్. వచ్చెయ్యి" బతిమాలింది ఇరీనా. అతడు నవ్వుకున్నాడు.

"నా ప్రయత్నం నన్ను చేయనీ" అని ఫోను పెట్టేశాడు.

సాన్‌జోస్ మ్యాపు తీశాడు. ఆరోజు తిరిగిన ప్రాంతాలను గుర్తుపెట్టుకుని మరుసటి రోజు కొత్త ప్రాంతాలకు వెళ్లాడు.

* * *

"నువ్వేం చేస్తున్నావో తెలుసా? మొత్తం పట్టణం నీ గురించే చర్చిస్తోంది" కోపంగా అన్నాడు హర్రెరా.

చిన్నగా నవ్వాడు టర్నర్.

"నాకు అపరాధ పరిశోధన పద్ధతులు తెలియవు. తెలిసింది ఒక్కటే. బహిరంగంగా జరిగిన హత్యను ఎవరైనా చూసి వుంటారు. వాళ్లలో కనీసం ఒక్కరైనా నాకు విషయాలు చెప్పకపోతారా అని ఆశ"

హర్రెరా టర్నర్‌ను పరిశీలనగా చూశాడు.

"ఆ హత్యను చూసిన వాళ్లకు నీకు నిజం చెప్పాల్సిన అవసరం ఏముంది; ఈ లోగా ఆ హంతకుడే నిన్ను పట్టేస్తే?!"

అతనికి టర్నర్ పట్టుదల ముచ్చటగానూ ఉంది. అతడికి సహాయం చేయాలనీ ఉంది.



© EMESCO BOOKS

"మన కోరిక స్వచ్ఛమైందీ, నిజాయితీతో కూడుకున్నదైతే భగవంతుడు తప్పక సాయం చేస్తాడు" నిశ్చయంగా అన్నాడు టర్నర్.

బార్లు, ఆఫీసులు, వీధులు తెగ తిరిగాడు టర్నర్. వేశ్యలు, బ్రోకర్లు, డ్రగ్ ఎడిక్ట్లు, వీధుల్లో నడిచేవాళ్లు, బిచ్చగాళ్లు ఎవరినీ వదల్లేదు. అలా ఓ రాత్రి ఇలాగే ఫోటో చూపించి అడుగుతుంటే ఓ వ్యక్తి టర్నర్‌కు హంతకుడిని చూపుతానని ఆశ చూపించి, నిర్మానుష్యమైన సందులోకి తీసుకెళ్లి ఒళ్లంతా హూనం చేసి అతడి దగ్గరవున్న డబ్బులు లాక్కుని ఉడాయించాడు. అయినా టర్నర్ తన పరిశోధన వదల్లేదు. గాయాలకు చికిత్స చేసుకుని మరీ వీధిన పడ్డాడు.

* * *

"ఒక్క డాలర్ ఇవ్వండి. ప్లీజ్"

వెంట బడి బతిమాలుతున్న బిచ్చగాడికేసి నిర్లిప్తంగా చూశాడు టర్నర్.

"ఒక్క డాలర్ ఏంటి, పది డాలర్లిస్తా. ఈ ఫోటోలోని వ్యక్తిని గుర్తుపడతావా?"

ఫోటో చూడగానే అతడి కళ్లలో గుర్తుపట్టిన భావన! టర్నర్ ఇరవై డాలర్లు తీశాడు.

"పక్క సందులో చర్చి ఉంది. దాని ఆవరణలో ఎర్రజుట్టు అమ్మాయి వుంది. ఆమెకు తెలుసు" అని గబగబా చెప్పి ఇరవై డాలర్లు అందుకుని పరుగెత్తాడు బిచ్చగాడు.

టర్నర్ గుండె ఉప్పొంగింది.

తడబడుతున్న అడుగులతో చర్చి చేరాడు. ఆవరణలోనే ఎర్రజుట్టు అమ్మాయి కనిపించింది. టర్నర్ ఆమెని సమీపించి ఫోటోతో పాటు పదిడాలర్లు ఆమె చేతిలో పెట్టాడు.

"నాకు తెలుసు. పోలీసులకు శవంగురించి చెప్పింది నేనే" అంది ఆ ఫోటో చూస్తూ.

"హంతకుడెవరో తెలుసా?" గొంతు ఎండిపోతుంటే అతి కష్టంమీద అడిగాడు టర్నర్.

"చీకట్లో సరిగ్గా చూడలేదు. కానీ మెక్సికో బార్‌లో ఉంటాడు" ఆమె భయపడుతున్నట్లు టర్నర్‌కు తెలుస్తూనే ఉంది.

అందుకే ఆమెను మరింతగా రెట్టించకుండా మెక్సికోబార్ వెతుకుతూ వెళ్లాడు టర్నర్.

* * *

టర్నర్‌బార్‌లో అడుగు పెడుతుండగా ఒక్కసారిగా బార్ నిశ్శబ్దంగా అయిపోయింది. అందరి కళ్లూ టర్నర్‌వైపే తిరిగాయి.

టర్నర్ గొంతు సవరించుకుని తను వచ్చిన పని చెప్పాడు.

అందరూ నిశ్శబ్దంగా, నిర్భావంగా అలాగే కూచున్నారు. ఎవరిలోనూ కదలిక లేదు.



© EMESCO BOOKS

ప్రతి ఒక్కరినీ దగ్గరగా వెళ్లి అడిగాడు టర్నర్. ఫలితం లేదు.

చివరికి నిరాశగా బయటికి వచ్చాడు. చీకట్లో ఎదురుగా వున్న పార్కులో కూచుని సన్నగా రోదించసాగాడు టర్నర్. అతని ఆశలన్నీ అడుగంటాయి. తన నిస్సహాయత్వానికి, చేతకానితనానికి అతనికి తనమీద తనకే అసహ్యమేసింది.

"ఆయన నీకేమౌతాడు?" ఎవరిదో స్వరం వినిపించి తలెత్తి చూశాడు టర్నర్.

చీకట్లో ముఖం సరిగ్గా కనిపించటంలేదు.

"మామయ్య. నా భార్య తండ్రి" చెప్పాడు టర్నర్ బాధగా.

"ఆయన చాలా మంచివాడు. ఆరోజు ఆకలితో మలమల మాడుతున్న నాకు భోజనం పెట్టించాడు"

టర్నర్ మాట్లాడలేదు.

"హంతకుడెవరో నాకు తెలుసు?" నెమ్మదిగా అన్నాడు అతను.

అంతే! టర్నర్ చివ్వున తలెత్తాడు.

* * *

టర్నర్ అందించిన సమాచారం మేరకు పోలీసులు అర్రియోలా అనే వ్యక్తిని అరెస్టు చేశారు. అతని దగ్గర అగెర్రా పర్సు, టర్నర్ కూతురి ఫోటో దొరికాయి.

అర్రియోలా నేరం ఒప్పుకున్నాడు.

ఫ్రాంక్ అగిర్రెను హత్యచేసిన నేరానికి ఆన్టోనియో రూయిజ్ అర్రియోలాకు 26 ఏళ్ల జైలుశిక్ష, పదివేల డాలర్ల జరిమానా విధించింది కోర్టు.

డిటెక్టివ్ హర్రెరా టర్నర్‌ను అభినందించకుండా ఉండలేకపోయాడు.

"నీవంటి వాళ్లు సమాజానికి ఎంతో అవసరం" అన్నాడు.

బదులుగా టర్నర్ నవ్వాడు.

"పోలీసులను చూస్తే ప్రజలు భయపడతారు. నిజం చెప్పరు. అందుకే పోలీసులు సాధించలేనిది నేను సాధించగలిగాను. అంతే! ఇందులోని అసలు తేడాని మీరు, మీ డిపార్ట్‌మెంట్ గుర్తిస్తే అంతే చాలు" అన్నాడు టర్నర్.

© EMESCO BOOKS

# మారణకాండకు మరోవైపు!

**మనుషుల బలహీనతల ఆధారంగా**
**మారణహోమం సృష్టించిన అసహాయ కథ ఇది.**

**మార్చి** 20, 1995 –

ఉదయం ఎనిమిది గంటలు.

ఒకటొకటిగా రైళ్ళు వచ్చి టోక్యో సబర్బన్ రైల్వేస్టేషన్ చేరుకుంటున్నాయి. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే రైళ్ళవి.

సెలవురోజులు కావటంతో మామూలుకన్నా ఎక్కువగా ఉన్నారు జనం. సంవత్సరానికి 2.7 బిలియన్ ప్రయాణీకులు ఈ సబర్బన్ రైళ్ళలో ప్రయాణిస్తారు. ఆ రోజు హడావిడిగా రైళ్ళు దిగుతున్న ప్రయాణికులందరికీ కళ్ళు మండసాగాయి. విపరీతంగా దగ్గు రాసాగింది. గుండె కొట్టుకునే వేగం ఎక్కువయింది...

అందరూ ఒకరొకరుగా నేలకొరగసాగారు.

అంతవరకూ కథల్లో మాత్రమే ప్రస్తావించే భయంకరమైన కల నిజమయింది.

టోక్యో సబర్బన్ రైళ్ళలో భయంకరమైన 'సరీస్' విషవాయువు ప్రయోగం జరిగింది.

ఉగ్రవాదమన్నది ఎరుగని జపాన్ దేశంలో తీవ్రవాదుల దాడి జరిగింది.

'ఎవరు చేసి ఉంటారీ పని?'

సమాధానంగా అందరి దృష్టి ప్రపంచంలోని పలుప్రాంతాల ప్రజలను విపరీతంగా ఆకర్షిస్తున్న 'ఓమ్ మతస్థాపకుడు, 'అసహారా' పేరుతో చలామణి అవుతున్న చిజువో మాట్సుమోటోవైపు మళ్ళింది.

* * *

© EMESCO BOOKS

చిజువో మాట్సుమోటో 1955 లో ఓ పేదకుటుంబంలో జన్మించాడు. పసితనంలోనే 'గ్లకోమా' కంటి జబ్బుతో అతని ఎడమకన్ను దృష్టిని కోల్పోయింది. కుడికన్ను సైతం మసక మసకగా మాత్రమే కనబడేది. దాంతో పాఠశాలలో తోటి విద్యార్థులు అతడిని గేలిచేసేవారు. అది చూసి వాళ్ళమ్మ అతడిని అంధుల పాఠశాలలో చేర్పించింది.

"గుడ్డివారిమధ్య మసక మసక దృష్టి ఉన్నవాడే గొప్ప. ఎప్పుడూ ఎవరి ఒత్తిడికీ లొంగకు. ఎదుటివాడు నిన్నేమైనా అనేలోగా నువ్వే వాడినేమైనా చెయ్యి. బెదిరించే వాడికే భయపడుతుంది లోకం. లొంగేవాడిని బెదిరిస్తుంది".

తల్లి మాటలు జాగ్రత్తగా విన్నాడు మాట్సు మోటో. అప్పుడే అతడిలో ప్రపంచ ప్రజలందరిపై అధికారం చలాయించాలన్న కోరిక కలిగింది. పాఠశాలలో అసలు చూపులేని వాళ్ళ మధ్య కాస్తయినా చూపు ఉన్నందువల్ల తనకు కలిగిన ప్రాధాన్యాన్ని గమనించాడు. ఇంతకాలం ఇతరుల హేళనకు గురయిన తాను ఇప్పుడు బలవంతుడు. తన తోటి విద్యార్థులను ఏడిపించ సాగాడు. భయపెట్టి డబ్బులు వసూలు చేయసాగాడు. అధ్యాపకులు సైతం ఎవరి ఫిర్యాదులను పట్టించుకోకపోవటంతో మాట్సుమోటోకు ఒక విషయం అర్థమయింది.

'ప్రపంచంలో ప్రజలంతా గుడ్డివాళ్లు. వాళ్ళ భయాలు, అపోహలు, ఆశలు వారిని గుడ్డివాళ్ళని చేస్తాయి. అటువంటి గుడ్డివాళ్ళపై అధికారం చలాయించటమే తన లక్ష్యం. జపాన్ మాత్రమే కాదు సర్వ ప్రపంచం తనకు ప్రణమిల్లేట్టే చేసుకుంటాను' అని తన జీవిత లక్ష్యం నిర్ణయించుకున్నాడు మాట్సుమోటో.

* * *

అధికారం చేతికి అందాలంటే పలుకుబడి కావాలి. పలుకుబడి కావాలంటే పుష్కలంగా డబ్బు ఉండాలి. సత్యం గ్రహించిన మాట్సుమోటో డబ్బు సంపాదనపై దృష్టి కేంద్రీకరించాడు. రకరకాల వ్యాపారాలు చేస్తూ డబ్బు సంపాదించటం ఆరంభించాడు.

మరోవైపు టోక్యో యూనివర్సిటీలో అతడికి సీటు లభించలేదు. దాంతో అతని దృష్టి ప్రజల బలహీనతల ఆధారంగా డబ్బు సంపాదించటం వైపు మళ్ళింది.

భార్య 'టోమోకో' సహాయంతో 'మాట్సుమోటో ఆక్యుపంచర్ ఆస్పత్రి' ప్రారంభించాడు. ఆస్పత్రి ద్వారా బాగా డబ్బులు సంపాదిస్తున్న సమయంలో – అతని దృష్టి ప్రజల మరో బలహీనత 'భవిష్యత్తు తెలుసుకోవాలన్న ఆత్రం' పై పడింది. ఆ అంశాన్ని పరిశోధిస్తున్న సమయంలో ప్రజల మరో భయంకరమైన బలహీనత 'మతం' అతనికి అర్థమైంది.

ప్రజలు భగవంతుడిని 'భయం' వల్ల నమ్ముతున్నారు. తమకేదో ప్రమాదం జరుగుతుందని, భగవంతుడు తమని రక్షిస్తాడని నమ్ముతున్నారు. తమ కష్టాలని భగవంతుడు తొలగిస్తాడని

© EMESCO BOOKS

నమ్ముతున్నారు. మాట్సుమోటో కళ్ళు మెరిసాయి. మెదడు చురుకుగా పని చేయసాగింది. పెదవులపై చిరునవ్వు విరిసింది.

* * *

1984 – జపాన్‌లో మాట్సుమోటో పేరు మారు మోగి పోసాగింది. ఇప్పుడు మాట్సు మోటో గొప్ప యోగి. ప్రజలను చూడగానే వారిని పట్టిన దుష్టశక్తుల ప్రభావం అతనికి తెలిసిపోతుంది.

మాట్సుమోటో 'గాల్లో' తేలతాడు!

మాట్సుమోటో శక్తుల గురించి ప్రజలు చర్చించుకోసాగారు. మాట్సుమోటో సైతం తన ప్రసంగాలతో ప్రజలను ఆకర్షించసాగాడు.

తన మాటలకు మభ్యపడి ప్రజలు తనకు నీరాజనాలివ్వటం చూశాడు. కానీ అతనికి సంతృప్తి కలగలేదు. 'ఇంకా ఏం చేస్తే ప్రజలు మరింత పెద్ద యెత్తున, వేగంగా, తన వైపు ఆకర్షితులౌతారు?' – అని ఆలోచించసాగాడు.

ఒకరోజు వాహ్యాళికి వెళ్ళిన మాట్సుమోటో ఓ ముసలి పిచ్చివాడి ప్రేలాపన విన్నాడు.

ప్రజలను తన దగ్గరకు ఆకర్షించగలిగే మంత్రం అతనికి స్ఫురించింది. ప్రపంచాన్ని శాసించగలిగే శక్తిని పొందే మార్గం తోచిందతనికి. వెంటనే కొన్నాళ్ళు 'తపస్సు'కి వెళ్ళాడు. గెడ్డం పెంచాడు. జుట్టు పెంచాడు. శుభ్రమైన తెల్లటి వస్త్రాలు మాత్రమే ధరించసాగాడు.

మాట్సుమోటో పేరు వదిలి 'షోకో అసహారా' అన్న పేరు స్వీకరించాడు. అలా 'ఓమ్' మతం ఆరంభించాడు.

* * *

'ప్రపంచం నాశనమవబోతోంది. నాశనమైన ప్రపంచ శకలాల నుంచి నూతన సృష్టి జరుగుతుంది. కొత్త ప్రపంచం ఉద్భవిస్తుంది. ఆ నూతన ప్రపంచంలోకి ప్రవేశం కావాలంటే 'అసహారా'ను నమ్మండి. షోకో అసహారా మాత్రమే మిమ్మల్ని రక్షించగలడు'.

ఒక ఝంఝూ మారుతంలా 'అసహారా' ప్రచారం జపాన్ ప్రజలను ఊపేయసాగింది.

"అసహారా దివ్య శక్తులున్న వ్యక్తి. ఆయన చేయి తాకితే సర్వ రోగాలు నయమౌతాయి"

"అసహారా రక్తం చుక్క తాగితే చాలు దివ్యశక్తులు లభిస్తాయి"

"అసహారా స్నానం చేసిన నీరు తాగితే పాపాలు నాశనమౌతాయి"

"అసహారా పాదాలు తాకితే గొప్ప దివ్యాను భూతి కలుగుతుంది"

ప్రజలు వెర్రివాళ్ళవ సాగారు. రోజురోజుకీ అసహారా భక్తులు పెరిగిపోసాగారు.



© EMESCO BOOKS

ప్రజల వెర్రిని ఆధారం చేసుకొని అసహారా డబ్బులు పిండుకోసాగాడు. నుదురు తాకాలంటే ఫీజు. ఆయన పాదం తాకాలంటే రుసుము. ఆయన స్నానం చేసిన నీరు పొందేందుకు డబ్బు. ఆయన గెడ్డం వెంట్రుకలు సాధించాలంటే ఖర్చు.

ఇలా 'ఓమ్ నిత్య సత్య సంస్థ'కు డబ్బులు కుప్పలు తెప్పలుగా వచ్చి పడసాగాయి. ఓమ్ ఆశ్రమం వెలిసింది. భక్తులు తయారయ్యారు. తాము దాచుకున్న డబ్బును అసహారాకు సమర్పించారు. డాక్టర్లు, లాయర్లు, శాస్త్రవేత్తలు వృద్ధులు, విద్యార్థులు అందరూ అసహారాకు భక్తులయ్యారు. అతనికోసం ప్రాణాలు త్యాగం చేసే స్థితికి ఎదిగారు'. అతని కనుసైగతో నిప్పుల్లో దూకేందుకు సిద్ధమయ్యారు.

తన ప్రవచనాలతో అసహారా భారత్ వచ్చి దలైలామాను కలిశాడు. అమెరికా వెళ్ళి అక్కడ 'ఓమ్' శాఖను ఆరంభించాడు. రష్యా ప్రజలను ఆకర్షించాడు. రష్యాలోని అక్రమ ఆయుధ రవాణా ముఠాలతో ఒప్పందాలు చేసుకున్నాడు.

అసహారాను నమ్మి అతనికి పాదాక్రాంతులైన భక్తులలో 'హిడియో మురాయ్' అనే శాస్త్రవేత్త. 'సైచి ఎన్డో' అనే ఇంజనీర్, 'మసామి షుచియా' అనే జీవరసాయన పదార్థాల శాస్త్రవేత్త, 'హయాకువా' అనే విస్ఫోటక పదార్థాల తయారీ నిష్ణాతుడూ ఉన్నారు. తను కోరిన వారందరూ అసహారా చుట్టూ చేరారు.

ధనానికి కొదవలేదు. ఇక సాధించ వలసింది అధికారమే. అయితే, జపాన్ ఎన్నికలలో పాల్గొన్న ఓమ్ సభ్యులు పరాజయం పాలయ్యారు. అసహారా అహం దెబ్బతింది. 'అధికారం సాధించాలంటే ఇక మంచి మాటలు సరిపోవు. అధికారం భయంలోంచి వస్తుంది. ప్రజలను భయభ్రాంతులను చేయాలి. ఆ భయంతో వణుకుతున్నవారికి అభయం ఇవ్వాలి. 'అధికారం సాధించాలి'–

అసహారా కళ్ళు వెలిగిపోతున్నాయి.

* * *

"అసహారా మోసగాడు. వాడి ప్రలోభంలో పడి అమాయక యువతీ యువకులు చెడిపోతున్నారు".

ప్రజలలో అలజడి మొదలయింది. ఇళ్ళు వదలి వెళ్ళిపోతున్న కొడుకులు, కూతుళ్ళను నియంత్రించలేని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేయసాగారు.

వీరి ఆగ్రహాన్ని గ్రహించిన 'ట్యుటుమి సకమోటో' అనే న్యాయవాది 'సొసైటీ ఆఫ్ ఓమ్ ట్రూత్ విక్టిమ్స్' అనే సంస్థను స్థాపించి అసహారాపై కోర్టులో కేసు వేశాడు. అసహారా తన నమ్మిన బంట్లకు కనుసైగ చేశాడు.

"మనల్ని ఎదిరించిన వాడు బతకకూడదు" ఆజ్ఞాపించాడు.

* * *

అర్ధరాత్రి ఓ అయిదుగురు నిద్రిస్తున్న లాయరు గదిలోకి ప్రవేశించారు.

అలికిడికి లాయరుకు మెలకువ వచ్చింది. అతని శరీరంలోకి విష పదార్థాన్ని ఇంజెక్టు చేశారు. తర్వాత అతని భార్య, కూతుళ్ళకూ అదే గతిపట్టింది.

లాయర్ మరణంతో అసహారాపైకి అనుమానం వెళ్ళినా – పోలీసులు అతడిని కన్నెత్తి కూడా చూడలేకపోయారు. అసహారాకు ధైర్యం పెరిగింది. తనని ఎవరూ ఏమీ చేయలేరన్న అహంకారం ఎక్కువైంది.

"మనం ప్రపంచాన్ని శాసించే రోజు దగ్గర పడింది. మనం అతితక్కువ శ్రమతో ఎక్కువమందిని అతి భయంకరంగా చంపగలగాలి. దాంతో ప్రజలలో భయోత్పాదక భావనలు చెలరేగుతాయి. వారికి రక్షణ నివ్వగలిగేది మనమేనని నమ్మించాలి" అని తన అనుచరుల వైపు తిరిగాడు అసహారా.

* * *

జపాన్‌లో అసహారాపై వ్యతిరేకత పెరగసాగింది. యువకులు అదృశ్యమవటానికి, అసహారాకు సంబంధం ఉందన్న ఫిర్యాదులు పోలీసులకు అందసాగాయి.

కానీ అసహారా మద్దతుదార్ల శక్తిని చూసిన పోలీసులు గొడవెందు కని ఉదాసీన వైఖరి ప్రదర్శించసాగారు.

అసహారాకు అహంకారం విపరీతంగా పెరిగిపోసాగింది. తన అనుచరులెవ్వరైనా ఒక్కమాట తను వ్యతిరేకంగా మాట్లాడినా భరించలేకపోతున్నాడు. ఎదురు చెప్పిన వారిని క్రూరంగా శిక్షించసాగాడు, భయంకరంగా చంపించసాగాడు.

"ప్రిన్స్ నారుహిటో వివాహ మహోత్సవవేడుకలలో మారణహోమం సృష్టించాలి" ఆజ్ఞాపించాడు అసహారా.

అతని అనుచరులు ఆ ఉత్సవాలలో ప్రజల నడుమ విషవాయువులను వదలాలని ప్రయత్నించారు. కానీ యంత్రం సరిగా పనిచేయకపోవడంవల్ల ఆ ప్రయత్నం విఫలమైంది. అసహారా కోపంతో ఊగిపోయాడు.

సెంట్రల్ టోక్యోలో బోట్యులిప్ విషపదార్థాన్ని వదిలారు. అదీ సరిగ్గా పనిచేయలేదు. అసహారాకు కోపంతో పిచ్చెక్కిపోయింది.

* * *

"దీన్ని 'ఐసోప్రొపైల్ మిథైల్ ఫాస్ఫోరో ఫ్లోరిడేట్' లేక 'సారిన్' వాయువంటారు. ఇది నరాలపై పనిచేసి వ్యక్తులను అతి భయంకరమైన చావుకు గురిచేస్తుంది" చెప్పాడు మురాయ్. అసహారా ఆనందంగా చూశాడు.



© EMESCO BOOKS

ఇది ద్రవ రూపంలో, పొడి రూపంలోనూ వస్తుంది.

"ప్రజలను ఏ మార్గంలో చంపుదాం?" అడిగాడు మురాయ్.

"ద్రవ రూపంలో" చెప్పాడు అసహారా.

ఈ ప్రయత్నమూ విఫలమయింది. అసహారాకు కోపం మిన్నంటింది.

"ఈసారి ముందుగా ఎక్కడయినా ప్రయోగించి ఫలితం చూసిన తరువాత ప్రయత్నించండి" ఆజ్ఞాపించాడు అసహారా.

ఆస్ట్రేలియాలో జనులకు దూరంగా ఉన్న ప్రాంతంలో ఓ కర్మాగారాన్ని నిర్మించి 'సారిన్' గ్యాస్‌ను తయారుచేశారు ఓమ్ భక్తులు. అక్కడి పశువులపై ప్రయోగించి చూశారు. సత్ఫలితాలు సాధించారు.

"ఇక టోక్యో సబర్బన్ రైళ్ళపైనే దాడి" ప్రకటించాడు అసహారా.

* * *

టోక్యో సబర్బన్ రైళ్ళల్లో 'సారిన్' ప్రయోగం ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. జపాన్ ప్రజలు భయభ్రాంతులయ్యారు.

అంతవరకూ అసహారా కార్యకలాపాల పట్ల ఉదాసీన వైఖరి చూపించిన ప్రభుత్వం వెంటనే రంగంలోకి దిగింది.

'ఓమ్' ఆశ్రమాలపై దాడులు ప్రారంభించింది. ఓమ్ అనుచరులను బంధించసాగింది.

ఇదంతా ముందే ఊహించిన అసహారా పరారయ్యాడు. 'ఓమ్' మతాన్ని ప్రభుత్వం నిషేధించింది.

* * *

ఓమ్ ఆశ్రమాల్లో లభిస్తున్న ఆయుధాలు, విషవాయువులు, జీవ రసాయన ఆయుధాలు జపాన్‌నే కాదు ప్రపంచాన్నే కుదిపేశాయి.

టోక్యో సబర్బన్‌పై దాడి జరిగిన రెండు నెలల తరువాత –

మే 16, 1995 న ఓ ఆశ్రమంలో నేలమాళిగలో దాగిన అసహారా పోలీసులకు పట్టుబడ్డాడు. ఒకరొకరుగా అసహారా ముఖ్య అనుచరులంతా లొంగిపోసాగారు.

ఏప్రిల్ 15, 2004 న జపాన్ కోర్టు అసహారాకు మరణశిక్ష విధించింది.

మనుషుల బలహీనతల ఆధారంగా ఒక వ్యక్తి ఎంత మారణహోమం సృష్టించగలడో అసహారా జీవితం నిరూపిస్తుంది.



© EMESCO BOOKS

# ప్రేమించే హృదయం!

**ప్రేమతో ప్రపంచాన్ని గెలవాలని,**
**ద్వేషాన్ని ప్రేమతో గెలిచిచూపిన యువకుడికథ.**

ఇన్నాళ్లూ దేనికోసం ఎదురుచూస్తున్నాడో ఆ ఘడియ దగ్గర పడ్తోంది.

ఇన్నాళ్లు తాను తపించిన గమ్యం చేరుకోబోతున్నాడు. అయినా ఎందుకీ సందిగ్ధం? ఇంతలో ఎందుకీ వైరాగ్యం?

28 ఏళ్ళ జెస్సీ బాంటింగ్ మనస్సు అల్లకల్లోలంగా ఉంది. 1985 లో ఆరంభమైన అన్వేషణ ఇప్పుడు (1993) పూర్తవుతోంది. ఈ ఎనిమిదేళ్లూ మరో ఆలోచన లేదు. ఇవాళ అది ఫలించబోతోంది. మనసులో ఏదో మూల ఓ శూన్య భావన అతడిని వేధిస్తోంది.

"నాన్నగారూ! నేనేం చేయాలి? నాకు సరైన మార్గం చూపించండి!" ఎనిమిదేళ్ళుగా అతనికి ఇది అలవాటైపోయింది.

ఎప్పుడు కష్టం వచ్చినా, సందిగ్ధం వెంటాడినా, ఆనాడు దారుణంగా హత్యకు గురైన తండ్రి గుర్తొస్తాడు. మనోధైర్యం కోసం ఆయనను ప్రార్థిస్తాడు. తన కళ్ళముందే తండ్రిని కారణం లేకుండా హతమార్చిన హంతకుడికోసం జెస్సీ వెతుకుతున్నాడు.

ఇన్నాళ్ళకు అతని అన్వేషణ ఫలించనుంది. కానీ ఈ సమయంలోనే ఏదో అధైర్యం....

తన అన్వేషణ ఆరంభమైన ఆరోజు జెస్సీ కళ్ళముందు కదలుతోంది.

* * *

డిసెంబర్, 1985.

జెస్సీ తండ్రి మిగ్యుల్ బాటింగ్ 16 సీటర్ టాక్సీ నడుపుతాడు. చాలా కష్టపడి డబ్బు సంపాదించి పొదుపుచేసి, ఆ టాక్సీ కొన్నాడు. తండ్రి జెస్సీకి నేర్పిన మొదటి పాఠం కూడా ఇదే.

"ఏదైనా సాధించాలన్న తపన ఉంటే చాలదు. అది సాధించే ప్రణాళిక ఉండాలి. ఆ తర్వాత నిజాయితీగా దానిని అమలు పరచాలి. ఎన్ని కష్టాలొచ్చినా లక్ష్యాన్ని మరచిపోకూడదు. అప్పుడు ఏదో ఒకనాడు నువ్వు అనుకున్నది సాధించి తీరతావు" ఆనాటి తండ్రి మాటలు జెస్సీ చెవుల్లో మారు మోగుతున్నాయి.

ఎప్పటిలాగే ఆ రోజు కూడా ఇంజనీరింగ్ తరగతి పూర్తి చేసుకుని తండ్రికోసం ఎదురుచూస్తూ నుంచున్నాడు 21 ఏళ్ళ జెస్సీ. ఆటోలో తండ్రితోపాటు అమ్మ, చెల్లెలు కూడా ఉండటం చూసి ఆశ్చర్యపోయాడు.

"ఏమిటీ విశేషం?" ఆనందంగా అడిగాడు.

"క్రిస్మస్ పార్టీ" చెప్పింది చెల్లెలు.

"యా హూ" అని అరుస్తూ ఒక్క గెంతులో టాక్సీలో చేరాడు జెస్సీ. ఇంతలో ఓ మనిషి తూగుతూ వచ్చాడు.

"ఎంతో సేపటినుంచి టాక్సీ కోసం ఎదురుచూస్తుంటే నువ్విక్కడున్నావా? పనిమీద శ్రద్ధ లేదా?" కోపంగా అన్నాడతడు.

అతడు బాగా తాగి ఉన్నాడని జెస్సీ గ్రహించాడు. ఎవరూ ఏమీ మాట్లాడలేదు. తప్పులేకున్నా "సారీ సర్ కూచోండి" అన్నాడు మిగ్యుల్.

తండ్రి స్వభావం జెస్సీకి బాగా తెలుసు. అతను ఎవరితోనూ అనవసరంగా వాదనలు పెట్టుకోడు.

"ప్రతి మనిషికీ అహంకారం ఉంటుంది. దాన్ని దెబ్బతీస్తే ఆవేశాలు పెరుగుతాయి. ఆవేశంలో మనిషి పశువు అవుతాడు. మరో మనిషిలోని పశువును జాగృతం చేసి చిక్కుల్లో పడే బదులు మన అహంకారాన్ని అణుచుకుని 'సారీ' చెప్తే గొడవ సమసి పోతుంది. అవతలి వారికీ సంతోషం, మనకీ సుఖం" అంటాడు మిగ్యుల్.

అందుకే ఆ తాగుబోతుకి తండ్రి 'సారీ' చెప్తూంటే జెస్సీ ఏమీ అనలేదు. ఆ తాగుబోతు తనలో తాను గొణుక్కుంటూ టాక్సీలో కూచున్నాడు.

"డబ్బులు" అడిగింది తల్లి. వెంటనే అతడికి కోపం వచ్చింది.

"రావటమే ఆలస్యంగా వస్తారు. ఇంకా డబ్బులు కూడా నా" అని తిట్టటం మొదలుపెట్టాడు.

మిగ్యుల్ వెనక్కు తిరిగి "పోన్లే ... డబ్బుల్లేకపోతే ఇవ్వనక్కర్లేదు" అన్నాడు టాక్సీ స్టార్టు చేస్తూ.

కానీ తాగుబోతుకి ఆ మాటలు అవమానకరంగా అనిపించినట్టున్నాయి.

బండి దిగి డ్రైవర్ వైపు వెళ్ళాడు.

"ఏమన్నావు" అంటూ అరిచాడు.

© EMESCO BOOKS

"నేనేమనలేదు సార్. ఎక్కడికి తీసుకెళ్ళాలో చెప్పండి. తీసుకెళ్తాను" మర్యాదగా అన్నాడు మిగ్యుల్.

ఆ తర్వాత జరిగింది సినిమా రీలులా, స్లో మోషన్‌లో కదుల్తోంది జెస్సీ కళ్ళముందు.

ఆ తాగుబోతు వెంటనే కత్తిదీశాడు.

"తీసుకో డబ్బులు" అంటూ మిగ్యుల్‌ను విచక్షణ రహితంగా పొడవసాగాడు.

జెస్సీ ఒక్క దూకులో వాళ్ళను చేరాడు. కానీ అప్పటికే ఆ తాగుబోతు మిగ్యుల్‌ను పొడిచి చీకట్లో కలిసిపోయాడు.

వెంటనే జెస్సీ టాక్సీని దగ్గరలో ఉన్న ఆస్పత్రివైపు పరుగెత్తించాడు. కానీ గాయలు లోతుగా కావటంవల్ల ఆస్పత్రి చేరేలోగా మిగ్యుల్ మరణించాడు. ఒక్క క్షణంలో జెస్సీ ప్రపంచం మారిపోయింది. ఒక పిచ్చివాడి విచక్షణారహిత ప్రవర్తన అతని కలల ప్రపంచాన్ని నిర్దాక్షిణ్యంగా కాలరాసింది.

* * *

తన తండ్రిని చంపినతని పేరు 'పాల్ అలిగెన్' అని పోలీసుల ద్వారా తెలుసుకున్నాడు జెస్సీ.

జెస్సీకి అలిగెన్ పేరు మీద వారెంట్‌ను ఇచ్చారు. కానీ అతడు దొరకలేదు. ఎక్కడకు పారిపోయాడో తెలియలేదు.

"మనం పేదవాళ్లం. మనం చనిపోయినా, బతికినా పట్టించుకునేదెవరు?" నిస్పృహగా అంది అతని తల్లి – పోలీసు స్టేషన్ చుట్టూ తిరిగి, నిరాశగా ఇంటికి వస్తున్న కొడుకును చూసి.

"మన జీవితాన్ని నాశనం చేసిన వాడిని వదలనమ్మా. పట్టుకుంటాను"

'హంతకుడ్ని పట్టుకునేవరకూ తనకు మనశ్శాంతి లేదని' జెస్సీకి తెలుసు. ఎందుకంటే, కళ్ళు మూసినా, తెరిచినా ఆనాటి దృశ్యమే. అది అతని కళ్లలో తిష్ట వేసుకుంది.

* * *

డబ్బుల్లేక చెల్లెలు, తమ్ముడు చదువులు మానేయాల్సి వచ్చింది. జెస్సీ కూడా చదువు మానేశాడు. టాక్సీ నడుపుతూ కుటుంబాన్ని పోషించసాగాడు.

తాను ద్వేషం, పగతో రగులుతుంటే, తన కుటుంబం పస్తులు పడుకోవాల్సి వస్తుందని గ్రహించాడు జెస్సీ. తాత్కాలికంగా తన ప్రతీకార వాంఛను పక్కనపెట్టి కుటుంబాన్ని ఆదుకోవటంపై దృష్టి కేంద్రీకరించాడు.

తమ్ముడికి డ్రైవింగ్ రాగానే టాక్సీ అతడికి ఇచ్చి, తాను ఉద్యోగాల వేటలో పడ్డాడు. ఈ సమయంలో పరిచయమైన మేరీ ఆన్‌ను పెళ్ళి చేసుకున్నాడు. యాంత్రికంగా తన బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. కానీ 'పాల్'ను మరచిపోలేక పోతున్నాడు.



© EMESCO BOOKS

'ఎప్పటికైనా అతణ్ణి పట్టుకుని తీరతాను' అని మనసును సమాధాన పరచుకున్నాడు.

* * *

"నీ మనసులో ఇంత బాధ ఉందా? మా ఇల్లు అలిగెన్ ఇంటి దగ్గరే. వాళ్ళ బంధువుల ద్వారా అతడి ఆచూకీ తెలుసుకుంటాను" జెస్సీని బాధిస్తున్న విషయం విన్న అతని మిత్రుడు లియొలిన్ వాగ్దానం చేశాడు.

* * *

భయంకరమైన పీడకల నిజమైన భావన కలుగుతోంది జెస్సీకి. అలిగెన్ పాల్ ఆచూకి కనుక్కుంటానన్న లియొలిన్‌ను ఎవరో చంపేశారు. మిత్రుడి చావుకి తానే కారణమని కుమిలి పోతున్న జెస్సీ వద్దకు వచ్చింది లియొలిన్ చెల్లెలు.

"పాల్ కోసం లియొలిన్ వెతుకుతున్నాడని నాకు తెలుసు. పాల్ బంధువులు కొందరు మనీలాలో ఉన్నారు. పాల్ అక్కడ ఉన్నాడేమో! నువ్వు పాల్‌ని పోలీసులకు పట్టిస్తే లియొలిన్ ఆత్మకు శాంతి లభిస్తుంది" చెప్పిందామె.

"తప్పకుండా అతణ్ణి పట్టుకుని చంపుతాను" పిడికిళ్ళు బిగించి వాగ్దానం చేశాడు జెస్సీ.

* * *

లియొలిన్ చెల్లెలు ఇచ్చిన అడ్రసు పాల్ తమ్ముడు 'ఆల్బెర్టో అలిగెన్' చిరునామా అని కనుక్కున్నాడు జెస్సీ. మనీలాలో మంచి ఉద్యోగం దొరికే అవకాశం ఉందని, భార్యకు అబద్ధం చెప్పి అక్కడికి బయల్దేరాడు జెస్సీ.

జెస్సీ మనీలా చేరేసరికి అల్బెర్టో ఇల్లు ఖాళీ చేసి వెళ్ళిపోయాడని తెలిసింది. అయినా నిరాశ పడలేదు. అల్బెర్టో 'హెయిర్ డ్రస్సర్' పనిచేసేవాడని తెలుసుకున్న జెస్సీ మనీలా వీథులు తిరిగి ప్రతి 'హెయిర్ డ్రస్సర్' దుకాణంలోకి వెళ్ళేవాడు. అల్బెర్టో గురించి అడిగేవాడు. ప్రతిచోటా అతనికి నిరాశే!

వెంట తెచ్చుకున్న డబ్బు అయిపోసాగింది. రోజుకు ఒకేపూట తినటం మొదలెట్టాడు. చివరికి ఓ రోజు జెస్సీ శ్రమ ఫలించింది.

"ఈ మధ్యనే నేనో కొత్త మనిషిని తీసుకున్నాను. మీ ఊరువాడే. పేరు 'అల్బెర్టో అలిగెన్'.

ఆ మాట వినగానే జెస్సీ ఎగిరిగంతేశాడు. పాల్ దొరికినంత సంబరపడ్డాడు. అయితే అల్బెర్టోద్వారా పాల్ ఆ చూకీ గ్రహించేందుకు ఇంకాస్త సమయం పడుతుంది. కాబట్టి మనీలాలో ఉద్యోగం చూసుకోక తప్పదనే నిశ్చయానికి వచ్చాడు. అలా ఉద్యోగం వెతుకుతూంటే, అతని రొట్టె విరిగి నేతిలో పడ్డట్టు పోలీసు డిపార్ట్‌మెంట్‌లో డ్రైవర్ ఉద్యోగం దొరికింది.

* * *



© EMESCO BOOKS

తాను మనీలా ఎందుకు వచ్చాడో పోలీసు అధికారి విక్టర్‌కు వివరించాడు జెస్సీ.

పాల్ పేరుమీది అరెస్టు వారెంట్ విక్టర్‌కు చూపించాడు.

"పాల్ ఆచూకీ పరిశోధించే అనుమతి నాకు లేదు. ఎందుకంటే ఇక్కడ పాల్ నేరం చేయలేదు. కానీ నువ్వు పాల్‌ను గుర్తుపట్టి చూపిస్తే ఈ అరెస్టు వారెంట్ ఆధారంగా అతడిని అరెస్టు చేయగలను" వాగ్దానం చేశాడు విక్టర్.

* * *

ఆల్బర్ట్‌ను తరచుగా కలుస్తూ అతని అభిమానం సంపాదించాడు జెస్సీ. చివరికి ఒకరోజు ఆల్బెర్టో తన గోడు వినిపించాడు.

"నా అన్న నాకో గుది బండలా తయారయ్యాడు. ఆవేశం ఎక్కువ. ఉద్యోగం చెయ్యడు. పైగా అతడు తాగేందుకు నేను డబ్బులివ్వాలి".

జెస్సీ గుండె లయ తప్పింది. 'ఇదే మంచి సమయం' అని మనసులో అనుకున్నాడు.

"నాకు తెలిసిన వాళ్ళ దగ్గర ఒక మంచి ఉద్యోగం ఉంది. కావాలంటే నాకు ఫోన్ చెయ్యమను" తన టెలిఫోన్ నెంబరు ఆల్బెర్టోకు అందించాడు జెస్సీ.

* * *

మరుసటి రోజు టెలిఫోన్ దగ్గర ఉద్విగ్నతతో ఎదురుచూస్తూ కూచున్నాడు జెస్సీ. ఫోను మోగిన ప్రతీ సారీ పాల్ ఫోన్ చేస్తున్నాడనుకునేవాడు.

చివరికి జెస్సీ ఎదురుచూస్తున్న ఫోన్ రానే వచ్చింది. అయితే ఫోను చేసింది పాల్‌కాదు, అతని భార్య!

ఆమెకు పాల్‌కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగం గురించి గొప్పగా వర్ణించాడు జెస్సీ. జెస్సీ వర్ణన విని పాల్ భార్య చాలా సంతోషించింది.

"నిజంగా... మీరు చెప్పేదే నిజమైతే పాల్‌కి ఈ ఉద్యోగం వస్తే నేను, నా ముగ్గురు పిల్లలంత అదృష్టవంతులు ఉండరు" అంది.

మరుసటి రోజు పాల్ వచ్చి జెస్సీని కలుస్తాడని ఆమె వాగ్దానం చేసింది.

అయితే ఆమె మాటలు విన్న జెస్సీ హృదయం ఆనందంతో ఆకాశానికి ఎగరలేదు.

ఆవేదనతో బద్దలయింది.

పాల్‌కు ముగ్గురు పిల్లలా!

జెస్సీ భద్రంగా దాచుకున్న కత్తిని విసిరేశాడు. తను పాల్‌ను చంపలేదు. తన తండ్రి మరణం వల్ల అస్తవ్యస్తమైన తమ జీవితాలు అతనికి గుర్తు వచ్చాయి. ఎదుటివాడు చేసిన తప్పే తాను చేయటంలో అర్థం ఉందా?



© EMESCO BOOKS

ఇప్పుడు పాల్‌ని తాను చంపితే, అతని భార్య, పిల్లలు అనాథలవుతారు. అతని కళ్ళముందు తండ్రికై రోదిస్తూ అడుక్కుంటున్న ముగ్గురు పిల్లలు కనిపించారు. నేలమీద మోకాళ్ళపై కూర్చుని ప్రార్థించ సాగాడు జెస్సీ.

"నాన్నగారూ! నేనేం చేయాలి? గమ్యం చేరుకునే సమయంలో నాకీ విషమ సమస్య ఏమిటి? పాల్‌కు శిక్షపడాలి. కానీ అతను చేసిన నేరం పిల్లల మీద పడకూడదు"–

తెల్లవారుతుంటే జెస్సీ చెవుల్లో అతని తండ్రిస్వరం గుసగుసలాడింది.

"పాల్‌ను శిక్షించే అధికారం చట్టానికే ఉంది. ద్వేషానికి ద్వేషం సమాధానం కాదు. అన్యాయానికి సమాధానం అన్యాయం కాదు. ద్వేషాన్ని ప్రేమతో జయించు. అన్యాయాన్ని న్యాయంతో ఎదుర్కో".

జెస్సీ కళ్ళనుండి ఆనందభాష్పాలు రాలాయి. అతని సందేహాలన్నీ పటాపంచలయ్యాయి.

* * *

ఉద్యోగం కోసం జెస్సీని కలిసేందుకు వచ్చిన పాల్‌ను పోలీసులు అరెస్టు చేశారు. మరుసటి రోజు పత్రికల వాళ్ళు, టివీల వాళ్ళు జెస్సీని చుట్టు ముట్టారు.

"1985 లో చాకోలోడ్ నగరంలో హత్య చేసిన పాల్ అలిగెన్ ఎనిమిదేళ్ళ తరువాత పట్టుబడ్డాడు" అని ప్రకటించాడు విక్టర్.

ఎనిమిదేళ్ళపాటు అవిశ్రాంతంగా తన తండ్రి హంతకుడిని వేటాడుతూ పట్టుకున్నాడు జెస్సీ. అంతే! క్షణాలమీద కెమెరాలు క్లిక్‌మన్నాయి. ఫ్లాష్ బల్బులు వెలిగాయి.

"నాకిప్పుడు పాల్‌మీద ద్వేషంలేదు. జాలి ఉంది. క్షణికావేశంలో చేసిన నేరం వల్ల ఇన్నాళ్ళకి పట్టుబడ్డాడు. కానీ నా బాధంతా అతడి సంతానం గురించే. తల్లిదండ్రులు చేసిన నేరాలకి పిల్లలకు శిక్షపడకూడదు. అందుకే, పాల్‌ను పట్టుకున్నందుకు బహుమానంగా నాకు లభించిన ధనాన్ని అతని కుటుంబానికే అందిస్తున్నాను. ద్వేషంతో కాదు, ప్రేమతో ప్రపంచాన్ని గెలవాలని నాన్న ఇచ్చిన స్ఫూర్తితో!" హాలు కరతాల ధ్వనులతో మార్మోగింది.

అతను మనసులో తృప్తి పడ్డాడు.

* * *

అక్టోబర్ 11, 1993.

కోర్టు పాల్‌కు 8 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించింది.

తీర్పు వెలువడిన నాలుగు నెలలకు జెస్సీ భార్య మగపిల్లవాడిని ప్రసవించింది. అతడికి తన తండ్రి జ్ఞాపకార్థం 'జస్టిస్ మిగ్యుల్' అని పేరు పెట్టుకున్నాడు జెస్సీ!

© EMESCO BOOKS

# ఇది అన్యాయం

**తనకి జరిగిన అన్యాయం మరొకరికి జరగకూడదని శాంతియుత పోరాటం జరిపి అమెరికా న్యాయవ్యవస్థని కదిలించిన తల్లిగాథ.**

"**ఇది** అన్యాయం!" ఆవేదన, ఆక్రోశం కలగలిపి పలికింది డెబ్బీ లక్.

'క్లిక్, క్లిక్' – ఫ్లాష్ లైట్ల వెలుగు.

ఆవేదనా భారంతో కన్నీళ్ళు కారుస్తున్న డెబ్బీ ముఖానికి దగ్గరగా టీవీ కెమెరాలు వెళ్ళాయి.

'ఇది అన్యాయం. ఒక వ్యక్తిని హత్య చేస్తే కనీసం 21 ఏళ్ళ జైలు శిక్ష పడుతుంది. అదే ఆక్సిడెంట్ చేసి పారిపోతే, అందువల్ల ఎవరైనా చనిపోయినాసరే శిక్ష రెండేళ్ళేనా? అదీగాక, ఇటువంటి నేరం మొదటిసారి జరిగితే మరీ ఘోరంగా కేవలం హెచ్చరించి వదిలేస్తారా? ఇదెక్కడి న్యాయం? ఒక నిండు ప్రాణాన్ని బలిగొన్న వ్యక్తికి హెచ్చరింపు మాత్రమే శిక్షనా? ఇదేనా న్యాయం?!"

ఆవేశంతో ప్రశ్నిస్తున్న ఆమెను చూస్తుంటే ప్రతివారికీ తమ న్యాయ వ్యవస్థలోని లోపం అర్థమవుతుంది.

ఆమె తన చేతిలోని ఫోటోని ఎత్తి పట్టుకుంది. కెమెరాలన్నీ ఫోటో పై కేంద్రీకృతమయ్యాయి.

"చూడండి. వీడే కిప్ టర్నర్. నాలుగు రోజుల క్రితమే పదకొండవ పుట్టినరోజు జరుపుకున్నాడు. ఈ దుర్మార్గుడు 'పాలెంకాస్' గుడ్డిగా కారు నడుపుతూ కొట్టి చంపే వరకూ జీవంతో తొణికిసలాడుతుండేవాడు. వాడి కళ్ళల్లో మెరుపు చూడండి. వాడి వదనంలో అమాయకత్వం చూడండి. తెలివి చూడండి. పెదవులపై చిరునవ్వు చూడండి. వాటిని క్షణంలో, శాశ్వతంగా చెరిపేసిన దుష్టుడికి శిక్ష 'హెచ్చరింపు' మాత్రమేనా? ఆ హెచ్చరింపు కిప్‌కు,

© EMESCO BOOKS

నాకు శాశ్వతంగా జరిగిన దారుణమైన అన్యాయాన్ని సరిచేస్తుందా? నేనూరుకోను. ఈ అన్యాయాన్ని సహించను. నేరానికి తగ్గ శిక్ష పడకపోతే నేరస్తులకు భయముండదు. నేరం చేసి తేలికగా తప్పించుకోవచ్చన్న ధైర్యం ఉంటుంది. నేరస్తులకు అలసత్వం వస్తుంది. నాకు న్యాయం జరిగే దాకా పోరాడతాను.”

అమెరికా ప్రజలు బాధతో, ఆశ్చర్యంతో చూస్తుండగా అందరిముందు ప్రతిజ్ఞ చేసింది డెబ్బీ లక్ (Debby Luck).

* * *

డెబ్బీ లక్ ఆక్రోశం అమెరికా ప్రజలలో ముఖ్యంగా ‘అరిజోనా’లో కలకలం రేపింది. న్యాయస్థానంలో డెబ్బీకి అన్యాయం జరిగిందని ప్రతివారి మనసు ఒప్పుకుంది. ఆమెకు న్యాయం జరగాలన్న కోరికను ప్రతి ఒక్కరూ వ్యక్తపరిచారు.

వార్తా పత్రికలలో డెబ్బీకి మద్దత్తుగా ఉత్తరాల వర్షం కురిసింది.

అరిజోనాలోని ప్రతి సంస్థ, ప్రతి సంఘం డెబ్బీకు న్యాయం జరగాలని పిలుపు నిచ్చాయి.

చివరికి అరిజోనా లెజిస్లేచర్ పాట్టి నోలాండ్ (Patti Naland) కు ప్రజాభిప్రాయాన్ని మన్నించక తప్పలేదు.

* * *

“నా పేరు పాట్టి నోలాండ్, ఈమె నీల్ మిల్లర్, కిప్ కేసు న్యాయవాది” తమని తాము పరిచయం చేసుకున్నారు.

“నేను డెబ్బీ లక్. కిప్ తల్లిని” ఆమె కళ్ళల్లో నీళ్ళూరసాగాయి.

“కేసు వివరాలు చెప్తారా?” అడిగింది నోలాండ్.

“1994 ఏప్రిల్ 12న సాయంత్రం 7.45 గంటలకు తన తండ్రితో కలసి నడుస్తూ వస్తున్న కిప్‌ను వేగంగా మలుపు తిరిగిన కారు గుద్దేసి ఆగకుండా వెళ్ళిపోయింది. కారు ముందరి భాగం కిప్ నడుముకు, కాలికి తగలటంతో కింద పడ్డాడు. దాంతో తల బంపర్‌కి తగిలింది. ఆ దెబ్బకి కిప్ నడుము విరిగింది. తల పగిలింది. చివరకు ప్రాణం కోల్పోయాడు” దుఃఖంతో డెబ్బీ గొంతు పూడుకుపోయింది.

చాలా సేపు వారి మధ్య నిశ్శబ్దం. కళ్ళు తుడుచుకుని, కాస్త కుదుటపడిన తర్వాత మళ్లీ చెప్పసాగింది డెబ్బీ.

కేసును డిటెక్టివ్ షాన్ ట్విచెల్‌కు అప్పగించారు. ఆయన నిజంగా ఎంతో శ్రద్ధగా పరిశోధించాడు. ఆక్సిడెంట్ స్థలంలో పసుపురంగు ప్లాస్టిక్ ముక్కలు పడి ఉండటాన్ని



© EMESCO BOOKS

గమనించాడు. ఆ ముక్కలు గోరు కన్నా చిన్నవిగా ఉన్నాయి. వాటిని ఏరి కారు గురించి తెలిసిన నిపుణుల దగ్గరకు తీసుకు వెళ్ళి పరిశోధించాడు. ఇటువంటి ప్లాస్టిక్‌ను ఇంగ్లండ్‌కు చెందిన ఒకే కంపెనీ తయారుచేస్తుందని తెలిసింది. దాన్ని 1981 తర్వాత తయారైన రోల్స్‌రాయిస్ కార్లలోనే వాడతారని, వాటిపై వాడిన రంగును 1984 తరువాతనే వాడటం ఆరంభించారని తెలిసింది.

"ఇవన్నీ మీకెలా తెలిశాయి?" అడిగింది మిల్లర్.

"షాన్ నిజంగా మంచి డిటెక్టివ్. మానవత్వమున్న మనిషి. పరిశోధనా క్రమంలోని విషయాలు ప్రతిక్షణం ఎప్పటికప్పుడు తెలుపుతూ నా ఆవేదనను తగ్గించే ప్రయత్నం చేశాడు. ఆయన పట్టుదల, నైపుణ్యం, నా కొడుకు మరణం నాలోనే కాక, మరొకరిలో కూడా స్పందన కలిగించిందన్న భావన నిచ్చింది. నాకు సాంత్వన చేకూర్చింది."

"తరువాత?" అడిగింది నోలాండ్.

"1984 తరువాత రోల్స్ రాయిస్ కార్లు కొన్న వారందరి జాబితాను కంప్యూటర్‌నుండి సేకరించాడు షాన్. అరవైమంది పేర్లొచ్చాయి. ఆ జాబితా ప్రకారం ఒకరొకరిని పరిశీలిస్తూ పోయారు. 67 ఏళ్ళ ఎడ్వర్డ్ పాలెంకాస్ దొరికాడు. అతడు తన కారును పోలీసులు పరిశీలించేందుకు ఇష్టపడలేదు. దాంతో పోలీసులు వారంటు తీసుకువచ్చి అతడి కారును పరిశీలించారు. ఆక్సిడెంటు జరిగిన విధానానికి తగ్గట్టుగా కారు బంపర్‌లో గుంటలు కనిపించాయి. అక్కడ కూడా రక్తం మరకలు కనిపించాయి. దాంతో పాలెంకాస్ నేరం ఒప్పుకున్నాడు. నేరస్తుడు దొరికినందుకు నాకెంతో ఆనందం కలిగింది. కానీ..."

మాట్లాడడం ఆపి డెబ్బీ రెండు చేతులతో మొహం దాచుకుంది.

నోలాండ్ పక్కనే ఉన్న మిల్లర్‌వైపు తిరిగింది.

"ప్రమాదం జరిగిన నాలుగైదు రోజులకు గానీ పాలెంకాస్ దొరకలేదు. దాంతో అతడు తాగి ఉన్నాడో లేదో నిరూపించే వీలు కలగలేదు. కాబట్టి అతడిపై హత్యానేరం మోపలేకపోయాం. చట్ట ప్రకారం, ఆక్సిడెంట్ చేసి పారిపోయిన కేసులో మరణం సంభవించినా రెండేళ్ళే శిక్ష. అదీ మొదటిసారి అయితే హెచ్చరించి వదిలేస్తాం".

"సిగ్గుచేటు" అరిచింది నోలాండ్ బాధగా.

విషాదంగా నవ్వింది డెబ్బీ.

"ఈ ఫోటో చూడండి. ఇందులో నేపథ్యంలోని కాక్టస్ చెట్టును దొంగిలిస్తే ఇంతకన్నా కఠినమైన శిక్ష పడుతుంది."

అవునన్నట్టు తల ఊపింది మిల్లర్.



© EMESCO BOOKS

"మిల్లర్... కేసును కొత్త కోణంలో పరిశోధించాలి. ఎలాగైనా పాలెం కాస్ తాగి కారు నడిపేడని ఋజువులు కావాలి" అంది నోలాండ్.

"ఇప్పుడు పాలంకాస్‌కు శిక్ష పడటం కన్నా, చట్టంలో మార్పు రావటం కావాలి నాకు" చెప్పింది డెబ్బీ.

తల పంకించింది నోలాండ్.

* * *

మిల్లర్ చెప్పింది శ్రద్ధగా విన్నాడు పాల్ అహ్లర్ (Paul Ahler).

"మిల్లర్ చెప్పింది రెండు కోణాల్లో పరిశోధించవచ్చు. ఆరోజు పాలెంకాస్ పార్టీనుండి వస్తున్నాడని తెలిసింది కదా! పార్టీలో ఉన్న వారిని ప్రశ్నించాలి. వారి ద్వారా పాలెంకాస్ తాగివున్నాడో, లేదో తెలుస్తుంది. మరోవైపు కారుని మళ్ళీ పరిశోధించాలి. కారు బంపర్‌ను ల్యుమినాల్ (Luminol) తో పరీక్షించాలి".

"దానివల్ల ఏం లాభం?"

"ల్యుమినాల్‌కో లక్షణం ఉంది. ఒక్క చిన్న చుక్క రక్తాన్ని తాకినా ల్యుమినాల్ పచ్చరంగులో మెరుస్తుంది. కారు బంపర్ మీద రక్తం మరకలుంటే ల్యుమినాల్ మనకు చెప్తుంది."

"ఇన్ని రోజుల తరువాత కూడానా?" నవ్వాడు పాల్–

"నిజానికి కాలం చెల్లే ప్రసక్తి లేదు. అది నిప్పులాంటిది. ఎంత కాలమైనా అణగి ఉంటుంది. అవకాశం దొరకగానే అణచినవాడిని దహించివేస్తుంది."

* * *

ఆరిజోనా లెజిస్లేచర్‌లో నోలాండ్ చేసిన వాదనను అందరూ శ్రద్ధగా విన్నారు. ముఖ్యంగా కిప్ ఫోటో చూపించి, ఫోటోలోని మనిషిని చంపినందు కన్నా, నేపథ్యంలో ఉన్న కాక్టస్‌ను దొంగిలించినందుకు శిక్ష ఎక్కువ అని తెలిసి అందరూ సిగ్గుతో తల వంచుకున్నారు.

"ఈ పరిస్థితి మారాలంటే చట్టం మారాలి. కాబట్టి ఆక్సిడెంట్ చేసి ఆగకుండా పారిపోయే వారికి అందువల్ల మరణం సంభవిస్తే ఏడేళ్ళు, లేకపోతే రెండున్నర ఏళ్ళు కనీసం జైలు శిక్ష ఉండాలి!"

అలా ప్రవేశపెట్టింది ఆరిజోనాలో చట్టాన్ని మార్చిన కిప్స్ లా అనే కిప్ చట్టం!

* * *



© EMESCO BOOKS

జూన్ 20, 1995.

కొత్తగా లభించిన సాక్ష్యాధారాలు మేరకు పోలీసులు పాలెంకాస్ కేసును తిరగదోడారు. ఈసారి అతడిపై హత్య కేసుపెట్టారు.

ప్రమాదం జరిగే ముందు పాలెంకాస్ తాగి ఉన్నాడని బార్‌లో అతడికి మద్యం అందించిన బార్టెండర్ సాక్ష్యం చెప్పాడు.

పాలెంకాస్ ఎంతగా తాగి ఉన్నాడంటే, ఇగ్నిషన్‌లో తాళం చెవి ఉంచలేకపోయాడని వాచ్‌మెన్ చెప్పాడు.

క్రైమ్ లాబ్ అధికారి గారెట్, ల్యుమినాల్ పరీక్ష ఫలితం కోర్టులో అందరి ముందు చెప్పాడు.

కారుపై రక్తం మరకలే కాదు, దాన్ని తుడిపినట్టు టిష్యూ, ఫైబర్లు దొరకటం నిరూపిస్తుందని చెప్పాడు. అంతేకాదు కారును శుభ్రపరిచేందుకు వాడిన రసాయనాలను కూడా ల్యుమినాల్ పరీక్షద్వారా కనుగొన్నాడాయన.

ఇన్ని ఋజువులు సమర్పిస్తున్నా తాను నిర్దోషినని పాలెంకాస్ వాదించాడు.

తాను ఒక మనిషిని గుద్దేశానని తను గమనించలేదని, అందుకే ఆగలేదని వాదించాడు.

కానీ కోర్టు అతని కల్లబొల్లి కబుర్లను నమ్మలేదు.

1995 జూలై 12న పాలెంకాస్ 'దోషి' అని కోర్టు తీర్పునిచ్చింది.

* * *

పాలెంకాస్ 'దోషి'గా కోర్టు నిర్ణయించిన తొమ్మిది గంటల తరువాత 'కిప్స్'లా అమలులోకి వచ్చింది. అయితే పాలెంకాస్‌కు మాత్రం ఆ చట్టం ప్రకారం శిక్షపడే అవకాశం లేదు.

పాలెంకాస్‌కు శిక్షపడటం, కిప్స్‌లా అమలులోకి రావటం డెబ్బీకి సంతోషం కలిగింది.

"ఇప్పుడు నాకు సంతృప్తిగా ఉంది. మరో దుర్మార్గుడు నేరం చేసి తేలికగా తప్పించుకునే అవకాశం లేదు. ఇక మరో తల్లికి అన్యాయం జరగదు. నా కిప్ మరణించలేదు. కిప్స్‌లా పేరుతో ఎప్పటికీ చిరంజీవి గానే ఉంటాడు. తన తల్లి అనుభవించిన శోకం మరే తల్లి అనుభవించకుండా చూస్తాడు" అంది కన్నీళ్ళ మధ్య డెబ్బీ.



© EMESCO BOOKS

# విరబూసిన ప్రేమ అరవిందం!

**అసలు సౌందర్యం ఆత్మసౌందర్యం అని నిరూపించే ప్రేమకథ ఇది.**

**1997**... నూతన సంవత్సర సంబరాల రోజు.

హాలంతా నృత్యం చేసే జంటలతో సందడిగా ఉంది. కొత్త సంవత్సరాన్ని ఆహ్వానించేందుకు సంతోషంగా సిద్ధమౌతున్నారు. అంత మందిలోనూ –

అందరి దృష్టి నృత్యం చేస్తున్న స్టీవ్, డయానాలపైనే!

సమయం అర్ధరాత్రి 12 గంటలు కావస్తోంది.

సెకన్లు పెద్దగా లెక్క పెట్టసాగారు. ఆ లెక్కకు తగ్గట్టు గంటలు కొడుతున్నారు. అయిదు.... నాలుగు.... మూడు ... రెండు ... ఒకటి!

'హుర్రే' సంతోషంగా నూతన సంవత్సరాన్ని ఆహ్వానిస్తున్నారందరూ–

ఇంతలో ఎవరూ ఊహించని సంఘటన జరిగింది.

స్టీవ్ మోకాళ్ళమీద నిలబడి, డయానా ఒక చేయిని పట్టుకుని, తలవంచి పెద్ద గొంతుతో అడిగాడు...

"డయానా! నేను నిన్ను ప్రేమిస్తున్నాను. నన్ను పెళ్ళి చేసుకుంటావా?"

డయానా అతని వైపు తీవ్రంగా చూసింది. చేయి విసిరి కొట్టి కుంటుకుంటూ గదిదాటి వెళ్ళిపోయింది.

పన్నెండేళ్ళ వయసులోనే, బోన్‌కేన్సర్ వల్ల ఆమె కుడికాలు తీసివేశారు డాక్టర్లు!

* * *

© EMESCO BOOKS

తన కుడికాలు లేనందుకు కొన్నాళ్ళు బాధపడ్డా, బాధను జయించి అడుగు ముందుకు వేయకపోతే తన జీవితం వ్యర్థమౌతుందని అర్థం చేసుకుంది డయానా. అందుకే, ఒక కాలితోనే, తనకు ఇష్టమైన స్కీయింగ్ చేయడం ఆరంభించింది. అంతేకాదు, క్రచెస్‌తోనే ఆమె పరుగుపందేలలో పాల్గొనేది.

'అంగవైకల్యం భౌతికమే కానీ మానసికంకాదు. మనిషి తలచుకుంటే భౌతిక లోపాలను మనోశక్తితో అధిగమించగలడు' అనేది డయానా, ఎవరైనా ఆమె కార్యకలాపాలను అడ్డుపడాలని చూస్తే. ఆమె కాలేజీలో చదివే సమయంలో అనేకమంది ఆమెను ఆరాధించేవారు. ఆమె ఆత్మ స్థయిర్యాన్ని చూసి అభినందించేవారు. వారిలో స్టీవ్ బ్రోస్ని హాన్ ఒకడు. అయితే స్టీవ్ ఆమెను దూరం నుంచే చూసి సంతోషించేవాడు. ఆరాధించేవాడు. ఆమెను పలకరించాలంటే ధైర్యం సరిపోయేది కాదు.

1984 లో చదువు పూర్తయిన తరువాత డయానా తన దృష్టిని అంగవైకల్యం కలవారి ఆటలవైపు నిలిపింది.

స్కీయింగ్‌లో ఆమె ముందు కాళ్ళున్నవారు కూడా నిలవలేకపోయేవారు. పరుగుపందేలలో ఆమె ఇతరులకు గట్టిపోటీ ఇచ్చేది.

దాంతో ప్రపంచవ్యాప్తంగా డయానా, వికలాంగుల ఆత్మవిశ్వాసానికి ప్రతీకగా ఎదిగింది. వారి ఆత్మగౌరవంగా నిలిచింది.

ఆమె ఉపన్యాసాలు వికలాంగులలో నిరాశని పారదోలి, ఆత్మ స్థయిర్యాన్ని నింపేవి.

'కాలు లేదు. దానికి బాధపడాల్సిన అవసరం లేదు. కాలు శరీరంలోని ఓ భాగమే తప్ప అదే శరీరం కాదు. మనం ఎవరికీ తక్కువ కాదు' అంటూ ఆమె దేశమంతా తిరిగి వికలాంగులను ప్రేరేపించసాగింది. అంతేకాదు, వరుసగా ఛాంపియన్ షిప్పులు గెలుస్తూ, అందరినీ ఆశ్చర్యచకితులను చేయసాగింది.

1988 లో జరిగిన 'కాల్గరీ ఒలింపిక్స్'లో వికలాంగుల పోటీల్లో బంగారు పతకం సాధించింది. అలా మొత్తం ఆమె అమెరికాకు చెందిన పోటీల్లో 19 బంగారు పతకాలు, ప్రపంచ వికలాంగుల పోటీల్లో పది బంగారు పతకాలు సాధించింది. 1990 లో ఆమె అథ్లెటిక్స్ నుంచి విరమిస్తున్నట్టు ప్రకటించింది. ఆ సంవత్సరం మహిళల 'స్పోర్ట్స్ ఫౌండేషన్' ఆమెకు 'ఫ్లో హైమాన్' బహుమతినిచ్చి సత్కరించింది. అంతకుముందు ఈ అవార్డును గెలుచుకున్న వారిలో మార్టినా నవ్రతిలోవా, క్రిస్ ఎవర్ట్‌వంటి వారున్నారు.

ఇంతలో హఠాత్తుగా డయానాకు మరో దెబ్బ తగిలింది. 1992 లో ఆమెకు బ్రెస్ట్ కేన్సర్ ఉందని డాక్టర్లు నిర్ధారించారు. ఈ వార్త ఆమెను కుంగదీసింది. కానీ అదీ కొంత కాలమే.



© EMESCO BOOKS

'ఒక వక్షోజం లేకపోతే నష్టం ఏముంది? పిల్లల్ని కనవచ్చు. వాళ్ళకి పాలివ్వచ్చు' అని నవ్వుతూ మిత్రులతో అనేది. తన సమస్యను ధైర్యంగా ఎదుర్కొంది.

అయితే కాన్సర్ చికిత్సలో భాగంగా డాక్టర్లు చేసే కీమోథెరపీ ఆమె శక్తిని హరించసాగింది. ఆమె సరిగ్గా వ్యాయామం కూడా చేయలేకపోయేది. ఇన్నాళ్ళు లేనిది 'తాను అందవికారంగా ఉంది' అన్న భావన ఆమెను పట్టి పీడించసాగింది.

ఒకరోజు అద్దంలో తనని తాను పరీక్షించుకుంది. తన కాలిపై, ఛాతీపై ఉన్న గాయాల మరకలను పరిశీలించింది.

"ఇవన్నీ జీవితం నా శరీరంపై మిగిల్చిన మరకలు. ప్రతివ్యక్తికీ గాయాలౌతాయి. ఆ గాయల తాలూకు మరకలు జీవితాంతం బాధిస్తాయి. కానీ ఈ గాయాలను నా మనసుదరికి చేరనివ్వను. నేను బతికినంత కాలం సంతోషంగా బతుకుతాను. భగవంతుడు పెట్టే కష్టాలను ధైర్యంగా ఎదుర్కొంటాను". అని తనికి తాను ధైర్యం చెప్పుకుంది.

అంతలో మరో దెబ్బ.

"డయానా! నీకు యుటెరస్ కేన్సర్ ఉంది. మొత్తం యుటెరస్ తీసివేయాలి" డాక్టర్ల మాటలు ఆశనిపాతంలా తగిలాయి.

డయానా కుప్పకూలి పోయింది.

"నేను పిల్లల్ని కనలేను – అన్న భావన నన్ను కుంగదీసింది. ఇక నా జీవితానికి అర్థమే లేదనిపించింది" అంటుంది డయానా ఆ రోజులను గుర్తుకు తెచ్చుకుని.

తను బతికి లాభం లేదని డయానా నిద్ర మాత్రలు మింగింది. కానీ అంతలోనే తన చర్యలోని నైచ్యం అర్థమైంది డయానాకు.

'భగవంతుడి రచనలో ప్రతి జీవితానికి ఓ పరమార్థం ఉంటుంది. బహుశా, ఎన్ని దెబ్బలు తగిలినా, ఎన్ని నష్టాలు అనుభవించాల్సివచ్చినా, మనిషి ధైర్యం కోల్పోకూడదని ప్రపంచానికి చాటి చెప్పటమే నా జీవితానికి అర్థమేమో, మానవుడి ఆత్మశక్తి ముందు ఎటువంటి శక్తులైనా దిగదుడుపులేనని నిరూపించటమే నా జీవిత పరమార్థమేమో! కష్టాలకు లొంగకుండా, వాటికి ఎదురునిలిచి సవాల్ చేయటమే తన జీవిత లక్ష్యమేమో' – స్పృహ తప్పుతుండగా ఈ ఆలోచన వచ్చింది డయానాకు. వెంటనే తన స్నేహితురాలికి ఫోన్ చేసింది డయానా. ఆ తరువాత స్పృహ తప్పి పడిపోయింది.

* * *

© EMESCO BOOKS

ప్రపంచ ప్రఖ్యాత కార్టూనిస్టుగా ఎదిగినా స్టీవ్ దయానాను మరిచిపోలేక పోతున్నాడు. అతను కోరుకుంటే ఎంతోమంది అమ్మాయిలు సంతోషంగా అతడిని పెళ్ళి చేసుకునే వారు. కానీ స్టీవ్ మనసు కాలేజీ నుండే దయానాపైన స్థిరపడింది.

అందంగా అలంకరించుకుని తిరిగే అమ్మాయిలెవరూ అతనికి నచ్చటం లేదు.

'అందమన్నది ఒక భావన. భౌతికంగా కనిపించే అందం క్షణికం, అశాశ్వతం. మానసిక అందమే అసలైన అందం. తన లోపాలను అధిగమించటమే కాదు, ఇతరులకు కూడా ఆత్మవిశ్వాసాన్నిచ్చే వ్యక్తిత్వంలోని అందం ముందు మిగతా కాస్మెటిక్ అందాలన్నీ దిగదుడుపే' అన్నది స్టీవ్ విశ్వాసం.

పైగా అతనికి యవ్వనంలోనే నిజమైన ఆత్మసౌందర్యం ఉన్న వ్యక్తిగా దయానా తెలుసు. అందుకే అతను ఇతరుల నెవ్వరినీ మెచ్చలేకపోయాడు.

ఇంతలో అతనికి దయానా ఆత్మహత్య ప్రయత్నం వార్త తెలిసింది.

సాధారణంగా ప్రతి వ్యక్తిలో కష్టాలను సమర్థవంతంగా ఎదుర్కొనే ధైర్యం ఉంటుంది. కానీ ప్రతి వ్యక్తికీ కొన్ని బలహీన క్షణాలుంటాయి. ఆ సమయంలోనే వ్యక్తికి విశ్వాసాన్నిచ్చే మరోవ్యక్తి అవసరమవుతాడు. ఒకసారి ఆ బలహీనక్షణం గడిచిందా, ఇక వ్యక్తికి తిరుగుండదు.

తాను దయానాకు సాంత్వననివ్వాలని నిశ్చయించుకున్నాడు స్టీవ్. దయానాకు ఫోన్‌చేసి తనని తాను పరిచయం చేసుకున్నాడు.

మొదటిసారి దయానాతో మాట్లాడుతున్నప్పుడు స్టీవ్ స్వరం వణికింది.

"దయానా... నేను ఇక్కడ కేన్సర్‌తో బాధపడుతున్న పిల్లలకు ఓ క్యాంపు నిర్వహిస్తున్నాను. నువ్వు నీ ఉపన్యాసంతో వాళ్ళకి స్ఫూర్తి నివ్వాలి" అడిగాడు స్టీవ్.

"నేనే నిరాశలో కొట్టుమిట్టాడుతున్నాను. నా జీవితానికి అర్థం ఏమిటని వెతుకుతున్నాను. ఇంకొకరికి ప్రేరణనిచ్చే స్థితిలో లేను" మరో మాటకు ఆస్కారం ఇవ్వకుండా ఫోను పెట్టేసింది స్టీవ్‌కు నిరాశగా అనిపించింది. దయానాతో పరిచయం పెంచుకునేందుకు మరో ఆలోచన తోచలేదు స్టీవ్‌కు.

మళ్ళీ 1996 లో నూతన సంవత్సరం నృత్యం సందర్భంలో దయానా పరిచయం కాగానే, ఆ అవకాశాన్ని వదులుకోదలచుకోలేదు స్టీవ్. వెంటనే ఆమెను పెళ్ళి చేసుకోమని అడిగాడు. భంగపడ్డాడు.

* * *

కీమోథెరపీ పూర్తయింది. నీరసంగా, నిస్త్రాణంగా ఉంది డయానాకు.

“డాక్టర్! నిజం చెప్పండి! ఎలా ఉంది నా స్థితి?” బలహీనంగా అడిగింది డయానా. డాక్టర్ నిరాశతో చెప్పాడు.

“డయానా! నిజం చెప్పాలని నాకు లేదు. కానీ చెప్పక తప్పటం లేదు. నీకు వెన్నుపూస కేన్సర్ వచ్చింది. అది మొత్తం వెన్ను పూసంతా పాకింది.”

డయానా మంచంలో వెనక్కి వాలింది. తన జీవితాన్ని అర్థవంతం చేసుకోవాలని నిశ్చయించుకున్న మరుక్షణం ఆమె శరీరాన్ని కేన్సర్ తినేస్తోందని, ఇంక ఎక్కువ కాలం బతకలేదని తెలుస్తోంది.

ఏం చేయాలి?

తలుపు దగ్గర శబ్దమయింది. ఆ వైపు చూసింది. స్టీవ్ కనిపించాడు. అతడిని వెళ్ళిపోమని చెప్పాలనుకుంది. కానీ చెప్పేందుకు కూడా శక్తి లేదు.

స్టీవ్ ఆమె దగ్గరకు వచ్చాడు. ఆమెవైపు ప్రేమగా చూశాడు.

“డయానా... నాకు అంతా తెలుసు. నేను ప్రేమిస్తున్నది నీ శరీరాన్ని కాదు. నీలోని ఆత్మను. జీవితంలో నువ్వు ఎదుర్కొంటున్నటువంటి కష్టాలను మరొకరు ఊహించనుకూడా లేరు. లేని కష్టాలను ఊహించుకుని కుంగిపోయే బలహీన మనస్కులే తప్ప, కష్టాలను చిరునవ్వుతో ఎదుర్కొని విజయాలవైపు దృష్టి సారించే నీ ఆత్మవిశ్వాసం నాకు నచ్చింది. నీమీద నా ప్రేమ ఇవాళ్టిదో, ఒక్కరోజుదో కాదు. ఇది నాలో, నాతో కొన్నేళ్ళుగా ఎదుగుతూ వచ్చింది. నాకు నీ డబ్బు వద్దు. దాన్ని కేన్సర్‌తో బాధపడేవారి చికిత్సకు ఇచ్చేద్దాం. కార్టూనిస్టుగా నాకున్న పేరు. సంపాదించిన డబ్బుతో ఇద్దరం హాయిగా బతుకుదాం. ఇన్నాళ్ళూ నువ్వు ఒంటరిగా విధితో పోరాటం సాగించావు. ఇకనైనా నీకు సహాయంగా నన్ను స్వీకరించు’ మోకాళ్ళమీద నిలబడి తలవంచి అభ్యర్థించాడు స్టీవ్.

డయానా మాట్లాడలేదు.

“డయానా ఈ నిర్ణయం జాలితోనో, ఆవేశంతోనే తీసుకున్నది కాదు. కాలేజీ రోజులలోనే ఈ నిర్ణయం తీసుకున్నాను. నువ్వు ప్రాక్టీస్ చేస్తూంటే దొంగతనంగా గమనించే వాడిని. నీకు తెలియకుండా నిన్ను గమనిస్తూ వచ్చాను. డయానా! ఆనాడే నేను నిర్ణయించుకున్నాను. పెళ్ళి చేసుకుంటే నీలాంటి నిజమైన సౌందర్యవతినే చేసుకోవాలని. ఈ ప్రపంచంలో నీలాంటివాళ్ళు ఇంకొకరు లేరు. డయానా... నన్ను పెళ్ళి చేసుకుని ధన్యుడిని చేస్తావా?”

“నేను.... నేను ... ఎక్కువకాలం బతకను...” లో గొంతుతో చెప్పింది డయానా.



© EMESCO BOOKS

'కాకిలా వందేళ్ళు బతికేకన్నా హంసలా అరగంట జీవిస్తే చాలు. కాగితం మనుషులతో జీవితాంతం గడిపేకన్నా నీలాంటి నిజమైన మనిషితో కలిసి గడిపిన కొద్ది క్షణాలయినా జీవితాన్ని అర్థవంతం చేసి మధురానుభూతులుగా నిలిచిపోతాయి"

'స్టీవ్...! ఇది కలకాదుకదా!' సంశయంగా అడిగింది డయానా.

అది 14 ఫిబ్రవరి, 1997...

వాలెంటైన్స్ డే!

* * *

ఆగస్టు 9, 1997.

"ఈ కాలంలో కూడా అద్భుతాలు జరుగుతాయని నాకు ఇప్పుడే అర్థమయింది. ప్రేమకు సరైన నిర్వచనాన్ని ఇచ్చిన స్టీవ్, డయానా లకు మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను."

స్టీవ్, డయానాల పెళ్ళి కార్యక్రమాన్ని నిర్వహించిన చర్చి ఫాదర్ కంట నీళ్ళు ఉబుకుతుండగా ఇద్దరినీ ఆశీర్వదించాడు.

"నిజమైన ప్రేమకు నిలువెత్తు ప్రతీక వీళ్ళిద్దరి జీవితం" అన్నాడు డయానా సోదరుడు మార్క్ వాళ్ళిద్దరినీ అభినందిస్తూ.

పెళ్ళి అవుతూనే డయానా, స్టీవ్‌లు హనీమూన్‌కు వెళ్ళారు. తిరిగి వస్తూనే దేశంలోని వికలాంగుల అభ్యున్నతికి పథకాలు ప్రారంభించారు. దేశం నలుమూలలా తిరుగుతూ వారికి ఆత్మ విశ్వాసాన్నిచ్చే కార్యక్రమాలు నిర్వహించటం ఆరంభించారు.

"మేమిద్దరం కలిసి బతికే కాలం తక్కువ. నేను ఎప్పుడయినా మరణించవచ్చు. కాబట్టి ప్రతి క్షణాన్ని ఆనందంగా బతుకుతున్నాం. సమాజసేవ చేస్తూ జీవితాన్ని అర్థవంతం చేసుకుంటున్నాం' అంటుంది డయానా.

"నాకు ప్రేమంటే ఏమిటో తెలియదు. నాకు తెలిసినందల్లా డయానా సాంగత్యంలో నేను జీవంతో ఉన్న మనిషిలా అనిపిస్తుంది" అంటాడు స్టీవ్ డయానావైపు చూస్తూ.

వాళ్ళ జీవితాన్ని సరిగ్గా ప్రతిబింబిస్తుంది డయానా రాసిన కవిత.

'శరదృతువులో, సీతాకోకచిలుకల్లా నృత్యం చేస్తూ/ మృత్యువును సమీపించే ఆకులాంటి జీవితం/ మృత్యువును సమీపిస్తూ కూడా ఆనందంగా, అందంగా/ నృత్యం చేస్తూండటమే జీవిత పరమార్థం!'–

ఈ సాహస నృత్యం ఎంతో ఆనందంగా, అందంగా చేస్తున్నారు స్టీవ్, డయానాలు!



© EMESCO BOOKS

# కన్నీళ్లతో వెలిగిన జ్యోతి!

**వ్యక్తిగత దుఃఖాన్ని సామాజిక అభ్యుదయానికి బాటగా మార్చిన 'గుడ్ మార్నింగ్ అమెరికా' కథ.**

'గాయపడిన బాధాతప్త హృదయం, ఆవేదనతో, నిస్సహాయ ఆక్రోశంతో కార్చే ప్రతి కన్నీటి చుక్క ఒక జ్యోతి అయి, అదే నిస్సహాయ స్థితిలో కన్నీరు కారుస్తున్న వేరొకరి కన్నీరు తుడుస్తుంది. సమాజంలో ఒక సున్నితమైన మార్పు సాధనకు మార్గం చూపుతుంది. ఇందుకు ప్రధాన నిదర్శనం జాన్ వాల్ష్.

జాన్ వాల్ష్ పేరును ప్రకటించగానే 'స్పాట్‌లైట్' ప్రేక్షకుల నడుమ కూచున్న జాన్‌వాల్ష్‌పై పడింది. తనని అభినందిస్తూ చప్పట్లు చరుస్తున్న ప్రేక్షకుల వైపు చేయి ఊపుతూ వేదిక మీదకు వచ్చాడు వాల్ష్. అతను మైకు దగ్గరకు చేరగానే అంతా నిశ్శబ్దమై పోయింది.

కానీ ఏం చెప్పాలో, ఎక్కడ, ఎలా ఆరంభించాలో వాల్ష్‌కు అర్థం కావటం లేదు. ఒక అలవికాని ఆవేదన హృదయాన్ని ఆక్రమించి, గొంతుకు అడ్డం పడుతోంది. ఎటువంటి ఒడిదుడుకులు, తుఫానులు లేకుండా హాయిగా సాగిపోతూండేది వాల్ష్ జీవితం. అందమైన భార్య రేవ్, ముద్దులొలికే కొడుకు ఆడమ్‌లతో ఆనందంగా సాగిపోతున్న వాల్ష్ జీవితం అనూహ్యమైన రీతిలో, ఒక ఉన్మత్తుడి అనౌచిత్యమైన చర్యవల్ల అల్లకల్లోలమయింది. అనూహ్యమైన మలుపు తిరిగింది.

'ఈ కథను ఎక్కడి నుంచి ఆరంభించాలి?' వాల్ష్ కళ్ల ముందు, తన జీవితాన్ని మలుపు తిప్పిన రోజు మెదిలింది.

* * *

జూలై 27, 1981.

ఎప్పటిలాగే ఆఫీసులో పని చేస్తున్నాడు జాన్‌వాల్ట్. ఆఫీసుకు వచ్చినప్పటి నుంచీ అతని దృష్టి గడియారం పైనే ఉంటుంది.

ఆఫీసయి పోగానే ఇంటికి వెళ్లి, తన ఏడేళ్ల కొడుకు ఆడమ్‌తో ఆడుకోవాలన్న ఆత్రం అతనిది. ఆడమ్ పుట్టినప్పటి నుంచి అతడే వాల్ష్ జీవితానికి కేంద్రం అయ్యాడు. ఆడమ్‌ని ఆడించటం, అతడికి కథలు చెప్పటం తప్ప జీవితంలో ఇంకేమి అవసరం లేదనిపిస్తుంది వాల్ష్‌కి. ఆడమ్ మెత్తటి చేయి, తన వేలుని బలంగా పట్టుకుని, తన అడుగులో అడుగు కలుపుతూ నడుస్తూ ఉంటే, వర్తమానం, భవిష్యత్తుతో చేయి కలిపి నడుస్తున్న భావన కలుగుతుంది వాల్ష్‌కి.

ఆఫీసుకి వచ్చినప్పటి నుంచీ ఆడమ్ నుంచి వచ్చే ఫోనుకోసం ఎదురుచూస్తుంటాడు. ఫోన్లో ఆడమ్ అడిగే సందేహాలకు సమాధానాలు చెప్పటం వాల్ష్‌కు ఆనందాన్నేకాదు తనని తాను తెలుసుకుంటున్న భావనను కలిగిస్తుంది. ఆ రోజు అతని భార్య రేవ్, ఆడమ్‌లు సూపర్ మార్కెట్‌కు కెళ్లారు. వాళ్లింటికి తిరిగి రాగానే, ఆడమ్ ఫోనుచేసి, సూపర్‌మార్కెట్‌లో తాను చూసిన వింతలు, విశేషాలు అన్నీ చెప్తాడు. అవి చెప్తుంటే మెరిసే ఆడమ్ కళ్ళని ఊహిస్తూ వాల్ష్ ఆనందిస్తాడు.

అందుకే ఫోన్ మోగగానే ఆత్రంగా ఎత్తాడు వాల్ష్. కానీ అతను ఊహించిన ఫోను కాదది. అతని జీవితాన్ని మొత్తంగా తల్లకిందులు చేసే సమాచారం మోసుకొచ్చిందా ఫోను.

'ఆడమ్ తప్పిపోయాడు. త్వరగా సూపర్ మార్కెట్‌కు రండి.'

అది వింటూనే వాల్ష్‌కు అర్థమయింది. ఇకనుంచీ తాను మామూలు జీవితం గడపలేడు!

* * *

ఆడమ్‌ని పిల్లలు ఆడుకునే గదిలో ఆడుకోమని చెప్పి వస్తువులు కొనేందుకు వెళ్లింది రేవ్. ఆమె మళ్లీ ఆ గదికి వచ్చేసరికి ఆడమ్ లేడు. నలుగురు పిల్లలు అల్లరి చేస్తుంటే వాళ్లని బయటకు పంపేశానని చెప్పింది అక్కడున్న అమ్మాయి. కానీ ఆడమ్ బయటలేడు. మార్కెట్‌లో లేడు. ఒంటరిగా ఇంటికి వెళ్లలేడు. మరి ఎక్కడకు వెళ్లి ఉంటాడు? ఏమైఉంటాడు? సూపర్ మార్కెట్ చేరిన వాల్ష్‌కు ఏం చేయాలో అర్థంకాలేదు. ఆడమ్‌కోసం ఎక్కడని వెతకాలి? ముందుగా రేవ్‌ని ఓదార్చాలి. కానీ అంతకన్నా ముందు పోలీస్ రిపోర్ట్ ఇవ్వాలి.

* * *

పోలీస్ రిపోర్టిచ్చినా వాల్ష్‌కు సంతృప్తిగా అనిపించలేదు. ఎందుకంటే ఈ కేసు పోలీసులకు ఒక రొటీన్ కేసు. కానీ ఇది తనకు జీవన్మరణ సమస్య.

అందుకే వాల్ష్ తన మిత్రులను సంప్రదించాడు. సహాయం చేసే వారిని కూడగట్టుకున్నాడు. బేస్‌బాల్ బ్యాటు పుచ్చుకున్న ఆడమ్ ఫొటోను పోస్టర్లుగా ముద్రించాడు. ఎందుకంటే, ఆ ఫొటోలో ఆడమ్ పళ్లూడుతున్నట్టు స్పష్టంగా తెలుస్తుంది. అందువల్ల ఎవరైనా ఆడమ్‌ని చూస్తే సులభంగా గుర్తించే వీలుంటుంది.

అన్ని పేపర్లలో ప్రకటనలిచ్చాడు. ఎవరైనా ఆడమ్‌ని ఎత్తుకుపోయి ఉంటే, తిరిగి తమకు అప్పగించేందుకు డబ్బులిస్తానని ఆ ప్రకటనలో అభ్యర్థించాడు వాల్ష్.

అలాగే, ఆడమ్ పోస్టర్లను కరపత్రాలుగా ముద్రించాడు. ప్రాంతీయ పోస్టాఫీసు వాటిని ఉచితంగా పంచేందుకు ముందుకు వచ్చింది.

వాల్ష్ వేదన చూసిన రెండు విమానయాన సంస్థలు దేశంలోని మిగతా విమానాశ్రయాలన్నిటికీ ఆడమ్ పోస్టర్లను పంపిణీ చేసేందుకు సిద్ధపడ్డాయి. వాల్ష్ మిత్రులు, బంధువులు ఒక బృందంలా ఏర్పడి, నగరం నలుమూలలా వెతకటం ఆరంభించారు.

ఫలితం శూన్యం!

ఆడమ్‌ని వెతకటంలో రాత్రింబవళ్లు మునిగిన వాల్ష్ ఎప్పుడో ఇంటికి వచ్చేవాడు. ఒక గంట నిద్రపోయి మళ్లీ వెతకటానికి బయలుదేరేవాడు. ఎప్పుడయినా ఒక్కక్షణం తీరిక దొరికితే ఆడమ్ గుర్తుకు వచ్చేవాడు. ఇప్పుడు ఎలా ఉన్నాడో? ఏం బాధలు అనుభవిస్తున్నాడో? అన్న ఆలోచన గుండెను మెలిపెట్టేది. ఆ బాధను మరచిపోయేందుకే మరింతగా ఆడమ్‌ని వెతకటంలో మునిగిపోయేవాడు వాల్ష్.

ఒకరోజు అర్ధరాత్రి అలసిపోయి ఇంటికి వచ్చిన వాల్ష్‌కు, ఆడమ్ గదిలో వెలుతురు కనిపించింది. ఆనందంలో గబగబా పరిగెత్తి గదలోకి అడుగు పెడుతూనే ఆగిపోయాడు వాల్ష్. ఆడమ్ గదిలో, అతని వస్తువులను పట్టుకుని నిశ్శబ్దంగా రోదిస్తోంది రేవ్.

అది చూస్తుంటే తన గుండె దుఃఖంతో బద్దలవుతుందేమో ననిపించింది వాల్ష్‌కు. తన బాధని మరచిపోయేందుకు తన ధోరణిలో తాను ప్రయత్నిస్తున్నాడు. తప్పిపోయిన ఆడమ్ ఆలోచనల్లో పడి తాను తన భార్య బాధను మరిచాడు. ఆమెని అలాచూస్తూన్న వాల్ష్ తనని తాను మరిచిపోయాడు. అంతకాలం పట్టిఉంచిన బాధ హద్దులు దాటి ప్రవహించింది.

ఇద్దరూ గుండెలవిసేలా రోదించారు.

* * *

మర్నాటినుంచీ ఆడమ్ కోసం వెతికే బాధ్యతను రేవ్‌కు అప్పగించాడు వాల్ష్. తాను పోలీసుల చుట్టూ తిరిగనారంభించాడు.

అప్పుడే అతనికి డాక్టర్ రోనాల్డ్ రైట్ పరిచయమయ్యాడు.

'ఆడమ్ దొరకటం, దొరకక పోవటం కాదు ప్రశ్న. చిన్నపిల్లలపై అత్యాచారాలు చేసిన వారెందరో కాస్త శిక్షను అనుభవించి మళ్లీ సమాజంలో స్వేచ్ఛగా వచ్చేస్తున్నారు. వీళ్లవల్ల ఏ పిల్లవాడూ సురక్షితంగా ఉండలేకపోతున్నాడు' అన్నాడు రోనాల్డ్ రైట్.

'అంటే....?'

'ఒక రాష్ట్రంలో నేరం చేసినవాడు, మరో రాష్ట్రం వచ్చి పిల్లలపై అత్యాచారం చేసే అవకాశం ఉంది. ఇప్పుడు ఆడమ్ శవం అమెరికాలోని 52 రాష్ట్రాల్లో ఎక్కడోచోట ఉండవచ్చు. కానీ అది మనకు తెలిసే అవకాశం లేదు.

'తెలుసుకోవాలంటే...?'

'కేసును ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (FBI) దృష్టికి తేవాల్సి ఉంటుంది'.

రోనాల్డ్ ఇచ్చిన ఆలోచనను అర్థంచేసుకునేలోగా వాల్ష్‌కు పోలీసులనుంచి ఫోను వచ్చింది.

* * *

'ఈ వార్తను మీకు ఎలా చెప్పాలో తెలియటం లేదు'. వాల్ష్ గుండె జారిపోయింది.

'మీకు జిమ్మీ కాంప్ బెల్ తెలుసా?' అడిగాడు పోలీసు.

'తెలుసు, మాకు చాలా సన్నిహితుడు'.

'కానీ ఆడమ్‌ని అతడే కిడ్నాప్ చేసి ఉండవచ్చని అనుమానం.'

'ఇంపాజిబుల్' అరిచాడు వాల్ష్.

'అతడికీ, నీ భార్యకు అక్రమసంబంధం ఉంది. కానీ ఆడమ్‌వల్ల ఆమె అతడితో వచ్చేందుకు ఇష్టపడటం లేదు. ఆడమ్ అడ్డు తొలగించేందుకు....'

'అబద్ధం' అరిచాడు వాల్ష్.

* * *

'నిజమే. రేవ్‌తో నాకు శారీరక సంబంధం ఉంది. కానీ ఆడమ్ అదృశ్యం అవటంలో నా పాత్ర ఏమీ లేదు. నేను నిరపరాధిని' చెప్పాడు జిమ్మీ. వాల్ష్ మౌనంగా ఉండిపోయాడు.

* * *

ఇంట్లోకి అడుగుపెడుతూంటే బ్యాగు సర్దుకుని వెళ్లిపోయేందుకు సిద్ధంగా ఉన్న రేవ్ కనిపించింది వాల్ష్‌కు.

'ఆడమ్ నన్ను వదలివెళ్లాడు. నువ్వూ వదలి వెళ్తావా?' కన్నీళ్లతో అడిగాడు వాల్ష్.

అతడిని పట్టుకుని భోరుమంది రేవ్.

* * *

'ఆడమ్ కనబడకుండా పోవటం అన్నది మీ ప్రాంతానికి సంబంధించిన సమస్య. దీన్లో ఎఫ్‌బిఐ జోక్యం చేసుకోదు' నిర్మొహమాటంగా చెప్పారు ఎఫ్‌బిఐ అధికారులు.

'కానీ ఆడమ్‌ని ఎత్తుకెళ్లినవాళ్లు దేశంలో ఏ మూలకైనా తీసుకువెళ్లవచ్చు కదా' వాల్ష్ ప్రశ్న

'మీ రాష్ట్రం సరిహద్దులు దాటినట్టు ఋజువులు చూపించగలిగితే....' ఇదే సమాధానం వాల్ష్‌కు టీవీ కేంద్రాల నుంచి లభించింది.

'మీ కథ బాగుంది. కానీ ఇది మీ ప్రాంతానికీ పరిమితమైంది. అమెరికా ప్రేక్షకులు దీన్ని మెచ్చకపోవచ్చు. ఇలా ప్రతివాళ్లూ వాల్ ప్రతిపాదనలను కొట్టిపారేయసాగారు. ఇంతలో ఓ మిత్రుడివల్ల అమెరికాలో అత్యంత ప్రజాదరణ పొందిన టీవీ షో 'గుడ్ మార్నింగ్ అమెరికా' నుంచి వాల్ష్‌కు పిలుపు వచ్చింది.



© EMESCO BOOKS

ఆరోజు 'షో'కు వెళ్లేందుకు వాల్ష్ సిద్ధమౌతూంటే ఫోను వచ్చింది.

'మాకు డ్రైనేజ్ కెనాల్‌లో ఓ పిల్లవాడి తల దొరికింది. ఆడమ్ డెంటిస్టు వివరాలు కావాలి'.

'ఆ తల ఆడమ్‌ది కాదు' అరిచాడు వాల్ష్.

'అది కాదని నిరూపించేందుకే ఆ వివరాలు కావాలి. మీరు రాకండి. మీ మిత్రుడి నెవరినైనా పంపించండి.' ఆడమ్ పంటి వివరాలను మిత్రుడిద్వారా పంపించాడు వాల్ష్. ఈ విషయం రేవ్‌కు చెప్పలేదు.

* * *

'గుడ్‌మార్నింగ్ అమెరికా'లో వాల్ష్ మాటలకు విపరీతమైన ప్రతిస్పందన లభించింది. ప్రేక్షకుల నుంచి ఫోన్లు, ఉత్తరాలు వరదలా వచ్చి పడసాగాయి. దేశంలోని ప్రతి రేడియో, టీవీల్లోని 'టాక్ షో'ల నుంచి వాల్ష్ దంపతులకు ఆహ్వానాలు అందసాగాయి.

ఇంతలో వాల్ష్ మిత్రుడి నుంచి ఫోను. 'వాల్ష్... మురిక్కాలువలో దొరికిన తల ఆడమ్‌దే'. కుప్ప కూలిపోయాడు వాల్ష్.

* * *

ఆడమ్ మరణవార్త తెలియటంతో వాల్ష్‌కు జీవితేచ్ఛ నశించింది. ఇక తన జీవితానికి అర్థం లేదనిపించింది. నెమ్మదిగా డిప్రెషన్ లోకి దిగజారసాగాడు వాల్ష్. ఈ సమయంలో అతడికి అండగా నిలిచింది రేవ్.

'వాల్ష్... ఆడమ్ అంటే నీకే కాదు నాకూ ప్రేమ ఉంది. కానీ ఆడమ్ లేకపోతే ప్రపంచమే లేదనటం అన్యాయం. ఎవరెంత సన్నిహితులయినా ఎవరి బతుకు వారిదే. జీవితాన్ని మించి అమూల్యమైందేదీ లేదు. వాల్ష్... ఏది మానేసినా జీవించటం మానేయకూడదు' అంటూ అతడి ఆత్మవిశ్వాసాన్ని పెంచే ప్రయత్నం చేయసాగింది. కానీ ఎవరూ చేయలేని పని ఓ పత్రిక వార్త చేసింది.

500,000 డాలర్ల ఖరీదైన గుర్రాన్ని ఎఫ్‌బిఐ వారు అత్యంత నైపుణ్యంతో పట్టుకున్న కేసు వార్త అది. అది చదువుతూనే వాల్ష్ గుండె మండింది. డాక్టర్ రోనాల్డ్ రైట్‌కు ఫోనుచేశాడు వాల్ష్. 'ఒక మనిషి జీవితం కన్నా ఓ గుర్రం విలువ ఎక్కువా?' అరిచాడు వాల్ష్.

'వెరీగుడ్! నీలో ఈ ఆవేశం నిద్రలేచేందుకే ఎదురుచూస్తున్నాను. ఒక దుండగుడి దుశ్చర్యకు నీ కొడుకు బలయ్యాడు. నువ్వూ బలి అవటం నాకిష్టం లేదు'.

'ఇప్పుడు నేనేం చేయాలి?'

'నీకోసం, తమ సంతానానికి దూరమయిన 20,000 మంది ఉత్తరాలు ఎదురు చూస్తున్నాయి. వారందరికీ సాంత్వన నివ్వగలిగింది నువ్వే' చెప్పాడు రోనాల్డ్.



© EMESCO BOOKS

అక్టోబర్, 1982.

తనలా, పిల్లలకు దూరమై, వాళ్ళేమైపోయారో తెలియని, తల్లిదండ్రులందరినీ కూడదీసి వాల్ష్ జరిపిన పోరాట ఫలితంగా, అమెరికాలో తప్పిపోయిన పిల్లలకు సంబంధించిన చట్టం తయారయింది. ఈ చట్టం వల్ల ప్రాంతంతో సంబంధం లేకుండా తప్పి పోయిన పిల్లలను వెతికే బాధ్యత ఎఫ్‌బిఐకి అప్పగించే వీలు కలిగింది.

ఇదే సమయంలో వాల్ష్, రేవ్‌లకు 'మేఘన్' అనే కూతురు జన్మించింది. దేశమంతా సంబరాలు చెలరేగాయి. ఉత్తరాల ద్వారా వాల్ష్‌కు సందేశాలు అందాయి. ఆడమ్ కథ ఆధారంగా నిర్మించిన చిత్రం ఆడమ్, అక్టోబర్ 10, 1983న విడుదలయింది. ఆ సినిమా చివర్లో 55మంది తప్పిపోయిన పిల్లల ఫోటోలు, వివరాలు ప్రదర్శించారు. ఇందువల్ల 13 మంది పిల్లలు వాళ్ల తల్లిదండ్రులతో కలవగలిగారు.

జూన్ 13, 1984 లో అమెరికా ప్రభుత్వం 'నేషనల్ సెంటర్ ఫర్ మిస్సింగ్ అండ్ ఎక్స్‌ప్లాయిటెడ్ చిల్డ్రన్' అనే సంస్థను ఏర్పరచి, దానికి అధ్యక్షుడిగా వాల్ష్‌ను నియమించింది.

ఇలా రకరకాల టాక్‌షోల ద్వారా, సంస్థల ద్వారా, తప్పిపోయిన పిల్లలను వారి ఇళ్లకు చేర్చే బృహత్ ప్రయత్నం చేస్తున్న వాల్ష్‌కు ఓ రోజు ఫాక్స్ టెలివిజన్ నుంచి ఫోను వచ్చింది.

'మేం ఒక కొత్త షో ఆరంభించాలనుకుంటున్నాం. ఎంతోమంది నేరాలు చేసి తప్పించుకుని తిరుగుతూ సమాజాన్ని ప్రమాదంలో పడేస్తుంటారు. అటువంటి వాళ్లవల్ల సమాజానికి ఎప్పుడూ ప్రమాదమే. అటువంటి నేరస్తుల వివరాలను ప్రదర్శించే 'షో' అది. 'షో'లో ఈ వివరాలను మీరే ప్రదర్శించాలి. ఇందువల్ల నేరస్తులను పట్టుకోగలగటమే కాదు, ఈ నేరగాళ్ల నుంచి అమాయకులను కాపాడవచ్చు'.

ఈ ఆలోచన వాల్ష్‌కు నచ్చింది. ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 'అమెరికాస్ మోస్ట్ వాంటెడ్' అనే టీవీ షో రూపు దిద్దుకుంది. దీనివల్ల ఇప్పటికి దాదాపుగా వెయ్యిమంది పైగా నేరగాళ్లు పట్టుబడ్డారు. ఈ 'షో' ప్రభావంతో, ప్రపంచవ్యాప్తంగా ఇటువంటి 'షో'లు అనేకం రూపొందాయి.

తన విషాదాన్ని మానవజాతికి విజయంగా, సమాజానికి లాభకరంగా రూపాంతరం చెందించిన వ్యక్తి జాన్ వాల్ష్.

* * *

'అమెరికాస్ మోస్ట్ వాంటెడ్' ఎమ్మీ అవార్డుకు నామినేషన్ పొందింది. ఆ సందర్భంలో జరిగిన సన్మానాన్ని స్వీకరిస్తూ 'ఆడమ్‌కు అన్యాయం జరిగింది. ఎంతో ఎత్తు ఎదిగి, దేశానికి ఎంతో సేవ చేస్తాడనుకున్న పౌరుడి జీవితం బాల్యంలోనే అంతమైంది. ఈ అన్యాయం మరొకరికి జరగకూడదన్న నా తపన ఫలితం ఇది' అన్నాడు జాన్ వాల్ష్.

© EMESCO BOOKS

# చిన్నారుల బతుకు పోరాటం!

ఆధునిక వైజ్ఞానిక వైద్య పద్ధతుల
మానవత్వరూపును ప్రదర్శించే కథ.

**శు**క్రవారం, ఏప్రిల్ 6, 2001, ఉదయం తొమ్మిది గంటలు.

ఆపరేషన్ గదిలోకి పిల్లలను తీసుకువెళ్ళారు. కన్నీళ్ళతో వాళ్ళకి వీడ్కోలు పలికారు తల్లిదండ్రులు సంధ్య, భూషణ్‌లు.

"వాళ్ళని మళ్ళీ సజీవంగా చూస్తామా?" సంధ్య కన్నీళ్ళతో భూషణ్‌ను అడిగింది.

భూషణ్ మాట్లాడలేదు. దుఃఖంతో అతని గొంతు పూడుకుపోయింది. ఇద్దరూ మౌనంగా దేవుడిని ప్రార్థించారు 'తమ పిల్లలు క్షేమంగా ఉండాలని'. మధ్యాహ్నం ఒంటిగంటైంది.

డాక్టర్ గోహ్, డాక్టర్ చంపన్‌చాన్‌వైపు 'అన్నీ సిద్ధమేనా?' అన్నట్టు చూశాడు. తల ఊపాడు చాన్ 'అన్నీ సిద్ధమే' అన్నట్టు. నిట్టూర్చాడు గోహ్.

తన వద్దకు గంగ, జమునల కేసు వచ్చినప్పుడు ముందు సందేహించాడు. ఎందుకంటే పుట్టుకతోనే తల భాగం కలసివుండి పుట్టే కవలలను వేరు చేయటం అంటే ఇద్దరి ప్రాణాలు, లేకపోతే ఎవరో ఒకరి ప్రాణాలు తప్పనిసరిగా తీయటమే. రెండు మిలియన్ పుట్టుకలలో ఇలా తల భాగం కలసి ఉండి పుట్టే కేసులు ఒకటో రెండో ఉంటాయి. ఇలా కలసి ఉండటాన్ని 'క్రేనియోపాగస్' అంటారు. అలా పుట్టిన ప్లిలలను వేరుచేయటం ఎంతో కష్టంతో కూడుకున్న పని. అందుకే కేసును టేకప్ చేసేందుకు వెనుకంజ వేశాడు గోహ్.

నేపాల్‌లో పుట్టిన ఆ పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లల గురించి పడుతున్న ఆరాటానికి వైద్యులు చలించిపోయారు. సింగపూర్, నేపాల్‌ల ప్రజలు స్వచ్ఛందంగా విరాళాలు సేకరించి వైద్యం ఖర్చు భరించేందుకు సిద్ధమయ్యారు. దాంతో ఆపరేషన్‌లోని ప్రమాదాన్ని తల్లిదండ్రులకు వివరించి వారు ఆమోదించిన తరువాతే డా॥ గోహ్ కేసు టేకప్ చేశాడు.

© EMESCO BOOKS

ముందుగా పిల్లల తల భాగాలను ఎంఆర్ఐ, కాట్ స్కాన్ల ద్వారా అణువణువూ క్షుణ్ణంగా పరిశీలించారు. ఆ వివరాలతో 3డి బొమ్మలను తయారుచేశారు. వివరాలను 'డెక్స్ట్రోస్కోప్'కు అందించారు. ఈ పరికరం ద్వారా ఆపరేషన్ థియేటర్లో అడుగు పెట్టకుండా ఆపరేషన్ చేసిన అనుభవాన్ని పొందవచ్చు. ఆపరేషన్ చేస్తున్నప్పుడు జరిగే పరిణామాలను ఊహించవచ్చు.

కొన్ని నెలలపాటు ఇలా ఆపరేషన్ను తన టీమ్తో ప్రాక్టీసు చేశాడు గోయ్.

ఇద్దరు శిశువుల తలలు ఒకటిగా కలసి ఉండటంవల్ల వారి రక్తనాళాలు కూడా కలసిపోయాయి. ఒకరి తల నుండి బయలుదేరిన రక్తనాళం, మరొకరి మెదడుకు రక్తం అందచేస్తుంది. దాంతో రెండు మెదళ్ళు ఒకటిగా రక్తనాళాలు గజిబిజిగా కలసిపోయాయి. ముఖ్యంగా మెదడులోని అతిపెద్ద రక్తనాళం 'సాగిట్టల్ రక్తనాళం' గంగ, జమునలిద్దరూ పంచుకున్నారు. ఇద్దరి తలలు వేరు చేయాలంటే రక్తనాళాలను కోయకతప్పదు. రక్తనాళాలు కోస్తే రక్తం అందకమరణం సంభవిస్తుంది. కానీ ఇద్దరినీ వేరు చేయాలంటే రక్తనాళాలు కోయాల్సిందే!

గోహ్ తన టీమ్తో వివరాలు విశదంగా చర్చించాడు.

ఇంతలో తలలు వేరుచేసిన తరువాత ఆ రంధ్రాన్ని మూసేందుకు తగినంత చర్మం శిశువుల శరీరాలపై లేదని తెలిసింది. దాంతో ప్లాస్టిక్ సర్జన్ విన్సెంట్ యూకాక్ లెంగ్, శిశువుల కపాల భాగంలో టిష్యూ ఎక్స్పాండర్లను అతికించాడు. వారానికి రెండు మార్లు ఇలా అతికించిన చర్మంలోకి సెలైన్ను ఎక్కించటం ద్వారా చర్మాన్ని వ్యాకోపింపచేసేవాడు. ఈ పనులప్పుడు నొప్పితో శిశువులు ఏడుస్తూంటే అందరి కళ్లల్లో నీళ్ళు తిరిగేవి.

ఇతర సమయాల్లో గంగ జమునలు తమ అల్లరితో, అమాయక చూపులతో అందరి మనసులను దోచుకున్నారు. దాంతో ఆపరేషన్ చేయటం డాక్టర్లకు మరింత కఠినతరం అనిపించసాగింది. ఎందుకంటే గంగ, జమునలు వాళ్ళ పేషెంట్లుగా కాక ఆత్మీయుల్లా అనిపించసాగారు.

తగినంత చర్మం ఏర్పడిన తరువాత టిష్యూఎక్స్పాండర్లను తీసేశారు. అప్పుడు వైద్యులు ఆపరేషన్ తేదీని నిశ్చయించారు.

ఇన్నాళ్ళు పడిన శ్రమ, మానసిక వేదన సఫలమో, విఫలమో తేలే ఘడియ దగ్గర పడింది. ఇద్దరు శిశువుల శరీరాలకు 64 ఎలక్ట్రాడ్లు అమర్చారు. తలలు కదలకుండా వాటిని హెడ్ ఫ్రేముల్లో అమర్చారు.

అంతవరకూ వారి మెదళ్ళ గురించి సేకరించిన ఎంఆర్ఐ డాటాను కంప్యూటర్లోకి ఎక్కించారు. ఆపరేషన్ సమయంలో ఈ కంప్యూటర్ అందించే సమాచారం ద్వారానే డాక్టర్లు తాము ఏ భాగాన్ని కోస్తున్నారు, ఏమౌతోందీ తెలుసుకుంటారు.

© EMESCO BOOKS

ఆపరేషన్ గదిలో ఇద్దరు డాక్టర్లుకాక సర్జికల్ టీమ్‌లో 30 మంది, ఇద్దరు న్యూరో సర్జన్లు, అయిదుగురు ప్లాస్టిక్ సర్జన్లు, నలుగురు అనాస్థిటిస్టులు, ఇద్దరు న్యూరాలజిస్టులు, ముగ్గురు రేడియోలజిస్టులు, 15 మంది నర్సులు ఉన్నారు. ఇంకా అవసరమైన మందులు, యంత్రాలు సిద్ధంగా ఉన్నాయి.

అందరివైపు ఓసారి చూశాడు గోహ్.

"ఈ ఆపరేషన్ తరువాత మనం నవ్వుతామో! ఏడుస్తామో" అంటూ ఆపరేషన్ ఆరంభించేందుకు సూచన ఇచ్చాడు.

వైద్య చరిత్రలో అత్యధిక సమయం, 83 గంటలపాటు జరిగిన అద్భుతమైన ఆపరేషన్ అప్పుడు ఆరంభమయింది.

శిశువులను బోర్లా పడుకోబెట్టి వారి కపాలభాగాలను నెమ్మదిగా కోయటం ఆరంభించారు. వెల్లకిల్లా పడుకోబెట్టటంవల్ల తలలో రక్తనాళాలు తక్కువగా ఉన్న భాగం కోసేందుకు వీలు చిక్కుతుంది. ఇలా తల మధ్య భాగం వరకూ తెరచి, తమ పరికరాలకు అందని ప్రాంతాలలో కంప్యూటర్‌ద్వారా ఆపరేషన్ చేస్తారు. ఒకో రక్తనాళాన్ని జాగ్రత్తగా వేరుచేసి, ఎవరెవరికి వారి వారి కపాలాలను ఏర్పాటు చేసిన తరువాత శిశువులను మళ్ళీ మామూలుగా పడుకోబెట్టటంతో ఆపరేషన్ పూర్తవుతుంది.

అంతా సజావుగా జరిగిన తర్వాత తన పని పూర్తయినట్లు సౌంజ్ఞ చేశాడు గోహ్.

వెంటనే ప్లాస్టిక్ సర్జన్ 'యావ్' ముందుకు వచ్చాడు. శిశువుల మెదళ్ళు కలిసే భాగంలోని చర్మాన్ని జాగ్రత్తగా కోసి వెనక్కుతోశాడు. చిన్న ఎముకల రంపంతో 16/34 సెంటీమీటర్ల రంధ్రం చేశాడు. ఆ రంధ్రంలోంచి తెల్లగా, మెదడుపైని రక్షణ పొర 'డ్యూరా' కనబడుతోంది. 'ఇక మీ పనే' అన్నట్టు గోహ్‌వైపు చూసి పక్కకు తప్పుకున్నాడు యావ్.

గోహ్ ముందుకు వచ్చి జాగ్రత్తగా డ్యూరాను పీకేయటం మొదలుపెట్టాడు. డ్యూరా కింద రెండు మెదళ్ళను వేరు చేస్తూ కొత్త చర్మం కనిపిస్తోంది. గోహ్ సంతోషంగా నవ్వాడు.

"మనం వేరు చేయకముందే ప్రాకృతికంగా రెండు మెదళ్ళను వేరు చేస్తూ టిష్యూ పెరుగుతోంది" అన్నాడు.

జాగ్రత్తగా ఆపరేటింగ్ మేక్రోస్కోపు లోంచి చూస్తూ, మూడు మిల్లీమీటర్ల పొడవుండే మైక్రోబ్లేడ్లతో రెండు మెదళ్ళ టిష్యూలను వేరు చేయసాగాడు గోహ్.

మరో చేతిలో డయాథెర్మీ ఫోర్సెప్స్ పట్టుకుని, తెగిన రక్తనాళాల నుండి రక్తం కారకుండా వాటిని మూసివేయ సాగాడు.

ఇలా ఒక సెంటీమీటరు ప్రాంతంలో ఆపరేషన్ జరిపేందుకు 'గోహ్'కు ఒక గంట సమయం పట్టింది. అయితే, ఇప్పుడు పైపొరతో పని అయిపోవటంతో అసలు మెదడులో పని ప్రారంభమౌతుంది. దాంతో గోహ్ పనివేగం తగ్గించి, మరీ జాగ్రత్తగా ఆపరేషన్ ఆరంభించాడు.

ఇదే సమయానికి మెదడులో మరోభాగంలో చురుకుగా పనిచేస్తున్నాడు డాక్టర్ చాన్. ఇద్దరి మెదళ్ళలో వివిధభాగాలను 'పాయింటర్'తో ముట్టుకుని, కంప్యూటర్ స్పందన ప్రకారం ఆయా భాగలను గుర్తిస్తున్నాడు చాన్.

ఇద్దరి మెదళ్ళు నిముషానికి 90 బీట్లతో కొట్టుకోసాగాయి. కాస్సేపయ్యే సరికి నరాల అడవిలో ఏ మెదడు ఎవరిదోకూడా గుర్తించలేని పరిస్థితి ఏర్పడింది.

"కరెంట్ షాక్" అరిచాడు చాన్.

న్యూరాలజిస్టు వెంటనే కరెంట్ పంపాడు.

జమున ఎడమ కాలు కదిలింది.

"ఓకే" అన్నాడు చాన్.

జమున మెదడును గుర్తించాడు.

ఇలా గంటకు కొన్ని మిల్లీ మీటర్ల ప్రాంతం చొప్పున ఆపరేషన్ జరగసాగింది. ఉండి ఉండి డాక్టర్లు కాస్సేపు విశ్రాంతి తీసుకుని మళ్ళీ ఆపరేషన్ చేస్తున్నారు. అనుమానం వచ్చినప్పుడు కంప్యూటర్‌లోని సమాచారాన్ని పరిశీలించి, తయారుగా ఉన్న మోడల్స్‌ను విశ్లేషించి మళ్ళీ ఆపరేషన్ టేబుల్ వద్దకు వస్తున్నారు.

ఏప్రిల్ 7, శనివారం.

ఆపరేషన్ ఆరంభించి 21 గంటలయింది. మెదడు మధ్య భాగాన్ని నింపే 'మెదడు ద్రవం' చేరేందుకు ఇంకా కొన్ని మిల్లీమీటర్లే ఉంది.

"అందరినీ పిలవండీ" ఆజ్ఞాపించాడు డాక్టర్.

ఇప్పుడు ఆపరేషన్‌లో అతి క్లిష్టమైన పని చేయాల్సిఉంటుంది. ఈ పనిని అందరూ కొన్ని నెలలపాటు ప్రాక్టీస్ చేశారు. కానీ మోడల్స్‌తో చేయడం వేరు, నిజంగా ప్రాణంతో ఉన్న పసిపిల్లలతో అదే పని చేయడం వేరు.

బోర్లా ఉన్న పిల్లలను తిప్పి వెల్లకిల్లా పడుకోబెట్టాలి! అందరూ మౌనంగా చకచక పనిచేయసాగారు. పిలల శరీరాలకు అతికించిన పరికరాలన్నిటినీ వేరు చేయసాగారు.

ప్లాస్టిక్ సర్జన్లు త్వరత్వరగా తెరచి ఉన్న పిల్లల కపాలాలను మూసివేయసాగారు.

ఇది చేసేందుకు గంట పట్టింది.



© EMESCO BOOKS

ఆ తరువాత డాక్టర్లు తల భాగాన్ని పట్టుకున్నారు. మిగతా వారు పిల్లలకింది భాగాన్ని పట్టుకున్నారు. ఆపరేషన్ మధ్యలో ఇలా పిల్లలను వెల్లకిల్లా తిప్పటం ఎంతో ప్రమాదకరమైన చర్య. ఒకో కదలికను ఎంతో జాగ్రత్తగా చేస్తూ, ప్రతి క్షణం అన్నీ సవ్యంగా ఉన్నాయో, లేదో పరిశీలిస్తూ, వారు పిల్లలను తిప్పారు.

మళ్ళీ వెంటనే వారికి అన్ని పరికరాలు అమర్చటం ఆరంభించారు.

ఇదంతా జరిగేసరికి నాలుగు గంటలు పట్టింది.

ఏప్రిల్ 8, ఆదివారం.

ఆపరేషన్ ఆరంభించి 36 గంటలయింది. మెదడులో అతి ప్రాముఖ్యాన్ని వహించే 'సాగిట్టల్ రక్తనాళం చేరుకున్నారు గోహ్. చెవి కిందనుండి ఆరంభమవుతుంది ఈ నరం. డాప్లర్ అల్ట్రాసౌండ్ ఫోన్ పట్టుకుని వెతికినా, నాళం ఎక్కడ పూర్తవుతుందో తెలియడం లేదు.

అలా ఆరుగంటలు పాటు వెతికిన తరువాత నాళం చివరిభాగం దొరికింది. ఆపరేషన్ థియేటర్ మొత్తం నిశ్శబ్ద సంతోష తరంగం ఎగసింది.

ఆ నాళాన్ని కనుక్కుని గోహ్, చాన్‌కు సౌంజ్ఞ చేశాడు. ఆ నాళాన్ని మూసివేసేందుకు సిద్ధమయ్యాడు చాన్.

ఆపరేషన్‌లో కీలకమైన ఘడియ అది. ఎందుకంటే, మెదడుకు రక్తాన్ని అందించే అతిపెద్ద నాళానికి ప్రత్యామ్నాయంగా సరిపడ రక్తాన్ని అందించకపోతే ప్రమాదం తప్పదు.

చాన్ పని పూర్తయ్యేసరికి గంట పట్టింది.

అందరి దృష్టి చాన్‌కు రక్తపోటు చూసే పరికరాలకు నడుమ తిరుగుతూనే ఉంది.

చాన్ పనిపూర్తి కాగానే గోహ్, చాన్‌లు కలసి గుబురు గుబురు పొదలలో కలసిపోయి శాఖలుగా ఉన్న రక్తనాళాలను జాగ్రత్తగా వేరుచేయటం, మళ్ళీ ఇద్దరు పిల్లలకు రక్తసరఫరా సరిగ్గా, సమానంగా అందేట్లు అమర్చటం ఆరంభించారు. ఈ రక్తనాళాలు అనేకం 1.5 మిల్లీమీటర్ల కన్నా ఎక్కువ లావు ఉండవు.

ఇలా చేస్తూ అప్పుడప్పుడు మెదడులో చేరిన రక్తం బయటకు 'పంప్' చేస్తూ వచ్చారు. బ్రెయిన్ ద్రవంతో ఆయా భాగాలు ఎండిపోకుండా, తుడుస్తూనే ఉన్నారు నర్సులు.

ఆపరేషన్ జరుగుతూనే ఉంది.

అయితే, ఇలా మెదడు ఎక్కువ కాలం తెరచిఉంచటం కూడా ప్రమాదకరం. అలాగని తొందరపడి లాభంలేదు.

ఆపరేషన్ కొనసాగుతూనే ఉంది.

ఏప్రిల్ 9, సోమవారం

ఆపరేషన్ ఆరంభించి రెండున్నర రోజులు అయింది. అందరూ అలసిపోతున్నారు. కానీ ఏమాత్రం పొరపాటు జరిగినా రెండు నిండుప్రాణాలు బలి అవుతాయి. జీవితాంతం మరపుకు రాని క్షోభ మిగులుతుంది.

ఒక కీలకమైన దశలో ఎడమభాగం కనబడలేదు. దాంతో మళ్ళీ పిల్లలను బోర్లా పడుకోబెట్టాల్సి వచ్చింది.

ఇది అంతకుముందు ఊహించని విషయం. కానీ తప్పదు. ఈ విషయం ముందే కంప్యూటర్‌లో 'లోడ్' అయి లేకపోవటం వల్ల ఇప్పుడు డాక్టర్లకు కంప్యూటర్ సహాయం కూడా ఉండదు.

ఇక వారికి ఆపరేషన్‌లో సహాయపడేది కేవలం అనుభవం, దైవం మాత్రమే!

ఆపరేషన్ ఆరంభించి 70 గంటలయింది!

"చాన్" ఆతృతగా పిలిచాడు గోహ్.

మెదడుకు రక్త సరఫరా చేసే నాళం తెగింది. రక్తం ధారగా కారసాగింది.

చాన్, గోహ్‌లు కలిసి నాళం మొదలు కోసం వెతకసాగారు. అది జముననుండి గంగకు రక్తాన్ని అందించే ప్రముఖమైన రక్తనాళం! కానీ తెగిపోవటంతో ఇప్పుడు రక్తం గంగ నుండి జమునకు చేరుకోసాగింది.

రేడియాలజిస్టులు, అప్పుడే ప్రత్యామ్నాయాలు ఆలోచించసాగారు. ఒకవేళ ఈ నాళం మొదలు తెలియకపోతే ఏ రకంగా వారికి రక్తం అందించవచ్చో చర్చించసాగారు.

ఇంతలో రక్తం అందకపోవటంతో గంగ రక్తపోటు తగ్గసాగింది. రక్తం ఎక్కువై జమున రక్తపోటు పెరగసాగింది.

గంగకు రక్తం ఎక్కించసాగారు.

జమున నుండి రక్తాన్ని బయటకు లాగసాగారు. కానీ ఫలితం కనబడటం లేదు.

ప్రతి క్షణం ఉత్కంఠ పెరిగిపోసాగింది.

ఉత్కంఠతోపాటు నిరాశ వెల్లువ కాసాగింది.

గంగ నుండి రక్తం జమునలోకి ప్రవహించకుండా, గంగ టేబిల్‌ను జమున టేబిల్ కన్నా ఎత్తుగా ఉంచి ఉంచారు. దాంతో గంగ నుండి రక్తం జమునకు చేరే వేగం తగ్గింది.

కానీ ప్రమాదం ఇంకా తొలగలేదు.



© EMESCO BOOKS

చివరికి రక్తనాళం మొదలు దొరికింది. వెంటనే దాన్ని మూసేశాడు చాన్. గోహ్ ఆపై ఇద్దరి మెదళ్ళకు వేర్వేరుగా రక్తం అందించే నాళాలను అడ్డు తొలగించాడు.

ఆపరేషన్ థియేటర్ మొత్తం పెద్దగా నిట్టూర్చింది.

ఏప్రిల్ 10, మంగళవారం.

గంగ మెదడు గోహ్ పట్టుకోగా, న్యూరాలజిస్టు టాంగ్ జమున మెదడు పట్టుకున్నాడు. వారి శరీరాలను నర్సులు పట్టుకున్నారు. నెమ్మదిగా ఆ రెండు మెదళ్ళను అంటి వున్న డ్యూరాను కత్తిరించసాగాడు చాన్.

అతడి కత్తిరింపు పూర్తవటంతో గంగ, జమునలను వేరు చేయటం పూర్తయింది.

ఇప్పుడు ఆ కవలలిద్దరూ ఎవరికి వారే ప్రత్యేకమైన వ్యక్తులు!

* * *

ప్రపంచంలో దీర్ఘకాలంపాటు సాగిన బ్రెయిన్ ఆపరేషన్ ఇది. ఆపరేషన్ ఆరంభించిన 99 గంటల తరువాత గంగను ప్రత్యేక మంచంపైకి చేర్చారు. అంతకుముందే జమున మరో మంచంపైకి చేరింది.

పుట్టినప్పటి నుంచీ వారిద్దరూ వేర్వేరుగా, ప్రత్యేకంగా మంచాలపై పడుకోవటం ఇదే ప్రథమం. సింగపూర్ వదలివెళ్తూ సంధ్య, భూషణ్‌లు డాక్టర్ల చేతులు పట్టుకుని–

"మీ మేలు ఎన్నటికీ మరువలేం" అన్నారు కన్నీళ్ళ పర్యంతమైపోతూ.

దానికి డాక్టర్లిద్దరూ ఒకే సమాధానం ఇచ్చారు.

"ఇందులో మా గొప్ప ఏమీ లేదు. 83 గంటలు ఏకబిగిన ఆపరేషన్ చేసే శక్తి, అంతసేపు మెదడు తెరచిఉన్నా ఎటువంటి ఇన్‌ఫెక్షన్లు శిశువుల దరిదాపుల్లో రాకపోవటం అంతా ఆ దైవ నిర్ణయం".

అదీ ఆ వైద్యుల నిజాయితీ, గొప్పతనం!



© EMESCO BOOKS

# వైద్యో నారాయణో 'సెమ్'

**ఒక దీపం మరెన్నో దీపాలను వెలిగిస్తుందని**
**వైద్యప్రగతికి కారణమైన డాక్టర్‌కథ.**

**1991...**

హాలు చప్పట్లతో మార్మోగుతోంది. ఒకరొకరే వచ్చి జర్మనీ అత్యుత్తమ అవార్డులు అందుకుంటున్నారు.

"ఇప్పుడు 'ఫిజీషియన్ ఆఫ్ ది ఇయర్' బహుమతిని ప్రకటిస్తున్నాం".

హాలు ఒక్కసారిగా నిశ్శబ్దం అయిపోయింది.

అందరి దృష్టి మొదటి వరుసలో ఓ మూల తలవంచుకుని కూచున్న ప్రొఫెసర్ 'కుర్ట్ సెమ్' పైనే కేంద్రీకృతమై ఉంది.

'కుర్ట్ సెమ్' మనసులో తుఫానులు చెలరేగుతున్నాయి. మరోవైపు ఆనంద తరంగాలు ఉవ్వెత్తున ఎగిసి పడుతున్నాయి.

"జర్మనీ ఫిజీషియన్ ఆఫ్ ది ఇయర్ అవార్డు ప్రొఫెసర్ 'కుర్ట్ సెమ్'కు ఇవ్వాలని న్యాయనిర్ణేతలు ఏకగ్రీవంగా నిర్ణయించారు".

ప్రకటన పూర్తికాక మునుపే ప్రేక్షకులంతా లేచి నిలబడి ప్రొఫెసర్‌కు అభివాదం చేస్తూ చప్పట్లు చరచసాగారు.

బహుమతి అందుకునేందుకు వేదికపైకి వెళ్తున్న 'కుర్ట్ సెమ్' మదిలో గతం కదలాడసాగింది.

* * *

బాల్యం నుంచి 'సెమ్' ఇతర పిల్లల్లా ఆట వస్తువులపై ఆసక్తి చూపలేదు. అతడికి యంత్రాలపై ఉన్న ఆసక్తి ఇతర విషయాలపై ఉండేది కాదు. అతడికి తొమ్మిదేళ్ల వయసులో నట్టులు, బోల్టులు తయారుచేయటం అలవాటైంది.

© EMESCO BOOKS

రెండవ ప్రపంచ యుద్ధం తరువాత మ్యూనిచ్ యూనివర్సిటీలో వైద్యం చదివాడు సెమ్. ఆ కాలంలో డబ్బు సంపాదించేందుకు ఓ ప్రయోగశాలలో పార్ట్‌టైమ్ ఉద్యోగం చేశాడు. కొన్నాళ్ళకు ప్రయోగశాలలకు అవసరమైన పరికరాలు తయారుచేసి అమ్మటం ఆరంభించాడు.

1950లో చదువు పూర్తయిన సెమ్, యూనివర్సిటీలోని మహిళల ఆస్పత్రిలో గైనకాలజిస్టుగా చేరాడు.

ఇక్కడే అతని దృష్టి స్త్రీల గర్భధారణవైపు మళ్లింది. స్త్రీలు గర్భం ధరించక పోవటంపై పరిశోధనలు చేసి దాదాపుగా 20 పేపర్లు ప్రచురించాడు.

ఆ సమయంలో ఓ ఆపరేషన్ అతడి ఆలోచనా విధానాన్ని మార్చింది.

* * *

"సెమ్! ఈమెకు లాపరోస్కోపీ అవసరం" ఆపరేషన్ థియేటర్‌లో అడుగుపెడుతూ చెప్పాడు డాక్టర్.

'ఎండోస్కోప్'ను ఉపయోగించటం సెమ్ ప్రత్యేకత.

రోగి కడుపులోకి గాలిని పంపటం ఆరంభించారు. కడుపు ఉబ్బటం వల్ల పరీక్షించటం సులభం అవుతుంది. నెమ్మదిగా ఎండోస్కోప్‌ను రోగి శరీరంలోకి ప్రవేశపెట్టారు.

ఆపరేషన్ పూర్తయింది.

ఎండోస్కోప్‌ను అసిస్టెంట్‌కు అప్పగించి పక్కకు జరిగాడు డాక్టర్ కుర్ట్‌సెమ్.

ఇంతలో అనూహ్యమైన విషయం జరిగింది.

అసిస్టెంట్ ఒక్క సెకను నిర్లక్ష్యంగా ఉండటం వల్ల ఎండోస్కోప్ రక్తనాళానికి గీసుకుంది. వెంటనే అందుకోసమే ఎదురుచూస్తున్నట్టుగా నైట్రోజన్ రక్తంలో కలిసింది.

'డాక్టర్' కంగారుగా పిలిచాడు అసిస్టెంట్.

* * *

ఆ రాత్రే కాదు ఎన్నో రాత్రుళ్లు సెమ్‌కు నిద్ర పట్టలేదు. ఒక్క సెకను అజాగ్రత్త మరణానికి దారితీస్తుంది.

"ఇలా కాకుండా ఏం చేయాలి?"

ఆలోచిస్తున్న డాక్టర్ మెదడులో మెరుపు మెరిసింది.

* * *

ముందు సెమ్‌వైపు అపనమ్మకంగా చూశాడు సూపర్‌వైజర్ రిచర్డ్ ఫికెన్‌స్చర్.

నమ్మకమిస్తున్నట్టు నవ్వాడు సెమ్–



© EMESCO BOOKS

"సార్... మామూలు గాలిని పంపటం ద్వారా కడుపు వ్యాకోచిస్తుంది. అందువల్ల పరిశీలన సులభమౌతుంది. కానీ ఏమాత్రం పొరపాటు జరిగినా రోగికి అపాయం. అందుకే రక్తంతో సులభంగా కలవని వాయువు 'కార్బన్ డయాక్సయిడ్'ను శరీరంలోకి పంపితే...! ఇది నేను కనుక్కున్న కార్బన్‌డయాక్సయిడ్‌ను శరీరంలోకి ఊదే యంత్రం. దీనిద్వారా ఆపరేషన్ చేయటం మరింత సులభం అవుతుంది. శరీరాన్ని కోయాల్సిన అవసరం లేకుండా పరీక్షించటం వీలవుతుంది' వివరించాడు సెమ్.

ఎంతోసేపు ఆలోచించిన తరువాత తన సమ్మతి తెలిపాడు రిచర్డ్.

* * *

జర్మనీ గైనకాలజిస్టులు సెమ్‌పై విరుచుకుపడ్డారు. 'రోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాడు సెమ్' అని ప్రచారం చేశారు.

"నా పద్ధతి వల్ల రోగి శరీరాన్ని కోయటం ఉండదు. పైగా అన్ని ఆపరేషన్లు విజయవంతమౌతున్నాయి. ఇంకెందుకు వ్యతిరేకత?" ప్రశ్నించాడు సెమ్ ధైర్యంగా.

కానీ సమాజం కొట్టుకుపోతున్న దిశవైపు కాకుండా నూతన దిశలో ప్రయాణించాలనుకునేవాడు, సమాజం తనను అణచివేసేందుకు ఉపయోగించే ఒత్తిడిని తట్టుకుని నిలబడగలగాలి. అప్పుడే కొన్నాళ్లకు సమాజం అతడిని అనుసరిస్తుంది. ఎవరెన్ని విమర్శలు చేసినా సెమ్ చలించలేదు. ఎండోస్కోప్‌పై ప్రయోగాలు చేస్తూ పోయాడు.

అక్టోబర్ 1970: కేల్ యూనివర్సిటీలోని మహిళల ఆస్పత్రి డైరెక్టర్ అయ్యాడు సెమ్. దాంతో అతని పరిశోధనల వేగం పెరిగింది.

ఇక్కడే 'పెల్విస్కోపీ' పరిశోధనలో ఆయన ఆశ్చర్యకరమైన ఫలితాలు సాధించాడు.

కానీ జర్మనీలోని ఇతర వైద్యులు సెమ్‌ను గుర్తించేందుకు ఇష్టపడలేదు. అతడిని విమర్శలతో ముంచెత్తారు.

* * *

"సాధారణంగా ఆపరేషన్ అంటే శరీరాన్ని కోయటం ఉంటుంది. ఆపరేషన్ పూర్తయిన తరువాత రోగి కోలుకునేందుకు రెండు నెలలైనా పడుతుంది. కానీ నేను కనుగొన్న మినిమల్ ఇన్వేసివ్ సర్జరీ (ఎంఐఎస్) వల్ల శరీరాన్ని అవసరమైనంత వరకే కోయటం ఉంటుంది. ఆపరేషన్ పూర్తయిన గంటలోగా రోగి మామూలుగా పని చేసుకోగలుగుతాడు".

సెమ్‌వైపు అపనమ్మకంగా చూశారు సమావేశంలో ఉన్న డాక్టర్లు. ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన వైద్య పరిశోధకులకు సెమ్ మాటలపై నమ్మకం కుదరలేదు.

జర్మనీ డాక్టర్లయితే సెమ్‌పట్ల బహిరంగంగా ద్వేషాన్ని ప్రదర్శించసాగారు.

"సాంప్రదాయిక సర్జరీ పద్ధతులను కాదని సెమ్ వైద్య రంగానికి నష్టం కలిగిస్తున్నాడు" అంటూ విమర్శలు కురిపించారు.



© EMESCO BOOKS

సెమ్ పరిశోధనల ఫలితాలను ప్రకటించేందుకు ఏ జర్మనీ వైద్య పత్రికకూడా ముందుకు రాలేదు.

"మా పత్రికలలో చెత్తను ప్రకటించం" అని అతని వ్యాసాలను తిప్పి పంపించాయి. అది చూసి నిరాశపడిన సెమ్‌ను అతడి భార్య 'రోస్విథా' ఓదార్చింది.

"నిజం చెప్పాలంటే మనిషికి ఎంతో ధైర్యం ఉండాలి. నిజం చెప్పటమే కాదు దాన్ని నిరూపించి ప్రపంచం చేత ఒప్పించినప్పుడే నీ ధర్మం నువ్వు పూర్తిగా నిర్వహించినట్టవుతుంది. అంతవరకూ నువ్వు నిరాశ పడకూడదు. విశ్రమించకూడదు" అంది రోస్విథా.

ఆమె సూచన మేరకే ప్రపంచ డాక్టర్ల సమావేశంలో తన ఆపరేషన్ చిత్రాన్ని ప్రదర్శించాలని నిశ్చయించాడు సెమ్.

సెమ్ ఉపన్యాసం పూర్తి కాగానే 'అమెరికన్ ఫెర్టిలిటీ సొసైటీ' అధ్యక్షుడు జాన్ బెహ్రమీన్ లేచి నిలబడ్డాడు.

"సెమ్! నీ పట్ల మాకు గౌరవం ఉంది. కానీ నువ్వు చెప్పిన ఈ 'మినిమల్ ఇన్వేసివ్ సర్జరీ' నే నమ్మబుద్ధి కావటంలేదు" అని నిర్మొహమాటంగా అన్నాడు.

అయితే ఆ ప్రశ్నను ఎదుర్కొనేందుకు సెమ్ సిద్ధంగా ఉన్నాడు.

"సర్...మీకు నేను చెప్పే విషయంపై నమ్మకం కుదరకపోవటంలో ఆశ్చర్యం లేదు. ఎందుకంటే మనం చూసిందాన్నే నమ్ముతాం" అంటూ ప్రొజెక్టర్‌ను ఆన్ చేశాడు.

తెరపై కనబడుతున్న దృశ్యాలవైపు అందరి దృష్టి మళ్లింది. ఓరోగిని థియేటర్‌లోకి తీసుకువచ్చారు. వెంటనే ఓ డాక్టర్ ఎండోస్కోప్‌ను రోగి బొడ్డునుండి 'ఫాలోపియన్ ట్యూబ్' వరకూ దూర్చాడు.

ఎటువంటి 'కోత' అవసరం లేకుండా, శరీరంలోపలి భాగాలను పరిశీలించే వీలు కలిగింది. చీఫ్ సర్జన్ ఎండోస్కోప్ చివరన ఉన్న 'దర్శిని' ద్వారా ఫాలోపియన్ ట్యూబ్‌లోని భాగాలను పరిశీలించసాగాడు.

ఎండోస్కోప్ చివరన ఉన్న కెమెరా, శరీరం లోపలి భాగాల దృశ్యాలను చిన్న తెరపై ప్రదర్శిస్తోంది.

బీజం, అండాన్ని చేరటంలో అడ్డుపడుతున్న 'కంతి' కనబడింది. చిన్న తెరపై దాన్ని చూస్తూ, రోగి పొత్తికడుపు భాగంలో చిన్నగా కోశాడు డాక్టర్. అక్కడినుంచి సర్జికల్ పరికరాలను ఆమె కడుపులోకి ప్రవేశపెట్టాడు. తెరపై చూస్తూ, మైక్రో కత్తెరల ద్వారా 'కంతి'ని ఒడుపుగా కోశాడు. ఫోర్సెప్స్‌తో కోసిన 'కంతి'ని వెలుపలికి తీశాడు. వాక్యూమ్ ట్యూబ్‌ను శరీరంలోకి దూర్చి ఫాలోపియన్ ట్యూబ్‌లోని చెత్త పదార్థాలను బయటకు లాగేశాడు. వెంటనే ఇతర డాక్టర్లు, పొత్తి కడుపుపై కోసిన భాగాన్ని మూసేశారు.



© EMESCO BOOKS

ఆపరేషన్ మొత్తం 90 నిమిషాల్లో అయిపోయింది. ఆపరేషన్ అయిన రోగి మామూలుగా అయిపోయింది.

హాలు చప్పట్లతో దద్దరిల్లింది.

మొట్టమొదటిసారి వైద్య రంగం 'కుర్ట్ సెమ్'ను అత్యుత్తమ వైద్య పరిశోధకుడిగా గుర్తించింది.

అతడిని వ్యతిరేకించినవారు సైతం సెమ్ గొప్పతనాన్ని ఒప్పుకోక తప్పలేదు. 'వైద్య రంగానికి సెమ్ అత్యుత్తమ వరం 'ఎంఐఎస్' ఆపరేషన్ పద్ధతి' అని ప్రపంచవ్యాప్తంగా డాక్టర్లంతా ఒప్పుకుంటారు.

* * *

'ఫిజీషియన్ ఆఫ్ ది ఇయర్' బహుమతి అందుకున్న కుర్ట్ సెమ్ సజల నయనాలతో ప్రేక్షకులవైపు చూశాడు.

"ప్రపంచం నన్ను వ్యతిరేకించి వెలివేసినప్పుడు నా వెన్నంటి ఉండి నాకు అండగా నిలిచిన నా భార్య- ఇప్పుడు ప్రపంచం నన్ను ఆదరిస్తున్నప్పుడు ఒంటరివాడిని చేసి వెళ్లిపోయింది" అన్నాడు.

హాలు సానుభూతితో నిశ్శబ్దమైపోయింది.

"ఈ గుర్తింపు, బహుమతి నా బాధ్యతను మరింత పెంచుతాయి. వైద్యశాస్త్రం మరింత అభివృద్ధి చెందటంలో నేను నా బాధ్యతను ఎన్నటికీ విస్మరించను" అని వాగ్దానం చేశాడు సేమ్.

ఇప్పుడు కుర్ట్ ప్రపంచమంతా పర్యటిస్తూ 'ఎంఐఎస్' పద్ధతిలో డాక్టర్లకు శిక్షణనిస్తున్నాడు. ఆయన ఆరంభించిన 'కార్బన్ డయాక్సయిడ్ బ్లోయింగ్'ను ఇప్పుడు ఆటోమాటిక్ యంత్రాలు చేస్తున్నాయి.

ఆయన సర్జరీని మరింత సులభతరం చేసేందుకు గుండ్రటి రంపాన్ని తయారుచేశాడు. ఆయన రచించిన పుస్తకాలు ప్రపంచ వ్యాప్తంగా డాక్టర్లకు పాఠ్యగ్రంథాలు. బైబిల్ అంత పవిత్రమైన పుస్తకాలు అవి.

"రోగుల రోగాలను నయం చేయటం, వారి చికిత్సను ఓ ఆనందకరమైన అనుభవంలా చేయటం తప్పించి డాక్టర్‌కు మరో లక్ష్యం లేదు" అనే కుర్ట్‌సెమ్ పరిశోధనల ఫలితాలను ప్రపంచవ్యాప్తంగా బిలియన్లకొద్దీ ప్రజలు అభిమానిస్తున్నారు.

అందుకే "ఒక దీపం వెలిగితే అది మరెన్నో దీపాలను వెలిగిస్తుందని, జగతిని కాంతిమయం చేస్తుందని" అంటారు అనుభవజ్ఞులు. ఇందుకు కుర్ట్‌సెమ్ జీవితం మంచి ఉదాహరణ.



© EMESCO BOOKS

# ఆత్మవిశ్వాసమే ఆలంబనగా!

**ఆత్మవిశ్వాసంతో ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన అంధుడి అద్భుతగాథ.**

చల్లటి గాలి కత్తిగా మారినట్టుంది.

శరీరాన్ని కోసేయాలన్నంత కసిగా వేగంగా వీస్తోంది. కాళ్లకున్న బూట్లలోంచి కింద మంచు చల్లదనం శరీరంలోని అణువణువూ పాకుతోంది.

గడగడా వణికిస్తోంది.

అడుగు తీసి అడుగు వేయటం కష్టంగా ఉంది. శరీరం మామూలుకన్నా వందరెట్లు బరువు పెరిగిన భావన కలుగుతోంది. తల తిరుగుతోంది.

చెవుల్లో తుఫాను హోరు భయంకరంగా ఉంది.

ఎత్తుకు వెళ్తున్న కొద్దీ వాతావరణంలో ఆక్సిజన్ తగ్గుతుంది. దాంతో ప్రతి చిన్న పనీ ఎంతో కఠినంగా, భారంగా అనిపిస్తుంది. ఇది ఇలాగే కొనసాగితే, మెదడుకు సరిపడ ఆక్సిజన్ అందక మెదడు ఉబ్బిపోతుంది. శరీరానికి పని చేసే శక్తి తగ్గి నిద్ర పోవాలనిపిస్తుంది.

అదీ మెలకువ రాని దీర్ఘ నిద్ర!

'ఎరిక్... కంగారేం లేదు. నెమ్మదిగా అడుగులు వేయి. ఒకో అడుగు వేయటం గురించే ఆలోచించు. గమ్యం గురించి ఆలోచించకు'.

ఎరిక్ వెన్నంటి, అతడి వెంటే నడుస్తూన్న జెఫ్ ఇవాన్స్ అన్నాడు. ఇవాన్స్‌కు కూడా ఊపిరి తీయటం కష్టంగానే ఉంది.

'ఎంత దూరం ఉంది ఇంకా?' ఆయాసపడుతూ అతికష్టం మీద అడిగాడు ఇవాన్.

'వచ్చేశాం...ఇంకా కొన్ని అడుగులే' చెప్పాడు ఇవాన్స్.

© EMESCO BOOKS

నవ్వాడు ఎరిక్. మనం బయలుదేరినప్పటి నుంచీ ఇదే చెప్తున్నావు' అంటూ తన చేతివేళ్లతో గడియారం పైనున్న అద్దం తీసి, ముళ్లను పట్టుకుని చూశాడు ఎరిక్.

'అమ్మో...మనం బయలుదేరి పన్నెండు గంటలయింది. క్యాంప్ చేరుకొనేందుకు మనకు ఏడుగంటల టైమే ఇచ్చారు' కంగారుగా అన్నాడు ఎరిక్.

'డోన్ట్ వర్రీ... మనం ఎంత సమయం నడిచామన్నది కాదు ముఖ్యం. క్షేమంగా క్యాంపు చేరటం ముఖ్యం...' చెప్పాడు ఇవాన్స్.

'ఖుమ్బూ ఐస్ ఫాల్ దాటటంలో ఆలస్యం అయింది' తనలో తాను అనుకున్నాడు ఎరిక్.

నిజంగా ఖుమ్బూ ఐస్ ఫాల్‌లో అడుగుతీసి అడుగు వేయటం కష్టమైంది. మంచురాళ్లు ఎవరో విసిరేసినట్టు ఇష్టం వచ్చినట్టు పడున్నాయి. వాటిలోంచి దారి చేసుకుని నడవటం, అడుగడుగునా బాంబులు ఉండగా, వాటిపై అడుగు వేయకుండా నడవటం ఎంత కఠినతరమో, అంత అప్రమత్తతా అవసరం.

'అదిగో మన క్యాంపు' సంతోషంగా అరిచాడు ఇవాన్స్.

ఎరిక్ నవ్వాడు 'మొత్తానికి చేరుకున్నామన్న మాట' సంతోషంగా అన్నాడు.

క్యాంపు చేరగానే తగిలిన గాయాలకు మందులు రాశారు.

'ఎరిక్...నువ్వు కావాలనుకుంటే ఇక్కడే ఆగిపోవచ్చు. ఎవరం ఏమీ అనుకోము' చెప్పాడు ఎక్స్‌పిడిషన్ నాయకుడు పాస్కెల్ స్కాటురో.

ఎరిక్ మనసులో కూడా అదే ఆలోచన మెదలుతోంది.

ఇంతవరకూ తాను ఎక్కిన పర్వతాలు ఒక ఎత్తయితే, ఎవరెస్టు అధిరోహణ మరో ఎత్తు. ఏ పర్వతారోహణ కూడా ఇంత కష్టం కాలేదు. ఇంతకీ ఇది మొదటి క్యాంపు మాత్రమే. ఇంకా మూడు క్యాంపులు చేరాలి. ఆపై అత్యున్నత శిఖరమైన ఎవరెస్టును ఎక్కాలి.

ఇది తనకు సాధ్యమా? తాను తన లక్ష్యాన్ని సాధించగలడా?!

అంతలో ఎరిక్‌కు తన భార్య ఎల్లీ గుర్తుకు వచ్చింది.

'ఎరిక్...! నీకు అసాధ్యమన్నది లేదు. నువ్వు ఎవరెస్టు ఎక్కగలవు' అతడిని ప్రోత్సహిస్తూ అంది ఎల్లీ.

తనపై తన భార్యకున్న విశ్వాసాన్ని వమ్ము చేయటమా? తన కూతురు ఎమ్మాకు ఏమని చెప్తాడు?

'ప్రయత్నించకుండా వెనుదిరగటం కన్నా, ప్రయత్నించి పరాజయం పాలవటం మేలు' తన నిర్ణయాన్ని పాస్కెల్‌కు చెప్పాడు ఎరిక్.

ఎరిక్ మొండి పట్టుదల పాస్కేల్‌కు తెలుసు.

అందుకే, ఎవరెంతగా వద్దని వారించినా ఎరిక్‌తో ఎవరెస్ట్ ఎక్కేందుకు సిద్ధమయ్యాడు పాస్కేల్.

ఎరిక్‌తో కలిసి ఎవరెస్టు అధిరోహణకు ఎవరూ సిద్ధం కాలేదు. మామూలుగానే ఎవరెస్టు ఎక్కటం అంటే మృత్యువుతో చెలగాటం ఆడటమే. గుడ్డివాడిని తోడుగా తీసుకుని ఎవరెస్టు ఎక్కటం అంటే ఇక చెప్పనవసరంలేదు.

ఎవరెస్టు ఎక్కాలని ప్రయత్నిస్తున్న ఎరిక్ వెహెన్ మేయర్ గుడ్డివాడు!

* * *

ఊహ తెలిసినప్పటి నుంచీ తాను చూపు కోల్పోతాడని ఎరిక్ తెలుసు. అతడికి జన్యుసంబంధమైన రెటీనా వ్యాధి ఉందని తెలియటంతో 'చూపు పోవటం తప్పనిసరి' అని డాక్టర్లు చెప్పారు.

అయితే చూపు ఉన్నంత కాలంపాటు ప్రపంచంలోని వివిధ రంగులను చూడాలని ఎరిక్ తొందరపడ్డాడు. పదమూడేళ్ల వయసులో అతని చూపు పోయింది.

కొన్నాళ్లు ఎరిక్ డిప్రెషన్‌లో పడ్డాడు.

అతడిలో జీవితేచ్ఛ నశించి పోయింది. తనకు చూపు పోయిందన్న విషయాన్ని గుర్తించనట్టే ప్రవర్తించాడు. కర్ర సాయం తీసుకోలేదు. బ్రెయిలీ భాష నేర్చుకోలేదు.

'జీవితంలో అందరికీ అన్నీ ఉండవు. ప్రతి వ్యక్తికీ దేవుడు కొన్ని పరిమితులు విధిస్తాడు. వాటిని తలచుకుని కుంగిపోకూడదు. పరిమితులను ప్రతిబంధకాలుగా భావించకూడదు. వాటిని అవకాశాలుగా మలచుకోవాలి. పరిమితులను అధిగమించి ఎదగాలి. అదే మనిషి జీవిత లక్ష్యం. భగవంతుడు నీ నుంచి ఆశించేది కూడా అదే' కుంగిపోతున్న ఎరిక్‌ని అక్కున చేర్చుకుని అనునయించాడు అతని తండ్రి.

'నువ్వు ఏడిస్తే ప్రపంచం నిన్ను మరింత ఏడిపిస్తుంది. తల ఎత్తి నిలచిపోరాడు. ప్రపంచం చప్పట్లు చరుస్తూ నీ ముందు తలవంచుతుంది' అని బోధించింది అతని తల్లి.

'నువ్వు ఏడుస్తూ కూచుంటే నీ చూపు తిరిగి వస్తుందా? చిరునవ్వుతో అడుగు ముందుకు వేయి. నీ జీవితం నీకు లభిస్తుంది' ఎరిక్‌ను ప్రోత్సహించాడు అతని అన్న.

వారిచ్చిన ధైర్యంతో ఎరిక్ మనిషిలా నిలబడ్డాడు. ఆత్మ విశ్వాసంతో అడుగు ముందుకేశాడు.

తనకు చూపులేదన్న నిజాన్ని ఒప్పుకున్నాడు.



© EMESCO BOOKS

ఇప్పుడు తన స్పర్శనే తన కళ్లు అని అర్థం చేసుకున్నాడు. ఇక తాను ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్ వంటి ఆటలు ఆడలేనని అర్థం చేసుకున్నాడు. స్పర్శ ఆధారంగా ఆడే కుస్తీ పోటీల్లో పాల్గొన గలనని నిశ్చయించుకున్నాడు.

కుస్తీల్లో ప్రావీణ్యం సంపాదించాడు. దాంతో తన వయసువారికి ప్రీతిపాత్రుడయ్యాడు. తన మిత్రులతో కలసి టూర్లకి వెళ్లేవాడు. పిక్నిక్‌లకు వెళ్లేవాడు. ఓ అమ్మాయి అందంగా ఉందని తనకు తెలిపేందుకు మిత్రులతో రహస్య సంకేతాలు ఏర్పాటు చేసుకున్నాడు.

ఇంతలో అనుకోకుండా పర్వతారోహణ అతనికి పరిచయం అయింది.

కళ్లున్నవాళ్లు ఎత్తులను చూసి భీతి చెందుతారు. లోతులను చూసి భయపడతారు. అంధకారంలో ఉక్కిరిబిక్కిరి అవుతారు.

అటువంటి భయాలు తన దరిదాపులకు రావని గ్రహించాడు. చేతులతో కొండరాయిని తడుముతూ, తాళ్ళ ఆధారంగా పైకి ఎగబాకుతూ ఉంటే ఎరిక్‌కు ఎంతో సంతోషంగా సంతృప్తిగా అనిపించసాగింది.

దాంతో పర్వతారోహణ పట్ల ఆసక్తి చూపాడు ఎరిక్. ఆరంభంలో అతడి అంధత్వాన్ని హేళన చేసినవారు అతడి ప్రతిభను చూసి అతని అభిమానులయ్యేవారు. అలా పరిచయమయింది ఎరిక్‌కు ఎల్లీ రీవ్. ఆమె అందాన్ని ఆమె స్వరం ద్వారా అనుభవించాడు ఎరిక్.

ఇద్దరూ కలసి ఆఫ్రికాలో–3,700 మీ అతి ఎత్తయిన కిలిమంజారో పర్వతశిఖరాన్ని అధిరోహించారు.

అక్కడే వారిద్దరూ పెళ్ళి చేసుకున్నారు. ఇద్దరూ కలసి అలాస్కాలోని డెనాలి, అర్జెంటీనాలోని 'అకోంకాగువా' శిఖరాలనుకూడా అధిరోహించారు.

ఇలా మూడు ఖండాలలోని మూడు అత్యున్నత శిఖరాలను అధిరోహించిన ఎరిక్ 'టాప్ ఆఫ్ ది వరల్డ్' అనే పుస్తకం రాశాడు. దాంట్లో పర్వతారోహణలోని తన భావాలు–అనుభవాలను వివరించాడు.

ఆ పుస్తకం చదివిన పాస్కెల్ స్కాటుర్రో, ఎరిక్‌ను కలిశాడు.

'ఇంతవరకూ ఎవరెస్టును ఎక్కిన గుడ్డివారు లేరు. ఆ ఖ్యాతికూడా నీకే దక్కాలి' అని ప్రోత్సహించాడు.

దాంతో ఎవరెస్టును ఎక్కాలని ఎరిక్ నిశ్చయించుకున్నాడు.

అతడి నిర్ణయం విని అందరూ హేళన చేశారు. నిరుత్సాహపరిచారు.

© EMESCO BOOKS

‘ఎవరెస్టు అతి క్రూరమైన పర్వతం. పొరపాట్లను క్షమించదు. 1922 నుంచి ఇప్పటివరకూ 165 పర్వతారోహకులు దానిని అధిరోహిస్తూ ప్రాణాలు కోల్పోయారు. కళ్లున్న వాళ్ల గతే అలాగైతే మరి నీ పరిస్థితి ఆలోచించు’ అని హెచ్చరించారు.

‘ఎవరెస్టుపై మరణించిన గుడ్డివాడు– అన్న వార్త రాసి ఉంచాను’ అని ఏడ్పించాడో మిత్రుడు. అయితే ఎరిక్‌తో కలసి ఎవరెస్టు ఎక్కేందుకు పర్వతారోహకులు ఎవరూ ముందుకు రాలేదు.

‘ప్రతి మనిషికీ ఎవరెస్టుపై తన శరీరాన్ని మోయటమే కఠినంగా ఉంటుంది. ఇక గుడ్డివాడిని మోసుకుని ఎక్కే ప్రసక్తేలేదు’ నిర్ద్వంద్వంగా చెప్పారు కొందరు.

అయినా ఎరిక్ నిరాశ పడలేదు. పాస్కేల్‌ని కలిశాడు.

‘ఆలోచన ఇచ్చింది మీరే. దాన్ని ఆచరణ సాధ్యం చేయాల్సిన బాధ్యతను కూడా మీరే తీసుకోండి’ అన్నాడు.

ఎరిక్ పట్టుదల పాస్కేల్‌ని ముగ్ధుడిని చేసింది. దాంతో తానే పర్వతారోహణ జట్టుకు నాయకత్వం వహించాడు.

* * *

గంటకు 160 కి.మీ. వేగంతో గాలులు వీస్తున్నాయి. గాలికన్నా భయంకరంగా గాలితోపాటు పరుగెత్తుతూ వస్తోంది చలి.

టెంట్లు పట్టుకుని కూచున్నారు అందరూ.

‘మంచు తుఫాను వస్తుందటున్నారు. జాగ్రత్త’ హెచ్చరించాడు పాస్కేల్.

ఎనిమిది వేల మీటర్ల ఎత్తున ఉన్న క్యాంపు అది. అక్కడి నుంచి ఓ వైపు టిబెట్టు, మరో వైపు నేపాల్ వెళ్లవచ్చు.

‘ఈ క్యాంపు దాటితే ఇక శిఖరం ఎక్కటమో, చావటమో తప్ప వేరే మార్గం లేదు. ఎవరైనా వెనక్కు వెళ్లిపోవాలంటే ఇక్కడించే వెళ్లిపోవచ్చు’ చెప్పాడు పాస్కేల్. అందరూ ఎరిక్‌నే చూశారు.

ఎరిక్ నవ్వాడు. అతడి ముఖమంతా గాయాలున్నాయి. కాళ్లవేళ్లు కోసుకుపోయాయి.

చేతులపై చర్మం లేదు. మాంసం కనిపిస్తోంది.

‘ఎవరెస్టు నన్ను పిలుస్తోంది. నేను వెనుతిరిగే ప్రసక్తేలేదు. అయితే ఎవరెస్టు శిఖరం లేదా స్వర్గం చేరతాను’ నిశ్చయంగా చెప్పాడు ఎరిక్.

* * *



© EMESCO BOOKS

చుట్టూ కన్ను పొడుచుకున్నా కానరాని చీకటి.

ఎవరెస్టు శిఖరం చేరేందుకు సాధారణంగా ట్రెక్కర్లు రాత్రి పూటనే నడుస్తారు. మిగతావారు కష్టపడుతున్నారు. కానీ చీకటినే జీవితంలో వెలుతురుగా మార్చుకున్న ఎరిక్ కష్టపడటం లేదు. అతని ముందున్న ఇవాన్స్ బ్యాగుకు గంట కట్టుకున్నాడు. ఆ గంట శబ్దాన్ని పట్టి నడుస్తున్నాడు ఎరిక్.

మంచులోంచి ఆయాసపడుతూ నడుస్తున్న ఇవాన్స్ ఆగిపోయాడు. ఎరిక్‌వైపు తిరిగి చెప్పాడు.

'ఎరిక్! కంగ్రాట్స్... ఎవరెస్టుపై అడుగిడిన వాళ్ల జాబితాలో నీ పేరు కూడా చేరింది' మృదువుగా అన్నాడు.

* * *

'నా జీవితంలో నేను ఎన్నో శిఖరాలు అధిరోహించాను. కానీ ఎవరెస్టు అధిరోహణలు మాత్రం ఒక అసాధారణమైన, అపురూపమైన అనుభవాన్నిచ్చిందని' అంటాడు ఎరిక్.

'ఎవరెస్టు ఎక్కినప్పటి అనుభూతిని మాటలలో వర్ణించటం సాధ్యం కాదు. అలాగే నా కూతురు నా చేయి పట్టుకుని నడిపిస్తూంటే కలిగే ఆనందాన్ని కూడా మాటలలో చెప్పటం సాధ్యం కాదు' అంటాడు ఎరిక్.

ప్రస్తుతం మళ్లీ ఎవరెస్టు ఎక్కాలని ఆలోచిస్తున్నాడు ఎరిక్.

'తొందర పడకు డాడీ...ఈసారి అమ్మా, నేనూకూడా నీతో వస్తాం' అంటుంది చిన్నారి ఎమ్మ.

వాళ్ల ఆత్మ విశ్వాసాన్ని దేనితోనూ కొలవలేం.

© EMESCO BOOKS

# ఎగిరిన పావురం!

**చైనీయుల ఇనుప తెరను దాటి**
**భారత్ వచ్చిచేరిన కర్మప్ప సాహసయాత్ర.**

డిసెంబర్ 28, 1999, షుర్ఫు ఆరామం, టిబెట్.

టిబెట్ మోనోస్టెరీ గోడకు ఆవల ఆగివున్న మిట్సుబిషి వాహనం డ్రైవరు ఉద్విగ్నంగా ఉన్నాడు. మాటిమాటికీ చెమట తుడుచుకుంటున్నాడు.

అసహనంగా స్టీరింగ్‌పై వేళ్ళు ఆడిస్తున్నాడు. తిన్నగా మోనాస్టెరీ తలుపువైపు చూడకూడదు. అందుకని వాహనానికున్న అద్దాన్ని తలుపువైపు తిప్పి అద్దంలో మాటిమాటికీ తలుపువైపు చూస్తున్నాడు.

ఆరోజు చైనావారి కన్నుగప్పి ఆ బౌద్ధమందిరం నుంచి ఎవరో తప్పించుకోబోతున్నారని అతడికి తెలుసు. ఎవరో 'లామా'ని సరిహద్దు దాటించేందుకు అతని సహాయం అవసరమని బౌద్ధ మందిర అధికారి రహస్యంగా అడిగాడు. తన ధర్మరక్షణలో తానూ భాగం పంచుకొనే అవకాశం లభిస్తుందని డ్రైవర్ వెంటనే ఒప్పుకున్నాడు.

కానీ...తీరా 'లామా' తన బండి ఎక్కే సమయం దగ్గర పడుతున్న కొద్దీ అతడి ఉద్విగ్నత అధికం అవుతోంది. ఎందుకంటే చైనా పోలీసులకు పట్టుబడితే మరణం...అదీ అతి భయంకరమైన మరణం తప్పదని అతడికి తెలుసు.

ఇంతలో ముగ్గురు 'లామా'లు పరుగెత్తుకు రావటం కనిపించింది. వెంటనే తలుపులు తెరచి, ఇంజన్ స్టార్ట్ చేశాడు.

ముగ్గురు ఎవరో స్పష్టంగా కనబడటం లేదు. వాళ్ళు గబగబా బండిలోకి ఎక్కారు. తలుపులు పూర్తిగా మూయకముందే వేగంగా ముందుకు దూసుకుపోయింది మిట్సు బిషి.

బండి కాస్త దూరం వెళ్ళిన తరువాత, ఓర కంట వెనకున్న వారిని గమనించాడు. అతని గుండె ఒక్కక్షణం ఆగి, ఆపై వేగంగా కొట్టుకోసాగింది. తాను, టిబెట్టునుంచి తప్పించి, భారత్

చేరుస్తున్నది మరెవరినో కాదు. టిబెట్ బౌద్ధులలో 'కర్మాకాగ్యు' ఆలోచనా విధానానికి పెద్దయిన 17వ అధికారి, 14 ఏళ్ళ గ్యాల్వా కర్మప్పని!

* * *

1992లో ఏడేళ్ళ వయసులో ఉగ్యెన్ ట్రీన్లెడోర్జిని 16వ కర్మప్ప పునర్జన్మ రూపంగా గుర్తించారు 60 కి.మీ. దూరంలో ఉన్న 'ఘర్ఫు' బౌద్ధ కేంద్రంలో, 20,000 మందికిపైగా హాజరైన ఓ అద్భుతమైన సమావేశంలో ఆ పిల్లవాడిని కర్మప్పగా సింహాసనంపై కుర్చోబెట్టారు. దలైలామా, బీజింగ్ ప్రభుత్వం ఆ బాలుడిని కర్మప్పగా గుర్తించటంతో బౌద్ధుల భవిష్యత్తును నిర్ణయించే ఉన్నత పీఠానికి అధిపతి అయ్యాడు కర్మప్ప.

ఆరంభం నుంచీ బీజింగ్ ప్రభుత్వం కర్మప్పని మంచి చేసుకోవాలని ప్రయత్నిస్తూ వచ్చింది. కర్మప్పద్వారా టిబెట్‌పై తమ అధికారాన్ని స్థిరం చేసుకోవచ్చని ఆశించింది. టిబెట్ స్వయం ప్రతిపత్తి కోరి అంతర్జాతీయ స్థాయిలో పోరాటం జరుపుతున్న దలైలామా పోరాటాన్ని కర్మప్పద్వారా దెబ్బ తీయవచ్చని బీజింగ్ భావించింది.

బీజింగ్ తన పట్ల చూపిస్తున్న ఆదరణకు ముగ్ధుడయ్యాడు కర్మప్ప. కానీ ఊహ తెలుస్తున్నకొద్దీ అతడికి చైనా ఆదరణ వెనుకవున్న రాజకీయం అర్థమయింది. 'కర్మకగ్యు' సాంప్రదాయం ప్రకారం 'కర్మప్ప' బౌద్ధ సిద్ధాంతాలను పరమ గురువుల నుంచి మౌఖికంగా నేర్చుకోవాలి. పరమ గురువులు 'తాయ్‌సితు రింపోచె', 'గ్యాల్ట్‌సాబ్ రింపోచే' లిద్దరూ భారత్‌లో ఉన్నారు. వారి దగ్గర విద్యాభ్యాసం చేసేందుకు భారత్ ప్రయాణమయ్యే అనుమతిని కోరాడు కర్మప్ప. చైనా ప్రభుత్వం ఆ అభ్యర్థనను తిరస్కరించింది.

కర్మప్పకు బోధించేందుకు టిబెట్ వచ్చే అనుమతినివ్వమని పరమ గురువులు చైనాను అభ్యర్థించారు. వారి అభ్యర్థనను తోసిపుచ్చింది చైనా ప్రభుత్వం. ఇది కర్మప్పలో మొదటిసారిగా తాను బంగారు పంజరంలో ఉన్న చిలకలాంటి వాడినన్న భావన కలిగించింది.

కర్మప్పలో ఆలోచన మొదలయింది. తనచుట్టూ ఉన్న పరిస్థితులను గమనించసాగాడు. 1999లో ఓ సభలో కర్మప్ప ఉపన్యాసం ఇవ్వాలి.

ప్రాంతీయ కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధి కర్మప్పకు తయారుచేసిన ఉపన్యాసం అందించాడు. ఉపన్యాసం చదివిన కర్మప్ప అసంతృప్తిని వ్యక్తం చేశాడు.

'నేనీ ఉపన్యాసం మీ తరఫున ఇస్తున్నట్టు ప్రకటించాలా?' అని సూటిగా అడిగాడు కర్మప్ప.

'కాదు...ఇది మీరే స్వయంగా తయారు చేసుకున్నట్టు చెప్పాలి'.

కర్మప్ప తలఅడ్డంగా ఊపాడు.



© EMESCO BOOKS

'నేను ఇటువంటి ఉపన్యాసం ఇవ్వను' నిశ్చయంగా చెప్పాడు.

ఆరోజు కర్మప్ప ఉపన్యాసం రద్దయింది.

అప్పట్నించీ కర్మప్పలో అసంతృప్తి పెరగసాగింది.

తమ అధికారంపట్ల కర్మప్ప అసంతృప్తితో ఉన్నాడన్న విషయం బీజింగ్‌ను కలవరపరచ సాగింది.

కర్మప్ప తమకు వ్యతిరేకి అయినా తప్పించుకుని భారత్ చేరినా టిబెట్ ప్రజలు తమ పాలనలో సంతృప్తితో ఉన్నారని తాము చేస్తున్న ప్రచారం అబద్ధమని ప్రపంచానికి తెలుస్తుంది.

ఇదీ బీజింగ్ ప్రభుత్వానికి భయం!

తాను భారత్‌కు పారిపోయి వస్తానని కర్మప్ప దలైలామాకు కబురు పంపించాడు. తొందర పడవద్దని దలైలామా సమాధానం ఇచ్చాడు.

బౌద్ధారామంపై నిఘాను పటిష్టం చేసింది బీజింగ్. కర్మప్ప గృహం వదలి వెళ్ళకూడదని నియమం విధించింది.

ఇన్నాళ్లు తాను బంగారు పంజరంలో చిలకగా ఉన్నానని, ఇప్పుడు తాను ఖైదీని అని కర్మప్పకు అర్థమయింది. బౌద్ధ మందిరంలోని చిత్రపటాలను పరిశీలిస్తున్న కర్మప్ప దృష్టి ఆ చిత్రపటంపై కేంద్రీకృతమైంది.

19వ శతాబ్దానికి చెందిన బౌద్ధ భిక్షువు 'చోగ్యుర్ డేచెన్ లింగ్పా' కలకు సంబంధించిన చిత్ర పటమిది. 17వ కర్మప్ప భారత్‌లో 'షేరాబ్‌లింగ్' అనే ప్రాంతానికి చేరుకున్నట్టు చూపే చిత్రపటం అది.

'షేరాబ్‌లింగ్' అన్నది ఉత్తర భారతదేశంలోని ఓ బౌద్ధ ఆరామం.

ఆ చిత్రపటం చూసిన కర్మప్ప ఓ నిశ్చయానికి వచ్చాడు.

* * *

డిసెంబర్ 29, రాత్రి 11.30 ని॥లు వ్యాన్ ఆగటంతో ఆలోచనల్లోంచి బయటకు వచ్చాడు కర్మప్ప. చుట్టూ చిమ్మచీకటి. ఎదురుగా ఏముందో కూడా తెలియనంత చీకటి.

"ఇక్కడికి దగ్గరలోనే చైనా సైనికుల చెక్‌పోస్ట్ ఉంది. మీరు ఇక్కడనుంచి కాలినడకన ఆ కొండ ఎక్కి దిగాలి. మేం చెక్‌పోస్ట్ దాటివచ్చి కొండకింద ఎదురుచూస్తుంటాం" చెప్పాడు డ్రైవర్.

"నేను తప్పించుకున్నట్టు ఎవరికయినా తెలిసిందా?" అడిగాడు కర్మప్ప.

"వారం దాకా తెలిసే అవకాశం లేదు. మీరు 8 రోజుల ఏకాంతవాసంలో తపస్సు చేస్తున్నారని అందరూ నమ్ముతున్నారు. మీ అధ్యాపకుడు, వంటవాడికి తప్ప మరెవరికీ మీ ఆంతరంగిక గృహంలోకి ప్రవేశం లేదు. కాబట్టి ఎవరికీ తెలిసే అవకాశం లేదు".

నిట్టూర్చాడు కర్మప్ప.

కర్మప్పతో పాటు మరో ఇద్దరు లామాలను ఆ చీకట్లో ఒంటరిగా వదలి ముందుకు సాగింది వ్యాను.

కన్ను పొడుచుకున్నా కానరాని చీకటి. ఆపై ఎముకలు కొరికే చలి. టార్చ్ వేయటానికి వీలులేదు. ఎందుకంటే, ఆ వెలుతురు చైనా సైనికుల దృష్టిని ఆకర్షించవచ్చు. దాంతో వారు పాకటం మొదలుపెట్టారు. ఒకరి కాలు మరొకరికి తగిలేట్టుగా పాకటం ఆరంభించారు.

అలా, అయిదు గంటలు పాకుతూ కొండ ఎక్కారు. కొండ దిగటం మరింత కష్టమయింది. వాళ్ళు కొండ దిగి వ్యాన్ చేరేసరికి మోకాళ్ళపై చర్మం చిట్లి రక్త సిక్తమయ్యాయి. అరచేతి దేక్కుపోయింది. ఒళ్ళంతా గాయాలయ్యాయి.

అటునుంచి వ్యాన్‌లో రోజంతా ప్రయాణం చేసి 'ముస్తాంగ్' సరిహద్దు చేరారు. కానీ నేపాల్‌లో ప్రవేశించేందుకు వారికి అనుమతి లేదు. అందుకని వ్యాన్‌ని అక్కడే వదలి గుర్రాలపై లోమాన్‌థాంగ్ చేరుకున్నారు. ఇక్కడ వారు బయలు దేరినప్పటినుంచీ మొదటిసారి విశ్రాంతి తీసుకున్నారు.

అందరూ నిద్రించారు. కానీ కర్మప్ప నిద్రపోలేదు. దూరంగా కనిపిస్తున్న హిమాలయాలను చూస్తూ, వాటి సౌందర్యాన్ని అనుభవిస్తూ, భగవాన్నామం జపిస్తూ రాత్రంతా గడిపాడు.

డిసెంబర్ 31.

తెల్లవారుతూనే గుర్రాలపై బయలుదేరారు. తాము టిబెట్‌నుంచి తప్పించుకుని వచ్చిన వార్త ఎవరికీ తెలియకూడదని వారు ముఖాలపై ముసుగులు వేసుకున్నారు. ఎక్కడా ఆగకుండా, విశ్రాంతి తీసుకోకుండా రెండు రోజులు గుర్రాలపై ప్రయాణించి నేపాల్‌లోని 'మానాంగ్' జిల్లా చేరుకున్నారు.

ఆ రోజు రాత్రి అక్కడే విశ్రాంతి తీసుకుని మరుసటి రోజు హెలికాప్టర్‌లో ఖాట్మాండు పరిసర ప్రాంతాలు చేరుకున్నారు.

ఎనిమిది రోజులు ఎడతెరపి లేకుండా ప్రయాణించిన కర్మప్ప జనవరి 5 ఉదయం 10 గం॥ 30 ని॥లకు ధర్మశాల చేరుకున్నారు.

* * *

తన భక్తులతో మాట్లాడుతున్న దలైలామా గదిలోకి ప్రవేశించిన ఆ పిల్లవాడిని చూసి ఆశ్చర్యపోయాడు.

ఆ పిల్లవాడి శరీరమంతా గాయాలున్నాయి. రక్తం గడ్డ కట్టి కనిపిస్తోంది. కాళ్ళుచేతులు గీరుకుపోయి ఉన్నాయి. సన్నగా, బలహీనంగా ఇప్పుడో, ఇంకో క్షణమో స్పృహతప్పిపోయేట్టు ఉన్నాడు ఆ అబ్బాయి.

'ఎవరు?' అడగబోయిన దలైలామా ప్రశ్న పెదవి దాటి బయటకు రాలేదు. తన ఎదురుగా నిలబడిన పిల్లవాడిని ఆయన గుర్తించారు.

* * *

కర్మప్ప భారత్ చేరిన వార్త ప్రపంచాన్ని కుదిపేసింది.

తమ కళ్ళు గప్పి కర్మప్ప భారత్ చేరటం చైనాను ఆగ్రహావేశాలకు గురిచేసింది. అంతర్జాతీయంగా సంచలనం సృష్టించిన ఈ వార్త చైనాను ఇరుకునపెట్టింది. 'కర్మప్ప తన మాతృభూమికి ద్రోహం చేయడు. వెంటనే టిబెట్ తిరిగివస్తాడు' అని ప్రకటించింది చైనా.

అయితే, పారిపోవటంలో కర్మప్పకు సహాయం చేసిన అతని టీచర్, వంటమనిషి గతి ఏమయిందో ఎవరికీ తెలియదు.

కర్మప్ప భారత్ చేరటంతోటే 'కర్మకగ్యు' లామాలు కర్మప్ప దర్శనం కోసం పెద్ద ఎత్తున రావటం ఆరంభమయింది.

చదువుకుంటూ, కవిత్వం రాస్తూ సమయం గడుపుతున్న కర్మప్ప టిబెట్‌పై చైనా అణచివేతకు, మానవుడిలోని స్వేచ్ఛ ప్రవృత్తికి ప్రతీకగా నిలిచాడు.

మత గురువుగా, స్వేచ్ఛ స్వతంత్రవాదిగా టిబెట్ ప్రజల భవిష్యత్తును నిర్దేశించగలిగిన కర్మప్ప మార్గదర్శనం కోసం టిబెట్ ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

© EMESCO BOOKS

# అమృతప్రేమకు చిరునామా

**పుట్టుకతోనే పక్షులను ప్రేమించి 14 ఏళ్ళ ప్రాయంలోనే ప్రపంచానికి జీవకారుణ్యం నేర్పిన బాలికకథ.**

మెస్సినా, ఇటలీ, 1984.

కళ్లు తెరిచింది అన్నా మరియా. కిటికీలోంచి వినీలాకాశం, నిర్మలంగా, ప్రశాంతంగా చిరునవ్వు వెలుగు కిరణాలను మోసుకువచ్చిన అన్నాకళ్లు తెరవటం కోసం ఎదురు చూస్తున్నట్టుంది. అంతలో-

ఓ తెల్లటి దూదిపింజలాంటి మల్లెమాల మేఘం కిటికిలోంచి అన్నావైపు తొంగిచూసి నవ్వింది.

'గుడ్‌మార్నింగ్' అన్నట్టనిపించింది అన్నాకు. ఆమె మనసంతా సంతోషంతో నిండిపోయింది.

ఇంతలో ఆమె ఎదురుచూస్తున్న మిత్రులు వయ్యారంగా ఎగురుతూ వచ్చారు. రకరకాల పక్షులు ఆమె కిటికీ దగ్గరకు వచ్చి కిచకిచమన్నాయి. కిటికీ బయట వాటికోసం వేసి ఉంచిన గింజలను గబగబా, ఆత్రంగా తినటం ఆరంభించాయి. మరీ ధైర్యం కల పక్షులు కిటికీలోంచి లోపలకు దూసుకువచ్చాయి. అన్నాచుట్టూ తిరగసాగాయి. కొన్ని ఆమె తలమీద చిందులు వేస్తే. మరికొన్ని జాపిన చేతుల్లోని గింజలను సుతారంగా ముక్కున కరుచుకుని రివ్వుమని ఎగిరిపోసాగాయి. ఎంతో ఆనందంగా అనిపించింది అన్నాకు.

'ఎంత సుందరమీ ప్రపంచం! సృష్టిలోని అణువణువునా అందాన్ని నింపాడు భగవంతుడు. చరాచర సృష్టి సర్వం ఆనంద రస ప్రవాహం' అనుకుంది అన్నా మరియా.

ఆమెకు ఎంతో ఉత్సాహంగా అనిపించింది. చకచకా తయారైంది.

"ఇవాళ్ల ఎవరిమీద యుద్ధానికి బయలుదేరుతున్నావు?" గబగబా బ్రేక్‌ఫాస్ట్ తింటున్న అన్నాను అడిగింది వాళ్లమ్మ.

© EMESCO BOOKS

"దీనికి పక్షులమీద ఉన్న ప్రేమ, మనుషులమీద లేదు. ఉంటే, రోజూ మనకింత టెన్షన్ పెట్టేదా?" అన్నారు. ఆమె తండ్రి ఆప్యాయంగానే.

నవ్వింది అన్నా. "పక్షులకు మోసం, అన్యాయం, కుట్రలు తెలియవు. వాటికి తమని చంపేందుకు మనుషులు ఆధునిక మారణాయుధాలతో పొంచి ఉన్నారనీ తెలియదు. తమని చంపటం కొందరికి ఆట అయితే, మరికొందరికి లాభసాటి వ్యాపారం అన్న ఊహకూడా వాటికి రాదు. అటువంటి వాటిని ప్రేమించకపోతే వాటిని చంపే మనుషులను ప్రేమిస్తామా?" నవ్వుతూ అన్నా, ఆమె స్వరంలోని పట్టుదలను ఆమె తల్లితండ్రి గమనించారు. కానీ వారి భయం వారిది.

"జాగ్రత్తమ్మా. తమ వ్యాపారానికి నువ్వు అడ్డుపడుతున్నావని వేటగాళ్లు నీమీద కోపంగా ఉన్నారు. వాళ్లు హింసకు దిగే అవకాశం ఉందని పోలీసులు హెచ్చరిస్తున్నారు కూడా." తండ్రి మాటలకు నవ్వింది అన్నా.

"నాన్నా! మనం చేస్తున్న పని మంచిది అని నమ్మకం ఉన్నప్పుడు ఎవరికీ భయం పడనవసరంలేదని నువ్వే నేర్పావు. నేను చేస్తున్నది మంచి పనే అని నాకు నమ్మకం ఉంది. మీరూ నన్ను మెచ్చుకుంటున్నారు. ఇక ఎవరేమన్నా నేను పట్టించుకోను" అని బయటకు నడిచింది అన్నా. ఇల్లు దాటి బయటకు వచ్చింది అన్నా. కారు మీద ఓ పక్షుల గుంపు, కారుపై ఉన్న గింజలను గబగబా తింటూ కనిపించాయి.

'మమ్మల్ని డిస్టర్బ్ చేయకు' అన్నట్టు అన్నావైపు ఓసారి చూసి మళ్లీ గింజలు తినటంలో నిమగ్నమయ్యాయి. ఆ దృశ్యాన్ని ఆనందంగా చూస్తూ నుంచుంది అన్నా. ఆమె అర్జంటుగా వెళ్లాలి. బయలుదేరాల్సిన సమయమవుతోంది. ఆమెకోసం అందరూ ఎదురుచూస్తుంటారు. కానీ ఆ పక్షులను డిస్టర్బ్ చేయటం కన్నా తన పనికి ఆలస్యంగా వెళ్లటమే ఉత్తమం అనుకుంది. అదే ఆమెను రక్షించింది.

ఎందుకంటే, సరిగ్గా ఆమె బయలుదేరాల్సిన సమయానికి, కారులో రహస్యంగా ఉంచిన టైమ్‌బాంబ్ పేలింది. పెద్ద శబ్దంతో కారు ముక్కలు గాలిలోకి ఎగిరాయి. అంతవరకూ ఆత్రంగా, చకచకా తింటున్న పక్షులు క్షణంలో ఆ నిప్పులో మాడి మసి అయిపోయాయి. బాంబు విస్ఫోటన శక్తికి అన్నా ఎగిరి పక్కన పడింది.

చుట్టుప్రక్కల ఉన్న చెట్లపై విశ్రాంతి తీసుకుంటున్న పక్షులు పెద్ద శబ్దంతో గాల్లోకి ఎగిరాయి.

* * *

ఊహ తెలిసినప్పటి నుంచీ అన్నాకు మనుషులకన్నా ఇతర జీవులంటేనే ఎక్కువ మక్కువ ఉండేది. దూకే కప్పల వెంటపాకుతూ పోయేది. పాకే పురుగుల వెంటపడి జారేది. ఎగిరే

© EMESCO BOOKS

సీతాకోకచిలుకలను అందుకోవాలని తాపత్రయపడేది. అయితే అన్నిటికన్నా ఆమెకు పక్షులంటే మహాఇష్టంగా ఉండేది. కళ్లార్పకుండా వాటిని చూస్తుండిపోయేది. గాలిలో స్వేచ్ఛగా, ఎగురుతున్న పక్షులను చూస్తూంటే ఆమె మనసు కూడా రెక్కలు కట్టుకుని విశాలమైన వినీలాకాశంలో విహరించడానికి రివ్వుమని ఎగిసేది. పాకెట్ మనీతో పిల్లలంతా చాక్లెట్లు, బిస్కట్లు కొనుక్కుంటే, అన్నా ఆదివారాలు మాత్రమే ఉండే పక్షుల దుకాణాలకు వెళ్లి తన దగ్గరున్న డబ్బుకు సరిపడ పక్షులను కొనేది. పంజరాల నుండి వాటిని విడిపించి, గాల్లోకి వదిలేసేది. అవి స్వేచ్ఛగా ఎగిరిపోతుంటే సంబరంగా చప్పట్లు చరిచేది.

పక్షులపై ఆమెకున్న ప్రేమను గమనించిన తండ్రి ఆమెను 'లీగ్ ఫర్ ది ప్రొటెక్షన్ ఆఫ్ బర్డ్స్' అనే సంస్థలో సభ్యురాలిగా చేర్పించాడు. తాను కొని స్వేచ్ఛగా వదిలేసిన పక్షులను మళ్లీ బంధించి పంజరాలలో పెట్టి, అమ్మకానికి బజార్లో పెడుతున్నారని తెలిసిన అన్నా కోపంతో ఊగిపోయింది.

"ఇంతమంది పక్షి ప్రేమికులం ఉండి ఏం లాభం?" అని గద్దించి అడిగింది. అప్పుడామెకు పదేళ్లు.

* * *

పధ్నాలుగేళ్ళ వయసులో జరిగిన సంఘటన అన్నా జీవితాన్ని మలుపు తిప్పింది.

ప్రతి వసంతకాలం 'హనీ బజార్డ్' అనే పక్షుల గుంపు ఆఫ్రికా నుంచి బయలుదేరి యూరప్‌గుండా ప్రయాణిస్తూ ధ్రువప్రాంతాలు చేరతాయి. కొన్ని వందలమైళ్లు ప్రయాణించే ఆ పక్షులు 'పెలోరిటాని' కొండలపై క్షణకాలం విశ్రాంతి తీసుకుని మళ్లీ తమ ప్రయాణం సాగిస్తాయి. వాటిని చూసేందుకు అన్నా, తన కొందరు మిత్రులతో కలసి ఆ పర్వతప్రాంతాలు చేరుకుంది. అందరూ ఎంతో ఉత్సాహంగా, ఆత్రంగా మొదటి పక్షిరాకకోసం ఎదురుచూడ సాగారు. వాళ్లు ఎదురుచూసిన క్షణం రానేవచ్చింది. గర్వంగా, మహారాజులా ఎగురుతూ వచ్చిన ఓ పక్షి కనిపించింది. దానికోసమే ఎదురుచూస్తున్న వారంతా హర్షధ్వానాలతో తమ సంతోషాన్ని వ్యక్తపరిచారు. అయితే, మహారాజుకన్నా ముందు పర్యవేక్షణకు వచ్చే అంగరక్షకుల్లా, ఒకటి రెండు పక్షులు ముందు వచ్చాయి. వాటి వెనుక రివ్వు రివ్వున ఎగురుతూ, పెద్దపక్షుల గుంపు ఒక్కసారిగా ఆకాశంలో కనబడింది. ఆకాశమంతా కొన్నివేల పక్షులతో తళతళతాడసాగింది. ఆ దృశ్యం చూస్తున్నవారి ఆనందానికి అంతులేదు.

వారి ఆనందం అంబరమై, ఆ పక్షుల విన్యాసాల వేదిక అయింది. అంతలో ధనధనమంటూ తుపాకుల మోత వినిపించింది. ఒకటొకటిగా పక్షులు నేలరాలసాగాయి. ఆనందం హర్షధ్వానాలు, ఆవేదనాపూరిత హాహాకారాలుగా మారాయి. అన్నా దుఃఖానికి అంతులేదు. అంతలోనే ఆమె పిడికిళ్లు బిగుసుకున్నాయి. ఆమె కళ్లముందే అనేక పక్షులు గిలగిల కొట్టుకుని ప్రాణాలు విడిచాయి.



© EMESCO BOOKS

ఆమె కన్నీళ్లు విస్ఫులింగాలుగా మారాయి. ఆ రోజు రాత్రి జరిగిన సమావేశంలో 14 ఏళ్ల అన్నా, అందరినీ ఆశ్చర్యచకితులను చేసింది.

"నోరులేని ప్రాణులు పక్షులు. వాటికి ప్రమాదం పొంచి ఉందని తెలియదు. మనిషి అనే తెలివైన జీవి తన శత్రువన్న జ్ఞానంలేదు. అటువంటప్పుడు వాటిని రక్షించాల్సిన బాధ్యత మనపై ఉంటుంది. మనం పక్షి ప్రేమికులమని చెప్పుకుంటూ, వాటిని చూసి ఆనందిస్తూ, మనిషి వాటిని చంపుతూంటే మౌనంగా చూస్తూ ఊరుకుంటే లాభంలేదు. మనం వాటి రక్షణకోసం పోరాడాలి. పక్షులు కూడా భగవంతుడి సృష్టిలోని ప్రాణులే. ఈ ప్రపంచంలో వాటికీ జీవించే హక్కు ఉంది. ఆ హక్కుకోసం మనం పోరాడాలి" గర్జించింది అన్నా.

ఆమె ఆవేశానికి అందరూ ఉక్కిరిబిక్కిరి అయ్యారు. పెద్దలు సైతం కార్యప్రణాళిక కోసం ఆమె మార్గదర్శనం కోరారు. వెంటనే అన్నా ఓ ప్రణాళిక వేసింది. మరుసటిరోజు ఆ సంఘసభ్యులంతా పక్షుల వేషాలు వేసుకుని వీధులన్నీ తిరిగారు. నాలుగురోడ్ల కూడలిలలో నలుగురు జమ కాగానే పక్షుల్లా ఎగిరినట్టు నటించారు. ఆపై వేటగాడి తుపాకీకి బలై మరణిస్తూ జాలిగా, దీనంగా తమని బతికించమని చుట్టూ మూగిన వారిని వేడుకున్నారు. ఓ వారం ఇలా ప్రదర్శనలు ఇచ్చారు. మరుసటివారం కొండలలో కాపుకాశారు. పక్షులను కాల్చేందుకు వచ్చినవారిని కాళ్లావేళ్లాపడి బతిమిలాడారు. పక్షులను చంపవద్దని వేడుకున్నారు. వేటగాళ్లు వీళ్లని చూసి విసుక్కున్నారు. హేళన చేశారు.

ఓవైపు వేటగాళ్లని ఇలా బతిమిలాడుతున్న సమయంలోనే పక్షుల రక్షణకు అన్నా పోలీసుల సహాయం కోరింది. ఆరంభంలో పోలీసులు ఉదాసీనంగా ఉన్నారు. కానీ అన్నా సంఘం వాళ్లు జరిపే ప్రదర్శనలు, ఇచ్చే ప్రకటనల ప్రభావంతో ప్రజాభిప్రాయం అన్నావైపు మళ్లటం గమనించిన పోలీసులు రంగంలోకి దిగారు. పక్షి ప్రేమికులతోపాటు వారు వేటగాళ్లకోసం కాపుకాశారు. నెమ్మదిగా మెస్సినా ప్రాంతంలో పక్షివేట తగ్గింది. అన్నాఖ్యాతి ఇటలీలో ఇతరప్రాంతాలకు పాకింది.

"అమ్మా! కాలాబ్రియా నుంచి ఉత్తరం వచ్చింది. ఆ ప్రాంతంలో దాదాపుగా 15,000 మంది పక్షివేటగాళ్లున్నారు. వారి చర్యలను అరికట్టేందుకు స్థానికులు ఆహ్వానించారు" సంతోషంగా చెప్పింది అన్నా.

"జాగ్రత్తనే. మన ఊరు వేరు. పరాయి ఊరు వేరు" అంది అమ్మ భయంతో.

'కాలాబ్రియా'లో సైతం అన్నా ఇదే పద్ధతిని ఉపయోగించింది.

వీధివీధినా వాడవాడనా జీవహింసకు వ్యతిరేకంగా ప్రచారం చేసింది. వీధి నాటకాలు వేసింది. రేడియోల్లో, టీవీల్లో చర్చలు చేసింది. ఇంటింటికీ వెళ్లి పక్షులవేట మానమని బోధించింది.

© EMESCO BOOKS

"ప్రపంచంలో మనుషులు తిండిలేక ఛస్తున్నారు. యుద్ధాల్లో ఛస్తున్నారు. వాళ్లకన్నా నీకు పక్షుల ప్రాణాలే విలువైనవిగా కనిపిస్తున్నాయా?" అని ఒక రాజకీయ నాయకుడు టీ.వి. ప్రోగ్రాంలో అన్నాను నిలదీశాడు. దానికి అన్నా ఘాటైన సమాధానం ఇచ్చింది.

"మనుషులకు తెలివుంది. జ్ఞానం ఉంది. తమ హక్కుల గురించిన గ్రహింపు ఉంది. తన హక్కుకోసం పోరాడే శక్తి ఉంది. అయినా మౌనంగా ఇతరుల జులుం భరిస్తున్నాడంటే దానికి దోషం మనిషిలోనే ఉంది. కానీ పక్షులకు హక్కులు తెలుసా? వాటిని మనుషులు చంపుతారని తెలుసా? తమని తాము రక్షించుకోవటం తెలుసా? అందుకే వాటి రక్షణకోసం నేను పోరాడుతున్నాను. నేనేకాదు మీరూ పోరాడాలి" గర్జించింది.

* * *

అన్నా ఆరంభించిన పోరాటం అంతర్జాతీయ దేశాల దృష్టిని ఆకర్షించింది. జర్మనీ, బ్రిటన్, స్వీడన్, అమెరికావంటి దేశాలలో అన్నా పర్యటించింది. తన పోరాట విధానాలను వారికి వివరించింది. అన్నా ఖ్యాతి పెరుగుతున్నకొద్దీ ఆమెకు బెదిరింపులు రావటం ఎక్కువయ్యాయి.

'నీ వల్ల మా జీవనభృతి పోయింది. నీ ప్రాణాలు తీసేస్తాం' అని ఫోన్లో, ఉత్తరాల ద్వారా బెదిరింపులు రాసాగాయి. 'నోరులేని జీవాలను దొంగతనంగా చంపే పిరికివాళ్ల బెదిరింపులకు నేను లొంగను' అని నిర్భయంగా ప్రకటించింది అన్నా.

ఆ రోజు ఆమె 'సిసిలీ'లో పక్షుల వేటకు వ్యతిరేక ప్రదర్శనను నిర్వహించేందుకు వెళ్లాల్సి ఉంది. అంతలో ఆమె ప్రయాణించాల్సిన కారు అలా బాంబు దాడిలో పేలిపోయింది.

* * *

కారు పేలిపోయినా అన్నా బెదరలేదు. ఆ రోజు ప్రదర్శనలో పాల్గొంది.

"మనిషైనా, పక్షి అయినా, చీమయినా అన్ని జీవులలో కదిలేప్రాణం ఒకటే. అది విశ్వశక్తి. సమస్త చరాచర సృష్టి లయకు కారణమైనవాడి శక్తి విశ్వం అణువణువునా ప్రవహిస్తోంది. కాబట్టి ఏ ఒక్కప్రాణిని చంపేహక్కు మరొకప్రాణికి లేదు. సృష్టిలో ఉన్న సూత్రాల ఆధారంగా 'ఆహారం' గ్రహించటంవేరు. వినోదం కోసం జరిపే హింసవేరు. స్వార్థంకోసం చేసే హత్య వేరు. విచక్షణ ఉన్న మనిషి ఈ నిజం గ్రహించి, ఇతర జీవులతో సహజీవనం సాగించాలి. విశ్వప్రణాళికలో విచక్షణ, కల జీవిలా తన బాధ్యతను నిర్వహించాలి" అంది అన్నా.

అన్నా స్ఫూర్తితో ప్రపంచవ్యాప్తంగా అనేకులు జీవుల పరిరక్షణకు జీవితాలను అంకితం చేసేందుకు ముందుకువచ్చారు. 1998లో అన్నాకు, పర్యావరణ రక్షకులకు నోబెల్ బహుమతితో సమానమైన 'గోల్డ్‌మాన్ ఎన్విరాన్‌మెంటల్' బహుమతి లభించింది.



© EMESCO BOOKS

# కనిపించని కన్నీళ్లు చెప్పే కథ

**చిన్నతనంలో ఏర్పడిన మానసికవ్యాధికి కృంగి కృషించిపోకుండా, ఒక మానసికవేత్తగా మారిన వ్యక్తికథ.**

"**ప్రతి** వ్యక్తికీ ఏదో ఓ లోపం ఉంటుంది. అన్నీ సంపూర్ణంగా ఉన్నవారెవరూ ఉండరు. అయితే తన బలహీనతలను, లోపాలను గుర్తించి వాటిని అర్థంచేసుకుని, అధిగమించి, తనకు అనువుగా ఉపయోగించుకుని అభివృద్ధి సాధించటంలో వ్యక్తి వ్యక్తిత్వం ప్రస్ఫుటమవుతుంది."

గంభీర స్వరంతో పాఠం చెప్తున్నాడు డంకన్. విద్యార్థులు ఏకాగ్రతగా వింటున్నారు. గమనిస్తే వారి శరీరాలపై వారికి నియంత్రణ లేదనిపిస్తుంది.

ఒక పిల్లవాడి కళ్లు అదే పనిగా కొట్టుకుంటున్నాయి. ఇంకో పిల్లవాడి వేళ్లు అతడి ప్రమేయం లేకుండా వణుకుతున్నాయి. ఇంకో పిల్లవాడి తల వణికిపోతుంది. ఇలా అక్కడ ఉన్నవారి శరీరాంగాలు తమదంటూ ఓ ప్రత్యేక జీవితం ఉన్నట్టు కదులుతున్నాయి.

"మనల్ని మిగతా వాళ్లు విచిత్రంగా చూస్తారు" మాటలు పూర్తికాకముందే డంకన్ మూతి విచిత్రమైన మెలికలు తిరగసాగింది. వెంటనే డంకన్, నేలపై వంగాడు. తన బరువంతా చేతులపై ఉంచి కూచునే ప్రయత్నం చేశాడు.

క్లాసంతా నిశ్శబ్దంగా అతడిని గమనించసాగింది. విద్యార్థులు తమ శరీరాల్లో నియంత్రణ కదలికల సంగతి మరచిపోయారు.

కాస్సేపటికి లేచినిలబడ్డాడు డంకన్. చేతులకు అంటినమట్టి దులుపుకుంటూ, తననే చూస్తున్న విద్యార్థులను చూసి నవ్వాడు.

"మనలో అంతులేని శక్తి ఉంది. ఆ శక్తి కట్టలు తెగి ప్రవహిస్తోంది. అదుపులేని ఆ శక్తిమూలంగా మన శరీరంలో మన ప్రమేయం లేకుండానే విచిత్రమైన కదలికలు

© EMESCO BOOKS

కలుగుతున్నాయి. దానిని అదుపులోకి తెచ్చుకుని మనం చెప్పిన దిశలో అది ప్రవహించేట్టు చేస్తే మనల్ని నాశనం చేసే శక్తే, మన అభివృద్ధికి దోహదపడుతుంది.”

విస్ఫారిత నేత్రాలతో అతనివైపు చూస్తుండిపోయారు విద్యార్థులు.

* * *

ఆ రోజు డంకన్‌కు బాగా గుర్తుంది. అప్పుడతడికి ఏడేళ్ల వయస్సు. తండ్రితో కలసి ‘కార్‌షో’కు వెళ్లాడు.

డంకన్‌కు కార్లంటే ఇష్టం. రకరకాల కార్లను చూడగానే అవి ఏ కంపెనీ కార్లో, ఏ మోడల్ కార్లో వెంటనే చెప్పేస్తూండేవాడు. అతని ఆసక్తిని గమనించిన తండ్రి ‘కార్ షో’కు తీసుకువెళ్లాడు. ‘షో’ అయ్యాక తిరిగి వస్తూన్నప్పుడు డంకన్ తన ఉత్సాహాన్ని ఆపుకోలేకపోయాడు. కార్ల గురించి, పెద్దయ్యాక తాను వాటిని ఎలా నడుపుతాడో, ఉత్సాహంగా తండ్రికి వివరిస్తున్నాడు. ఆయన నవ్వుతూ కొడుకు మాటల్ని వింటున్నాడు.

ఇంతలో, డంకన్‌కు అర్జంటుగా లఘుశంక వస్తున్నట్టనిపించింది.

“డాడీ! కారు ఆపు” వేలు చూపించాడు.

ఓ పక్కకు కారు ఆపాడు అతడి తండ్రి.

ఎంత ప్రయత్నించినా మూత్రం రాలేదు.

“ఏమోయ్ నాతో ఆటలాడుతున్నావా?” మూడోసారి కూడా డంకన్ అలాగే చేయటంతో అడిగాడు అతడి తండ్రి.

డంకన్ కన్నీళ్ల పర్యంతం అయ్యాడు. “లేదు నాన్నా, నిజంగా వచ్చినట్టు అనిపిస్తోంది. తీరా వెళ్లేసరికి రావటంలేదు.”

తండ్రి నవ్వేసి ఊరుకున్నాడు.

కానీ డంకన్‌కు నవ్వురాలేదు.

“ఏమౌతోంది తనకు?” అనుకున్నాడు.

* * *

నెమ్మదిగా తనలో మార్పును గమనించసాగాడు డంకన్. ఉండుండి హఠాత్తుగా అతని ప్రమేయం లేకుండా వేళ్లు కదలిపోతాయి. కన్ను టపటప కొట్టుకుంటుంది. కాళ్లు కదలవు. కాలివేళ్లు వంకర్లు తిరిగిపోతుంటాయి.

ఇవి చాలవన్నట్టు, ప్రతిచిన్న వాసనా అతనికి ప్రాణాంతకంగా అనిపిస్తోంది. బట్టలలోని దారపు పోగులు చూస్తే ఒళ్లు జలదరిస్తుంది. అదిక ఎంతకీ ఆగదు. దీనికితోడు, ఒకోసారి

డంకన్‌మాటలు సైతం అతని సంబంధం లేకుండా బయటికి వచ్చేస్తాయి. ఏదో అసంబద్ధంగా మాట్లాడేస్తాడు. ఎంత వద్దనుకున్నా నోరు మూతపడదు. గొంతులోంచి విచిత్రమైన శబ్దాలు వాటంతట అవేవస్తాయి. పిల్లికూతలు, కుక్క అరుపులు, మూల్గులు వస్తాయి. ఎంత ఆపాలనుకున్నా ఆగకుండా, వస్తూనే ఉంటాయి. ఇలా, తానువేరు, తన శరీరం వేరు అనిపించసాగింది డంకన్‌కు. దాంతో డంకన్ బెదిరిపోయాడు.

'తనలో ఎక్కడో లోపం ఉంది? ఎందుకు తాను అందరిలా ఉండలేక పోతున్నాడు? అనుకున్నాడు డంకన్. దాంతో నెమ్మదిగా అందరికీ దూరంగా, ఒంటరిగా ఉండటం ఆరంభించాడు. తరగతిలో, తోటి విద్యార్థులతో సైతం సరిగ్గా కలవలేకపోయాడు. తన విచిత్ర కదలికలు చూసి వారు ఏడిపిస్తారన్నది ఒక భయమైతే, తన సంగతి అందరికీ తెలిస్తే, వెలివేస్తారన్నది మరో భయం. వీటికితోడు కూతలను కంట్రోల్ చేయలేడు. అయితే తాను పాఠాలు చదివేటప్పుడో, పుస్తకాలు ఏకాగ్రతతో చదివేటప్పుడు ఈ కదలికలు అంతగా లేకపోవటం గమనించాడు డంకన్. అందుకని పుస్తకాలతో ఎక్కువ సమయం గడిపేవాడు. దాంతో డంకన్‌పై టీచర్లకూ ఫిర్యాదులు ఉండేవి కావు. తల్లి, తండ్రి తమ పనుల్లో మునిగి ఉండేవారు. పిల్లవాడు నిశ్శబ్దంగా ఉన్నాడని సంతోషించేవారు.

ఒంటరిగా ఉన్న డంకన్, నిశ్శబ్దంగా ఉండేవాడు. కానీ శాంతంగా ఉండేవాడు కాదు. తన కదలికలను ఆపేందుకు గది అంతా పరుగెత్తేవాడు. తనలోంచి శక్తి బయటకు రావాలని ప్రయత్నిస్తున్నట్టు అనిపించేది. దాన్ని బయటకు పంపేందుకు కఠినమైన పనులు చేసేవాడు. కార్లని తుడిచేవాడు. ఇళ్లు ఊడ్చేవాడు. బట్టలు ఉతికేవాడు. సోఫాలు, కుర్చీలు షోకేసులు మళ్లీ మళ్లీ తుడుస్తుండేవాడు.

అయినా ఆగకుండా వణుకువస్తే, బాత్‌రూమ్‌లో దూరి తలుపు వేసుకునేవాడు. అటూ ఇటూ కదులుతున్న తన తలని, వణకుతున్న శరీర భాగాల్ని చూస్తూ ఏడ్చేవాడు.

అతనికో ఆలోచన వచ్చింది.

"ఇలా తన శరీరం కదలినప్పుడల్లా, తనని తాను హింసించుకుంటే..."

కానీ అందువల్ల నొప్పి కలగటం తప్ప ఫలితమేమీ లేదని గ్రహించి వదిలేశాడు.

అయితే, నిరంతరం ఒంటరిగా ఉండటం, ఏమీ తోచక ఏదో ఒకటి నములుతూ ఉండటంతో డంకన్ విపరీతంగా బరువు పెరిగాడు.

"బయటకు వెళ్లి అందరితో ఆడుకోవేం?" విసుక్కునే వాడు తండ్రి.

చివరికి, డంకన్ బరువు తగ్గించేందుకు ఓ థెరపిస్టు దగ్గరకు తీసుకువెళ్లాడు.

బరువు తగ్గాడు. కానీ డంకన్ శరీర బాధమాత్రం తగ్గలేదు.

* * *



© EMESCO BOOKS

ఏళ్లు గడుస్తున్నాయి. డంకన్‌కు యుక్తవయుసు వచ్చింది. వయసుకు తగ్గ కోరికలు కూడ కలగసాగాయి. అమ్మాయిలతో సన్నిహితంగా ఉండాలని ఉంది. ముఖ్యంగా, తనశక్తిని విడుదల చేసేందుకు డ్రమ్స్ వాయించటం ఆరంభించినప్పటి నుంచీ డంకన్‌లో కదలికలు తగ్గాయి. యువతులు పరిచయమవసాగారు. కానీ ఎక్కువసేపు వాళ్లతో ఉండాలంటే భయమే. ఎప్పుడు శరీరంలోని ఏ భాగం తన ఇష్టం వచ్చినట్టు కదులుతుందో తెలియదు కనుక! అయినా ధైర్యం చేసి ఓఅమ్మాయితో బయటకు వెళ్లాడు డంకన్. కాస్సేపు బాగానే గడిచింది. ఇంతలో హఠాత్తుగా మూతి వంకర్లు తిరగటం ఆరంభమైంది. దాని ఆపాలనుకునేలోగా, వేళ్లు కొంకర్లుపోసాగాయి. గొంతులోంచి విచిత్రమైన శబ్దాలు. ఇంతలో మూత్రం వస్తున్నట్టు అనిపించింది. అదరబాదరగా బాత్రూంవైపు పరుగెత్తాడు. కానీ బాత్రూం చేరేలోగా నియంత్రణ కోల్పోయాడు. నిస్సహాయంగా నిలబడ్డ డంకన్‌వైపు అసహ్యంగా చూశారు అందరూ.

* * *

డంకన్‌కు కొద్దికొద్దిగా తెలివివస్తోంది. కళ్లు తెరచిచూసాడు. ఎదురుగా అమ్మ, నాన్న కనిపించారు. వారి పక్కన డాక్టర్ ఉన్నాడు. డంకన్‌కు గుర్తుకు వచ్చింది. పార్టీలో అవమానం తరువాత, ఇంటికి వచ్చి కసిగా నిద్రమాత్రలు మింగాడు.

కానీ తనకు నిష్కృతి లేదు. కన్నీళ్లు కారసాగాయి. డాక్టర్ సానుభూతిగా డంకన్ తలపై చేయి వేశాడు.

“మాకు ఇన్నాళ్లూ చెప్పలేదేం?”

వెంటనే అడిగాడు డంకన్ తండ్రి.

పార్టీలో జరిగింది వాళ్లకు తెలిసింది. ఇన్నాళ్లూ డంకన్ ఒంటరిగా ఎందుకుంటున్నాడో, వాళ్లకు అర్థమయింది.

డాక్టర్ వాళ్లవైపు కోపంగా చూశాడు.

“ఒకటికాదు, రెండుకాదు, పన్నెండేళ్లు తన పరిస్థితిని అందరి ముందూ దాచగలిగాడు డంకన్. వేరేవాళ్లంటే ఫరవాలేదు. కానీ ఒకేఇంట్లో ఉంటున్న మీరూ గుర్తించలేకపోయారు. తానెందుకిలా ఉన్నాడో, అర్థంకాని డంకన్, ఎవరితో ఏం చెప్పుకుంటాడు? అతడిని గమనించి, గ్రహించవలసిన మీకు తీరికలేదు” కటువుగా అన్నాడు.

వాళ్లిద్దరూ తలలు వంచుకున్నారు.

* * *

“డంకన్‌లో కలిగే కదలికలు అతని దోషం కాదు. దీన్ని టోరెట్స్ సిండ్రోమ్ (Tourette's Syndorome) అంటారు. 1885లో ఫ్రెంచి న్యూరాలజిస్టు ‘జార్జెస్ గిల్లెస్ డిలా టోరెట్టె’ ఈ పరిస్థితిని మొదటిసారిగా ప్రపంచానికి తెలిపాడు. ఇది మెదడులోని నరాల బహీనతల వల్ల

© EMESCO BOOKS

వస్తుంది. అంటే మెదడు నరాల 'న్యూరోకెమికల్' లోపం వల్ల. కండరాలపై వ్యక్తికి నియంత్రణ ఉండదు. దాంతో అవితమంతట తాము కదులుతాయి. ఈ వ్యాధి మరోపేరు 'తిట్టు వ్యాధి' (స్వేరింగ్ డిసీజ్). ఎందుకంటే చాలామంది ఈ వ్యాధి ఉన్నవాళ్లు తమ ప్రమేయం లేకుండా తిట్టేస్తూ ఉంటారు. అరుస్తూ ఉంటారు. వాళ్ల గొంతుల్లోంచి రకరకాల కూతలు వస్తుంటాయి. ఇవి గొంతు సరిచేసుకునే శబ్దం నుంచి ఏవైనా కావచ్చు. అలాగే కళ్లు మాటి మాటికీ మూసి తెరుస్తూండటం, కనుగుడ్లు తిరగటం, తల, మెడ భుజాలు కదలిపోవటం, మూత్రం వస్తున్నట్టు ఉండటం ఇవన్నీ ఈ వ్యాధి లక్షణాలే. ఈ వ్యాధి పదేళ్లలోపే కనిపించటం ఆరంభమౌతుంది. యుక్తవయసులో విపరీతమౌతుంది. కానీ ఈ వ్యాధిని గుర్తించటం కష్టం" వివరించసాగాడు డాక్టర్.

డాక్టర్ మాటలు వింటూంటే, డంకన్ తల్లిదండ్రులకు ఇన్నాళ్లూ తాము చూసీచూడనట్టు వదిలేసినవన్నీ వ్యాధి లక్షణాలే అని అర్థమవసాగింది. డంకన్ కుర్చీలు తాకి పడిపోవటం, సినిమాహాల్లో పాప్‌కార్న్ ప్యాకెట్ పట్టుకోలేకపోవటం, అతడి గొంతులోంచి గురకలాంటి శబ్దాలు రావటం... తాము కళ్లున్న గుడ్డివాళ్లు. ఎవరితో చెప్పుకోలేక, ఏమౌతుందో అర్థంకాక డంకన్ ఎంత బాధపడ్డాడో! వాళ్ల హృదయాలు ద్రవించసాగాయి.

"ఈ వ్యాధితో బాధపడేవాళ్లు దాన్ని దాచాలని చూస్తారు. తాము అందరిలాగే మామూలుగా పనులు చేయగలమని చూపించాలని తహతహలాడతారు. అందుకే , ఒకే పనిని మాటిమాటికీ చేస్తుంటారు. దీన్ని 'అబ్సేసివ్ కంపల్సివ్ డిజార్డర్' అంటారు" అని చెప్పాడు డాక్టర్.

డంకన్ కార్లు, సోఫాలు, బల్లలు, అదేపనిగా తుడవటం వారికి గుర్తొచ్చింది.

"అంటే నాలో ఈ కదలికలు జరగటం నా తప్పు కాదా?" మెల్లిగా అడిగాడు డంకన్.

డంకన్‌ను దగ్గరకు తీసుకున్నాడు డాక్టర్.

"దీన్లో నీ తప్పు ఏముంది చెప్పు? ఈ ప్రపంచంలో ఏ విషయంలోనూ మన ప్రమేయంలేదు. ఇదంతా భగవదేచ్ఛ ప్రకారం జరుగుతోంది. ఈ వ్యాధి ఉన్నవారికి నేరభావన అధికంగా ఉంటుంది. దాన్ని తొలగించాలి. నీ తప్పేమీలేదు దీన్లో."

"మరి నాకే ఎందుకుందీ వ్యాధి? దేవుడికి నేనేం అన్యాయం చేశాను?" అరిచాడు డంకన్.

కాస్సేపు మౌనంగా ఉన్నాడు డాక్టర్. మెల్లిగా గొంతు విప్పాడు.

"సృష్టిలో కారణం లేనిది ఏదీలేదు. ప్రతిదానికి ఏదో ఓ కారణం ఉంటుంది. ఇది నీకే ఎందుకురావాలి? నేను డాక్టర్‌నెందుకయ్యాను? వాడు బిచ్చగాడిగా ఎందుకున్నాడు? అన్నదానికి మనం సమాధానం చెప్పలేం. కానీ నాకు తెలిసింది, నాకు అర్థమైంది, నేను నిజమని నమ్ముతున్నదీ ఒకటి చెప్తాను."



© EMESCO BOOKS

ఆత్రంగా ముందుకు వంగాడు డంకన్.

"ప్రపంచమంతా భగవంతుడి స్వరూపం. ఇందులో మనకు వచ్చే కష్టాలు భగవంతుడు మనకు పెట్టే పరీక్షలు. నీకీ వ్యాధి ఎందుకిచ్చాడంటే, భగవంతుడికి నువ్వంటే, అంత విశ్వాసం, ఇష్టం ఉన్నాయన్న మాట...

... నువ్వీ కష్టాన్ని అధిగమించి, పదిమందికి ఆదర్శంగా నిలుస్తావన్న నమ్మకం ఆ దేవుడికి ఉందన్నమాట... అదీగాక, దేవుడు నాకీ కష్టం ఇచ్చాడని ఏడుస్తూ, దేవుడిని ద్వేషించే బదులు, నీకీ పరీక్ష పెట్టి నీపై ప్రేమను ప్రకటించినందుకు భగవంతుడిని మరింతగా ప్రేమిస్తూ, ఆ ప్రేమను భగవంతుడు సృజించిన ప్రపంచంలోని ఇతరులకు కూడా పంచిపెడతావన్న నమ్మకం, నీపై భగవంతుడికి ఉందన్నమాట. ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకుంటావు కదూ?" అన్నాడు డాక్టర్ మృదువుగా.

డంకన్ మాట్లాడలేదు. ఆలోచిస్తూ ఉండిపోయాడు.

* * *

ఆ రోజు నుంచీ డంకన్ మారిపోయాడు.

తన పరిస్థితి చూసి సిగ్గుపడటం మానేశాడు.

"భగవంతుడు నాకు పెట్టిన పరీక్ష ఇది. ఇందులో విజయం సాధించితీరతాను" అని నిశ్చయించుకున్నాడు. తనచుట్టూ ఉన్న ప్రపంచాన్ని కళ్లెత్తి, ధైర్యంగా గమనించటం ఆరంభించాడు.

కొందరికి కళ్లు లేవు. కొందరికి కాళ్లులేవు. కొందరికి అన్నీ ఉన్నా న్యూనతాభావం ఉంది. ఇంకొందరికి ఏమీ లేకున్నా అహంకారం ఉంది. దాంతో తన పరిస్థితికి సిగ్గుపడి, దాచటం మానేశాడు. ధైర్యంగా మిత్రులకు తన పరిస్థితి వివరించాడు. వారిముందే తన కదలికలను ప్రదర్శించాడు. మిత్రులు అతడిని ఆదరించారు, అర్థం చేసుకున్నారు. తమలో ఒకడిగా చూసుకున్నారు.

తల్లిదండ్రులుసైతం డంకన్‌కు అండగా నిలిచారు. అప్పుడు అతనికి మరో సత్యం అర్థమైంది.

ప్రతి వ్యక్తీ లేని భయాలను ముందే ఊహించుకుని ముదుచుకుపోతాడు. దాంతో ప్రపంచం అతడిని మరింతగా భయపెడుతుంది. అలాకాక భయాన్నే భయపెడితే, ప్రపంచం అతడివెంట నడుస్తుంది."

* * *



© EMESCO BOOKS

డంకన్ కాలేజీ నాటకాల్లో పాల్గొన్నాడు. ఆటలు ఆడాడు. డ్రమ్స్ వాయించాడు. డిగ్రీ పూర్తవగానే 'మానసిక శాస్త్రం' వైపు మొగ్గు చూపాడు.

'నా పరిస్థితి గురించి అవగాహన లేని కాలంలో నేనెంతగా కుమిలిపోయానో నాకు తెలుసు. ఎవరికీ చెప్పుకోలేక, ఎంతగా మధనపడ్డానో నాకు తెలుసు. కారణం, ఎవరితో చెప్పుకోవాలో నాకు తెలియదు. హేళన చేయకుండా, సానుభూతిగా నన్ను ఎవరు అర్థం చేసుకుంటారో నాకు తెలియదు. అందుకే, నాలా కుమిలే వారికి నేనున్నాన'ని అండగా నిలబడాలనుకుంటున్నాను. వారి మానసిక వేదనను తొలగించి వారికి సాంత్వన నివ్వాలనుకుంటున్నాను. భగవంతుడికి మాపై ఎంత విశ్వాసం ఉందో వివరించి, భగవంతుడిని, ఈ ప్రపంచాన్ని మరింతగా ప్రేమించటం నేర్పాలనుకుంటున్నాను." అన్నాడు తన నిర్ణయానికి దారితీసిన కారణాలు వివరిస్తూ.

29 ఏళ్ల వయస్సులో డంకన్ సైకాలజీ చదువు పూర్తిచేశాడు.

టొరెంటోలోని ఓ పాఠశాలలో ఉద్యోగం ఆరంభించాడు. మానసికంగా, శారీరకంగా లోపాలున్న విద్యార్థులను చేరదీసి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పాదుకొల్పటం కోసం ప్రత్యేకంగా ఏర్పడిన పాఠశాల అది.

అయితే డంకన్ అంతటితో సంతృప్తి పడలేదు. ప్రపంచానికి తన 'ప్రేమ విశ్వాస' సందేశాన్ని పంచేందుకు దేశ విదేశాలు పర్యటిస్తాడు. తనలా, శారీరక వికలాంగులకు విశ్వాసాన్ని ఇస్తాడు. ప్రేమ, దయా దాక్షిణ్యాలను పంచిపెడతాడు.

ఇందుకుగాను డంకన్ www. lifesatwitch.com అనే వెబ్‌సైట్ నడుపుతున్నాడు. ప్రపంచం నలుమూలల నుంచి ఆ సైట్‌కి టోరెట్స్ సిండ్రోమ్‌కు సంబంధించిన ప్రశ్నలు వస్తుంటాయి.

డంకన్ వాటికి సమాధానాలిస్తుంటాడు.

"భగవంతుడి ప్రపంచంలో మనం ఏ విషయానికీ సిగ్గు పడాల్సిన అవసరంలేదు. ఒకవేళ, ఏ విషయానికైనా సిగ్గుపడాలంటే, అది ఆయన ఇచ్చిన శక్తిని అనవసరంగా ద్వేషం, అసూయ, క్రోధం వంటి అనవసర భావాలతో వృథా చేస్తున్నందుకే" అంటాడు డంకన్.

© EMESCO BOOKS

# వెలిగిన 'జీవనజ్యోతి'

**ఎప్పుడు మరణిస్తుందో తెలియదు, పైగా చిన్నపనికే అలిసిపోతుంది. వందలకు పైగా నృత్య ప్రదర్శనలిచ్చి, తనలాంటి రోగులను ఆదుకున్న యువతికథ**

**ము**ంబాయి, తారాబాయి ఆడిటోరియం.

"థయ్... థోం.... థణకిట్ట ధిన థోం..."

లయబద్ధంగా వినిపిస్తున్న తాళానికి అనుగుణంగా మోగుతున్నాయి. అభినయం అందంగా సాగుతోంది. గానంలోని భావం నాట్యకత్తె అణువణువూ ఇమిడి ప్రదర్శితమౌతోంది. ప్రేక్షకులు సర్వం మరచి ఆ రసానంద ప్రవాహంలో ఓలలాడుతూ పరవశించిపోతున్నారు.

లయ వేగం పెరిగింది. నాట్యం వేగవంతమైనది. రసానంద ప్రవాహవేగం తీవ్రతరమైంది. ప్రేక్షకులు ఆమె నాట్యం చూసి మైమరచిపోయారు. లయబద్ధంగా, క్రమం తప్పకుండా నికేత అడుగులు పడుతున్నాయి. అంతవేగంగా నృత్యం చేస్తున్నా ఆమె భావప్రదర్శన అత్యుత్తమస్థాయిలో ఉంది. అయితే, తెరవెనుక నుంచి ఆత్రుతగా నికేతను పరిశీలనగా చూస్తున్న డాక్టర్ 'రాజా పుర్కర్' వదనంలో మాత్రం ఆందోళన స్పష్టంగా కనిపిస్తోంది. అతనికి ఉద్విగ్నతతో చెమటలు పడుతున్నాయి. ఎందుకంటే అందమైన మేకప్ కప్పిన ఆమె వదనంలో అలసటకనిపిస్తోంది. ఆమె ముఖం నీలిరంగులోకి మారుతోంది. ఆమె శరీరంనుంచి చెమటలు ధారాపాతంగా కారుతున్నాయి.

'ఇంకాస్సేపు నృత్యం ఇలా కొనసాగితే ఆమె స్టేజిపై పడిపోవటం ఖాయం' అన్న ఆలోచనకు వచ్చాడు రాజా.

ఇంతలో సంగీతం తారాస్థాయికి చేరుకుంది. సంగీతానికి అనుగుణంగా గిరగిర తిరగసాగింది నికేత. ఆమెతోపాటు ప్రేక్షకులూ తిరగసాగారు. ఉద్వేగంతో చప్పట్లు చరిచారు.

© EMESCO BOOKS

సంగీతం ఆగింది. నికేత ఆగి వినమ్రంగా ప్రేక్షకులకు నమస్కారం చేసింది. తెరపడింది. ఆమె డాక్టర్ చేతుల్లో ఒరిగిపోయింది.

ఎవరో చల్లని నీళ్లు తెచ్చిచ్చారు.

"వద్దు" కఠినంగా వినిపించింది డాక్టర్ స్వరం.

తడిసిన కర్చీఫ్‌తో ఆమె పెదవులమీద రాయసాగాడు డాక్టర్. ఎందుకంటే నికేతలాంటి వారు ఎక్కువ నీరు తాగకూడదు. చికిత్సలేని 'కిడ్నీ ఫెయిల్యూర్' వ్యాధితో కూడిన బాధ ఆమెది.

* * *

1986. పదిహేనేళ్ల నికేత, తన బంధువులు జతిన్, కుసుమ్‌దలాల్‌లతో సెలవులు గడిపేందుకు ముంబాయి వచ్చింది. ముంబాయిలో టూరిస్టు ప్రదేశాలన్నీ తిరిగారు. ముఖ్యంగా 'ఎలిఫెంటా' గుహలను చూస్తూ మైమరచిపోయింది నికేత.

"అస్సలు వదలబుద్ధి కావటంలేదీ ప్రదేశాన్నీ" పలుమార్లు ఆంటీ కుసుమ్‌తో అంది. బోటులో తిరుగు ప్రయాణం చేస్తుండగా అలసటగా పడుకుని నీళ్లకేసి చూస్తోంది నికేత్.

"పాపం బాగా అలసిపోయినట్టుంది" అన్నాడు అంకుల్ నికేతను చూస్తూ. నవ్వి, ఏదో అనబోయిన కుసుమ్ దృష్టి పచ్చగా ఉన్న నికేత, కాళ్లు, చేతులపై హఠాత్తుగా పడింది.

"పసుపు పూసుకున్నావా?" అడిగింది.

అసంబద్ధమైన ప్రశ్నకు నీరసంగా నవ్వింది నికేత.

"లేదు పొద్దుటి నుంచి కలసి తిరుగుతున్నాంగా" అంది.

"మరి చేతులు, కాళ్లు పచ్చగా ఉన్నాయేంటీ?" అడిగి, నికేత నుదురు ముట్టుకుంది కుసుమ్. వెచ్చగా తగిలింది.

"జ్వరం ఉన్నట్టుంది. ఓసారి డాక్టర్ దగ్గరకు తీసుకువెళ్దాం" కంగారుగా అంది కుసుమ్.

"పొద్దుటి నుంచీ తిరిగాం కదా! అలసిపోయి ఉంటుంది" తేలికగా అన్నాడు జతిన్.

"కాదు పచ్చకామెర్లని అనుమానంగా ఉంది. డాక్టర్‌కి చూపిస్తే మంచిది" అంది కుసుమ్.

ఆ సమయంలో ముంబాయిలో పచ్చకామెర్ల వ్యాధి విపరీతంగా ఉంది.

* * *

"నికేతకి పచ్చకామెర్ల వ్యాధిలేదు. కానీ రక్తంలో హిమోగ్లోబిన్ చాలా తక్కువగా ఉంది. అందుకే నికేత త్వరత్వరగా అలసిపోతుంది. ఇంకొన్ని పరీక్షలు చేస్తే కానీ అసలు కారణం తెలియదు" ఆలోచనగా అన్నాడు డాక్టర్ అలసటగా కూచున్న నికేతను చూస్తూ. మరికొన్ని పరీక్షలు జరిగాయి.



© EMESCO BOOKS

"నికేత రెండు కిడ్నీలు బాగా దెబ్బతిన్నాయి" నిర్దాక్షిణ్యంగా చెప్పాడు డాక్టర్.

నిశ్చేష్టులై నిలిచిపోయారు కుసుమ్, జతిన్‌లు. తల వంచుకుని కూచుంది నికేత.

"కిడ్నీలు ఎందుకు పనిచేయటం మానేస్తాయో తెలియదు. వ్యాధి ఆరంభ దశలో కనుక్కుని చికిత్స చేసేందుకు, అసలు వ్యాధిని సరిగ్గా గుర్తించే వీలేలేదు. హఠాత్తుగా తెలుస్తుంది వ్యాధి ఉందని. మూత్రపిండాలు పనిచేయకపోవటంతో విసర్జనకు గురవ్వాల్సిన మలినాలు రక్తంలో చేరుతాయి. శరీరమంతా ప్రవహిస్తుంది దాంతో శరీరానికి ఉన్న రోగనిరోధక శక్తి తగ్గిపోతుంది. ప్రతి చిన్న విషయం రోగానికి దారితీస్తుంది. శరీరానికి శక్తి తగ్గిపోయి త్వరగా అలిసిపోతుంది. ఎటువంటి హెచ్చరిక లేకుండా మనిషి కోమాలోకి వెళ్లిపోయే అవకాశమూ ఉంది" నిర్మొహమాటంగా వివరించాడు డాక్టర్.

వింటున్న ఆమె బంధవులు కుప్పకూలిపోయారు.

"దేవుడా! ఇంత చిన్న వయసులో ఈ వ్యాధి ఎందుకు రావాలి?" ఆక్రోశించాయి వారి హృదయాలు.

నికేత కళ్లనుండి నీళ్లు కారసాగాయి.

"మూత్రపిండాల వ్యాధికి మందులేదు. వ్యాధి తీవ్రతను బట్టిరోజు విడిచి రోజుకానీ, వారానికి ఒకటి, రెండుసార్లు కానీ రక్తశుద్ధి చేయాలి. దాన్ని 'డయాలిసిస్' అంటారు. అంటే ఏ పని అయితే ప్రాకృతికంగా మూత్రపిండాలు చేయాలో వాటిపని అవి చేయనప్పుడు కృత్రిమంగా ఆ పనిని మనం చేయాలి. దానిని యంత్రం ద్వారా వైద్యులు జరిపిస్తారన్నమాట. శరీరంలోని రక్తాన్ని వెలికి తీసి శుభ్రపరచి మళ్లీ శరీరంలోకి పంపుతారు.

డాక్టర్ చెప్తూ ఉంటే ఆమె తల్లిదండ్రులు వణికారు.

నికేత నిర్భావంగా కూచుండిపోయింది.

"దీనికి మందేమిటంటే, ఆరోగ్యవంతమైన మూత్రపిండం ఎవరైనా దానమిస్తే, దాన్ని నికేత శరీరంలో అమర్చటం. అది కుదరకపోతే 'డయాలిసిస్' తప్ప నికేతను సజీవంగా ఉంచేందుకు వేరే మార్గం లేదు" చెప్పాడు డాక్టర్.

"డాక్టర్! నేను మూత్రపిండం ఇస్తాను" వెంటనే చెప్పింది నికేత తల్లి రేణుక. డాక్టర్ 'అలాగే' అన్నట్టుగా తలాడించాడు.

* * *

నికేత శరీరానికి రేణుక మూత్రపిండం సరిపోతుందని పరీక్షలు చేసి తేల్చుకున్నాడు డాక్టర్. అయితే ఆరంభంలో శరీరం ప్రదర్శించే వ్యతిరేకతను అధిగమించేందుకు ఆమెకు

© EMESCO BOOKS

స్టెరాయిడ్లు ఇవ్వవలసి వచ్చింది. దాంతో నికేత విపరీతంగా బరువు పెరిగిపోయింది. ఆమె ముఖం ఉబ్బింది. ముఖమంతా మొటిమలు మొలిచాయి. గడ్డం పెరిగింది. మీసాలు వచ్చాయి. ఐతే మూత్రపిండాల మార్పిడి విజయవంతమైంది. కానీ నికేత మాత్రం గుర్తు పట్టలేని రీతిగా మారిపోయింది.

ఆమెను చూసిన వారెవరూ, 'నికేత 20 ఏళ్ల యువతి' అనుకోరు. నికేత తనూ మానసికంగా కృంగిపోయింది. తనకు తెలియకుండానే ఆమె మనుషులకు దూరంగా పారిపోసాగింది. తనలో తానే కుమిలిపోసాగింది. సాధారణంగా విధి బలహీనులనే దెబ్బకొడుతుందంటారు. అలా ఒకసారి తగిలిన దెబ్బకు కుంగిపోయేవారిని దెబ్బమీద దెబ్బ కొడుతూ ఆనందిస్తుందంటారు.

పనిచేసే ఒక మూత్రపిండంతో మళ్లీమామూలు జీవితంలో పడే ప్రయత్నాలు చేస్తున్న నికేతపై మరో దెబ్బపడింది. వాళ్ళ అమ్మదానం చేసిన మూత్రపిండం పని చేయటం మానేసింది.

ఆమెకు వారానికి మూడుమార్లు 'డయాలిసిస్' అవసరమని డాక్టర్లు తీర్మానించారు.

* * *

"ఏమిటి వారానికి మూడుసార్లు డయాలిసిస్ చేయించుకోవటం, ఆపై ఇంటికెళ్లి తీరిగ్గా ఏడుస్తూ కూచోవటం తప్ప వేరే పనేమీ లేదా నీకు?" కోపంగా అడిగాడు డాక్టర్ రాజాపుర్కర్.

ఆయన 'నడియాడ్'లోని ముల్జిభాయ్ పటేల్ యురోలాజికల్ హాస్పిటల్ డైరెక్టర్. నికేత కేసును క్షుణ్ణంగా పరిశీలించాడు. కానీ రోజు రోజుకూ డిప్రెషన్‌లోకి దిగజారుతూ వ్యర్థమైపోతున్న నికేతను చూస్తుంటే అతడికి ఆవేశం ఆగటం లేదు.

"నీలా చదువుకున్న యువతి జీవితాన్నిలా వ్యర్థం చేయటం నేరం. నీకేమైంది? మూత్రపిండాలు పని చేయటం లేదు. అంతేకదా? అవి చేసే పనిని కృత్రిమంగా చేయిస్తున్నాం కదా! మరి ఇంకేంటి నీ సమస్య? నీవున్న దుర్భరస్థితిలో ఉన్నవారెందరో ఉన్నారు. తెలుసా? నీకు కనీసం డయాలిసిస్ చేయించుకునే శక్తి ఉంది. డబ్బుంది. అది లేక ఎంతోమంది తాము ప్రేమించిన వారికి చికిత్స చేయించలేక విలపిస్తున్నారు తెలుసా? రోజు రోజుకి ఒక్కో అడుగు తాము ప్రాణప్రదంగా భావించే వ్యక్తులు మృత్యువువైపు ప్రయాణం చేస్తూంటే నిస్సహాయంగా చూస్తూ ఏడుస్తున్నారు. నీకు ప్రేమించే తల్లిదండ్రులున్నారు. వాళ్లు నీకు చికిత్స చేయిస్తున్నారు. ఇప్పటికైనా చెప్పు – అసలు నీ సమస్యేంటి? ఇంట్లో ఊరికే ఏడుస్తూండే బదులు, వేరే పనిలేకపోతే హాస్పిటల్‌కి రా. ఇక్కడ పనిచేసే వారి అవసరం చాలా ఉంది. లేదూ, ఇంకేదైనా చేసి నీ జీవితాన్ని సార్థకం చేసుకో" అన్నాడు డాక్టర్ ఆవేశంగా.

"మీకేం, మీరు డాక్టర్లు. ఏమైనా చెపుతారు. అనుభవిస్తే తెలుస్తుంది" కన్నీళ్లు కారుతుండగా అరిచింది నికేత.



© EMESCO BOOKS

"అడిగావు కాబట్టి చెప్తున్న . 29 ఏళ్ల వయసులో నాకు గుండెపోటు వచ్చింది. అప్పటి నుంచి నాకు బోలెడన్నిసార్లు గుండె ఆపరేషన్లు అయ్యాయి. మా ఇంట్లో అందరూ గుండెపోటుతోనే మరణించారు. నేనూ అలాగే మరణిస్తాను. అలాగని ఏడుస్తూ కూచున్నానా?" అడిగాడు డాక్టర్.

* * *

డాక్టర్ మాటలు నికేతలో ఆలోచనలు రేకెత్తించాయి.

'అవును ఈ వ్యాధితో జీవితాంతం గడపాలి. అలాగని, ఎప్పుడో చావు వస్తుందని ఇప్పటినుంచే బతకటం మానేయటం మూర్ఖత్వం. ప్రాణం ఉన్నంతకాలం ఏదో పని చేస్తుండాలి. పైగా, తన జీవిత కాలం తక్కువని తెలిసినప్పుడు ఉన్న కాలాన్ని అపురూపంగా భావించాలి. సక్రమంగా ఉపయోగించాలి' – ఆలోచిస్తున్న నికేతకు సమాధనం దొరికింది. 'అవును, తాను ఆపేసిన నృత్యం మళ్లీ నేర్చుకోవాలి'.

వెంటనే ఆమె గురువు బిజోయ్ శివరామ్‌ను సంప్రదించింది.

ఆమె కేసు విన్న శివరామ్ డాక్టర్ రాజాపుర్కర్‌ను కలిశాడు.

"మూత్రపిండాలు పనిచేయకపోవటం, వారానికి మూడుమార్లు డయాలిసిస్‌ల వల్ల మనిషి చాలా బలహీనమైపోతాడు. ఎక్కువ శ్రమను తట్టుకోలేడు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా రోగాలు దాడిచేస్తాయి. ఎముకలు బలహీనమైపోతాయి. కానీ పట్టుదల, ఇచ్ఛాశక్తి ఉంటే మనిషి సాధించలేనిదేమీ లేదు. సరైన జాగ్రత్తలు తీసుకుంటే ఏదీ అసంభవం కాదు" చెప్పాడు డాక్టర్.

దాంతో శివరాం వద్ద నృత్యం నేర్చుకోవటం ఆరంభించింది నికేత. నృత్యంలో ప్రావీణ్యం సంపాదించిన తరువాత తన మనసులోని కోరికను వెల్లడించింది.

"మూత్రపిండాల వ్యాధి, వ్యక్తి ఆర్థిక స్థోమతను దృష్టిలో ఉంచుకుని రాదు. ఎవరికైనా వస్తుంది. ధనవంతుడు చికిత్స పొందుతాడు. పేదవాడు చికిత్స చేయించుకోలేక మరణిస్తాడు. కానీ ధనవంతుడికైనా, పేదవాడికైనా ప్రాణం విలువ అమూల్యమైంది. అందుకే నేను నేర్చుకున్న నృత్యకళని పేదవారికి అంకితం చేయదలచుకున్నాను."

నికేత మాటలను నిర్భావంగా వింటున్నాడు శివరాం. ఆమెవంక ఆశ్చర్యంగా చూశాడు డాక్టర్.

"అవును డాక్టర్. నేను నృత్య ప్రదర్శనలివ్వదలచుకున్నాను. అందువల్ల వచ్చిన డబ్బుతో పేదప్రజలకు డయాలిసిస్ చికిత్స చేయిస్తాను. నాకు వీలయినంత వరకూ – మూత్రపిండాల రోగి ఒక్కరు కూడా డబ్బులేమితో డయాలిసిస్ చేయించుకోలేక బాధపడనివ్వను" నిశ్చయంగా చెప్పింది ఆమె.

చిరునవ్వు నవ్వాడు డాక్టర్.

* * *



© EMESCO BOOKS

నికేత నిశ్చయానికి అనూహ్యమైన రీతిలో స్పందన లభించింది. గుజరాత్, చెన్నయ్ వంటి రాష్ట్రాలలో నికేత ప్రదర్శనలిచ్చే ఏర్పాట్లు చూసేందుకు ప్రైవేట్ కంపెనీలు స్వచ్ఛందంగా ముందుకువచ్చాయి. ఆమె మిత్రులు, పరిచయస్తులు, ఆమె నిశ్చయానికి ముగ్ధులై స్వచ్ఛందంగా విరాళాలు అందించారు.

ఆమె మొదటి నృత్య ప్రదర్శనవల్ల 1.2 లక్షల రూపాయలు వసూలయ్యాయి. వాటితో ఆమె తన ఆశయాన్ని అమలులో పెట్టింది.

1999 నుంచి 2005 వరకూ నృత్య ప్రదర్శనల ద్వారా 31 లక్షల రూపాయలను సేకరించింది నికేత. ఈ డబ్బుతో ఇంతవరకూ 65 మంది రోగులకు చికిత్స లభిస్తోంది. ఇంకో 31 మందికి చికిత్సలో సగం డబ్బు హాస్పిటల్‌కు అందుతోంది.

2003లో నికేత మరో పథకం ఆరంభించింది.

ఆ పథకంలో మూత్రపిండాల వ్యాధితో బాధపడే బాల, బాలికలకు ఉచిత చికిత్స అందుతుంది. ఇలా 17 మంది బాలబాలికలు చికిత్స పొందుతున్నారు.

"దెబ్బతిన్న వాడికి గాయం నొప్పి తెలుస్తుంది. నాకు దెబ్బ తగిలిందని ఏడుస్తూ కూచునేకన్నా దెబ్బ తగిలిన ఇతరుల గాయాలకు మందువేసి సాంత్వన నివ్వటంలోనే జీవితానికి అర్థం వస్తుంది. నేను అదే చేస్తున్నాను" అంటుంది నికేత.

ఆమె జీవితం ఎందరికో స్ఫూర్తిదాయకం!

© EMESCO BOOKS

# అనుభవం నేర్పిన పాఠం

**ప్రమాదానికి గురైన భర్త మరణం క్రుంగదీయకుండ, క్షతగాత్రులందరికీ అండగా నిలబడిన ఓ స్త్రీమూర్తి కథ.**

© EMESCO BOOKS

"**మ**నిషిని ఆశ నడిపిస్తుంది. కానీ అప్పుడప్పుడు ఆశలు నిరాశలవుతాయి. అంత మాత్రాన మనిషి కుంగిపోకూడదు. నిరాశ చీకట్లలోంచి ఆశల వెలుగుల వైపు ప్రయాణించాలి. అదే జీవితం"

స్టీఫెన్ మాటలు కిమ్ చెవుల్లో మార్మోగుతున్నాయి.

అందుకే ఆమె, తనను కమ్ముకుంటున్న నిరాశ భావనలను తరిమివేసే ప్రయత్నాలు చేస్తోంది.

'అంతా మంచే జరుగుతుంద'ని తనని తాను నమ్మించుకోవాలని ప్రయత్నిస్తోంది.

కీమ్, ఆమె భర్త స్టీఫెన్, వారిద్దరి పిల్లలు. అయిదేళ్ల అలెగ్జాండర్, 18 నెలల ఎలెన్‌లతో ఫ్రాన్స్‌లోని దక్షిణ బ్రిటనీ తీరం వద్ద సెలవులు గడిపేందుకు వెళ్లారు.

తీరంలో టెంటు వేసుకున్నారు. హాయిగా ఆటలు ఆడుకున్నారు. అందరూ కలసి పాడుకున్నారు. సాయంత్రం సూర్యాస్తమయాన్ని కళ్లు విప్పార్చుకుని చూశారు.

చీకట్లో అలలపై తేలియాడే తెల్లని నురుగును చూస్తూ కూర్చున్నారు. ఆపై నిద్రపోయారు. కానీ అర్ధరాత్రి హఠాత్తుగా మెలకువ వచ్చింది కిమ్‌కు.

కళ్లు తెరచి చూసేసరికి, రాత్రంతా నారింజరంగులో ధగధగలాడుతోంది.

"పిల్లలు పడుకున్న టెంటుపైన అగ్ని జ్వాలలు ప్రళయ తాండవం చేస్తూ రాత్రిని తమ వెలుగులతో మండిస్తున్నాయి.

కిమ్ కేకలకు స్టీఫెన్ ఉలిక్కిపడి లేచాడు.

ముందు వెనుకలు చూడకుండా నిప్పుల్లోకి దూకాడు.

ఎలెన్‌ను రక్షించి తెచ్చేసరికి అతడి ఒళ్ళు సగం కాలుతోంది.

ఎలెన్ మెడకూ, ముఖానికీ మంటలంటాయి. బాధతో అరుస్తున్న ఎలెన్‌ను ఇసుకలో పొర్లిస్తూ మంటలార్పసాగింది కిమ్.

ఇంతలో మళ్లీ నిప్పుల్లోకి దూకాడు స్టీఫెన్. అలెగ్జాండర్‌ను రక్షించాలని అతడి ప్రయత్నం. కానీ అప్పటికే అలెగ్జాండర్‌ను నిప్పులు చుట్టుముట్టాయి.

స్టీఫెన్ ఎంత ప్రయత్నించినా అలెగ్జాండర్ దరిదాపులకు చేరలేకపోయాడు. అప్పటికే స్టీఫెన్ శరీరం మొత్తం కాలిపోయింది.

సమయానికి స్థానికులు వారిని ఆదుకున్నారు. ఆస్పత్రికి తీసుకువెళ్లారు.

ఎలెన్‌కు స్థానిక ఆస్పత్రిలో చికిత్స జరిగింది. కానీ స్టీఫెన్ పరిస్థితి ప్రమాదకరంగా ఉండటంతో, అతడిని విమానంలో పారిస్ హాస్పిటల్‌కు తరలించారు.

డాక్టర్లు వెంటనే అతడికి చికిత్స చేయటం ఆరంభించారు.

అణగారిపోతున్న ఆశాజ్యోతిని వెలిగించే ప్రయత్నాలు చేస్తూ. డాక్టర్ల రిపోర్టుకోసం ఎదురుచూస్తోంది కిమ్.

"స్టీఫెన్‌కి ఏమీ కాదు" అంటూ తనకి తాను ధైర్యం చెప్పుకుంటున్న కిమ్, డాక్టర్ రావటంతో దిగ్గున లేచి నిలబడింది.

"ఎలా ఉంది డాక్టర్?" ఆత్రంగా అడిగింది.

"స్టీఫెన్ బతకటం కష్టం. 90 శాతం శరీరంలోతుగా కాలింది. శరీరంలోని గాయాల నుంచి ద్రవాలన్నీ వెళ్లిపోతున్నాయి. దాంతో రక్తపోటు నిలవటం కష్టంగా ఉంది. గుండెపై ఒత్తిడి పెరుగుతోంది. అతడిని బతికించాలంటే వెంటనే అతని శరీరాన్ని చర్మంతో కప్పాలి. సాధారణంగా, శరీరంలోని ఇతర భాగం నుంచి చర్మం తీసి కాలిన భాగంలో కప్పుతాం. కానీ స్టీఫెన్ శరీరంలో కాలని భాగం అంటూ లేదు. అతడి చర్మాన్ని 'లాబ్'లో పెంచాలంటే (కల్చర్ చేయాలి) సమయం మించిపోతుంది. కాబట్టి వేరేవారి చర్మంతో అతడి శరీరాన్ని కప్పాలి. కానీ ఇక్కడ చర్మాన్ని దాచే 'స్కిన్ బ్యాంకులు' లేవు. కాబట్టి బంధువులు, స్నేహితులు ఎవరైనా తమ చర్మాని దానం చేయాలి. అలా కనీసం పది, పదిహేను మందయినా ముందుకు వస్తే, స్టీఫెన్‌కు సరిపడ చర్మాన్ని సేకరించే వీలుంటుంది" గబగబా, సూటిగా చెప్పాడు డాక్టర్.

వింటున్న కిమ్ ఆశలు అడుగంటాయి.



© EMESCO BOOKS

'ఎవరిస్తారు చర్మాన్ని? అదీ ఒకరిద్దరు కాదు, పది పదిహేను మంది ముందుకు వస్తేకాని పనికాదు'...

తొడదగ్గర నుంచి చర్మాన్ని తీస్తారు. తరువాత కొన్ని వారాలపాటు భయంకరమైన నొప్పి ఉంటుంది. కొద్దికాలం నడవటం కష్టమౌతుంది. జీవితాంతం శరీరంపై ఆ మచ్చ అలాగే ఉండిపోతుంది.

ఇటువంటి కోరిక స్వంతవారిని సైతం కోరటం అనుచితం అవుతుంది.

కిమ్ తల పట్టుకుని కూర్చుంది.

డాక్టర్ సానుభూతిగా చూసి వెళ్లిపోయాడు.

అంతలో కిమ్‌కు స్టీఫెన్ మాటలు గుర్తుకువచ్చాయి.

'అవును! ఎందుకు ప్రయత్నించకూడదు? నిరాశ చీకటి వెనుక ఏ ఆశాకిరణాలు దాగున్నాయో?' అనుకుంది కిమ్.

* * *

సాధారణంగా, మనిషి ఏదైనా పని ఆరంభించాలనుకోగానే, అడ్డంకుల గురించి ఆలోచిస్తాడు. వాటిని అధిగమించలేనని భయపడతాడు. దాంతో ఆ పనిచేయటమే మానేస్తాడు.

అలాకాక, ఏదైతే అదయిందని అడుగు ముందుకేస్తే, అవరోధాలన్నీ భ్రాంతులేనని అర్థమౌతుంది. అసంభవమనుకున్న పని సంభవమౌతుంది.

ఈ నిజం కిమ్‌కు త్వరలోనే అనుభవానికి వచ్చింది.

పరిస్థితి వివరించి, సహాయం కోరిన వెంటనే దాదాపుగా 52 మంది తమ చర్మాన్ని దానం చేయటానికి ముందుకు వచ్చారు.

వారిలో బంధువులు, ప్రాణస్నేహితులు, పరిచయస్థులు ఉన్నారు. ఆరంభంలో కిమ్ అడగటానికి సంశయించింది. కానీ ఆమె అడిగిన వెంటనే కొందరు స్వచ్ఛందంగా ముందుకు రావటమేకాదు, తామే తమ మిత్రులకు వివరించి వారినీ తెచ్చారు.

తన వారి స్పందన చూసి కిమ్ చలించిపోయింది.

పొరుగువాడికి ఏమైనా పట్టించుకోని కాంక్రీటు అరణ్యాల నాగరికతగా భావిస్తున్న తమ సమాజంలో సాటి మనిషికి సహాయం చేయాలన్న ఇంత మానవత్వం దాగుండటం ఆమెకి ఆశ్చర్యం కలిగించింది.

* * *

డాక్టర్లు చకచకా తమ పని ఆరంభించారు. ఒకరొకరిగా దాతల శరీరం నుంచి చర్మం తీసి, స్టీఫెన్ శరీరంపై కప్పటం ఆరంభించారు.

రెండు వారాలలో మూడు ఆపరేషన్లు జరిగాయి. వీపు తప్పించి స్టీఫెన్ శరీరం అంతా దాతల చర్మంతో కప్పబడింది.

నెమ్మదిగా స్టీఫెన్ కోలుకోవటం ఆరంభమైంది.

* * *

ఆరోజు కిమ్ సంతోషంగా ఉంది.

ఎలెన్‌ను ఇంటికి తీసుకువచ్చింది. ఆమె శరీరంపై గాయాల మచ్చలున్నా, ఎలెన్ ఇంటికి రావటం కిమ్‌కు ఎంతో ఆనందాన్నిచ్చింది.

ఇక స్టీఫెన్ ఇంటికి రావటమే ఆలస్యం!

స్టీఫెన్ ఇంటికి వస్తే మళ్లీ తమ జీవితాన్ని ఎలా పునర్నిర్మించాలో ఆలోచించ సాగింది కిమ్. ఆ ఆలోచన ఆమెకి ఎంతో శాంతినిస్తోంది.

ఫోను మోగింది. రిసీవర్ ఎత్తి–

"హలో" అంది.

"అర్జంటుగా ఆస్పత్రికి రావాలి. స్టీఫెన్ గుండె పని చేయటం లేదు" వినిపించింది.

వార్త వింటూనే కుప్పకూలిపోయింది కిమ్.

* * *

స్టీఫెన్ అంత్యక్రియలకు, అతనికి చర్మందానం చేసిన 12 మంది దాతలు వచ్చారు. వారు సరిగ్గా నడవలేని పరిస్థితిలో ఉన్నారు.

చర్మం తీసిన తరువాత మత్తులోంచి బయటకు వచ్చినప్పుడు, స్టీఫెన్ చెల్లెలికి అతడి మరణవార్త తెలిసింది. ఆమె అంత్యక్రియలకు రాలేకపోయింది.

"చర్మం దానం చేసినందుకు బాధలేదు. కానీ అందువల్ల ఫలితం లేకపోవటం కోపంగా ఉంది" అన్నాడు నిక్, కిమ్‌తో.

"మన ప్రయత్నం మనం చేశాం. ఫలితం గురించి ఆలోచించకూడదు" నిక్‌కు సర్దిచెప్పింది స్టీఫెన్ చెల్లెలు.

"మీరు పెద్ద మనసుతో చర్మం దానం చేశారు. కానీ అప్పటికే ఆలస్యమైపోయింది. ప్రమాదం జరిగిన 24 గంటలలో చర్మం లభించివుంటే ప్రాణాన్ని కాపాడగలిగేవాళ్లం. కానీ మన ప్రయత్నం మనం చేశామన్న సంతృప్తి మనకు మిగిలింది" అన్నాడు డాక్టర్ విషాదంగా.



© EMESCO BOOKS

ఆ రాత్రి కిమ్‌కు నిద్ర పట్టలేదు.

నిరాశలో ఆశను చూసింది తాను. అయినా చివరకు తనకు నిరాశాంధకారమే మిగిలింది. తనకు సహాయానికి వచ్చిన వారికి వేదన మిగిలింది. అది ఆమెను మరింత బాధపెట్టింది.

అంతలో ఆమెకు డాక్టర్ మాటలు గుర్తుకువచ్చాయి. స్టీఫెన్‌కు దాతలనుంచి చర్మం లభించేసరికి ఆలస్యమైపోయింది.

'ప్రమాదం జరిగిన వెంటనే చర్మం దొరికుంటే...' ఆమె ఆలోచనలు అక్కడ ఆగిపోయాయి.

స్టీఫెన్‌కు సమయానికి చర్మం ఎందుకు దొరకలేదు? ఎందుకంటే, చర్మాన్ని ముందే తీసివుంచి దాచే 'స్కిన్ బ్యాంక్' తమ దేశంలో లేదు కాబట్టి. అలాంటి 'స్కిన్ బ్యాంక్' అక్కడ ఉంటే స్టీఫెన్ ప్రాణం నిలిచి ఉండేది.

స్టీఫెన్ మరణించాడు. కానీ స్టీఫెన్‌లా భవిష్యత్తులో ఎవరికి ఇలా చర్మం అత్యవసరమైనా, వారు సరైన సమయానికి చర్మం దొరకక మరణించే అవకాశం ఉంది.

తనలాగే ఇంకెందరో 'కిమ్'లు, ఆశ నిరాశల నడుమ ఊగిసలాడుతూ చివరికి నిరాశ సముద్రంలో మునిగిపోయే అవకాశం ఉంది.

అలా జరగకూడదు!

అలా మరణించే వారిలో స్టీఫెన్ చివరివాడు కావాలి. స్టీఫెన్ మరణం, ఇతరుల ప్రాణదానానికి నాంది ప్రస్తావన కావాలి.

అవును...!

'స్టీఫెన్ పేరిట తానే ఓ స్కిన్ బ్యాంక్ ఏర్పాటు చేస్తే?' – ఆ ఆలోచన రావటంతోటే కిమ్ బాధను తాత్కాలికంగా మరచింది. ఉత్సాహంగా లేచింది. బాధను మరచిపోయేందుకు మనుషులు నానా బాధలు పడతారు. దృష్టిని ఆకర్షించే పని ఆరంభిస్తే చాలు, పెద్ద గీత ముందు పాత గీత చిన్నదైపోయినట్టు బాధ వెనుకబడుతుంది.

* * *

"అసాధ్యం... మనం మామూలు మనుషులం. మన వల్ల ఇది సాధ్యంకాదు. అదీగాక స్టీఫెన్ అంటే మాకు ప్రాణం. కాబట్టి మేం ఎంతటి కష్టానికయినా ఓర్చుకునేందుకు సిద్ధపడ్డాం. తెలియనివారి కోసం ఇంత కష్టపడటానికి ఎవరూ ముందుకు రారు" నిర్మొహమాటంగా అంది స్టీఫెన్ చెల్లెలు, కిమ్ ఆలోచన విన్నాక.

"నేను ఈ విషయం ఆలోచించాను. చనిపోయిన వారి శవం మీది చర్మాన్ని తీసి భద్రపరచవచ్చు. గ్లిజరాల్‌లో నాలుగు డిగ్రీల వద్ద రెండున్నరేళ్ళ వరకూ భద్రపరచవచ్చు.



© EMESCO BOOKS

కేవలం శరీరం కాలిన వారికే కాదు, తీవ్రమైన గాయలైన వారికి కూడా స్కిన్ బ్యాంక్ పనికివస్తుంది. గాయమైన స్థలంలో ఈ చర్మం ఉంచటం వల్ల రక్తం కారటం ఆగుతుంది. కొత్త చర్మం పుట్టుకొచ్చేదాకా అది 'బయోలాజికల్ డ్రెస్సింగ్'లా ఉపయోగపడుతుంది" ఉత్సాహంగా చెప్పింది కిమ్.

"కానీ ఇదంతా ఖర్చుతో కూడిన వ్యవహారం కదా!" అనుమానంగా అడిగింది స్టీఫెన్ చెల్లెలు.

"పని ప్రారంభిస్తే వచ్చే అడ్డంకులను అధిగమించటం గురించి ఆలోచించవచ్చు" అంది కిమ్.

* * *

వార్తాపత్రికలోని ఆ వార్త పాఠకులను కదలించింది.

'12 మంది తమ ప్రియమిత్రుడి ప్రాణం కాపాడటం కోసం చర్మాన్ని దానం చేశారు. అయినా మిత్రుడి ప్రాణం కాపాడలేకపోయారు. తమ స్నేహితుడి స్మారకార్థం వారు 'స్కిన్ బ్యాంక్'ను ఏర్పాటు చేయాలనుకుంటున్నారు. అందుకోసం ప్రజలనుండి విరాళాలు ఆహ్వానిస్తున్నారు'

ఈ వార్త తెలియగానే మీడియా 'కిమ్'ను ఇంటర్వ్యూ చేసింది. ఆ ఇంటర్వ్యూ ఆధారంగా 'కిమ్' దేశంలోని పలు ప్రాంతాలను పర్యటించటం ప్రారంభించింది. 'కిమ్' ప్రయత్నాల ఫలితంగా ఓ వార్తాపత్రిక నిధుల సేకరణకు ముందుకు వచ్చింది. నెలలోగా 100,000 పౌండ్లు సేకరించింది. తన హాస్పిటల్ ఆవరణలో 'స్కిన్ బ్యాంక్'ను నిర్మించే స్థలాన్నిచ్చేందుకు 'క్వీన్ మేరీ' హాస్పిటల్ అధికారులు ముందుకు వచ్చారు. స్కిన్ బ్యాంక్ కట్టేందుకు సరిపడధనాన్నిచ్చేందుకు ఓ ప్రైవేట్ సంస్థ ముందుకు వచ్చింది. స్టీఫెన్‌తో కలసి పనిచేసిన కొలీగులంతా కలసి 10,000 పౌండ్లు విరాళం ఇచ్చారు.

'కిమ్' అవిశ్రాంతంగా చేస్తున్న ప్రచారంతో ప్రజలందరి దృష్టి 'స్కిన్‌బ్యాంక్' అవశ్యకతవైపు మళ్లింది. దాంతో 1996, మార్చిలో 'ది స్టీఫెన్ కిర్బీ స్కిన్ బ్యాంక్' ఆరంభమయింది. స్కిన్ బ్యాంక్ ఆరంభమయిన నెలలోనే దాదాపుగా వెయ్యి చదరపు సెంటీమీటర్ల చర్మం బ్యాంక్‌కు అందింది.

* * *

ఆగస్టు 1997.

కారులో పెట్రోల్ పోయించుకుని, స్టార్టు చేసేందుకు ఇగ్నిషన్ కీ తిప్పాడు డేవిడ్.

కన్ను మూసి తెరిచేలోగా కారు భగ్గుమంది. డేవిడ్ ఎగిరిపడ్డాడు.



© EMESCO BOOKS

కారు వెనుక సీట్లో అమాయకంగా ఆడుకుంటున్న చార్లొటెకి జరుగుతున్నది అర్థమయ్యేలోగా, మంటలు ఆమెని చుట్టుముట్టాయి.

* * *

చార్లొటె హాస్పిటల్ చేరేలోగా, స్కిన్ బ్యాంకునుంచి చర్మం వచ్చి సిద్ధంగా ఉంది. డాక్టర్లు చకచకా ఆపరేషన్ చేయటం మొదలుపెట్టారు.

ఆరు వారాలలోగా చార్లొట్ శరీరం చర్మాన్ని ఉత్పత్తిచేసింది. దాంతో అంటించిన చర్మం పీకేశారు డాక్టర్లు.

"సరైన సమయానికి చర్మం లభించటం వల్ల చార్లొటె బతికింది. లేకపోతే.." దుఃఖంతో మాట్లాడలేకపోయాడు డేవిడ్.

"స్టీఫెన్ మరణించాడు. కానీ అతని మరణం ఇతరులకు జీవనాన్ని ప్రసాదిస్తోంది. నిరాశను ఆశగా మలచుకోవటం అంటే ఇదే" అంటుంది కిమ్ కన్నీళ్ళు తుడుచుకుంటూ.

ఎందుకంటే 'స్కిన్‌బ్యాంక్' చర్మం వల్ల ప్రాణం నిలబడిన ప్రతి వారూ స్టీఫెన్‌ని గుర్తుతెచ్చుకుంటారు. కిమ్‌కు కృతజ్ఞతలు తెలుపుతారు.

* * *

ఇప్పటి వరకూ దాదాపుగా 350 మంది స్టీఫెన్ స్కిన్‌బ్యాంక్ సహాయంతో చికిత్స పొందారు. ఈ విధంగా కిమ్ కుటుంబం సమాజానికి ఉపయోగపడింది.

© EMESCO BOOKS

# పాటకు మళ్లీ ప్రాణం

---

**అణచివేయబడిన శాస్త్రీయ సంగీతానికి పాలకుల దౌష్ట్యం తొలగగానే ప్రాణం పోసి, తన దేశ సంస్కృతీ సంపదలను పునర్జీవింపచేసిన యువకళాకారుని కథ**

---

**సం**గీతం వినిపిస్తోంది. అది గాలి తరగలపై తేలుతూ, సుమధురమైన నాద తరంగాలు, శ్రవణేంద్రియాల ద్వారా శరీరంలోకి ప్రవేశించింది. అక్కడ్నించి హృదయ లోతులను చేరి, నిద్రాణమైన అనేక సున్నిత భావాలను స్పందింపచేసి జాగృత పరిచింది. ఏడుస్తున్నశిశువును, హృదయానికి హత్తుకుని లాలిస్తున్న తల్లిలా ఆ సంగీతం అతడికి సాంత్వననిస్తోంది. తన దేహంలో అణువణువునా నిక్షిప్తమైన అనేక అజ్ఞాత సంస్కారాలు చేతనత్వాన్ని పొంది నృత్యమాడుతున్నట్లు అనిపిస్తోందతనికి, ఆ సంగీతం వింటూంటే.

అతడు అణచిపెట్టాలని ప్రయత్నిస్తున్న జ్ఞాపకాలేవో ఆ సంగీత ధ్వనిగా ప్రాణం పోసుకుంటున్నాయి. ఆ సంగీతం వింటున్న 'ఆర్న్ కోర్న్-పాండ్' కళ్లలో అతని జ్ఞాపకాలు కన్నీటి బిందువులై కదలసాగాయి.

* * *

కాంబోడియా దేశ చరిత్రలో 'ఖ్మెర్‌రోజ్' నియంత, 'పోల్‌పాట్' పాలనా కాలం ఓ పీడకల వంటిది. దేశాన్ని వర్గరహితంగా చేయాలన్న దురాశతో అత్యంత దారుణంగా ప్రవర్తించాడు 'పోల్‌పాట్'. కళాకారులను, వ్యాపారులను, పండితులను, ఇతరులకన్నా భిన్నంగా ఉన్న వారందరినీ పేరు పేరునా ఏరివేసి ఊచకోత కోశాడు. అందరినీ సమానం చేయాలన్న ఆత్రంతో అంతులేని విధ్వంసాన్ని సృష్టించాడు.

'ఓపేరా' నృత్యరూపకాలను ప్రదర్శించే తన తల్లిదండ్రులను, సోదరులను, జంతువులలా వేటాడి క్రూరంగా చంపేయటం, స్వంత కళ్లతో చూశాడు 'ఆర్న్' తన 12 ఏళ్ల వయసులో. వెయ్యేళ్లనాటి 'వాట్‌ఎక్‌నోమ్' మందిరంలో తల దాచుకున్నాడు కొన్నాళ్లు. ఆ తరువాత, తనకు

© EMESCO BOOKS

సంగీతంలో ప్రవేశం ఉందన్న నిజం ఎవరికీ తెలియకుండా జాగ్రత్తపడ్డాడు. ఒక అనాథలా, ఏమీ తెలియని అమాయకుడిలా నటించాడు. సైనికులు ఎలా చెప్తే అలా చేశాడు. రోడ్లు ఊడ్చాడు. అంట్లుతోమాడు. గిన్నెలు కడిగాడు. అవకాశం దొరికినప్పుడు చిన్న పురుగులను ఏరుకుని, కప్పలను పట్టుకుని తిన్నాడు. ఎందుకంటే అతడికి ఇచ్చే సగం తిండిని సైనికులు కాజేసేవారు. ఇలా అయిదారు నెలలయ్యేసరికి తనకు సంగీతం వచ్చున్న విషయం మరచిపోయాడు 'ఆర్న్'. అది గుర్తుంటే ప్రమాదం. ఆర్న్‌కు సంగీతం వచ్చున్న విషయం పసిగడితే సైనికులు అతడిని చంపి పురుగులకు ఆహారంగా వేసేవారు. ఆరు నెలలయ్యేసరికి ఆర్న్ చాలా బలహీనంగా అయిపోయాడు. ప్రతి కదలిక ప్రాణాంతకం అయ్యేది. ఇంతలో ఓ రోజు ఓ ప్రకటన విన్నాడు.

"ప్రాచీన సాంప్రదాయిక సంగీతానికి రోజులు చెల్లిపోయాయి. ఇకనుంచీ మన దేశంలో విప్లవాత్మకమైన వినూత్న సంగీతమే వినిపిస్తుంది. ఆ సంగీతం నేర్చుకుని గానం చేసేందుకు స్వచ్ఛందంగా వాలంటీర్లు కావాలి"

కఠినమైన లేబర్ పనినుంచి తప్పించుకొనేందుకు 'విప్లవ సంగీతం' నేర్చుకునేందుకు ముందుకు వచ్చాడు ఆర్న్.

* * *

సంగీతం క్లాసులో వెదురు వాద్యాలను పట్టుకోవటంతోటే 'ఆర్న్' కళ్లల్లోకి నీళ్లు వచ్చాయి. ఆ వాయిద్యాల ద్వారా తన శరీరంలోకి నూతనోత్తేజమేదో ప్రవహిస్తున్నట్టు తోచింది 'ఆర్న్'కు. కానీ తన సంచలనాన్ని నియంత్రించుకుని టీచర్ చెప్తున్న అంశాలవైపు దృష్టి కేంద్రీకరించాడు ఆర్న్. గురువు చెప్తున్నది సంగీతంలా అనిపించలేదు ఆర్న్‌కు, వెదురుబొంగులతో తాము కర్ణకఠోరమైన శబ్దాలను సృష్టిస్తున్నట్టు అనిపించింది. కానీ ఆ శబ్దమే తన ప్రాణాలను నిలుపుతుందని ఆర్న్‌కు తెలుసు. అందుకే గురువు చెప్పినట్టే వాయించాడు. వారంలోగా 'విప్లవ సంగీతం'లో ప్రావీణ్యం సంపాదించాడు ఆర్న్.

ఎప్పటిలాగే తరగతి అయిపోయిన తరువాత తిరిగివెళ్తున్న ఆర్న్ ఆ సంగీతం వినగానే ఆగిపోయాడు. అతడి గురువు 'యోన్‌మెక్', విప్లవ సంగీతం నడుమ ఓ శాస్త్రీయ సంగీత ధ్వని క్షణకాలం సేపు వాయించాడు. అది విని అంతలోనే మళ్లీ ఏమీ తెలియనట్లు వెళ్లిపోయాడు. ఎందుకంటే తనకు శాస్త్రీయ సంగీతం తెలుసో, లేదోనని గ్రహించేందుకు ఇది పరీక్షకావచ్చు.

అయితే, "ఆర్న్" అని పిలిచాడు యోన్‌మెక్. విధిలేక వెనక్కు తిరిగాడు ఆర్న్.

"నీకు శాస్త్రీయ సంగీతం తెలుసుకదా?" సూటిగా అడిగాడు యోన్‌మెక్. తలవంచుకుని నిలబడ్డాడు ఆర్న్.



© EMESCO BOOKS

"నువ్వు అబద్ధం చెప్పి లాభంలేదు. మొదటిరోజు నువ్వు వెదురుబొంగులు పట్టుకున్నప్పుడే నీకు సంగీతం వచ్చని గ్రహించాను. విప్లవ సంగీతం కూడా శాస్త్రీయ సంగీతంలా ధ్వనించినప్పుడే నీ నరనరాన శాస్త్రీయ సంగీతం రక్తమై ప్రవహిస్తోందని అర్థం చేసుకున్నాను" అని, ఓ గీతం సన్నగా వాయించాడు. అది ఆర్న్ తండ్రి ఎప్పుడూ పాడే గీతం. అది వింటూ కన్నీళ్లు ఆపుకోలేకపోయాడు ఆర్న్.

ఆర్న్‌ని దగ్గరకు తీసుకున్నాడు యోన్‌మెక్.

"దేశంలో శాస్త్రీయ సంగీతమే కాదు ప్రాచీన సాంప్రదాయక కళలు తెలిసిన ప్రతి ఒక్కరినీ హతమార్చారు. అదృష్టవశాత్తు నా గురించి ఎవరికీ తెలియకపోవటంతో బతికిపోయాను. కానీ నాతో మన పూర్వీకులు తరతరాలుగా కాపాడుతూ, అభివృద్ధి చేస్తూ వస్తున్న శాస్త్రీయ సాంప్రదాయిక సంగీతం అంతరిస్తుందన్న భావన నా శాంతిని భగ్నం చేస్తోంది. నిన్ను చూడగానే నాకు ఓ ఆలోచన వచ్చింది. నాకు వచ్చిన సంగీతం నీకు నేర్పిస్తాను. నువ్వింకా పిల్లవాడివి. ఈ రాక్షసుడి రాజ్యం అంతరించే వరకూ బతికే అవకాశం నీకుంది. ఈ రాక్షసుడి మరణం తరువాత, పరిస్థితులు మళ్లీ మామూలు అయినప్పుడు శాస్త్రీయ సంగీతాన్ని సజీవం చేయాలి నువ్వు" వాగ్దానం కోసం చేయి సాచాడు యోన్‌మెక్. ఆర్న్ కదలలేదు.

"ఎవరు ఏ క్షణంలో ఛస్తారో ఎవరూ చెప్పలేరు" అన్నాడు ఆర్న్.

యోన్‌మెక్ నవ్వాడు.

"మునిగేవాడు గడ్డిపోచనయినా ఆధారంగా భావిస్తాడు. నా గడ్డిపోచ నువ్వు. వాగ్దానం చేయి. బతికితే నెరవేర్చగలిగితే నెరవేర్చు. లేకపోతే కనీసం నా సంస్కృతిని నిలబెట్టాలని ప్రయత్నించానన్న సంతృప్తి నాకుంటుంది" మరింత ముందుకు సాచాడు చేతిని.

ఆ చేతిని అందుకున్నాడు ఆర్న్.

* * *

ఆ రోజు నుంచీ ఉదయం పూట సైనికుల సంతృప్తి కోసం విప్లవ సంగీతం సాధన చేసేవారు. చీకటి పడగానే నిశ్శబ్దంగా తమ గుడారాల్లోంచి బయటకు పాకి, దగ్గరలోని అడవికి పారిపోయేవారు. అక్కడ రకరకాల క్రూర జంతువులు నేపథ్య సంగీతాన్ని అందిస్తూంటే, కీచురాళ్లు మృదుమధురంగా పాడుతూంటే, ఆకాశంలో తారలు మిలమిలమంటూ తాళం వేస్తూంటే వారిద్దరూ శాస్త్రీయ సంగీత సాధన చేసేవారు. మైమరచిపోయేవారు. రాత్రి అయి, తెల్లారాకూడదని ప్రార్థించేవారు. కానీ తెల్లవారేది. తాము చేయాల్సిన పనులు యాంత్రికంగా చేస్తూ మళ్లీ చీకటి పడటం కోసం ఎదురుచూసేవారు. ఇంతలో –

ఆర్న్‌కు పిలుపు వచ్చింది.

"సంగీత వాయిద్యాలు వదలి ఆయుధాలు ధరించాల్సిన రోజు వచ్చింది" అంటూ సైన్యాధికారి అతడి చేతిలోంచి సంగీత వాయిద్యం లాగిపడేసి ఆయుధాన్ని అందించాడు. ఆ రోజు రాత్రి యోన్‌మెక్ ఆర్న్ తన కిచ్చిన వాగ్దానాన్ని గుర్తుచేశాడు.

"యుద్ధంలో బతికి బయటపడితే వాగ్దానం నెరవేరుస్తాను" మనస్ఫూర్తిగా అన్నాడు ఆర్న్.

* * *

యుద్ధానుభవాలు ఆర్న్‌ను బండరాయిగా మార్చాయి. సైనికులు శత్రువుల తలల పగులగొడుతూంటే, వాళ్లు కదలకుండా పట్టుకోవాల్సి వచ్చేది ఆర్న్‌కు. బాయ్‌నెట్లతో అమాయకులను పొడుస్తూంటే, వారి కేకలు వింటూన్న ఆర్న్ హృదయంలోంచి సంగీతం పారిపోయింది. అతని చెవులకు ప్రజల ఆర్తనాదాలు, మరణిస్తూ వారు చేసే హృదయ విదారకమైన ధ్వనులు, తుపాకుల మోతలు మాత్రమే వినిపించేవి. ఆర్న్ తాను మనిషిన్నన్న భావననే మరచాడు. సైనిక జీవితం కన్నా తప్పించుకొని పారిపోతూ మరణించటమే మేలన్న నిశ్చయానికి వచ్చాడు. కాంబోడియా వదలి థాయ్‌లాండ్ పారిపోతున్న వేలాదిమందిలో తానూ ఒకడయ్యాడు. థాయ్‌లాండ్ రెఫ్యూజీ క్యాంపు చేరుకున్నాడు.

* * *

ఆగస్టు 1980. యుద్ధంలో చిక్కుకున్న పిల్లలను కాపాడి, వారికి భద్రతనిచ్చి, విద్యాబుద్ధులు చెప్పించటం, వారిని మనుషులుగా తీర్చిదిద్దటం జీవితలక్ష్యంగా గల 'పీటర్‌పాండ్' దృష్టి రెఫ్యూజీ క్యాంపులో జీవచ్ఛవంలా పడి ఉన్న ఆర్న్‌పై పడింది. దాంతో అతని జీవితం అనూహ్య మలుపు తిరిగింది. అమెరికా చేరిన ఆర్న్ చదువులో మునిగిపోయాడు. తన సర్వేంద్రియాలను చదువుపై కేంద్రకరించటం ద్వారా అతను గతంలోని భయంకరమైన అనుభవాలను మరచిపోవాలని ప్రయత్నించాడు. కానీ ఎప్పుడు ఏ రకమైన సంగీతం వినిపించినా గడగడ వణికిపోయేవాడు. అతడు అదిమిపెట్టాలని ప్రయత్నిస్తూన్న అనేక పీడకలల్లాంటి అనుభవాలు ఒక్కసారిగా నిద్రలేచి నిజమైకూచునేవి. అందుకే ఇతరుల్లా అతడు డిస్కోలకు, సంగీతసభలకు, నృత్యాలకు వెళ్లేవాడుకాదు. అందరికీ దూరంగా ఉంటూ, ఏదో ఓ పనిలోపడి తననితాను మరచిపోవాలని ప్రయత్నిస్తూన్న ఆర్న్ ప్రవర్తనను అర్థంచేసుకున్నాడు పీటర్‌పాండ్.

ఓ రోజు ఆర్న్‌ను తన గదిలోకి పిలిచాడు.

"ఆర్న్! నీకొక జీవిత సత్యం చెప్తాను. విను. మనం ఎప్పుడూ నిజం నుంచి పారిపోవాలని ప్రయత్నించకూడదు. ఎంత కఠినమైనదైనా, ఘోరమైనదైనా నిజం నిజమే. దాన్ని ఒప్పుకుని తీరాల్సిందే. ఎంతకాలం నువ్వు నిజాన్ని మరచిపోవాలని ప్రయత్నిస్తావో, అంతకాలం అది

నిన్ను బాధిస్తుంది. భూతమై వేధిస్తుంది. నీ గతాన్ని అర్థం చేసుకో. దాన్ని భవిష్యత్తుకు బాట చూపే దివ్వెగా చేసుకో"

మౌనంగా గది వదిలి వెళ్లిపోయాడు ఆర్న్.

* * *

"నేను కాంబోడియా వెళ్తాను".

ఆర్న్ మాటలకు ఆశ్చర్యపోయాడు పీటర్. అంతలో నవ్వేశాడు.

"గుడ్. సమస్య నుండి పారిపోయేకన్నా ఎదుర్కోవటమే మేలు, అది పరిష్కారమవుతుంది" అన్నాడు పీటర్.

"నేనూ, నాలా కాంబోడియా నుంచి తప్పించుకున్న ఇంకొందరం యువకులం కలసి 'కాంబోడియన్ వాలంటీర్స్ ఫర్ కమ్యూనిటీ డెవలప్మెంట్' అనే సంస్థను స్థాపించాం. కాంబోడియా నగరాలను శుభ్రపరచి, ప్రజలకు సేవ చేయాలని నిశ్చయించాం. 'పోల్పోట్' పాలన నుంచి విముక్తమైన దేశం తన కాళ్లమీద తాను నిలబడేందుకు మా వంతు బాధ్యతను నిర్వహించాలనుకుంటున్నాం."

"గుడ్లక్" అన్నాడు పీటర్పాండ్.

* * *

కాంబోడియా చేరిన ఆర్న్ దృష్టిని మొదట ఆకర్షించింది. 'నిశ్శబ్దం' ఏదో పీడకల నుంచి జాగృతులయినా, ఆ కల తాలూకు భయం మనసుని వదలని వాళ్లలా స్థబ్దులై ఉన్నారు ప్రజలు.

"ప్రజలీ సుషుప్తి నుంచి బయటపడాలంటే, వారి ఆత్మను తాకే సంగీతాన్ని వినిపించాలి. ఈ భయంకర నిశ్శబ్దాన్ని పారదోలే సంగీత సంజీవని కావాలి" నిశ్చయించుకున్నాడు ఆర్న్.

తన దేశంలో చైనీయులు, థాయ్లాండ్ దేశీయుల పాప్ సంగీతం తప్ప మరేమీ వినపడటం లేదు.

"చేప నీటిలో హాయిగా ఉంటుంది. పక్షి గాలిలో ఎగురుతుంది. అలా ఏ దేశప్రజలు ఆ మట్టికే ప్రత్యేకమైన శాస్త్రీయ సంగీతానికి స్పందిస్తారు. విదేశీయుల సంగీతం మన శరీరాన్ని ఊపవచ్చు కానీ మనస్సును స్పందింపచేయదు" అని వాదించి తన సహచరులను ఒప్పించాడు ఆర్న్. శాస్త్రీయ సంగీతం తెలిసిన వారికోసం వేట ఆరంభమైంది. అంతవరకూ తనకు వచ్చిన సంగీతాన్ని ఔత్సాహికులకు బోధించటం ఆరంభించాడు ఆర్న్.

ఓ రోజు ఆర్న్ముందు ఓ పిచ్చి 'బిచ్చగాడు వచ్చి నిలబడ్డాడు. మౌనంగా ఆర్న్ చేతిలోంచి సంగీత వాయిద్యం లాక్కుని మధురంగా ఆలపించటం ఆరంభించాడు. "యోన్మెక్" ఆనందంగా అరిచాడు ఆర్న్.



© EMESCO BOOKS

ఆ రోజునుంచీ సంగీతం శిక్షణిచ్చే బాధ్యతను 'యోన్‌మెక్'కు అప్పగించాడు ఆర్న్. విప్లవం కన్నా ముందు దేశాన్ని ఉర్రూతలూపిన గాయని 'చెక్‌మాచ్' వీథుల్లో సిగరెట్లు అమ్ముతూ బతుకుంతోందని తెలియగానే ఆమెని వెతికి పట్టుకున్నాడు ఆర్న్. ఆమెనీ తన 'కాంబోడియన్ మాస్టర్ పర్ఫార్మర్స్ పోగ్రాం'లో భాగస్వామిగా చేర్చుకున్నాడు. ఇలా అంతరించిపోతున్న కాంబోడియా శాస్త్రీయ సంగీతాన్ని మళ్లీ చిగురింపచేస్తున్నాడు ఆర్న్. ప్రస్తుతం 16 మంది శాస్త్రీయ సంగీత విద్వాంసులు, 250 మంది విద్యార్థులకు కాంబోడియా శాస్త్రీయ సంగీతంలో శిక్షణనిస్తున్నారు. దేశ విదేశాలు తిరుగుతూ కాంబోడియా సంస్కృతిని నిలబెట్టే కార్యక్రమాలకు నిధులు సేకరిస్తున్నాడు.

* * *

"నా గురువుకి నేనిచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకుంటున్నాను. అయితే ఆయనకి వాగ్దానం చేసినప్పుడు ఆయన నాపై ఉంచిన బాధ్యత ఎంత గురుతరమైందో నాకు తెలియదు. ఆయన నన్ను సంగీతాన్ని పునరుజ్జీవింపజేయమన్నాడని అనుకున్నాను. కానీ ఇప్పుడు అర్థమయింది. నేను పునరుజ్జీవితం చేస్తున్నది కేవలం శాస్త్రీయ సంగీతాన్ని, ప్రాచీన సాంప్రదాయాలనో కాదు. కాంబోడియా ఆత్మ జాగృతమౌతోంది. తనని తాను తెలుసుకుంటోంది. కాంబోడియాకు ప్రత్యేకమైన గుర్తింపునిస్తుంది. శాస్త్రీయ సంగీతం నిలిపేందుకు దాన్ని నా బాధ్యతగా చిత్తశుద్ధితో నిర్వహిస్తున్నాను. సముద్రంలో నీటిబొట్టులాంటివాడిని. నా కర్తవ్యం నేను చేస్తున్నాను. ఫలితం దైవం పైనే" అంటాడు ఆర్న్.

తనలో సంగీతం ధ్వనులు కలిగిస్తున్న ప్రకంపనలు రేపుతున్న జ్ఞాపకాల అశృవులను తుడుచుకుంటూ.

© EMESCO BOOKS

# ఆశా దీపం వెలిగింది

**మంచి ఉద్యోగంలోనే ఆనందం ఉందని అనుకోక,**
**అభాగ్యుల ఆసరాలోనే ఆనందం ఉందని నమ్మి చేరదీసి,**
**ఆశ్రయమిచ్చిన మహిళామణి కథ.**

"**ప్రతి** సంవత్సరం వేల సంఖ్యలో నేపాలీ అమ్మాయిలు అన్యాయంగా వేశ్యావృత్తిలోకి నెట్టబడుతున్నారు. వాళ్ల శరీరం గుల్ల అయి, రోగాలమయమైన తరువాత నిర్దాక్షిణ్యంగా వారిని వీథుల్లోకి నెట్టేస్తున్నారు. అడుక్కునే ఓపిక కూడా లేకుండా నిరాశ్రయులై దుర్భర దారిద్ర్యంలో జీవితాలు గడుపుతున్నారు. ఏమీ నేరం చేయకుండానే ఘోరమైన శిక్షను అనుభవిస్తున్న అమాయకులు వాళ్లు. పవిత్ర హిమాలయాల పాదపీఠం వంటి నేపాల్‌లో ఇటువంటి దురంతాలు జరగటం మనం సహించకూడదు. ఎవరో వచ్చి మనల్ని రక్షిస్తారని, ఉద్ధరిస్తారని ఎదురుచూస్తూ కూచుంటే మన చెల్లెళ్లు, మిత్రురాళ్లు, కూతుళ్లు ఇలా అన్యాయాలకు గురవుతూనే ఉంటారు. ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు మనమే నడుం బిగించి ముందుకు రావాలి. ఈ అన్యాయాన్ని అరికట్టాలి."

ఊపిరి పీల్చుకునేందుకు ఆగి తన ముందున్న యువతుల వైపు చూసింది. అనురాధ కోయిరాల.

వాళ్ల ముఖాల్లో ఆవేశం కనిపిస్తోంది. పట్టుదల కనిపిస్తోంది. తామింక అన్యాయాలను సహించమన్న ఆలోచన కనిపిస్తోంది.

ముఖ్యంగా, తమ పరిస్థితిని తామే మెరుగుపరుచుకోవాలన్న గ్రహింపు కనిపిస్తోంది.

అది చూసి సంతృప్తిగా నిట్టూర్చింది అనురాధ కోయిరాల. తాను నాటిన 'మైత్రినేపాల్' బీజం వేళ్లూనుకుని మొక్కలా ఎదుగుతోందని ఆమె గ్రహించింది. 'మైత్రి నేపాల్' ఏర్పాటుకు దారితీసిన ఆ సంఘటనలు ఈనాటికీ ఆమె కళ్లముందు మెదలుతున్నాయి.

* * *

© EMESCO BOOKS

అనూరాధ కోయిరాల ఓ పాఠశాలలో ఇంగ్లీషు, ఖగోళశాస్త్రం బోధిస్తూండేది. ఆమె భర్తతో విడాకులు పొందిన తరువాత ఒంటరి జీవితం గడపటం ఆరంభించింది. మనసును తన బాధ నుంచి మళ్లించేందుకు దైవధ్యానం చేయటం ఆరంభించింది. రోజూ పశుపతినాథ మందిరం సందర్శించి 'మనశ్శాంతి' నివ్వమని భగవంతుడిని అర్థించేది.

పూజ పూర్తయి మందిర ప్రాంగణంలో కూచున్నప్పుడు రకరకాల ఆలోచనలు ఆమెమదిలో మెదిలేవి.

'ఏమిటీ తన జీవితానికి అర్థం?

పుట్టింది. పెరిగింది. పెళ్లి చేసుకుంది. విడాకులిచ్చి భర్తతో వేరుపడింది. ఉద్యోగం చేస్తోంది. తన బతుకుతాను బతుకుతోంది. ఏదో ఒకరోజు మరణిస్తుంది. ఇంతేనా?

తన జీవితానికి ఇంతకు మించి వేరే అర్థం లేదా? భగవంతుడి సృష్టిలో ఎంత సూక్ష్మ జీవికైనా ఏదో ప్రయోజనం ఉంటుందంటారు. మరి తన జీవిత ప్రయోజనం ఏమిటి?'–

ఇలా రకరకాల ఆలోచనలతో సతమతమయ్యేది. నిరాశలో కుంగిపోయేది. ఇటువంటి సమయంలో మందిరం బయట అతిదైన్యస్థితిలో కూచుని బిచ్చం అడిగే మహిళలను చూస్తుంటే ఆమె మదిలో విచిత్రమైన భావనలు కలిగేవి. 'వారిలో చాలామంది భర్తలచేత మోసగింపబడినవారు. ఏదో కారణంతో ఇళ్లల్లోంచి తరమబడ్డవారు. కానీ వారికి తనలాగా విద్యలేదు. ఉద్యోగం లేదు. అందుకని అడుక్కుంటున్నారు. సమాజంలో అందరి దూషణకు గురవుతున్నారు. తన అదృష్టం బాగుండి తానిలా ఉంది. లేకపోతే?'

ఈ ఆలోచనలతో ఒళ్లు జలదరించేది.

రోజూ వారిని అలా చూస్తుంటే ఆమెకో ఆలోచన కలిగింది. ముఖ్యంగా ఆలనాపాలనా లేక తల్లి చుట్టూ తిరుగుతూ, మట్టిలో ఆడుతూ, తల్లిలానే 'అయ్యా', 'బాబా' అంటూ చిట్టి చిట్టి చేతులని చాస్తున్న వారి పిల్లలను చూస్తుంటే ఆ ఆలోచన స్థిరపడింది.

రోజూ వారికి డబ్బిస్తూ వారి నమ్మకం సంపాదించింది. ఓ రోజు వారిలోని ఓ అమ్మాయిని అడిగింది.

"నీ భర్తతో ఎందుకు వేరుపడ్డావు?"

ముందు ఆ అమ్మాయి ఏమీ మాట్లాడలేదు. కానీ అనూరాధ నెమ్మదిగా ఆ అమ్మాయిని బుజ్జగించింది.

"నా పేరు దీప. నాకు 12 ఏళ్ల వయసులో నా కజిన్ నన్ను భారత్‌లో ఉన్న బంధువుల దగ్గరకు తీసుకువెళ్తానని చెప్పి తీసుకువచ్చాడు" అంటూ ఏడవటం ఆరంభించింది.



© EMESCO BOOKS

అనూరాధ గుండె కరిగిపోయింది. ఆమె కన్నీరు చూస్తుంటే–

"ఆ తరువాత నన్ను ఓ వ్యభిచార గృహానికి అమ్మేశాడు."

అనూరాధ రోమాలు నిక్కపొడుచుకున్నాయి. ప్రపంచం ఒక్కసారిగా గిర్రున తిరిగినట్టయింది.

"నేను లొంగలేదు. నన్ను హింసించారు. అన్నం పెట్టలేదు. సిగరెట్లతో కాల్చారు" చేతి మీద గాయాలు చూపిస్తూ అంది.

అనూరాధ గుండె బద్ధలయింది. కంటనీరు కారసాగింది.

"మొదటిరోజు పదిమంది... ఆ తరువాత ఎందరో. రిక్షాలాగేవాళ్ళు, లారీలు తోలేవారు, పెద్దలు, ముసలి వాళ్లు, అడుక్కునేవారు..." అంటూ భోరుమంది.

దీప ఇక మాట్లాడలేకపోయింది. వీళ్లు మాట్లాడుతుంటే మిగతా బిచ్చగాళ్లు, వీళ్ల చుట్టూ చేరారు. దీప మాట పూర్తయ్యేసరికి, మరో మహిళ ఏడుస్తూ తన కథ చెప్పింది.

అవన్నీ వింటూంటే అనూరాధ గుండె కరిగినీరయింది. ఎవరికి వారికి ప్రత్యేకమైనా, దాదాపుగా ప్రతి మహిళ గాథ ఇదే.

ఒకరిని బంధువు మోసం చేస్తే, మరొకరిని ప్రేమికుడు మోసం చేశాడు. ఒకరిని తల్లిదండ్రులు అమ్మేస్తే, మరొకరిని బలవంతంగా కిడ్నాప్ చేసి ఎత్తుకుపోయాడు.

ఆ తరువాత లొంగేంతవరకూ హింసలు. శరీరానికైన గాయలు వారు చూపిస్తుంటేనే అనురాధకు ఒళ్లు జలదరిస్తోంది.

మనసుకైన గాయాన్ని ఎవరికి చూపించగలరు? ఎవరు అర్థం చేసుకోగలరు?

మగవారి మానసిక దౌర్భల్యాలకు, మానసిక వికృతులకు ఇలా ఎంతమంది అమాయకులు ఎన్నెన్ని గాయాలభారాల కింద నలిగిపోతున్నారో!

సృష్టిలో అతిసున్నితం, అత్యంత మధురమూ అయిన శృంగారం ఇంత అధమంగా పశుస్థాయికి దిగజారిందేమిటి? మానవుడికి దైవత్వం ఆపాదించే సృష్టికార్యం ఇంతరాక్షస కృత్యంలా మారిందేమిటి? తమ గాథలు వింటూ కన్నీరు కారుస్తున్న అనూరాధను చూస్తుంటే ఇన్నాళ్లకు తమపట్ల సానుభూతి చూపిస్తున్న సాటిమనిషి లభించిన ఆనందంతో వారు స్వచ్ఛందంగా తమ దయనీయగాథలు వినిపించటం ఆరంభించారు.

ఇక వినలేకపోయింది అనూరాధ కోయిరాల.



© EMESCO BOOKS

"రండి. ఇవాల్టి నుండి మీరు అబలలు కారు. సబలలు. మీరు ఇతరుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడే దౌర్భాగ్యులు కారు. స్వశక్తిమీద ఆధారపడి మీ అదృష్టాన్ని మీరే లిఖించుకోగల శక్తిమంతులు" ఆవేశంగా అంది అనూరాధ.

వారు ఆశ్చర్యంగా చూశారు.

"మీరంతా నా ఇంటికి రండి. నా ఇల్లే మీ ఇల్లు. మీ పిల్లలు నా పిల్లలు. కలిసి కష్టపడదాం. కలసి మన పిల్లలకు బంగారు భవిష్యత్తు ఇద్దాం" నిశ్చయంతో పలికింది అనూరాధ.

అలా ఆరంభమయింది 'మైత్రినేపాల్' సంస్థ.

ఆరంభంలో ఓ ప్రణాళిక అంటూ లేదు.

నిర్భాగ్యులు, దౌర్భాగ్యులకు అండ దొరికే ఇల్లుగా మారింది అనూరాధ ఇల్లు. ఎవరికయినా తిండి దొరకకపోతే ఆమె ఇంటికి వెళ్తే తిండి దొరుకుతుందన్న నమ్మకం పేదవారిలో కలిగింది.

అనూరాధ ఒంటరిగా చేపట్టిన కార్యక్రమం చూసి, ఇరుగుపొరుగు తమ వంతు సహాయం చేయటం ఆరంభించారు.

ఒక్కో చినుకు కలసి ఒక చెరువును నింపినట్టు, ఒకో కరగిని హృదయం, దౌర్భాగ్యుల ఆత్మవిశ్వాసం పెంచే అమృత చినుకుగా మారి, 'మైత్రినేపాల్' ప్రేమ తటాకాన్ని సుసంపన్నం చేయసాగింది.

అయితే నిర్భాగ్యులకు నీడ కల్పించటంతో అనూరాధ సంతృప్తి పడలేదు. తన వద్ద ఆశ్రయం పొందిన వారి ద్వారా, వారిని బంధించిన వ్యభిచార గృహాల చిరునామాలు తెలుసుకుంది. బ్రోకర్ల వివరాలు సేకరించింది. పోలీసులకు ఆ సమాచారం ఇచ్చేది.

దాంతో వ్యభిచార చెరవిముక్తి లభించిన నేపాలీ మహిళలకు 'మైత్రినేపాల్' ఆశాకిరణంలా ఎదిగింది.

దేశం నలుమూలల నుంచి పతితులు, భ్రష్టులు, బాధాసర్పదష్టులు, అభాగ్యులు, నిర్భాగ్యులు, దౌర్భాగ్యులు అంతా అనూరాధ కోయిరాల ఇల్లు చేరటం ఆరంభించారు. ఆమె ఇల్లు నిండిపోవటంతో పక్కనే ఉన్న బంగళాను అద్దెకు తీసుకుంది.

అనూరాధ సామాజిక సేవగురించి తెలియటంతో విరాళాలు అందసాగాయి.

అయితే విరాళాలపైనే ఆధారపడక, 'మైత్రినేపాల్'లో ఓ ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసింది అనూరాధ. పెద్ద వారు చిన్నవారికి మార్గదర్శనం చేస్తారు. పిల్లల ఆలనాపాలననూ చూసే విభాగం ప్రత్యేకం. కొత్తగా వచ్చినవారి మానసిక గాయాలను అర్థంచేసుకుని, వారిని

మామూలు మనుషులుగాచేసే విభాగం మరొకటి. అయితే అనూరాధ ఏర్పాటు చేసిన 'మైత్రినేపాల్' స్వచ్ఛంద సైన్యం ఒక అద్భుతమైన ఆలోచన.

"ఎవరో వచ్చి మనల్ని రక్షించాలని, మనల్ని ఆదుకోవాలని, కాపాడాలని ఎదురుచూసి లాభంలేదు. మనం అలా ఎదురుచూస్తుంటే, ఈ అత్యాచారాలు ఇలా కొనసాగుతూనే ఉంటాయి" అని బోధించి ఓ స్వచ్ఛంద మహిళ సైన్యాన్ని ఏర్పాటు చేసింది ఆమె.

వీరు నేపాల్, భారత్ సరిహద్దులు కాపలాకాస్తారు. ఆ దారిలో ప్రయాణించే వాహనాలను పరీక్షిస్తారు. అనుమానాస్పదంగా కనిపించిన వారిని ప్రశ్నిస్తారు.

మహిళలను అక్రమంగా సరిహద్దు దాటిస్తున్న వారిని పట్టుకుంటారు.

అలా 2000లో 395 అమ్మాయిలను, 2001లో 359 మహిళలను వ్యభిచార గృహాలు చేరకముందే రక్షించారు. దాదాపుగా 30 మంది బ్రోకర్లను పోలీసులకు పట్టించ్చారు.

"ప్రభుత్వం చట్టాలను చేస్తుంది. అవి సరిగ్గా అమలు అయ్యేట్టు చూసే బాధ్యత మనదే. వ్యభిచార గృహాల్లోంచి అమ్మాయిలను రక్షిస్తుంది. వారికి ఆశ్రయం ఇచ్చి, వారిని మనుషులుగా నిలబెట్టే బాధ్యత సమాజానిదే. నేను నా సామాజిక కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నాను. ఇందులో నా గొప్ప ఏమీలేదు. భగవంతుడు నా జీవితాన్ని అర్థవంతం చేసుకునే మార్గం చూపించాడు. ఆ మార్గంలో ప్రయాణిస్తున్నాను. అంతే" అంటుంది అనూరాధ కోయిరాల.

© EMESCO BOOKS

# ఆఫ్రికా ఏనుగు - ఆమె

జంతు ప్రపంచాన్ని మానవ ప్రపంచానికి
చేరువ చేయాలనుకున్న మహిళ అనుభవం

"వెల్‌కమ్ టు సెంట్రల్ ఆఫ్రికా" సాదరంగా ఆహ్వానించాడు ఆండ్రియా టుర్కాలో.

సంతోషంగా నవ్వింది చార్లొటె.

"ఈ అపరచితమైన ప్రాంతంలో, అపరిచితుల నడుమ ఒక పరిచితుడు కనపడటం - ఎడారిలో ఒయాసిస్‌ని చూసినంత ఆనందాన్నిస్తోంది" అంది.

ఆండ్రియా కూడా నవ్వాడు.

"హాస్యం తరువాత చార్లొటె! నీకు కొన్ని విషయాలు చెప్పాలి" అన్నాడు టెంటులో బల్లపై కూర్చుంటూ.

తానూ కూర్చోటానికి స్థలం వెతికింది చార్లొటె.

ఎక్కడా దొరకక్కబెడ్‌పై కూర్చుంది.

"చెప్పండి"

"జంతు ప్రపంచాన్ని మానవ ప్రపంచానికి చేరువ చేయాలన్న నీ ఉద్దేశం మంచిదే. కానీ, అది నువ్వు టీవీలో చూసినంత సులభం కాదు. జంతువులను అర్థం చేసుకోవాలి. వాటి భయాలను అవగాహన చేసుకోవాలి. అనేక జాగ్రత్తలు తీసుకోవాలి. ఇవాళ్ల నీతో ఆటలాడిన జంతువే, రేపు నువ్వు కనబడగానే చీల్చి చెండాడేందుకు నీపైన పడవచ్చు. ఆశ్చర్యమేమీలేదు. ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలి"

"ఆండ్రియా, నేను బాగా ఆలోచించి నిర్ణయం తీసుకున్నాను. నేను ఏనుగులను గురించి టీవీ కార్యక్రమం ప్రజెంట్ చేస్తాను. అదీ ఆఫ్రికా అడవులలో వాటి సహజ వాతావరణంలో,

© EMESCO BOOKS

వాటి ఎదురుగా నిలబడి మరీ షూట్ చేస్తాను" స్థిరంగా చెప్పింది చార్లొటె. చాలాసేపు ఆండ్రే టెంటులోంచి బయట కనిపిస్తున్న అడవివైపు చూస్తుండిపోయాడు.

చివరికి నెమ్మదిగా లోగొంతుకలో చెప్పటం ఆరంభించాడు.

"చార్లొటె! నేను 13 ఏళ్లుగా ఏనుగులను అధ్యయనం చేస్తున్నాను. నీకు వాటి అలవాట్లు చెప్తాను. అవి ఏ ప్రాంతంలో, ఏ సమయంలో ఎక్కువగా ఉంటాయో చెప్తాను. కానీ, అవి బెదిరితే మాత్రం నిన్ను నువ్వు ఎలా రక్షించుకోవాలో మాత్రం చెప్పలేను."

"ఎందుకని?" అడిగింది ఆసక్తిగా చార్లొటె.

"ఎందుకంటే సాధారణంగా మానవుడు తప్ప మరే జీవి ఆకలేస్తే, భయపడితే తప్ప మరో ప్రాణికి హాని తలపెట్టదు. ఆనందం కోసం, వినోదం కోసం, కసి తీర్చుకోవటం కోసం ఇతర ప్రాణులనే కాదు, తోటి మానవుడిని కూడా హింసించేది, జీవులన్నిటిలోకి తెలివైన మానవుడు మాత్రమే!". అతడివైపు నిశితంగా చూసింది చార్లొటె.

"అందుకేనా మనుషులకు దూరంగా, అడవిలో జంతువుల నడుమ కాలం గడిపేస్తున్నావు?" అడిగింది హుషారుగా.

అవునన్నట్టుగా తలూపాడు ఆండ్రియా.

"ఆఫ్రికాలో మొత్తం 1,95,000 ఏనుగులున్నాయి. అవి అధికంగా ఉండే ప్రాంతం జాంగాచాయ్. ఏనుగులేకాదు అనేక జంతువులు అక్కడకు నీళ్లు తాగేందుకు వస్తాయి. అక్కడ నువ్వు నీకు ఓపిక ఉన్నన్ని దృశ్యాలు షూట్ చేసుకోవచ్చు. అయితే, ఓ విషయం ఇక్కడ దంతాల కోసం ఏనుగును చంపేవాళ్లు ఈ మధ్యనే పెరిగిపోయారు. దాంతో ఏనుగులు మనుషులను చూస్తే భయపడుతున్నాయి. వాటికి అనుమానం ఏ మాత్రం కలిగినా, అవి దాడి చేస్తాయి. ఓ బొమ్మని నలిపినట్టు నలిపేస్తాయి. దంతంతో పొడిచి, తొండంతో ఎత్తి నేలపై విసిరి కాళ్లతో తొక్కిపడేస్తాయి. కానీ, సాధారణంగా భయపడితే అవి పారిపోయే ప్రయత్నం చేస్తాయి. అవి కొన్ని సందర్భాలలోనే దాడిచేస్తాయి."

"అప్పుడు మనం ఏం చేయాలి?" అడిగింది చార్లొటె.

నవ్వాడు ఆండ్రియా.

"పరుగో! పరుగో..." అన్నాడు.

* * *

'జాంగాచాయ్' ప్రాంతాన్ని చూస్తూనే అప్రతిభురాలయి నిలచిపోయింది చార్లొటె. తనేకాదు తనతో వచ్చిన ఇతర బిబిసి సిబ్బంది కూడా అదే పరిస్థితి అని అర్థం చేసుకోవటానికి ఆమెకు సమయం పట్టింది.

© EMESCO BOOKS

దట్టమైన అడవి నడుమ హఠాత్తుగా 20 ఫుట్‌బాల్ మైదానాల స్థలంలో ఒక్కచెట్టు లేకుండా కనిపించటం ఒక అద్భుతం. ఆ మైదానం నడుమ సూర్యకిరణాల మెరుపులను దుస్తులుగా ధరించి ఓ నది వయ్యారం ఒలకబోసే యువతిలా ప్రవహించటం మరో అద్భుతం. వీటన్నిటినీ మించిన మరో అద్భుతం ఆ నదిలో నీళ్లు తాగేందుకు వచ్చిన అనేకమైన జంతుసమూహాలు. కొన్ని నీళ్లలో ఈదులాడుతుంటే, ఇంకొన్ని నీళ్లు తాగి పచ్చికలో సేదతీరుతున్నాయి. ఇంకొన్ని గుంపులు గుంపులుగా కూర్చొని ఏదో సభ జరుపుతున్నట్టున్నాయి. అది జంతువుల 'స్వర్గం'లా ఉంది. ఏ చీకూచింతా లేకుండా, ఎటువంటి భయాలు, ఆందోళనలు లేకుండా, ప్రపంచానికంతా తామే రారాజులమైనట్టు హాయిగా, స్వేచ్ఛగా తిరుగుతున్న ఆ జంతువులను చూస్తూంటే ఆమె మదిలో అనిర్వచనీయమైన ఆనందం కలుగుతోంది. మనిషి ఎందుకింత హాయిగా, స్వేచ్ఛగా ఉండలేడన్న ఆలోచన కలుగుతోంది.

'అనేక జంతువులు ఇక్కడికే రావటం వెనుక ఓ కారణం ఉంది. ఇక్కడి నీళ్లలో సోడియం, పొటాషియం, కాల్షియం వంటి ఖనిజాలు అధికంగా ఉంటాయి. శాకాహారులైన జంతువులకీ ఖనిజాలు ఇక్కడి నీటినుంచి లభిస్తాయి. ఆ ఖనిజాల కోసం ఎక్కడెక్కడి నుంచో జంతువులు ఈ ప్రాంతానికి వస్తాయి. నీళ్లు తాగుతాయి' అన్ని జంతువులు అక్కడికే రావడం వెనుక కారణాన్ని ఆంద్రియా వివరించడం ఆమెకు గుర్తుకు వచ్చింది.

నిజంగా, మనిషి ఎంతో తెలివైనవాడని అనుకుంటాడు. కానీ 'తెలివి' ఉండటం వల్ల, మనిషి స్వతఃసిద్ధమైన 'ఇన్‌స్టింక్ట్'ని కోల్పోయాడు. అందుకే జంతువులకు తమకేం కావాలో తెలుస్తుంది. మనిషికి ఎదుటివాడు చెప్పినా తెలియదు.

చార్లొటె ఆ దృశ్యాన్ని చూసి మైమరచి నిలుచున్న సమయంలో, ఆమెతోపాటు వచ్చిన ఇతరబృందం తమ పనులు చకచకా చేసుకుంటూపోయారు. ఆ ప్రదేశాన్ని ఏయే ప్రాంతాలనుంచి ఫిల్మ్ తీయవచ్చో నిర్ణయించుకున్నారు. ఓ ఎత్తయిన ప్రదేశంలో పెద్ద కెమెరా ఉంచారు.

రకరకాల దృశ్యాలను ఫిల్మ్ తీయసాగారు. ఆడుకుంటున్న జంతువులను, ఆవులిస్తున్న జంతువులను 'జూమ్'చేసి క్లోజప్పులు తీయసాగారు. ఇలా తీసిన షాట్లను తరువాత 'ఎడిట్' చేసుకుని చూపిస్తారు. ఇదంతా అయ్యేసరికి చార్లొటె ఈ లోకానికి వచ్చింది.

"నా కామెంటరీ స్టార్ట్ చేయనా?" అడిగింది వాకీటాకీలో.

ఆమెతోపాటు 'సై' అనే ఫొటోగ్రాఫర్ ఉంది. ఆమె చేతిలో పట్టుకునే కెమెరాతో చార్లొటెని పిక్చరైజ్ చేస్తుంది.

ఎత్తయిన ప్రదేశంలో ఉన్న డైరక్టర్ చుట్టూ చూసి చెప్పాడు.



© EMESCO BOOKS

"దూరం నుంచి ఏనుగుల గుంపు వస్తోంది. దాన్ని దగ్గరకు రానీ. అవి నేపథ్యంలో ఉన్నప్పుడు, నువ్వు ఏనుగుల గురించి చెప్తూంటే ఫిల్మ్ తీస్తే మరింత లైవ్లీగా ఉంటుంది. నేను సిగ్నల్ ఇస్తాను. అప్పుడు ఆరంభించండి. సైని సిద్ధంగా ఉండమను."

డైరెక్టర్ మాటలు 'సై'కి చెప్పిచుట్టూ చూస్తూ నిలుచుంది చార్లొటె. నిజమే, దూరం నుంచి ఏనుగుల గుంపు నీటి దగ్గరకు వస్తోంది. ఏనుగులను చూస్తూంటే ఎంతో ఆనందం అనిపించింది చార్లొటెకు.

వాటి శారీరక నిర్మాణం, అందమైన మంద గమనం అద్భుతం అనిపించాయి. 'నిజంగా సృష్టిలో ఎన్ని విభిన్నమైన రూపాలలోకి పరిణామం చెందింది జీవం' అనుకుంది. ఆమెకు ఆంఢ్రియా చెప్పిన మరో విషయం గుర్తుకువచ్చింది. 'ఏనుగుల కంటిచూపు అంత గొప్పదికాదు. ఏనుగులు సరిగ్గా చూడలేవు. కానీ అవి వాసనద్వారా విషయాలను పసిగట్టగలవు.' 'సై' ఇచ్చిన సూచనలను అనుసరించి నీటి దగ్గరకు నడిచింది చార్లొటె.

వెనుక ఏనుగులు ఓసారి తలెత్తి ఆమెవైపు అనుమానంగా చూశాయి. ఆపై మళ్లీ తమపనిలో మునిగిపోయాయి.

"కరెక్ట్ పొజిషన్. ఫ్రీజ్" అరిచింది సై, వాకీ టాకీలో.

"ఆరంభించనా?" అడిగింది చార్లొటె.

ఎందుకో ఆమె గుండె దడదడలాడుతోంది. మొదటిసారి ఆమె వైల్డ్‌లైఫ్ ఫిల్మ్‌ను ప్రెజెంట్ చేస్తోంది. 'డేవిడ్ ఆటెన్‌బరో' నుంచి స్ఫూర్తిపొంది, ఆమె వైల్డ్‌లైఫ్ కామెంటేటర్ అవాలని నిశ్చయించుకుంది. ఎవరెంత చెప్పినా వినలేదు. 'తాను విజయం సాధిస్తుందా? లేదా?' అన్న ఆలోచనలతో ఆమె ఉద్విగ్నతకు గురవుతోంది.

"ఏక్షన్" అరిచింది సై.

"హలో! దిసీజ్ చార్లొటె. వెల్కమింగ్ యూ టు ఎన్ అన్‌ఫర్గెటబుల్ వైల్డ్‌లైఫ్ ఎడ్వంచర్" (హలో నేను చార్లొటెని. మరపురాని వన్యప్రాణి అద్భుత సాహసయాత్రకు ఇదే ఆహ్వానం) అంటూ ఆరంభించింది చార్లొటె. అయితే, ఆమె దృష్టి కంగారుగా సౌంజ్ఞ చేస్తున్న సైపై పడింది. 'తాను సరిగ్గా నుంచోలేదా? సరిగ్గా పలకటం లేదా?' అని ఆలోచించింది చార్లొటె. ఇంతలో తన వెనుక భూమి అదురుతున్నట్టు అనిపించింది చూస్తే, ఓ ఏనుగు భీకరంగా ఆమెవైపు పరుగెత్తుకుంటూ వస్తోంది! ఒక్కక్షణం ఏం చేయాలో తోచలేదు చార్లొటెకు.

ఆమె కాళ్లు నేలకు అతుక్కుపోయాయి. శరీరం వణకసాగింది. అంతలో ఆమెకు ఆంఢ్రియా మాటలు గుర్తుకువచ్చాయి. 'ఏనుగులు దాడి చేసినప్పుడు, పరుగెత్తటం తప్ప మార్గంలేదు'.



© EMESCO BOOKS

తొండం ఎత్తి, ఘీంకరిస్తూ, భీకరంగా ఏనుగుమీదకు వచ్చేస్తోంది. హఠాత్తుగా తెలివికి వచ్చింది చార్లొటె. పెద్దగా అరిచి పరుగెత్తటం మొదలుపెట్టింది. ఏనుగు వెంటపడింది. వెనుక దాని పదఘట్టనలకు భూమి అదురుతోంది. దుమ్ము లేస్తోంది. ఒక్కక్షణం క్రితం వరకూ స్వర్గంలా కనిపించిన ప్రాంతం ఇప్పుడు భయంకరంగా మారింది.

అయితే మిగతా ఏనుగులు, జంతువులు ప్రాణాలు అరచేతపట్టుకుని పరుగెత్తుతున్న చార్లొటెను గమనించటంలేదు.

వాటి లోకంలో అవి ఉన్నాయి.

"చార్లొటె త్వరగా వచ్చేయ్! పరుగెత్తు" అరుస్తోంది సై.

"చార్లొటెకి చెమటలు పట్టేశాయి. కాళ్లు రబ్బరుతో చేసినట్టు తేలిపోతున్నాయి. వెనుకనుంచి ఏనుగు దగ్గరకు వచ్చేస్తోంది. ఆమెకేం చేయాలో తోచటం లేదు. ఆమె శక్తి అయిపోతోంది. అడుగుల వేగం తగ్గిపోయింది. పరుగు తీయటం శక్తికి మించిన పని అవుతోంది.

"చార్లొటె ఆగకు" గట్టిగా అరిచింది సై.

ఇక పరుగెత్తలేక ఆగిపోయింది చార్లొటె. వెనక్కు తిరిగి చూసింది. పరుగెత్తుకు వస్తున్న ఏనుగు ఆగి, సైవైపు చూస్తోంది. వెంటనే గట్టిగా అరిచింది చార్లొటె. ఎందుకో ఏనుగు ముందు నిస్సహాయంగా నిలబడటం ఆమెకు అవమానం అనిపించింది. అదీగాక, తనను రక్షించేందుకు కేకలు పెడుతున్న తన స్నేహితురాలు ప్రమాదంలో పడుతుందన్న ఆలోచన ఆమెకు వెర్రి ఆవేశాన్ని కలిగించింది.

"ఏయ్!" అని అరుస్తూ దగ్గరలో పడి ఉన్న ఓ చెట్టుకొమ్మను ఆయుధంలా పట్టుకుంది చార్లొటె. సైవైపు చూస్తున్న ఏనుగు నెమ్మదిగా తన దృష్టిని చార్లొటె వైపు మళ్లించింది.

'పిరికిపందలా పరుగెత్తే కన్నా, ధైర్యంగా దానితో ప్రాణరక్షణకోసం పోరాడతాను' అనుకుని చేతిలోని కర్రను ఊపింది చార్లొటె.

ఏనుగు ఒక్కక్షణం చార్లొటెవైపు తీక్షణంగా చూసింది. అడుగు ముందుకు వేసింది. చార్లొటె చేతిలోని కొమ్మను బలంగా ఊపింది.

ఏనుగు వింతగా చూసింది చార్లొటె వైపు, కొండ, తనతో తలపడుతున్న చీమనో, దోమనో చూసినట్టు ఉంది ఆ చూపు.

"రా... నా తడాఖా చూపిస్తా" అని ఒకవైపు ఏడుస్తూనే పిచ్చిగా అరుస్తూ కొమ్మను ఊపుతోంది చార్లొటె.



© EMESCO BOOKS

ఏనుగు ఒక అడుగు వెనక్కువేసింది. ఆ తరువాత నెమ్మదిగా వెను తిరిగి వెళ్ళిపోయింది.

ఏం జరుగుతుందో అర్థంకాలేదు చార్లొటెకు. ఆ తరువాత ముఖం చేతుల్లో దాచుకుని కూలబడి ఏడవసాగింది.

* * *

"ఆ క్షణంలో నాకు ఒక విషయం అర్థమైంది. నా జీవితానికి ఓ అర్థం ఉంది. మనుషులకు జంతు ప్రపంచాన్ని చేరువచేయటం నా జీవితలక్ష్యం. అది నెరవేరేంత వరకూ నేను ఏ శక్తికీ భయపడాల్సిన అవసరంలేదు. నన్ను క్షణంలో చంపగలిగిన ఏనుగు నన్ను విడిచి పెట్టటం వెనుక ఉన్న పరమార్థం ఇదే. మనుషులు గ్రహించలేని విషయాలు జంతువులు గ్రహిస్తాయి. నేను వాటి మేలుకోసమే అక్కడ ఉన్నానని ఆ ఏనుగు గ్రహించిందేమో. అందుకే నన్ను విడిచి పెట్టిందేమో. అప్పుడే నేను జీవితాంతం జంతు ప్రపంచాన్ని మానవులకు చేరువ చేయాలని నిశ్చయించుకున్నాను" అంటుంది ప్రఖ్యాత వైల్డ్‌లైఫ్ సినీ నిర్మాత, వ్యాఖ్యాత చార్లొటె ఉప్లెన్ బ్రోక్.

ఏనుగు నుంచి ఆమె పారిపోవటాన్ని ఎత్తున ఉన్నవారు చిత్రీకరించారు. అయితే ఆ దృశ్యాన్ని వారు ప్రపంచానికి ప్రదర్శించలేదు.

ఆ ఫిల్మ్‌ని తమ గుర్తుగా చార్లొటెకు బహుమతిగా ఇచ్చారు.

అంతేనేమో – కళాకారుడికి తన కళతో ఉన్నంత సంబంధం, చావు బతుకులతో ఉండదేమో.

© EMESCO BOOKS

# ఓడి గెలిచిన యోధుడు

**నేలకొరిగిన బాక్సింగ్ వీరుడు,**
**చవిచూసిన మరో విజయగాథ**

శనివారం, ఏప్రిల్ 19, 2003 లండన్ నగరం.

లండన్ మెరథాన్ పరుగు ఆరంభమైన అయిదవరోజు అది. మెరథాన్ పరుగు పోటీలో పాల్గొన్న వారందరి పరుగు ఎప్పుడో పూర్తయిపోయింది. మెదడు, వెన్నుపూస సమస్యల పరిష్కారానికి పరిశోధనలు జరిపే 'బ్రెయిన్ అండ్ స్పైయిన్ ఫౌండేషన్' నిధుల కోసం జరిపే మెరథాన్ పరుగులో 42 కిలోమీటర్లు పరుగెత్తుతూ, దారివెంట ప్రజల నుండి నిధులు సేకరిస్తారు.

అయితే, అసలు పరుగు పూర్తయిపోయినా ప్రజలు మెరథాన్ దారికి రెండువైపుల పెద్ద సంఖ్యలో నిలబడి ఎదురుచూస్తున్నారు ఓపికగా.

వాళ్లందరి ముఖాలలో ఏదో ఆతృత, ఏవో ఉత్తేజాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. వారు ఎవరికోసం ఎదురుచూస్తున్నారో, ఆ వ్యక్తి కనబడగానే ప్రజలు వెర్రి ఆనందంతో చిందులు తొక్కుతున్నారు. తమ చేతికి అందినంత దానం చేస్తున్నారు. నడవలేక, నడవలేక నడుస్తూ, ఒక కాలు ఆధారంగా, మరోకాలు ఎత్తివేస్తూ, ఆయాసపడుతూ, అతికష్టంతో అడుగుతీసి అడుగువేస్తున్న అతడిని చూడగానే ప్రజల కళ్లల్లో నీళ్లు పొంగి పొర్లుతున్నాయి. గర్వంతో గుండెలు ఉప్పొంగుతున్నాయి. అప్రయత్నంగా అక్కడ ఉన్నవారంతా 'మైకీ, మైకీ, మైకీ' అని అరుస్తూ అతడిని ప్రోత్సహిస్తున్నారు.

అతడి ప్రయత్నానికి తమ మద్ధతు తెలుపుతున్నారు.

'మైకీ, మైకీ, మైకీ'

ప్రజలు తనని ఉత్సాహపరచటం మైకెల్ వాట్సన్‌కు తెలుస్తోంది.

© EMESCO BOOKS

ప్రజలు తనకు ఇలా ప్రేరణనివ్వటం విని దాదాపుగా 12 ఏళ్లు దాటిపోయింది. ప్రజల కేకలు వింటున్నకొద్దీ మైకెల్ నరనరాల రక్తం ప్రచండ వేగంతో పరుగులిడుతోంది. అతడికి తెలియకుండానే ఒక చేయి పిడికిలి బిగుసుకుంటోంది. ఇంకో చెయ్యిలో అదృశ్యంగా ఉత్తేజం ప్రవహిస్తోంది. ప్రజలు 'మైకీ, మైకీ' అని అరుస్తూంటే, అతడి మనసు తన జీవితాన్ని తిరుగులేని విధంగా రూపాంతరం చెందించిన ఆ రోజు జ్ఞాపకాల తుఫానులోకి పరుగులిడుతోంది.

* * *

'మైకీ, మైకీ, మైకీ' వెర్రిగా అరుస్తున్నారు ప్రజలు. గొంతుచించుకుని అరుస్తున్నారు. వారి రక్తం ఉద్రేకపు ఉప్పెనలా ఎగసిపడుతూంటే ఉగ్రూతలూగుతుంటే, సర్వం మరచి ఆ ఉద్రేక ప్రవాహంలో ఊగిపోతూ అరుస్తున్నారు ప్రజలు. వారి ఉత్తేజం తన రక్తంలో ఉరుకులు పెడుతూంటే ప్రత్యర్థి 'క్రిస్ యూచ్యాంక్'పై పిడుగుల్లాంటి పిడిగుద్దులు కురిపిస్తున్నాడు మైకెల్ వాట్సన్.

కామన్‌వెల్త్ బాక్సింగ్ ఛాంపియన్ మైకెల్ వాట్సన్ 22 యుద్ధాల్లో, 22 మార్లు ప్రత్యర్థులని మట్టి కరిపించాడు. మైకెల్ బాక్సింగ్ యుద్ధం అంటే, తప్పనిసరి ఓటమి అన్న అభిప్రాయం బలపడుతోంది. ఇప్పటికే ప్రత్యర్థి 'క్రిస్ యూచ్యాంగ్'ను చిత్తుచేశాడు మైకెల్. పదకొండవ రౌండ్ ఆరంభమయ్యేసరికి మైకెల్ గెలుపు దాదాపుగా స్థిరమైపోయింది. ప్రజలు మైకెల్ నామజపం చేస్తున్నారు.

ఇంతలో అనుకోనిది జరిగింది.

మైకెల్ దెబ్బకు వెనక్కు తూగిన క్రిస్, ఆధారం వెతుక్కుంటున్నట్టు చేతులు ఆడించాడు. 'కిల్లర్ పంచ్' ఇచ్చేందుకు బలంగా ముందుకు దూకాడు మైకెల్. అతడు ఊహించని రీతిలో క్రిస్ పిడికిలి, మైకెల్ దవడ కింద బలంగా తాకింది. ఆ తాకిడికి మైకెల్ నేలమీద పెద్దశబ్దంతో పడ్డాడు. కోలాహలంగా అరుస్తూన్న ప్రజలు నిశ్శబ్దమై పోయారు. అందరూ నిర్విణ్ణులయ్యారు. రింగ్‌సైడ్ డాక్టర్ తేరుకుని మైదానంలోకి దూకాడు. మైకెల్ స్పృహ తప్పిపడిపోయాడు. మైకెల్‌కు స్పృహ తెప్పించాలని డాక్టర్ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. అరగంటలో అంబులెన్స్ వచ్చింది. మైకెల్ ఆస్పత్రిలో చేరాడు.

* * *

నలభై రోజుల తరువాత కళ్లు తెరిచాడు మైకెల్. కానీ తానేం చూస్తున్నాడో మైకెల్‌కు అర్థంకాలేదు. తాను బతికి వున్నట్టా, మరణించినట్టా అతడికి బోధపడలేదు. అసలు తనకు శరీరం ఉన్న భావనకూడా అతడికి కలగటంలేదు. శరీరం లేకుండా పడి ఆలోచిస్తున్న తానెవరో అతడికి అర్థం కావటంలేదు.

* * *



© EMESCO BOOKS

'మైకెల్, మైకెల్' ఎవరో మృదువుగా పిలుస్తున్నారు. శబ్ద తరంగాలు, చెవినుండి మెదడు చేరి, అక్కడ స్పందనలు కలిగించేసరికి అయిదు నిమిషాలు పట్టింది. అతికష్టం మీద తలను అటువైపుతిప్పాడు మైకెల్. తనను పిలుస్తున్నదెవరో గుర్తించేందుకు మరికొంత సమయం పట్టింది.

'లెన్నార్డ్' పిలిచాననుకున్నాడు మైకెల్. అతడి పెదవులు అతి కష్టంతో కదిలాయి. కానీ శబ్దం బయటకు రాలేదు. మైకెల్ కళ్ల కొసల నుంచి నీటిధార కారసాగింది.

అది చూసి చలించిపోయాడు లెన్నార్డ్.

లెన్నార్డ్ చాలాక్, మైకెల్ ప్రాణస్నేహితులు. అనేకమార్లు లెన్నార్డ్‌ను ప్రమాదాల్లోంచి రక్షించాడు మైకెల్. లెన్నార్డ్ కోసం తన ప్రాణాలను ఫణంగా పెట్టేవాడు మైకెల్. అటువంటి మైకెల్‌ను ఇలాంటి నిస్సహాయ స్థితిలో చూస్తూంటే లెన్నార్డ్ హృదయం ద్రవించి, కంటినీరుగా కారసాగింది.

* * *

ఎనిమిది నెలలయింది. మైకెల్ ప్రపంచాన్ని చూడగలుగుతున్నాడు. వినగలుగుతున్నాడు. ప్రపంచం అతడిని తాకకలుగుతోంది.

"దెబ్బ చాలా సున్నితమైన భాగంలో తగిలింది. మెదడులో రక్తం గడ్డకట్టింది. దాదాపుగా అయిదారుసార్లు మెదడును తెరచి ఆపరేషన్ చేయాల్సి వచ్చింది. నీ ప్రాణం నిలిచింది. కానీ శరీరం చచ్చుబడిపోయింది. నువ్వు ప్రయత్నిస్తే గుసగుసగా మాట్లాడగలవు. నీ ఎడమభాగం పనిచేయదు. చేతులు, కాళ్లు..." లెన్నార్డ్ గొంతు దుఃఖంతో పూడుకుపోయింది. మైకెల్ కంటనీరు పొంగింది. తన కన్నీళ్లు తుడుచుకుని, మైకెల్ కన్నీళ్లను తుడిచాడు లెన్నార్డ్.

"ఇప్పుడు ఊపిరి పీల్చటం తప్ప నా అంతట నేను ఏమీ చేయలేనన్నమాట. దానిమీద కూడా నాకెటువంటి నియంత్రణ లేదు కదా!" అస్పష్టంగా, గుసగుసగా అన్నాడు మైకెల్. ఆ మాటలు అనటానికి ఎంతో ప్రయాస పడాల్సివచ్చింది అతడికి.

మైకెల్ కుడిచేయిని గట్టిగా పట్టుకున్నాడు లెన్నార్డ్.

"మైకెల్, నీ ఎడమభాగం పనిచేయదని బాధపడకు. నేను నీ ఎడమ చేతిని, కాలును అనుకో. నేను నీతో ఉండేందుకు నా ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేశాను. నీ పని చేయని ఎడమభాగం నేనవుతా."

మైకెల్ కళ్ళలోంచి కన్నీరు జలజలా రాలింది.

* * *



© EMESCO BOOKS

మైకెల్ తోడునీడగా లెన్నార్డ్ నిలిచాడు. డాక్టర్లు చెప్పినట్టు ఎక్సర్‌సైజులు చేయించాడు. అనుక్షణం తోడుండి కంటికి రెప్పలా కాపాడసాగాడు. లెన్నార్డ్ భుజంపై చేయివేసి నెమ్మదిగా నడవటం అలవాటయింది మైకెల్‌కు. కుడికాలు ముందుకువేసి, లెన్నార్డ్ సహాయంతో ఎడమకాలును వేసి, ముందుకు కదల్చేవాడు మైకెల్. కొన్నాళ్ల తరువాత, లెన్నార్డ్ పక్కన నిలబడితే, కుడికాలు కదిపి, ఎడమకాలు లాగి, ముందుకు నడవటం ఆరంభించాడు. అలా కాస్త దూరం నడవగానే చెమటలుపట్టేవి. చెమట తుడిచేవాడు లెన్నార్డ్. పట్టుతప్పి పడబోతూంటే మైకెల్‌ను పట్టి ఆపేవాడతను. 'నేనిక నడవలేను' అని మైకెల్ మొండికేస్తే, బతిమిలాడి, బుజ్జగించి ఇంకో అడుగు ముందుకు వేయించేవాడు.

ఓ రోజు మైకెల్‌కు విసుగు వచ్చింది.

"నాకీ బతుకువద్దు. నేను చచ్చిపోతాను. దేవుడా ఈ శిక్షణ నాకే ఎందుకు విధించావు" అని అరుస్తూ పెద్దగా ఏడిచాడు.

మౌనంగా చూస్తూ నిలబడ్డాడు లెన్నార్డ్. ఏడుపు పూర్తయిన తరువాత మైకెల్ ముఖం తుడుస్తూ మెల్లిగా, సూటిగా అడిగాడు. "బాక్సింగ్ రింగ్‌లో ప్రత్యర్థిని చిత్తుచేస్తూ, నెగ్గుతున్నప్పుడు నువ్వెప్పుడైనా దేవుడిని గెలిచేందుకు నన్నే ఎందుకు ఎన్నుకున్నావు?' అని ప్రశ్నించావా? గెలుస్తున్నంత కాలం ఆ ప్రశ్న వేయని నీకు, ఇప్పుడెందుకు దేవుడా ఈ బాధ అనుభవించాలని నన్నే ఎందుకు ఎన్నుకున్నావని' అడగాలని అనిపిస్తోంది?"

మైకెల్ మౌనంగా ఉండిపోయాడు. లెన్నార్డ్ ప్రశ్న మైకెల్‌లో ఆలోచన కలిగించింది 'అవును. అంతా సక్రమంగా జరుగుతున్నంత కాలం నా గొప్ప అని విర్రవీగాను. ఇలా అవగానే దోషం దేవుడిపైన నెట్టివేస్తున్నాను. అయినా, ఇప్పుడు మాత్రం ఏమైంది? ఎడమభాగం చచ్చుపడింది. కానీ లెన్నార్డ్ స్నేహం దొరికింది. ఈ స్నేహితుడి అండతో ఎంతదూరమైనా నడుస్తాడు. ఎన్ని కష్టాలైనా అధిగమిస్తాడు. ఆంతకాలం తన శారీరక దౌర్బల్యం గురించి ఆలోచిస్తూ కుమిలిపోయాడు. కానీ కొండంత స్నేహితుడి అండనిచ్చిన భగవంతుడి కరుణను గుర్తించలేదు. ఇటువంటి సమయంలో ఇలా అండగా నిలిచే మిత్రుడు లభించే అదృష్టం ఎందరికుంటుంది? ఇంత అండగా ఎవరు నిలుస్తారు?'

* * *

'బ్రెయిన్ అండ్ స్పైన్ ఫౌండేషన్' మెరథాన్ వార్త చూసిన మైకెల్ లెన్నార్డ్‌వైపు తిరిగాడు. "నేనీ మెరథాన్ పరుగుపందెంలో పాల్గొంటాను. నావల్ల నాలాంటి వారికి నాకు చేతనైనంత లాభం కలుగచేస్తాను" అన్నాడు స్థిరంగా. తన మిత్రుడివైపు నిశితంగా చూశాడు లెన్నార్డ్.

"ఉద్దేశం మంచిదే. కానీ అందరి అంత వేగంగా నడవలేవు. 42 కిలోమీటర్లు నడవాలంటే ఎంత కాలం పడుతుందో, నువ్వెంత శ్రమపడాల్సివస్తుందో ఆలోచించావా?"



© EMESCO BOOKS

"ఎన్ని రోజులు పట్టినా సరే. నా పరిస్థితిలో ఉన్నవాడు పట్టుదలగా నడవటం, నాలాంటి స్థితిలో ఉన్నవారికి ఎంత శక్తినిస్తుందో ఆలోచించాను. ఈ స్థితిలో ఉండి కూడా ఒక సామాజిక కార్యం కోసం నేను నడవటం, ఎంతమంది హృదయాలను కదిలిస్తుందో ఆలోచించాను. ఇది ఎంతమందికి స్ఫూర్తినిస్తుందో ఆలోచించాను. మన కథ ప్రపంచానికి తెలిస్తే, ఎంత మందిలో అది మంచి ఆలోచనలు కలిగిస్తుందో కూడా ఆలోచించాను" నిశ్చయంగా అన్నాడు మైకెల్.

మైకెల్ మాటలు వింటున్న లెన్నార్డ్ హృదయం స్పందించింది.

'తనకోసమే బతికేవాడు మామూలు మనిషి. తన కష్టాలను ఇతరుల సౌఖ్యానికి బాటగా మలచాలనుకునే వాడు అసలైన మనిషి' అనుకున్నాడు మనసులో.

* * *

లండన్ మెరథాన్ పరుగుపందెం ఆరంభమైంది.

అయిదు నిమిషాల్లో మైకెల్, లెన్నార్డ్‌లు ఒంటరిగా మిగిలారు. ఎడమకాలిని లాక్కుంటూ, కుడికాలితో నడుస్తున్న మైకెల్‌ను ముందు ఎవరూ పట్టించుకోలేదు.

తరువాత 'చివరగా వస్తున్నదెవరు?' అని చూశారు.

'ఒకప్పటి పేరు పొందిన బాక్సర్ మైకెల్ వాట్సన్. తన అంగవైకల్యాన్ని జయించి, తన తోటి సోదరులకోసం పరుగుపందెంలో పాల్గొంటున్నాడన్న వార్త తెలిసేసరికి అందరి దృష్టి మైకెల్‌పై పడింది.

అతడు భారంగా వేస్తున్న ప్రతి అడుగు లండన్ ప్రజల గుండెల్లో ప్రతిధ్వనించసాగింది. నెమ్మదిగా మైకెల్ గురించిన వార్త కార్చిచ్చులా లండన్‌లో వ్యాపించింది.

మొదటిరోజు కేవలం రెండు కిలోమీటర్లు మాత్రమే నడవగలిగాడు మైకెల్. రెండోరోజు మైకెల్ రోడ్డుమీదకు వచ్చేసరికి జనం బారులు తీరి నుంచున్నారు. అతడి 'షేక్‌హ్యాండ్'కోసం ఉరుకులు, పరుగులు పెట్టారు.

ఇది చూసిన మైకెల్‌కు ఆలోచన వచ్చింది. తన 'షేక్‌హాండ్'కు వెల నిర్ణయించాడు. అయినా ప్రజలు సంతోషంగా మైకెల్‌ను అభినందించసాగారు. మైకెల్‌కోసం ఎదురుచూసేవారు.

సమయం వ్యర్థం కాకుండా ఉండేందుకు ముందే డబ్బులు జమచేసి ఉంచేవారు. ఆ దారిన మైకెల్ రాగానే డబ్బులందించేవారు.

అభినందించి, ప్రోత్సహించేవారు.

అలా అయిదు రోజులుగా నడుస్తూ మైకెల్, ప్రజల మనస్సాక్షిని తట్టిలేపాడు. మానవత్వాన్ని కదిలించాడు. జనం తండోపతండాలుగా వచ్చారు. విరివిగా విరాళాలు ఇచ్చారు.



© EMESCO BOOKS

మైకెల్ కాలు మొత్తం నడకకు చిట్లిపోయింది.

నేలమీద లాగుతూ నడవటం వల్ల ఎడమకాలు చెక్కుకుపోయి రక్తం కారుతోంది. అయినా మైకెల్ నడవటం ఆపలేదు. ఓపిక లేనపుడు లెన్నార్డ్ భుజం ఆధారం తీసుకుని నడిచాడు.

అలా అయిదోరోజు అయ్యేసరికి గమ్యం దగ్గరపడింది.

గమ్యం దగ్గర ప్రజలు మైకెల్ ప్రతి అడుగుకూ చప్పట్లు కొట్టి ప్రోత్సాహపరిచారు. అసలు మెరథాన్ అయిపోయినా, మైకెల్‌కోసం ప్రత్యేకంగా రిబ్బన్ కట్టారు. మైకెల్ గమ్యం చేరేసరికి మైకెల్ ఘన విజయం సాధించినట్టు ప్రజలు కేకలు వేశారు. సంబరాలు జరిపారు.

మైకెల్ సైతం చేతులెత్తి ప్రజల జయజయధ్వానాలు స్వీకరించాడు.

అయిదు రోజుల్లో మైకెల్ రెండు కోట్ల రూపాయలపైన విరాళాలను వసూలు చేశాడు.

'డబ్బుకన్నా మైకెల్ ప్రజలకు ఇచ్చిన స్ఫూర్తి ఎంతో విలువైంది' అని ప్రధాని వ్యాఖ్యానించాడు.

'నేను బాక్సింగ్‌లో గెలుస్తున్నప్పుడు ప్రజలు అందించిన అభినందనలకు ఈనాడు నేను అందుకుంటున్న అభినందనలకు చాలా తేడా ఉంది. ఆనాడు ప్రజలు నా శక్తికి, నా రాక్షసత్వానికి జేజేలు పలికారు. ఇప్పుడు అలా కాదు. నా మానవత్వానికి, 'నేను జాగృతం చేసిన మానవతకు నీరాజనాలు పలుకుతున్నారు. బాక్సింగ్ విజయాలకన్నా ఈ విజయం నన్ను మనిషిని చేసింది' అన్నాడు మైకెల్ ప్రజల నీరాజనాలు స్వీకరిస్తూ.

© EMESCO BOOKS

# ఒక అర్ధరాత్రి కథ

**నిజం నిప్పులాంటిది, దానిని కప్పి ఉంచలేం.**
**ఇరవై అయిదేళ్ళు తరువాత బయటపడి**
**నేరస్తులను శిక్షించిన 'నిజం' కథ.**

**అది** 2001. తమ అధికారివైపు ఆశ్చర్యంగా చూశారు స్టీవ్‌జేమ్స్, చిల్‌వాల్‌లు. తాము విన్నది నిజమేనని నిర్ధారించుకునేందుకు మరోసారి అడిగారు.

"హార్మన్ హత్యకేసును మాకు అప్పగిస్తున్నారా?"

'అవును' అన్నట్టుగా తలూపాడు వాళ్ల అధికారి.

"ఇది మీ శిక్షణలో భాగమే. ఆధునిక నేరపరిశోధనా పద్ధతులు ఉపయోగిస్తూ, గతంలో పరిష్కారం కాని కేసులను సాధించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. పాతకేసులను పరిశోధించటం వల్ల కొన్ని లాభాలున్నాయి. మీకు పరిశోధన పద్ధతి తెలుస్తుంది. పాత డిటెక్టివ్‌లు ఎక్కడ పొరపడ్డారో గ్రహించి, మీరు అటువంటి పొరపాట్లు చేయకుండా ఉండే వీలుంటుంది. నేరస్తులు ఎలా నేరం చేసి శిక్షనుంచి తప్పించుకోగలరో అర్థమౌతుంది. ఇవన్నీ కాక మరో ముఖ్యమైన సత్యం మీరు గ్రహిస్తారు."

"ఏమిటది?" ఇద్దరు యువ డిటెక్టివ్‌లు ఆసక్తిగా అడిగారు.

"నేరం చేసిన వాడికిపడే శిక్షకన్నా, వాడి నేర ఫలితాన్ని అనుభవించే వారివేదన వెయ్యిరెట్లు అధికం. కాబట్టి ఒక్క నేరస్తుడు శిక్ష పడకుండా తప్పించుకుంటే, అనేక కుటుంబాల ఆవేదన అనంతంగా సాగుతుందనటమేకాదు, ఇంకా అనేక కుటుంబాలు వేదనకు గురయ్యే ప్రమాదం కూడా ఉంటుంది."

అతని మాటలలోని అర్థం, వారిద్దరికీ హార్మన్ హత్యకేసు పరిశోధన పూర్తయ్యే సరికి సంపూర్ణంగా అర్థమయింది.

* * *

© EMESCO BOOKS

హార్మన్ కేసు వివరాలు తెలుసుకుంటున్నకొద్దీ జేమ్స్, చిల్‌ల ఆశ్చర్యానికి అంతులేకుండా పోతోంది.

''ఇంత స్పష్టంగా తెలుస్తోంది నేరస్తులెవరో? కానీ వారే నేరం చేశారని నిరూపించలేకపోతున్నాం" అన్నాడు జేమ్స్.

"ఇరవై ఏళ్లుగా నేరస్తులు స్వేచ్ఛగా తిరుగుతున్నారు. అసలు తామునేరం చేశామని కూడా మరచిపోయి ఉంటారు" అన్నాడు బిల్.

"ఎలాగైనా మనం నేరం నిరూపించి వాళ్లని కటకటాల వెనుకకు తోయాలి" నిశ్చయంగా అన్నాడు జేమ్స్.

ఇద్దరూ హార్మన్ ఫైలును క్షణ్ణంగా పరిశీలించారు. ఎవరెవరిని కలవాలో, ఏమేం ప్రశ్నలు అడగాలో రాసుకున్నారు.

పరిశోధన సమయంలో పోలీసులు సేకరించిన సమాచారాన్ని, రుజువులను పరిశీలించారు.

"ముందుగా మనం కలవాల్సింది గేల్‌బెర్గ్‌స్ట్రాండ్, రిచర్డ్‌లని" చెప్పాడు జేమ్స్. వాళ్ల అడ్రసు ఉన్న కాగితాన్ని జేమ్స్ ముందుకుతోశాడు చిల్.

"నేను పాల్ మోరిసన్‌ను కలుస్తాను. హత్య జరిగిన స్థలాన్ని పరిశీలించిన డిస్ట్రిక్ట్ అటార్నీ అతడు."

ఇద్దరూ ఒకరికొకరు 'గుడ్‌లక్' చెప్పుకుని తమ దారుల్లో సాగారు.

* * *

"ఫిబ్రవరి 28, 1982 అర్ధరాత్రి రెండున్నర గంటలకు గేల్‌కు హఠాత్తుగా మెలకువ వచ్చింది. పక్కింట్లో ఏదో గొడవ జరుగుతున్నట్టు శబ్దాలు వినిపించాయి. ఎవరో ఎవరినో దబదబా బాదుతున్నట్టు, నేల మీద పడేసి లాగుతున్నట్టు 'ధబీధబీ' మంటూ శబ్దాలు వినిపించాయి.

నోట్సు చూసి చెప్పాడు జేమ్స్.

"పక్కింట్లో అలా శబ్దాలు వినిపిస్తున్నా గేల్ దంపతులు ఏమీ చేయలేదా? ప్రశ్నించాడు చిల్.

"నాకూ అదే సందేహం వచ్చింది. కానీ పక్కింటి విషయాల్లో జోక్యం చేసుకోవటం మర్యాద కాదని ఆగారట. అదీకాక అరుపులు, కేకలు ఏవీ వినిపించకపోవటంతో, ఇంట్లో ఏదో సర్దుతున్నారేమోనన్న అనుమానంతో ఆగారట."

తల ఊపాడు చిల్. కొనసాగించాడు జేమ్స్.

"శబ్దాలు వినిపించిన గంట తరువాత పక్కింట్లో ఉండే మెలిండా హార్మన్ పరుగెత్తుకుంటూ వచ్చి గేల్ ఇంటి తలుపులు బాదింది. తలుపు తెరిచిన గేల్‌కు దవడ వాచి ఉన్న మెలిండా



© EMESCO BOOKS

కనిపించింది. ఆమె నైట్‌గౌన్‌పై రక్తం మరకలున్నాయి. ఎవరో ఇద్దరు ఆగంతకులు ముసుగు వేసుకుని ఇంట్లోకి దూరారని, తన భర్తను చితకబాది, ఆయన దగ్గర నుంచి బ్యాంకు తాళం చెవులు ఎత్తుకుపోయారని ఏడుస్తూ చెప్పింది. వాళ్లు కొట్టిన దెబ్బలకు తను స్పృహ కోల్పోయిందని, లేచేసరికి తన భర్త మరణించిపడి ఉన్నాడని చెప్పింది. వెంటనే గేల్ దంపతులు పోలీసులకు ఫోన్ చేశారు" ఆగాడు జేమ్స్.

అక్కడి నుంచి అందుకున్నాడు చిల్.

"తన జీవితంలో అంత ఘోరమైన హత్య చూడలేదన్నాడు పాల్ మోరిసన్. అతని మొదటి హత్యకేసు కావటంతో ప్రతి చిన్న విషయం అతడికి స్పష్టంగా గుర్తుంది. గదినిండా రక్తం వెదజల్లి ఉంది. డేవిడ్ హార్మన్ ముఖం గుర్తుపట్టలేనంతగా పచ్చడి పచ్చడిగా కొట్టారు. గది సీలింగ్‌పైనా, గోడలపైనా నేలమీద ఎక్కడ చూసినా రక్తమే' ఆ దృశ్యాన్ని ఊహిస్తున్నట్లు కళ్లు మూసుకున్నాడు చిల్.

"నేను డిటెక్టివ్ 'జో ప్రుయెట్'ని కలిశాను. మెలిండాను ప్రశ్నించేందుకు వెళ్లిన 'జో', మెలిండాతోపాటు మార్క్ మాంగెల్‌డోర్ఫ్ ఉండటం చూశాడు. మెలిండా, డేవిడ్‌ల స్నేహితుడు మార్క్. కష్ట సమయంలో తన స్నేహితులకు అండగా వచ్చాడని అనుకున్నాడో జో. కానీ కాస్సేపు వాళ్లతో మాట్లాడిన తరువాత 'జో'కు వాళ్లిద్దరి మీదా అనుమానం వచ్చింది. జరిగిన సంఘటన గురించి మెలిండా చెప్తున్నకొద్దీ వాళ్లపై జో అనుమానం పెరిగిపోయింది. ఇద్దరు దొంగతనంగా ఇంట్లో ప్రవేశించినప్పుడు మెలిండా భయంతో అరవలేదు. ఆమె భర్తను చితక బాదుతున్నప్పుడూ ఆమె అరవలేదు. కనీసం అరుపులు, కేకలు పెట్టాలన్న ఆలోచనకూడా రాలేదు. వాళ్లు ఒక దెబ్బ కొట్టగానే స్పృహ కోల్పోయింది. ఇంతకీ ఆమెకు తగిలిన దెబ్బ ఏమిటంటే – కాస్త దవడ వాయటం...

... పైగా, అంత అర్ధరాత్రి మార్క్ స్నానం చేసివచ్చినట్టు తెలుస్తోంది. అంత అర్ధరాత్రి స్నానం చేయాల్సిన అవసరం ఏముంది? ఇంకో ముఖ్యమైన విషయం ఏమిటంటే, దొంగలు ఇంట్లోకి వచ్చి డేవిడ్‌ను బ్యాంకు తాళం చెవులకోసం బెదిరించటం కూడా ఎవరూ వినలేదు...

దీన్నిబట్టి ఏం తెలుస్తోందంటే, జరిగేదంతా గుట్టు చప్పుడు కాకుండా జరిగిపోయింది. ఆ తరువాత మొగుడిని కొట్టి మొరపెట్టుకున్నట్టు, డేవిడ్‌ని చంపి మెలిండా, మార్క్‌లు ఎవరో హత్య చేశారని కట్టుకథలు అల్లి తప్పించు కోవాలనుకున్నారు. ఇంతవరకూ తప్పించుకున్నారు" నిట్టూర్చాడు చిల్.

"దొంగలు తలుపులు విరగ్గొట్టి లోపలకు వచ్చారా? లేక?..." అడిగాడు జేమ్స్.

"అటువంటి దాఖలాలేవీ లేవు. అందుకే ప్రశ్నించటం ఆరంభించిన ఇరవై నిమిషాల్లో తాను హంతకులతో మాట్లాడుతున్నానని జో గ్రహించాడు. కానీ ఇరవై ఏళ్లయింది. ఇంకా వాళ్లే హంతకులని నిరూపించలేకపోతున్నాం" నిరాశగా అన్నాడు చిల్.

"అప్పుడు డిఎన్ఎ పరీక్ష పద్ధతిలేదు. ఇప్పుడు వచ్చినా లాభం లేకుండా పోయింది. ఎందుకంటే, మార్క్ అపార్ట్‌మెంట్‌లో దొరికిన రక్తం మరకలు ఇరవై ఏళ్లుగా దాచి ఉంచేసరికి పరీక్షకు పనికి రాకుండా పోయాయి" చెప్పాడు జేమ్స్.



© EMESCO BOOKS

"మరిప్పుడు మనం చేసేదేముంది? కేసు మూసేయటమేనా?" అడిగాడు చిల్.

"అంత త్వరగా నిరాశపడతామా? సరే... మెలిండా, మార్క్‌లు కలసి డేవిడ్‌ను హత్య చేశారని అనుకుందాం. కానీ హత్య చేయటానికి ఏదో కారణం ఉండాలి కదా?" ఆలోచిస్తూ అన్నాడు జేమ్స్.

"అదీ దొరకటం లేదు. మిలిండా, మార్క్‌లిద్దరికీ ఏదో సంబంధం ఉందని అనుకునేందుకు వీలు లేకుండా పోయింది. మిలిండా, డేవిడ్‌లకు పెళ్లయి అయిదేళ్లే అయింది. ఇద్దరూ అన్యోన్యంగా ఉండేవారు. డేవిడ్‌కు పెద్ద ఇన్సూరెన్స్‌లేదు. అంటే, డబ్బుకోసం ఈ హత్య జరగలేదు. హత్య జరిగిన తరువాత మిలిండా, మార్క్‌లు పెద్దగా కలసినట్టు కనబడదు. కొన్నేళ్ల తరువాత మిలిండా, రైస్ అనే అతడిని పెళ్లిచేసుకుంది. వారికిద్దరు పిల్లలు. మార్క్ క్రిష్టినా అనే ఆమెను పెళ్లి చేసుకున్నాడు. ఇప్పుడు క్రిష్టినా గర్భవతి. అంటే, ఇద్దరూ ఎవరి దారుల్లో వారు ప్రయాణిస్తున్నారు. సుఖంగా, ప్రశాంతంగా జీవితం సాగిస్తున్నారు. మరి, హత్యకు కారణం ఏమై ఉంటుంది?" అన్నాడు చిల్.

"మనలో మనం తర్జనభర్జనలు పడి లాభంలేదు. వాళ్లే హంతకులని తెలుస్తూనే ఉన్నా వాళ్ల నేరం నిరూపించలేకపోవటం మన అసమర్థతను చూపిస్తుంది. మనం మిలిండాను కలసి మాట్లాడితే?" అడిగాడు జేమ్స్.

"ప్రయత్నిద్దాం. కానీ ఏమీ లాభం ఉండదేమో" అన్నాడు చిల్.

"చూద్దాం!..." అంటూ లేచాడు జేమ్స్.

* * *

తలుపు తెరిచిన మిలిండా ఎదురుగా అపరిచితులు కనబడటంతో ఒక అడుగు వెనక్కు వేసి–

"ఎవరు మీరు?" అనడిగింది.

నవ్వాడు జేమ్స్.

"డేవిడ్ హెర్మన్ హత్యకేసును పరిశోధిస్తున్న డిటెక్టివ్‌లం" అన్నాడు.

మిలిండా ముఖం మాడిపోయింది.

"నాకేం తెలియదు. ఎవడో ముసుగు దొంగ ఇంట్లోకి దూరాడు. అయినా ఇది జరిగి ఇరవై ఏళ్లయిందే..." గబగబా అంది మిలిండా.

"నేరం చేసిన వాడికి శిక్ష పడుతుందంటాడు భగవంతుడు" అన్నాడు.

"నేరం చేసి మనిషి తప్పించుకున్నా, భగవంతుడి దృష్టినుంచి ఏమీ దాచలేదు" అన్నాడు జేమ్స్.

ఆమె చేతిలోని బైబిల్‌ను చూస్తున్నారు ఇద్దరూ. ఆమెలో భగవంతుడి గురించి భయం కలిగించాలన్న ప్రయత్నం అది.



© EMESCO BOOKS

"ఇంతకీ డేవిడ్‌ను చంపింది ఒకరా? ఇద్దరా?" అడిగాడు చిల్.

ఆమె అయోమయంగా ఇద్దరివైపు చూసింది. ఆమెకు ఆలోచించే సమయం ఇవ్వటంలేదు వాళ్లు.

"ఒకరే" అంది మిలిండా.

"ఎవరూ మార్క్ చంపాడా?" అడిగాడు చిల్.

"ముందు ఇంట్లోకి ఇద్దరు జొరబడ్డారని చెప్పారు?" అడిగాడు జేమ్స్.

"లేదు ఒక్కరే" స్థిరంగా అంది మిలిండా.

"మీరు అల్లిన కట్టుకథ ఇరవై ఏళ్ళవటం వల్ల మరచిపోయారు కదా" అడిగాడు చిల్.

"లేదు. మీరు నిజం చెప్తున్నారు. డేవిడ్‌ని చంపింది ఇద్దరు. ఒకరు మార్క్, మరొకరు మిలిండా" బెదిరిస్తున్నట్టు అన్నాడు జేమ్స్.

"అబద్ధం" అరిచింది మిలిండా.

"మాకు మార్క్ నిజం చెప్పాడు. మీరు చేసిన నేరం మీ మెడకు చుట్టుకునేందుకు ఇరవైఏళ్లు పట్టింది. నిన్ను అరెస్టు చేయటానికి వచ్చాం" చెప్పాడు చిల్.

భోరుమంది మిలిండా.

''నాకు తెలీదు. అంతా మార్క్ చేశాడు. నేను డేవిడ్‌తో కలసి ఉండటం భరించలేకపోయాడు. అసూయతో రగిలిపోయాడు. డేవిడ్‌కి విడాకులు ఇవ్వటం మత విరుద్ధం. అందుకని నేను ఒప్పుకోలేదు. దాంతో ఒకరోజు ఇంట్లో దూరి డేవిడ్‌ను కొట్టి చంపేశాడు. అందుకే నేను మార్క్‌తో సంబంధం వదులుకున్నాను. 'ఈ విషయం తెలిస్తే నా భర్త ఏమంటాడు? నా పిల్లలు నా గురించి ఏమనుకుంటారు?" ఏడవసాగింది మిలిండా.

* * *

మే12, 2006.

మిలిండాకు కోర్టు ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. మార్క్‌కు యావజ్జీవకారాగార శిక్షపడింది.

"నేరస్తుడు తను చేసిన నేరానికి ఎప్పటికైనా శిక్ష అనుభవించి తీరతాడు" అంటాడు జేమ్స్. ఈ కేసు గుర్తుకు వచ్చినప్పుడల్లా.

"నేరం చేసి కూడా వారు ఇరవైయేళ్లు హాయిగా జీవించారు. ఇప్పుడు జైలుపాలవటం మరీ దుర్భరమైన శిక్ష. కానీ ఏ నేరం చేశాడని డేవిడ్ జీవితం అర్థాంతరంగా ముగిసింది? అందుకే నేరం చేసిన వాడికన్నా నేరానికి గురయిన వాడికే ఎక్కువ నష్టం జరుగుతుంది. ఆ నష్టం కలగకుండా ఆపటం మన సామాజిక బాధ్యత" అంటాడు చిల్.

అలా నేరస్థులు మొత్తానికి కటకటాల పాలయ్యారు.



© EMESCO BOOKS

# 'ఎవరికీ తలవంచని' విజేత

**"తవలంచలేదపుడు, వంచబోము ముందెపుడు"**
**అని నిరూపించి, ముందుకు సాగిన ఒంటరి మహిళ కథ**

**నవంబర్** 6, 1993.

"మనం దుకాణం మూసేద్దాం" మొండిగా అంది ఆన్.

ఆమెవైపు చూసి నవ్వాడు ఆండ్రే.

కానీ తన పని ఆపలేదు. అతను దుకాణం తెరవటానికే సిద్ధమౌతున్నాడు.

"నా మాటలు వినలేదా? విన్నా విననట్టు నటిస్తున్నారా?" కోపంగా అడిగింది ఆన్.

"చూడు ఆన్, కష్టాలకు కదిలిపోయే వారు బలహీనమైన వారు. ఎదురు నిలిచి పోరాడేవారు బలవత్తరులు. కష్టాలను అధిగమించే వారు ఉత్తములు. మనం ఉత్తములుగా ఎదిగే ప్రయత్నం చేయాలి. కనీసం బలవత్తరుల్లానైనా నిలబడాలి. కానీ బలహీనుల్లా, కష్టాలకు భయపడి పారిపోకూడదు" శాంతంగా అన్నాడు ఆండ్రే.

"సిద్ధాంతాలు మాటల్లో చెప్పేందుకు బాగానే ఉంటాయి. ఆచరించేటప్పుడు అసలు రంగు బయటపడుతుంది" నిరసనగా అంది ఆన్.

"నేనూ అదే అంటున్నాను. ఎవరో ఆలోచనలు లేనివాళ్ళు, మెదడు ఎదగని వాళ్ళు బెదిరిస్తే, మనం బెదిరి పారిపోతామా? దుకాణం మూసేసి, వాళ్లకి మనం భయపడుతున్నామని ఎలుగెత్తి చాటుతామా?"

"వాళ్లు మెదడు ఎదగనివాళ్లు. అదే నా భయం. మన దుకాణాన్ని దొంగిలించాలని ప్రయత్నించటం నగరంలో యువకులకి ఓ ఆటైపోయింది. మన దుకాణాన్ని దొంగిలించే విషయంలో పందాలు కట్టుకుంటున్నారట. పోటీలు పడుతున్నారట. ఇటువంటి పరిస్థితిలో ఆ దుకాణాన్ని నడపటం వల్ల లాభం కన్నా నష్టమే ఎక్కువ ఉంది" వారిచింది ఆన్.

"పిచ్చివాళ్లు. వాళ్లేం చేయగలరు? ఇప్పటికి 18 సార్లు దొంగతనం ప్రయత్నాలు జరిగాయి. ఒక్కసారన్నా వాళ్లు పూచికపుల్ల అయినా తీసుకువెళ్లగలిగారా?"

© EMESCO BOOKS

"ఇకపై తీసుకువెళ్లరన్న గ్యారంటీ ఏమిటి? మొన్న ఆ ముగ్గురు పిల్లల సంఘటన జరిగినప్పటినుంచీ నాకు నిద్రపట్టటంలేదు" దాదాపుగా ఏడుస్తున్నట్టు అంది ఆన్.

"ఏ ముగ్గురు పిల్లలు?" అడిగాడు ఆంద్రే. 'అప్పుడే మరచిపోయారా? నేను కౌంటర్‌లో ఉన్నప్పుడు, ముసుగు వేసుకున్న ముగ్గురు పిల్లలు తుపాకులు పట్టుకు వచ్చారు. డబ్బిమ్మని బెదిరించారు."

ఆన్ మాటలకు పెద్దగా నవ్వాడు ఆంద్రే.

"వాళ్లని బెదిరించి పంపించేశాను మరచిపోయావా? బయటికి వెళ్లి ఆడుకోమని చెప్పాను. అసలు తుపాకులు ప్రమాదకరం. బొమ్మ తుపాకులతో ఆడుకోమని తరిమేశాను. అటువంటి వాళ్లని చూసి బెదరాల్సిన పనిలేదు."

"నాకు అటువంటి వాళ్లగురించి భయంలేదు. కానీ ఇంతకాలం కత్తులు పట్టుకుని వచ్చే దొంగలు, ఇప్పుడు తుపాకులు పట్టుకువస్తున్నారు. ప్రతిసారీ వాళ్లు మీ మాటలు వింటారని నమ్మకం ఏమిటి? ప్రాణాన్ని ఇంత ప్రమాదంలో పడేసి అక్కడే ఆ దుకాణం నడపాల్సిన అవసరం ఏముంది?"

"మన దుకాణం మంచి ప్రదేశంలో ఉంది. వ్యాపారం బాగా నడుస్తోంది. పైగా మన దుకాణం మంచి ఫేమస్ అయింది. వీళ్ల విఫల దొంగతనాల ప్రయత్నాలు మనకు మంచి ప్రచారాన్నిచ్చాయి. మొత్తం నగరంలో మనకు మంచి పేరుంది. నాతో మాట్లాడేందుకు దూరదూరాల నుంచి దుకాణానికి వచ్చి ఏదో ఒకటి కొనివెళ్తున్నారు. అటువంటప్పుడు, చిన్నపిల్లల ఆకతాయి పనులకు బెదురుతామా?" అంటూ నెదర్లాండ్స్‌లో బాగా ప్రాచుర్యం పొందినపాట పాడటం ఆరంభించాడు. 'ఎవరికీ తలవంచకు. ఎదురు నిలచి పోరాడు. ప్రాణాలు పోయినా ఫరవాలేదు. బెదిరింపులకు లొంగకు. ప్రాణాలు పోసేదీ, తీసేదీ భగవంతుడే అయినప్పుడు, మామూలు మనుషులను చూసి భయపడకు' అని అర్థం వచ్చే పాట అది.

'ఆంద్రే'కు అతి ఇష్టమైన పాట అది. అతని దుకాణంలో రాత్రింబగళ్లు అదే పాట మోగిస్తుంటాడని ఆన్‌కు తెలుసు. అంతెందుకు తమ నగరంలో, ఆ పాట వినిపిస్తే చాలు, మనుషులు ఆంద్రేని గుర్తు చేసుకుంటారనీ ఆన్‌కు తెలుసు. ఆన్ ఏమీ మాట్లాడలేదు. మూతి బిగించి లోపలకు వెళ్ళిపోయింది. నవ్వుకుంటూ బయటకు వెళ్లాడు ఆంద్రే.

కానీ ఆంద్రే ప్రాణాలతో ఇంటికి తిరిగిరాలేదు. ఆ రోజు మధ్యాహ్నం ఫోన్ వచ్చింది.

"ఎవరో ఆంద్రేని కాల్చి చంపారు. దుకాణంలో డబ్బు దొంగిలించారు" ఫోన్‌లో మాట వింటూనే ఆన్ కుప్పకూలిపోయింది.

* * *

ఆంద్రే మరణవార్త తెలిసిన ఆన్ స్పృహ కోల్పోయింది. వారం తర్వాత కానీ ఆమెకు తెలివిరాలేదు. స్పృహ వచ్చిన వెంటనే ఆమె మాట్లాడిన మొదటిమాట–

© EMESCO BOOKS

"దుకాణం మూసేద్దాం, ఆంద్రేను బలిగొన్న ఆ దుకాణం మనకనవసరం."

"వద్దమ్మా. దుకాణం నడపటం నాన్నగారికి ఇష్టమైనపని. దుకాణం మూసేయటం అంటే, నాన్నగారి మాటను వ్యతిరేకించినట్టే" తన మాటని కాదంటున్న కూతురివైపు కోపంగా చూసింది ఆన్.

"ఆంద్రే అంటే నీకన్నా ఎక్కువ ప్రేమ ఉంది. కానీ ఏం లాభం? అతడిని రక్షించుకోలేక పోయాను. దుకాణం అతడిని బలిగొంది. ఇప్పుడు ఇంకా ఎవరిని దానికి బలి ఇమ్మంటావు?" కూతురిపై అరిచింది ఆన్.

ఆమె మాట్లాడలేదు.

"దుకాణాన్ని నేను నడుపుతాను" అని విసవిసా వెళ్తూ టేప్ రికార్డర్ 'ఆన్' చేసింది.

దాన్లో ఆంద్రేకి ఇష్టమైన 'ఎవరికీ తలవంచకు' పాట వస్తోంది పాట వింటున్న ఆన్ కళ్లలోంచి నీటిధార పొంగసాగింది.

ఆన్ దుకాణం తెరవటం చూసి అందరూ ఆశ్చర్యపోయారు. ఒకరొకరూ వచ్చి తమ సానుభూతిని తెలపటం మొదలుపెట్టారు.

"దొంగలకు భయపడటం అంటే వారి శక్తికి మనం లొంగినట్టవుతుంది. ధైర్యంగా నిలబడటం వల్ల వారు బలహీనులని నిరూపించినట్టువుతుంది" పోలీసు అధికారి వచ్చి ధైర్యం చెప్పాడు.

ఆ నగరంలోని కొందరు పౌరులు, స్వచ్ఛందంగా దుకాణానికి కాపలా కాసేందుకు ముందుకు వచ్చారు.

ఇదంతా చూసిన ఆన్‌కు ధైర్యం వచ్చింది. ఆంద్రే మాటలలోని నిజం గ్రహింపుకు వచ్చింది.

"ప్రజలు ధైర్యంగా నిలబడి పోరాడే వాళ్లకోసం ఎదురుచూస్తుంటారు. తమకు అలా నిలబడి పోరాడాలని ఉన్నా వారు పోరాడలేరు. అందుకే ఎవరైనా ధైర్యం చేస్తే వారికి అండగా నిలుస్తారు. దాంతో సమాజం మొత్తం ధైర్యవంతులమయం అవుతుంది" అనేవాడు ఆంద్రే.

రోజు దుకాణం తెరవగానే ఆమె ఆంద్రేకి ఇష్టమైన పాటని మోగించేది.

ఇంతలో, ఆంద్రే హంతకుడిని పోలీసులు పట్టుకున్నారని తెలిసింది.

ఆంద్రే హంతకుడు 17 ఏళ్ల అబ్బాయి మహమ్మద్. 15 ఏళ్ల వయసులో ఓ యాభైఏళ్ల వృద్ధుడిని కత్తితో పొడిచి జైలు పాలయ్యాడు. కానీ అతడి వయసు దృష్ట్యా సానుభూతి చూపించింది కోర్టు. దాంతో విడుదల అయి వచ్చాడు. వచ్చి వారంలో మిత్రులతో బెట్ కట్టి, ఆంద్రేని చంపి దుకాణాన్ని దోచుకున్నాడు.

వార్త విన్న ఆన్ కోపంతో రగిలిపోయింది.



© EMESCO BOOKS

ఆయుధాలు చేత పుచ్చుకుని ఎదుటివాడిపై దాడిచేసే వాడికి వయసుతో సంబంధం లేకుండా శిక్షించాలి. ఆయుధం ధరించినప్పుడే వాడి పసితనం పోతుంది.

"మానసికంగా మహమ్మద్ నేరస్తుడు. అసలు అతడిని విడుదల చేయకుండా ఉండాల్సింది" చెప్పింది జైలు సైకియాట్రిస్టు.

అది విన్న ఆన్ ఆలోచన ఆరంభించింది. అంటే, ప్రభుత్వం వ్యక్తి మానసిక స్థితిని పరిశీలించకుండా నేరస్తుడిని వయసు ఆధారంగా అమాయకుడిగా భావించి విడుదల చేస్తున్నది. దానివల్ల సమాజంలో అమాయకుల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతున్నట్టువుతోంది.

మిత్రులను సంప్రదించింది ఆన్. రోజంతా 'ఆండ్రే' పాట వింటూ ఆలోచించింది. తెల్లారి ఆన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కోర్టులో కేసు వేసింది. తన భర్త మరణానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని కోరింది. అంతేకాదు, మహమ్మద్‌ను మైనర్‌లా కాక మామూలు నేరస్తుడిలా విచారించాలని డిమాండ్ చేసింది.

ఆన్‌కు మద్ధతుగా నగరంలోని పౌరులంతా ప్రదర్శనలు చేశారు. ఆండ్రేకు ఇష్టమైన పాట పాడుతూ వీధుల్లో తిరిగారు. పోలీసులకు, ప్రభుత్వాధికారులకు విజ్ఞప్తులు అందజేశారు. దాంతో ప్రభుత్వానికి దిగిరాక తప్పలేదు.

సరైన మానసిక పరిశోధన లేకుండా ఎవరికీ బెయిల్ ఇవ్వకూడదని ప్రభుత్వం ఉత్తర్వు జారీచేసింది. మహమ్మద్‌ను మామూలు నేరస్తుడిని విచారించినట్టు విచారించింది. ఫలితంగా అతడికి ఏడేళ్ల జైలు శిక్షపడింది. మామూలుగా అయితే 17 ఏళ్లలోపు నేరస్తులకు రెండేళ్ల జైలుశిక్ష పడేది.

అయితే ఆన్‌కు అన్నిటికన్నా సంతృప్తి కలిగించింది. సాటిపౌరుల ప్రవర్తన. ఆన్ పోరాటం గురించి తెలుసుకున్నవారు ఆమెకు అండగా నిలిచారు. దేశం నలుమూలల నుంచి ప్రజలు ఆమెకు మద్ధతు తెలిపారు. అంతేకాదు, ఇప్పుడు ఆమె దుకాణం వైపు దొంగలు కన్నెత్తి కూడా చూడలేనట్టు చేశారు. నగర అధికారులు దుకాణంలో వీడియో కెమెరాలనుంచారు. దాంతో దుకాణంలో ఉన్నవారినే కాదు, దుకాణం బయట నుంచి లోపలకు వచ్చేవారిని, దుకాణం వదలి పారిపోయే వారినీ కెమెరాలో బంధించే వీలు కలిగింది.

నగర పౌరులు స్వచ్ఛందంగా ఇరవైనాలుగు గంటలు దుకాణాన్ని కాపలా కాసే బాధ్యత తీసుకున్నారు.

దాంతో ఇప్పుడు దుకాణం లాభాలలో నడవటమే కాదు సురక్షితమయింది.

"ఇదంతా ఆండ్రే పట్టుదల ఫలితం. మనిషి కష్టాలకు తలవంచితే మామూలు మనిషిలా మిగిలిపోతాడు. కానీ కష్టాల కెదురు నిలచి పోరాడితే, కష్టాలను వంచటమేకాదు, సమాజానికి ఉత్తమ ఆదర్శం నిలిపిన వాడవుతాడు" అంటుంది ఆన్ సజల నయనాలతో.

# మత్తు నుండి మానవత్వం వైపు

**కళాకారుడికి కళను మించి వేరే మత్తు అవసరంలేదు.**
**అవసరం అయిందంటే అతడి కళలోనే ఏదో లోపముంటుంది.**
**అని నిరూపించిన కథ.**

**తూ**లుతూ ఇంట్లోకి అడుగుపెట్టాడతడు. అతడు వస్తున్నాడంటేనే ఇంట్లో అందరూ బితుకు బితుకుమంటుంటారు. చిన్న శబ్దం కూడా చేయరు.

అడుగు వేస్తే అగ్నిపర్వతం బద్ధలవుతుందేమో అన్నట్టు జాగ్రత్తగా మెలగుతుంటారు. అతడు ఎటువంటి మూడ్‌లో ఇంటికి వస్తాడో ఎవరికీ తెలియదు. వారికి తెలిసిందల్లా అతడు బాగా తాగి వస్తాడు. డ్రగ్స్ తీసుకువస్తాడు.

ఇంట్లో అడుగుపెడుతూ కనబడ్డ దాన్ని విసిరేస్తే అతడికి దూరంగా ఉండాలని అర్థం. అలా కాక, గిటార్ తీసుకుని పాట అందుకుంటే మంచి మూడ్‌లో ఉన్నాడని అర్థం.

ఆ రోజు ఇంట్లోకి వస్తూనే అతడు అందరినీ తిట్టడం మొదలుపెట్టాడు. ఫ్లవర్ వేజ్ విసిరేశాడు. ఏదో కసి. ఎవరి మీదనో కసి. ఎందుకో కోపం అర్థంకాదు. కనబడ్డ వాటన్నిటినీ విసిరేశాడు. కనబడిన వారందరినీ తిట్టాడు. అలా విసుర్తూ, తిడుతూ తన గదిలోకి వెళ్ళి ధడేల్న తలుపు వేసుకున్నాడు.

ఆ గదిని చూస్తూంటే అతడికోపం మరింత పెరుగుతుంది. గదినిండా అతడు అందుకున్న వివిధ బహుమతులున్నాయి. పెద్దవారితో అతడి ఫొటోలున్నాయి. అతడి రికార్డులు మిలియన్ల సంఖ్యలో అమ్ముడుపోతే, రికార్డింగ్ కంపెనీలు అతడికి ఇచ్చిన బహుమతులు ఉన్నాయి.

అవి చూస్తూంటే అతడి ఆవేశం ద్విగుణీకృతమౌతుంది.

'అందరూ తనని గొప్ప వాడంటారు. తన పాటకు ఉర్రూతలూగిపోతారు. తన కళలో తనకే తెలియని గొప్ప అర్థాలు వెతుకుతారు. తన ప్రోగ్రాం కోసం ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు

© EMESCO BOOKS

పడిఛస్తారు. కానీ తానే ఎందుకు పనికిరానివాడని తనకు తెలుసు. తనొక తాగుబోతు. తాగకుండా ఉండలేడు. డ్రగ్స్ తీసుకుంటాడు. మత్తులో మునిగి తేలుతాడు. ప్రపంచం తన పాటలకోసం ఎదురుచూస్తోంది. కానీ తానేమీ సృజించలేకపోతున్నాడు. తానొక ఫ్రాడ్. తనకేమీ చేతకాదు...

ఈ నిజం ప్రజలకు తెలిస్తే, తన గురించి ఏమనుకుంటారు?'–

ఊగుతూ తన మంచం చేరాడు. పక్కన ఎప్పుడూ ఉండే వోడ్కా బాటిల్ అతడిని ఆహ్వానించింది. గబగబా బాటిల్ ఎత్తి తాగేశాడు. కాస్త మంట శాంతించి నట్టనిపించింది. అంతలో మళ్లీ మంట మొదలయింది. 'తనలో ఏదో అగ్నిగుండం ఉన్నట్టుంది. ఎన్ని మాదకద్రవ్యాలు అందించినా 'స్వాహా' అంటూ మరిన్ని కావాలంటోంది. ఎంత మద్యం పోసినా, అంతా ఒక్క గుక్కలో తాగేసి, 'మోర్' అంటోంది. ఈ మంట ఎప్పుడు చల్లారుతుంది?'– మంచం మీద పడుకున్నాడు. మత్తుగా ఉంది. నిద్రరావటం లేదు. కళ్లు మూసుకుపోతున్నాయి. శరీరమంతా నిప్పుల్లో పెట్టినట్టుంది. దిండు కింద నుంచి తుపాకీ తీశాడు. నోట్లో తుపాకీ బారెల్ ఉంచాడు.

ట్రిగ్గర్ నొక్కితేచాలు, తల పేలిపోతుంది. బాధలన్నీ ఆవిరైపోతాయి. ఎవరూ తననుంచి ఏమీ ఆశించరు. పాటలు రాయాలన్న టెన్షన్ ఉండదు. అవి ప్రజలు మెచ్చుతారో, మెచ్చరో అన్న భయం ఉండదు. క్రితం పాటలు ఎంతగా హిట్ అయ్యాయో అంతకన్నా తక్కువ హిట్ అవుతాయేమోనన్న ఉద్విగ్నత ఉండదు. అన్ని బాధలు, ఉద్విగ్నతలు క్షణంలో మాయమై పోతాయి...

'కానీ... కానీ... మళ్లీ మద్యం తాగే అవకాశం ఉండదు. అమ్మో...!'– తుపాకీ పక్కన విసిరేశాడు. 'తాను పాటలు పాడకుండా ఉండగలడు. కానీ మద్యం తాగకుండా ఉండగలడా?' అలా ఆలోచిస్తూ నిద్రలోకి జారుకున్నాడు. అంతలో హఠాత్తుగా పొట్టలో నొప్పి వచ్చింది. మెలకువ వచ్చీరాని స్థితి. బాధతో అరుస్తున్నాడు. గది అంతా మనుషులతో నిండిపోయింది. అంతా హడావిడి పడుతున్నారు. 'ఎవరో తనని గాల్లోకి లేపుతున్నట్టనిపించింది. లేక తనే గాల్లో ఎగుర్తున్నాడా?'

అతడిని ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ఎమర్జెన్సీవార్డులో చేర్చారు. నర్సు వచ్చింది.

"పేషెంట్ పేరు చెప్పండి?" అడిగింది, కేసుషీటుపై పెన్ను సిద్ధంగా పెట్టుకుని.

"ఎరిక్ క్లాప్టన్" చెప్పారొకరు.

ఆ పేరు వింటూనే నర్సు నిర్ఘాంతపోయింది. పెన్ను చేతిలోంచి జారి పడిపోయింది. ఆమె కళ్లు పెద్దవయ్యాయి. "ఎరిక్ క్లాప్టన్! ది ఫేమస్ రాక్ సింగర్?!" ఆమె ఆశ్చర్యంగా అడిగింది.

* * *



© EMESCO BOOKS

"అవును. నేనే ఎరిక్ క్లాప్టన్. ది ఫేమస్ రాక్ సింగర్" తల వంచుకుని చెప్పాడు ఎరిక్ క్లాప్టన్.

"మిస్టర్ క్లాప్టన్. నేను మీ అభిమానిని. నీ సంగీతం నన్ను అలౌకికానందపు అలల్లో విహరింపచేస్తుంది" మృదువుగా అన్నాడు డాక్టర్.

"థాంక్యూ డాక్టర్" గుసగుసగా అన్నాడు క్లాప్టన్.

"కానీ మిమ్మల్ని ఈ స్థితిలో చూడాల్సి వస్తుందనుకోలేదు. మీరు గొప్ప కళాకారులు. మీ కళ మాలాంటి సామాన్యుల హృదయాలలో నిద్రాణస్థితిలో ఉన్న సున్నితపు ఆలోచనలను జాగృతం చేస్తుంది. మీ కళద్వారా మేం సామాన్యస్థితి నుంచి ఓ మెట్టుపైకి ఎదుగుతాం. అటువంటి కళాకారులైన మీరు ఇలా తాగుడుకు బానిసై, డ్రగ్స్ సేవిస్తూ, మరణాన్ని కౌగిలించుకోవటం చాలా బాధాకరమైన విషయం!" చివరి మాటలు కటువుగా అన్నాడు డాక్టర్. తల దించుకున్నాడు క్లాప్టన్.

"మీరు ఎటువంటి పరిస్థితిలో ఆస్పత్రికి వచ్చారో తెలుసా?" అడిగాడు డాక్టర్.

ఎరిక్ క్లాప్టన్ మాట్లాడలేదు. మౌనంగా ఉండిపోయాడు.

"మొత్తం మీ జీర్ణాశయంలో మూడు అల్సర్లున్నాయి. వాటిలో ఒకటి పేలిపోయింది. దాని నుంచి రక్తం కారుతోంది. మీరు బతకరని అనుకున్నాం. చూడండి. మీరు చచ్చిపోతే మీకు నష్టం లేదు. కానీ ప్రపంచానికి ఎంత నష్టం ఆలోచించండి! మీ కళవల్ల ఆనందం పొందుతున్న వారికది ఎంత తీరని లోటో ఊహించండి. అదీగాక మీరు మరో విషయం గుర్తుంచుకోవాలి..."

తలెత్తాడు క్లాప్టన్. అతని కళ్లల్లో నీటిపొర తళుక్కుమంది.

"మీరు రెండు దశాబ్దాల నుండి సంగీతం సృజిస్తున్నారు. మీ పాటలు ప్రపంచ వ్యాప్తంగా ప్రజలను ఉర్రూతలూగిస్తున్నాయి. ఎందరో యువతీయువకులు మిమ్మల్ని ఆరాధిస్తున్నారు. ఆదర్శంగా తీసుకుంటున్నారు. అనుకరిస్తున్నారు. మీ హెయిర్ స్టయిల్‌ను, దుస్తులు ధరించే విధానాన్ని, స్వరాన్ని... మీ ప్రతి కదలికను వాళ్లు అనుకరిస్తున్నారు. మీలా మాదకద్రవ్యాలు తీసుకోవటం, మత్తుమందులకు వాళ్లు అలవాటుపడితే..." డాక్టర్ వాక్యాన్ని పూర్తిచేయకుండా ఆపేశాడు. వాక్యం ముగిస్తే శ్రోతకు ఆలోచించే అవసరం ఉండదు. సగంలో ఆపితే, దాన్ని పూర్తిచేసే బాధ్యత శ్రోతపై పడుతుంది. అందుకే ఆలోచించాల్సి వస్తుంది. క్లాప్టన్‌ను ఆలోచింపచేయటమే డాక్టర్ కర్తవ్యం.

క్లాప్టన్ మౌనంగా ఉండిపోయాడు. కాస్సేపు అతడేమైనా అంటాడేమోనని చూశాడు డాక్టర్. ఏమీ మాట్లాడక పోవటంతో గది వదలి వెళ్లాడు.

* * *



© EMESCO BOOKS

గదిలో కూచున్న క్లాప్టన్ మనసులో తుఫాను చెలరేగుతోంది.

ఆరంభం నుంచి క్లాప్టన్ జీవితంలో అడుగడుగునా విషాదం ఎదురవుతూ వచ్చింది. టీనేజీలో ఉన్నప్పుడు అతడి ప్రపంచం అతడి కళ్లముందే కూలిపోయింది. ఇన్నాళ్లూ, తాను తన సోదరి అనుకుంటున్న వ్యక్తి నిజానికి తన తల్లి అని తెలిసిన క్షణం క్లాప్టన్ పిచ్చివాడయిపోయాడు. తన తల్లిదండ్రులుగా వ్యవహరిస్తున్న వారు తన తాత, అమ్మమ్మలు అని తెలిసినప్పుడు, తనవారు తనతో ఆడిన మోసాలాటలు భరించలేకపోయాడు.

16 ఏళ్ల వయసులో తన తల్లి గర్భవతి అవటం వల్ల అందరూ తనతో ఈ ఆట ఆడేరని తెలిసి అందరిపై అపనమ్మకం పెంచుకున్నాడు. దాంతో ఇల్లు వదలి వచ్చేశాడు. పాటలు పాడటం, తాగటం, డ్రగ్స్ సేవించటం అలవాటయింది. పాటలు ప్రజలు మెచ్చి, అందువల్ల అతడికి పేరు వస్తున్నకొద్దీ అతడిలో న్యూనతాభావం పెరగసాగింది.

తనీ పొగడ్తలకు అనర్హుడేమో అన్న భావం విషవృక్షంలా ఎదగసాగింది. ఏదో ఓ రోజు కళ్లు తెరిచేసరికి ఇదంతా కల అని తేలుతుందేమోనన్న భయం పెరిగిపోసాగింది. దాంతో అతడి తాగుడు మరింత ఎక్కువైంది. ఇప్పుడు డాక్టర్ మాటలతో అతడిలో మథనం ఆరంభమయింది.

'ఎంతోమంది తనని ఆదర్శంగా తీసుకుంటున్నారు. మరెంతోమందిపై తన ప్రభావం ఉంటోంది. దాంతో తన బాధ్యత మరింత పెరుగుతుంది. ఇది గ్రహించక తాను ఆత్మన్యూనతా భావంలో పడికొట్టుమిట్టాడుతున్నాడు. నిజంగా ప్రజలలో తనుకున్న ఆదరణను చేజేతులా పాడుచేసుకుంటున్నాడా! ఇంతకాలం జరిగినదానిలో తన ప్రమేయంలేదు.

విధి తనతో ఆడుకుంది. కానీ తన జీవితాన్ని తానే స్వయంగా పాడు చేసుకుంటున్నాడు. తనెటువంటివాడయినా తన పాటను ఆదరించే ప్రజలకు తాను అన్యాయం చేస్తున్నాడు. ఇకపై ఇలా జరగకూడదు. తాను మారాలి. తన గతంతో తనకు పనిలేదు. తన దృష్టి భవిష్యత్తుపై ఉండాలి. సమాజం పట్ల తనకు బాధ్యత ఉండాలి'- అని ఒక నిశ్చయానికి వచ్చాడు ఎరిక్ క్లాప్టన్.

* * *

1982లో క్లాప్టన్ తాగుడు మానేందుకు చికిత్స పొందటం ఆరంభించాడు. మిన్నెసోటాలోని హాజ్లెడీన్ ఫౌండేషన్ క్లినిక్‌లో చేరాడు. కానీ ఇన్నేళ్లు పెంచి పోషించిన అలవాటును, మానటం అంతసులభం కాదు. మానేయటం, మళ్లీ ఆరంభించటం పలుమార్లు జరిగింది. అయినా పట్టుదలగా తాగుడు మానాలని ప్రయత్నించాడు.

చివరికి 1987లో తాగుడుకు పూర్తిగా తిలోదకాలు ఇచ్చాడు.



© EMESCO BOOKS

ఈ సమయంలో క్లాప్టన్ ఓ విషయం గ్రహించాడు. ఇంతకు ముందు మత్తులో ఉంటే తప్ప పాట రాయగలిగేవాడు. మత్తులో ఉంటేనే పాడగలిగేవాడు. దాంతో మత్తు లేకపోతే పాటలేదు అనుకునేవాడు.

రాయాలని మరింత తాగేవాడు. మత్తులో మునిగిరాతనే మరచేవాడు. కానీ ఇప్పుడు తాను చైతన్యంగా ఉంటే మరింత బాగా రాయగలని అర్థం చేసుకున్నాడు. తన భావాలను మరింత స్పష్టంగా వ్యక్తపరచగలుగుతున్నాడని అతడికి తెలిసింది. అదీగాక ఇప్పుడు చుట్టూ ఉన్న ప్రపంచాన్ని గమనించగలుగుతున్నాడు. మనుషులను అర్థం చేసుకోగలుగుతున్నాడు. అది తన పాటను మరింత మెరుగుపరుస్తోంది. ప్రజల మనసు లోతుల్లోకి చొచ్చుకు వెళ్లే శక్తిని తన పాటలకిస్తోంది.

దాంతో క్లాప్టన్ తాగుడును పూర్తిగా త్యజించాడు.

'నాకోసం నాకున్నా సమాజంపై ప్రభావంపై చూపించే నాలోని కళాకారుడి కోసం నేను మత్తును వదిలాను. చైతన్యాన్ని స్వీకరించాను" అంటాడు క్లాప్టన్. ఇదే సమయంలో క్లాప్టన్ మరో విషయం గ్రహించాడు.

తనలాగే అనేకులు మాదకద్రవ్యాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అర్థం చేసుకున్నాడు. తమ పరిస్థితి పదిమందికి చెప్పుకోలేక మరింత దిగజారుతున్నారని గ్రహించాడు. అందుకే ఓ రోజు తాను వదిలిన అలవాటు గురించి బహిరంగంగా మాట్లాడటం ఆరంభించాడు క్లాప్టన్.

'నాకు పేరుంది. డబ్బుంది. ప్రపంచంలోని సౌఖ్యాలన్నీ నాకు అందుబాటులో ఉన్నాయి. అయినా నేను తాగుడుకు బానిసయ్యాను. ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాను. జీవితాన్ని నాశనం చేసుకోవాలనుకున్నాను. తాగుడు వదిలిన తరువాత ఇప్పుడు అర్థమయింది. మత్తులో ఆనందంలేదు. అసలు ఆనందం జీవితంలో ఉంది. తోటివారి సేవ చేయటంలో అసలు సౌఖ్యం ఉంది. ఆనందంగా, ఆరోగ్యకరంగా జీవించటమే అసలైన మత్తు. అది ఆరోగ్యకరమైన మత్తు" అని బోధించటం ఆరంభించాడు.

క్లాప్టన్ ప్రచారం వల్ల అంతవరకూ తమ దురలవాటుకు సిగ్గుపడుతున్న వారంతా ధైర్యంగా తమ అలవాటును తగ్గించుకునేందుకు ముందుకు రాసాగారు. చికిత్స పొందసాగారు.

ఇంతలో విధి క్లాప్టన్ దీక్షను పరీక్షిస్తోందా అన్నట్టు ఓ విషాదకరమైన సంఘటన జరిగింది. క్లాప్టన్ నాలుగేళ్ల కొడుకు క్యార్ న్యూయార్క్‌లోని ఆకాశహర్మ్యం పైఅంతస్తు కిటికీలోంచి జారి కిందపడి మరణించాడు.

మళ్లీ క్లాప్టన్ తాగుడు ఆరంభిస్తాడని అందరూ భయపడ్డారు. కానీ క్లాప్టన్ తన కష్టాన్ని, దుఃఖాన్ని చిరునవ్వుతోనే ఎదుర్కొన్నాడు.



© EMESCO BOOKS

"బాధ మరచిపోవటానికి తాగుడు మందుకాదు. తాగుడువల్ల బాధ తగ్గదు. పెరుగుతుంది. తాత్కాలికంగా మత్తు వచ్చినా శాశ్వతంగా హాని కలుగుతుంది. కాబట్టి కష్టం నుంచి పారిపోవటం వల్ల లాభంలేదు. కష్టాన్ని ధైర్యంగా ఎదుర్కోవాలి. కష్టాన్ని మరపించే మత్తుపాట. నా పాటలో నా బాధను ప్రపంచానికి తెలుపుతాను. నాలా బాధపడే వారికి నా పాట ద్వారా సాంత్వననిస్తాను. కళ భగవంతుడు మనిషికిచ్చిన గొప్ప మత్తు. ఆ మత్తులో నా బాధనే కాదు ప్రపంచం నుంచి బాధను తొలగిస్తాను" అని ప్రకటించాడు క్లాప్టన్.

న్యూయార్క్ వదలి 'ఆంటిగ్వా' చేరాడు. ఆంటిగ్వాలో పాటలు రాయటం ఆరంభించాడు. తనలోని ఆవేదనలను, మానవ సంబంధాల పట్ల తన వేదనలను పాటల రూపంలో బహిర్గతం చేశాడు. 'టియర్స్ ఇన్ హెవెన్', 'మై ఫాదర్స్ ఐస్', 'ది సర్కస్ లెఫ్ట్ టౌన్' వంటి పాటలద్వారా తన కొడుకుకీ, తన కుటుంబానికీ కళా నీరాజనాలర్పించాడు.

"కళాకారుడికి కళను మించి వేరే మత్తు అవసరంలేదు. అవసరం అయిందంటే అతడి కళలోనే ఏదో లోపముంటుంది" అంటాడు క్లాప్టన్.

పాటలద్వారా సంపాదించిన డబ్బుతో ఆంటిగ్వాలో 'క్రాస్‌వర్డ్' అనేమత్తు బానిసల చికిత్సాలయం ఆరంభించాడు. దాదాపుగా 8 మిలియన్ పౌండ్ల ఖర్చుతో ఈ వైద్యశాల ప్రారంభించాడు ఎరిక్ క్లాప్టన్.

ఇందుకోసం తాను సంపాదించిన ధనమంతా ఖర్చుపెట్టాడు. డబ్బు అవసరమైతే తన సంగీత వాయిద్యాలను వేలం వేశాడు. తన ఆస్తినంతా వెచ్చించి ఆయన ఆరంభించిన ఈ వైద్యశాల ఆంటిగ్వాలోని మత్తుబానిసలకే కాదు ప్రపంచంలోని నలుమూలల నుంచి వచ్చే వారందరికీ చికిత్స నందిస్తుంది. "డబ్బునంతా దీనికే ఖర్చుపెట్టటం మూర్ఖత్వం. ఈ ప్రయత్నం విఫలమైతే?" అని క్లాప్టన్‌నను ఎందరో అడుగుతుంటారు.

వారందరికీ క్లాప్టన్ ఒకటే సమాధానం చెప్తాడు.

"నేనింత గౌరవం పొందుతున్నాను. డబ్బు సంపాదిస్తున్నానంటే అది నా కళకు ప్రజలు ఇచ్చిన గౌరవం వల్ల. ఆ డబ్బును సమాజానికి సేవ చేయటం వల్ల కోల్పోతే నాకు బాధలేదు. ఆ బాధలో తాగటం వల్ల సాధించేదేదీ లేదు. తాగకపోతే పాటలు రాస్తాను. మళ్లీ సంపాదిస్తాను. మళ్లీ సమాజం కోసం ఆ డబ్బు వెచ్చిస్తాను. మాధవుడిచ్చిన కళను మానవసేవ కోసం వాడటం కన్నా దానికి సార్థకత ఏముంటుంది?" అంటాడు. ఆ వెంటనే "కళ మాదకద్రవ్యమైతే సమాజసేవ తాగుడుమత్తు లాంటిది. కానీ వాటివల్ల ప్రయోజనమే తప్ప నష్టంలేదు" అంటాడు నవ్వుతూ.

© EMESCO BOOKS

# మానవతకు మరో రూపం

**శరీరం రంగు ఏదయినా అందరి దేవుడు ఒక్కడే**
**అని నిరూపించిన మహిళకథ.**

**ఆగస్ట్** 16, 1995.

ఇంట్లోకి అడుగు పెడుతూండగానే ఫోను మోత వినిపించింది. బ్యాగు కూడా పక్కన పడేయకుండా పరుగెత్తి ఫోను ఎత్తింది ఆమీ మర్రే. దాదాపుగా తొమ్మిదేళ్ల శ్రమ క్షణంలో బూడిదైపోతోంది. వెంటనే తనని తాను నియంత్రించుకుంది.

గబగబా బయటకు పరుగెత్తింది. కారులో వేగంగా 'సెయింట్‌జాన్' చర్చి వైపుకు వెళ్తున్న ఆమీ మనసు అంతకంటే వేగంగా గతంలోకి పరుగులు తీసింది...

* * *

ఒళ్ళంతా దుమ్ము కొట్టుకుపోయి విషాద వదనంతో ఆఫీసులోకి అడుగుపెట్టిన సిమ్మన్స్‌ను చూసి "నా ఛాంబర్ లోకి రా" ఆజ్ఞాపించింది ఆమీ.

ఎవరైనా ఆఫీసుకి ఆలస్యంగా వస్తే ఆమీ భరించలేదు. పైగా దుమ్ముకొట్టుకు పోయిన దుస్తులతో వచ్చేవాళ్లని ఆమె అసలు క్షమించదు. ఇప్పటికే సిమ్మన్స్ వల్ల తను అనేక కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తోంది. సిమ్మన్స్ నల్లజాతికి చెందిన యువతి. అమెరికన్లు ఎంత విశాల హృదయాన్ని ప్రపంచానికి ప్రదర్శించినా, అంతర్గతంగా నల్లవారికి, తెల్లవారికి నడుమ ఉద్విగ్నతలు కొనసాగుతూనే ఉన్నాయి. అడుగడుగునా సంఘర్షణలు జరుగుతూనే ఉన్నాయి.

నల్లవారిని అణచివేయాలని, తక్కువ చేయాలని తెల్లవారు ప్రయత్నిస్తూనే ఉన్నారు. సామాజికంగా ఒక స్థాయికి ఎదిగిన నల్లవారు, తెల్లవారూ ఇటువంటి సంకుచిత భావనలు ప్రదర్శించటంలేదు. కానీ అడుగు స్థాయిలో ఈ భేదభావాలు రూపుమాసి పోలేదు.

"సిమ్మన్స్" కు తన కంపెనీలో ప్రాధాన్యం ఇస్తున్నదని అమీకి బెదిరింపు ఉత్తరాలు వచ్చాయి. ఫోన్‌కాల్స్ వచ్చాయి. "అర్హత ఉన్న తెల్లవాళ్లు అనేకులుండగా నిగ్గర్లను నెత్తికెక్కించుకోవాల్సిన అవసరం ఏముంది?" అంటూ ఆమె స్నేహితులు కూడా ప్రశ్నించారు.

© EMESCO BOOKS

"నాకు కావలసింది క్రమశిక్షణతో, చిత్తశుద్ధితో విశ్వాసంగా పనిచేసే వ్యక్తి. అటువంటి వ్యక్తి శారీరక రంగుతో నాకు పనిలేదు. సిమ్మన్స్ సరిగ్గా పనిచేయనినాడు ఆమె రంగుతో సంబంధం లేకుండా ఆమెని తీసేస్తాను" అని వాదించేది అమీ. కానీ సిమ్మన్స్ ప్రతి పనిలో తప్పులు వెతుకుతూ ఫిర్యాదులు చేసేవారి తాకిడి తట్టుకోవటం అమీకి కష్టమైంది. అటువంటి పరిస్థితిలో సిమ్మన్స్ ఇలా ఆలస్యంగా, అశుభ్రంగా రావటం అమీకి కోపం తెప్పించింది. తను ఛాంబర్‌లోకి రాగానే "ఆలస్యం ఎందుకైంది? ఆ వేషం ఏమిటి?" అని గద్దించింది.

ఆమె మాట పూర్తి కాకముందే కుర్చీలో కూలబడి భోరుమని ఏడవసాగింది సిమ్మన్స్. అది చూస్తుంటే అమీ హృదయం ద్రవించింది. ఒక మనిషి ఎంత బాధను అనుభవిస్తే, ఇంత హృదయ విదారకంగా రోదిస్తాడు? కానీ వ్యాపారానికి జాలి, దయాగుణాలు ఉండకూడదని అమీకి తెలుసు. అందుకే మనసులోని భావనలను దాచుకుని పైకి కఠినంగా అడిగింది–

"ఏడుపు ఆపి అసలు విషయం చెప్పు". కన్నీళ్ళు తుడుచుకుంది సిమ్మన్స్.

గద్గదిక స్వరంలో నెమ్మదిగా చెప్పటం ఆరంభించింది. "మేం నల్లవాళ్లం అందరం కలిసి 'సెయింట్ జాన్' చర్చి కట్టుకున్నాం. అది కట్టినప్పటినుంచీ మాకు బెదిరింపులు వస్తున్నాయి. పోలీసు రిపోర్టిచ్చాం. అయినా బెదిరింపులు ఆగలేదు. నిన్నరాత్రి ఎవరో చర్చిపై దాడిచేశారు. నిప్పుపెట్టి, సర్వనాశనం చేశారు. కానీ మేమంతా సమయానికి మేలుకోవటంతో పూర్తిగా దగ్ధం కాకుండా బతికిబయటపడ్డాం. అందుకే ఆలస్యమైంది. ఇంకా అందరూ అక్కడే ఉన్నారు. నేనే ఆలస్యమౌతున్నదని..." దుఃఖం హద్దులు దాటటంతో ఇక చెప్పలేకపోయింది సిమ్మన్స్.

సిమ్మన్స్ వైపు చూస్తూ కూచుంది అమీ. ఆమెకు విషయం సంపూర్ణంగా అర్థం కాలేదు. తాము ఉంటున్నది అమెరికాలో, 20వ శతాబ్దం చివర్లో. బానిసత్వాన్ని రద్దు చేసిన కొత్తల్లో 'కుక్లుక్స్ క్లాన్' అనే తెల్లవాళ్ల ముఠా నల్లవాళ్లపై అత్యాచారాలు సాగించింది. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. 'క్లుక్లుక్స్' పూర్తిగా అదృశ్యమైంది. అనేక రంగాలలో నల్లవాళ్లు అభివృద్ధి సాధిస్తున్నారు. తెల్లవారికి తామేమీ తీసిపోమని నిరూపిస్తున్నారు. 'ఇటువంటప్పుడు నల్లవారి చర్చిపై తెల్లవారు దాడి చేయటమేమిటి?' – అమీ మనసు నొచ్చుకుంది.

"పద నేనూ వస్తాను, మీ చర్చిచూస్తాను. అవసరమైతే మన ఆఫీసు తరుఫున ఏదైనా సహాయం చేస్తాను" అని సిమ్మన్స్‌ని లేవదీసింది అమీ.

* * *

చర్చి తన దృష్టిపథంలోకి రాగానే అమీ మనసులో బాధ మొదలైంది. చర్చి ఆవరణలోని శిలువను రెండుగా విరిచేశారు. పూలమొక్కలను తవ్విపారేశారు. "నల్లవారికైనా, తెల్లవారికైనా శిలువ పవిత్రమైంది. మొక్కలు ప్రజలకు మేలు చేస్తాయేతప్ప ద్వేషం చూపవు. అలాంటి వాటిపైన కోపం ఎందుకు?" అమీ మనసులో ఆలోచన కలిగింది.

చర్చిలోపలకు అడుగు పెట్టగానే స్థాణువయిపోయింది అమీ.

© EMESCO BOOKS

కిటికీల అద్దాలు ముక్కలు ముక్కలై హాలునిండా పడున్నాయి. లోపల భక్తుల కూర్చునేందుకు ఉండాల్సిన బల్లలన్నీ సగం విరిగి ఉన్నాయి. మిగతా సగం కాలిపోయాయి. నల్లగా కాలిన గోడలపైన బుల్లెట్ల గుర్తులు కనిపిస్తున్నాయి. విరిగిన బల్లల నడుమ బీరు బాటిళ్లు, విస్కీ బాటిళ్లు పడున్నాయి. 'అంటే లోపలివన్నీ విరగ్గొట్టి ఇక్కడే తాగి నిప్పుపెట్టి వెళ్లారన్నమాట. ఎందుకని? ఎందుకంత విద్వేషం? ఒక చెంప కొడితే మరో చెంప చూపమని చెప్పిన ప్రవక్త అనుచరుల పని ఇదేనా?'–

ఇంకో అడుగు ముందుకేసి ఆగిపోయింది ఆమీ. చర్చిలో చదివే పెద్ద బైబిలును చింపి పోగులు పెట్టారు. పాస్టర్ల కుర్చీలను పీకి ముక్కలుచేశారు. పియానోను కసికసిగా ముక్కలు చేశారు. అది సిమ్మన్స్ భర్త చర్చికోసం కొన్నాడు. దాన్ని ఆయనే మోగిస్తాడు. చర్చి ఫాదరు ఉపన్యసించే వేదికపైన బుల్లెటు గుర్తులున్నాయి. అంతేకాదు, ఆ వేదికపై ఉపయోగించిన కండోమ్‌లు పడి ఉన్నాయి. అవి గూండాలు ఎందుకు ఉపయోగించారో, చెప్పకనే చెప్తున్నాయి...

కళ్లెత్తి గోడవైపు చూసిన అమీ కళ్లల్లో నీళ్లు! గోడపై ఉండాల్సిన పెద్ద సిలువను ముక్కలు చెక్కలు చేశారు. శిలువపై ఉండాల్సిన జీసస్ బొమ్మలు ఏ కీలుకి ఆ కీలు విరిచారు. కానీ గోడపైన మేకుల నుంచి ఓ చేయి మాత్రం వేలాడుతోంది. ఇక చూడలేకపోయింది ఆమీ. కళ్ల నుంచి నీరు ధారాపాతంగా కారుతూంటే, పెద్దగా ఏడుస్తూ చర్చినుంచి బయటకు పరుగెత్తుకు వచ్చింది.

"ఏసుక్రీస్తును ఆయన వ్యతిరేకులు శిలువ చేశారు. అయినా ఆయన మళ్లీ బతికాడు. కానీ ఆయన అనుచరులు వేసిన ఈ సిలువనుంచి ఆయన బతకగలడా?" ఇంటికి చేరుకున్నా అమీని ఇదే ఆలోచన వెంటాడసాగింది. ఏసుక్రీస్తు సకల మానవాళిని రక్షించటానికి అవతరించాడు. ప్రజల పాపాల శిక్షను తాను అనుభవించి ప్రపంచానికి ప్రేమను పంచి ఇచ్చాడు. కానీ ఇక్కడ జరిగిందేమిటి? నల్లవారి యేసు వేరు, తెల్లవారి యేసు వేరవుతాడా? నల్లవారు పూజించే యేసు, యేసు కాకుండాపోతాడా? దేవుడి విలువ రంగునుబట్టి మారుతుందా? బంగారం ఎవరి దగ్గర ఉన్నా దాని విలువ దానిదే'– రాత్రంతా ఆమీ మనసులో ఇవే ఆలోచనలు సుళ్లు తిరిగాయి.

"భగవంతుడా! నాకు మార్గదర్శనం చేయి" అని ప్రార్థించింది యేసును. తెల్లవారుతుండగా ఆమె ఓ నిర్ణయానికి వచ్చింది.

* * *

"నేను సెయింట్ జాన్ చర్చిని మళ్లీ నిర్మిస్తాను. ఆ చర్చిని ధ్వంసం చేసినవారు దారి తప్పినవారు. వారి భయానికి మనం మౌనంగా ఉంటే మనం జీసస్ దృష్టిలో నేరస్తులమౌతాం. అందుకే 'సేవ్ సెయింట్ జాన్ చర్చ్ కమిటీ'ని ఏర్పాటు చేస్తున్నాను. మనమంతా విరివిగా విరాళాలు ఇచ్చి చర్చి పునర్నిర్మాణానికి తోడ్పడాలి. శరీరం రంగు ఏదయినా దేవుడొక్కడే అని నిరూపించాలి."



© EMESCO BOOKS

అమీ నిర్ణయాన్ని కొందరు మిత్రులతో కలసి కమిటీ ఏర్పాటు చేసింది,

సెయింట్ జాన్ చర్చిపై దాడి విషయం ఏ వార్తా పత్రికలో రాలేదు.

పిల్లి తప్పిపోయినా ప్రధాన వార్తగా చూపించే ఛానల్‌వారు కూడా ఆవైపు రాలేదు. అమీయే స్వయంగా ప్రతి పత్రిక ఆఫీసుకి వెళ్లి వార్త అందించింది. ఫొటోలు ఇచ్చింది. కానీ ఒక్క 'డిస్పాచ్ న్యూస్' పత్రిక మాత్రమే ఆ వార్త ప్రచురించింది.

మిగతా వారంతా ఉదాసీనంగా ఉండిపోయారు.

ఆమీ వెళ్లి డిస్పాచ్ న్యూస్ పత్రిక ఎడిటర్ 'జెర్రీ బెల్లూన్'ను కలిసింది. "మీరు ఒక్కసారి వచ్చి చర్చిని చూసి మళ్లీ వార్త రాయండి" అని కోరింది.

* * *

జెర్రీ వార్త రాయటంతో ఆగలేదు. తనకు పరిచయమైన జర్నలిస్టులందరితో వార్త రాయించాడు. పోలీసు రిపోర్టు ఇచ్చాడు. పోలీసుల ఉదాసీన వైఖరిని విమర్శించాడు. ఆమీతో ఇంటర్వ్యూ ప్రచురించటమే కాదు, తనకు పరిచయం ఉన్న చానళ్లలో ఆమెకు ఉపన్యాసం ఇచ్చే అవకాశం ఇప్పించాడు.

నెమ్మదిగా ఆమీ చేస్తున్న పనికి ప్రచారం రాసాగింది. నల్లవారు, తెల్లవారు కలిసి ఉన్న 'సేవ్ సెయింట్ జాన్ చర్చి' కమిటీ ప్రజలను ఆకర్షించింది. కొందరు దారి తప్పిన వ్యక్తుల నేరానికి ప్రతిగా చర్చి పునర్నిర్మాణానికి ఆమీ స్వచ్ఛందంగా నడుం కట్టటం అమెరికా ప్రజలను కుదిపింది. ఫలితంగా విరాళాలు రావటం ఆరంభమయింది. వాలంటీర్లు పెద్ద సంఖ్యలో వచ్చి చర్చి నిర్మాణంలో పాల్గొనటం ప్రారంభించారు. వీటితోపాటూ ఆమీకి బెదిరింపు ఉత్తరాలు, ఫోన్ కాల్స్ రావటం మొదలయింది.

"...నిన్ను చంపేస్తాం" అంటూ బెదిరించేవారు.

ఆమె కారును వెంబడించేవారు. అర్ధరాత్రి ఇంట్లో దూరి కుక్కల్ని చంపేసేవారు. ఆమీ ఇల్లు మారింది.

కానీ తన లక్ష్యాన్ని మార్చలేదు. 1986 చివరికల్లా చర్చి నిర్మాణం పూర్తయింది. అయితే ఆమీ పని పూర్తికాలేదు.

ఎందుకంటే చర్చిపై దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. అయితే ఇప్పుడు చర్చి విషయం దేశమంతా తెలియటంతో పోలీసులు చురుకుగా పనిచేయటం ప్రారంభించారు. దాంతో పెద్దగా నష్టం కలగలేదు. 1986 నుండి 1994 వరకూ దాదాపుగా 200 మందిని చర్చిపై దాడి చేసిన నేరానికి అరెస్టు చేశారు.

ప్రజల నడుమ సౌభ్రాతృత్వ భావనల పెంచేందుకు ఆమీ చేస్తున్న కృషిని గుర్తించిన ప్రభుత్వం ఆమెకు 'జెఫర్సన్ అవార్డు'ను ఇచ్చి సత్కరించింది. ఆ అవార్డును ఆమె జీసస్‌కే అంకితమిచ్చింది.



© EMESCO BOOKS

అంతా సవ్యంగా సాగుతోందని అనుకునేంతలో, మళ్లీ చర్చిని కాల్చేస్తున్నారన్న వార్త వచ్చింది.

* * *

'సేవ్ సెయింట్ జాన్ చర్చి కమిటీ' సమావేశం జరుగుతోంది.

"మనం దాదాపుగా ఎనిమిదేళ్లు అవిశ్రాంతంగా శ్రమించాం. చర్చిని నిర్మించాం. కానీ ఇప్పుడది బూడిద అయిపోయింది. ఆ బూడిద స్థానంలో మళ్లీ చర్చిని నిర్మించే ఓపిక మనకి ఉందా?" దాదాపుగా అందరి మదిలో మెదలుతున్న ప్రశ్న ఇది.

"మనం చర్చిని నిర్మించకపోతే మనం ఓటమిని ఒప్పుకున్నట్టు అవుతుంది. ప్రేమ పరాజయం పొందినట్టవుతుంది" అంది ఆమీ, అందరినీ ఉత్సాహపరచే ఉద్దేశంతో. కానీ అందరూ నీరసించిపోయారు. ఎవరూ ఉత్సాహం ప్రదర్శించటంలేదు.

అది చూసిన ఆమీలో సంశయం ప్రవేశించింది. 'తాను మళ్లీ చర్చిని నిర్మించగలదో? తన కర్తవ్యం ఒక్కర్తే నిర్వహించగలదా? ఎదురుగా శిలువపైనుండి జీసస్ ఆమెని చూసి నవ్వుతున్నట్టు, 'ఇంత చిన్న ఎదరుదెబ్బలకే లొంగిపోతావా?' అని అడుగుతున్నట్టు-

"కొరడా దెబ్బలు అవిశ్రాంతంగా తగులుతున్నా, రక్తం ఏరులయిపారుతున్నా, శరీరంలోకి మేకులు దిగబడుతున్నా, సత్యపథంలో ఆగకుండా ప్రయాణించేవాడే నిజమైన అనుచరుడు" అని యేసు అంటున్నట్టు తోచింది. "మీరెవరూ ముందుకు రాకున్నా ఫరవాలేదు. నేను ఒక్కర్తినే ఎలాగో అలా చర్చి నిర్మిస్తాను" ఆవేశంగా అంది ఆమీ.

ఆమె ఎదురుగా ఉన్న ఓ రాజకీయ నాయకుడు ఏదో అనబోయాడు. ఇంతలో ఆమీ ఫోను మోగింది. రిసీవర్ ఎత్తి "హలో" అంది.

"మేడమ్ నా పేరు ఆల్‌హోల్చెర్. నేను ఇప్పుడే టీవీలో సెయింట్ జాన్ చర్చి గురించి కార్యక్రమం చూశాను. మీ శ్రమ అభినందనీయం. అందుకే నా వంతుగా నేను చర్చిని పునర్నిర్మించటంలో సహాయపడదలచుకున్నాను. నేను కాంట్రాక్టర్‌ని. చర్చి మొత్తం నేను ఉచితంగా నిర్మించి ఇస్తాను." ఆమీ కమిటీ సభ్యులవైపు చూసి నవ్వింది.

శిలువపై నుండి జీసస్ ప్రేమ వెన్నెల కురిపిస్తున్నట్టు...

* * *

నవంబర్ 8, 1998న సెయింట్ జాన్ చర్చి పునర్నిర్మాణం పూర్తయింది. అందరూ ఆమీపై పొగడ్తల వర్షం కురిపిస్తున్నారు.

"ఈ భూమిపై దైవకార్యం సాధించటమే మానవుల కర్తవ్యం" అంది ఆమీ చిరునవ్వుతో...!

© EMESCO BOOKS

# అరుదైన ఒక అద్భుతం

**భగవంతుడి గొప్పతనానికి,**
**దయకు ప్రతిరూపమైన పాపకథ.**

"**అ**మ్మా! దేవుడంటే ఎవరు? నాకు దేవుడిని చూపించవా?"

మారాం చేయటం ఆరంభించింది మూడేళ్ల గ్రేస్.

ఏం చెప్పాలో, గ్రేస్‌ని ఎలా సముదాయించాలో తెలియటంలేదు లెస్లీ కెనడీకి. అంత చిన్న పిల్లలకు దేవుడనే భావాన్ని అర్థమయ్యేట్టు ఎలా చెప్పాలో ఆమెకు అర్థం కావటంలేదు.

"నీ వద్ద దేవుడి ప్రసక్తి తెచ్చిందెవరమ్మా?" అడిగింది లెస్లీ, కూతురిని.

"నన్ను చూసినప్పుడల్లా దేవుడి గొప్పతనం గుర్తొస్తుందని నాన్నగారంటారు. ఇందాక కూడా నన్ను ముద్దుపెట్టుకుని ఇదే మాట చెప్పారు – నన్ను చూస్తే దేవుడి గొప్పతనం ఎందుకు గుర్తొస్తుందమ్మా?" అని చాలా అమాయకంగా అడిగింది గ్రేస్.

ప్రపంచాన్ని వింతగాచూసే ఆ అద్భుతమైన కళ్లలోకి చూస్తున్న లెస్లీ కెన్నడీకి, ఆమె భర్త డీన్ కెన్నడీ మాటల అర్థం తెలుసు.

* * *

డిసెంబర్ 2001.

"మీకు పుట్టబోయే బిడ్డకు 'స్పినా బైఫిడా' (Spina bifida) అనే సమస్య ఉంది" మృదువుగా చెప్పింది డాక్టర్ చెస్‌చైర్. అమెరికాలో నార్త్ కరోలినాలోని 'చాపెల్ హిల్ సెంటర్'లో ఫీటల్ థెరఫీ ప్రోగ్రాం డైరెక్టర్ ఆమె.

బిడ్డ మాతృగర్భంలో పిండం రూపంలో ఉన్నప్పుడే పరీక్షలు చేసి, ఏవైనా లోపాలుంటే పిండ స్థాయిలోనే గుర్తించి, సవరించే ప్రయత్నాలు చేయటం ఈ ప్రోగ్రాం లక్ష్యం.

© EMESCO BOOKS

"స్పినా బైఫిడా అంటే?" ధైర్యం కూడదీసుకుని అడిగాడు డీన్.

"ఇది వివరించటం కాస్త కష్టం. కానీ ప్రయత్నిస్తాను. పిండం వెన్నుపూసలో ఉన్న కొన్ని టిష్యూలను 'డ్యురు'లంటారు. ఇవి వెన్నెముక నరాలను కప్పి ఉంచుతాయి. కానీ కొన్ని సందర్భాలలో ఈ టిష్యూలు వెన్నెముక నరాలను కప్పవు. అందువల్ల 'హైడ్రోసెఫాలస్' పరిస్థితి ఏర్పడుతుంది. అంటే నీరు వెన్నుపూస ద్వారా పిండం మెదడులోకి చేరుతుందన్నమాట. నీరు మెదడులో నిండుతుండటంతో మెదడు వెనక్కు నెట్టబడుతుంది. అలా మెదడు మెడవైపు నెట్టబడటం వల్ల వెన్నుపూస ఒత్తిడి పెరుగుతుంది. దీన్నే 'స్పినాఫైడ్' అంటారు. ఈ పరిస్థితి వల్ల పాప ఊపిరి పీల్చడం కష్టమవుతుంది. మింగటం కూడా సమస్య అవుతుంది. చాలామటుకు స్పినాఫైడ్ పిల్లలు గర్భంలోనే మరణిస్తారు. లేదా పుట్టిన కొద్దినెలల్లోనే ప్రాణాలు కోల్పోతారు" ఓపికగా వివరించింది డాక్టర్.

డీన్, లెస్లీలు ఒకరి చేయి మరొకరు గట్టిగా పట్టుకున్నారు.

"అంటే ఇప్పుడు మా పాప బతకటం కష్టమా?" అడిగింది లెస్లీ.

"దాదాపుగా మనం ఆశలు వదులుకోవలసిందే. కానీ ప్రస్తుతం పరిశోధన స్థాయిలో ఓ ఆపరేషన్ జరుపుతున్నాం. ఇప్పటికి 225 మంది 'స్పినాఫైడ్' పిల్లలకు ఈ ఆపరేషన్ జరిగింది. ఫలితాలు ఇంకా సరిగ్గా నిర్ణయం కాలేదు" చెప్పింది డాక్టర్.

"ఈ ఆపరేషన్‌లో ఏం చేస్తారు?" అడిగింది లెస్లీ.

"ఆపరేషన్‌లో ముందుగా మాతృగర్భాన్ని తెరుస్తాం. శిశువు వెన్నెపూసలో ఉన్న లోపాన్ని సరిచేస్తాం. ఇందువల్ల శిశువు మెదడులోకి నీరు చేరటం ఆగిపోతుంది. మెదడులో చేరిన నీటిని తొలగిస్తాం. దాంతో ఇక చివరి మూడు నెలల్లోనయినా మెదడులోకి నీరు చేరటం ఆగిపోతుంది. ఇంతవరకూ జరిగిన నష్టం తప్ప మెదడుకు పెద్దగా నష్టం జరగదు. శిశువు మలమూత్ర విసర్జన క్రమబద్ధమౌతుంది. ఎదుగుతున్న కొద్దీ నడవటం కూడా అలవాటు అవ్వచ్చు. ఆపరేషన్ చేయటం వల్ల 'షంట్' అవసరం ఉండదు.

"షంట్ అంటే?"

"మెదడులో చేరుతున్న నీటిని తొలగిస్తుండే ట్యూబ్ 'షంట్'. ఆపరేషన్ చేయకపోతే మెదడులోకి నీరు నిరంతరం చేరుతూనే ఉంటుంది. దానిని తొలగించేందుకు ఎప్పటికీ పాప శరీరంలో ఆ ట్యూబును ఉంచాలి. దాదాపుగా 80 శాతం స్పినాఫైడ్ పిల్లలకు షంట్ అవసరమౌతుంది."

డీన్, లెస్లీలు ఒకరివైపొకరు చూశారు.

వారిద్దరి కళ్లముందు ఒకే దృశ్యం కదలాడుతోంది. పసిపాప శరీరంలో జీవితాంతం ఓ ట్యూబు ఉండటం. మెదడులోకి చేరిన నీటిని అది బయటకు పంపిస్తుండటం. వారిద్దరినీ గమనిస్తూన్న డాక్టర్ మరో విషయం చెప్పింది.



© EMESCO BOOKS

“ఆపరేషన్‌వల్ల కొన్ని ప్రమాదాలూ ఉన్నాయి. ఆపరేషన్ విజయవంతం కాకపోవచ్చు. గర్భసంచీ విచ్ఛిన్నం కావచ్చు. అందువల్ల పిండం మరణించవచ్చు. ఒక్కోసారి ఆపరేషన్ టేబిల్‌పైనే ప్రసవం జరగవచ్చు. ఆపరేషన్ వల్ల తల్లి ప్రాణానికీ ముప్పు ఉంటుంది” మెల్లగా చెప్పింది డాక్టర్.

“మేం ఆలోచించుకోవాల్సి ఉంటుంది” అంది లెస్లీ.

తన భర్త మాట్లాడలేని పరిస్థితిలో ఉన్నాడని ఆమె అర్థం చేసుకుంది.

* * *

“నాకేం చేయాలో తోచటంలేదు. ఇద్దరి ప్రాణాలు ప్రమాదంలో పడేయటం నాకు ఇష్టంలేదు” కోపంగా అన్నాడు డీన్.

అతడిది కోపం కాదని, నిస్సహాయత వల్ల జనించిన ఉక్రోషం అనీ అతని కళ్లల్లోని నీళ్లు స్పష్టం చేస్తున్నాయి.

లెస్లీ అతడిని దగ్గర తీసుకుంది.

“మునిగేవాడు గడ్డి పోచనయినా ఆధారంగా భావిస్తాడు. ప్రస్తుతం మనకు వేరేదారి లేదు. ఇదే ఇంకొన్ని ఏళ్ల ముందు అయి ఉంటే, ఇంత ఆశ కూడా ఉండేది కాదు. కాబట్టి మనం డాక్టర్ చెప్పినట్టు ఆపరేషన్ అనే గడ్డిపోచను పట్టుకుందాం” అనునయిస్తూ అంది.

“కానీ... పాపకు ఎలాగో సమస్య ఉంది. మనం పాపను పోగొట్టుకోటానికే సిద్ధమయ్యాం. కానీ పాపను రక్షించే ప్రయత్నంలో నీకేదయినా అయితే...” డీన్ ఇక మాట్లాడలేకపోయాడు.

ఆమె ఒళ్లో ముఖం దాచుకున్నాడు.

“భగవంతుడు మనకు ఓ అవకాశం ఇచ్చాడు. పాపను రక్షించుకునేందుకు ఓ మార్గం సూచించాడు. మనం మన అనుమానాలతో, భయాలతో అడుగు వెనక్కు వేస్తే ఆ అవకాశాన్ని కోల్పోతాం. భగవంతుడిపై భారం వేసి అడుగు ముందుకు వేద్దాం . ఆయన ఇచ్ఛ ఎలా ఉంటే అలా జరుగుతుంది” స్థిరంగా అంది లెస్లీ.

“కానీ ఆపరేషన్ సక్సెస్ అవుతుందంటావా?” బేలగా అడిగాడు డీన్.

“మన చేతుల్లో ఏమీ లేనప్పుడు, భవిష్యత్తులో ఏం జరుగుతుందో తెలియనప్పుడు, మనకు చేతనైన ప్రయత్నం మనం చేసి, ఆపై భగవంతుడిని ప్రార్థించాలి. అంతా ఆయన ఇచ్ఛ ఎలా ఉంటే అలా జరుగుతుంది” స్థిరంగా అంది లెస్లీ.

“చూసుకుంటాడంటావా?”

“చూద్దాం. భవిష్యత్తులో ఏమవుతుందో తెలిసిందొక్కడికే” అంది లెస్లీ నవ్వుతూ.

* * *



© EMESCO BOOKS

ఆపరేషన్ ఆరంభమైంది. లెస్లీ గర్భసంచీని శరీరంలోంచి వెలికితీసింది డాక్టర్ చెస్‌చైర్. అయితే గర్భసంచీకి లెస్లీ శరీరానికి రక్తనాళాల ద్వారా సంబంధం ఉంది. పిండం గుండె కొట్టుకుంటున్నట్టు అల్ట్రాసౌండ్ తెలుపుతోంది. అల్ట్రాసౌండ్‌లో కనిపిస్తున్న ప్రతిబింబం ఆధారంగా ఆపరేషన్ కొనసాగిస్తోంది డాక్టర్. నెమ్మదిగా గర్భసంచీని, అతి జాగ్రత్తగా పిండానికి దూరం చేసింది డాక్టర్. వెంటనే ఓ 'సిరంజీ'ని గర్భసంచీలోకి పంపింది. దీనిద్వారా 'ఉమ్మనీరు' వేగంగా బయటకు రాసాగింది. ఆపరేషన్ జట్టులోని ఇద్దరు గబగబా ఉమ్మనీటిని శరీర ఉష్ణోగ్రత ఉన్న ఇతర ట్యూబుల్లో భద్రపరచసాగారు.

ఎంతో నైపుణ్యంతో డాక్టర్ పిండం 'స్పినాపైడ్ సాక్'ను చేరుకుంది. ఉమ్మనీరు లేకపోవటం వల్ల పిండం ప్రమాదంలో పడుతుంది. ఎటువంటి ప్రమాదం కలగకుండా శుభ్రపరచిన ఉప్పునీటిని పిండంపై చల్లుతున్నారు ఇతరులు.

ఆపరేషన్ జరపాల్సిన స్థలం కేవలం రెండు సెంటీమీటర్లు మాత్రమే. అందుకే ఆ ప్రదేశాన్ని పెద్దగా చేసి చూపించే పరికరాన్ని కళ్ళకు ధరించింది చెస్‌చైర్. మైక్రోసీజర్లతో స్పినోఫైడా సాక్‌ను జాగ్రత్తగా కోసి వేసింది. వెన్నుపూసను కప్పేబదులు, పక్కన పడి ఉన్న 'డ్యురా' పొరలను నెమ్మదిగా తీసి వెన్నుపూసపై పరిచింది. పెద్దలలో ఈ 'డ్యురా' చాలా కఠినంగా ఉంటుంది. కానీ 26 వారాల పిండం 'డ్యురా' తడిసిన టిష్యూ కాగితం అంతం మెత్తగా ఉంటుంది.

ఆపరేషన్ పూర్తయిపోయింది. దాంతో మళ్లీ నెమ్మదిగా గర్భాశయాన్ని దాని స్థానంలో జాగ్రత్తగా ఉంచింది. ఉమ్మనీటిని మళ్లీ గర్భాశయంలోకి ప్రవేశపెట్టింది. మిగతావారు ఆ ప్రాంతమంతా 'ఆన్టిబయాటిక్'లు చల్లారు. ఆ తరువాత తాను చేసిన గాయాన్ని కుట్టేసింది. ఆపరేషన్ థియేటర్ బయటకు వస్తూ దీర్ఘంగా నిట్టూర్చింది డాక్టర్.

* * *

ఆదివారం, డిసెంబర్ 16, 2001.

ఆపరేషన్ టేబిల్‌మీద నుంచి ఇంటెన్సివ్‌కేర్ యూనిట్‌లోకి చేరినవెంటనే లెస్లీకి నొప్పులు రావటం మొదలయ్యాయి. విశ్రాంతి తీసుకుంటున్న డాక్టర్లు, ఆపరేషన్ జట్టు గబగబా పరుగెత్తుకువచ్చారు.

పెద్దగా కేకలు పెడుతూ 730 గ్రాముల బరువు మాత్రమే ఉన్న శిశువు భూమిపై అడుగిడింది.

ఇంత త్వరగా జన్మించిన శిశువులు బతకటం కష్టం. డాక్టర్లు హడావుడిగా పాపను సురక్షితం చేశారు. పాప పుట్టిన రెండురోజుల తరువాతగానీ ఆమె తల్లిదండ్రులు ఆమెని చూడలేకపోయారు.



© EMESCO BOOKS

ఎర్రగా చిన్న తేలు అంత ఉన్న పాపని చూసి వారి ఆశ్చర్యానికి అంతులేదు. 'పిట్ట కొంచెం కూత ఘనం' అన్నట్టు వేలంత లేని ఆ పాప మొత్తం హాస్పిటల్ అదిరేట్టు కేకలు పెడుతూ ఏడవటమేకాదు. కాళ్లతో గాలిని తంతోంది.

తల్లిదండ్రుల ఆనందానికి అంతులేదు.

శిశువు, తల్లి ఇద్దరూ క్షేమంగానే ఉన్నారు. అసంభవమన్నది సంభవం అయింది. అద్భుతం ఇది! భగవంతుడి అద్భుతం ఇది!

ఇద్దరి కళ్లల్లో ఒకే భావం!

ఇద్దరూ ఒకేసారి అన్నారు – "భగవంతుడి గొప్పతనానికి, దయకు ప్రతిరూపం ఈ పాప. ఈమెకు 'గ్రేస్' అని పేరు పెడదాం.

* * *

"అమ్మా! నాన్నగారు చెప్పటంలేదు. నిన్నే అడగమంటున్నారు" బుంగమూతి పెట్టుకుని అమ్మ దగ్గరకు వచ్చింది గ్రేస్.

జీవంతో ఉట్టిపడుతున్న గ్రేస్ అద్భుతమైన కళ్లల్లోకి చూస్తూ సర్వం మరిచిపోయింది లెస్లీ. నిజంగా భగవంతుడి ఉనికి, గొప్పతనానికి రుజువులు అవసరమా? గ్రేస్‌ని ఎత్తుకుని ముద్దాడింది లెస్లీ.

"చెప్పమ్మా... దేవుడంటే ఎవరు?" మళ్లీ అడిగింది గ్రేస్.

"అదిగో ఆ బయట కనిపించే చెట్లు, కొండలు, వీచేగాలి, పారేనీరు, నువ్వు, నేను, మీ నాన్న ఇదంతా దేవుడే...! ముఖ్యంగా నువ్వు" అంటూ పాపని ముద్దాడింది లెస్లీ.

కిలకిల నవ్వింది గ్రేస్.

© EMESCO BOOKS

# పాములా చుట్టుకున్న పాపం

## చార్లెస్ శోభరాజ్ పాపం పండించిన 'డచ్' రాయబారి కథ

సెప్టెంబర్ 19, 2003. వార్తాపత్రికలో ఆ వార్త చదువుతూనే నిటారుగా కూర్చున్నాడు హెర్మన్ నిప్టెన్ బర్గ్. మరోసారి ఆ వార్తను గబగబా చదివాడు.

వార్తాపత్రిక పక్కనపెట్టి, ఓ నిముషం కిటికీలోంచి బయటగాలికి ఊగుతున్న చెట్లను చూశాడు. నీలి ఆకాశంలో కదులుతున్న మేఘాలను చూశాడు.

పత్రికను తీసుకుని ఈసారి నెమ్మదిగా ఆ వార్తను చదివాడు.

"నేపాల్ రాజధాని ఖాట్మండులో చార్లెస్ శోభరాజ్ అరెస్టు"- 30 ఏళ్ల క్రితం చేసిన హత్యా నేరంపై శోభరాజు అరెస్టయ్యాడు. పదే పదే ఆ వార్తను చదువుకున్నాడు హెర్మన్.

ఆ తరువాత నెమ్మదిగా లేచి తన గదిలోకి వెళ్లాడు హెర్మన్. తన గదిలో అటకమీద ఉంచిన ఫైళ్లన్నీ కిందకు లాగాడు. వాటిపైన పేరుకున్న దుమ్మును దులిపి ఒకటొకటిగా ఫైళ్లను తీసి చూడటం ఆరంభించాడు.

అన్నిటికన్నా అడుగున కనిపించింది ఆ ఫైలు. దాన్ని తీసుకుని సోఫాలో కూర్చున్నాడు. నెమ్మదిగా ఫైలు తెరిచాడు. ఆ ఫైలులో మొదటి కాగితాలు ఫిబ్రవరి 1976 నాటివి.

* * *

ఎప్పటిలాగే తనకు వచ్చిన ఉత్తరాలను చదువుతున్నాడు బ్యాంకాక్‌లోని డచ్ దౌత్య కార్యాలయాధికారి హెర్మని నిప్టెన్ బర్గ్. ఇంతలో అతని దృష్టిని ఆ ఉత్తరం ఆకర్షించింది.

తన దేశం నుంచే వచ్చిన ఉత్తరం కావటంతో గబగబా తెరిచాడు. హెర్మన్ బ్యాంకాక్ వచ్చి కొన్ని నెలలే అవుతోంది. అందుకే తన దేశం నుంచి వచ్చిన దేన్ని చూసినా ఎంతో ఆప్యాయంగా అనిపిస్తోంది. అయితే, ఉత్తరంలో ఉన్న విషయాలు అతనికి ఆనందం కలిగించలేదు.

© EMESCO BOOKS

'అమ్‌స్టర్‌డామ్' నుంచి 'జాంట్' అనే వ్యక్తి రాసిన ఉత్తరం అది.

అతని వదిన 'కార్నేలియా', ఆమె బాయ్‌ఫ్రెండ్ 'హెన్రికస్'లు సెలవుల్లో విహారానికని ఆసియా వచ్చారు. ఆసియా ఖండంలోని దేశాలు తిరగటం ఆరంభించారు. ఏ దేశంలో ఉన్నా, వారానికి ఓసారి ఉత్తరం తప్పనిసరిగా రాస్తూ వచ్చారు. కానీ హాంకాంగ్ చేరినప్పటినుంచీ వారి నుంచి ఉత్తరాలు రావటంలేదు. చివరి ఉత్తరం డిసెంబర్ 8, 1975న హాంకాంగ్‌లో రాసింది. తాము హాంకాంగ్ వదలి బ్యాంకాక్ వెళ్తున్నట్టు రాశారు ఆ ఉత్తరంలో. తమకు ఉత్తరాలు 'చియాంగ్‌కూయ్' పోస్టాఫీసు అడ్రసుకు రాయమని రాశారు. అంతే, ఆ తర్వాత వారినుంచి ఎటువంటి కబురులేదు. వాళ్ల చివరి ఉత్తరంలో మరో విషయం రాశారు.

ఓ వజ్రాల వ్యాపారి తమను బ్యాంకాక్ తీసుకువెళ్తున్నట్టు తెలిపారు. ఆ వ్యాపారి ఫ్రెంచి పౌరుడని, కానీ ఇండో-వియత్నాం సంతతికి చెందిన వాడనీ ఉత్తరంలో ఉంది. ఇన్నాళ్లయినా తన వదిననుంచి ఎటువంటి కబురులేదు. కాబట్టి, వాళ్ల గురించి విచారించి, వాళ్ల అడ్రసులు కనుక్కోమని 'జాంట్', డచ్ దౌత్య కార్యాలయాధికారికి రాశాడు.

హెర్మన్‌కు అప్పుడు 31 ఏళ్లు. అదే అతని మొదటి పోస్టింగ్. పైగా తప్పిపోయింది. తమ దేశానికి చెందిన యువతీ యువకులు. అందుకే వెంటనే పరిశోధన ప్రారంభించాడు హెర్మన్.

డచ్ దౌత్యాధికారిగా తన పలుకుబడిని ఉపయోగించి, బ్యాంకాక్‌కు వచ్చిన యువతీ యువకుల వివరాల సేకరించాడు. వాటి ప్రకారం డిసెంబర్ 11, 1975న కార్నేలియా, హెన్రికస్‌లు బ్యాంకాక్ వచ్చారని తెలిసింది. డచ్ అధికారుల సహాయంతో వారిద్దరి ఫొటోలు సంపాదించాడు. ఎయిర్‌పోర్ట్‌లో టాక్సీ డ్రయివర్లకూ, పరిసర ప్రాంతాలలోని హోటళ్లలో పనివారికీ ఆ ఫొటోలు చూపించి, వారెవరైనా వీరిని గుర్తు పట్టగలరేమో ప్రశ్నించాడు. వారం రోజుల తరువాత ఫలితం కనిపించింది, ఓ టాక్సీ డ్రైవర్ వారిద్దరి ఫొటోలను గుర్తించాడు.

"వీళ్లు అలైన్ గాటియర్ అనే వజ్రాల వ్యాపారితో కనిపించారు. నా టాక్సీలోనే వారిని ఎయిర్‌పోర్ట్‌నుంచి గాటియర్ అపార్ట్‌మెంట్ వరకూ తీసుకువెళ్లాను" చెప్పాడు టాక్సీ డ్రైవర్.

కానీ గాటియర్ ఇంటి అడ్రసు చెప్పలేకపోయాడు.

పోలీసుల సహాయంతో 'చియాంగ్‌మై' పోస్టాఫీసులో జమయిన కార్నేలియా, హెన్రికస్‌ల కోసం వచ్చిన ఉత్తరాలను జప్తు చేస్తున్నాడు హెర్మన్. ఆ ఉత్తరాల వల్ల, కార్నేలియా, హెన్రికస్‌ల బ్యాంకాక్‌లో ఓ మలేషియా హోటల్‌లో గది బుక్ చేసుకున్నారనీ, కానీ ఆ హోటల్ చేరలేదని తెలిసింది. ఇంతలో బ్యాంకాక్ పోలీసుల నుంచి హెర్మన్‌కు ఫోన్ వచ్చింది.

"మాకు రెండు విదేశీయుల శవాలు దొరికాయి. మీరు ఓసారి రావాలి". హెర్మన్ మనసు కీడును శంకించింది.

‘‘ఈ రెండు శవాలు కార్నేలియా, హెన్రికస్‌లవి కాకూడదు’’ అనుకుంటూ బయలుదేరబోయాడు. ఇంతలో ఫోన్ మోగింది. బెల్జియన్ దౌత్యాధికారి పాల్ సీమన్స్ ఫోన్ అది.

“హెర్మన్, బ్యాంకాక్ వచ్చే మీదేశం వారికి ఓ హెచ్చరికను విడుదల చేయాలి” అన్నాడు పాల్.

“ఏమిటది?” అడిగాడు హెర్మన్.

“ఇక్కడ ఓ నీలివార్త ప్రచారంలో ఉంది. ఈ దేశానికి వచ్చే పర్యాటకులను ఓ ఫ్రెంచివాడు మోసం చేస్తున్నాడట. వాళ్లకి మాయమాటలు చెప్పి, నమ్మించి, తన ఇంటికి తీసుకువెళ్లి వాళ్లని చంపి డబ్బులు, ఇతర విలువైన వస్తువులు కాజేస్తున్నాడట. కాబట్టి, సరైన రిఫరెన్స్ లేనివారితో సంభాషించవద్దని, వారితో స్నేహం చేయవద్దని, అటువంటి వాళ్ల మాటలు నమ్మవద్దనీ హెచ్చరిక జారీ చేయాలి.”

పాల్ మాటల గురించి ఆలోచిస్తూ, శవాలను గుర్తుపట్టేందుకు వెళ్లాడు హెర్మన్. కానీ శవాలు పూర్తిగా కాలిపోయి ఉన్నాయి. గుర్తుపట్టటం కష్టం. దాంతో, వాళ్ల డెంటల్ రికార్డ్స్ పంపించమని అమ్‌స్టర్‌డామ్‌ను కోరాడు. మార్చ్ 3న వాళ్ల డెంటల్ రికార్డులు బ్యాంకాక్ చేరాయి.

శవాల పళ్ల వరుసను, ఈ రికార్డులతో పోల్చారు. అవి కార్నేలియస్, హెన్రికస్‌ల శవాలే. హెర్మన్ మనసు పాడయిపోయింది.

‘అధికారికంగా చూస్తే పరిశోధనలో అతని పాత్ర పూర్తయిపోయింది. హంతకుడిని వేటాడి పట్టుకోవటం అతడి బాధ్యతకాదు. కానీ రెండు యువ జీవితాలు క్షణంలో కాలి బూడిద అయిపోయాయి. దానికెవరు బాధ్యులో వారు స్వేచ్ఛగా తిరుగుతూ, జీవితాన్ని హాయిగా అనుభవిస్తూండటం న్యాయమా?’ తన దౌత్య ఉద్యోగంతో సంబంధం లేకుండా వ్యక్తిగతంగా ఈ కేసు పరిశోధించాలని హెర్మన్ నిశ్చయించుకున్నాడు.

ఆ జాబితాలోంచి ఆసియాలో పుట్టిన ఫ్రెంచిపౌరుల వివరాలను వేరుచేశాడు. ఆ తరువాత థాయ్‌లాండ్ పోలీసుల సహాయం కోరాడు.

“ఈ ఫ్రెంచ్ పౌరులెవరి పైనయినా ఫిర్యాదులున్నాయా? లేక వీరికి నేరచరిత్ర ఏమైనా ఉందా?” అని అడిగాడు.

పోలీసులు ఆ లిస్టు చూస్తూనే ఓ పేరు దగ్గర ఆగిపోయారు.

“అలన్ గాటియర్ గురించి ఈ మధ్యనే ఓ ఫిర్యాదు వచ్చింది. అతడి ఫ్లాట్‌కు విదేశీయులు ఎక్కువగా వస్తున్నారని, వచ్చినవారు అనారోగ్యం పాలవుతున్నారని” పాల్, హెర్మన్‌లు ముఖాలు చూసుకున్నారు.



© EMESCO BOOKS

"అతడి అడ్రసు ఇవ్వండి" కోరారు.

ఆపై పోలీసు కమీషనర్‌ని కలిశారు. 'మా దేశానికి చెందిన యువతీ యువకులు హత్యకు గురయ్యారు. ఇతనికి ఆ హత్యతో సంబంధం ఉంటుందని మా అనుమానం. అతని అపార్ట్‌మెంట్‌ను వెతికేందుకు మాకు అనుమతి కావాలి".

పోలీసు కమీషనర్ వెంటనే అనుమతినిచ్చాడు. వారికి సహాయంగా ఇద్దరు పోలీసులను పంపాడు. 'అలన్ గాటియర్' ఫ్లాట్‌లో బోలెడన్ని విదేశీయుల పాస్‌పోర్ట్‌లు దొరికాయి. రకరకాల వస్తువులు దొరికాయి. ఆ వస్తువుల గుట్టలో హెన్రికస్ డైరీ దొరికింది!

* * *

గాటియర్ గదిలో దొరికిన వస్తువులను బట్టి చూస్తే కార్నేలియాస్, హెన్రికస్‌లు మాత్రమే అతని బారిన పడ్డవారు కాదని అర్థమౌతోంది.

"ఇంకా అనేకమంది విదేశీయులు అతని మాయమాటలకు లొంగి మోసపోయారని తెలుస్తోంది" అన్నాడు పోలీసు కమీషనర్.

"అతని గదిలో సంకెళ్లు దొరికాయి. ఈ సంకెళ్లతో తాను చంపేవారిని మంచానికి కట్టేసేవాడని తెలుస్తోంది" అన్నాడు డిటెక్టివ్.

"అమాయకులను మాయమాటలతో మోసగించి వారిని తన గదికి ఆహ్వానిస్తాడు. అతడితోపాటు అతని గర్ల్‌ఫ్రెండ్ 'మేరీ ఆండ్రి లెక్లెర్క్' ఉండటంతో అతడిని నమ్మేవారు. ఇంటికి వచ్చిన తరువాత ఇక్కడి నీటివల్ల వచ్చేవ్యాధులు రాకుండా ఉండేందుకు వేసుకోమని టాబ్లెట్స్ ఇస్తాడు. అవి వేసుకున్న వెంటనే అనారోగ్యానికి గురయ్యేవారు పర్యాటకులు. వారు బలహీనం కాగానే వారిని కట్టేసి, వారి దగ్గరున్న విలువైన వస్తువులను కాజేసిన తరువాత వారిని చంపేసేవాడు. వీరికి సహాయంగా అజయ్‌చౌదరీ అనే భారతీయుడు కూడా ఉన్నాడని తెలిసింది" తాను సేకరించిన వివరాలను ఓ నివేదికలా సమర్పించాడు హెర్మన్.

ఆ ఫైలు 'నిప్పెన్‌బర్గ్ ఫైల్'లా ప్రసిద్ధి పొందింది. పోలీసులు సాధించలేనిది ఓ దౌత్యాధికారి సాధించటం చూసి థాయ్‌లాండ్ పోలీసులు సిగ్గుపడ్డారు. వెంటనే రంగంలోకి దూకారు.

అప్పుడు తెలిసింది వారికి తామింతకాలం 'గాటియర్' అని భావిస్తున్న వ్యక్తి అసలుపేరు చార్లెస్ శోభరాజ్ అని! అతనికి అంతకుముందే నేరచరిత్ర ఉందని. వెంటనే అరెస్టు వారంటు తయారుచేశారు పోలీసులు.

కానీ, పోలీసులు ఇల్లు చేరేలోగా శోభరాజ్ మలేషియా పారిపోయాడు. శోభరాజ్ మలేషియా వెళ్లినా హెర్మన్ అతడి గురించిన సమాచారం సేకరించటం వదలలేదు. మలేషియా

© EMESCO BOOKS

నుంచి చార్లెస్ శోభరాజ్ ఇండియా చేరాడు. ఢిల్లీ చేరిన 60 మంది ఫ్రెంచి టూరిస్టులతో స్నేహం చేశాడు. వారికి మత్తుమందు ఇచ్చాడు. కానీ డోసు ఎక్కువకావటంతో వారు హోటల్ గది చేరకముందే అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. వారిద్వారా శోభరాజ్ గురించి తెలుసుకున్న పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. శోభరాజ్‌ని చూస్తూనే పోలీసులు 'షాక్' తిన్నారు.

ఎందుకంటే నాలుగేళ్ల క్రితం వజ్రాల దొంగతనం నేరంలో శోభరాజ్ అరెస్టయ్యాడు. జైలు నుంచి తప్పించుకున్నాడు. శోభరాజ్ ఇచ్చిన మత్తుమందు ప్రభావంతో ఓ ఫ్రెంచి పర్యాటకుడు ప్రాణాలు కోల్పోవటంతో శోభరాజ్‌పై హత్యానేరం మోపబడింది. అతడికి పదేళ్లు, అతడి గర్ల్ ఫ్రెండ్ 'లెక్లెర్క్'కు ఎనిమిదేళ్ల జైలుశిక్ష కోర్టు విధించింది. అజయ్ చౌదరి మాత్రం పోలీసులకు దొరకలేదు.

* * *

కార్నేలియస్, హెర్నిక్‌స్‌ల హత్యానేరంపై కాకున్నా ఏదో ఒక నేరానికి శోభరాజ్‌కు జైలుశిక్ష లభించినందుకు సంతోషించాడు హెర్మన్. కానీ అతని సంతోషం ఎక్కువకాలం నిలవలేదు.

1986లో, జైలుగార్డుకి మత్తుమందు ఇచ్చి తీహార్ జైలునుంచి శోభరాజు తప్పించుకున్నాడు. కొన్ని వారాల తరువాత పోలీసులు అతడిని గోవాలో పట్టుకున్నారు. అతడి జైలుశిక్ష మరో పదేళ్లు పొడిగించారు.

ఈసారి శోభరాజ్ కొత్త ఎత్తుగడ వేశాడు. తన జీవిత చరిత్ర రచన హక్కులు, సినిమా హక్కులను పెద్ద మొత్తానికి అమ్మాడు. అలా వచ్చిన డబ్బుతో జైల్లో సకల సౌఖ్యాలు అనుభవించసాగాడు. "ప్రపంచం ఎంత పిచ్చిది. ఓ నేరస్తుడి గురించి చదివేందుకు, వినేందుకు, అతడి జీవితం ఆధారంగా తీసే సినిమాలు చూసేందుకు ఎగబడతారు ప్రజలు. అదే, నీతి నిజాయితీలతో, క్రమశిక్షణగా ఉత్తమరీతితలో జీవితం గడిపేవారి గురించి ఎవరూ వినేందుకు ఇష్టపడరు. అందుకే ప్రపంచం నేరం వైపు మొగ్గు చూపినంతగా, మంచితనానికి ప్రాధాన్యమివ్వదు" అనుకున్నాడు హెర్మన్. అయినా అతను శోభరాజ్‌పై ఆసక్తిని వదల్లేదు.

1982లో లెక్లెర్క్ పెరోల్ మీద విడుదలైంది. ఆమె సంవత్సరాంతానికల్లా కేన్సర్‌తో మరణించింది.

శోభరాజ్ 1997లో జైలు నుంచి విడుదలయ్యాడు.

కొన్నాళ్లకు నేపాల్‌లో మరో హత్యానేరానికి అరెస్టయ్యాడు.

* * *

నేపాల్‌లో శోభరాజ్ హత్యా నేర విచారణ వివరాలను హెర్మన్ ఆసక్తిగా తెలుసుకోవటం ఆరంభించాడు. ఇప్పుడు హెర్మన్ రిటైరయినా, అతనికి గుర్తుపట్టరాని రీతిలో కాలిపోయిన

డచ్ యువతీ యువకుల శవాలు మరపుకురాలేదు. కోర్టులో తానెప్పుడూ నేపాల్ రాలేదని వాదించాడు శోభరాజ్. తాను నేపాల్‌లో అడుగుపెట్టటం అదే ప్రథమమని చెప్పాడు.

"అతడు నిర్ధోషి' అని అందరూ భావించే పరిస్థితి వచ్చింది.

అప్పుడు రంగంలోకి దూకాడు హెర్మన్. తన ఫైలు పట్టుకుని నేపాల్ చేరాడు.

కోర్టుకి శోభరాజ్ కదలికలపై తాను సేకరించిన వివరాలను సమర్పించాడు.

"శోభరాజ్ ఇంతవరకూ నేపాల్‌లో అడుగు పెట్టలేదనటం అబద్ధం. 1975లో పలుమార్లు శోభరాజ్ నేపాల్ వచ్చాడు. కోనీ, లారెంట్‌ల హత్య జరిగిన సమయంలో శోభరాజ్ నేపాల్‌లో ఉన్నాడు. 1976లో ఢిల్లీ పోలీసులముందు శోభరాజ్, లెక్లెర్క్‌లు తాము దొంగ పాస్‌పోర్టులపై నేపాల్ ప్రయాణం చేసినట్టు ఒప్పుకున్నారు. అంతేకాదు, కార్నేలియా, హెన్రికస్‌లను హత్యచేసిన తరువాత ఆ పాస్‌పోర్ట్‌లపై తమ బొమ్మలు అతికించుకుని వీరు ప్రయాణం చేశారు" చెప్పాడు హెర్మన్.

బ్యాంకాక్ ఎయిర్‌పోర్ట్‌లో శోభరాజ్ మారుపేరుతో నింపిన ఫారం ఎయిర్‌లైన్ ప్యాసింజర్ లిస్టులతోసహా, నేపాల్ ప్రవేశించేందుకు వాడిన దొంగ పాస్‌పోర్ట్ వివరాలు కూడా నేపాల్ పోలీసులకు అందించాడు హెర్మన్. అంతేకాదు, నేపాల్ విమానంలో శోభరాజ్ పక్కన కూర్చుని ప్రయాణం చేసిన ప్రయాణీకుడి వివరాలు కూడా కోర్టుకు సమర్పించాడు హెర్మన్.

30 ఏళ్లుగా అతడు సాగిస్తున్న పరిశోధన – ఆ రోజు ఫలితం ఇచ్చింది. న్యాయంకోసం అతడి అన్వేషణ ఆరోజు పూర్తయింది.

ఆగస్టు 12, 2004న
శోభరాజ్‌కు యావజ్జీవ కారాగార శిక్షపడింది.

* * *

జైల్లో ఓ డచ్చి రిపోర్టర్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో శోభరాజ్ ఆవేదనగా చెప్పాడు.

"హెర్మన్ ఎవరో నాకు తెలియదు. అతడిని నేనెప్పుడూ కలవలేదు. అతడికి నామీద ఇంత పగ ఎందుకో నాకు అర్థం కావటంలేదు"

ఆ వ్యాఖ్య విని నవ్వాడు హెర్మన్?

"నాకు ఎవరిమీద కోపంలేదు. ద్వేషంలేదు. నేను ఆశించిందల్లా న్యాయం జరగాలని. నేరస్తుడికి శిక్షపడాలని. అందుకు అవసరమైతే వందేళ్లయినా ఎదురు చూసేందుకు సిద్ధమే" అన్నాడు.



© EMESCO BOOKS

# అమ్మప్రాణం సాక్షిగా

**ప్రాణం కంటే మాతృత్వానికే పెద్దపీట వేసిన ఓ మాతృమూర్తి కథ**

"మిషెల్ ఓ సాంటిస్" నర్సుపిలిచింది. తనపేరు వినబడగానే లేచి నిలుచుంది మిషెల్. ఆమెతో పాటు ఆమె భర్త 'జిమ్' కూడా లేచి నిలుచున్నాడు.

ఆమెతోపాటు డాక్టర్ గది తలుపు వరకూ నడిచాడు. తలుపు తోసుకుని ఆమె లోపలకు వెళ్తూంటే, ఆమె చేయి పట్టుకుని గట్టిగా వొత్తి వదిలాడు.

ఆ ఒత్తిడిలో, అతనికి ఆమె పట్ల ఉన్న అనురాగం, ఆమె పరిస్థితి మెరుగవాలన్న భావన, ఆమె వేదన పట్ల సానుభూతి, ఆమెకు తోడుగా ఉన్నానన్న భావనలు సర్వం ఆమె అర్థం చేసుకుంది.

అతనివైపు చూసి చిరునవ్వు నవ్విలోపలకు వెళ్లింది.

కాస్సేపటికి మిషెల్‌ను స్ట్రెచర్‌పై పడుకోబెట్టి బయటకు తెచ్చారు సిబ్బంది. ఆ స్ట్రెచర్‌ని తోసుకుంటూ ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకువెళ్లారు. ఆపరేషన్ గదిలో డాక్టర్ ఆమెని చూసి 'భయం లేదన్నట్టు' నవ్వాడు. 'తాను తీసుకున్న నిర్ణయం సరైనదా? కాదా?' అన్న అనుమానం ఆమెని వేధిస్తోంది. కానీ, జీవితంలో ఒకోసారి కఠిన నిర్ణయాలు తీసుకోవడం తప్పనిసరి అవుతుంది. నిర్ణయం తీసుకున్న సమయంలో అదే ఉత్తమ నిర్ణయం అనిపిస్తుంది. కానీ ఆ నిర్ణయం సరైనది కాదని భవిష్యత్తులో తేలితే?' బాధతో కళ్లు మూసుకుంది మిషెల్.

"ప్రస్తుత పరిస్థితులలో మనం తీసుకున్న నిర్ణయం సరైనది. అది తప్పని భవిష్యత్తు తేలిస్తే?! దాని బాధ్యత మనదికాదు. భవిష్యత్తులో ఏం జరుగుతుందో మనకు తెలియదు కదా! మన పరిమిత పరిధిలో మన నిర్ణయం ఉత్తమమైంది. అంతే ఆలోచించు" రాత్రి ఆమెకి ధైర్యం

© EMESCO BOOKS

చెప్తూ జిమ్ అన్న మాటలు ఆమెకు గుర్తుకువచ్చాయి. ఇంతలో, డాక్టర్లు ఇచ్చిన మత్తుమందు ప్రభావం మొదలయింది. కళ్లు బరువయ్యాయి. మాయలా మత్తు ఆమెని ఆవరించింది.

ఆమె మనసు గతంవైపు పరుగులు తీసింది.

* * *

మిషెల్ గర్భవతి అని నిర్ధారణ అయిన రోజు జిమ్, మిషెల్‌లు సంబరాలు చేసుకున్నారు. వాళ్ల కొడుకు 'జేమ్స్' ఆనందానికి అంతులేదు. ఎప్పటినుంచో ఆడుకోవటానికి తమ్ముడు కావాలని జేమ్స్ డిమాండ్ చేస్తూ వచ్చాడు. తనకో తమ్ముడు కావాలని దేవుడిని ప్రార్థిస్తూ వచ్చాడు. దేవుడు తన ప్రార్థనలకు సమాధానం ఇచ్చాడని పొంగిపోయాడు జేమ్స్. గర్భవతి అయిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకుంటూ, నిర్ణీత సమయానికి డాక్టర్ పరీక్షలు చేయించుకుంటూ వస్తోంది మిషెల్. ఆ రోజు మామూలు పరీక్షలన్నీ అయ్యాక, డాక్టరు రిపోర్టులు ఆమె చేతికిస్తూ చెప్పాడు–

"ఓసారి సోనోగ్రామ్ చేయించుకోండి."

"ఎందుకని?" అడిగింది మిషెల్.

"మామూలుగా, రొటీన్‌గాచేసే పరీక్ష అది. గర్భవతిగా ఉన్న సమయంలో వక్షోజాల్లో కణతిలాగా తగిలితే, ముందు జాగ్రత్తగా చేస్తామా పరీక్ష. డోన్ట్‌వర్రీ" ధైర్యం చెప్పాడు డాక్టర్.

రేడియోలజిస్టుకు డాక్టర్ ఇచ్చిన చీటీ అందిస్తూ క్యాజువల్‌గా ఆయన ఏం రాశాడోనని చూసింది.

"అదేమిటి, అల్ట్రాసౌండ్ కుడివైపు రాశాడు. ఎడమవైపు కణతి ఉందని నాతో అన్నాడు" రేడియాలజిస్టుతో అంది మిషెల్. అతను డాక్టర్‌కి ఫోన్ చేసి విషయం కనుక్కున్నాడు.

"రెండువైపులా పరీక్షించమన్నాడు."

పరీక్ష అయిన తరువాత ఆమె ఇల్లు చేరేలోగా డాక్టర్ నుంచి ఫోను అర్జంటుగా రమ్మని. ఆమె, జిమ్‌కు ఫోన్ చేసింది. అరగంటలో అతను వచ్చాడు. ఇద్దరూ కలసి డాక్టర్ వద్దకు వెళ్లారు.

డాక్టర్ ముఖం చూడగానే ఏదో ప్రమాదం ముంచుకు వచ్చిందని ఇద్దరికీ అర్థమయింది.

"సాధారణంగా ముప్పైఏళ్ల వయసులోపు వారికి బ్రెస్ట్‌కేన్సర్ రావటం అరుదుగా జరుగుతుంది. కానీ కుడివైపు కొన్ని కణాలకు కేన్సర్ ఉన్నట్టు రేడియోలజిస్టు అంటున్నాడు. బయోప్సీ చేసిన తరువాత కానీ ఏదీ నిర్ధారణగా చెప్పలేం" చెప్పాడు డాక్టర్.

© EMESCO BOOKS

మిషెల్ ముఖం వాడిపోయింది. జిమ్ ముఖం బాధామయమైంది. ఆరోజు వెంటనే బయాప్సీ జరిగింది. రాత్రంతా జిమ్, మిషెల్–ఇద్దరూ నిద్రపోలేదు. ఒకరి చేతులు ఒకరు పట్టుకుని కూర్చున్నారు. 'విధి ఎంత క్రూరమైంది! అత్యంత ఆనందం అనుభవించిన క్షణాల వెంటనే అత్యంత వేదనను అనుభవించాల్సి వస్తోంది.'

"మొదట బయోప్సీవల్ల సరిగ్గా నిర్ధారించలేకపోతున్నాం. రెండో బయోప్సీకావాలి" నిర్భావంగా చెప్పాడు డాక్టర్.

"డాక్టర్.." ఏదో అడగబోతున్న జిమ్ మాటలమధ్యలోనే అడ్డుకున్నాడు డాక్టర్.

"ఒకసారి రెండు మూడు బయోప్సీలయితే కానీ ఏదీ నిర్ధారణగా చెప్పలేం."

మూడవ బయోప్సీకూడా జరిగింది. మొదటి రెండుసార్లకన్నా ఆలస్యంగా వచ్చింది రిపోర్టు. మరణశిక్ష విధిస్తున్న జడ్జిలా ఉంది డాక్టర్ ముఖం.

"బ్రెస్ట్ కేన్సర్ ఉందని స్పష్టంగా తెలిసింది. కుడివైపు స్పష్టంగా తెలుస్తోంది. కానీ సోనోగ్రామ్ జరగకపోతే ఎడమవైపు కూడా ఉన్నట్టు తెలిసేదికాదు."

డాక్టర్ మాటలు వింటూనే కుప్పకూలిపోయింది మిషెల్. ఆమెకు తాను మరణిస్తున్నాననిపించింది. జిమ్ ఎంత ఓదార్చినా ఆమె కన్నీరు ఆగటంలేదు.

"బ్రెస్ట్ కేన్సర్‌వల్ల మరణం తప్పదని అనుకోవటం పొరపాటు. సరైన సమయంలో చికిత్స జరిగితే కేన్సర్ ఇతర కణాలకు పాకకుండా అరికట్టవచ్చు. మరీ అవసరమనుకుంటే, వక్షోజాన్ని తొలగించాల్సి ఉంటుంది. అలా కేన్సర్‌ను అరికట్టవచ్చు.

డాక్టర్ మాటలు వింటూంటే మిషెల్‌లో భయం మరింత పెరిగిపోసాగింది.

'ఒక వక్షోజాన్ని తొలగిస్తే...!' – ఆ ఆలోచన ఊహించుకుంటేనే భయంగా ఉంది. దీనికన్నా మరణమే మేలేమో అనుకుంది.

"మీరు, బ్రెస్ట్ కేన్సర్ స్పెషలిస్ట్‌ని కలవండి" మరో డాక్టర్ అడ్రసు ఇచ్చాడు.

బ్రెస్ట్ కేన్సర్‌కి రకరకాల చికిత్సలున్నాయి. కానీ మీరు గర్భవతి అవటం పరిస్థితిని మరింత క్లిష్టతరం చేస్తుంది. లంపెక్టమీ, మాస్టెక్టమీ, కెమో థెరపీలతో బ్రెస్ట్‌కేన్సర్ చికిత్స చేయవచ్చు."

డాక్టర్ మాటలకు అడ్డొచ్చింది మిషెల్.

'కెమో థెరపీ వద్దు. జుట్టు ఊడిపోతుంది." నవ్వింది డాక్టర్.

"కానీ చికిత్స ఆరంభించేముందు మరో ప్రధానమైన నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది."

'ఏమిటన్నట్టు' ప్రశ్నార్థకంగా చూసింది మిషెల్.

© EMESCO BOOKS

"గర్భస్రావం చేయాలి. ఆ తరువాత లంపెక్టమీ, తరువాత రేడియేషన్" నిర్భావంగా చెప్పింది డాక్టర్.

ఆమె మాటలు వింటూనే ఏడవసాగింది మిషెల్.

'ఎన్ని కలలు కన్నది ఈ సంతానం గురించి? ఎన్నో ఆశలు పెట్టుకుంది పుట్టబోయే బిడ్డ గురించి! ఇప్పుడు గర్భస్రావం అంటే...? ఆ ఆశలన్నీ వదిలేసుకోవటమేనా?'–

"లేదు నేను గర్భస్రావానికి ఒప్పుకోను. భగవంతుడు నాకు స్త్రీగా ఇస్తున్న అమూల్యమైన వరం మాతృత్వం. నేను ఆ వరాన్ని కాలదన్ని, ప్రాణిహత్యకు సిద్ధపడను. నేను మరణించినా ఫరవాలేదు" నిశ్చయంగా చెప్పింది మిషెల్.

"మీకు నేను మరో విషయం చెప్పలేదు. మీకు ఉన్న ట్యూమర్ ఈస్ట్రోజెన్ పాజిటివ్ ట్యూమర్."

"అంటే?" అడిగాడు జిమ్.

"అంటే, మీకున్న ట్యూమర్ ఈస్ట్రోజెన్ ఆధారంగా ఎదుగుతుంది. గర్భవతుల్లో ఈస్ట్రోజెన్ అధికంగా ఉత్పత్తి అవుతుంది. అంటే, రక్తంలో ఉన్న ఈస్ట్రోజెన్ ఆధారంగా ట్యూమర్ ఎదుగుతూ వస్తుంది. కాబట్టి గర్భస్రావం చేసుకుంటే, చికిత్స వల్ల ఫలితం త్వరగా ఉంటుంది."

"నేను గర్భస్రావం చేసుకోకుండా చికిత్స చేసుకుంటే?" ప్రశ్నించింది మిషెల్.

"ఒకవేళ 'లింఫ్‌నోడ్స్'పై కేన్సర్ ప్రభావం లేకపోతే ఫలితం ఉంటుంది" ఆలోచించి చెప్పింది డాక్టరు.

"దానికి టిష్యూ సాంపిల్స్ అవసరం. పరీక్షలు చేయాల్సి ఉంటుంది" చెప్పింది డాక్టరు మళ్లీ.

ఆరోజు రాత్రి జిమ్‌తో వాదనకు దిగింది మిషెల్.

"లింఫ్ నోడ్స్‌పై కేన్సర్ ప్రభావం ఉందో, లేదో తెలియనప్పుడు తొందరపడి గర్భస్రావం చేయించుకోవటం ఎందుకు? అసలు గర్భవతిని కాకపోతే, సోనోగ్రామ్ పరీక్ష చేసేవారు కాదు. ఆ పరీక్ష చేయకపోతే నాకు బ్రెస్ట్ కేన్సర్ ఉన్నట్టు తెలిసేదే కాదు. అంటే, మనకు పుట్టబోయే బిడ్డ నా ప్రాణం కాపాడిందన్నమాట. మరి నా స్వార్థం కోసం నేను నా బిడ్డ ప్రాణం తీయనా?"

ఆమె వాదనకు ఎదురు వాదన జిమ్‌వద్దలేదు.

జిమ్ మౌనంగా ఉండిపోయాడు. జిమ్‌ని దగ్గర తీసుకుని లోగొంతుకతో చెప్పింది మిషెల్.

"ఒక ప్రాణికి జన్మనివ్వటం మరపురాని మధురానుభూతి. అది నీకు అర్థంకాదు జిమ్. నాలో ఒదిగి ఎదిగి, ప్రాణం పోసుకున్న పిల్లవాడు, బయట ప్రపంచానికి వచ్చి ఎదుగుతాడు.



© EMESCO BOOKS

తనదంటూ ప్రత్యేకమైన వ్యక్తిత్వాన్ని సాధిస్తాడు. సమాజంపై ముద్రవేస్తాడు. సంతానాన్నికంటాడు. తద్వారా నిన్నూ, నన్నూ చిరంజీవులను చేస్తాడు. ఈ అద్భుతానికి జన్మనిచ్చే అవకాశాన్ని కాదనుకుంటామా?"

* * *

ఆమె మాటలు విన్న డాక్టర్ అడ్డంగా తల ఊపింది.

"నువ్వు గర్భస్రావం చేయించుకోకతప్పదు" స్థిరంగా అంది డాక్టరు.

తల అడ్డంగా ఊపింది మిషెల్.

"డాక్టర్, ఒకవేళ నేను గర్భస్రావం చేసుకుంటే, నాకున్న ట్యూమర్ తగ్గటానికి 'టోమోక్సిఫెన్' అనే మందు అయిదేళ్లు ఇస్తారని తెలిసింది".

డాక్టర్ తల ఊపింది.

"అందువల్ల నేను మళ్లీ గర్భవతియ్యే అవకాశం తగ్గుతుందనీ తెలిసింది!"

"అటువంటిదేమీ నిర్ధారణగా చెప్పలేం. కానీ ప్రమాదం అయితే ఉంది" అయిష్టంగా అంది డాక్టర్.

"కాబట్టి నేను ఇప్పుడు గర్భస్రావం చేయించుకోవటం అంటే, జీవితాంతం గర్భవతిని అయ్యే అవకాశాన్ని వదులుకోవటమే. నా ప్రాణం కోసం పసిప్రాణం తీయటమే."

"కానీ పరిస్థితి తీవ్రత అటువంటిది"

"ఒద్దు డాక్టర్. నాకు బ్రెస్ట్ కేన్సర్ చికిత్స వద్దు. లంపెక్టమీ వద్దు. రేడియోషన్ వద్దు."

"మరి..."

"నా వక్షోజాన్ని తొలగించండి. గర్భవతులెందరో టాన్సిల్స్ చేయించుకుంటారు. కాబట్టి లంపెక్టమీ అయినా, మాస్టెక్టమీ అయినా సమస్యేలేదు. నా వక్షోజాన్ని తొలగించండి. మీరే అన్నారుగా, మొత్తం తొలగించాల్సిన అవసరం లేదు. కేన్సర్ ఉన్న భాగాన్ని తొలగిస్తే చాలు అని. అందువల్ల అవి అందవికారంగా తయారవుతాయి. ఫరవాలేదు. టోమోక్సిఫెన్ మందు తీసుకునే సమయం వరకూ పిల్లవాడికి పాలివ్వగలుగుతాను. ఈలోగా లింఫ్‌నోడ్స్ పరీక్ష ఫలితాలు వస్తాయి. దాని గురించి అప్పుడు ఆలోచించవచ్చు. ఒకవేళ నేను గర్భస్రావం చేసుకున్నాక, లింఫ్‌నోడ్స్‌కి కేన్సర్ లేదని తెలిసిందనుకోండి. జీవితాంతం నన్ను నేను క్షమించుకోలేను".

డాక్టర్ ఏమీ అనలేదు. కేవలం తల ఆడించింది.

* * *



© EMESCO BOOKS

ఆపరేషన్ విజయవంతంగా ముగిసింది.

గర్భంలో శిశువు మామూలుగా ఉందని తెలిసింది.

ఆపరేషన్ నుంచి మిషెల్ కోలుకుంటోంది. అప్పుడు వచ్చింది డాక్టర్ నుంచి ఫోను.

"మిషెల్... నీ లింఫ్‌నోడ్స్‌వరకూ కేన్సర్ పాకలేదు. నువ్వు సరైన నిర్ణయం తీసుకున్నావు" మిషెల్, జిమ్‌వైపు చూసింది.

ఇద్దరూ సంతోషంగా నవ్వుకున్నారు. భగవంతుడికి దండంపెట్టుకున్నారు.

ప్రస్తుతం, మిషెల్, తన ఇద్దరు కొడుకులతో సంతోషంగా జీవిస్తోంది. పిల్లవాడికి పాలిచ్చే వయసు దాటగానే ఆమె టోమోక్సిఫెన్ చికిత్స ఆరభించింది.

డాక్టర్లు వక్షోజపు నిర్మాణ చికిత్స చేస్తున్నారు.

ఇద్దరు పిల్లలు నవ్వుతూ కేరింతలు కొడుతూ ఇంట్లో తిరుగుతూంటే ఆమె ఎంతో సంతృప్తిగా ఉంటుంది.

"భగవంతుడి అద్భుతశక్తికి ప్రతీకలు పిల్లలు. సృష్టిలోని అద్భుతం వారే. ఆ అద్భుతాన్ని అనుభవిస్తూ బతకటంలోనే ఆనందం ఉంది. నేను గర్భస్రావం చేయించుకుని ఉంటే ఈ అద్భుతాన్ని చూసే అవకాశం కలిగేదా?" అంటుంది మిషెల్ సంతృప్తిగా.

© EMESCO BOOKS

# చిన్నపాము - పెద్ద కర్ర

నేరస్తులను పట్టుకునేందుకు ప్రాణాలకు తెగించి
'మానవవీర'గా మారిన ఓ సాహసమూర్తి కథ.

**1986.** ఆమె చాలా క్యాజువల్‌గా నడుస్తున్నట్టు కనిపిస్తోంది. కానీ, ఆమె గుండె దడదడా కొట్టుకుంటోంది.

"నిజం ఇది చాలా కష్టంగా ఉంది" అనుకుంది మహిళా పోలీసు కానిస్టేబుల్ జానెట్ రాడ్జర్స్.

తెలియకుండా ప్రమాదం వచ్చి మీద పడటం ఒక రకం.

ప్రమాదాన్ని వెతుక్కుంటూ వెళ్లటం మరో రకం.

కానీ ప్రమాదం ఉందని తెలిసి, తనపై దాడి జరుగుతుందని తెలిసి, ఏమీ ఎరగనట్టు నటించటం చాలా కష్టం.

ఏదో ఓ మూల నుంచి ప్రమాదం వస్తుందని తెలుసు. కానీ ఎప్పుడు వస్తుందో తెలియదు. అందుకే, జానెట్ మనస్సు ఉద్విగ్నంగా ఉంది.

ఇంతలో వెనుక అడుగుల శబ్దం వినిపించింది.

ఆగిపోయి గట్టిగా అరవాలనిపించింది ఆమెకు.

"నేనీపని చేయలేను" అని వెనక్కు పరుగెత్తిపోవాలని ఉంది.

అడుగుల శబ్దం దగ్గరవుతున్నకొద్దీ, ఆమె శరీరంలోని అణువణువూ ఉద్విగ్నతామయం అయింది. పిడికిళ్లు బిగుసుకున్నాయి.

'అతడు తన వెనక్కు వచ్చేశాడు'–

ఏమీ ఎరగనట్టు, అమాయకంగా నడవటం కష్టంగా ఉంది. ఊపిరి బిగబట్టింది.

'అతడు ఆమెని దాటి వెళ్లాడు. ఆమెని దాటుతూ ఓరకంట చూసి వెళ్లాడు. మరి అంతరాత్రి, ఆ చీకటి వీథిలో, వాహ్యాళికి వెళ్లినట్టు నడుస్తూన్న ఆమెని వింతగా చూడటంలో ఆశ్చర్యం ఏమీలేదు.

© EMESCO BOOKS

అతడు తనని దాటి వెళ్లగానే, ఒక్కసారిగా రిలీఫ్ ఫీలయింది ఆమె. పెదవులపైకి నవ్వు వచ్చింది. అంతవరకూ తాను అనవసరంగా భయపడ్డందుకు నవ్వుకుంది.

మరుక్షణం ఏమౌతుందో ఆమెకి అర్థంకాలేదు.

ఎవరో వెనుక నుంచి ఆమెని గట్టిగా పట్టుకున్నారు. అరవకుండా నోటికి చేయి అడ్డంపెట్టారు. ఒక్కచేత్తో సులువుగా ఆమెని గాల్లోకి లేపి, దారిపక్కన ఉన్న చీకటి పొదవైపు లాక్కెళ్ళాడు.

ఆమె గింజుకొంది.

అంతవరకూ ఇలాంటిది జరుగుతుందని ఊహిస్తూ వచ్చింది. సిద్ధంగా ఉంది. ట్రైనింగ్‌లో ఆమెకు పట్లు, కిక్కులు నేర్పారు. కానీ ఇప్పుడు అవేవీ పనికి రావటంలేదు.

మూతిమీద చేతిబరువు భయంకరంగా ఉంది. ఆమె నోరు తెరచే ప్రయత్నం చేసింది. అతడి చేతిపట్టు సడలగానే బలంగా అతడి చేయిని కొరికింది.

వెంటనే అతడు ఆమెని వదిలేశాడు.
ఆమె కిందపడింది. ఒళ్ళంతా అదిరిపోయింది.
కళ్ళముందు కొన్నివేల నక్షత్రల విస్ఫోటనం జరిగింది.

తేరుకునేలోగా ఆమె డొక్కలో ఎవరో నిప్పుతో కాల్చినట్టయింది. ఊపిరిని ఎవరో బలంగా ఆమె శరీరంలోంచి బయటికి నెట్టినట్టయింది.

అతడు మరోసారి ఆమెని తన్నేలోగా ఎవరో పరుగెత్తుకు వస్తున్న శబ్దం వినిపించింది. ఆమెని వదిలి అతడు పారిపోబోయాడు. కానీ పోలీసులు అతడిని వెన్నాడి పట్టుకున్నారు.

పడి ఉన్న జానెట్‌ని ఎవరో లేపారు. మంచి నీళ్లిచ్చారు.

కానీ ఆమె తాగలేకపోతుంది. ఆమె మూతి వాచిపోయి ఉంది. తల తిరుగుతుంది. ఒళ్లంతా నొప్పులుగా ఉంది. ఆమె నుంచోలేకపోతోంది.

ఎవరో స్ట్రెచర్ పట్టుకొచ్చారు.

"కంగ్రాట్యులేషన్ జానెట్. రేపిస్టు అరెస్టు అయ్యాడు. నీ సర్వీసులో మొదటిసారి నేరస్తుడిని పట్టించావు. ఎలా ఉంది అనుభవం?" నవ్వుతూ అడిగాడు పోలీసు అధికారి.

కానీ అప్పటికే జానెట్ స్పృహ కోల్పోయింది.
ఆ తరువాత డాక్టరు పరీక్షలో –
ఆమె పక్కటెముకలు విరిగాయని తెలిసింది.
అలా ఆరంభమయింది జానెట్ రాడ్జర్స్ పోలీసు 'డెకాయ్' జీవితం!

'డెకాయ్' అంటే, పులిని ఆకర్షించేందుకు 'ఎర'లా కట్టేసే మేకలాంటిది. రేపిస్టులను, ఆకర్షించే డెకాయ్ జానెట్ రాడ్జర్స్!

* * *

"సారీ, జానెట్, నిన్ను ఈ కేసులోకి లాగకూడదని అనుకున్నాను. కానీ నిన్ను లాగక తప్పటంలేదు" అన్నాడు డ్యూటీ సర్జెంట్.

అతడికి తెలుసు ఇటీవలె ఓ రేపిస్టును పట్టుకునే కేసులో జానెట్ దాదాపుగా ప్రాణాలు కోల్పోయినంత పని అయింది.

ఆమెని వెన్నాడుతున్న పోలీసుల కన్నుగప్పి రేపిస్టు, కారులోకి జానెట్‌ని లాగాడు. వాడు ఓ దారిలో పోతున్నాడని పోలీసు భావిస్తే, మరోదారిలో వెళ్ళాడు. జానెట్ ధైర్యంగా వాడితోపోరాడింది. చివరి క్షణంలో వాడికి జానెట్ పోలీసు వ్యక్తి అని అర్థమయింది. లొంగిపోయే ముందు తుపాకీతో ఆమెని కాల్చాడు. గుండు, గుండె పక్కనుంచి దూసుకుపోయింది. దాంతో, జానెట్ ప్రాణాలు నిలిచాయి. అందుకే మరో కేసులో ఆమెని 'మానవ ఎర'గా వాడాలంటే పోలీసు అధికారులకు మనసొప్పటం లేదు. కానీ ఎంత ప్రయత్నించినా రేపిస్టు దొరకటంలేదు. జానెట్ తప్ప వాడిని పట్టుకునేందుకు వేరే మార్గం తోచటంలేదు.

జాన్‌ట్ నీరసంగా నవ్వింది.

"కేసు వివరాలు చెప్పండి" అంది.

"ఈ రేపిస్టును పట్టుకునే పథకానికి 'ఆపరేషన్ అలేమాన్' అని పేరు పెట్టాం"

"అలేమాన్ (Alleyman)?" ప్రశ్నించింది జానెట్.

నవ్వాడు పోలీసు అధికారి.

"వీడు, అమ్మాయిలను గల్లీలోకి లాక్కుపోయి రేప్ చేస్తున్నాడు. మెయిన్‌రోడ్లలో, చీకటి మూలల్లో దాక్కుని ఉంటాడు. హఠాత్తుగా అమ్మాయిలపైకి లంఘిస్తాడు. వారిని పొదల్లోకి లాక్కుపోతాడు. ఒక సంవత్సరంలో వాడు ఎనిమిది అత్యాచారాలు చేశాడు. ఇంకో నాలుగుమార్లు అత్యాచారం చేస్తూ పట్టుబడబోయి తప్పించుకున్నాడు. అయినా వాడి అత్యాచారాలు కొనసాగుతున్నాయి. మనం కూచున్న స్థలానికి ఓ అరకిలో మీటరు దూరంలో, ఇవాళ్ల పొద్దున్నే ఓ 16 ఏళ్ల అమ్మాయి మీద అత్యాచారం చేశాడు."

గదిలో నిశ్శబ్దం అలుముకుంది.

"అమ్మాయి ఉదయమే క్లాసుకి వెళ్తోంది..."

కొనసాగించలేకపోయాడు పోలీసు ఆఫీసరు.

అతని గొంతు గద్గదికమయింది. కళ్లల్లో నీళ్లు నిండాయి.

"రేపిస్టుని పట్టుకుందాం" ఆ నిశ్శబ్దంలో స్పష్టంగా, స్థిరంగా ధ్వనించింది జానెట్ స్వరం.

ఆమెవైపు కృతజ్ఞతగా పూర్వకంగా చూశాడు పోలీసు అధికారి.

* * *

"మొత్తం మనం ఆరుగురం ఉన్నాం. మన దగ్గర అనుమానితుడి రూపురేఖల ఆధారంగా గీసిన చిత్రపటాలు ఉన్నాయి. ఇకనుంచి ప్రతి రాత్రి నా పని చీకటి దారుల్లోంచి నడవటమే.

© EMESCO BOOKS

మీ పని ఎవరికీ అనుమానం రాకుండా నన్ను వెంబడించటమే. ఒక కారు ముందుండాలి, ఒక కారు వెనుక. రెండు కార్లు నేను నడుస్తున్న దారికి సమాంతరంగా ఉన్న దారుల్లో నడవాలి. అందరూ ఒకరితో ఒకరు సమాచారం మార్చుకుంటూ ఉండాలి" చకచకా చెప్తోంది జానెట్.

ఆమె అపారమైన అనుభవానికి వారంతా అంజలి ఘటిస్తూ ఆమె చెప్తున్న పథకాన్ని జాగ్రత్తగా వినసాగారు.

"ఈ రేపిస్టు అత్యాచారం చేయటాన్ని గమనిస్తే ఓ విషయం స్పష్టంగా తెలుస్తుంది. వీడు వారాంతాలలో ఇంతవరకూ అత్యాచారం చేయలేదు. కాబట్టి, మనం శని, ఆదివారాల్లో రాత్రిళ్లు నిద్రపోవచ్చు".

అందరూ నవ్వారు.

"మిగతా రాత్రులంతా మనం ఆ అల్లేమేన్‌ని వేటాడదాం" అంటూ లేచింది జానెట్.

* * *

దాదాపుగా మూడు వారాలయింది. రేపిస్టుకోసం కాపుగాసి, తన కోసం పోలీసులు ఎదురు చూస్తున్నారని పసిగట్టినట్టే, రేపిస్టు ఎక్కడో దాక్కున్నాడు. ఎటువంటి అత్యాచారాలూ చేయలేదు.

రేపిస్టుకోసం గాలింపులో కాస్త అలసత్వం ప్రవేశించిందని గ్రహించినట్టు, ఓ రాత్రి రేపిస్టు దాడి చేశాడు. ఓ అమ్మాయిపై అత్యాచారం చేశాడు.

పోలీసులు గస్తీ తిరుగుతున్న పక్క 'లేన్'లోనే అత్యాచారం జరిగింది. దాంతో పోలీసులు మళ్లీ అప్రమత్తమయ్యారు.

* * *

ఆ రోజు రాత్రి ఒంటి గంట...

అనుమానితుడిలా కనిపిస్తున్న ఓ వ్యక్తి రోడ్డుమీదకు వచ్చాడు. వాడు ఏ రోడ్డులో నడుస్తున్నాడో చెప్పాడు పోలీసు.

వెంటనే అప్రమత్తమైంది జానెట్.

కారు దిగి చీకట్లోంచి రోడ్డు మీదకు వచ్చింది.

ఓరకంట వెనక్కి చూస్తూ నెమ్మదిగా నడక సాగింది.

సందు మలుపు తిరిగి ఓ వ్యక్తి దారిలోకి రావటం కనిపించింది.

జానెట్ నడక వేగం తగ్గించింది.

అతడు దగ్గరకు వస్తున్నాడు.

దడదడ లాడుతున్న గుండెను చిక్కబట్టుకొని ఏమీ ఎరగనట్టు నడవసాగింది జానెట్.



© EMESCO BOOKS

వెనుక అడుగుల శబ్దం దగ్గరయింది.

ఊపిరి బిగబట్టి దాడిని ఎదుర్కొనేందుకు సిద్ధమైంది జానెట్.

ఇంతలో పోలీసుకారు సందుమలుపు తిరిగింది.

అది చూసిన ఆ వ్యక్తి జానెట్‌వైపు కూడా చూడకుండా, జేబులో చేతులుంచుకుని చకచకా నడచిపోయాడు.

"వాడే రేపిస్టని నా అనుమానం" నిశ్చయంగా చెప్పింది జానెట్.

దాంతో మళ్లీ రాత్రిళ్లు గస్తీ తీవ్రతరం చేశారు.

ఇలా వారాలు, నెలలు గడచిపోతున్నాయి. కానీ రేపిస్టు జాడలేదు. కొన్ని రాత్రుళ్లు జానెట్ ఒంటరిగా తిరిగింది. అలా చేయవద్దని ఆమె సహచరులు హెచ్చరించారు.

"ఏదో ఒకరోజు ఓ అమాయకురాలిపై వాడు అత్యాచారం చేస్తాడన్న భావన నన్ను నిలువనివ్వటంలేదు. నేనయితే ఏదో ఓ రకంగా వాడిని ఎదుర్కోగలను. కానీ అమాయకులు వాడిబారిన పడితే..."

ఆమె సహచరుల మౌనం, ఆమెతో వారి అంగీకారాన్ని తెలిపింది.

* * *

"వాడిలాగే ఉన్నాడు" కారు అద్దంలోంచి చూసి చెప్పింది జానెట్.

ఓ పక్కవారు రాత్రంతా వెతుకుతూ, ఎదురుచూస్తూనే ఉన్నారు. వాడు మరో ఇద్దరు అమ్మాయిలపై అత్యాచారం చేశాడు.

అందుకే రోజుకన్నా భిన్నంగా, వేరే దారిలోకి వెళ్లారు ఆ రాత్రి. వాళ్ల ప్రయత్నం ఫలిస్తున్నట్టే ఉంది.

కాస్త ముందుకు వెళ్లి కారు ఆపాడు. కారులోంచి దిగి వేగంగా సందు మలుపు తిరిగింది జానెట్.

ఎదురుగుండా వస్తున్నాడు వాడు.

వాడిని పరిశీలనగా చూసింది జానెట్.

వాడు ఓసారి ఆమెవైపు చూశాడు. తల వంచుకుని నడవసాగాడు. అయితే వాడు చీకట్లో ఉండటం వల్ల సరిగ్గా కనబడటం లేదు. కానీ పట్టి పట్టి చూస్తే. వాడికి అనుమానం రావచ్చుని జానెట్ ముఖం తిప్పుకుని నడవసాగింది.

వాడు ఆమెని దాటిపోయాడు.

ఒక్కసారిగా నిరుత్సాహం జానెట్‌లో అలముకుంది.

© EMESCO BOOKS

వాడే రేపిస్టని సిక్త్‌సెన్స్ చెప్తోంది. కానీ వాడు దాడి చేస్తే కానీ వాడిపై నేరారోపణ చేయటం కుదరదు.

అంతలో ఆమె ఆలోచనలన్ని 'అమ్మా' అన్న అరుపుతో ఆవిరైపోయాయి. ఆమె అప్రమత్తంగా ఉన్న సమయంలో, ఆమెని దాటినవాడు, ఒక్క పరుగున వెనక్కి తిరిగి ఆమెపై దాడి చేశాడు.

ఆమెవెంటనే జూడోకిక్ ఇచ్చింది. కానీ దాన్ని ఊహించినట్టేవాడు ఒడుపుగా పక్కకు తప్పుకుని ఆమె వీపుకింద భాగంలో బలంగా తన్నాడు.

జానెట్ కిందపడింది. తేరుకునే లోగా వాడు రెండు కాళ్లు పట్టుకుని, ఆమెని పశువును లాగినట్టు చీకటి పొదల్లోకి లాగసాగాడు.

గింజుకునే అవకాశం కూడాలేదు ఆమెకి. కింద రాళ్లు ఎడాపెడా తాకుతున్నాయి. చీకటి పొద చేరిన తరువాత, ఆమె మూతిపై చేయి ఉంచి అడిగాడు. వాడు - "ఎవరు నువ్వు? నీ పేరేమిటి?"

అలా అడుగుతూ మరో చేయితో ఆమె కాళ్ళను వేరు చేయాలని ప్రయత్నించసాగాడు.

"నాకు ఎదురు పోరాడకు. నిన్ను నేను ఏం చేయను" ఆమెని బుజ్జగిస్తున్నట్టుగా అన్నాడు.

ఆమె ఓ కాంక్రీటు స్థంభం చుట్టూ కాళ్లను చుట్టింది. వాడు ఎంత ప్రయత్నించినా స్థంభాన్ని విడవకపోవటంతో, వాడు ఆమె తలపై మోదసాగాడు.

ఇంతలో పోలీసులు పరుగెత్తుకువచ్చారు. వాడిపై విరుచుకుపడ్డారు.

వాడి ముఖంపై వెలుతురు పడగానే అందరూ ఆశ్చర్యపోయారు. ఎందుకంటే, ఆ రేపిస్టుకి ఇంకా మీసాలు కూడా సరిగ్గా రాలేదు.

16 ఏళ్ల వయసుంటుందతనికి!

* * *

జానెట్ అనుభవంలో అతిచిన్న వయసున్న రేపిస్టువీడే. షాన్‌ఫ్రాన్సిస్ 13వ ఏటనుంచే రేపులు ప్రారంభించాడు. షాన్‌ఫ్రాన్సిస్‌ను పట్టుకునే ప్రయత్నంలో జానెట్ చేతివేలు విరిగింది. కాలు విరిగింది. ఆమె తలకు లోతైన గాయమయింది. తన 18 ఏళ్ల అనుభవంలో దాదాపు 30 మార్లు తీవ్రంగా గాయపడింది జానెట్. అయినా నేరస్థులను పట్టుకునేందుకు 'మానవ ఎర'గా మారటంలో ఆమె ఉత్సాహం మాత్రం తగ్గలేదు. "ఒక మనిషి, మరో మనిషిపై అత్యాచారం చేయటం అన్న ఆలోచనను నేను భరించలేను. అందుకే ఓపిక ఉన్నంతకాలం నేరస్తులను పట్టుకోవటంలో సహాయపడుతూనే ఉంటాను" అంటుంది జానెట్ చిరునవ్వుతో.



© EMESCO BOOKS

# అమ్మ-నాన్న-ఒక పసిపాప

---

**న్యాయానికి కుల, మత, స్థాయీ భేదాలు**
**లేవని నిరూపించిన కథ**

---

అక్టోబర్ 11, 2005. "అమెరికా సంయుక్త రాష్ట్ర ప్రభుత్వం తరఫున నేను క్షమార్పణలు వేడుకుంటున్నాను. నీకు అమెరికా దేశ పౌరసత్వం అనుమతించటమే కాకుండా 950,000 డాలర్లు నష్టపరిహారం ప్రకటిస్తున్నాను. అంతేకాదు, నీ కూతురు లిలియాన్ పేర 150,000 డాలర్ల నిధులతో ట్రస్టు ఏర్పాటు చేస్తున్నాను" తీర్పు విన్పించాడు జడ్జి రిచర్డ్ డి. చెన్నెట్.

ఒక్క క్షణం కోర్టు నిశ్శబ్దంగా ఉంది. జడ్జితీర్పు పూర్తిగా అర్థంకాగానే హాలు హర్షధ్వానాలతో నిండిపోయింది.

అంతలో అనూహ్యమైనది జరిగింది. జడ్జి తన సీటునుంచి లేచి దిగివచ్చాడు. అందరూ లేచి నిలబడ్డారు. నెమ్మదిగా మిగ్యుఎల్ వాలాక్సెజ్ దగ్గరకు నడిచి వచ్చి, అతడిని కౌగలించుకున్నాడు జడ్జి.

కోర్టు నిశ్శబ్దమై పోయింది. అద్భుతాన్ని చూస్తున్నట్టు అందరూ నిశ్శబ్దంగా ఉన్నారు. మిగ్యుఎల్ పక్కనే ఉన్న లిలియానా బుగ్గలు చిదిమి వెనుతిరిగి వెళ్లిపోయాడు జడ్జి. సజల నయనాలతో జడ్జి వెళ్ళినవైపే చూస్తున్న అలైస్, మిగ్యుఎల్ దంపతుల మనస్సులు, తమ పీడకలలాంటి భయంకరమైన అనుభవాలు ఆరంభమైన ఆ రోజులను తలచుకున్నారు.

* * *

అలైస్, మిగ్యుఎల్‌ల నాలుగు నెలల కూతురు 'లిలియాన్' ఎడ తెగకుండా ఏడుస్తోంది. కడుపు నొప్పేమో అని కడుపుమీద మృదువుగా రాశారు. పాలు పట్టారు. చెవుల్లో మందుపోశారు. ఆడించారు. పాటలు పాడారు. కానీ లిలియాన్ పాప ఏడుపు ఆపలేదు.

ఇంతలో ఆమె నడుము దగ్గర రెండు కణతల్లాగా వాచి ఉండటం కనిపించింది.

© EMESCO BOOKS

'మిగూ... ఇటు చూడు' అని వాటిని చూపించింది అలైస్.

'వాచినట్టుంది. ఎందుకైనా మంచిది డాక్టర్ దగ్గరకు తీసుకువెళ్దాం.'

ఇద్దరూ హడావిడిగా పాపని డాక్టర్ దగ్గరకు తీసుకువెళ్ళారు.

అది ఫిబ్రవరి 3, 2000. వాళ్లు చెప్పింది జాగ్రత్తగా విన్నాడు డాక్టర్. పాపని ఒంటిని జాగ్రత్తగా ఒత్తిచూశాడు. కొన్ని భాగాలపై చెయ్యి పెట్టగానే పాప ఏడుపు తీవ్రత పెరగటం అందరూ గమనించారు. డాక్టర్ ముఖం గంభీరంగా మారింది. 'పాపని ఎక్స్ రే తీయాలి' చెప్పాడు.

* * *

ఎక్స్‌రే రిపోర్టు పరిశీలిస్తున్న డాక్టర్ ముఖం చూస్తున్న అలైన్, మిగ్యుఎల్‌లకేదో భయం కలిగింది. 'డాక్టర్... ఏమైనా ప్రమాదమా?' వణకుతున్న స్వరంతో అడిగింది అలైస్. డాక్టర్ మాట్లాడలేదు.

ఆమెవైపు కోపంగా చూశాడు. ఆమె భర్తవైపు తీక్షనంగా చూశాడు. మాట్లాడకుండా ఫోను నెంబరు కలపసాగాడు. భార్యభర్తలిద్దరూ అతనివైపు ఆత్రంగా చూడసాగారు.

'డాక్టర్ మీరు ఓసారి రండి' అలా అయిదారుగురు డాక్టర్లని కన్సల్టేషన్‌కని పిలిచాడు ఆ డాక్టర్. 'మీరు బయట కూర్చోండి' ఆజ్ఞాపించాడు డాక్టర్. అతని స్వరంలో ధ్వనిస్తున్న అకారణ కాఠిన్యానికి భార్యాభర్తలిద్దరూ వణికారు. తమ పాపని డాక్టర్లనడుమ వదలి వెళ్లేందుకు వాళ్లిద్దరికీ మనసొప్పటం లేదు. కానీ వెళ్లక తప్పదు. పాపని వదలి వెళ్తోంటే, ఎందుకో ఇక జీవితంలో ఆమెని మళ్లీ చూడలేమోనన్న భావన ఇద్దరికీ కలుగుతోంది.

బయట కూచున్నారు.

కానీ వాళ్లిద్దరికీ లోపల ఏం జరుగుతుందన్నది తెలుసుకోవాలని ఆత్రుతగా ఉంది. ఎవరెవరో డాక్టర్లు వస్తున్నారు. హడావిడిగా లోపలకు వెళ్తున్నారు. గంభీరమైన ముఖాలతో బయటకు వస్తున్నారు. తమలో తామేదో తీవ్రంగా చర్చిస్తున్నారు. అంతా ఉరుకుల పరుగుల మీద ఉన్నారు. తమతో సంబంధం లేకుండా తమ పాప గురించి, ఏవేవో నిర్ణయాలు వాళ్లు తీసుకుంటూంటే, తమ పాపను తమకు దూరం చేస్తున్న భావన కలుగుతోంది వారిద్దరికీ. ఒకళ్ల చేతులు మరొకరు గట్టిగా, సాంత్వననిస్తూ, పట్టుకుని కూచున్నారు.

'మిగ్యుఎల్‌ను డాక్టర్ పిలుస్తున్నారు' మిగ్యుఎల్‌వైపు కోపంగా చూస్తూ కఠినంగా చెప్పింది నర్సు.

అతనితోపాటు లేవబోయిన అలైస్‌ను ఆపింది 'నిన్ను పిలవటంలేదు' అంది. పోలీసులు నేరస్తుడిని ప్రశ్నిస్తున్నట్టు. పదిమంది డాక్టర్లు తన ఎదుట కూచుని ప్రశ్నించేందుకు సిద్ధంగా ఉండటం చూసిన మిగ్యుఎల్ మనసు కీడును శంకించింది.



© EMESCO BOOKS

'మీ అమ్మాయి ఎదుగుదల మామూలుగానే ఉంది. అమ్మాయిని శుభ్రంగానే ఉంచారు. మీరు క్రమం తప్పకుండా ఇద్దరూ కలసి డాక్టర్ దగ్గరకు అమ్మాయిని తీసుకువెళ్తున్నారు. అమ్మాయి బ్రెయిన్ స్కాన్ మామూలుగానే ఉంది. కానీ... ఆమె లోపలి ఎముకలన్నీ విరిగి ఉన్నాయి' అన్నాడు డాక్టర్.

'అదెలా సాధ్యం?' ఆత్రంగా అడిగాడు మిగ్యుఎల్.

'మేమూ అదే అడుగుతున్నాం. అదెలా సాధ్యం?' చీకట్లోంచి బయటికి వస్తూ కఠినంగా అడిగాడు పోలీసు ఆఫీసర్. పోలీసులను చూస్తూ తెల్లబోయాడు మిగ్యుఎల్.

అది చూసి వికటంగా నవ్వాడు పోలీసు ఆఫీసర్.

'మాకు నిజం ఎలా తెలిసిందని తెల్లబోతున్నావా? చెప్పు.. ఎందుకు నాలుగు నెలల పాపని అంత కర్కశంగా హింసించావు?' క్రూరంగా అడిగాడు పోలీసు ఆఫీసర్.

'నేనా? హింసించానా?' ఆశ్చర్యపోయాడు మిగ్యుఎల్.

'మీ పాప ఎముకలన్నీ విరిగి ఉన్నాయి. చిన్నపిల్ల కాబట్టి ఏం జరిగిందో చెప్పలేదు. శరీరంపై దెబ్బలేవీ లేవు. ప్రమాదం జరిగిన సూచనలు లేవు. పైన ఎటువంటి గాయం తాలూకు ఆనవాళ్ళు లేకుండా లోపల ఎముకలు ఎలా విరుగుతాయో తెలుసా?' అడిగాడు పోలీస్.

తెలియదన్నట్టు తలూపాడు మిగ్యుఎల్.

వెంటనే పోలీసు అతడిపై దూకాడు. చేయి పట్టుకుని ఒత్తసాగాడు. బాధతో గట్టిగా అరిచాడు మిగ్యుఎల్. పోలీసు అతడిచెయ్యి వదిలిపెట్టి నవ్వాడు.

'నువ్వు ఎదిగిన వాడివి కాబట్టి ఏమీకాలేదు. అదే 4 నెలల మృదువైన పాపయి శరీరమైతే, లోపలి ఎముకలన్నీ పటపట విరుగుతాయి. పాప ఏడుపు భరించలేక, చిరాకుతో ఒత్తేశావా?' అడిగాడు.

'లేదు. అటువంటిదేమీ లేదు. లిలియన్ నా ప్రాణం' ఆవేదనగా అన్నాడు మిగ్యుఎల్. పోలీసులు తనని ఎందుకు అనుమానిస్తున్నారో, తనపై ఎటువంటి నేరం మోపబోతున్నారో అతడికి అర్థమైంది.

* * *

'మిగ్యుఎల్‌కి లిలియాన్ అంటే ప్రాణం అసలతడు పాపని ఎంత ముద్దు చేస్తాడంటే' ఆగిపోయింది అలైస్.



© EMESCO BOOKS

'ఎంత ముద్దు చేస్తాడంటే... పాపకేమైనా అవుతుందన్న భయం వేస్తుందా?' మాట పూర్తి చేశాడు పోలీసు ఆఫీసర్.

'లేదు..లేదు – అతడికి లిలియాన్ అంటే ప్రాణం' బోరుమంది అలైస్.

'మరైతే పాప ఎముకలెలా విరిగాయి? తనే స్వయంగా విరగ్గొట్టుకుందా? లేక పుడుతూనే విరిగాయా?

'వేరే ఏదైనా కారణం ఉండవచ్చుగా?'

'ఉంది. మీ ఆయన నేరం నువ్వు దాస్తున్నావు. అటువంటి కిరాతకుడిని రక్షించాలని చూడటం పాతివ్రత్యం కిందకు రాదు. అది నేరం. అమానుషత్వం' అరిచాడు పోలీసు.

'లేదు. ఆయన నిర్దోషి' భోరుమంది అలైస్.

* * *

'మీరిద్దరూ తోడుదొంగలు. పాపపై మిగ్యుఎల్ అత్యాచారం చేశాడు. ఆమె ఎముకలు విరిగాయి. ఈ నిజాన్ని అలైస్ దాస్తోంది. కాబట్టి, పాపను మీ దగ్గర ఒక్క క్షణం కూడా ఉంచటం ప్రమాదకరంగా భావిస్తున్నాం. అందుకే పాపను వేరేవారి సంరక్షణలో ఉంచాలని నిశ్చయించాం. మీరు అనవసరమైన గొడవ చేసి లాభంలేదు. ఇంకా మీకు ఈ దేశపౌరసత్వం రాలేదు. ఈ కేసు బయటకు పొక్కితే పౌరసత్వం రాకపోగా పాపకూడా మీకు దక్కదు' హెచ్చరించాడు పోలీసు. అలైస్ నిశ్శబ్దంగా రోదిస్తుంటే, మిగ్యుఎల్ స్థాణువయ్యాడు.

* * *

కేసు కోర్టులో నడుస్తోంది. లాయర్‌ను పెట్టుకునే శక్తిలేని అలైస్, మిగ్యుఎల్‌ల నేరం నిరూపించటం పోలీసులకు సులభమవుతోంది.

ఆరోజు కోర్టునుంచి ముఖాలు వేలాడేసుకుని ఇంటికి వచ్చారు భార్యాభర్తలిద్దరూ.

హడావిడిలో ఫ్రిజ్ తలుపు వేయటం మరచిపోవటంతో, ఫ్రిజ్‌లోని మంచు కరిగి నీరు కారసాగింది. కిందపడ్డ ఓ మంచు ముక్కను ఏరబోయింది అలైస్. ఆమె ముట్టుకోగానే అది ముక్కలయింది. అది చూడగానే ఆమెకో ఆలోచన వచ్చింది. 'ఒకవేళ ఏదైనా కారణం వల్ల లిలియాన్ ఎముకల కూడా, ఈ మంచులా ముట్టుకోగానే విరిగిపోతున్నాయేమో! నా చిన్నప్పుడు నా ఎముకలు చాలా నాజూకుగా ఉండేవని అమ్మ అంటూ ఉండేది' అనుకుంది.

వెంటనే నెట్‌లో అకారణంగా ఎముకలు విరిగే వ్యాధి గురించి వెతకటం ఆరంభించాడు మిగ్యుఎల్. కాస్సేపటికి ఆత్రంగా అరిచాడు – 'అలైస్ ఇటురా'. పరుగెత్తుకు వచ్చింది.

'ఇది చూడు. ఓస్టియో జెన్‌సిస్ ఇమ్ పర్ ఫెక్' లేక 'బ్రిటిల్ జోన్ డిసీజ్' ఎముకలకు శక్తినిచ్చే కోల్లాజెన్ అనే ప్రొటీన్ ఉత్పత్తి సరిగ్గా లేకపోతే ఎముకలు పట్టుకోకముందే విరిగిపోతాయి. ఎక్స్‌రేలద్వారా ఈ విషయం తెలియదు. కానీ పసిపిల్లల్లో అకారణంగా ఎముకలు విరగటం ఈ వ్యాధి ప్రథమ లక్షణం' గబగబా పైకి చదివాడు మిగ్యుఎల్.

'లిలియాన్ కేసు ఇదే' సంతోషంగా అరిచింది అలైస్. 'నేను ఇప్పుడే డాక్టర్లతో, లాయర్లతో ఈ విషయం చెప్తాను. మనం కేసు గెలిచినట్టే' అంది అలైస్. తల అడ్డంగా ఊపాడు మిగ్యుఎల్.

'ఈ ప్రమాదంలో ఏదీ అంత సులభంకాదు అలైస్. కళ్ళెదురుగా కనిపిస్తున్న నిజాన్నే, నిజం అని ఒప్పుకోదీ లోకం. ఇక తమ పొరపాటున ఎవరూ ఒప్పుకోరు. కానీ మన ప్రయత్నం మనం చేద్దాం' శాంతంగా అన్నాడు.

* * *

ఫిబ్రవరి 15, 2000. వికటంగా నవ్వాడు పోలీసు అధికారి.

'నీ భర్తను కేసు నుంచి రక్షించాలని నువువేస్తున్న కొత్త ఎత్తుగడా ఇది?' క్రూరంగా అడిగాడు.

'లేదు. డాక్టర్లని అడగండి' ధైర్యం చిక్కబట్టుకుంటూ అంది అలైస్.

'ఇటువంటి రోగమైతే ఉంది. కానీ లిలియాన్ కేసులో మాత్రం తండ్రి హింసనే కారణం' అలైస్ మాటలు పూర్తిగా వినకుండానే అన్నాడు డాక్టర్.

'ఈ ప్రపంచం చాలా క్రూరమైందే కాదు మూర్ఖమైంది కూడా అలైస్. అది తాను చూడాలనుకున్నదే చూస్తుంది. వినాలనుకున్నదే వింటుంది. అది కోరుకున్నది చూపించి, వినిపించే శక్తిలేని వారికి నిలువనీడ కూడా దొరకదు' అలైస్‌ను ఓదార్చాడు మిగ్యుఎల్.

* * *

కోర్టునుండి అనుమతి తీసుకుని లిలియాన్‌ను చూసేందుకు వెళ్లిన అలైస్, లిలియాన్‌ను చూడగానే భోరుమంది. లిలియాన్‌ను ఏ 'సోషల్ సర్వీస్ సెంటర్'లో ఉంచారో, వాళ్లు లిలియాన్‌ను పట్టించుకుంటున్నట్టులేరు. స్నానం లేక ఒళ్లంతా మట్టి ఓ పొరలా చర్మంపై పేరుకుంది. బట్టలు మురికి తెర చాపల్లా ఉన్నాయి. అన్నం తిని నెలరోజులయినట్టుంది. ఎముకల గూడులా, అదీ విరిగిన ఎముకల గూడులా ఉంది. పాప స్థితికి మిగ్యుఎల్ ఆవేశం పట్టలేకపోయాడు.

'మనం పేదవాళ్లమని ఏడుస్తూ కూచుంటే లాభంలేదు. సర్వం ధారపోసి అయినా లిలియాన్‌ను రక్షించుకోవాలి. నేను లిలియాన్ ఎముకలు విరిచేస్తున్నాని ఆమెకు రక్షణనిచ్చారు వీళ్లు. కానీ వీళ్లు లిలియాన్‌ని చంపేస్తున్నారు' మిగ్యుఎల్ కళ్లనుండి విస్ఫులింగాలు అశృరూపంలో ధారగా వెలువడసాగాయి.

* * *



© EMESCO BOOKS

డబ్బు మూటను వెనక్కి తోసింది డోరోథీ ఇజాక్స్.

'మీకు అన్యాయం జరిగింది. ఆ అన్యాయాన్ని న్యాయంగా మార్చేందుకు మీ దగ్గర డబ్బు తీసుకుంటే మానవత్వానికే అన్యాయం చేసినదాన్నవుతాను. ఉంచండి. దీన్ని లిలియాన్ చదువుకి వినియోగించండి' చెప్పిందామె.

అలైస్, మిగ్యుఎల్‌లు కన్నీళ్లతో ఆమెలోని మానవత్వానికి అభిషేకం చేశారు. 'సోషల్ సెంటర్'లో లిలియాన్‌ను చూసిన డోరోథీకళ్లు అగ్ని గోళాలయ్యాయి. పాప ఒళ్లంతా ఎర్రటి పుళ్లు, చీము కారుతున్నాయి. వాటిపై వాలి ఈగలు విందులు చేసుకుంటున్నాయి.

చకచకా ఫొటోలు తీసింది డోరోథీ. వాటిని కోర్టుకు సమర్పించింది.

'లిలియాన్ సంరక్షణలో ప్రభుత్వం విఫలమైంది. ఆమె వ్యాధిని సరిగ్గా నిర్ధారించలేదు. తల్లిదండ్రుల సంరక్షణకు దూరంచేసి, ఆమెను మురిక్కాలువల్లో పెరిగే వారికన్నా హీనంగా, దయనీయంగా పెంచుతున్నారు. ఇందువల్ల ఎవరికి న్యాయం జరిగిందో తెలియదు కానీ ఏమీ ఎరుగని పాపకు మాత్రం అన్యాయం జరుగుతోంది. ఆమె తల్లిదండ్రులకెందుకు దూరంగా ఉండాలి? పైగా ఆమె తండ్రిని అనవసరంగా బాధిస్తూ, హింసిస్తున్నారు. లిలియాన్ అసలు వ్యాధిని నిర్ధారించే పరీక్షలు ఇప్పటికీ ఎందుకు చేయలేదు?' కోర్టును నిలదీసింది డోరోథీ.

అది అక్టోబర్ 11, 2005. కోర్టు తీర్పు విన్న ప్రజలు హర్షధ్వానాలతో తమ ఆమోదాన్ని తెలిపారు. అలైస్, మిగ్యుఎల్‌లు ఆనందంగా లిలియాన్‌ను హృదయానికి హత్తుకున్నారు.

డొరోథీకి కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

'ఇందులో నేను చేసిందేమీ లేదు. వ్యక్తి కులంతో, మతంతో, సామాజిక స్థాయితో సంబంధం లేకుండా న్యాయాన్నిచ్చే వ్యవస్థ మనకుంది. దాన్ని మనం ఎలా ఉపయోగించుకుంటే అది అలా ఉపయోగపడుతుంది. నేను అదే నిరూపించాను. అంతే' అంది.

న్యాయానికి అన్యాయం జరిగినప్పుడు ఆమెలాంటి వారే అవసరమవుతారు.

© EMESCO BOOKS

# తడి మనసు వెనుక

**'పంచిస్తే పెరిగేది ఆనందం'**
**అని నిరూపించిన జంట కథ.**

"**మా**నవ శరీరం కూడా యంత్రంలాంటిదే. శరీరానికి నీరు అవసరమౌతుంది. మనం నీరు తాగం. అప్పుడు శరీరంలోని కణాలో ఉండే నీటిని పీల్చుకుని, శరీరంలో నీటి సమతౌల్యాన్ని కాపాడటం జరుగుతుంది. కణాలలో కూడా నీరు అయిపోతే... అప్పుడు 'డీ హైడ్రేషన్' వల్ల ప్రమాదం ఎదుర్కోవాల్సి ఉంటుంది. అంటే, ఒక స్థాయి వరకూ ఎటువంటి ప్రమాదాన్నయినా ఎదుర్కొనే శక్తి మన శరీరానికి ఉందన్నమాట. ఆ తరువాత అది తన శక్తి తగ్గుతున్నట్టు మనకు సంకేతాలు పంపుతుంది. వాటిని గుర్తించి జాగ్రత్తపడాలి. ఏదైనా యంత్రం కూడా ఇంతేకదా!" అంటూ నవ్వాడు టామ్. విద్యార్థులంతా నవ్వారు.

'నేను గంటపైగా లెక్చరిచ్చాను. దాహం వేస్తోంది. ఇప్పుడు నీళ్లు తాగాలి" అంటూ టేబుల్ మీద ఉన్న నీటి గ్లాసు వైపు చేయి సాచాడు టామ్. చేయి బరువుగా అనిపించింది. నీటి గ్లాసు వరకూ చేయిని కదపటం కష్టంగా తోచింది. అసలు ఆ చెయ్యి తనదిగా అనిపించలేదు టామ్‌కు.

* * *

టామ్ వైపు పరిశీలనగా చూశాడు డాక్టర్ పీటర్సన్. "ఎప్పటి నుంచి ఇలా అనిపిస్తోంది?" ప్రశ్నించాడు. టామ్ తల అడ్డంగా ఊపాడు.

"నేను సరిగ్గా గమనించలేదు. గ్లాసు చేతిలోంచి జారిపోవటం, పెన్ను సరిగ్గా పట్టుకోలేకపోటం, మాట తడబడటం ఒక పదం బదులు మరో పదం వాడటం, తల బరువుగా ఉండటం, అప్పుడప్పుడు తిరిగినట్టు అనిపించటం... కానీ ఇవన్నీ అలసట వల్ల, పని ఒత్తిడివల్ల అనుకున్నాను. పెద్ద సీరియస్‌గా తీసుకోలేదు" చెప్పాడు టామ్.

© EMESCO BOOKS

"ఇప్పుడు కూడా ఎంత సీరియస్సో మనకు తెలియదు. మన శరీరం సంకేతాలిస్తూంటుంది. వాటిని సరిగ్గా అర్థం చేసుకోవాలి. పెద్దగా భయపడాల్సిందేమి లేదు. కొన్ని పరీక్షలు రాస్తారు. ఫలితాలను బట్టి మనం నిర్ణయం తీసుకుందాం" అన్నాడు డాక్టర్.

* * *

"ఏమిటలా ఉన్నారు?" ప్లేటు ఎదరుగా పెట్టుకుని తినటం ఆరంభించకుండా, ప్లేటువైపే చూస్తూ కూచున్న టామ్‌ని అడిగింది మేరీ.

టామ్ పెదిమలు కదులుతున్నాయి. కానీ మాట బయటకు రావటంలేదు. అతడి కళ్లల్లో నిస్సహాయత్వం కనిపిస్తోంది.

"ఏమైంది?" కంగారుగా లేచిందామె.

టామ్ కళ్లల్లోంచి నీళ్లు కారసాగాయి.

గబగబా హాస్పిటల్‌కి ఫోన్ చేసింది.

* * *

అప్పటి వరకూ తమ జీవితం ఒక కలలా అనిపించేది మేరీకి. 1987లో మేరీకి టామ్‌తో పరిచయమైంది. నాలుగేళ్లు ఇద్దరూ ఒకరినొకరు సన్నిహితం అయ్యారు. తమ మధ్య గాఢమైన అనుబంధం ఏర్పడిందని, ఒకరినొకరు వదలి ఉండలేరని అర్థం చేసుకునే సరికి మరో మూడేళ్లు పట్టింది. 1994లో మేరీ, టామ్‌లు పెళ్లి చేసుకున్నారు.

ఒకరి అలవాట్లు, ఇష్టాయిష్టాలు మరొకరు అర్థం చేసుకోవటంతో వారి సంసారం అన్యోన్యంగా, ఆనందంగా సాగింది. మేరీకి కొండలెక్కటం నేర్పించాడు టామ్. అతడికి ఈత నేర్పింది మేరీ. అవకాశం దొరికితే ఇద్దరూ సెలవులు తీసుకుని ఊళ్లు తిరిగేవారు. కొండలెక్కేవారు. సముద్రాల్లో ఈదేవారు. సంతోషంగా, నవ్వుతూ, తుళ్లుతూ జీవితాలు సాగిపోతున్నాయి. ఇక పిల్లల్ని కనాలని నిశ్చయించుకున్నారు. ఇంతలో...

"తన అందమైన కల అంతమై, పీడకల ఆరంభమౌతోందా?" మేరీ మనసు ఆందోళనగా ఉంది. భీకరంగా అరుస్తూ అంబులెన్స్ ఆస్పత్రివైపు వెళుతోంది.

* * *

స్కాన్ రిపోర్టులను మేరీకి చూపించాడు డాక్టర్. మెదడు చివరలో రూపాయి నాణాల లాంటి వాటివైపు చూపించాడు.

"వీటిని 'గ్లియోమా'లంటారు. ఇదొక రకమైన కేన్సర్. ఇవి కేవలం మెదడుకే పరిమితమవుతాయి. ఆపరేషన్ ద్వారా వీటిని తొలగించాల్సి ఉంటుంది. ఆ తరువాత ట్రీట్‌మెంట్ తీసుకోవాలి" చెప్పాడు డాక్టర్.



© EMESCO BOOKS

మేరీ కళ్లముందు చీకట్లు కమ్మాయి. పీడకల చేదు నిజమై కళ్లెదుట నిలిచింది!

* * *

"నాకు చావంటే భయం లేదు. కానీ ఇప్పటి నుంచి, చావుకు నడుమ పడే వేదనను తలచుకుంటే భయం వేస్తోంది" ముద్దముద్దగా అన్నాడు టామ్.

ఆపరేషన్ తరువాత అతడి నొప్పి తగ్గింది. కానీ మాట తడబడుతోంది. ఆపరేషన్ చేసి డాక్టర్ ఎక్కువభాగం కేన్సర్ కణతిని తీసేశాడు. కానీ చిన్న భాగాన్ని తీయటం కుదరలేదని వదిలేశాడు. "కొన్నాళ్లు సమస్యలేదు. ఈలోగా కెమోథెరపీవల్ల కేన్సర్‌ను అణచవచ్చు" అన్నాడు డాక్టర్.

డాక్టర్ ఊహకు భిన్నంగా, ఆ చిన్న కణతి, అనూహ్యమైన వేగంతో ఎదిగింది. మళ్లీ టామ్ కుడివైపు మెదడు పనిచేయటం మానేసింది. దాంతో మేరీ, మరో స్పెషలిస్ట్ దగ్గరకు తీసుకువెళ్లింది టామ్‌ను. రిపోర్ట్ చూసి పెదవి విరిచాడు డాక్టర్.

'గ్లియోబ్లాస్టోమా మల్టిఫోర్మె' పెద్దల మెదడుకు కలిగే వ్యాధి. ఇదొక సాలెగూడు లాంటిది. చిన్నగా ఆరంభమైన సాలెగూడు మొత్తం గదినంతా ఆక్రమించినట్టు త్వరలో ఇది మెదడును కబళిస్తుంది. దీనివల్ల మెదడుపై ఒత్తిడి పెరుగుతుంది. సర్జరీవల్ల 12 నుండి 16 వారాలు బతుకుతారు. రేడియేషన్‌వల్ల 40 వారాలు, కెమోథెరపీవల్ల 50 వారాలు బతకవచ్చు. ఆపై దేవుడి దయ" నిర్లిప్తంగా ముగించాడు డాక్టర్.

* * *

ఆ రోజు జీవితంలో తొలిసారిగా దేవుడిని ప్రార్థించింది మేరీ. బాల్యం నుంచీ మేరీకి దైవభక్తిలేదు. ఆమె తల్లిదండ్రులు ఆమెను నాస్తికురాలిగా పెంచారు. ఆమెకు ప్రార్థించాల్సిన అవసరం అంతవరకూ రాలేదు. ఆమెకు ఎలా ప్రార్థించాలో కూడా తెలియలేదు. కానీ ఓ అపరిమితమైన శక్తి తన మొర ఆలకిస్తుందని, తనను అర్థం చేసుకుంటుందన్న భావన ఆమెకు సాంత్వననిస్తోంది.

* * *

ప్రార్థన ఆమెకు ఆత్మ విశ్వాసాన్నిచ్చింది. ఏడుస్తూ కూరోచవటం వల్ల లాభం లేదని గ్రహించింది. ఆమె నెట్‌లో ఓ సెర్చ్ ఇంజన్‌ని అడిగింది. 'గ్లియోబ్లాస్టామా' గురించిన వివరాలు సేకరించింది. అవి చదువుతూంటే ఆమెకు టామ్ వ్యాధిగురించి అర్థంకాసాగింది. ఇంత మందిలో తాను టామ్‌నే ఎందుకు ప్రేమించాలి? 'తాము ఇంత సఖ్యంగా, ఆనందంగా ఎందుకు జీవితం గడపాలి? కనీసం తమ మధ్య కలతలు, భేదాభిప్రాయాలు ఉంటే అదోరకంగా ఉండేది. అవేవీ లేకుండా ఎంతో ఆనందంగా తమ జీవితం ఎందుకు గడపాలి? మందు లేని ఈ వ్యాధి టామ్‌కే ఎందుకు రావాలి?'



© EMESCO BOOKS

మేరీ ఆలోచనలకు అంతులేదు. ఇష్టం వచ్చిన దిశలో పరుగెత్తుతున్నాయి. అటువంటప్పుడు ప్రార్థన ఆమెకు సాంత్వనిస్తోంది. బతికి ఉన్నన్ని రోజులు టామ్‌ను ప్రేమలో ముంచెత్తాలని నిశ్చయించుకుంది. మరణంతో టామ్ జీవితం సమాప్తమవుతుంది. బతికి వున్న తనకు టామ్‌తో గడిపిన ఈ ఆనందకరమైన జ్ఞాపకాలే ఆలంబనగా మిగులుతాయి.

* * *

"నీ పేరేమిటి?" అడిగాడు డాక్టర్.

టామ్ వెర్రినవ్వు నవ్వాడు. మాట్లాడలేదు.

"ఇవ్వాళ తేదీ ఏమిటి?"

టామ్ అయోమయంగా చూశాడు.

"మన దేశాధ్యక్షుడెవరు?"

ఏదో చెప్పటానికి టామ్ పెదిమలు కదిపాడు. కానీ మాట బయటకు రాలేదు. మేరీ కళ్లల్లో నీళ్లు నిలిచాయి.

* * *

టామ్‌ను వీల్‌చైర్‌లో తోట అంతా తిప్పుతోంది మేరీ. అతడికి అర్థమైనా కాకున్నా చెట్లను చూపుతోంది. పూలను చూపుతూ వాటి అందాన్ని వివరిస్తోంది. ఉండి, ఉండి టామ్ కళ్లల్లో ఏదో అర్థమైన భావన కనిపిస్తోంది. అతడి పెదవులపై చిరునవ్వు వెలుగుతోంది.

టామ్ చికిత్సను ఆపేయాలని మేరీ నిశ్చయించటం అందరికీ ఆగ్రహం కలిగించింది. ఆమె కావాలని టామ్‌ను చంపేస్తోందనీ దూషించారు. టామ్, తల్లిదండ్రులు ఆమెపై కోర్టులో కేసు వేశారు.

"చికిత్స వల్ల ఫలితం లేదని తెలుసు. చికిత్సలో శక్తివంతమైన మందులను టామ్ భరించలేకపోతున్నాడు. బతికి ఉన్నప్పుడే నిర్జీవంగా, శవంలా మత్తులో ఉంటున్నాడు. టామ్ జీవితాన్ని ప్రేమించాడు. జీవితంలోని ప్రతి క్షణం ఆనందంగా జీవించాడు. అందుకే, మిగిలిన అతని జీవితాన్ని మందులతో, సూదులతో, మత్తులో కాక – హాయిగా, ఆనందంగా ప్రకృతి నడుమ గడిపే వీలు కల్పిస్తున్నాను. నాలుగు గోడల మధ్య బందీగా బతికే గదులు, స్వేచ్ఛగా జీవించిన వ్యక్తికి స్వేచ్ఛగా మరణించే వీలు కల్పిస్తున్నాను" గద్గద స్వరంతో కోర్టులో వాదించింది మేరీ.

అయితే, మేరీ నిజాయితీని, మేరీ ఆలోచనలలో టామ్‌పట్ల ఉన్న ప్రేమను అర్థంచేసుకున్న టామ్ తల్లిదండ్రులు మేరీపై కేసు వాపస్ తీసుకున్నారు.

* * *

టామ్ మెదడు కుడివైపు పూర్తిగా చచ్చుబడిపోయింది. కణతి మెదడును పూర్తిగా ఆక్రమించటంతో అది పనిచేయటం మానేసింది.

హఠాత్తుగా టామ్ ఏదో పదం పలుకుతాడు. మళ్లీ నిర్జీవంగా పడిఉంటాడు. టామ్ గదిని అందంగా అలంకరించేదీ మేరీ. అతడికి ఇష్టమైన సంగీతం వినిపిస్తుంది. కథలు చెప్తుంది. ఆటలు ఆడిస్తుంది. అర్థం అయినప్పుడు ఆనందిస్తాడు. మిగతా సమయాల్లో మౌనంగా ఉండిపోతాడు. అయితే, మేరీ చేసే ప్రార్థనలను మాత్రం ఆసక్తిగా చూస్తాడు. అప్పుడప్పుడు అతడి కళ్లు తడి అవుతాయి.

నెమ్మదిగా టామ్ తినటం తగ్గిపోయింది. ద్రవపదార్థాలు కూడా గ్రహించలేకపోతున్నాడు. అతడి మంచం చుట్టూ అప్పుడే విరిసిన పూలను ఉంచింది మేరీ. కళ్లు తెరచి వాటినే చూసేవాడు టామ్. ఆ తరువాత మేరీవైపు చూసేవాడు.

ఆ రోజు నిద్రలో మేరీకి హఠాత్తుగా మెలకువ వచ్చింది. ఎవరో తనని పిలుస్తున్నారు. చూస్తే టామ్!

"మేరీ" బలహీనంగా పిలుస్తున్నాడు. ఒక్క ఉదుటున అతడి దగ్గరకు పరుగెత్తింది. మేరీని చూడగానే నవ్వాడు టామ్.

"మేరీ... ఐ లవ్ యూ... థాంక్యూ..." అస్పష్టంగా, అతి ప్రయత్నం మీద అన్నాడు. మేరీ కళ్లల్లో నీళ్లు నిండాయి.

'టామ్ ఐ లవ్ యు టూ" అంది.

మనోహరంగా, సంతృప్తిగా నవ్వాడు టామ్. ఆ నవ్వుతో అతని ప్రాణం పోయింది.

* * *

"మనిషికి దైవం అవసరంలేదు. దైవంపై విశ్వాసం అవసరం. దేవుడుపై నుంచి దిగివచ్చి మనకు సహాయం చేయటం అన్నది అర్థరహితం. కానీ దైవప్రార్థన వల్ల జనించే ఆత్మవిశ్వాసం అవసరం. నా జీవితం ఇంతే అని నాకు అర్థమయింది. అందుకని ఈ జీవితంలో వీలయినన్ని ఆనందాలు అనుభవించాలని, టామ్‌కు ఆనందాన్ని పంచివ్వాలని నిశ్చయించుకున్నాను. ఆనందంగా టామ్ భరించాడు. టామ్ జ్ఞాపకాలలో నేను ఆనందంగా బతుకుతున్నాను. 'పంచిస్తే పెరిగేది ఆనందం' అని టామ్ నాకు నేర్పాడు. అదే అనుసరిస్తున్నాను" అంటుంది మేరీ కన్నీళ్లతో టామ్‌ని తలచుకుని.

"మనం శరీరం తెలిపే సంకేతాలనే కాదు, మనసు సంకేతాలను కూడా అర్థం చేసుకోవాలి" అంటుంది మేరీ.



© EMESCO BOOKS

# మృత్యువుతో మౌనపోరాటం

**ఆత్మవిశ్వాసంతో విధికి ఎదురు నిల్చిపోరాడి**
**విజయం సాధించిన యువతి కథ.**

**జూన్** 6, 1992 కారు వేగంగా నడుస్తోంది. కిటికీల్లోంచి గాలి రివ్వురివ్వున వీస్తోంది. కారు నడుపుతూంటే మైకెల్ క్విన్‌కు ఉత్సాహంగా అనిపిస్తోంది. పక్కన భార్య జాకీ తాళం వేస్తూంటే, వెనక సీట్లోంచి ఇద్దరు పిల్లలు గెమ్మా, గిలియన్లు పెద్దగా పాటలు పాడుతున్నారు. హాలీడేస్‌ను ఎలా ఆనందంగా, ఉత్సాహంగా గడపాలో అలాగే గడుపుతున్నారు.

వేగంగా కారు నడుపుతూ మైకెల్ ఎదురుగా అడ్డుగా ఉన్న ట్రక్కును పక్కనుంచి ఓవర్‌టేక్ చేసేందుకు హార్న్ మోగించాడు.

'ఓవర్ టేక్ చేయమని ట్రక్ డ్రైవర్ సౌంజ్ఞ చేశాడు. దానిని అందుకుని ట్రక్కును ఓవర్‌టేక్ చేసేందుకు స్పీడు పెంచాడు మైకెల్. ట్రక్కు పక్కగా కారుపోతూంటే, హఠాత్తుగా ట్రక్కు పక్కకు తిరిగింది. ఎదురుగా ఓ పెద్ద గుంట వచ్చింది. దాన్ని తప్పించేందుకు ట్రక్కును కుడివైపు తిప్పాడు డ్రైవర్. అది ఊహించని మైకెల్ కంగారు పడ్డాడు.

స్టీరింగ్‌పై క్షణంసేపు పట్టు తప్పింది. జీవితాలు అల్లకల్లోలమై, గుర్తెరగరాని రీతిలో రూపాంతరం చెందేందుకు ఒక్కక్షణం చాలు!

కారుపై మైకెల్ పట్టు తప్పింది. వెంటనే కనుమూసి తెరిచేలోగా కారు రోడ్డు దిగిపోయింది. పక్కనే ఉన్న గుంతలో బోల్తాపడి పల్టీలు కొట్టింది. దాంతోపాటు మైకెల్ కుటుంబ జీవితం మొత్తం బోర్లా పడింది.

* * *

మైకెల్‌కు స్పృహ వచ్చింది. తల దిమ్ముగా ఉంది. అతడి దవడ ఎముక విరిగింది. శరీరంలో అక్కడక్కడా గాయాలయ్యాయి. ఎవరో అతడిని కారులోంచి బయటకు లాగారు.

© EMESCO BOOKS

"నా భార్యా పిల్లలు" ఏడవసాగాడు మైకెల్.

అతడి భార్య కాలు ఇంజన్‌లో ఇరుక్కుపోయింది. వెనుక సీట్లో పదకొండేళ్ల గిలియన్ పెద్దగా ఏడుస్తోంది. స్పృహలేని గెమ్మా శరీరం ఆక్సిజన్ అందక నీలిరంగులోకి మారుతోంది. సహాయం చేసేందుకు వచ్చిన పారా మెడికల్ జట్టు సభ్యులు చకచకా పనిచేస్తున్నారు. ఒడుపుగా ఇంజన్‌నుంచి మైకెల్ భార్య జాకీ కాలు లాగారు. వెనుక అద్దాలు విరగ్గొట్టి గిలియన్‌ను బయటకు తీశారు. బయట ఇంత గోల జరుగుతున్నా గెమ్మాలో చలనంలేదు. ఆమె ఊపిరి పీలుస్తున్న జాడలు కనబడటంలేదు. మైకెల్ పిచ్చివాడిలా ఏడవసాగాడు. గబగబా అంబులెన్స్‌లోకి ఎక్కించారు. పెద్దగా సైరన్ మోగిస్తూ ఆస్పత్రివైపు పరుగెట్టింది అంబులెన్స్.

* * *

పిచ్చి పట్టినవాడిలా హాస్పిటల్‌లో భార్య ఉన్న అయిదో అంతస్తు, గెమ్మా, గిల్లియన్లున్న రెండో అంతస్థుల నడుమ రాత్రింబవళ్లు తిరుగుతున్నాడు మైకెల్. ఒక్క క్షణంలో అతడి సుందర ప్రపంచం తునాతునకలై పోయింది. 'ఆ ఒక్క సెకను ట్రక్కును ఓవర్‌టేక్ చేయాలన్న కోరికను అణచుకుని ఉంటే? కారు స్పీడు తగ్గించి ఉంటే? గతంలో ఎన్నో ట్రక్కులను ఓవర్ టేక్ చేశాడు. కాని ఈసారే ఎందుకిలా అయింది? ఇదిప్పుడు ఎలా అంతమవుతుంది? ఇంతమంది ప్రాణాలను తన చేతుల్లో ఉంచుకుని తాను ఎందుకంత అజాగ్రత్తగా ప్రవర్తించాడు?' – తలచుకుని తలచుకుని కుమిలిపోసాగాడు మైకెల్. నెమ్మదిగా ఒకరొకరు కోలుకోసాగారు. శారీరకంగా కోలుకున్నా మానసికంగా ప్రమాదం తాలూకు గాయాలు మాసిపోలేదు.

జాకీ నడవటం ప్రారంభించింది. కానీ కారును చూస్తే వణికిపోయేది. గిల్లియన్‌కు సర్జరీ అవసరం అయింది. సర్జరీ జరిగిన ఆరువారాల తరువాత గిల్లియన్ కోలుకుంది. కానీ అందరి దృష్టి ఏడేళ్ల గెమ్మాపైనే ఉంది. ఎందుకటే, ఆ పాప మెడ కింద శరీరమంతా చచ్చుబడిపోయింది!

* * *

"మీరు గెమ్మాకి ఉన్నది ఉన్నట్టు చెప్పేయటం మంచిది. ఇక జీవితాంతం తన స్వంత కాళ్లమీద తాను నిలబడలేదు. స్వయంగా ఊపిరి పీల్చలేదు" సలహా ఇచ్చాడు డాక్టర్.

తల అడ్డంగా ఊపాడు మైకెల్–

"డాక్టర్! మానసిక శాస్త్రం ఏం చెప్తుందో నాకు తెలియదు. కానీ, ఆశ అన్నది మనిషికి జీవనాధారం. ఏదో ఒకరోజు తాను లేచి నిలబడగలుగుతుంది. మామూలుగా జీవించగలుగుతుందన్న ఆలోచన గెమ్మాలో జీవితేచ్ఛ రగిలిస్తుంది. జీవితాంతం ఇక జీవచ్ఛవంలా పడి ఉండాలంటే, జీవించాలనే కోరిక నశిస్తుంది." ఆవేశంగా అన్నాడు మైకెల్.



© EMESCO BOOKS

"అబద్ధంలో ఆనందంగా బతికేకన్నా నిజంలో నిరాశగా బతకటం మేలు" అన్నాడు డాక్టర్.

"నిరాశ కలిగించే నిజం కన్నా కొద్దిసేపయినా ఆనందంగా ఉంచగలిగే అబద్దం గొప్పది" అన్నాడు మైకెల్.

డాక్టర్ ఇక వాదనను పొడిగించలేదు.

* * *

మైకెల్ రోజంతా స్పైనల్ ఇంజురీస్ యూనిట్‌లో గెమ్మాతో గడపసాగాడు. వెంటిలేటర్ సహాయం లేనిదే ఊపిరి తీయలేదు గెమ్మా. ఆమెని చూస్తూ దైవాన్ని ప్రార్థిస్తూ, తాను స్వయంగా ఊపిరి పీల్చ గలిగే రోజుకోసం ఎదురుచూస్తూ గడపసాగాడు మైకెల్.

"ఇలాంటి దెబ్బలు ఒకోసారి హఠాత్తుగా తగ్గుతాయి. అవయవాలు వాటంతటవే పని చేయటం మొదలు పెడతాయి" అన్నాడు డాక్టర్ మైకెల్‌తో ఒకసారి. అది మైకెల్‌లో ఆశను కలిగించింది. అలా నాలుగు నెలలు గడిచాయి. ఒకరోజు గెమ్మా చేయి కదలటం చూసిన తన కళ్లను తానే నమ్మలేకపోయాడు. హడావిడిగా డాక్టర్‌ను పిలుచుకుని వచ్చాడు.

"కదిలేది ఆమె చెయ్యికాదు, పొట్ట" చెప్పాడు డాక్టర్. గెమ్మా చెయ్యి పొట్టమీద ఉంది. ఊపిరి లయకనుగుణంగా పొట్ట సంకోచ వ్యాకోచాలకు చెయ్యి పైకి కిందకూ లేస్తోంది.

"అంటే... గెమ్మా ఇప్పుడు తనంతట తాను ఊపిరి పీల్చగలుగుతున్నట్టా?" ఆనందంగా అడిగాడు మైకెల్.

"ఇప్పుడే చెప్పలేం. వెంటిలేటర్ తొలగించి చూద్దాం. ఎప్పుడు అవసరమనిపిస్తే అప్పుడు వెంటనే వెంటిలేటర్ అమర్చేందుకు సిద్ధంగా ఉందాం. ఎంతసేపు ఎటువంటి కృత్రిమ సహాయం లేకుండా ఊపిరి పీల్చగలదో చూద్దాం" అన్నాడు డాక్టర్.

వెంటిలేటర్ తొలగించారు. మైకెల్ గెమ్మావైపే చూస్తూ కూచున్నాడు. వెంటిలేటర్ తొలగించి నిమిషమైంది. అయిదు నిమిషాయింది. అరగంట అయింది. గంట అయింది. గెమ్మా ఊపిరి పీల్చగలుగుతోంది. సాయంత్రం దాటి రాత్రయింది. గెమ్మా ఊపిరి పీలుస్తోంది.

మైకెల్ ఆ రోజు ఇంటికి వెళ్లలేదు. గెమ్మా మంచం దగ్గరే కూచుని ఆమెవైపే చూస్తున్నాడు. మనసులో 'ఊపిరి పీల్చు గెమ్మా. ఇంకాస్సేపు... ఇంకాస్సేపు" అంటూ మౌనంగా ఆమెని ప్రోత్సహిస్తూ కూచున్నాడు. ఇంట్లో గిల్లియన్ దగ్గర ఉన్నా జాకీ, అయిదు నిమిషాలకోకసారి రాత్రంతా మైకెల్‌కు ఫోన్ చేస్తూనే ఉంది. సంతోషంగా ఇద్దరూ గెమ్మా సమాచారాన్ని గురించి చర్చిస్తూనే ఉన్నారు.



© EMESCO BOOKS

గెమ్మా స్వయంగా ఊపిరి పీల్చటం ఆరంభించింది. కొన్నాళ్లకి ఆమెకు వెంటిలేటర్ అవసరం తీరింది. వెన్నుపూస వార్డులో ఆమెది అందరికన్నా చిన్న వయసు కావటంతో అందరూ ముద్దు చేసేవారు. వెన్నుపూసను టిటానియం రాడ్ల సహాయంతో నిలపటం వల్ల ఆమె వీల్‌చైర్‌లో కూచో గలిగేది. నర్సులు వీల్‌చైర్‌లో ఆమెని ఆస్పత్రి అంతా తిప్పేవారు. అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ, గలగలా నవ్వేది. అందరినీ ఆహారం సరిగ్గా తీసుకోమని ప్రోత్సహించేది. ఆస్పత్రిలోకి వచ్చినవారంతా గెమ్మాను 'చిన్నదేవత' అనేవారు ప్రేమగా.

"అవును నేను దేవదూతనే. రెక్కలు లేని దేవదూతను" అనేది గెమ్మా అమాయకంగా నవ్వుతూ. ఆమె నవ్వుతూ అన్నా, అందరి కళ్లల్లో నీళ్లు చిప్పిల్లేవి.

* * *

ఆస్పత్రిలో చేరిన సంవత్సరం తరువాత గెమ్మాను ఇంటికి తీసుకుపోవచ్చన్నారు డాక్టర్లు. గెమ్మాను చూసుకునేందుకు మైకెల్ మనుషులను నియమించాడు. కానీ హాయిగా నవ్వుతూ పాడుతూ తిరగవలసిన వయసులో రోజంతా వీల్‌చైర్‌కు, మంచానికి పరిమితమైన గెమ్మాను చూస్తుంటే మైకెల్ మనసు బాధతో నిండిపోయేది. తెలియని కసి కలిగేది. దాంతో నెమ్మదిగా అతడికి కోపం, చిరాకులు ఎక్కువయి పోయాయి. అటువంటి సమయాల్లో మైకెల్‌ను గెమ్మా ఓదార్చేది.

"నాకిది రెండో జన్మలాంటిది నాన్నా. నేను కదలలేకపోవటం వల్ల కష్టంలేదు. మీ అందరి ద్వారా బయట ప్రపంచాన్ని చూస్తాను" అని ధైర్యం చెప్పేది. రాత్రింబవళ్లు తన దగ్గరే ఉంటూ అమ్మ మానసిక రోగిగా తయారవుతోందని గ్రహించింది గెమ్మా.

"అమ్మా! నువ్వు బయటకు వెళ్లు. ఉద్యోగం చేయటం ఇష్టం లేకపోతే వెళ్లి సమాజసేవ చెయ్యి. నాకెదురుగా కూర్చుని నువ్వు ఏడుస్తుంటే నాకు బాధగా ఉంటుంది" అంది ఓ రోజు గెమ్మా.

ముందు గెమ్మా మాటలకు ఆశ్చర్యపోయినా, తరువాత ఆమె మాటల్లోని నిజం జాకీకి అర్థమైంది. దగ్గరలోని పిల్లల ఆస్పత్రిలో నర్సుగా చేరింది.

ఒకరోజు గెమ్మాను డాక్టర్లు కాస్సేపు నీటిలో వదిలారు. నీటిలో శరీరం తేలికవటంతో గెమ్మా తలను కదల్చి ఈదగలిగింది. ఆ రోజునుంచీ గెమ్మా నీటిలో ఈదటానికి ఎక్కువ ఇష్టపడటం ఆరంభించింది. తలను కదల్చటం ద్వారా నీటిలో ముందుకూ వెనక్కూ వెళ్లటం నేర్చుకుంది. 1995లో 20 మీటర్ల స్విమ్మింగ్ పూల్‌లో 32 మార్లు వరుసగా ఈది, వెన్నుపూస సంబంధిత పరిశోధనలకు 6000 పౌండ్లను విరాళంగా సంపాదించి పెట్టింది. అలాగే వికలాంగుల సంక్షేమానికి నడకలో పాల్గొని 100,000 పౌండ్ల విరాళాలను సేకరించింది.



© EMESCO BOOKS

ఓ రోజు టీవీలో 'రాచ్ ఓగ్లీ' అనే 'మైండ్ ఇనస్ట్రక్టర్' కార్యక్రమం చూసింది గెమ్మా. మెదడు ఆలోచనలతో శరీరాంగాలను నియంత్రించవచ్చని డాక్టర్ ఇచ్చిన ఉపన్యాసం గెమ్మాకు నచ్చింది. తండ్రిని ఒప్పించి అతని దగ్గర చికిత్సకు చేరింది. ఫిబ్రవరి 2003 న ఒగ్లీవద్ద చికిత్సకు చేరింది గెమ్మా. ఆరు నెలల్లోగా ఆమె తలను కదల్చగలిగింది. చేతులు, కాళ్లను కొన్ని సెంటిమీటర్ల ఎత్తుకు ఎత్తగలిగే శక్తి సంపాదించింది. అమెరికా నిర్మాత బిల్‌హేస్‌తో కలసి వెన్నుపూస దెబ్బతిన్న వారికి ఆత్మవిశ్వాసాన్ని, జీవితేచ్ఛను కలిగించేందుకు ఓ సినిమా నిర్మించింది. దాన్లో గెమ్మా జీవితమే కథాంశం. సూపర్‌మన్ వేషంతో ప్రపంచ ప్రఖ్యాతిపొంది, ఓ ప్రమాదంలో మెడకింద నుంచి శరీరమంతా చచ్చుబడిన నటుడు, స్పీల్‌రీవ్స్‌కు గెమ్మా ప్రేరణగా నిలిచింది. ఆమెను చూసి తాను ఆత్మవిశ్వాసాన్ని పొందానని స్పీల్‌రీవ్స్ స్వయంగా చెప్పాడు.

గెమ్మా ప్రతి విజయానికీ ఆనందిస్తూ, ప్రతి కదలిస్తూ ఆస్వాదిస్తూ ఆమె తల్లిదండ్రులు, అక్క గెమ్మాను ప్రోత్సాహపరుస్తున్నారు.

"మనిషి పట్టుదలను, విశ్వాసానికి, ఆత్మశక్తికి గెమ్మా తిరుగులేని నిదర్శనం" అంటాడు మైకెల్ గర్వంగా.

"విధికి ఎదురునిల్చి పోరాడుతున్న ధైర్యశాలి నా కూతురు" అంటుంది తల్లి జాకీ.

"గెమ్మాను చూస్తే గర్వంగా ఉంటుంది" అంటుంది సోదరి గిల్లియన్. అయితే గెమ్మా మాత్రం –

"నా పరిమిత పరిధులలో ఆనందంగా జీవించాలని ప్రయత్నిస్తున్నాను" అంది.

© EMESCO BOOKS

# 'వెన్నెల పాప' వెలుగు కథ

---

భయంకరమైన సమస్యను చిరునవ్వుతో
ఎదుర్కొంటున్న బంగారు పాప కథ.

---

**రో**జంతా జగతికి వెలుగులు పంచిన సూర్యుడు, విశ్రాంతికోసం నెమ్మదిగా నింగిని విశ్రమిస్తున్నాడు. తారలతో అలంకరించిన నల్లటి దుప్పటి కొద్దికొద్దిగా కప్పుకోవటం ఆరంభించాడు. సూర్యుడు తల వాల్చగానే, చంద్రుడు తలెత్తాడు. సూర్యుడి వెలుతురు నుంచి వేడి తీవ్రతను గ్రహించి, చల్లటి వెలుతురు కిరణాలను జగతికి పంచటం ఆరంభించాడు. ఆకాశంలో తారకలు సంతోషంతో మిలమిలలాడుతూ కలకల నృత్యం చేయసాగాయి. అది చూస్తూ ఆనంద తాండవారాంభానికి తాళం సరిచూసుకుంటున్నట్టు చిరుగాలి తరగల వీచికలు వీయసాగాయి. లయకు అనుగుణంగా, తారల మిలమిలతో తమ గలగలను కలుపుతూ చెట్ల ఆకులు కదలసాగాయి. ప్రకృతి బయట ప్రదర్శిస్తున్న ఈ సుందర నృత్య ప్రదర్శనను దర్శించేందుకు తహతహలాడుతున్నట్టు ఓ ఆరేళ్ల పాప ఇంట్లో అసహనంగా అటూ ఇటూ పరుగెత్తుతోంది. ఆ ఇంట్లో కిటికీలు, వెంటిలేటర్లన్నీ సూర్యకాంతిని లోపలికి రానీయని ప్లాస్టిక్ ఫిల్టర్లతో మూసేసున్నాయి.

మరోసారి పరుగెత్తికెళ్లి వాళ్ళమ్మను అడిగింది ఆ పాప.

"అమ్మా! నేను బయటకు వెళ్లవచ్చా?" ఆత్రంగా అడుగుతున్న పాపవైపు జాలిగా చూస్తోంది వాళ్ళమ్మ జెన్నిఫర్.

ప్రతిరోజూ ఆ పాప ఇలా చీకటి పడటం కోసం ఎదురుచూస్తుండటం, చీకటి పడగానే పంజరం నుండి బయటపడిన పక్షిలా బయటకు పరుగెత్తి, స్వేచ్ఛగా, ప్రకృతి ఒడిలో గెంతులేయటం చూస్తుంటే ఆమె హృదయం బాధతో కుములుతుంది. కానీ...

"అమ్మా! నేను బయటకు వెళ్లవచ్చా?" మరోసారి అడిగింది ఆరేళ్ల పారిస్.

© EMESCO BOOKS

జెన్నిఫర్ బయటకు తొంగిచూసింది. చీకటి పడింది. ఇప్పుడు సూర్యకాంతి భయంలేదు. వెలుతురు భయంలేదు. వెలుతురంటే భయపడి దాక్కునే చీకటి ప్రాణులన్నీ ఇప్పుడు స్వేచ్ఛగా బయట విహరిస్తాయి. ఆడుకుంటాయి. పాడుకుంటాయి. మళ్లీ సూర్యుడు నిద్రలేచేసరికి వెనుతిరిగి వచ్చేస్తాయి. సూర్యకిరణం తాకని చిక్కని చీకటి ప్రదేశంలో విహరిస్తాయి.

"వెళ్లు" అంది జెన్నిఫర్. వెంటనే పెద్దగా అరుస్తూ తలుపు తోసుకుని బయటకు పరుగెత్తింది పారిస్.

అవును, సూర్యకాంతిని భరించలేని చీకటి జీవులలో పసిపాప పారిస్ కూడా ఒకర్తి. ఆమె అతి అరుదైన వ్యాధి ఎక్స్.పి. అంటే క్సిరో డర్మా పిగ్మెంటోసమ్‌తో బాధపడుతోంది.

* * *

డాక్టర్ నోటివెంట ఆ వ్యాధిపేరు వినిపించగానే, అయోమయంగా అతడివైపు చూశారు జెన్నిఫర్, టాడ్ ఫెల్ట్‌నర్‌లు. వారి ప్రథమ సంతానం పార్కర్ ఆరోగ్యంగానే ఉన్నాడు. వారి కుటుంబంలో ఎవరికీ అటువంటి వ్యాధి ఉన్న దాఖలాలు లేవు.

మరి తమ రెండో సంతానం 'పారిస్'కు ఈ వ్యాధి ఎలా వస్తుంది?

పారిస్ నగరకాంతులను చూసి, రాత్రిళ్లు దీపాల వెలుతురులో ధగధగ మెరిసే పారిస్ అందానికి ముగ్ధులై, ప్రపంచ 'సిటీ ఆఫ్ లైట్స్'గా కొనియాడే ఆ పారిస్ నగరం పేరును తమ కూతురికి పెట్టుకున్నారు. ఇప్పుడు తమ ముద్దుల పారిస్ దీపాల వెలుతురులో తప్ప ప్రపంచాన్ని చూడలేదని తెలిసి, ఆ నిజాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు.

"ఇది జన్యు సంబంధిత వ్యాధి. దీనికి మందు లేదు. జీవితాంతం ఈ వ్యాధి బాధను అనుభవించల్సిందే. సాధారణంగా సూర్యకాంతికి మనిషి శరీరంపై ఉన్న కణాలు నశిస్తూ ఉంటాయి. కానీ శరీరం వాటిని తిరిగి ఉత్పత్తి చేస్తుంది. అవి ఎంత వేగంగా నశిస్తాయో, అంతే వేగంగా తిరిగి పుడుతుంటాయి. కాబట్టి, ఈ చర్యను మనం గమనించలేం. కానీ మీ పాపలో ఈ చర్య జరగకుండా అలాగే ఉండిపోతుంది" ఇద్దరి ముఖాలలో కనబడుతున్న భావనను చూసి ఆగిపోయాడు డాక్టర్.

పాప పుట్టినప్పుడు ఎటువంటి తేడాను గమనించలేదు జెన్నిఫర్ టాడ్‌లు. అందరిలానే ఆరోగ్యంగా ఉండింది. అందరు పసిపిల్లలకు వచ్చినట్టు ముఖంపై మచ్చలు వచ్చాయి. ఆ మచ్చలతో పాప మరింతగా అందంగా కనిపించేది. కానీ ఆ మచ్చలు ఎంతకీ తగ్గకపోగా మరింత పెరగటంతో డాక్టర్ దగ్గరకు వెళ్లారు.



© EMESCO BOOKS

డాక్టర్ ఇచ్చిన మందువల్ల ఫలితం కనబడక పోవటంతో, చర్మరోగ వ్యాధుల డాక్టర్‌ను సంప్రదించారు. ఆయన పరీక్షలు చేశాడు. చివరికి ఇది జన్యు సంబంధిత చర్మవ్యాధి అని అనుమానించి బయాప్సీ జరిపించాడు. దాని ఫలితం తెలియగానే ఇద్దరినీ పిలిచి అది 'క్సిరోడెర్మా పిగ్మెన్టోసమ్' అని తేల్చాడు.

"ఇది చాలా క్రూరమైన వ్యాధి"

వాళ్ళిద్దరూ కాస్త తేరుకున్నారనిపించగానే చెప్పటం ఆరంభించాడు డాక్టర్.

"ఈ వ్యాధి ఉన్నవారు వెలుతురును భరించలేరు. పగటిపూట అంతా వారు సూర్యకాంతి కూడా సోకని చీకటి గదుల్లో గడపాల్సి ఉంటుంది. సూర్యకాంతి తగిలిందా వారి చర్మం నాశనమవుతుంది. కొందరు గుడ్డివాళ్లయిపోతారు. రూపురేఖలు మారిపోతాయి. ఇలా చీకటిగదుల్లో ఉండాల్సి రావటం వల్ల మానసికంగా దెబ్బ తింటారు. కాబట్టి ఎట్టి పరిస్థితులలో వారి చర్మానికి సూర్యకాంతి తగలకూడదు. రాత్రి సమయాల్లో కూడా ఫ్లోరెసెంట్, హాలోజెన్ దీపాలున్న స్థలాలోకి వెళ్లకూడదు. ఆ వెలుతురు కూడా చర్మానికి హానికరం" చెప్పాడు డాక్టర్.

జెన్నిఫర్ ఏడవటం మొదలుపెట్టింది. టాడ్ కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

"పాపను చీకట్లో పెంచటం" అన్న ఆలోచన వారిని కలవరపరచసాగింది.

"ఇది సాధ్యమా?"

"ఈ వ్యాధి మా పాపకే ఎందుకు రావాలి?" కన్నీళ్ల మధ్య అడిగింది జెన్నిఫర్.

"ఈ ప్రశ్నకు సమాధానంగా విధి, దైవం వంటి పదాలు వాడక తప్పదు. ఈ వ్యాధి కలిగించే 'జీన్' మీ పూర్వీకులద్వారా మీకు అందింది. మీలో నిద్రాణంగా ఉన్న 'జీన్' మీ పాపలో నిద్రలేచింది. దానిలో ఎవరిదీ దోషం కాదు. ఎవరూ బాధ్యులు కారు" మృదువుగా చెప్పాడు డాక్టర్.

"కారణాలు వెతుకుతూ, ఎవరో ఒకరిపై నేరాన్ని నెట్టి, ఏడుస్తూ కూచునే సమయం కాదిది. విధిని తిట్టుకుంటూ కూచోవాల్సిన అవసరంలేదు. సమస్య స్వరూపం మీకు తెలిసింది. దాన్ని ఎలా పరిష్కరించుకోవాలో ఆలోచించండి. మనం మార్చలేని విషయాలను గురించి వ్యర్థంగా బాధపడి లాభంలేదు. మన చేయగలిగే విషయాల గురించి ఆలోచించండి" అన్నాడు డాక్టర్.

జెన్నిఫర్, టాడ్‌లు ఒకరి చేయి మరొకరు గట్టిగా పట్టుకున్నారు.

* * *

తల్లి వైపుకు దూకింది పారిస్. ఆమెని చూస్తూ దుఃఖం ఆపుకోలేకపోయింది జెన్నిఫర్. కానీ డాక్టర్ మాటలు గుర్తుకువచ్చాయి.



© EMESCO BOOKS

ఏడుపును దిగమింగింది. ఇంతలో టాడ్ వచ్చాడు.

అతడివెంటే పనివారు వచ్చారు. చకచకా ఇంటి కిటికీలన్నిటికీ అల్ట్రా వయోలెట్ కాంతిని లోపలకు రానీయని ప్లాస్టిక్‌తో మూసేశారు. ఎందుకంటే, నల్లటి పేపర్‌తో మూసేస్తే, పాప దాన్ని పీకి మరీ బయటకి తొంగి చూడటం గమనించారు. అంతేకాదు, ఇంటికి ఎవరయినా వచ్చి తలుపు తట్టినా, పాపను చీకటి గదిలో ఉంచిన తరువాతే తలుపులు తీయటం అలవాటు చేసుకున్నారు. తమ పని వేళలు మార్చుకున్నారు. ఉదయం పడుకుని, రాత్రిళ్లు మేల్కొని వీలయినంత కాలం పాపతో గడపటం అలవాటు చేసుకున్నారు. రాత్రిళ్లు పాపని బయటతిప్పటం, షాపింగ్ చేయటం ఆరంభించారు. ఏయే దుకాణాల్లో పాపకు హాని కలిగించే దీపాలున్నాయో తెలుసుకుని ఆ దుకాణాలకు వెళ్లటం మానుకున్నారు.

కాస్త ఊహ రాగానే, పాపకు ఆమె పరిస్థితి వివరించారు. అంతా విని అర్థమైనట్టు తల ఊపింది పారిస్.

"సూర్యుడిని చూస్తే చచ్చిపోతాను" అంది. ఆమె మాటలు విని భోరుమంది జెన్నిఫర్. టాడ్ కళ్లు తుడుచుకున్నాడు. కానీ పారిస్ కిలకిల నవ్వింది.

"నాకు సూర్యుడంటే ఇష్టంలేదు. చందమామంటేనే ఇష్టం" అంది.

* * *

నెమ్మదిగా ఇంట్లోవాళ్లంతా రాత్రి జీవితానికి అలవాటు పడసాగారు. పార్కర్ మాత్రం చెల్లితోపాటు రాత్రి జీవితం గడపటానికి ఇష్టపడలేదు. దాంతో జెన్నిఫర్, టాడ్‌లకు రెండు రకాల జీవితాలు అలవాటు చేసుకోవల్సి వచ్చింది. ఉదయం మేల్కొనే పార్కర్‌తో ఒక జీవితం, రాత్రి మాత్రమే బయటకు రాగలిగే పారిస్‌తో మరో జీవితం...

ఇప్పుడు పారిస్‌కు ఆరేళ్లు. నెమ్మదిగా జీవితం రొటీన్‌లో పడుతోంది. 'నాసా' వారు వ్యోమగాములను సూర్యకాంతినుంచి రక్షించేందుకు తయారుచేసిన దుస్తులను పారిస్‌కోసం కొన్నారు జెన్నిఫర్, టాడ్‌లు. ఆ దుస్తులపైన మామూలు దుస్తులు వేసుకుని పారిస్ ఇప్పుడు, అప్పుడప్పుడు బయటకు రాగలుగుతోంది. తన పరిస్థితి అర్థం చేసుకున్న పారిస్ కూడా తల్లిదండ్రులతో సహకరిస్తోంది.

చీకటి పడగానే బయటకు వచ్చి ఆనందంగా ఆడుకుంటుంది. ప్రకృతిని స్వేచ్ఛగా అనుభవిస్తుంది. అయితే, జెన్నిఫర్, టాడ్‌ల భయమంతా భవిష్యత్తు గురించే.

"రేపు పారిస్ యవ్వనవతి అయిన తరువాత పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించాలంటేనే భయంగా ఉంది. అది బయటకు వెళ్లాలని, తన వయసువారితో కలవాలని అనుకుంటే, ఎలాంటి పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందో" అంటుంది జెన్నిఫర్.



© EMESCO BOOKS

"సమస్యను సృష్టించిన దేవుడే పరిష్కారం ఇస్తాడు. భవిష్యత్తు ఊహిస్తే ఎప్పుడూ భయంకరంగానే ఉంటుంది. అది వర్తమానంగా మారితే అనుకున్నంత భయంగా ఉండదు. అందుకే, మన పని మనం చేసుకుంటూపోవాల్సిందే. భవిష్యత్తు గురించి అప్పుడు ఆలోచిద్దాం" అంటాడు టాడ్. పారిస్ మాత్రం వీరి ఆందోళనతో పనిలేకుండా చందమామ వెలుతురులో ఆడుకుంటోంది.

చంద్రుడిని అందుకోవాలని ఆత్రుత పడుతోంది. "నాకు చంద్రుడే ఇష్టం. నేను ఏదో ఒకరోజు ఎగిరి చందమామను అందుకుంటాను" అంటుంది. గట్టుమీద నుంచి ఎగిరి ఆకాశంలో చందమామను అందుకోవాలని ప్రయత్నిస్తూ...!

© EMESCO BOOKS

# రియల్‌స్టోరీస్

స్ఫూర్తినిచ్చే వాస్తవ విజయగాథలు

కస్తూరి మురళీకృష్ణ

'రియల్‌స్టోరీ' అంటే నిజంగా జరిగిన కథ. అది నేరానికి సంబంధించిందే కానక్కర్లేదు. మానవజీవితంలో అనేక సందర్భాలలో, అనేక అడ్డంకులను దాటుకుని వ్యక్తులు విజయం సాధిస్తారు. ప్రతికూల పరిస్థితులను సమర్థవంతంగా ఎదర్కొని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతారు. నిరాశామయ అంధకారంలో ఆశాజ్యోతిని వెలిగించి పదిమందికి మార్గదర్శనం చేస్తారు. అటువంటి కథలు ఇతరులకు స్ఫూర్తినిస్తాయి. ఆత్మవిశ్వాసాన్నిస్తాయి. మానవుడి 'స్పిరిట్' పట్ల నమ్మకం కలిగిస్తాయి. ఈ కథలన్నీ నిజంగా జరిగినవే. వివిధ పత్రికలలో వచ్చిన ఈ నిజాలను, కథారూపంలో, కాస్త ఉన్నత ఆలోచనలను, కాస్త డ్రామాను కల్పించి జోడించి ఆసక్తికరంగా అందించిన 50 కథల సంకలనం ఇది.

ఎమెస్కో బుక్స్